

'ప్రజాయుద్ధం - ప్రజాతంత్రం అవిభాజ్యం'

# నేటి దండకారణ్యం

(2001-2011)

వి. శంకర్

‘ప్రజాయుద్ధం - ప్రజాతంత్రం అవిభాజ్యం’

# నేటి దండకారణ్యం

## (2001-2011)

పి. శంకర్

# అంకితం



**అమరుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు (రామ్‌జీ, కిషన్‌జీ)**

**సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు**

**జననం : 26-11-1954**

**అమరత్వం : 24-11-2011**

ఈ పుస్తక రచనలో నన్నెంతగానో ప్రోత్సహించి అనేక సూచనలు, సలహాలు ఇస్తూ పేరును సైతం ఎంపిక చేసి, అడిగిన వెంటనే ముందుమాట రాసిచ్చి, తన ఫలించిన స్వప్నం 'నేటి దండకారణ్యం' వెలుగు చూడకముందే ఫాసిస్టు శత్రు హత్యాకాండలో లాల్‌గఢ్-జంగల్ మహల్ అడవుల్లో అసువులు బాసిన గొప్ప ప్రజా ఉద్యమాల నిర్మాత, మా ప్రియతమ నాయకుడు, ఆప్తుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు (రామ్‌జీ, కిషన్‌జీ) స్మృతిలో....

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట – నేటి దండకారణ్యం – ఒక ఆశా కిరణం – అసిధార..... | | 5 |
| 1. | సంఘటిత ప్రజలు – ప్రజా పోరాటాలు | ..... | 12 |
| 2. | రాజ్యహింస – విప్లవ హింస | ..... | 47 |
| 3. | ప్రజాతంత్ర విప్లవంలో ప్రజాయుద్ధ ప్రగతి | ..... | 82 |
| 4. | త్యాగాల ఫలం – దశాబ్ది వికాసం | ..... | 120 |
| 5. | ప్రజాయుద్ధంతో ప్రజాతంత్రం – రాజ్యయంత్రం | ..... | 132 |
| 6. | విప్లవ ప్రజలు – విప్లవ వేడుకలు | ..... | 167 |
| 7. | నూతన సంస్కృతికి పునాది ప్రజా సంస్కృతి | ..... | 177 |
| 8. | ముగింపు | ..... | 185 |

# నా మనవి

ప్రియమైన పాఠకులకు

రానున్న సంవత్సరం దండకారణ్య విప్లవోద్యమం 40వసంతాల విప్లవ వేడుకలు జరుపుకోబోతుంది. దండకారణ్య రజత వేడుకల సందర్భంగా నేను 'ఈ అడవి మాదే' పుస్తకాన్ని పాఠకుల ముందుకు తెచ్చాను. ఆ తర్వాతి దశాబ్దకాల దండకారణ్య విప్లవోద్యమ అనుభవాలతో, విశేషాలతో 'నేటి దండకారణ్యం' పాఠకులకు అందివ్వడానికి కృషి చేశాను. ఈ పుస్తకానికి మా పార్టీ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు లాల్‌గఢ్ ఉద్యమనేత నా సన్నిహిత సహచరుడు, నాకు మార్గదర్శీ, నా తోబుట్టువు అయిన కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు(రాంజీ, కిషన్‌జీ) ముందుమాట రాశాడు. ఆయనకు దండకారణ్యం ఎంతో ప్రియమైనది. ఆయన ఆశయాల హరివిల్లు. అది భారత విప్లవోద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ విముక్తి ప్రాంత నిర్మాణంలో అగ్రస్థానాన ఉంటుందనీ, ఉండాలనీ ఎంతగానో కోరుకున్నాడు. అందుకు ఆయన చివరి వరకూ అన్ని రకాలుగా పాటుపడ్డాడు. కానీ, నా 'ప్రియమైనవాడు' ఆ పుస్తకం వెలుగు చూడక ముందే పశ్చిమబంగ బురిసోల్ అడవులలో 2011నవంబర్ 24నాడు విద్రోహంతో జరిగిన పోలీసుల బూటకపు ఎదురుకాల్పులలో అసువులు బాసాడు.

కామ్రేడ్ కిషన్‌జీ అమరుడై 8సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఈ పుస్తకాన్ని 2013లో విప్లవ రచయితలు అచ్చువేసి నా సోదరుడితో సమానమైన విప్లవ రచయిత కామ్రేడ్ వేణుగోపాల్‌తో ఆవిష్కరింపచేశారు. కానీ, అది ఆనాడు విస్తృతంగా పాఠకుల చేతులలోకి వెళ్లలేదు. కానీ వెళ్లాల్సిన అవసరం ఈనాటికీ ఎంతగానో ఉంది.

ఈ పుస్తకం దండకారణ్య ఉద్యమ చరిత్రను రికార్డు చేసింది. వ్యక్తులుగా రాసే చరిత్ర పాక్షికమే అయినా, ఆ రచనకు ఎన్ని పరిమితులున్నప్పటికీ ఉద్యమంలో భాగమైన రచయిత కలం నుండి వెలువడడం మూలాన అది ఉద్యమ అనుభవాలను విశ్వాసనీయంగా ఎత్తిపడుతోంది. అవి తెలుసుకోవడం ద్వారా విప్లవ పాఠకులకు, తద్వారా విప్లవోద్యమానికి ఎంతయినా ఉపయోగమేనని నేను భావిస్తూ నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమ వేడుకల సందర్భంగా మీ ముందుకు నేటి దండకారణ్యన్ని మరోసారి తెస్తున్నాను. సోదర రచయితలు, అపార విప్లవ పాఠకులు పుస్తకాన్ని ఆదరిస్తారనీ, విప్లవోద్యమాన్ని కాపాడుకుంటారనీ ఒక విప్లవోద్యమ రచయితగా, దండకారణ్య విప్లవోద్యమ కార్యకర్తగా, సైనికుడిగా మనసార కోరుకుంటున్నాను.

శంకర్

ముందుమాట

# నేటి దండకారణ్యం - ఒక ఆశా కిరణం

దండకారణ్యానికి నేడు పరిచయం అవసరం లేదు. ముప్పది ఏళ్ల క్రితం అంటే 1980లలోనైతే పరిచయం చేయాల్సి వచ్చేది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టి, పెరిగి, చీలికలై, దారులు వేరైన పిదప విప్లవ దిశ ఏమిటనే ప్రశ్నకు జవాబు చెప్పింది నక్సల్‌బరీ. అంతకు పూర్వం 1945లలో తెలంగాణ ఓ అడుగు ముందుకు వేసినా అది నాయకత్వ విద్రోహానికి బలైపోయింది. అప్పటి నుండి ఎర్రసైన్యం, విప్లవ స్థావర ప్రాంతాల ఏర్పాటు ఓ కలగానే మిగిలింది. నక్సల్బరీ, శ్రీకాకుళం, కాంక్షాలోనూ కలగానే వుండింది. బోజ్‌పుర్‌లోనూ అది స్వప్నభంగం పొందింది.

కరీంనగర్-ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల వెల్లువ, ఆ వెల్లువ కేంద్రంగా చేసిన ప్రయత్నాల ఫలితంగా దండకారణ్యం రూపుదిద్దుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో అక్కడ గెరిల్లా యుద్ధం ద్వారా గెరిల్లా స్థావర ప్రాంతాలను ఏర్పర్చి చలన యుద్ధం వైపు పురోగమిస్తూ ఎర్రసైన్యాన్ని బలోపేతం చేస్తూ నిలకడ గలిగిన స్థావర ప్రాంతాల నిర్మాణానికి సిద్ధం అవుతున్న నేటి దండకారణ్యం మూడు దశాబ్దాల కృషి ఫలితం.

పదేళ్ల క్రితం 'అడవి మాదే' పేర దండకారణ్య రెండు దశాబ్దాల చరిత్రను రచయిత శంకర్ పాఠకుల కండ్లకు కట్టినట్లు చిత్రించారు. దండకారణ్య ప్రజల ఆశలు, ఆకాంక్షలకు విప్లవకారులు ఎలా కార్యరూపం ఇచ్చి ప్రజల కంటి వెలుగై ఒక్కో అడుగు ఎలా వేసిందీ సుస్పష్టం చేశారు. తదుపరి కాలం, చరిత్ర పెట్టిన పరీక్షలలో అది నెగ్గి జనతన సర్కార్‌లకు జవసత్వాల నిచ్చింది. ఓ నవతరాన్ని తనలో ఇముడ్చుకుందది. ఓ సమాజాన్ని విప్లవీకరించింది. ఓ కొత్త సమాజంకై, ఓ దోపిడి రహిత సమాజంకై కలలు గంటూ గోదావరి అద్దరిలో రైతాంగ పోరాట వెల్లువకు నాయకత్వం వహించి అప్పటికే ఉద్యమంలో తలెత్తిన అతి, మితవాదాలను ప్రజాపంథా ప్రాణంగా ఎదుర్కొని పరిమిత ప్రాంతాలలో ప్రారంభమై చీలికలైన విప్లవ పార్టీలను, గ్రూపులను సంగమంగా సంలీనం చేసి ఒకే ప్రవాహంగా సంలీనమైన విప్లవకారులు 2004 నుండి ఇక వెనుదిరిగి చూడకుండా ఉద్యమాన్ని ముందుకు ఒక గెంతు గెంతించారు. దేశమంతా ప్రత్యేకించి మధ్య, తూర్పు భారతాలలో బలమైన పార్టీ, ఎర్రసైన్యం, ఐక్యసంఘటనలతో విముక్తి ప్రాంతాల నిర్మాణం కేంద్ర, ప్రధాన మరియు తక్షణ కర్తవ్యంగా రూపొందించుకొని ఒక పథకం ప్రకారం ముందుకు సాగుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీ విధానాలను, ఎత్తుగడలను విశ్లేషించి కొత్త కార్యక్రమం, ప్రజా సమీకరణ, మిలటరీ సమీకరణలే కాదు, భౌతిక పరిస్థితిలో విప్లవానికి అనుకూలంగా వస్తున్న స్థితిని గమనిస్తున్నారు. నాయకత్వ నష్టాలను తట్టుకుంటూ ఏటికి ఎదురీతలో ప్రవాహ వేగం, దిశను పరిగణలోకి తీసుకున్నారు.

వాస్తవానికి ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ఉద్యమాల దన్నుతో, వాటికి అండగా ప్రారంభమై 2000 నాటికి దండకారణ్యం తనకు తానుగా బలోపేతం కావడమే కాదు దెబ్బతిని వెనకడుగు వేసిన ఏపి-ఎన్‌టి (ఉత్తర తెలంగాణ)-ఉత్తరాంధ్రలకు దన్నుగా నిలిచి విలీనం ద్వారా బలోపేతం

అయిన ఐక్యపార్టీకి అందునా తూర్పు భారత ఉద్యమాలకు ఒక ప్రేరణగా నిలిచింది. ఆంధ్ర-బిహార్, దండకారణ్యాలుగా నున్న పోరు నినాదం తాత్కాలికంగా ఆంధ్ర-బిహార్‌లో వెల్లువ పోటుతగ్గి ఆటులో నున్న సమయంలో ఈ అనుభవాలను ఆటును తనలో యిముడ్చుకున్న దండకారణ్యం అనేక కొత్త సూత్రీకరణలకు నమూనాగా నిలిచిందిపుడు.

భారత మైదానాలలో ఉద్యమం దెబ్బతిన్న క్లిష్ట సమయంలో అటవీ ప్రాంతాలలో ఏర్పడిన ప్రజాపునాదిపై నిలబడి మళ్లీ ముందుకు సాగడానికి దండకారణ్యం దానికదే ఒక మాడల్ అయింది. దేశవ్యాప్తంగానే 'జనతన రాజ్'లకు అంటే ప్రజల ప్రజాస్వామ్య ప్రభుత్వానికి, మాడల్‌గా నిలిచి ప్రతీఘాతక శక్తులను చావుదెబ్బ కొట్టడంలోనూ నమూనాగా నిలిచింది. సమైక్య పార్టీ నాయకత్వం, ఉద్యమ ఫలితాలను సంశ్లేషిస్తూ ఓ చోట విఫలతను ఎదుర్కొంటే, ఆ విఫలత నుండి పాఠాలు తీసి మరో చోట సఫలతకు మార్గాన్ని సుగమం చేస్తోంది.

అలాగే శత్రువు తన విఫలత నుండి పాఠాలు తీసి మరింత దూకుడుగా తీవ్రంగా, హింసాయుతంగా దాడికి దిగాడు. రాజ్యం తన సర్వశక్తిని కేంద్రీకరించడమే కాదు సామ్రాజ్యవాద శక్తినీ, కార్పొరేట్ శక్తులూ, భారత బడాబూర్జువా శక్తుల కనుసన్నలలో కేవలం విప్లవోద్యమాన్నే కాదు సమూలంగా ఒక విశాల ప్రాంతములో దంతెవాడ, బీజాపుర్ జిల్లాలుగా పిలవబడే దక్షిణ, పశ్చిమ బస్తర్ జనపదాలను మొత్తంగానే 'శరణార్థి శిబిరాలనే' నాజీ తరహా క్యాంపులను ఏర్పర్చి 50 వేలమందిని తరలించగా ప్రజలు తిరగబడ్డారు. మరింత బలంగా విప్లవోద్యమంలోకి దిగారు. సల్వాజుడుం 'సర్వం విధ్వంసం' అనే సర్కారీ పాలసీ అది. కాంగ్రెస్ లేదా భాజపా ఏ పేరుతోనున్నా రెంటి గుణం ఒకటిగానే ప్రజలపైకి అవి దండెత్త వచ్చాయి. సరిగ్గా ఈ సమయంలోనే విప్లవకారులు ప్రజల రక్షకులుగానే కాదు, ఆ ప్రజలనే ప్రజాయుద్ధంలో భాగం చేశారు. దాన్ని ప్రజా యుద్ధంగా మలిచారు. ఈ పరిణామ క్రమాన్ని అందులో భాగమైన రచయిత శంకర్ అక్కడ క్షణక్షణం ఏం జరిగిందో ఈ రచనలో పాఠకుల ముందు వుంచారు. రచయిత తాను స్వయంగా రణక్షేత్రంలోకి వెళ్లి తెలుసుకున్నది తన మాటల్లో ఇలా రాశాడు -

"సల్వాజుడుం దాడులు తొలి నుంచీ అత్యంత హింసాత్మకంగా సాగాయి. ఆ మూకలు తొలుత నిర్వహించిన పాదయాత్రల దారి అంతా రక్తం పొంగింది. దారిలో ఎదురైన ఏ ఊరునూ, ఏ పల్లెనూ వదలలేదు. ఊరు మీద పడిన జుడుం గూండా వాహిని క్షణాల్లో ఊరునంతా బుగ్గిపాలు చేసేది. ఊళ్లో ఏదీ మిగిలేది కాదు. తాము తినగలిగినంత తిని, మోయగలిగినంత మోసేవాళ్లు. కోళ్లు, మేకలు, పందులు ఏవీ ప్రజలకు మిగిలేవి కావు. నాగా పోలీసులు వచ్చాక ఆదివాసుల కుక్కలు కూడా దక్కలేదు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో బహిరంగసభలు నిర్వహించి ప్రజలను నానారకాలుగా బెదరగొట్టి భయకంపితులను చేసేవాళ్లు. వారి రాక గురించి జనాలకు తెల్సిందంటేనే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆత్మరక్షణ కోసం అడవుల్లోకి పరుగెత్తేవాళ్లు. పొరపాటున వాళ్ల చేతికి చిక్కినవాళ్లలో విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలు, జనతన సర్కార్ల నాయకులు, మాజీ గెరిల్లాలు, విప్లవ పార్టీ మాజీ కార్యకర్తలు, పిఎల్‌జిఏలో, విప్లవ పార్టీలో

కొనసాగుతున్న గెరిల్లాల, కార్యకర్తల బంధుమిత్రులను నిర్దాక్షిణ్యంగా నరికి చంపేవాళ్లు. సజీవంగా మంటల్లోకి విసిరి నిలువెత్తు మనిషి కాలిబూడిదవుతూంటే చూసి ఆనందించేవాళ్లు. ఇళ్లల్లో మనుషులను బంధించి తలుపులు బిగించి, గొళ్లాలు వేసి ఇంటికి నిప్పు పెట్టిన ఘటనలున్నాయి. మనుషులను చంపి వారి శిరస్సులను బజార్లలో భయం గొలిపే విధంగా వేలాడదీసిన ఘటనలూ ఉన్నాయి. ఆడ, మగ, చిన్న, పెద్ద జనాలు; మహిళల్లో బాలెంతలు, సూలెంతలు, గర్భవతులు; జనాల్లో రోగులు, వృద్ధులు, పసిపిల్లలు అనే ఏ తేడా లేకుండా ఈ హంతక వాహిని హత్యలు చేసింది. ఎందరెందరో మహిళలను సామూహిక అత్యాచారాలకు బలిచేశారు. ఊళ్లల్లో మహిళలను నగ్నంగా చేసి లావుపాటి కర్రలకు వేలాడదీసుకొని పశువుల్లా సజీవంగా పోలీసు క్యాంపులకు తరలించుకుపోయేవారు. తమకు నచ్చిన యువతిని సల్వాజుడుం గూండాలు, పోలీసులు తమతోఉంచుకున్న ఘటనలూ ఉన్నాయి. వావీ, వరుసలు లేకుండా తరతరాల ఆదివాసీ (మానవ) సంబంధాల సంప్రదాయాలను అమానవీయంగా హననం చేస్తూ తోడేళ్లలా పడి ఎంత మంది స్త్రీలను ఎన్ని రకాలుగా వేధించారో, పోలీసు క్యాంపుల్లో, సల్వాజుడుం శిబిరాల్లో ఎంతమంది మహిళల జీవితాలు ఛిద్రమయ్యాయో! తమకు టార్గెట్‌గా ఉన్న గ్రామాలపై పదుల సార్లు దాడులు చేశారు. ఒక్క మన్కెలి గ్రామంపై నలభై సార్లు, కోత్రపాల్ గ్రామంపై ఇరవై ఐదు సార్లు దాడి చేశారంటే వాళ్ల దాష్టీకానికి ఏ కొలమానం సరిపోతుంది? ''

సల్వాజుడుం ప్రయోగం ప్రజల ప్రయోజనాలకై చేపట్టింది కాదు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాలలో అపారమైన సహజ వనరులు వున్నాయి. ఇనుము, బొగ్గు, డైమండ్, డోలమైట్‌లే కాదు అపారమైన బాక్సైట్ నిల్వలున్నాయి. అమెరికాతో సహా జి-8 దేశాలకు ఈ సంపదపై తమ ఆధిపత్యం కావాలి. అన్ని రంగాలను సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ప్రత్యేకించి అమెరికన్ ప్రయోజనాలకు ప్రపంచ బ్యాంకుకు అపార లాభాలను ఆర్జించి పెట్టడమే లక్ష్యంగా గల యుపిఏ మరియు ఎన్‌డిఏ కూటములు ఇతర రీజనల్ పార్టీలు ఈ కూటములలో భాగమైనా, బయట వున్నా ఒకే రకమైన విధానాలు, ఎజెండాతో కదిలి పలు ఎంఎన్‌సి, సిబిబి కంపెనీలతో మౌ (ఎంఓయు)లు కుదుర్చుకున్నాయి. ఈ మౌలు అమలులోకి రాకుండా ఇక్కడ ప్రజలను సమీకరించి పోరాడుతున్న మావోయిస్టులను, ప్రజల ప్రజాస్వామ్య భావాలను, జల్-జంగల్-జమీన్-ఖనిజ్ సంపదలపై మాదే అధికారం అనే వారి చైతన్యాన్ని నిర్మూలించడానికి వారికి ఓ పూర్తి స్థాయి దీర్ఘకాల యుద్ధ పథకం అవసరమైనదని మనం మరవరాదు.

ప్రపంచంలో అతి పెద్ద 'ప్రజాస్వామ్యం' గా చెప్పుకునే భారత రాజ్యం తన దాడికి పాపులర్ నినాదాలనే వెతుక్కోంది. జనాకర్షక నినాదాలను చేపట్టడంలో కాంగ్రెస్ దేశంలోనే మొదటి కోవకు చెందినది కనుక భాజపా నేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమిని ఓడించి అధికారంలోకి రాగలిగింది. యుపిఏ-1 ప్రభుత్వం తన విధానాలకు మద్దతుగా సోషల్ ఫాసిస్టులుగా తయారైన సిపిఎంను తోడు దెచ్చుకొని 'మావోయిస్టులు ఈ దేశ అంతరంగిక రక్షణకు ప్రధాన ప్రమాదకారులని' ప్రకటించింది. యుపిఏ-2గా మళ్లీ రంగం మీదికి వచ్చిన వెంటనే ఏకంగా దేశవ్యాప్తంగా ఆ పార్టీ పైన నిషేధం విధించారు. మార్క్సిజంను నమ్మి

ప్రజల పక్షం నిల్చినవారిని అది దండకారణ్యాం అయినా లాల్‌గఢ్ అయినా మరోచోట అయినా యుఏపిఏ (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్టు-చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం)తో బంధించి వేస్తున్నారు. బెంగాల్‌లో కుహనా మార్క్సిస్టు ప్రభుత్వం ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో బిజెపి ప్రభుత్వం, ఒడిశాలో బీజూ జనతాదళ్, మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి అందరూ ఒకేదారిలోనున్నారు.

దండకారణ్యంలో సల్వాజుడుంకు, అన్ని రకాల రాజ్యహింసకు వ్యతిరేకంగానూ, విస్థాపనకు వ్యతిరేకంగానూ నిలిచిన ప్రజలను, వారి నాయకత్వాన్ని మూకుమ్మడిగా కాల్చిచంపిన రాజ్యం తన 'ప్రజాస్వామ్య' బురఖాను కాపాడుకోవడం కోసం 'హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న మావోయిస్టు కమ్యూనిస్టుల 'ను అణచివేస్తూన్నట్టు ప్రచార హోరు సృష్టించింది. ఇందుకు తన వందిమాగదులను ముందుపెట్టి మావోయిస్టుల ఏరివేత గానూ అభివృద్ధికి ఆటంకమైన తీవ్రవాదాన్ని మట్టుపెట్టడంగానూ దోపిడి పాలక వర్గాలు తమ ప్రచారాన్ని తీవ్రం చేశాయి. కానీ ప్రజలు నమ్మలేదు. సల్వాజుడుం అసలు బండారం బయటపడడంతో చివరకు దేశ సుప్రీం న్యాయవ్యవస్థ కూడా దాని సాధికారతను తప్పనిసరై ప్రశ్నించినపుడు 'దండకారణ్య శాంతి సంఘర్ష్ సమితి'గా అది తన అవతారం మార్చుకుంది.

మరోవైపు సల్వాజుడుం అభియాన్ వైఫల్యాలను బేరీజు వేసుకొని, ఏకంగా మరో పెద్ద అభియాన్‌ను ఒక లక్షకు పైగా అర్ధ-సైనిక బలగాలను దింపి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేర 2009 జూన్ తర్వాతి నుండి దేశ వ్యాప్తంగా ముమ్మరం చేసింది కేంద్రం. దేశ ఆర్థిక మంత్రిగానున్న కార్పొరేట్ వర్గాల వకీలు చిదంబరంను యుపిఏ-1 కాలంలోనే ఆ శాఖ నుండి తప్పించి గృహమంత్రిగా మార్చాక, ఆయన ఈ దాడికి పథక రూపకల్పనే కాదు స్వయంగా ఆయనే ముందుండి దాడిని నడిపించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలుమార్లు ప్రకటించుకున్నది.

ఆపరేషన్ గ్రీన్ హంట్ (ఓజిహెచ్) ప్రజల్లో బహిర్గతమై దాని సైనిక కర్కశత్వానికి ఆదివాసీ ప్రజలు బలైపోతూంటే దాని సాధికారత కోసం ప్రజలలో పెద్దఎత్తున సంస్కరణలకు పూనుకుంది. వాటితో అది తన మేడిపండు ప్రజాస్వామ్యానికి కొత్త రంగు అద్దే ప్రయత్నం చేస్తే ప్రజాయుద్ధం తుత్తునియం చేసింది. రచయిత శంకర్ ఓజిహెచ్ గురించి యిలా అన్నారు-

"భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో గత మూడు దశాబ్దాలుగా దండకారణ్యంలో అభివృద్ధి చెందుతోన్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే ఫాసిస్టు లక్ష్యంతో శత్రువు దాదాపు నాలుగు సంవత్సరాలు కొనసాగించిన సల్వాజుడుం సైనిక దాడి చివరకు ఓటమి పాలైన పరిస్థితులలో గ్రీన్ హంట్ ఆపరేషన్ ముందుకు వచ్చింది. ఇది వ్యూహాత్మక దృష్టితో, సమగ్రమైన ప్లాన్‌తో కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష దిశా నిర్దేశంలో మొదలైంది. దేశవ్యాప్తంగా బలమైన మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలుగా ఎంపిక చేసుకున్న 34 జిల్లాలలో ఏక సమయంలో సమన్వయంతో సైనిక దాడులు నిర్వహించే ఏడేళ్ల పథకంతో గ్రీన్ హంట్ ఆపరేషన్ విరుచుకుపడింది. ఇది సైనిక దాడినే ప్రధానంగా ఎన్నుకున్నప్పటికీ బహుముఖ దాడిగా ఇది కొనసాగుతోంది. 'హోల్డ్-కంట్రోల్-బిల్డ్' లక్ష్యంతో ఈ ఆపరేషన్ 5-7 సంవత్సరాల కాల

వ్యవధిని నిర్ణయించుకొని 2010 జులై, ఆగస్టుల నుంచీ ప్రారంభమైంది. దీని ప్రారంభానికి ముందు కేంద్ర గృహ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై 2009 జూన్‌లో పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌గఢ్‌లో ప్రారంభించిన సైనిక ఆపరేషన్‌ను గ్రీన్ హంట్ దాడులకు స్ప్రింగ్ బోర్డుగా ప్రకటించిన విషయం పాఠకులు గుర్తు పెట్టుకోవాలి.''

కేంద్ర గృహ మంత్రిత్వశాఖ కార్యదర్శి జి.కె.పిళ్లై 2009 జూన్‌లో మాట్లాడుతూ 'లాల్‌గఢ్'ను ఒక 'లాబరేటరీ'గా ఆపరేషన్ ప్రారంభించి జులై కల్లా మరో మూడు రాష్ట్రాలకు విస్తరించామని చెప్పాడు. యేడాది పైగా సాగుతున్న ఈ ఆపరేషన్‌ను లాల్‌గఢ్ నుంచి దంతెవాడ మీదుగా సూర్జాగఢ్ వరకు ప్రజలు, ప్రజా విముక్తి గెరిల్లాలు ప్రజాయుద్ధం ద్వారా ఎదుర్కొని నిలవరించడమే కాదు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను రాజకీయంగా, మిలటరీపరంగానూ దెబ్బకొట్టి చొరవ తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఫలితంగా, పెండింగ్‌లో ఉన్న మౌల అమలుకు పెరుగుతున్న సామ్రాజ్యవాదుల ఒత్తిడి వెనుక బద్ధలైన ప్రపంచవ్యాపిత సంక్షోభం నేపథ్యంలో మన్‌మోహన్‌సింగ్ అన్ని వేదికలపై నుండి బరితెగించి దాడి తీవ్రతకు ఏకంగా సైన్యాన్నే దింపుటకు ఆదేశించాడు.  జనవరి 2011లో 400పై చిలుకు భారత సైనికులు రెక్కీ టీములుగా దండకారణ్యం రాగా అప్రకటితంగా ఎన్నివేల మంది దిగారో లెక్కలు మనకు అందాలంటే మరికొంత కాలమే పడుతుంది. ఇంతేకాకుండా ఓ రెండు పూర్తిస్థాయి రెజిమెంట్లను ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో మోహరించుటకు వారి తర్ఫీదుకు (ఆపరేషన్లకు దిగే ముందు  సైన్యానికి  టెర్రయిన్, గెరిల్లాల ఎత్తుగడల నేపథ్యంలో కౌంటర్ వార్‌ఫేర్ తర్ఫీదు యివ్వడానికి) 900 చ.కి.మీ. భూమిని నారాయణపుర్‌కు సమీపాన సైన్యానికి కేటాయించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకుండా సన్నాహాలు పూర్తి చేస్తూ పైకి మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని ముఖ్యమంత్రి రమన్‌సింగ్ ఈ మధ్య మరోసారి ప్రకటించాడు. ఇదీ వాస్తవ పరిస్థితి.

మరోవైపు ప్రచార యుద్ధంలో ఆరితేరిన రాజ్యం తన మీడియా ఫౌజును ముందుపెట్టి జనతన సర్కార్లు ఏర్పర్చిన స్కూళ్లు, ఆశ్రమాలు, ఆసుపత్రులను మావోయిస్టు కేంద్రాలనే దుష్ప్రచారం చేస్తూ తమ బలగాలను ఎయిర్‌లిఫ్ట్ చేసి వాటి మీదా దాడి చేస్తున్నారు. 2010 ఆగస్టులో వయనార్ కేంద్రంగా వయనార్, దౌడాయి తదితర క్యాంపులకు పలుమార్లు జవాన్లను వాయుసేన హెలికాప్టర్లు తరలించాయి. ఇలా బలగాలను ఇంత పెద్దయెత్తున దండకారణ్యానికి ఎయిర్‌లిఫ్ట్ చేయడం ఇదే మొదటిసారిగా చెప్పవచ్చు. ఆంధ్ర గ్రేహౌండ్స్, ఒడిశా ఎస్ఓజి , మహారాష్ట్ర సి-60, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్, కేంద్ర కోబ్రా కమాండోలు, నాగా, మిజో ప్రాంతాల హంతక బలగాలను, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బి, ఎస్‌టిఎఫ్ వంటి పేర్లతో తిష్ట వేసిన అనేక రకాల బలగాలు గడిచిన పదేళ్లలో బస్తర్‌లో పెద్దఎత్తున  ప్రజల చేతుల్లో ఎన్నో గట్టిదెబ్బలు తినడంతో కొత్త ఎత్తుగడల పేర మరింత హింసను ప్రయోగిస్తున్నారు. దండకారణ్యంను దిగ్బంధనం చేయ సమకట్టారు. అలానే ఒడిశా, ఝార్ఖండ్, జంగల్ మహల్ (లాల్‌గఢ్, బంగాల్)ను దిగ్బంధం చేయ సమకట్టారు. అయితే భౌతిక పరిస్థితులు అందుకు సహకరించక ప్రభుత్వాలు మరింత

ప్రజావ్యతిరేకతను మూటకట్టుకున్నాయి.

యుపిఏ ప్రభుత్వ నిర్వాకం వల్ల అవినీతి వెల్లువెత్తుతోంది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు దేశాన్ని ఫణంగా పెట్టడం తీవ్రమై ఒకటి తదుపరి మరొకటిగా గత యేడాది కాలమంతా మహా కుంభకోణాలు వెలుగు చూస్తూ కుంభకోణాల సంవత్సరంగా మారింది. కామన్‌వెల్త్ గేమ్స్ కుంభకోణం, ఆదర్శ్ హౌసింగ్ ఘొటాలాలే కాకుండా 2జి స్పెక్ట్రమ్ అమ్మకాలలో 1,76,000 కోట్ల రూ.ల ప్రభుత్వ ఖజానాకు దర్జాగా కన్నం వేసిన ఉదంతం వేడెక్కుతుండగానే ఎస్-బ్యాండ్ స్పెక్ట్రమ్ అమ్మకాల ద్వారా ఇస్రో (ఐఎస్ఆర్ఓ) వాణిజ్యశాఖ జరిపిన కుంభకోణంలో 2 లక్షల కోట్లు బొక్కసానికి కన్నం వేసిన చౌర్యం గురించి గడిచిన వారం రోజులుగా దేశంలో పెద్దయెత్తున వార్తలు వస్తున్నవి. ఈ చర్చను ఎలాగో ఒకలాగ నిలిపివేయాలని ఇస్రోలో పాలనాపరమైన మార్పులు ప్రకటించారు. ఈ మార్పులు ఏవీ పోరాడ సిద్ధపడిన ప్రజల కళ్లు కప్పలేవు. నేటి దండకారణ్యం సామ్రాజ్యవాద ప్రయోజనాలకు, అవినీతికి వ్యతిరేకంగా తన చుట్టూ గల పట్టణ జనాభాను, కార్మికవర్గాన్ని సంఘటితం చేస్తుందని ఆశిద్దాం.

2000లో పిఎల్‌జిఏ ఏర్పడిన పిమ్మట ప్లాటూన్లుగా సంఘటితపడి కంపెనీలుగా కలుద్దాం అనే నినాదం పాటై, మాటై ముందుకు సాగింది. ఆచరణలో ఇప్పుడు కంపెనీలుగా కలవడం సాధారణమవుతున్నపుడు ప్రతిదీ ప్రజలను పాజిటివ్‌గా ప్రభావితం చేస్తోంది. పిఎల్‌జిఏ ప్రజల రక్షణలో ఎలా నిలిచింది శంకర్ మాటల్లోనే చూద్దాం. "అందుకే ప్రజా గెరిల్లాలు విప్లవ ప్రజల సంరక్షణకై పోలీసులతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. ఫలితంగా, ఈ దశాబ్ద కాలంలో వారు అనేక త్యాగాలు చేస్తూ 800 మందికి పైగా పోలీసులను దండకారణ్యంలో అంతమొందించారు. మరో 850 మందిని గాయపర్చారు. 600 తుపాకులను, 54 టన్నుల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పళ్లెం నిండా పెట్టుకున్న అన్నంలో నుంచీ బుక్క-బుక్కే నమిలి మింగినట్టూ అడవంతా పరచుకున్న పోలీసుల్లో నుంచీ వీలైన చోటల్లా గెరిల్లా ఎత్తుగడలతో వాళ్లను దెబ్బతీస్తూ పోలీసుల మనోబలాన్ని రోజు రోజుకూ పరీక్షకు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా పిఎల్‌జిఏ గెరిల్లాలు 2 వేల మంది పోలీసులను మట్టుబెట్టారు. దాదాపు అంతేమందిని గాయపర్చారు. 2,500 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. సల్వాజుడుం, సెంద్రా, గ్రీన్ హంట్ ఆపరేషన్లను ఎదుర్కోవడంలో భాగంగా 2006 నుంచీ 2011 వరకు దేశంలో 1150 మంది పోలీసులు గెరిల్లాల దాడుల్లో హతులయ్యారు.''

కంపెనీలు ఇవ్వాళ ఉద్యమ విస్తరణలోనూ భాగమైనాయి. గతంలో దళాలు సంఘటితపడి దళం తదుపరి దళంగా కొత్త ప్రాంతాలకు విస్తరించడం అనే ప్రక్రియ 2004 వరకు సాగింది. ఆ తదుపరి విస్తరణ రాజనాంద్‌గాం జిల్లా మాన్‌పుర్, నవపాడా జిల్లా మైన్‌పుర్, బస్తర్ జిల్లా దర్భ అడవులు చేరినట్లు ఈ రచనలో స్పష్టంగా చూడగలం. ఈ నమూనా విస్తరణను మరింత వేగం చేసి రెండు నెలల్లో పిఎల్‌జిఏ కంపెనీలు ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో ఆరు జిల్లాలలోకి విస్తరించాయి. ప్రజలు ఈ విప్లవకారులకు సంతోషంతో ఆహ్వానిస్తున్నారని చెప్పడం అక్కడి దోపిడి తీవ్రతను, పేదరికాన్ని కళ్లకద్దుతుంది.

ఒకప్పుడు 10 కి.మీ. దూరాన పనికి పోవాలన్నా, మాడ్‌పైకి పిఎల్‌జిఏ శక్తులను పంపాలన్నా నాయకత్వ కామ్రేడ్స్ చర్చించి, అవసరాన్ని నచ్చజెప్పి పంపుటకు అనేక ప్రయాసలకు ఓర్చేవారు. అలాంటి చోట వర్తమాన ప్రజాయుద్ధం బైలదిల్లా నుండి బలిమెలకు అక్కడి నుండి ఆగ్నేయాన దామన్‌జోడి రెయిడ్‌కైనా లేదా కోరాపుట్, నయాగఢ్‌ల తుపాకుల స్వాధీనానికైనా, వుత్తరాన రాయపూర్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని) సమీపాన గల రిస్‌గాం దాడికైనా వందలాది కిలోమీటర్లు ఎర్ర విత్తనాలను విత్తుతూ ప్రజా గెరిల్లాలు ఒక కొత్త అధ్యాయానికి పునాదులు వేస్తూన్నరనేది మనం మరవవద్దని శంకర్ సోదాహరణంగా తన ఈ రచనలో పేర్కొన్నారు. కంపెనీలుగా సంఘటితపడి బెటాలియన్లుగా కలుద్దాం అని వీడ్కోలు సమయాల్లో లయబద్ధంగా గొంతెత్తి పాడుతున్న పాట, చెమర్చే కళ్ల వెలుగు ఓ అద్భుతమైన శక్తిని యిస్తుంది.

ఇవ్వాళ దండకారణ్యం రేపటి భారత విప్లవ విజయానికి ఒక ప్రేరణ శక్తి, ఒక అండ, ఒక ఆధారం. ఇది ఒక విశ్వాసమే కాదు, పెట్టుబడిదారీ విధానానికి విరుగుడుగా మళ్లీ రూపుదిద్దుకుంటున్న నూతన ప్రజాస్వామ్యం. ఓ సోషలిస్టు విప్లవానికి అర్పితమైన కార్మికవర్గపు బీజప్రాయ గెరిల్లా ఆధార క్షేత్రం. అక్కడ జనతన సర్కార్లు చిన్నవే, కొత్తవే. కాని ఓ తరాన్ని తర్ఫీదు చేశాయి, చేస్తున్నాయి. అందుకే దండకారణ్యం దానికదే ఒక నమూనా. భారత విప్లవోద్యమంలో అది మన కాలపు యేనాన్. రండి! ఈ ఎర్ర యేనాన్‌ను కాపాడుకోవడానికి, దెబ్బతిన్న, తిరోగమించిన ఇతర ప్రాంతాలలో పురోగమనానికి, పురోగమన ప్రాంతాలలో జనాధారం పెంచడమే కాదు మరిన్ని యేనాన్‌లను సృష్టించి వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రకు సోపానాలుగానూ, ఆదర్శాలుగానూ, ఆకాంక్షలుగానూ, అమరులు కన్న కలల సాకారంగానూ దానిని చేతిలోకి తీసుకొని మరింత బలంగా మరో గెంతుకు సిద్ధమవుతున్న ఆ శక్తితో భుజం కలిపి నడుద్దాం. పాలకవర్గాల ముప్పేట దాడిని ప్రజాయుద్ధం ద్వారా ఓడిద్దామని శపథం చేద్దాం. అశేష ప్రజలకు అండగా వుందాం. అన్ని అణచివేత అభియాన్లను ఓడిద్దాం.

విప్లవాభివందనాలతో,

**భూంకాల్ దివస్, 2011** **అసిధార**

# 1. సంఘటిత ప్రజలు - సంఘటితోద్యమం

దండకారణ్య విప్లవ ప్రజల సంఘటితీకరణ, వారు చేపట్టిన ప్రజా పోరాటాల గురించి చెప్పుకోబోయే ముందు ఇక్కడి భూ-భౌతిక, రాజకీయ, జనజీవన సాంస్కృతిక పరిస్థితుల గురించి సంక్షిప్తంగా చూద్దాం.

దండకారణ్యం అంటే ప్రధానంగా దట్టమైన అడవులతో, ఆదివాసీలతో కూడుకున్న ప్రాంతం. ఇక్కడ అపారమైన భూ, ఉపరితల, భూగర్భ, జల వనరులున్నాయి. వీటినే మరోమాటలో 'జల్-జంగల్-జమీన్' అంటున్నారు. ఈ ప్రాంతం నాలుగు రాష్ట్రాల - ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిషా - సరిహద్దు కూడలి ప్రాంతం. ఇక్కడ అడవుల్లోని ఆదివాసీ జనాభా అతి పలుచన. ఈ ప్రాంతంలోని పట్టణాలే సాపేక్షికంగా ఎక్కువ జనసాంద్రత కలిగిన కేంద్రాలు అని చెప్పుకోవచ్చు. ఇక్కడి ఆదివాసులలో కోయ, దొర్ల తెగల ప్రజలే అధికం. వీరినే మురియా, మాడియా, రాజగోండ్ తెగలుగానూ వ్యవహరిస్తారు. వ్యవహారికంలో వీరంతా కోయతూరే. ఈ తెగలే కాకుండా మరిన్ని తెగల, కులాల ప్రజలు కూడా ఇక్కడ వీరితో తరతరాలుగా సహజీవనం చేస్తున్నవారున్నారు. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న సోకాల్డ్ సెక్యులర్ విధానాల ఫలితంగా వీరంతా ఇప్పటి వరకూ హిందువులుగానే పరిగణించబడుతూ వస్తున్నారు.

1947 తర్వాత జరిగిన తొలి జన గణనాల నుంచీ ఈనాటి జన గణనాల వరకు సేకరించిన జనాభా వివరాలను పరిశీలిస్తే క్రమంగా ఆదివాసీ జనాభా తరిగిపోతూ, గైరాదివాసీ ప్రజల జనాభా పెరుగుతూ ఉండడం కనబడుతుంది. 2001 జనగణనాల వరకు మెజార్టీ ఆదివాసులతో ఉన్న (65%) గడ్చిరోలి జిల్లాలో 2001 జనగణనాల నాటికే ఆదివాసీ జనాభా మైనార్టీలోకి దిగింది (45%). 2011 జనగణనాల నాటికి ఆదివాసీ జనాభా 38% దిగింది. బృహత్ బస్తర్‌లో ఈ పరిణామాలు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. భారత పాలకవర్గాలు తలకెత్తుకున్న నూతన ఆర్థిక విధానాలు, సెజ్‌లు, భారీ ప్రాజెక్టుల రూపకల్పన అందుకు ప్రధాన హేతువుగా మారాయి. వీరిలో కోయతూర్‌గా పిలవబడేవారి మాతృభాష కోయ. ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది కాగా మిగతా హల్బా, ప్రధాన్, వతన్‌కార్, భత్రా, ధుర్య, గోవారీ తదితర అనేక తెగల ప్రజలు మాట్లాడే భాషలు, ప్రధానంగా ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినవి.

ఇక్కడ పేర్కొంటున్న దండకారణ్యం అంటే దాదాపు 60 వేల పైగా చదరపు కి.మీ. వైశాల్యాన్ని కలిగిన భూభాగం గురించేనన్నది పాఠకులు పరిగణనలోనికి తీసుకోవలసి ఉంటుంది. ఈ దశాబ్దంలో విస్తరించిన నూతన ఉద్యమ ప్రాంతాలను కూడా కలుపుకొని దండకారణ్యాన్ని పేర్కొంటే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, బస్తర్, నారాయణపూర్, కాంకేర్, రాజనాంద్‌గాం జిల్లాలో కొంత భాగం కాగా మహారాష్ట్రకు చెందిన గడ్చిరోలిలతో కూడుకొని వున్నదిగానే చెప్పుకోవాలి. ఈ విశాల భూభాగంలో నివసిస్తున్న ఆదివాసీ పీడిత ప్రజల జీవన విధానంలో సారూప్యతే అధికంగా ఉంటుంది.

దండకారణ్యంలోని గోదావరి, శబరి, ప్రాణహిత, ఇంద్రావతి లాంటి ప్రముఖ నదుల తీరప్రాంతాలు అతిసారవంతమైన నల్లరేగడి భూములను కలిగి ఉన్నాయి. మిగతా ప్రాంతంలో చాలా వరకు నిస్సారమైన ఇసుక, చౌడు భూములే అధికంగా ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాలైతే విశాల భూఖండాలను వ్యవసాయ యోగ్యంగా మలచుకోవడానికే అక్కడ భూ-భౌగోళిక పరిస్థితులు అనుమతించని విధంగా ఉన్నాయి. ఇక్కడి ప్రధాన పంట వరి కాగా కోహ్‌లా లాంటి తృణ ధాన్యాలు కూడా కొండల్లో పండిస్తారు. అతి ప్రాచీనమైన పప్పు ధాన్యాలు - ఉలవలు, మినుములు - ఎక్కువగా పండిస్తారు. వ్యాపార పంటలు వేగంగా దూసుకువస్తున్నాయి. పురాతనమైన వ్యవసాయ సాగు పద్ధతులే నేటికీ ఆధిక్యతలో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులలో తగిన మార్పులకు విప్లవ ప్రజా పోరాటాలు, విప్లవోద్యమం శ్రీకారం చుట్టాయి. ఈ పోరాటాలకు పునాది విప్లవ సంఘటిత ప్రజానీకమే.

సంఘటిత ప్రజలు మాత్రమే విప్లవోద్యమంలో తమ రాజకీయ లక్ష్యసాధనకు అంకితమై చురుగ్గా, క్రియాశీలంగా పాల్గొంటారు. ఇది ఒక చారిత్రక వాస్తవం. ప్రపంచంలో 20వ శతాబ్దంలో జయప్రదమైన ఉద్యమాల, విప్లవోద్యమాలన్నిటా ఇది నిరూపితమైన విషయం. సంఘటిత ప్రజలు అన్నప్పుడు విప్లవ ప్రజా నిర్మాణాలలో వాళ్లు సంఘటితం కావడమే. ప్రజలు తాము ఈ దోపిడీ వ్యవస్థ - అర్ధవలస, అర్ధభూస్వామ్యలో ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ తదితర సమస్యలన్నింటిపై ఒక స్పష్టమైన అవగాహనతో సమీకరింపబడి వాటి పరిష్కారానికై పోరాట మార్గంలో సంఘటితంగా వుద్యమించడం ద్వారా వారిలో నిర్మాణ స్పృహ, నిర్మాణ క్రమశిక్షణ, నిర్మాణ ప్రాముఖ్యత, నిర్మాణ ఐక్యత ఏర్పడి పెంపొందుతుంది. అది తమ లక్ష్యసాధనకు వారికి ఒక అనివార్యమైన అవసరం. దాని ద్వారా వారిలో రాజకీయ సమైక్యత పెరగడమే కాకుండా దృఢసంకల్పంతో పోరాడడానికి అది వారిని వుద్యుక్తులను చేస్తుంది. ఈ నేపథ్యంలోనే దండకారణ్యంలో విప్లవ ప్రజాసంఘాలు ఉనికిలోకి వచ్చాయి.

దండకారణ్యంలో ఉనికిలోకి వచ్చిన విప్లవ ప్రజాసంఘాలలో 'దండకారణ్య ఆదివాసీ కిసాన్-మజ్దూర్ సంఘటన్' ప్రధానమైనది. 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికపై ఇందులో వేల సంఖ్యలో ఆదివాసీ-గైరాదివాసీ ప్రజలు పెద్దఎత్తుననే సంఘటితమయ్యారు. ఇంకా సంఘటితమయ్యే ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇందులో రైతు మహిళలను చేర్చడం అనే ప్రక్రియ 2001 తర్వాతనే ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే 2003 నుంచే మళ్లీ ప్రాణం పోసుకుందని చెప్పవచ్చు. విప్లవోద్యమ ఆరంభ సంవత్సరాలలో స్త్రీలు, పురుషులు ఉమ్మడిగానే రైతు-కూలీ సంఘాలలో సభ్యత్వం తీసుకొనేవారు. కానీ ఆ తర్వాత సంవత్సరాలలో 'క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం' ఏర్పడడంతో మహిళలంతా ఇందులోనే ఉండడం అనే విశేష నిర్మాణ క్రమం అప్రకటితంగానే అమలులోకి వచ్చింది. 2001-02లలో ఈ సమస్యపై చర్చ ప్రారంభమైంది. 'రైతుకూలీ సంఘాలలో మహిళలు ఎందుకు ఉండాలి?' అనే విషయంపై 2003 మార్చి డికె పార్టీ ప్లీనం స్పష్టీకరణ ఇచ్చింది. 'రైతుకూలీలు స్త్రీలైనా, పురుషులైనా, 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికపై నిర్మితమవుతున్న



దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ మహాసభ

విప్లవ రైతు-కూలీ సంఘాలలో తప్పక చేరాలి’ అన్నదే ఆ స్పష్టీకరణ సారాంశం. దీనితో రెండు సమస్యలు పరిష్కారమయ్యాయి.

1) విప్లవ రైతు-కూలీసంఘాలలో పురుషులతో పాటు మహిళలు చేరడం.

2) రైతాంగ మహిళలు విడిగా క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘంలో ఉంటూ రైతు-కూలీ సంఘాలలో కూడా చేరడం.

21వ శతాబ్దం ప్రారంభం నాటికీ విప్లవోద్యమంలో చెప్పుకోతగిన మెరుగుదల వచ్చింది. రాజకీయ, సైనిక, నిర్మాణ, విద్యా బోధన, ప్రచార కార్యక్రమాలేవైనప్పటికీ వాటిని ఒక క్యాంపెయిన్ రూపంలో చేపట్టగలిగినప్పుడే శక్తివంతంగా నిర్వహించగలమనే అవగాహన ఏర్పడింది. అలాగే భారతదేశ విప్లవోద్యమంలో తొలిసారిగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడడంతో అనేక రంగాలలో అద్భుతమైన మార్పులకు ఆహ్వానం పలికినట్టయింది. ప్రధానంగా సైనిక రంగంలో ఎత్తుగడలపర ఎదురుదాడుల క్యాంపెయిన్లను నిర్వహిస్తూ మిగతా రంగాలలో కూడా క్యాంపెయిన్ల నిర్వహణ మొదలైంది. ప్రతీ క్యాంపెయిన్ నిర్దిష్ట లక్ష్యాలతో (టార్గెట్) సాగుతూ చాలావరకు ఆశించిన ఫలితాలు సాధిస్తూ జయప్రదం కావడం విప్లవోద్యమంలో అనేక మార్పులకు దారితీసింది. టిసిఓసి (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్ - ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్)లతో పాటు పార్టీలోకి, పిఎల్‌జిఏలోకి భర్తీ చేసుకొనే క్యాంపెయిన్లు

యేటేటా చేపట్టడం, నిర్ణీత లక్ష్యాలను సాధిస్తూ అవి సఫలం కావడం, అలాగే విప్లవ ప్రజాసంఘాల పటిష్టీకరణకూ, విస్తరణకూ ప్రత్యేకంగా క్యాంపెయిన్‌లు చేపట్టడం కూడా వుద్యమాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయనీ దశాబ్ద ఫలితాలు వ్యక్తం చేస్తున్నాయి.

## 1 ఎ) విప్లవ ప్రజాసంఘాల పటిష్టీకరణ

విప్లవ ప్రజాసంఘాల పటిష్టీకరణ లేదా సంఘటితీకరణ అన్నపుడు కేవలం వాటిలో సభ్యత్వం పెరగడం మాత్రమే కాదు. విప్లవ రైతు-కూలీ, మహిళా, సాహితీ-సాంస్కృతిక సంఘాలలో విస్తృతంగా సభ్యులు చేరడంతో పాటు వారు క్రియాశీలంగా తమ సంఘ కార్యకలాపాలలో పాల్గొనడం, వారి రాజకీయ చైతన్యం, నిర్మాణ క్రమశిక్షణ పెరగడమే పటిష్టీకరణకు ప్రామాణికంగా ఉంటూ వస్తున్నందునా ఆయా సంఘాల అభివృద్ధిలో గెంతు మార్పులను సాధించగలుగుతున్నారు. దండకారణ్యంలో ప్రధానంగా ఆదివాసీ రైతు-కూలీ సంఘం (డిఏకెఎంఎస్)తో పాటు క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం, చేతనా నాట్య మంచ్‌లున్నాయి. దండకారణ్యంలోని బస్తర్, గడ్చిరోలి ప్రాంతాలలో మొదట వేరు వేరు పేర్లతో రైతు-కూలీ సంఘాలు ఏర్పడి పనిచేసినప్పటికీ 1989 నాటికి పేరులో ఏకరూపత 'డిఏకెఎంఎస్' వచ్చింది. ఆనాటికి దండకారణ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మన్యం, ఆదిలాబాద్ ప్రాంతాలు కూడా ఉండి యావత్తు వుద్యమ ప్రాంతానికి నాయకత్వం వహించే స్థాయిలో డిఏకెఎంఎస్ కమిటీ రాష్ట్ర మహాసభలలో ఎన్నికై వునికిలోకి వచ్చింది. కాగా దండకారణ్యంలో మహిళా సంఘాలు సైతం తొలుత వేరు వేరు పేర్లతోనే ప్రారంభమైనప్పటికీ ఇవీ 1991 వచ్చేసరికి 'క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం' పేరుతో దండకారణ్యవ్యాప్తంగా ఒకే నిర్మాణం ఉనికిలోకి వచ్చింది. కానీ కెఏఎంఎస్ రాష్ట్ర (స్పెషల్ జోన్) స్థాయి కార్యవర్గాలు 2003-04 నుంచే ఎన్నిక కావడం మొదలైంది. అప్పటికే ఎన్నికై పనిచేస్తూ ఉండిన డిఏకెఎంఎస్ 'రాష్ట్ర' కార్యవర్గం క్రమంగా 1993-94 వచ్చేసరికి దెబ్బతింది. దీనికి ప్రధాన కారణం దండకారణ్యవ్యాప్తంగా తీవ్రమైన 'రాజ్య' నిర్బంధం - ఉద్యమ అణచివేత చర్యలే. పెరిగిన నిర్బంధాన్ని తట్టుకొని ఎదిరిస్తూ 'రాష్ట్ర'స్థాయిలో నాయకత్వం వహించగలిగే శక్తులు ప్రజాసంఘాలలో ఆనాటికింకా ఎదిగిరాని ఫలితంగా డిఏకెఎంఎస్ కార్యవర్గం దెబ్బతింది. దీనితో అలాంటి శక్తులు ఎదిగి వచ్చేవరకూ విశాల దండకారణ్యవ్యాప్తంగా ఉన్నతస్థాయి - రాష్ట్ర - కార్యవర్గాలు ఎన్నికై సమర్థవంతంగా పనిచేయలేవనే అవగాహనకు పార్టీ వచ్చింది. ఈ పరిస్థితి దాదాపు 2003-04 వరకూ కొనసాగింది. ఆ క్రమంలో సాధించిన ఉద్యమాభివృద్ధి ఫలితంగానే 2003-04 నుంచీ ఇందులో మార్పు సాధ్యమైంది. సాహితీ - సాంస్కృతిక సంస్థ - చేతనా నాట్య మంచ్ - ఒక విప్లవ ప్రజా సంఘంగా ఉనికిలోకి రావడం వెనుకగల చరిత్రను, విశిష్ట పరిస్థితులను విడిగా చూద్దాం.

## 1 బి) సంఘటిత ఉద్యమ అభివృద్ధి – నిర్మాణ దొంతరలలో వికాసం

దండకారణ్య గెరిల్లా జోన్ వ్యాప్తంగా బలమైన ప్రజా పునాదిని కలిగి ఉండి, టెర్రయిన్ రీత్యా

అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసుకొని గెరిల్లాబేసులుగా అభివృద్ధి చేసుకోవాలనే అవగాహనను 2001 - భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) - పార్టీ కాంగ్రెస్ ఇచ్చింది. ఫలితంగా ఆ కొలబద్దలతో ఎంపిక చేసుకున్న గెరిల్లాబేసు ప్రాంతాలన్నింటా వాటి, వాటి ప్రాముఖ్యతా క్రమాన్ని అనుసరించి పార్టీ విశేష కృషి సలిపింది. గెరిల్లాబేసులన్నిటా తొలుత పెద్దెత్తున విప్లవ ప్రజానీకాన్నీ విప్లవ ప్రజా సంఘాలలోకి సమీకరించడం వేగవంతమైంది. ఇది క్యాంపెయిన్ల రూపంలో సాగి సత్ఫలితాలు వచ్చాయి. మరోవైపు పార్టీలోకి, ప్రజా (విముక్తి) గెరిల్లా సైన్యంలోకి, ప్రజా సంఘాలలోకి భర్తీ చేసుకునే క్యాంపెయిన్లను చేపట్టిన ఫలితంగా పూర్తికాలం విప్లవకారులుగా - వృత్తిరీత్యా విప్లవకారులుగా - వుద్యమంలో చేరిన వారి సంఖ్యా గణనీయంగా పెరిగింది. ఈ పునాదిపై ఆధారపడి ఆయా రంగాలకు ప్రత్యేకంగా కార్యకర్తలను విడిగా కేటాయించే ప్రక్రియ ఉనికిలోకి వచ్చింది. పోతే, దీనికన్నా ముఖ్యమైంది ఏమంటే 2000లో పీపుల్స్ గెరిల్లా ఆర్మీ ఏర్పడడం, బలమైన ప్రతిఘటన పెంపొందడం అన్ని రంగాలలో అభివృద్ధికి ప్రాణవాయువులా పని చేసింది. అలాగే 1995కు ముందరి దండకారణ్యానికీ, తర్వాతి దండకారణ్యానికీ ఏరియా విస్తీర్ణంలో గణనీయమైన మార్పు జరిగి సమన్వయంలో సరళత ఏర్పడింది. మరోవైపు ప్రజా గెరిల్లా సైన్యం ఏర్పడడం, ప్రజా ప్రతిఘటన పెంపొందడం, వివిధ సమస్యలపై కేంపెయిన్‌లు కొనసాగించడం లాంటి రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ఫలితంగా ఆయా రంగాలన్నీ చెప్పుకోతగిన అభివృద్ధిని సాధించాయి. ఈ అభివృద్ధి ఫలితమే విప్లవ ప్రజాసంఘాలలో నిర్మాణపరమైన గెంతు మార్పులు సాధ్యమయ్యాయి. ఈ నిర్మాణపరమైన మార్పులన్నీ గెరిల్లాబేసులను పటిష్టం చేసే దిశలోనే, వాటి ఆధారంగానే, అవి కేంద్రకంగానే రూపొందాయి.

నిర్మాణ దొంతరలలో సాధించిన ప్రగతిని గూర్చి చెప్పుకునే ముందూ పార్టీ అవగాహనలో వచ్చిన మరో ముఖ్యమైన నిర్మాణపర మార్పును ఇక్కడ గమనించాల్సి ఉంది. పార్టీకీ, విప్లవ ప్రజాసంఘాలకూ మధ్య గెరిల్లాజోన్‌లలో సంబంధం ఎలా ఉండాలి? విప్లవ పార్టీ విప్లవ ప్రజాసంఘాల నిర్మాణాలలో భాగంగా ఉంటూ ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం (గైడెన్స్) వహించడంపై విస్తృతంగా, సమగ్రంగా చర్చ జరిగింది. వెంటనే ఆ దిశలో మార్పులూ జరిగాయి. ఫలితంగా ఇప్పుడు విప్లవ ప్రజాసంఘాల నాయకత్వ కమిటీలలో ఏ స్థాయికాస్థాయి పార్టీ నాయకత్వం భాగమైంది. ప్రజాసంఘాల నాయకత్వ కమిటీలలో ఫ్రాక్షన్స్ వుండడం, పార్టీ నాయకత్వ కమిటీల నుంచి ప్రత్యక్షంగా అందులో వుండడంతో సమన్వయ సౌలభ్యం ఏర్పడింది. కమిటీ ప్రత్యక్ష గైడెన్స్ సులువైంది.

భారతదేశం తీవ్ర అసమానాభివృద్ధిని కలిగిన దేశం. ఇక్కడ నిర్మితమయ్యే విప్లవ ప్రజాసంఘాలు ఆయా ప్రాంతాల విశిష్ట పరిస్థితులపై ఆధారపడి పూర్తి రహస్యంగా, బహిరంగంగా, సెమీలీగల్ (అర్ధబహిరంగం)గా ఉంటూ పనిచేయాల్సి ఉంటుందనే పార్టీ అందించిన అవగాహన వెలుగులోనే దండకారణ్యంలో నిర్మాణ మార్పులు సాధ్యం అయ్యాయి. ఈ నిర్మాణ మార్పుల ఫలితంగానే గ్రామస్థాయి

నుంచీ స్పెషల్ జోన్ స్థాయి వరకూ దండకారణ్యంలోని ప్రజాసంఘాల కమిటీలన్నింటిలో ఆయా స్థాయిల పార్టీ కమిటీల సభ్యులున్నారు. వీరు ప్రజాసంఘాల మహాసభలలో ఎన్నికవుతూ వస్తున్నారు. ఈ విధంగా విప్లవ ప్రజాసంఘాలకు దండకారణ్య గెరిల్లాజోన్‌లో విప్లవ పార్టీ ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తోంది. విప్లవ ప్రజాసంఘాలకూ విప్లవ పార్టీయే నాయకత్వం వహించడం ద్వారా అవి సమర్థవంతంగా, దృఢంగా, విప్లవాశయానికి కట్టుబడి పనిచేస్తాయన్నది నిర్వివాద విషయం. దండకారణ్యంలోనే ఇతర రంగాలలో లీగల్‌గా, సెమీ లీగల్‌గా, కవర్లలో ప్రజాసంఘాలు పనిచేస్తున్న చోటా వాటిలోనూ పార్టీ ఫ్రాక్షన్లు ఏర్పడి పనిచేస్తున్నాయి. వాటిలోని సభ్యుల పార్టీ హోదా (స్థాయి) వారి, వారి అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది.

దండకారణ్యంలో 2005 నాటికే విప్లవ ప్రజాసంఘాలలో దాదాపు లక్షన్నర పైగా సభ్యత్వం నమోదైంది. గ్రామాలలో ఐదుగురికి మించని సంఖ్యలో ఉండే ఒక్కొక్క పార్టీ సెల్ నిర్మాణంతో పాటు అక్కడక్కడ 15 మందితో కూడిన పార్టీ బ్రాంచీల నిర్మాణం గెరిల్లాబేసులలో ఉనికిలోకి వచ్చింది. గ్రామాలలో పార్టీ సభ్యత్వం పొందుతున్న స్త్రీ, పురుషులు ఎవరైనప్పటికీ వారు ఏదో ఒక విప్లవ ప్రజాసంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నవారేనన్నది గమనించాల్సిన విషయం. ఇలాంటి పరిస్థితులలోనే విప్లవ ప్రజాసంఘాల కార్యకలాపాల నిర్వహణకు చురుకైన, అనుభవం కలిగిన వృత్తి రీత్యా విప్లవ పార్టీ కార్యకర్తల కేటాయింపు మొదలైంది. గ్రామ, ఏరియా, డివిజన్, స్పెషల్ జోన్ అంటే నాలుగు దొంతరలలో ప్రజాసంఘాల మహాసభలు జరుగుతూ, నాయకత్వం ఎన్నికవుతూ విప్లవ కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమై ప్రజలకు నాయకత్వం వహిస్తున్నాయి. సాధారణంగా ఐదు నుంచీ పదకొండు మందితో కూడిన కార్యవర్గాలు ఎన్నికవుతూ కమిటీగా సమష్టి పని విధానాన్ని అమలు చేస్తున్నాయి. కార్యవర్గ సభ్యులు తమ మధ్య పని విభజన చేసుకొని సంఘ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ కార్యవర్గ పని విభజన ప్రధానంగా రైతుల భూమి సమస్య కేంద్రంగా ఉంటోంది. గెరిల్లా బేసులలో భూమి ఉత్పాదకత పెంచడం, జనతన సర్కార్లకు సహకారాన్నందించడం కేంద్రంగా పని విభజన సాగుతోంది. మహిళా సంఘాల కార్యవర్గాల పని విభజన మహిళా విముక్తి లక్ష్యంగా సాగే విప్లవ కార్యక్రమాల ప్రచారం, మహిళల ఆరోగ్యం, సంక్షేమం పట్ల శ్రద్ధ తీసుకోవడంతో పాటు రాజ్యహింస, కుటుంబ హింస వ్యతిరేక ప్రచారం, పురుషాధిపత్య వ్యతిరేక ప్రచారం మొదలైన కార్యకలాపాల నిర్వహణతో కూడుకొని ఉంటోంది. గెరిల్లాబేసులలో భూమి, ఉత్పత్తి, జనతన సర్కార్లకు సహకారాన్నందించడం కేంద్రంగా సాగుతోంది. అన్ని ప్రజాసంఘాలు తాము రాసుకున్న నిబంధనావళి ఆధారంగానే ఉద్యమ స్థాయీ, పరిస్థితులను బట్టి కార్యకలాపాలు, ప్రచార-ఆందోళన, పోరాటాలు చేపడుతున్నాయి. అవి సంవత్సరానికి 2 నుంచీ 4 సమావేశాలు జరుపుకుంటున్నాయి. కేఏఎంఎస్ తన అధికార పత్రికను 'పోరు మహిళ'ను యేడాదికి రెండు సంచికలను తెస్తోంది. ఇదే పత్రిక హిందీలో 'సంఘర్షరత్ మహిళ' పేరుతో వెలువడుతోంది.

| కెఏఎంఎస్ జనవరి 2008 (3 సం॥ల) నవంబర్ 2010 వరకు వున్న సభ్యత్వం | | | | |
|---|---|---|---|---|
| క్రమసంఖ్య | డివిజన్ | పాత సభ్యత్వం | పెరిగినది | ప్రస్తుతం టోటల్ |
| 1 | దక్షిణ బస్తర్ | 17,075 | 5,761 | 22,836 |
| 2 | పశ్చిమ బస్తర్ | 4,087 | 11,008 | 15,095 |
| 3 | దర్భ | 2,340 | 4,658 | 6,998 |
| 4 | మాడ్ | 4,116 | 7,104 | 11,220 |
| 5 | ఉత్తర బస్తర్ | 3,243 | 2,119 | 5,362 |
| 6 | తూర్పు బస్తర్ | 7,843 | 6,369 | 14,210 |
| 7 | మాన్‌పూర్ | 3,383 | 410 | 3,793 |
| 8 | ఉత్తర గడ్చిరోలి | 9,205 | 5,469 | 14,674 |
| 9 | దక్షిణ గడ్చిరోలి | 3,582 | 4,150 | 7,732 |
| | మొత్తం | 54,874 | 47,046 | 1,01,920 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| దక్షిణ బస్తర్‌లో పంచాయితీ స్థాయి కెఏఎంఎస్ యూనిట్లు | | | | - | 49 |
| పశ్చిమ బస్తర్‌లో | ,, | ,, | ,, | - | 42 |
| ఉత్తర గడ్చిరోలిలో | ,, | ,, | ,, | - | 30 |
| ఈస్ట్ బస్తర్‌లో | ,, | ,, | ,, | - | 36 |

2007లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తన నిబంధనావళిలో ఒక గమనించతగిన మార్పును ప్రవేశపెట్టి ఐక్యతా కాంగ్రెస్‌లో ఆమోదం పొందింది. దానిననుసరించి విప్లవ ప్రజాసంఘాలలో పార్టీ సెల్స్ నిర్మాణం ఉనికిలోకి వచ్చింది. దీనికి పూర్వం దండకారణ్యంలో ఈ అనుభవం లేదు. (పట్టణ) కార్మిక సంఘాలలో (ట్రేడ్ యూనియన్) పార్టీ సెల్స్ నిర్మాణం గురించి మూడవ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాలలో పేర్కొన్న దానికి దీనిని ఒక చక్కని అన్వయింపుగా గుర్తించవచ్చు.

2007-2008లలో జరిగిన అన్ని ప్రజాసంఘాల మహాసభలలో 'సభ్యత్వ పెంపుదల క్యాంపెయిన్' చేపట్టాలనే నిర్ణయం తీసుకున్నారు. నిరంతరం ప్రజాసంఘాలలో చేరే కొత్త సభ్యులు ఎలాగూ ఉంటున్నప్పటికీ మొత్తం సభ్యత్వ పెరుగుదలలో ఒక కుదుపును ఇవ్వగలిగేటువంటి మార్పును సాధించే లక్ష్యంతో ఈ క్యాంపెయిన్‌ను తీసుకున్నారు. ఇందులో డిఏకెఎంఎస్, కెఏఎంఎస్, సిఎన్ఎం సఫలమైనాయనీ, అవి తమ నిర్ణీత టార్గెట్‌ను దాదాపు చేరుకోగలిగాయనీ 2009 సెప్టెంబర్‌లో సమీక్షించారు. 2010 డిసెంబర్ నాటికి చూస్తే దండకారణ్యంలోని విప్లవ ప్రజాసంఘాల సభ్యత్వం రెండు లక్షలు దాటింది. గెరిల్లాబేసుల్లోని

ప్రజా నిర్మాణాలలో సభ్యత్వం తీసుకున్న విప్లవ ప్రజానీకం అధికంగా ఉండగా వాటి బయటనున్న గెరిల్లాజోన్‌లో సభ్యత్వం సాపేక్షికంగా తక్కువ ఉంది. దండకారణ్యంలోని గెరిల్లాబేసుల్లో సైతం నేటికీ ఇంకనూ విప్లవ ప్రజాసంఘాలలో చేరనివారి సంఖ్య గణనీయంగానే వుంది. 2009 చివర్లో చేసిన ఒక పార్టీ సమీక్షలో గెరిల్లాబేసులలో మెజార్టీ ప్రజలు ప్రజా నిర్మాణాలలో సంఘటితం అయినట్టు పేర్కొంది. 2010 చివర్లో ఫాసిస్టు గ్రీన్ హంట్ దాడుల మధ్యనే ప్రజాసంఘాల మహాసభలు జయప్రదంగా ముగిశాయి.

విప్లవ ప్రజాసంఘాలలో ప్రధానంగా ఆదివాసీలే ఉన్నారు. వారంతా తమ సంఘ కార్యకలాపాల నిర్వహణకు యేటేటా సభ్యత్వ రుసుం ఐదు రూపాయలు చెల్లించడమే గాకుండా అవసరమైనపుడు స్వచ్ఛందంగా చందాలు కూడా సమకూరుస్తున్నారు. చందాల కోసం చాలా వరకు వారంతా తాము సేకరించిన అటవీ ఉత్పత్తులను పోగుచేసి సంతలో వాటిని అమ్మగా వచ్చిన నగదును చందాలుగా సమకూరుస్తున్నారు. సంఘ కార్యకలాపాల పట్ల వారి నిబద్ధతకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. గతంలో మూడు దశాబ్దాల పూర్వం దోపిడీ ప్రభుత్వ ఖాకీలకు, వారి తుపాకులకు, వారి కోర్టులకు, వారి లాకప్పు చిత్రహింసలకు వెరచి చెల్లించుకున్న వేలాది రూపాయల దండుగల జీవితాలకు వారి సంఘటిత శక్తి స్వస్తి చెప్పింది. మావోయిస్టుల తుపాకుల భయంతోనే ఇంత భారీ సంఖ్యలో ఆదివాసీలు సంఘటితమయ్యారని దోపిడీ పాలక వర్గాలు చేసే మతిలేని ఆరోపణలకు వారి సంఘటిత శక్తే జవాబు నిస్తోంది.

## 1 సి) చేతనా నాట్య మంచ్

1998 నుంచీ చేతనా నాట్య మంచ్ సాంస్కృతిక దళాలు పని చేస్తున్నాయి. ఇవి ప్రారంభంలో వేళ్ల మీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉండేవి. ఇవి ప్రజల్లో విప్లవోద్యమ ప్రచారానికే అంకితమై తమ కార్యకలాపాలను కొనసాగించేవి. కానీ, 2002 మేలో జరిగిన 'అఖిల భారత విప్లవ సాంస్కృతిక కార్యశాల' ఈ రంగంలో ఒక మలుపుకు దారి చూపింది. సాంస్కృతిక రంగంలో ప్రజా సంఘ నిర్మాణానికై అక్కడ విస్తృతంగా చర్చలు జరిగాయి. చేతనా నాట్య మంచ్‌ను ఒక విప్లవ ప్రజా సంఘంగా ఉనికిలోకి తీసుకరావడానికి ఆ చర్చలు ఎంతగానో తోడ్పడినాయి. ఈ రంగంలో పని చేస్తున్న రచయితలు, కళాకారులు, పార్టీ నాయకత్వం కృషి మూలంగా 2004 నాటికీ చేతనా నాట్య మంచ్ ఒక ప్రజా సంఘంగా పురుడు పోసుకుంది. నూతనంగా ఉద్భవించిన చేతనా నాట్య మంచ్ ఒక ప్రజా సంఘంగా విస్తృత ప్రజాదరణ పొందుతూ బలపడడానికి ఇక్కడి ఆదివాసీ సమాజం ఎంతగానో తోడ్పడింది. ఆదివాసీ సమాజంలో నేటికీ మిగిలి ఉన్న సామూహిక నృత్యం, పాట, సమష్టితత్వం ఇక్కడి యువతరాన్ని చేతనా నాట్య మంచ్‌లో చేరడానికి బాగా ప్రోత్సహించాయి. ప్రజా కళలను విప్లవ కళలుగా, ప్రజా గీతాలను విప్లవ గీతాలుగా మలచడానికి ఆ యువతరానికి అందుతున్న విప్లవ రాజకీయాలు ప్రాణం పోశాయి. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్‌లో ఉన్నవారైనా, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘాలలో ఉన్న యువతులకైనా

| ప్రజాసంఘ నిర్మాణానికి ముందు సిఎన్ఎం బృందాల వివరాలు (జనవరి 2004) | | | | |
|---|---|---|---|---|
| డివిజన్ | సిఎన్ఎం బృందాలు | సభ్యులు | | మొత్తం |
| | | స్త్రీలు | పురుషులు | |
| దక్షిణ బస్తర్ | 4 | 5 | 10 | 15 |
| పశ్చిమ బస్తర్ | 4 | 2 | 21 | 23 |
| ఉత్తర బస్తర్ | 3 | 2 | 9 | 11 |
| మాడ్ | 2 | 1 | 1 | 2 |
| గడ్చిరోలి | 1 | 3 | 2 | 5 |
| మొత్తం | 14 | 13 | 43 | 56 |

| 2008-2010 మధ్య తయారైన నూతన కళారూపాలు | |
|---|---|
| నూతన కళారూపాలు | సంఖ్య |
| పాటలు | 621 |
| పీటోలు | 8 |
| నాటకాలు | 522 |
| కథలు | 17 |

| 2010 అక్టోబర్‌లో జరిగిన దండకారణ్యం సిఎన్ఎం 3వ మహాసభలలో నమోదైన వివరాలు (2008-2010 మధ్య) | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | వివరాలు | మహిళలు | పురుషులు | మొత్తం |
| 1 | ప్రదర్శనలలో పాల్గొన్న ప్రజలు | 8,91,728 | 9,30,221 | 18,29,949 |
| 2 | ఉత్పత్తిలో పాల్గొన్న కళాకారులు | 3,478 | 4,249 | 7,727 |
| 3 | సిఎన్ఎం సంఘ సభ్యుల సంఖ్య | 6,157 | 6,437 | 12,594 |
| 4 | వివిధ వర్క్‌షాపులలో పాల్గొన్నవారు | 1,256 | 2,110 | 3,366 |

వారిలోని కళను, కళాభిరుచినీ, కళాభిమానాన్నీ విప్లవాత్మకంగా తీర్చిదిద్దుకోవడానికి చేతనా నాట్య మంచ్ ఒక చక్కని వేదిక అయింది. అనతి కాలంలోనే ఈ ప్రజా సంఘ సభ్యత్వం కొన్ని వేలలోకి చేరింది. పల్లె పల్లెనా, అడవివ్యాప్తంగా, కొండ కోనల్లో విప్లవ గీతాలే వినబడడం సాధారణమైంది. పాలబుగ్గల పసిపిల్లల నోటా, పడుచువాళ్ల ఆట, పాటల్లో, గోటుల్ (గ్రామ రాజకీయ, సాంస్కృతిక కేంద్రం) వద్ద సాగే సాంస్కృతిక కార్యకలాపాలలో విప్లవ గీతాలే ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2004లో దండకారణ్య తొలి మహాసభను జరుపుకున్న చేతనా నాట్య మంచ్ తన కంటూ ఒక ప్రణాళిక-నిబంధనావళిని రూపొందించుకోవడంతో పాటు సాంస్కృతిక కళాకారులకు జెండా ఆహార్యాన్ని నిర్ణయించుకుంది. సాహితీ-కళల సమైక్యతా చిహ్నంగా అది 'డోలు-కలాన్ని' హత్తిన ఎర్రజెండాను తన జెండాగా ప్రకటించింది. 'ఝంకార్'ను అధికార పత్రికగా స్వంతం చేసుకుంది. ఈ దశాబ్దం చివరి నాటికి దాని సభ్యత్వం పన్నెండువేలకు చేరుకుంది.

విప్లవోద్యమ తొలినాళ్లలో ప్రజా సంఘాల మహాసభలు జరిగినా 1990వ దశకం నుంచీ ప్రజాసంఘాలు రెండేళ్ల కొకసారి మహాసభలను జరుపుకుంటూ వస్తున్నప్పటికీ 2007 వచ్చేసరికి దోపిడీ పాలకవర్గాలు అపూర్వస్థాయిలో చేపట్టిన ఉద్యమ నిర్మూలనా దాడుల మూలంగా అనివార్యంగానే మహాసభల మధ్యకాలాన్ని మూడేళ్లకు పొడగించుకున్నాయి.

గెరిల్లాబేసులలో ప్రజల రాజ్యాధికారం అంచెలంచెలుగా బలపడుతూండడంతో విప్లవ ప్రజా సంఘాలు

ఆ అధికారాన్ని మరింత పటిష్టం చేసే దిశలో తమ ప్రణాళిక-నిబంధనావళిలో అవసరమైన మార్పులూ చేసుకున్నాయి. జనతన సర్కార్లు కూడా ఏరియా స్థాయి ప్రభుత్వ యూనిట్లు ఏర్పర్చుకునే నాటికి (2004) తమ ప్రభుత్వ విభాగాలలో నూతనంగా అవి ప్రజా సంబంధాల శాఖను ఏర్పర్చుకున్నాయి. ఈ రకంగా జనతన సర్కార్లు విప్లవ ప్రజా సంఘాలకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యాన్ని కల్పించాయి. ప్రభుత్వ నిర్ణయాలు ఈ శాఖ ద్వారా సులువుగా ప్రజల వద్దకు వెళ్లి 'జనతన సర్కార్లకే సర్వాధికారాలు' అనే అత్యంత ప్రజాస్వామ్యయుతమైన విప్లవ  నినాద స్ఫూర్తితో అవి ప్రజల నిర్ణయాలుగా మారడానికి దారి సుగమం అయింది.

## 1 (డి) ప్రజా పోరాటాలు – కదిలిన జన ప్రభంజనం

దండకారణ్యవ్యాప్తంగా ఈ దశాబ్దంలో (2001-2010) జరిగిన ప్రజా పోరాటాలన్నీ మెరుగైన సంఘటిత ప్రజాపునాదిపై ఆధారపడే జరిగాయన్నది మొట్టమొదట గుర్తు పెట్టుకోవలసిన విషయం. ఈ దశాబ్దానికి గల ఇతర కొన్ని విశిష్టతలను చెప్పుకోవలసి వస్తే :

1. ఈ దశాబ్దంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాలకు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం అండగా ఉంది.

2. ఈ పదేళ్లలో ఇక్కడి ప్రజలు దోపిడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాలకు



కృత్రిమ కరువులను సృష్టించే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కదం తొక్కిన ప్రజలు

గెరిల్లాబేసులలో నిర్మితమవుతున్న ప్రజల ప్రజాస్వామిక అధికారం - జనతన సర్కార్ - దన్నుగా నిలిచింది.

3. ఈ దశాబ్దంలో దండకారణ్య విప్లవ ప్రజానీకం చేపట్టిన ప్రజాపోరాటాల స్వభావంలో చెప్పుకోదగిన మార్పు ఉంది. ఆర్థిక పోరాటాల కన్నా రాజకీయ పోరాటాలు మళ్లీ వీటిలోనూ ముఖ్యంగా రాజ్యహింస వ్యతిరేక పోరాటాలు అనివార్యంగా ముందుకొచ్చాయి. తప్పనిస్థితి ఏర్పడింది. వీటిలో ప్రజలు పెద్దసంఖ్యలో కదులుతున్నారు.

4. చాలా వరకు ప్రజావ్యతిరేక భూస్వామ్య, పెత్తందారీ శక్తులు పోరాట గ్రామాల నుంచీ పారిపోయి శత్రువు క్యాంపులలో, పట్టణాలలో అడ్డా లేర్పర్చుకున్న దశాబ్దం ఇది.

5. భారత దోపిడీ పాలకవర్గాల ప్రతినిధి, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల వకాల్తాదారు అయిన భారత ప్రధాని మన్‌మోహన్‌సింగ్ 2006 ఏప్రిల్ 13న మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దేశ ఆంతరంగిక భద్రతకు ఏకైక అతిపెద్ద ప్రమాదకర శక్తులుగా 'వామపక్ష ఉగ్రవాదులను' పేర్కొన్నాడు.

పైన పేర్కొన్న విశిష్టతల నేపథ్యంలోనే, ఈ దశాబ్దంలో జరిగిన దండకారణ్య ప్రజా పోరాటాలను అర్థం చేసుకోవాలి.

## 1 (ఈ) భూపోరాటాలు – విప్లవ భూసంస్కరణలు

1980లో విప్లవోద్యమం నెత్తుటి త్యాగాలతో దండక్ అడవుల్లోకి అడుగుపెట్టింది. 1975-77 ఎమర్జెన్సీ చీకటి రోజుల తర్వాత విప్లవకారులను తిరిగి ఎన్‌కౌంటర్లో పోలీసులు కాల్చిచంపింది దండకారణ్యంలోనే. కామ్రేడ్ పెద్దిశంకర్ 1980ల తొలి అమరుడుగా గణుతికెక్కాడు. 2 నవంబర్ 1980న పెద్దిశంకర్ అమరత్వం - ఆంధ్ర సరిహద్దులోని మహారాష్ట్రకు చెందిన చంద్రపూర్ జిల్లా (వర్తమాన గడ్చిరోలి జిల్లా) సిరొంచ తాలూకా ముయ్యబోయినపేట అడవుల్లో జరిగింది. ఈ నెత్తుటి త్యాగాల నుంచే ప్రజా పోరాట బీజాలు మొలకెత్తి విస్తరించాయి.

1980లోనే కేంద్ర ప్రభుత్వం అడవులను రాష్ట్ర జాబితా నుంచీ కేంద్ర జాబితాలోకి మార్చింది. అప్పటికీ గ్రామాల్లోని అధిక శాతం ఆదివాసీ రైతాంగానికి కనీస జీవనోపాధికి సరిపడే భూములే లేవని చెప్పుకోవచ్చు. తమకు ఉన్న కుంటో, సెంటో భూమిని సాగు చేసుకొని పంటలనుభవించడం అంటే దోపిడీ ప్రభుత్వ అటవీశాఖ వారితో వారు పెద్దయుద్ధమే చేయాల్సి వచ్చేది. ఆ యుద్ధంలో నిరుపేద ఆదివాసీలు ఎప్పుడూ పరాజితులే. 'స్వాతంత్ర్యా'నంతరం అయినా వాళ్లకు 'శాంతిగా, శాశ్వతంగా' భూములు దక్కిందే లేదు. అందుకే వాళ్లు తరాలు ఎన్ని మారుతున్నా భూమి కోసం నిరంతరం పోరాడక తప్పింది గాదు. ఆ పోరాటంలో వాళ్ల గుడిసెలు అటవీశాఖ అధికారుల దాష్టీకానికి కాలిబూడిదయ్యేవి. ఆ పోరాటంలో వాళ్ల చిరు సంపదలు కోళ్లు, మేకలు, సారా, డబ్బు అవినీతిమయ అటవీశాఖ వారి వశం అయ్యేవి. ఆ



దున్నేవారికే భూమి నినాదంతో
ఇంద్రావతి ప్రాంతంలో తాకిలోడ్ భూస్వామి భూమిని ఆక్రమించిన ప్రజలు

పోరాటంలో వాళ్ల వొళ్లు అధికారుల క్రౌర్యానికి హూనం అయినా, వాళ్ల ఆడపడుచులు దుర్మార్గ అధికారుల సెక్స్ ఉన్మాదానికి బలి అయినా ఆశ్చర్యం ఏమీ లేదు. ఇవి ఎన్ని అయినా వాళ్లు ఆ భూమి కోసం భరించారు. 1980లో ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంతో, వాళ్ల జీవితాల్లో కొడగట్టిన ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఆదివాసీ రైతులకు భూములు దక్కవు అనే సందేశాన్నిచ్చింది ఆ చట్టం.

సరిగ్గా అదే సమయంలో వీర నక్సల్బరీ విప్లవ పోరాట సందేశం దండక్ అడవుల్లోకి చేరింది. 'దున్నేవారికే భూమి' నినాదం అడవుల్లో ప్రతిధ్వనించింది. తెలంగాణ మైదానాల నుండీ పోరు పాలికేక గోదావరి తీరాన్ని దాటి ఆదివాసుల అడవుల్లోకి చేరి రైతాంగాన్ని తట్టిలేపింది. అప్పటికీ పాత బస్తర్, గడ్చిరోలి జిల్లాల్లో అటవీశాఖ వారు అంటే అమాయాక ఆదివాసీ రైతాంగానికీ హడల్. వాళ్ల చట్టాలు అంటే జనాలకు చెప్పలేని భయం. ఆ చట్టాలే వాళ్ల జీవితాలను కడతేరుస్తున్నాయనీ వాళ్లకు తెలుసు. ఆ చట్టాలతో, ఆ చట్టాలను సృష్టించిన దోపిడీ పాలకవర్గాలతో వారిని దీర్ఘకాలిక పోరాటానికి ఆహ్వానించింది ఆ నినాదం. ఆ ఆహ్వానాన్ని అందుకున్న రైతాంగం అన్నింటికీ తెగించి దోపిడీ రాజ్యంతో జీవన పోరాటాలకు నడుం బిగించారు. దేశంలో అతివిశాల భూఖండాలను తన గుప్పిట్లో పెట్టుకున్నది దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య భారత రాజ్యమే. ఆ రాజ్యంతో పోరాడకుండా సాగులో ఉన్న భూములు గానీ, నూతనంగా

సాగు కోసం భూములు కానీ లభించవు అని ఆ ప్రజలకు విప్లవోద్యమం ద్వారా అవగతమైంది. అప్పటి వరకూ 'భూములు ఇప్పిస్తామనే' పేరుతో పట్టాల కోసం తహసీల్ ఆఫీసుల చుట్టూ, అసెంబ్లీల చుట్టూ, పట్టణాల చుట్టూ తిప్పిన అన్ని రకాల ఎన్నికల పార్టీల దోపిడీ వర్గస్వభావం వారికి ఎరుకైంది. దానితో వాళ్లు ఆ దోపిడీవర్గ పార్టీలకు సలాం కొట్టి విప్లవ పార్టీ నాయకత్వంలో భూపోరాటాలకు దిగారు. ఊరూరా రైతాంగం ధైర్యంగా అడవులను నరికి వందల, వేల ఎకరాల భూములు కొత్తగా సాగులోకి తెచ్చుకోసాగారు. వాళ్ల జీవితాల్లో కొత్త భూములు కొత్త వెలుగులను నింపాయి. ఈ వెలుగులు వందల మైళ్ల దూరాన ఉన్న నిరుపేద ఆదివాసీ ఉరావ్ రైతులకు భూదాహాన్ని తీర్చే బాటను చూపాయి. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచీ (రాయగఢ్, సర్గూజ, జశ్‌పూర్ మున్నగు జిల్లాలు) 1980-2000 మధ్య వేలాది ఉరావ్ ఆదివాసీ రైతాంగ, వ్యవసాయ కూలీల కుటుంబాలు భూములు వెతుక్కుంటూ దండకారణ్యానికి చేరాయి.

1980-2000 మధ్య దండకారణ్యంలోని దాదాపు లక్షకు పైగా ఆదివాసీ, పీడిత రైతాంగ కుటుంబాలు కనిష్టంగా మూడు లక్షలకు పైగా ఎకరాల అడవులను నూతనంగా నరికి భూమిని సాగులోకి తెచ్చుకోగలిగాయి. సాపేక్షికంగా చాలా తక్కువ మొత్తాల్లోనే అయినప్పటికీ ఆదివాసీ, గైరాదివాసీ భూస్వాముల, మాల్‌గుజార్ల, దుష్టతెగ పెత్తందార్ల, షావుకార్ల కొన్ని వందల ఎకరాల అన్యాక్రాంత భూములను విప్లవ రైతాంగం స్వాధీనం చేసుకున్నారు. దండకారణ్యవ్యాప్తంగా తొలి రెండు దశాబ్దాల కాలంలో సాగిన భూపోరాటాలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వేలాది భూమిలేని నిరుపేద రైతాంగం అన్నింటికీ తెగించి భూపోరాటాల్లోకి దిగారు. వారు పెంటపాడ్‌లో కల్మా దేవాల్, బండార్‌పదర్‌లో కాయ కోసాల్, టెట్టమడుగులో మడ్కాం నందాల్, కాంకేర్‌లంకలో సోడి లింగాల్, డోక్‌పాడ్‌లో కన్నె వడ్డె, కుంటలో గోపాల్‌రావు, కేడ్వాల్‌లో బురద వడ్డె, పిడిమేల్‌లో కోవాసి మాసా శేడల్, గొల్లపెల్లిలో కోర్స అప్పారావు లతో పాటు ఏరియాలో, సవలగిరి గిరి, దుబ్బ కన్నయ్య, కుర్సం రామయ్య, కడ్తి సుద్రులు కాగా గడ్‌చిరోలిలోని ఆసరెల్లి రాఘవరావు, సిరొంచ ప్రాంతంలో బడా జమీందార్‌గా పేరొందిన నస్వూర్ జమీందార్, రేగుంటలో గోవిందరావు, వెలుగురులో బుచ్చయ్య, రాజారంలో ఆత్రం గంగారాం లాంటి భూస్వాముల, పెత్తందార్లతో వారికి అండగా నిలిచిన పోలీసులతో పోరాడి ఆ భూములను తమ సాగులోకి తెచ్చుకున్నారు. జైలు కటకటాలకు వాళ్లు వెరవలేదు. అతి భయంకరమైన ఫాసిస్టు 'టాడా' చట్టం రాజ్యమేలిన కాలంలోనే వాళ్లు ఆ భూములను తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడం విశేషం. దండకారణ్యంలోని ప్రధానంగా గడ్చిరోలిలోని వేలాది ఆదివాసీ విప్లవ రైతాంగం టాడా పీడితులే. ఈ రైతాంగాన్నీ ఏ నల్ల చట్టాలూ భూపోరాటాలు చేయకుండా నిరోధించలేకపోయాయి. 1990 తర్వాత ఏ రాజకీయ పార్టీ వాళ్లను భూముల పట్టాల కోసం మళ్లీ-మళ్లీ పట్టణాలకు ప్రయాణం కట్టించలేకపోయాయి. పీడిత రైతాంగం రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చే భూముల హక్కు పత్రాల కోసం (పట్టా) డిమాండ్ చేయడం మానుకున్నారు. యేటేటా ఆ భూముల్లో పంటలు పండించుకోవడం మాత్రం పెరిగింది. దండకారణ్య ఆదివాసీ రైతాంగం పెద్దెత్తున భూములు సాధించుకున్న కాలంగా ఈ రెండు దశాబ్దాలను మనం చెప్పుకోవచ్చు. 'దున్నేవారికే భూమి' నినాదం

దండకారణ్యవ్యాప్తంగా వాస్తవంగా అమలులోకి వచ్చి వ్యవసాయ విప్లవంలోని అతి ముఖ్యమైన సమస్య పరిష్కారానికి పూనుకున్న ప్రారంభ కాలంగా దాన్ని పేర్కొనాలి. ఆ 20 ఏళ్లలో రైతాంగం సాధించుకున్న భూముల వివరాల సేకరణ కోసం 2001లో చేపట్టిన ఒక సర్వేలో భాగంగా మూడువేల కుటుంబాలను కలిసిన రిపోర్టు ప్రకారం కేవలం మూడు శాతం మందికే భూమిలేదని తేలింది. ఆ పోరాటాలు మరిన్ని గొప్ప మార్పులకు దారితీశాయి. సాగు భూముల స్వాధీనోద్యమం సాగు పద్ధతుల సంస్కరణోద్యమానికి నాంది పలికింది. ఆదివాసీ వ్యవసాయ ఉత్పత్తి విధానంలో, వారి జీవితాల్లో నూతన మార్పులకు బీజాలు వేశాయి. (ఈ వివరాలు జనతన సర్కార్ల అధ్యాయంలో చూద్దాం).

నగ్జల్బరీ కాలం నుంచీ 20వ శతాబ్దం చివరి వరకూ దేశంలోని కోట్లాది ఆదివాసులు చేపట్టిన అనేక భూపోరాటాల ఫలితంగా భారత ప్రభుత్వం అనివార్యంగా తన చట్టాల్లో మార్పుకు పూనుకోక తప్పలేదు. ఆ మార్పు 2006 నాటికి నూతన అటవీ చట్టంగా అవతారమెత్తింది. భారత ప్రభుత్వం చేపడుతున్న అన్ని చట్టాలూ ఈ దేశంలో పెల్లుబుకుతున్న ప్రజా పోరాటాలను అణచివేయడానికీ లేదా పక్కదార్లు పట్టించడానికీ, లేదా వాటికి ద్రోహం తలపెట్టడానికే నన్నది ఆచరణలో పదే పదే రుజువు అవుతున్న విషయం. దోపిడీ ప్రభుత్వాలు తమ చట్టాల్లో అనివార్యంగా మార్పులకు పూనుకోక తప్పనిస్థితికి వాటిని నెడుతున్న ప్రజా పోరాటాలకు వీర విప్లవ తెలంగాణ రైతాంగ పోరాట కాలం నుంచీ ఈనాటి దండకారణ్య ఉద్యమం వరకు ఒక సుదీర్ఘ చరిత్ర వుంది.

నూతన అటవీ చట్టంతో ఆదివాసుల సాగు భూములకు పట్టాలు దొరుకుతాయనీ ప్రభుత్వం, పాలకవర్గాల దోపిడీ, రివిజనిస్టు పార్టీలు తెగ ప్రచారం చేసి మురిశాయి. ఆ చట్టం అవతరించడం తమ ఘన విజయంగా రివిజనిస్టులు సంబరపడ్డారు. కానీ, ఆ చట్టం రూపొందాకా, తర్వాత అటవీ శాఖవారు నానారకాల తిరకాసులు పెడుతూ ఆదివాసులకు అటవీ సాగు భూములు దక్కకుండా చేయాల్సినంత చేస్తున్నారు. పట్టాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వాలు ముహూర్తాలు నిర్ణయించి పంపక ప్రక్రియను మహా ఆర్భాటంగా మొదలుపెట్టాయి. కానీ ఎంతమంది రైతులకు భూముల పట్టాలు పంపకం చేశారు? వారి నియమాలు, పద్ధతులు, విధి విధానాల చట్రంలో పొసగడం లేదనే నెపంతో లక్షలాది ఆదివాసుల సాగు భూములకు నాలుగేళ్లు దాటవస్తున్నా పట్టాలే దొరకలేదు. దోపిడీ పాలకవర్గాల స్వభావం తెల్సిన విప్లవ రైతాంగం మాత్రం ఆ పట్టాల మాయలో పడిపోకుండా తమ భూములను తాము సేద్యం చేసుకుంటున్నారు. దీర్ఘకాలంగా విప్లవ ప్రజానీకం చేస్తున్న పోరాటాల ఫలితంగానే దోపిడీ ప్రభుత్వాలు 'నూతన అటవీ చట్టాన్ని' తెచ్చినప్పటికీ దానిని చిత్తశుద్ధితో అవి అమలు చేయవనీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) స్పష్టం చేసింది. బలమైన విప్లవోద్యమ ప్రాంతాలలో ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వాలను ఎన్నుకుంటున్న విప్లవ రైతాంగం దోపిడీ ప్రభుత్వాలు ఇవ్వచూపుతున్న భూముల పట్టాల కోసం వెంపర్లాడనవసరం లేదనీ, జనతన సర్కార్లే రైతుల సాగు భూములను సర్వే చేసి స్త్రీ-పురుషుల ఉమ్మడి పేరుతో భూముల ప్రమాణ

పత్రాలను (పట్టా) జారీ చేస్తాయనీ అది ప్రకటించింది.

## 1 (ఎఫ్) భూమి కేంద్రంగా సాగుతున్న రైతాంగ విస్థాపన వ్యతిరేక ప్రజా ఉద్యమాలు

దండకారణ్యం అపార ప్రాకృతిక సంపదలకు నిలయం. ఇక్కడ ప్రధానంగా ఇనుప ఖనిజం లభ్యమవుతున్నప్పటికీ, దాదాపు మరో **25** రకాల ఖనిజాలు లభ్యమవుతున్నాయి. దేశంలో దొరికే **86** రకాల ఖనిజాల్లో దాదాపు అన్ని రకాలూ మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో ఎక్కడో దగ్గర లభ్యమవుతున్నాయి. దండకారణ్యంలో గత మూడు దశాబ్దాలుగా బడాపెట్టుబడులతో ఎలాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభమవ్వలేదు. దేశంలోనే ఇనుప గనుల తొలి యాంత్రిక ఓపెన్‌కాస్ట్ తవ్వకాలు **1968**లో బైలాదిల్లాలో మొదలయ్యాక, కొద్ది సంవత్సరాలకే బస్తర్‌లో విప్లవ కణికలు రగుల్కొన్నాయి. విశాల దండకారణ్యం నుంచీ కారుచౌకగా ప్రకృతి వనరులను కొల్లగొట్టుకపోవడానికి దేశ దళారీ, విదేశీ ఘరాన కార్పొరేట్ శక్తులు తీవ్రంగా ప్రయత్నాలు సలుపుతున్నాయి. వారి ప్రయత్నాలలో అడుగడుగునా ప్రజలపై రాష్ట్రాల పోలీసుల, భారత అర్ధ సైనిక బలగాల హింస రాజ్యమేలుతోంది. దీనిని ఎదుర్కొంటూ తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసం విప్లవించడం ఆదివాసులకు అనివార్యం అవుతోంది.

దండకారణ్యంలోని బైలాదిల్లా, భాంసీ, ఆముదాయమెట్ట, కువ్వెమారి, లోహండిగూడా, రావుగాట్, పల్లామాడ్, చార్‌గాం, సూర్జాగఢ్, దమ్‌కోడి లాంటి ఇంకా అనేక ఆదివాసీప్రాంతాలలో నెలకొన్న అపార గనులను తవ్వడానికి భారీ పెట్టుబడులు సిద్ధమయ్యాయి. డంకినీ, శంకినీ, ఇంద్రావతి, పాముల గౌతమి, పరాల్‌కోట, తాల్పేరు లాంటి జీవనదులపై భారీ డ్యాంలు నిర్మించడానికి పథకాలు రూపొందించారు. దేశంలో **1947** తర్వాత నిర్మించిన దాదాపు మూడు వేల మూడు వందల భారీ ప్రాజెక్టులతో దాదాపు రెండున్నర కోట్ల ప్రజలను భారత ప్రభుత్వం నిరాశ్రయులను చేసింది. వీరిలో సగం ఆదివాసీ జనాలే ఉన్నారనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. భారీ ప్రాజెక్టులతో నిరాశ్రయులైన వారిలో నాల్గవ వంతు జనాలకైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పునరావాసాన్ని కల్పించలేకపోయాయి. ఇలాంటి అనుభవాలను తమ ముందు పరుచుకున్న దండకారణ్య ఆదివాసీ ప్రజలు దళారీ పెట్టుబడిదార్ల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం తమ అస్థిత్వాన్నీ, ఉనికినీ ఎందుకు వదులుకోవాలనీ సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న భారత పాలకవర్గాలకు ఊపిరాడనివ్వడం లేదు. ఈ ప్రశ్న కేవలం దండకారణ్య ప్రజలే గాదు గత దశాబ్ద కాలంగా 'రెడ్ కారిడార్'గా నూతన పదప్రయోగం ఉనికిలోకి వచ్చిన యావత్తు మావోయిస్టు ఉద్యమ ప్రాంత ప్రజలందరూ తమ ప్రాంతాలలో పెట్టిన పది లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడులను ప్రశ్నిస్తున్నారు. దేశంలోని దాదాపు **410** లక్షల ఎకరాల అడవులనూ, నిర్దిష్టంగా ఛత్తీస్‌గఢ్‌లో **35** వేల ఎకరాల అడవులను గనుల తవ్వకాల కోసం ఇవ్వడాన్ని మేం ఆమోదించేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. భారత పాలకవర్గాలు తలకెత్తుకున్న నూతన ఆర్థిక విధానాలను వారు సవాలు చేస్తున్నారు. వారు ఆ సవాళ్ల నేపథ్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధమవుతున్నారు.

మధ్యప్రదేశ్ నుంచీ 2000 సంవత్సరంలో 16 జిల్లాలు విడిపోయి ప్రత్యేక ఛత్తీసగఢ్ రాష్ట్రం ఏర్పడింది. రెండు కోట్ల జనాభాతో విడిపోయిన ఛత్తీస్‌గఢ్‌లో మూడవ వంతు జనాభా ఆదివాసులదే. ఛత్తీస్‌గఢ్‌లో నూతన ఆర్థిక విధానాలు అతి వేగంగా అమలవుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన ప్రారంభంలోనే బాల్కో నుంచీ ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. ఆ ప్రక్రియపై వెల్లువెత్తిన ప్రజా నిరసన సద్దుమణగక ముందే రాష్ట్రంలో రోడ్డు రవాణా సంస్థను ప్రైవేట్‌పరం చేసి మరో చిచ్చులేపారు. ఇవి ఇలా ఉండగానే భారత బడాపెట్టుబడిదారులతో కారుచౌకగా గనుల తవ్వకాల కోసం అవగాహనా పత్రాలపై అనేక ఒప్పందాలు (ఎంఓయు) కుదుర్చుకున్నారు. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో జిందల్ టెక్నికల్ పార్క్ నిర్మాణానికీ పూనుకున్నారు. అక్కడి మూడు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల కోట్ల రూ.ల పెట్టుబడులతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పలు పెట్టుబడిదార్లతో 48 ఎంఓయులు కుదుర్చుకున్నది. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ప్రధానంగా 'నెకో'కు అనేక చోట్ల గనుల తవ్వకానికీ ప్రభుత్వం అనుమతి నిచ్చింది. నెకో యాజమాన్య వర్గాల్లో భారత హోంశాఖ మాజీ మంత్రి (యుపిఏ-1లో), ప్రస్తుత గనుల శాఖ (యుపిఏ-2) మంత్రి శ్రీప్రకాశ్ జైస్వాల్ ప్రముఖుడు. నెకోతో పాటుగా పల్లామాడ్ ప్రాంతంలో గోదావరి ఇస్పాత్, రాయపూర్ అల్లాయిస్ తదితర బడాబూర్జువా శక్తులు; సోనాదాయి, సరోలి, పల్లామాడ్, రోసెల్, దర్భా, హల్లాది, కచ్చె, కామ్‌ఖేడా, దువ్వార్‌ఘాట్, ఖేడాఝురన్, కొండెమెప్పు, మహామాయలలో గనుల తవ్వకానికి అనేక కంపెనీలు దిగాయి. దంతెవాడ జిల్లా భాంసీలో ఎస్సార్, బస్తర్ జిల్లా లోహండిగూడలో స్టీలు ప్లాంట్ల నిర్మాణానికి రంగప్రవేశం చేశారు. దంతెవాడ జిల్లా బైలాదిల్లా విశాఖ రేవు వరకు లోహ చూర్ణాన్ని భూగర్భ మార్గాన పైప్‌లైన్ ద్వారా ఎస్సార్ యాజమాన్యం చేరవేస్తోంది. గడ్‌చిరోలి జిల్లా సూర్జాగఢ్‌లో లాయిడ్ ముందుకు వచ్చాడు. ఇలా దండకారణ్యవ్యాప్తంగా భారత బడాపెట్టుబడిదార్లు తమ భారీ దళారీ నిరంకుశ పెట్టుబడులతో నిండుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పెట్టుబడుల దిగుమతిని 'అభివృద్ధి'గా వర్ణిస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం తెగ మురిసిపోతోంది. కానీ ఈ పెట్టుబడుల దిగుమతి స్థానిక ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారింది.

విప్లవోద్యమ ప్రారంభంలో అటవీ భూముల కోసం పోరాడి ప్రజలు వాటిని గెలుచుకున్నారు. తమ జీవికకు హామీనీ పొందారు. కానీ నిరంతరం ఆ ప్రజలు తమ జీవికనూ, తమ విజయాలనూ కాపాడుకోవడానికి పోరాడాల్సి వస్తోంది. ఈ పోరాటం అతి నిర్దాక్షిణ్యంగా సాగుతోంది. ఆ పోరాటం ఒకవైపు ఆ ప్రాంతంలో భారీ పెట్టుబడుల ప్రవేశాన్నీ అడ్డుకుంటూ మరోవైపూ విశాల పీడిత ప్రజారాశుల అస్థిత్వాన్నీ కాపాడుకోవడానికై సాగుతున్న పోరాటం. ఆ పోరాటంలో గెలుపు సాధించడం పీడిత ప్రజలకు అనివార్యమవుతుంది. అందుకే వాళ్లు భారత అర్ధసైనిక బలగాల లాఠీలతో, తుపాకులతో, భారీ ఆయుధాలన్నింటితో సాయుధంగానే పోరాడుతున్నారు. దోపిడీవర్గ 'సైన్యాల' అత్యాచారాలను, హత్యలను, లూటీలను, గృహ దహనాలను, పంటల విధ్వంసాన్ని, పంట భూముల స్వాధీనాన్నీ ధైర్యంగా ప్రతిఘటిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై సల్వాజుడుం పేరుతో 2005 జూన్‌లో ప్రారంభించి

2009 చివరి వరకు కొనసాగించి అంతిమంగా ఓటమి పాలైన ఫాసిస్టు దాడినీ ఘరానా కార్పొరేట్ శక్తులే ప్రమోట్ చేశాయి. ఈ విషయాన్ని వ్యవసాయ సంబంధాల స్థితి, భూసంస్కరణల అసంపూర్ణ కర్తవ్యాలు (కమిటీ ఆన్ స్టేట్ అగ్రేరియన్ రిలేషన్స్ అండ్ అన్‌ఫినిష్డ్ టాస్క్స్ ఆఫ్ ల్యాండ్ రీఫార్మ్స్, వాల్యూం-1)పై కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ రూపొందించిన చిత్తు నివేదికలో సల్వాజుడుంకు టాటా, ఎస్సార్‌లే తొలి ఫైనాన్సియర్‌లుగా ఉన్నారంటూ నిజాయితీగానే వాస్తవాన్ని బయటపెట్టింది. వీరికి స్థానికంగా విప్లవోద్యమ చేతిలో శిక్షలు అనుభవించిన ప్రజా వ్యతిరేకశక్తులు, భూస్వామ్య-పెత్తందారీ శక్తులు అండగా నిలవగా స్థానిక విధాన సభ సభ్యుడు, భూస్వామ్య-దళారీ పెట్టుబడిదారీ వర్గాల కుఖ్యాత ఏజెంటు, రాష్ట్ర విధాన సభలో ప్రతిపక్ష నాయకుడు, హంతక రాజకీయాలకు జిల్లాలో పేరుమోసిన ఫాసిస్టు మహేంద్ర కర్మ అధికార పక్షం తీర్థం పుచ్చుకొని ముందు నిలిచాడు. గ్రామసభల పేరుతో జరిగే తంతులో పెట్టుబడిదారుల దళారీలు ప్రధానంగా మహేంద్ర కర్మ అతని సల్వాజుడు గూండాలు పాల్గొని ప్రభుత్వ అధికారుల సమక్షంలో రైతాంగాన్నీ తమ భూములు వదలుకోవాలనీ, లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయనీ అతి దుర్మార్గంగా హెచ్చరించేవారు. 'బస్తర్ వికాసానికీ పరిశ్రమల స్థాపనా, రైల్వేలైన్లు, జాతీయ రహదార్ల నిర్మాణం అవశ్యం' అంటూ అందుకుగానూ రైతాంగం భూములు వదులుకోవాలనీ సల్వాజుడుం వకాల్తాదారులందరూ నిస్సిగ్గుగా రైతాంగంపై పాశవిక దాడులు కొనసాగిస్తున్నారు. భారత వాణిజ్య విభాగం అధికారికంగా ఆమోదం తెల్పిన 574 ప్రత్యేక ఆర్థిక మండళ్లలో నిర్మాణ పనులు ప్రారంభించిన 341 కేంద్రాలలో ప్రభుత్వ బలగాల దాడుల స్వభావంలో పెద్ద మార్పులేదు. భారీ పెట్టుబడులకు వ్యతిరేకంగా తమ అస్థిత్వం కోసం పోరాడుతున్న కళింగనగర్, సింగూర్, నందిగ్రామ్, లాల్‌గఢ్, లోహండిగూడా, రావుగాట్ తదితర ప్రజా పోరాటాల అనుభవాలు మన ముందున్నాయి. వీటన్నింటిలో కెల్లా వర్తమానంలో లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటు ఒక నూతన నమూనాగా విస్థాపన ప్రజల ముందు నిల్చింది.

దండకారణ్యంలోని చార్‌గాం గనుల తవ్వకానికి, తవ్విన ముడి పదార్థాల రవాణా కోసం పూనుకున్న రావుఘాట్ రైల్వేలైన్ నిర్మాణానికీ వ్యతిరేకంగా 2004 అక్టోబర్ 25న దాదాపు 20 వేలకు పైగా సంఖ్యలో ప్రజలు హాజరై చార్‌గాంలో పెద్ద బహిరంగసభను జరిపి ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. అదే విధంగా దల్లీ-రాజహారాలో 20వేలకు పైగా ప్రజలు హాజరై 2004 అక్టోబర్‌లోనే రావుగాట్ రైల్వేలైన్ నిర్మాణానికీ, చార్‌గాం గని తవ్వకాలకూ వ్యతిరేకంగా పెద్ద బహిరంగసభను జరిపి తమ నిరసనను తెలిపారు. ఈ సభలకు బిడి శర్మ, వినాయక్ సేన్ లాంటి ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ ప్రజాహితాభిలాషులు హాజరయ్యారు. దాదాపు 68 గ్రామాల్లో 'రావుగాట్ గనుల పరిరక్షణ కమిటీ'లను ఏర్పర్చుకున్నారు. ఈనాటికీ వేలసంఖ్యలో ప్రజలు తాము ఏర్పర్చుకున్న కమిటీల నాయకత్వంలో దృఢంగా నిల్చి పోరాడుతున్నారు. దోపిడీ ప్రభుత్వాలు 'వికాసం' మాటున సృష్టిస్తున్న వినాశనాన్నీ వారు ఏర్పర్చుకున్న సాంస్కృతిక బృందాలు నిరంతరం ఎండగడుతూ ప్రజలలో దృఢమైన సమైక్యతను పెంపొందిస్తున్నాయి. తమ ఆస్తులనూ, సంపదలనూ పోరాడి సంరక్షించుకోవడానికి ప్రజలు పదుల సంఖ్యలో పోరాట

మిలీషియాను నిర్మించుకుంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎంతటి తీవ్ర నిర్బంధ, అణచివేత విధానాలను చేపట్టినప్పటికీ వారు తమ ఇళ్లనూ, భూములనూ, అడవులనూ, తరతరాల సాంస్కృతిక వారసత్వాన్నీ వదులుకునేది లేదని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. కేవలం రావుగాట్ గనుల ప్రాంత ప్రజలే కాదు దండకారణ్యంలోని అన్ని గనుల ప్రాంతాలలోని పేద ప్రజలు అది పల్లామాడ్ కావచ్చు, సూర్జాగఢ్ కావచ్చు లేదా మరో గని తవ్వకం ప్రాంతం ఏదైనా కావచ్చు. ఎక్కడైనా పోరాట ప్రజల ప్రతిక్రియ ఒకే రకంగా వుంది. లొహండిగూడాలో పోరాట ప్రజలు మరింత మిలిటెంట్‌గా కదలుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి తరలి వస్తున్న ప్రభుత్వ అధికారులను తన్ని తరుముతున్నారు. ఇక్కడి 10 గ్రామ పంచాయితీలకు చెందిన బాధిత ప్రజలు అనేక రకాల పోలీసు నిర్బంధాన్ని, లాఠీదెబ్బలను భరిస్తూనే 2009 జూన్ 1 నాడు జిల్లా ముఖ్య పట్టణం జగ్దల్‌పూర్‌లో దాదాపు 25 వేల మంది ప్రజలు హాజరై విస్థాపన వ్యతిరేక భారీ ర్యాలీనీ, బహిరంగసభను నిర్వహించారు. ప్రజల విస్థాపన సమస్యను అర్థం చేసుకొని వారి పక్షం వహించే గౌతం నవలఖా లాంటి పౌరహక్కుల సంఘాల నాయకులను ఆ సభకు ఆహ్వానించి తమ గోడు విన్నవించుకొని వారు తమ సమస్యను విశాల ప్రజల ముందుంచారు. దళారీ నిరంకుశ పెట్టుబడిదారుడైన టాటా పక్షం వహించిన కాంగ్రెస్ నాయకుడు, ప్రజావ్యతిరేకి విమల్ మెశ్రాం లాంటి దళారీలను ఆ సమయంలోనే మట్టుబెట్టారు. బేసెవాడ (ఏటపల్లి తాలూకా, గడ్చిరోలి జిల్లా), రావుగాట్, పల్లామాడ్‌లలో ప్రజలు, గెరిల్లాలు సంయుక్తంగా దాడులు జరిపి తవ్వకం యంత్రాలను, వాహనాలను ధ్వంసం చేశారు. ఎస్సార్ పైప్‌లైన్‌ను బైలాదిల్లాలో పలుమార్లు ధ్వంసం చేసి లోహ చూర్ణ సరఫరాను చాలాకాలం అడ్డుకున్నారు. బైలాదిల్లాలో పదుల సంఖ్యలో బడా కాంట్రాక్టర్ల వాహనాలకు నిప్పుపెట్టి తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. తమ అస్థిత్వానికి అత్యంత ప్రమాదకరంగా తయారైన గనుల తవ్వకాన్ని నిలిపివేయడంలో భాగంగా ప్రజలు  అనేక రకాల నిరసన, ప్రతిఘటన పోరాట రూపాలను ఎన్నుకుంటున్నారు.

భారత పాలకవర్గాల నూతన ఆర్థిక విధానాలను మరోమాటలో సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను మాటల్లో వ్యతిరేకిస్తున్న రివిజనిస్టు సిపిఐ, సిపిఎం పార్టీలు ఆచరణలో వాటి అమలుకు సిద్ధపడుతున్నాయి. ప్రజల ఆస్తులకు ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలంటూ బేరసారాలాడుతున్నాయి. సమరశీల పోరాటాలలో ముందుకు వస్తున్న ప్రజల పోరాటచేవనూ, చొరవనూ నీరుగారుస్తున్నాయి. తల లోతు ఆర్థికవాద రొంపిలో కూరుకపోయిన రివిజనిస్టులు ప్రజా పోరాటాలకు ద్రోహం చేస్తూ వారి పోరాట ఆగ్రహాలనూ, జీవన ఆకాంక్షలనూ తమ ఎన్నికల రాజకీయాలకు బలిగొంటున్నాయి. ఈ రివిజనిస్టు పార్టీలు ప్రజా నిరసన చర్యలను జాతీయ విధ్వంసక చర్యలుగా అభివర్ణిస్తూ, గాంధీని మించిన గాంధేయ దేశభక్తినీ, టాటా, ఎస్సార్‌లను మించిన జాతీయతనూ, చిదంబరంను మించిన అహింసనూ అలుపుసొలుపు లేకుండా నిస్సిగ్గుగా విప్లవ ప్రజలకు ఉపదేశిస్తున్నాయి.

ఈ అధ్యాయం ప్రారంభంలోనే ఈ దశాబ్దపు విశిష్టతల్లో మొట్టమొదటిగా పేర్కొన్న ప్రజా విముక్తి

గెరిల్లా సైన్యం ఆవిర్భావం పెద్దెత్తున ముందుకువస్తోన్న సమరశీల ప్రజా పోరాటాలన్నింటికీ దన్నుగా వుంది. 2008లో సిఎస్ఈ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) వాళ్లు 'రిచ్‌ల్యాండ్స్ అండ్ పూర్ పీపుల్' (సంపద్వంతమైన భూములు, నిరుపేద ప్రజలు)పై తయారు చేసిన రిపోర్టులో 'ఈ దేశంలో ఖనిజ సందలతో తులతూగే మైనింగ్ జోన్స్‌లో 60 శాతం మావోయిస్టుల నియంత్రణలోనే ఉన్నాయంటూ' తన అంచనాను ఇచ్చింది. ఈ ఉద్యమ ప్రాంతాల ప్రజలు తమ పోరాటాలకు పిఎల్‌జిఏ దన్నుగా ఉందనీ సగర్వంగా చెప్పుకుంటున్నారు. దోపిడీదార్ల బడాపెట్టుబడులకు ప్రవేశం లేదని ప్రకటిస్తున్నారు.

ప్రజలు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, దేశ, విదేశీ ప్రజాస్వామికవాదులు, పౌర, ప్రజాస్వామ్య హక్కుల సంఘాల కార్యకర్తల సమష్టి కృషితో సల్వాజుడుం ఓటమి పాలైంది. ఫలితంగా దీనికి తొలి ఫైనాన్సియర్లుగా ఉండిన టాటా, ఎస్సార్‌లే కాకుండా ఈ ప్రాంతంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టిన దేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, విదేశీ సంస్థల పెట్టుబడులన్నీ స్థంభించిపోవడంతో ఈనాటి అంతులేని సంక్షోభ పరిస్థితులలో వారికి దిక్కు తోచకుండా పోతోంది. వారి ఆందోళనను దేశ ప్రధాని 2009లో ఒక సందర్భంలో పార్లమెంట్‌లో తన మాటల్లో ఈ విధంగా స్పష్టం చేశాడు "ప్రకృతి సంపదలైన ఖనిజాలు లభ్యమయ్యే ప్రాంతాలలో వామపక్ష తీవ్రవాదం పెరిగిపోతూంటే పెట్టుబడుల వాతావరణం తప్పకుండా ప్రభావితం అవుతుంది" అన్నాడు. సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభం 2007 చివరి నాటికి ద్రవ్య సంక్షోభంగా మొదట అమెరికాలో బద్దలైనప్పటికీ అతివేగంగా ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలనూ చుట్టుముట్టి అతలాకుతలం చేస్తోంది. ఇందుకు భారత ఆర్థిక వ్యవస్థ ఏమాత్రం మినహాయింపుగా లేదు. అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య సంక్షోభ దుష్ప్రభావాలు భారతదేశంలోనూ అన్ని రంగాలలో ప్రమాదకరంగా వ్యక్తమవుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రజల జీవితాలతో సంబంధం ఉండని అభివృద్ధి రేటు ఎంతో గణనీయంగా ఉందని ఆర్థికమంత్రి, ప్రధానమంత్రి తెగ ప్రచారం చేస్తున్నా గనుల తవ్వకాలు, ఖనిజాల వెలికితీత నిల్చిపోతే వారు ఎంత ఆగమవుతారో వారి ప్రతి మాటలో, ప్రతి చర్యలో స్పష్టంగా వ్యక్తమవుతోంది. వారు 'రెడ్ కారిడార్'లో గనుల తవ్వకాలను ప్రారంభించడానికి 2009 జులై-ఆగస్టు మాసాల్లో 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో మున్నెన్నడూ లేనిస్థాయిలో భారత అర్ధసైనిక బలగాలను మోహరించి దేశ వ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలపై సైనిక దాడులను తీవ్రం చేశారు. ఈ దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామ్యశక్తులు, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, పాత్రికేయులు, ఆదివాసీ ప్రజల హితోభిలాషులు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, వారి 'రెడ్ కారిడార్'ను 'ఎంఓయూస్ కారిడార్'గా వారి గ్రీన్‌హంట్ ఆపరేషన్ సైనిక దాడులను 'వార్ ఆన్ పీపుల్' (ప్రజలపై యుద్ధం)గా పేర్కొంటూ ప్రాకృతిక సంపదలతో తులతూగుతున్న ఆదివాసీ ప్రాంతాలలోని యదార్థ చిత్రాన్ని ప్రపంచం ముందు ఉంచడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నేడు భారతదేశ రాజకీయ చిత్రపటంపై ఎర్రరంగును పులుముకుంటూ అరుణకాంతులీనుతున్న ప్రాంతాలలో ప్రజాయుద్ధం తీవ్రమవుతోంది. ఈ యుద్ధం దేశ సంపదలను, సార్వభౌమాధికారాన్ని అమ్మకానికి పెట్టిన దోపిడీ భారత పాలకవర్గాలకూ, వారికి దన్నుగా

నిల్చిన సామ్రాజ్యవాదులకూ మరియు విశాల ప్రజలకు మధ్య జరుగుతోంది. పరమ రియాక్షనరీ శక్తులతో విప్లవ శక్తులు తలపడుతున్నాయి. ప్రజాయుద్ధం న్యాయమైంది. ఇది అన్యాయమైన యుద్ధాన్ని ఎదుర్కొంటోంది. నిన్న సల్వాజుడుం రూపంలో, నేడు ఒజిహెచ్ రూపంలో ముందుకు వస్తోన్న యుద్ధాన్ని ప్రజలు తమ భూముల కోసం, ఆస్తుల కోసం, ప్రాణాల కోసం, సంస్కృతి కోసం మరోమాటలో తమ అస్థిత్వం కోసం ఎదుర్కొంటున్నారు.

## 1 (జి) యాజమాన్య హక్కుల స్పృహతో అటవీ ఉత్పత్తుల అమ్మకాలపై గిట్టుబాటు ధరలను డిమాండ్ చేస్తూ సాగిన ప్రజా పోరాటాలు

దండకారణ్యంలోని వివిధ ప్రాంతాలలో వివిధ రకాలైన అటవీ ఉత్పత్తులను ప్రజలు సేకరించి వినియోగించుకోవడం అనాదిగా జరుగుతోంది. గతంలో ఈ ఉత్పత్తులను ప్రధానంగా గృహ అవసరాలకే వినియోగించేవారు. ఇప్పపూలు,ఇప్పకాయ, మొర్రిపండ్లు లాంటివన్నీ ప్రజలు తమ ఆహార అవసరాలకే అధికంగా వినియోగించుకునేవారు. కానీ మార్కెట్ విస్తరణ, ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావంతో పాటు విప్లవోద్యమ విజయాలలో భాగంగా రైతాంగానికి సాగు భూములు చేజిక్కి ఆహార పంటలు రావడం సాపేక్షికంగా పెరగడంతో అటవీ ఉత్పత్తుల సేకరణలో, వినియోగంలో గణనీయమైన మార్పులే జరుగుతున్నాయి.

పై పరిణామాలను నిర్దిష్టంగా పరిశీలిస్తే అటవీ ఉత్పత్తుల సేకరణలో పెద్దమార్పులే జరిగాయి. బృహత్ బస్తర్‌లో 475కు పైగా వారపు సంతలు నడుస్తున్నాయి. ఫాసిస్టు సల్వాజుడుం దాడులు ముమ్మరంగా సాగిన ప్రాంతాలలో అటవీ ఉత్పత్తుల సేకరణ గణనీయంగా పడిపోయింది. భూముల సేద్యం పెరిగి, ఇతర నగదు రాబడి మార్గాలు విస్తృతమైన చోట, అధిక ప్రయాసతో కూడుకొని ప్రమాదభరితమైన అటవీ ఉత్పత్తుల సేకరణలో ప్రజలు ముఖ్యంగా యువతరం పాల్గొనడం చాలా తగ్గింది. ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా మార్కెట్ విస్తరించడంతో మారకపు విలువలు కలిగిన అన్ని రకాల అటవీ ఉత్పత్తుల వినియోగం కన్నా అమ్మకాలు పెరిగాయి. మార్కెట్ దృష్టితో గతంలో లేని రకరకాల అటవీ ఉత్పత్తులను సేకరించడం పెరిగింది. వీటిలో ఔషధ విలువలు కలిగిన మొక్కలు, వేర్లు, పండ్లు, కంద మూలాలు, కాయలు, ఆకుల్లాంటివి కూడా ఉన్నాయి. అలాగే వనస్పతి తయారీలో వినియోగించే నూనె గింజల అమ్మకాలు గతం కన్నా పెరిగాయి. అద్దకం పరిశ్రమలో వినియోగించే బంక అమ్మకాలు విస్తృతమయ్యాయి. నిరంతరం అటవీ ఉత్పత్తులను అందించే వనరులను మార్కెట్ విస్తరించడంతో అమ్మకాల వేటలో, వ్యాపారస్థుల దురాశా ప్రోత్సాహంతో, డబ్బుల ఆశతో (ప్రధానంగా చెట్లను) ముందుచూపు లేకుండా తక్షణావసరాల కోసం విచ్చలవిడిగా నిర్మూలించే ధోరణి ప్రబలింది. ఫలితంగా కొన్ని ప్రాంతాలలో ఉసిరికాయ (నెల్లికాయ) చెట్లు చాలా పలుచబడిపోయాయి. తునికి ఆకు రేటు పెరగడంతో ఆకు కోసం చెట్లే నరుకుతూండడంతో ఆదివాసీలకు తరతరాల తునికి పళ్లు కరవు

అయ్యే దుస్థితి దాపురించింది. అలాగే ఆదివాసీలు 'లంజెమ్ర'గా వ్యవహరించే చెట్టు బెరడు గొప్ప ఔషధ గుణాలు, జిగురు లక్షణాలు కలిగి ఉండడంతో మార్కెట్‌లో దాని డిమాండ్ పెరిగి బెరడు తీసిన చెట్లు చాలా చోట్లా చచ్చిపోయాయి. క్రమంగా ప్రబలుతున్న ఈ ధోరణినీ జనతన సర్కార్లు సమర్థవంతంగా పనిచేస్తున్న ఏరియాలలో అవి కొంత నియంత్రించగలిగాయి. ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటి అమ్మకాలను క్రమబద్ధీకరించాయి.

1998-99 సంవత్సరాలలో మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాలలో అటవీ ఉత్పత్తుల ప్రైవేటు కొనుగోళ్లను నిషేధించింది. కానీ అది ఎక్కువ కాలం సాగలేదు. ప్రభుత్వం విధించిన నిషేధాన్నీ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పెద్దెత్తున ప్రజలు పోరాటానికి దిగి విజయం సాధించారు. ఆ తర్వాత నుంచీ తిరిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అలాంటి నిషేధాలకు ఇప్పటి వరకూ ధైర్యం చేయలేదు. 2001 నుంచీ 2004 వరకు దండకారణ్యవ్యాప్తంగా ముఖ్యంగా దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ డివిజన్లలోని ప్రజలు తమ అటవీ ఉత్పత్తులకు సంతలలో షావుకార్లు న్యాయమైన రేట్లు చెల్లించాలనీ విప్లవ ప్రజా సంఘాల నాయకత్వంలో ప్రతి యేటా పోరాటాలు చేపడుతున్నారు. దాడెల్లి, బోడ్‌కల్, కిష్టారం, గొల్లపెల్లి, బీజాపూర్, గంగలూర్, నారాయణపూర్, బడ్‌గాం, కోయల్‌బేడ సంతలలో ర్యాలీలు నిర్వహించి తమ డిమాండ్లను షావుకార్ల ముందుపెట్టి చర్చించారు. దీనితో షావుకార్లు ప్రజల డిమాండ్లకు ఆమోదించి కొనుగోలు రేట్లను పెంచారు.

2005 జూన్‌లో ఫాసిస్టు సల్వాజుడుం విధ్వంసకాండ ముందుకు వచ్చింది. ఇది రైతుల గృహ ఆర్థిక స్థితిని చిన్నాభిన్నం చేసింది. దంతెవాడ, బీజాపూర్ జిల్లాల్లో దాదాపు 644 గ్రామాలను ఖాళీ చేయించడంతో వందలాది కుటుంబాల ఆర్థిక స్థితి తీవ్రంగా దెబ్బతింది. వందలాది ఇండ్లను తగులబెట్టడంతో రైతాంగం పెద్దఎత్తున అటవీ ఉత్పత్తులను కోల్పోయారు. జూన్‌లో సల్వాజుడుం దాడులు ప్రారంభం కావడం అంటే అది రైతుల ఇండ్లల్లో తాము వేసవిలో సేకరించుకున్న అటవీ ఉత్పత్తులన్నీ పెద్దెత్తున నిలువలు ఉండే సమయం అవుతుంది. ఆ సమయాన దాడులు జరగడంతో ఇంటింటా ఉన్న ఇప్పపూల రాసులు, గార (ఇప్పకాయ) రాసులు మంటల్లో కాలిబూడిదయ్యాయి. సల్వాజుడుం దాడుల నుంచీ రైతులు తమ పంట దినుసులతో సమానంగా భావించే అటవీ ఉత్పత్తులను కాపాడుకోగలిగిన చోట వాటిని వారు తమ అవసరార్థం అమ్మకానికై సంతలకు తీసుకెళ్లజూస్తే జుడుం పరమ దుర్మార్గంగా సంతలను అడ్డుకుంది. జుడుం ప్రారంభం కావడంతోనే దాని వేటు తక్షణం సంతలపై పడింది. అనేక సంతలు బంద్ అయ్యాయి. దీనితో పేద ఆదివాసీలు తమ అటవీ ఉత్పత్తుల్లో అధిక భాగాన్ని పరంపరగా వస్తున్న వస్తుమార్పిడి విధానం కిందా సంతల్లో మార్చుకోలేకుండా పోయీ వారు తమ దైనందిన అవసరాలను తీర్చుకోలేకపోయారు. మరుసటి సంవత్సరం 2006 వచ్చే సరికి జుడుం దాడుల తీవ్రత, విస్తృతి పెరిగింది. జుడుం ఏమేరకు విస్తరిస్తూ వెళితే ఆ మేరకు తొలుత నిలిచిపోయేవి సంతలే. ఆదివాసీ ప్రజల సంప్రదాయ

గృహ ఆర్థిక జీవనం అంతా వారం-వారం సాగే సంతలపై ఆధారపడిందేనన్న విషయం స్పష్టంగా తెలిసే జుడుం గూండాలు, వారి రక్షణలో నిల్చిన సాయుధ బలగాలు సంతలను నిలిపివేయడం ప్రజల ఆర్థిక జీవనాన్ని అస్తవ్యస్తం చేయడం తమ దాడులకు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2006లో జుడుం దాడుల మధ్య చాలా చోట్ల ప్రజలు అటవీ ఉత్పత్తులను సేకరించుకోలేకపోయారు. ఈ రకంగా 2005-2006లలో అటవీ ఉత్పత్తుల గృహ నిలువలు, సేకరణ జుడుం దాడులకు పూర్తిగా దెబ్బతిని నిరుపేద ఆదివాసీ ప్రజల ఆర్థిక జీవనాన్ని దారుణంగా ప్రభావితం చేసింది.

2007 నాటికి సల్వాజుడుం వరుసగా దెబ్బ మీద గట్టిదెబ్బ తింటూ దాని దాడుల తీవ్రత తగ్గి దాని విస్తరణ ఆగిపోయింది. విప్లవ ప్రజా సంఘాలు క్రమంగా సంఘటితం అవుతూ తమ కార్యకలాపాలను పెంచాయి. మరోవైపు ఏరియా, డివిజన్ స్థాయిల్లో జనతన సర్కార్లు ఏర్పడి పటిష్టం కాసాగాయి. ఇలాంటి పరిస్థితులలో విప్లవ ప్రజా సంఘాలు సంత కమిటీలు అటవీ ఉత్పత్తుల అమ్మకాల రేట్లను నిర్ణయించడం మళ్లీ ముందుకు వచ్చింది.

**గడ్చిరోలి, తూర్పు బస్తర్‌లలో**
**అటవీ ఉత్పత్తుల అమ్మకపు రేట్ల జాబితా**

| క్రమ సంఖ్య | అటవీ ఉత్పత్తి | రేటు (రూ.) (ప్రతి కిలో) |
|---|---|---|
| 1 | పూసు గింజలు | 10/- |
| 2 | ఇప్పపూలు | 10/- |
| 3 | ఇప్ప పరక (పప్పు) | 15/- |
| 4 | తేనె | 100/- |
| 5 | తేనె తెట్టె (మైనం) | 150/- |
| 6 | తగిరేసి గింజలు | 5/- |
| 7 | మామిడి వరుగులు | 30/- |
| 8 | దుల్లి గింజలు | 80/- |
| 9 | ఉసిరికాయలు | 50/- |
| 10 | మొర్రిపళ్లు (చారపప్పు) | 100/- |
| 11 | చింతపండు | 20/- |
| 12 | చీపురు గడ్డి | 15/- |
| 13 | లక్క | 150/- |
| 14 | కరక్కాయ | 5/- |
| 15 | దసిరికాయ (కోసా కాయ) | కాయ ఒక్కటికి 5/- |
| 16 | బంక | 70/- |

జనతనా సర్కార్లు ఏర్పడడంతో సంత కమిటీలు ఉనికిలోకి వచ్చి సంతల్లో సాగే షావుకార్ల అక్రమాలను కొంతమేరకు నియంత్రించగలిగాయి. అటవీ ఉత్పత్తుల సేకరణలో భాగంగా దీర్ఘదృష్టి లేకుండా సత్వర లాభాల కోసం చెట్లను సమూలంగా నిర్మూలించే చర్యలను మానుకోవాలనీ జనతనా సర్కార్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సల్వాజుడుం, ప్రభుత్వ సాయుధ బలగాల దాడులను ప్రతిఘటిస్తూ ప్రజలకు రక్షణ కల్పించడంలో పిఎల్‌జిఎ, ప్రజా మిలీషియా పూర్తిగా నిమగ్నం కావడంతో ప్రజలు తమ అటవీ ఉత్పత్తుల సేకరణలో మళ్లీ యధావిధిగా పాల్గొంటున్నారు. అటవీ ఉత్పత్తుల రేట్లను నిర్ణయించడంలో సంత కమిటీలు చురుకైన పాత్రను పోషిస్తున్నాయి. జనతన సర్కార్లు సాపేక్షికంగా సమర్థవంతంగా పనిచేసే ప్రాంతాలలోనే నిర్ణయించిన రేట్లు అమలవుతున్నాయి. విప్లవ ప్రజా సంఘాలు, జనతన సర్కార్లు చురుగ్గా, చొరవతో పనిచేయని చోట షావుకార్లు ఆ బలహీనతను పూర్తిగా వినియోగించుకుంటూ ప్రజలను తెలివిగా దోపిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2010 సీజన్‌లో దక్షిణ బస్తర్‌లో అమలైన అటవీ ఉత్పత్తుల రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి.

| అటవీ ఉత్పత్తుల అమ్మకపు రేట్లు – దక్షిణ బస్తర్ (ప్రతి కిలోకు) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంవత్సరం | ఇప్పపూవు | ఇప్ప పరక | బంక | ఉసిరికాయ | చింతపండు | మామిడి వరుగులు |
| 2005 | 5 | 6 | 50 | 5 | 5 | 7 |
| 2006 | 6 | 7 | 60 | 6 | 8 | 12 |
| 2007 | 7 | 7 | 75 | 10 | 6 | 9 |
| 2008 | 20 | 9 | 85 | 9 | 10 | 10 |
| 2009 | 10 | 7 | 95 | 7 | 12 | 8 |
| 2010 | 8 | 8 | 110 | 12 | 7 | 11 |
| 2011 | 8 | 7 | 120 | 7 | 5 | 25 |

ప్రజలు మార్కెట్ నుంచీ కొనుగోలు చేసే సరకుల రేట్లు ఆకాశాన్నంటుతూండగా ప్రజల నుంచీ సంతల్లో షావుకార్లు మాత్రం చౌకగా అటవీ ఉత్పత్తులను కొనుగోళ్లు చేస్తూ పెద్దమొత్తాల్లో లాభాలు గడిస్తున్నారు. ఈ దురాశాపూరిత దోపిడీని కనీసం తగ్గించాలంటే జనతన సర్కార్లు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సి ఉంటుంది. వాటి అధికారం మరింత, మరింతగా బలపడినప్పుడు అవి ప్రజల వ్యాపారంలో నిర్ణయాత్మక పాత్రను పోషించగలవు.

## 1 (హెచ్) తునికి ఆకు కూలి, వెదురు నరికే కూలిరేట్ల పెరుగుదల :

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 1990వ దశకం ప్రారంభం నుంచీ 2003 వరకూ తునికాకు సేకరణె సహకార సంఘాలే కొనసాగించాయి. ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా తునికాకు సేకరణె జరుగుతున్నందునా అడవిలో విప్లవకారులకు (నక్సలైట్లకు) పెద్దెత్తున నిధులు సమకూరుతున్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కాంట్రాక్టర్లకు అడవిని గుత్తాకు ఇచ్చే పద్ధతినీ 1980ల చివర్లో రద్దు చేసి సహకార సంఘాల పద్ధతిని





తునికాకు సేకరిస్తున్న స్త్రీ, పురుషులు

ప్రవేశపెట్టింది. కానీ 2003 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్నీ మనసు మార్చుకొని తిరిగి కాంట్రాక్టర్లకు గుత్తాకు ఇచ్చే పద్ధతినే ముందుకు తెచ్చింది. అయితే ఈ కాలంలోనే విప్లవకారుల కార్యకలాపాలు అనేక రెట్లు పెరిగాయన్నది వాస్తవం. మహారాష్ట్రలోనూ 1980వ దశకం మధ్య భాగంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చేష్టలనే ప్రయోగాత్మకంగా మూడేళ్లు నడిపి చివరకు మళ్లీ కాంట్రాక్టర్లను ఆహ్వానించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వానికి యేటా తునికి ఆకు వ్యాపారం మీద మూడు వందల కోట్ల రూపాయిల రాయల్టీ లభించడం, తునికి ఆకు వ్యాపారం చేసే వ్యాపారస్థుల, బీడీ పరిశ్రమ లాబీ ఒత్తిడి దాని విధాన మార్పుకు దారితీసిందనీ ఎల్‌పిజి ఆర్థిక విధానాల స్వభావం తెల్సినవారు ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. 2004 నుంచీ ఇప్పటి వరకూ అటు మహారాష్ట్రలో కానీ ఇటు ఛత్తీస్‌గఢ్‌లో గానీ రాష్ట్ర ప్రభుత్వాలు తునికి ఆకు సేకరణ పనులను మార్చుకున్న విధానాలలో భాగంగానే ప్రైవేటు వ్యాపారస్తులకే అప్పగిస్తున్నాయి. తునికాకు వ్యాపారస్తుల నుంచీ మావోయిస్టులు తమ ఉద్యమ అవసరాల కోసం నిధులు వసూలు చేస్తుంటారు. అయితే వారు ఎప్పుడూ శ్రామికులు పొందాల్సిన కూలీ రేటుకు పోటీగా తమ నిధి వసూళ్లను చేపట్టింది లేదు. తమ డిమాండ్ కోసం శ్రామికుల కూలీ డిమాండ్‌ను ఫణంగా పెట్టింది లేదు. కానీ తునికాకు

వ్యాపారస్థుల నుంచీ  అంతకు అనేక రెట్లు అధికంగా అటవీ, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, సల్వాజుడుం గూండాలు డబ్బులు దండుకుంటున్న విషయం జగమెరిగిన సత్యం.  తునికాకు సేకరణా వ్యాపారస్తుల ద్వారా జరిగినా, ప్రభుత్వం ద్వారా జరిగినా తునికాకు సేకరణా పనులలో కూలీలకు కావాల్సింది న్యాయమైన కూలిరేటు మాత్రమే. తునికాకు సేకరణ కూలీలు తమ న్యాయమైన కూలిరేట్ల డిమాండ్లను ముందుపెట్టి సమ్మె పోరాటాల ద్వారా విజయాలు సాధిస్తున్న ఫలితంగానే దేశంలోనే మరే ప్రాంతంలో లేనంత అధిక రేటు దండకారణ్య తునికాకు సేకరణ కూలీలు పొందగలుగుతున్నారు. తునికాకు కూలీల న్యాయమైన డిమాండ్లను వ్యాపారస్తులు ఆమోదించి కూలీరేట్లు పెంచుతుండగా, ప్రభుత్వం మాత్రం సహకారీకరణ అమలైన కాలంలో కూలీల డిమాండ్లను ఎన్నడూ పూర్తి చేసింది లేదు. అయినప్పటికీ కూలీలు మాత్రం వరుసగా సంవత్సరాల తరబడి తునికాకు కోత సీజన్‌లో సమ్మె చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలుపుతూనే ఆకుల కోతలో పాల్గొన సాగారు. వారు ప్రభుత్వ సహకారీకరణ అమలైన కాలంలో తమకు తాముగా ఆకుల కోతను ఆపిందెన్నడూ లేదు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా ఇవ్వచూపిన నామమాత్ర రేటుకు కూడా ఆకులు కోయడానికి కూలీలు ముందుకొచ్చారు. కానీ ప్రభుత్వం మాత్రం  మొండిగా ఆకుల కోతను 2003 వరకు అప్రకటితంగా నిలిపివేసిందనే చెప్పొచ్చు.

సుదీర్ఘ కాలం తర్వాత 2004లో తిరిగి తునికి ఆకు సేకరించుకునే పనులు వ్యాపారస్థుల చేతిలోకి రావడంతో కూలీ రేటు దక్షిణ, పశ్చిమ బస్తర్‌లలో షేకడా (100 కట్టలకు) రూ. 70/- ఇచ్చారు. 2005లో ఈ రేటును రూ. 80/-లకు పెంచారు. 2004 కన్నా 2005లో ఎక్కువ మొత్తంలో కూలీలు పనుల్లో పాల్గొన్నారు. దాదాపు 15 సంవత్సరాలు ప్రభుత్వ మొండి విధానాల ఫలితంగా తునికాకు పనుల్లో పెద్దగా పాల్గొనలేకపోయిన కూలీలు 2005లో ఎక్కువ సంఖ్యలో పాల్గొని వ్యాపారస్తుల నుంచీ ఎక్కువ కూలిరేటు సాధించుకోగలిగారు. ఆ మేరకు తమ నగదు అవసరాలనూ తీర్చుకోగలిగారు. కానీ ఈ అవకాశం వారికి మరో యేడుకు మిగలకుండా పోయింది. 2005 జూన్‌లో ప్రారంభమైన ఫాసిస్టు సల్వాజుడుం దాడులు 2006లో కొనసాగిన ఫలితంగా వేలాది కుటుంబాలు తునికాకు పనులలో పాల్గొనలేకపోయాయి. కానీ, దొంగే, దొంగ! దొంగ! అని అరిచినట్లుగా ప్రభుత్వం, అది సృష్టించిన సల్వాజుడుం మాత్రం 'తునికాకు కోత మావోయిస్టుల మూలంగానే నిలిచిపోయిందనీ' పూర్తి అసత్య ప్రచారానికి లంఖించుకున్నారు. మావోయిస్టుల మీదా ప్రభుత్వం, జుడుం మూక చేసిన అనేక అసత్య ప్రచారాలలో ఇది కూడా ఒకటి. 2007 నాటికి అన్నివైపుల నుంచీ దెబ్బలు కాచుకునే ఆత్మరక్షణా స్థితిలోకి నెట్టబడిన జుడుం తునికాకు సేకరణ పనులను అడ్డుకోలేకపోయింది. క్రమంగా విప్లవోద్యమం పైచేయి సాధించడంతో 2007లో దక్షిణ, పశ్చిమ బస్తర్‌లలో షేకడాకు రూ. 90/-లు, దర్భ డివిజన్‌లో  తునికాకు కోత కూలీలు తిరిగి తమ సమ్మె పోరాటంతో షేకడాకు రూ. 70/- కోత కూలీలు పొందగలిగారు. తిరిగి 2008లో ఈ రేటు దర్భా డివిజన్‌లో షేకడాకు రూ. 80/-, పశ్చిమ బస్తర్‌లో, దక్షిణ బస్తర్‌లో షేకడాకు రూ. 95/ కాగా 2010 వచ్చేసరికి షేకడాకు రూ. 100/- లభించాయి. ఈ రేట్లు 2011లో మరింత పెరిగి 105/-లకు

| తునికి ఆకు కోత కూలీరేట్ల వివరాలు – దక్షిణ బస్తర్ | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంవత్సరం | కోత కూలి (షేకడాకు) పైసలలో | కల్లంపై ఆకు తిప్పడానికి రోజు కూలి రూ.లలో | ఆకులను తడపడానికి కావడి నీళ్ల కూలి రూ.లలో | కల్లెదారు జీతం రూ.లలో | కల్లం కాపలాదారు జీతం రూ.లలో | కల్లం జాగా కిరాయి రూ.లలో |
| 2005 | 80 | 5 | 5 | 1700 | 1500 | 1500 |
| 2006 | 85 | 7 | 6 | 2000 | 1800 | 1800 |
| 2007 | 90 | 6 | 7 | 2500 | 2500 | 2000 |
| 2008 | 95 | 12 | 12 | 3500 | 3000 | 2300 |
| 2009 | 95 | 13 | 13 | 4000 | 3200 | 2700 |
| 2010 | 100 | 13 | 12 | 4500 | 3500 | 2000 |
| 2011 | 105 | 14 | 14 | 5000 | 4800 | 2300 |

చేరాయి. బస్తర్ అనుభవం ఈ విధంగా ఉండగా గడ్చిరోలి అనుభవం మరో రకంగా ఉంది.

1986-89 మధ్య మహారాష్ట్ర ప్రభుత్వం గడ్చిరోలి డివిజన్‌లో సహకారీకరణ విధానాన్ని అమలు చేసి ఘోరంగా విఫలమైంది. ఆ తర్వాత మరెప్పుడూ అలాంటి ప్రజా వ్యతిరేక విధానాలకు సాహసించలేదు. ఫలితంగా అక్కడ గత 20 యేళ్లుగా వ్యాపారస్తులే తునికాకు సేకరణ కొనసాగిస్తున్నారు. తునికాకు కూలీలు 2010లో అక్కడ సాధించుకున్న అత్యధిక కూలీరేటు షేకడాకు రూ. 155/- కాగా, 2011 వచ్చేసరికి కథ అడ్డం తిరిగింది. గడ్చిరోలిలో విప్లవ ప్రజా సంఘాలు తొలుత తొందరపాటుతో షేకడాకు రూ. 157/- డిమాండ్ చేయగా, ప్రభుత్వం, పోలీసులూ కుమ్మక్కై ప్రజల బాగుకోరే వాళ్లుగా ఫోజు పెడుతూ ఏకంగా షేకడాకు రూ. 75 నుంచీ 157.5/కు పెంచి ప్రకటించింది. కానీ అవి త్వరలోనే తమ తొందరపాటును గ్రహించి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రూ. 200/- డిమాండ్ పెట్టాయి. చివరకు 185/- వరకు సాధించుకోగలిగారు. విప్లవోద్యమం డిమాండ్ చేసే రేటు కన్నా అధికంగా ప్రకటించడం బహుశా అది అమలుచేస్తున్న ఎల్ఐసి విధానాల్లో ఒక భాగమే అయి వుంటుంది.

## 1 (ఐ) బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తోన్న దండకారణ్య విప్లవ ప్రజానీకం

గడచిన పదేళ్లలో దండకారణ్య విప్లవ ప్రజానీకం ముందుకు రెండు విడుతలుగా లోక్‌సభ ఎన్నికలు (14వ, 15వ లోక్‌సభ ఎన్నికలు), రెండు పర్యాయాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల విధానసభ ఎన్నికలు వచ్చాయి. దండకారణ్య విప్లవోద్యమంలో సంఘటితమవుతున్న ప్రజలు గత ముప్పయి యేళ్లుగా 'బూటకపు ఎన్నికలను బహిష్కరించండి' అంటూ నినదిస్తూ అన్ని స్థాయిల్లోని ఎన్నికలను చాలా క్రియాశీలంగా బహిష్కరిస్తూ వస్తున్నారు. కాకపోతే ఈ దశాబ్దపు బహిష్కరణ ప్రత్యేకతలుగా మనం ఒక రెండు ముఖ్య

విషయాలను పరిగణనలోనికి తీసుకోవలసి ఉంటుంది.

1) ఈ దశాబ్దంలో జరిగిన బూటకపు పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణ ప్రజలు ఏర్పర్చుకున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం అండతో చాలా సమరశీలంగా జరిగింది.

2) ఈ దశాబ్దంలో ప్రజలు ఉన్నతస్థాయి ఏరియా, డివిజన్ జనతన సర్కార్లను ఎన్నుకొని వాటి నాయకత్వంలోనే బూర్జువా పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు.

పై రెండు అంశాలను ఈ దశాబ్దపు విశిష్టతలుగానే చూడాలి.

మధ్యప్రదేశ్ నుంచీ విడిపోయి ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన పిదప విధానసభకు ఎన్నికలు 2003 డిసెంబర్‌లో తొలిసారి, 2008 నవంబర్‌లో రెండవసారి జరిగాయి. మరోవైపు మహారాష్ట్ర విధానసభకు 2004లో, 2009లో ఎన్నికలు జరగగా, 2004 ఏప్రిల్‌లో 14వ లోక్‌సభకూ, 2009 ఏప్రిల్‌లో 15వ లోక్‌సభకూ ఎన్నికలు జరిగాయి. ఇవి కాకుండా రెండు రాష్ట్రాలలోనూ పంచాయితీ ఎన్నికలు యధావిధిగా జరుగుతూ వచ్చాయి. ఈ అన్ని ఎన్నికలనూ దండకారణ్య విప్లవ ప్రజానీకం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపును అందుకొని సమరశీల పద్ధతుల్లో చాలా క్రియాశీలంగా బహిష్కరించారు.

ఈ దేశంలో విధానసభ, లోక్‌సభ ఎన్నికలంటేనే అతి భారీ వ్యయంతో కూడుకున్న ఒక హింసాత్మక ప్రక్రియగా మారాయి. అవి కండబలానికి, కాసుల రాశులకు పర్యాయ పదాలుగా మారాయి. విశాల ప్రజాస్వామ్యం అని చెప్పుకునే ఈ దేశంలో పౌరులకు పార్లమెంటరీ ఎన్నికల విధానం (వ్యవస్థ) పైనే భ్రమలు తొలగిపోతూ విశ్వాసం నానాటికి సన్నగిల్లుతోంది. డబ్బు, కులం, కండబలం, అధికార దుర్వినియోగం, రిగ్గింగ్, హత్యలు 'ప్రజాస్వామ్య' ఎన్నికలకు పర్యాయపదాలయ్యాయి. లక్షలాది పోలీసు, అర్ధసైనిక బలగాలను మోహరించకుండా, ప్రభుత్వాలు ఎన్నికలను జరుపుకోలేకపోతున్నాయి. ఈ దశాబ్దపు నిర్దిష్ట ఆచరణను చూస్తే అవి విధానసభ ఎన్నికలైనా, లోక్‌సభ ఎన్నికలైనా ఒకే విడుతలో ఎక్కడా పూర్తి చేసుకోలేకపోతున్న వైనం  చూస్తూనే వున్నాం. పాలకులు సెలవిచ్చే ప్రజాస్వామ్యమైనా ఏనాటికానాడు మిగులకుండా పోతోందనీ గ్రహించడానికి ఈ సంకేతాలు చాలు. వీటికి తోడు రోజు రోజుకూ భారీ, అతి భారీ అవినీతి కుంభకోణాలు, అధికార దాహంతో డబ్బులు కుమ్మరించి, పదవుల ఆశ చూపి ఎంపీలను, ఎంఎల్ఏ లను కొనుక్కోవడం లాంటివి వెలుగు చూస్తున్న ఈ దేశంలో ప్రజలకు పార్లమెంటు ప్రజా ప్రతినిధుల మీదా, వారు సెలవిచ్చే ప్రజాస్వామ్యం మీదా ఇంకెక్కడ విశ్వాసం వుంటుందనీ ఘంటాపథంగా చెప్పవచ్చు.

ప్రభుత్వాలు దండకారణ్యంలో ఎన్నికలను నిర్వహించడాన్ని చూస్తుంటే యుద్ధ వాతావరణంలో ఉన్నట్టే ఉంటోంది. ఆకాశంలో సైనిక విమానాలు గస్తీ తిరుగుతోంటాయి. ప్రతీ పోలింగ్ సెంటర్‌లో పెద్దెత్తున సాయుధ బలగాలు తిష్టవేస్తాయి. బ్లాక్, తాలూకా, జిల్లా కేంద్రాలలో అర్ధసైనిక బలగాలు ఫ్లాగ్‌మార్చ్‌లు

చేసి ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఎన్నికలు నిర్వహణ కోసం వేలసంఖ్యలో దిగే అదనపు బలగాలతో అడవంతా నిండిపోతోంది. ప్రభుత్వం నిర్వహించే ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు పాల్గొనని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయనీ మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా రంగంలోకి దిగి తన శక్తినంతా కేంద్రీకరించి ప్రజలు బెదిరిపోయేలా ప్రచారం చేస్తూంటారు. ఇక మీడియా వారి ప్రచారానికి వస్తే వారు పాటించాల్సిన వృత్తి ధర్మాలు కనీసంగానైనా కొందరు పాటించకుండా మవోయిస్టుల ఎన్నికల బహిష్కరణ ప్రచారానికి ప్రతిగా అర్ధసత్యాలతో, అసత్యాలతో ఆధార రహితమైన వార్తలను అతి సంచలనాత్మకంగా విడుదల చేస్తూంటారు. 'ఓటు వేసినవారి వేలును కోస్తామంటూ' మావోయిస్టులు ప్రచారం చేస్తున్నారనే అబద్ధాన్ని గత ముప్పయి సంవత్సరాలలో అలుపూ, సొలుపూ లేకుండా వార్తల్లోకి ఎక్కించకుండా ఏ ఎన్నికలు ముగియలేదు. కనీసం ఎన్నికల సమయాల్లోనైనా బూటకపు ఎన్‌కౌంటర్లలో పౌరులను చంపడం ఆగడం లేదు. ప్రతీ ఎన్నికల సందర్భంలో ఇదే వాతావరణం చోటుచేసుకుంటుందనీ దండకారణ్యంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించే వారికెవరికైనా సులువుగానే బోధపడుతుంది.

జనతన సర్కార్లు గ్రామ సభలు నిర్వహించి బూటకపు పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రజలు పాల్గొనాల్సిన అవసరం లేదనీ, బూటకపు ఎన్నికలను బహిష్కరించాలనీ విజ్ఞప్తులు చేస్తున్నాయి. ప్రజా మిలీషియా కార్యకర్తలు అవకాశం చిక్కిన చోట ఈవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు)లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఎన్నికల బహిష్కరణను పెడచెవిన పెట్టి ప్రచారానికి వచ్చిన బూర్జువా ఎన్నికల పార్టీల నాయకులను ప్రజల ముందు నిలదీసి వారి ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించారు. 2004లో మహారాష్ట్ర విధానసభకు, 14వ లోక్‌సభకు గడ్చిరోలిలో జరిగిన ఎన్నికల్లోనూ దాదాపు ఇలాగే జరిగింది. ఈ రకంగా చాలా సమరశీలంగా ప్రజలు, ప్రజా మిలీషియా, పిఎల్‌జిఏ గెరిల్లాలు ప్రభుత్వ సాయుధ బలగాల నిర్బంధ-అణచివేత చర్యలను ప్రతిఘటిస్తూ క్రియాశీలంగా ఎన్నికలను బహిష్కరించారు. ఫలితంగా దండకారణ్యంలోని బృహత్ బస్తర్‌కు చెందిన పోరాట గ్రామాలలో నిజానికి ఎక్కడా 2-5 శాతానికి మించి ఓట్లు పోలవ్వడంలేదు. చాలా చోట్ల జీరో పోలింగ్ జరిగిందనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ ఎన్నికల కమీషన్ మాత్రం యధావిధిగా మావోయిస్టుల ప్రాంతంలో 50 శాతానికి పైగా పోలింగ్ జరిగినట్టు ప్రకటించింది. నిజానికైతే 2009లో వందకు పైగా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందే రాలేదు.

2003 నవంబర్‌లో జరిగిన ఛత్తీస్‌గఢ్ విధానసభ తొలి ఎన్నికలలో తొలిసారిగా రాష్ట్రంలో కాషాయ ధ్వజం అధికారాన్నందుకొంది. భారతీయ జనతా పార్టీ రమణ్‌సింగ్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించింది. ఈయన నాయకత్వంలో సాగిన ఐదేళ్ల పాలన రాష్ట్ర ప్రజలకు అందులో భాగంగా 33 శాతం ఆదివాసులకు మహాశాపంగా పరిణమించింది. ప్రత్యేకించి బస్తర్‌లో ఆదివాసుల నెత్తురోడ్డింది. 2005లో ఫాసిస్టు సల్వాజుడుంను సృష్టించి దానిని రక్షించి దాని ప్రధాన వకాల్తాదారుగా వ్యవహరించడంలో ఛత్తీస్‌గఢ్

ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ వర్గాల పక్షం వహించి ప్రజలకు ద్రోహం చేసింది.

2003 డిసెంబర్ 1 నాడు జరిగిన పోలింగ్ రోజున బస్తర్‌లో 70 చోట్ల పోలీసు, అదనపు పోలీసు బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు ఆదివాసీ రైతు ఓటర్లు తమ ప్రాణాలు కోల్పోగా, అనేక మంది రైతాంగం పోలీసుల హింసా, అత్యాచారాలకు గురైనారు. 2004లో జరిగిన 14వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలీసులు భైరంగఢ్ తాలూకా ఇంద్రావతి ఏరియా ధర్మ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడి ఒక మహిళను హత్య చేశారు. అక్కడే చైతు అనే యువకుణ్ని కొట్టి చంపారు. పోలీసుల హింసా, దౌర్జన్యాలు ఓటర్లకూ, రైతాంగానికీ పరిమితం కాలేదు. కుంట తాలూకాలో సంతోష్ అనే ఆదివాసీ విద్యార్థి నాయకుణ్ని కాల్చిచంపారు. విధానసభ ఎన్నికల కన్నా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హింస, అత్యాచారాలు, దౌర్జన్యాలు అనేక రెట్లు ఎక్కువగా జరిగాయి. అయినప్పటికీ 80 పోలింగ్ బూతులలో ఒక్క ఓటు కూడా పోల్ కాకపోగా 5-10 శాతానికి మించి ఓటర్లు ఎక్కడా ఓటింగ్‌లో పాల్గొనలేదు. పోలీసుల, అర్ధసైనిక బలగాల హింస, దౌర్జన్యాల నుంచీ ప్రజలను రక్షించడంలో భాగంగా ప్రజా గెరిల్లాలు, ప్రజా మిలీషియా అనివార్యంగా 200 చోట్ల వారితో తలపడక తప్పలేదు. ఈ ప్రతిఘటనలో కనీసం 20 మంది ఖాకీలు మట్టిగరిచినట్టు వారి అధికారులు ప్రకటించుకున్నారు.

తిరిగి ఐదేళ్ల తర్వాత 2008 నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ విధానసభకు, 2009 ఏప్రిల్‌లో 15వ లోక్‌సభకూ, 2009 అక్టోబర్‌లో మహారాష్ట్ర విధానసభకూ ఎన్నికలు జరిగాయి. దాదాపు ఒక సంవత్సర కాల వ్యవధిలో జరిగిన ఈ మూడు ఎన్నికల మూలంగా ఆ కాలమంతా దండకారణ్యంలో బూర్జువా ఎన్నికల వేడి కొనసాగింది. ఆ కాలంలోనే అంటే 2009 జులై-ఆగస్టులలో ఫాసిస్టు గ్రీన్‌హంట్ సైనిక దాడి మొదలవడంతో అడవంతా అదనపు బలగాలతో నిండిపోయింది. వారు కొనసాగించిన హింసలో ప్రజల రక్షణలో నిమగ్నమైన పదిమంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను ఫణంగా పెట్టారు. మాడ్‌లో కామ్రేడ్స్ సుజాత, రమేష్, జగ్గులు, దక్షిణ, పశ్చిమ బస్తర్‌లలో మినప ఘటనలో కామ్రేడ్స్ చందూ, బాబు, దస్రూ, రింకూలతో మరో ఐదుగురు కామ్రేడ్స్, గడ్చిరోలి లాహెరిలో కామ్రేడ్ మంగేష్‌లు బూటకపు ఎన్నికలను బహిష్కరించే క్రమంలో ప్రభుత్వ సాయుధ బలగాలతో పోరాడుతూ తమ ప్రాణాలను త్యజించారు. కాంకేర్ జిల్లా కూరెనార్‌లో ఒక రైతును సిఆర్‌పిఎఫ్ బలగాలు అతిక్రూరంగా హత్య చేశాయి. దంతెవాడ, బీజాపూర్ జిల్లాలలో 50 మందికి పైగా పౌరులు హతులయ్యారు. ప్రతీ ఎన్నికల సందర్భంగా ఇలాంటి దారుణమైన హత్యలను జరపడం దండకారణ్యంలో భారత భద్రతా బలగాలకు పరిపాటైంది.

ఈ ఎన్నికల నాటికి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ప్లాటూన్ల నుంచీ కంపెనీలకు ఎదిగి సాపేక్షికంగా పటిష్టమైంది. అలాగే ప్రజా మిలీషియా రాశి రీత్యా పెరిగి గుణం రీత్యా చాలా మెరుగైంది. సల్వాజుడుం కొనసాగించిన నిప్పుల కొలిమిలో వినూత్న అనుభవాలను సంపాదించి దృఢంగా నిల్చింది. ప్రజా మిలీషియాలో నూతనంగా కోయ భూంకాల్ మిలీషియా ఎదిగి వచ్చింది. జనతన సర్కార్లు ఏరియా, డివిజన్ సర్కార్‌లలో సంఘటితమవుతూ పని చేయసాగాయి. 15వ లోక్‌సభ ఎన్నికల బహిష్కరణ పిలుపును

ఇచ్చిన జనతన సర్కార్లు తొలిసారిగా తమ ప్రత్యామ్నాయ ఎన్నికల ప్రణాళికను ప్రకటించాయి. ఆ ప్రణాళికను ప్రజల ముందుంచి గ్రామసభలలో బూటకపు ఎన్నికలను బహిష్కరించడంపై ఓటర్లతో విప్లవ ప్రతిజ్ఞలు చేయించాయి. జనతన సర్కార్లను తమ ఓట్ల ద్వారా ఎన్నుకున్న ప్రజలు తిరిగి తమ ఓట్ల ద్వారానే బూర్జువా రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎన్నుకోవడానికి నిరాకరిస్తూ బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు.

దోపిడీ ప్రభుత్వాలు తమ ఎన్నికల ప్రజాస్వామ్య ముసుగును ఎంత ఫాసిస్టు పద్ధతుల్లో నిలుపుకుంటున్నాయో 2008 ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల సందర్భంగా దండకారణ్యంలోని దక్షిణ బస్తర్‌కు చెందిన ఒక్క గోరుగొండ గ్రామ ఘటన తెలుసుకుంటే సరిపోతుంది.

దక్షిణ బస్తర్‌కు చెందిన గోరుగొండలో 770 ఓటర్లున్నారు. వీరంతా తమ జనతన సర్కార్ పిలుపు మేరకు బూటకపు విధానసభ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఆ ఊర్లో పోలింగ్ బూతు పెట్టడానికి కూడా వాళ్లు ఆమోదించలేదు. ఎన్నికల రోజు అక్కడి ఓటర్లు ఈవిఎంలను స్వాధీనం చేసుకోవడంతో ప్రభుత్వం రీపోలింగుకు ఆదేశించింది. రెండవసారి కూడా ప్రభుత్వాధికారులు ప్రజల ప్రతిఘటనతో ఎన్నికలను జరపలేకపోయారు. దీనితో మూడవసారి ఎన్నికల నిర్వహణకు స్వయానా జిల్లా అధికారి (కలెక్టర్) తన మందీమార్బలంతో దిగాడు. 770 ఓటర్లు ఉన్న గోరుగొండకు 1000 మంది పోలీసులు చేరుకున్నారు. ప్రజల తీవ్ర నిరసనల మధ్య సాయంత్రం జిల్లా అధికారి కేవలం 10 ఓట్లతోనే సరిపెట్టుకొని వెళ్లక తప్పలేదు. ఆ వార్తా ఆ రోజు దోపిడీ ప్రభుత్వ అధికారుల, పాలవర్గ పార్టీల గుండెల్లో పెద్ద సంచలనాన్నే సృష్టించింది. కానీ వార్తల్లో వెలుగు చూడని గోరుగొండలు పోరాట దండకారణ్యంలో ఎన్నో! ఎన్నెన్నో!

2011 మే 8 నాడు బస్తర్ లోక్‌సభ స్థానానికీ ఉపఎన్నిక జరిగింది. బస్తర్‌లో కాషాయ ధ్వజ పోషకుడు, తెగ పెద్ద, భూస్వామి దీర్ఘకాల వరుస పార్లమెంటేరియన్ బలిరాం కశ్యప్ మరణంతో ఆ ఎన్నిక వచ్చింది. ఆయన 'పుత్ర రత్నాలలో' ఒకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మంత్రివర్గ సభ్యుడు కాగా, మిగతా ఇద్దరిలో ఒకడు తాన్‌సేన్ కశ్యప్ 2009లో విప్లవకారుల చేతిలో మరణశిక్ష అనుభవించాడు. తాన్‌సేన్ మృగత్వానికి పెట్టింది పేరు. తన ప్రత్యర్థుల చేత, తనను వ్యతిరేకించేవారి చేత తన మూత్రం తాగిస్తూ చిత్రహింసలు పాలుచేసే దుర్మార్గుడు. తన పాపాల ఫలితంగా అతడు మరణశిక్ష పొందగా మిగిలిన మరో పుత్రరత్నం ఆ వుపఎన్నికలలో పోటీ చేసి తండ్రి స్థానాన్ని పూరించాడు. పాలకవర్గాలు చేపట్టిన గ్రీన్ హంట్ ఆపరేషన్‌లో జరిగిన తొలి ఉపఎన్నిక అది. ఆ ఉపఎన్నికకు సైతం పెద్దెత్తున పోలీసు బలగాలను దింపి క్రూర అణచివేతను కొనసాగించారు. ఓటర్లలో భయోత్పాతాన్ని సృష్టించడానికి చేయగలిగిందంతా చేసినా గెరిల్లాబేసుల్లోని ప్రజలు బూటకపు ఎన్నికలను బహిష్కరించి జనతనా సర్కార్ల పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. బహిష్కరణ సరళిని తెలుసుకోవడానికి ఒక ఉదాహరణ చూద్దాం. దంతెవాడ జిల్లా కిష్టారంలో పోలీస్‌స్టేషన్ ఉంది. అక్కడ అదనపు బలగాలూ ఉన్నాయి. అయినప్పటికీ 1500 ఓటర్లలో కేవలం ఒకే ఒక్క ఓటు

పోలైంది. అదీ పాలకవర్గాలు ఓటర్లతో-ఓట్లతో సంబంధం లేకుండా నామినేట్ చేస్తూ ప్రకటించిన సర్పంచ్ ఓటు కావడం గమనార్హం. దండకారణ్యంలో ఎన్నికలంటేనే గత మూడు దశాబ్దాలుగా దోపిడీ పాలకవర్గాలకు ఎదురవుతున్న అనుభవాల్లో ఇలాంటివి కూడా ఇంకా లేకపోలేదు.

## 1 (జె) తమ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గంగా సాగుతున్న విప్లవ ప్రజానీకం – వారి సమస్యలు

ఈ వ్యవస్థలో జన సామాన్యం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలు అనేకంగా ఉన్నాయి. 'ఆమ్ ఆద్మీ' ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు కూడు, గూడు, గుడ్డ, ప్రజలకు ప్రజాస్వామ్యం లాంటి వాటిని గత 65 ఏళ్ల పాలనలో భారత పాలకవర్గాలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయి. ఫలితంగా దాదాపు 120 కోట్లు దాటిన ఈ దేశ జనాభాలో 80 కోట్లకు పైగా జనాభా దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్నారనీ అర్జున్ సేన్ గుప్తా నివేదిక స్పష్టంగా వెల్లడి చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం తన నివేదికల్లో చూపే హీనపక్షాన్నే పరిగణనలోకి తీసుకున్నా వీరి సంఖ్య దాదాపు 40 కోట్లు ఉంది. దేశంలో యేటా కనీసంగా ఇరువై లక్షల పిల్లలు ఐదేళ్ల వయస్సుకు చేరకుండానే కన్ను మూస్తున్నారంటే నిరుపేదల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవడం ఏమంత కష్టమైన పని గాదు. ఇలాంటి లెక్కలు క్రమం తప్పకుండా దినపత్రికలు చూసేవారికి ఇంకా అనేకం తెలుస్తూంటాయి. ఇలాంటి 'భారతం'లో బడుగుల జీవితాలు రోజు రోజుకూ ఎంత భారంగా గడుస్తున్నాయో విడిగా చెప్పాల్సిన పనే ఉండదు. ఇలాంటి ప్రజలు తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ దేశంలో చేపడుతున్న అనేక పోరాటాలు ఆనాటికానాటికీ మరింత సమరశీల స్వభావాన్నీ సంతరించుకుంటున్నాయి. అవి తాగునీరు సమస్య నుంచీ అధిక ధరల తగ్గింపు వరకూ ఏ సమస్య అయినా కావచ్చు. కార్మిక, కర్షక, విద్యార్థి, ఉద్యోగ, మేధావి సెక్షన్లు ప్లకార్డులు చేత పట్టుకొని, గొంతెత్తి నినదిస్తూ వీధుల్లోకి రాకతప్పడం లేదు. వాళ్లు అంగన్‌వాడి కార్యకర్తలైనా, అవిటి విద్యార్థులైనా, బ్యాంకు ఉద్యోగులైనా, గని కార్మికులైనా, నిరుద్యోగులైనా, ఉపాధ్యాయులైనా లేదా ఇంకెవరైనప్పటికీ సమస్యల పరిష్కారానికి వీధుల్లోకి వస్తే ఖాకీల హింసా, దౌర్జన్యాలను తీవ్రంగా ఎదుర్కోవల్సి వస్తోంది. ఈ ధోరణీ ఈ దశాబ్దంలో చాలా ప్రబలింది. దీని సరసనే ఆందోళన కలిగించే మరో ధోరణీ కూడా చాలా పెరుగుతోంది. అవి రైతాంగ ఆత్మహత్యలు. వాళ్లు తమ సమస్యల పరిష్కారానికి న్యాయమైన పోరాట మార్గాన్ని ఎంచుకోకుండా దోపిడీ వ్యవస్థపై తీవ్రమైన నిరసనతో తమ ప్రాణాలను అంతమొదించుకుంటున్నారు. నిజానికి వీరి ఆత్మహత్యలన్నీ రాజ్యం చేస్తున్న హత్యలుగానే చూడాలి.

పై సమస్యల నేపథ్యంలో దండకారణ్య ప్రజలు కూడా అనేక సమస్యలపై ఈ పదేళ్లలో ఎన్నో పోరాటాలు చేశారు. వాటన్నింటి పరాకాష్టగా దండకారణ్య విప్లవ ప్రజానీకంలో రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడడం యేటేటా పెరుగుతోంది. ఈ దశాబ్దం ప్రారంభంలో అతి అరాచకుడు, పరమ దుర్మార్గుడైన

నారాయణపూర్ ఠాణేదార్ అమృత్ కెర్కెటా బదిలీ చేయాలనీ డిమాండ్ చేస్తూ 25 వేల మంది ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా అనేక చోట్ల ప్రజలు తమ నిరసనను తెలుపుతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా పెరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా, అలాగే బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయిన తమ గ్రామస్థుల శవాల స్వాధీనం కోసం సామూహికంగా ప్రజలు పోలీసుస్టేషన్లపైకి వెళ్లడం, ధర్నాలు చేయడం, ఘెరావ్‌లు చేయడం, బైఠాయింపులు చేయడం శవాలను తెచ్చుకోవడం పెరుగుతోంది. మిగతా సమస్యలపై చేపట్టే అన్ని పోరాటాల కన్నా పెరుగుతున్న రాజ్యహింసకు, భారత భద్రతా బలగాల పైశాచిక దాడులకు వ్యతిరేకంగా చేపట్టే పోరాటాలే క్రమంగా అధిక ప్రాధాన్యాన్ని సంతరించుకోక తప్పడం లేదు.

దండకారణ్యంలో చిన్నారి బడి పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊళ్లో ఉంటూ తమ విధులు సక్రమంగా నిర్వహించాలనీ బలంగా కోరుకుంటున్నారు. 2001 ఆగస్టులో దక్షిణ బస్తర్‌లో అదే సమస్యపై వందలాది మంది చిన్నారి బాలలు నిరసన ప్రదర్శన జరిపారు. 2002 శీతాకాలంలో ఓర్చాలో 2010 వర్షాకాలంలో నారాయణపూర్‌లో, 2011 జూన్‌లో 7 వేల మంది ప్రజలు భూపాలపట్నంలో ర్యాలీలు తీసినప్పటికీ ప్రభుత్వం ఎక్కడా స్పందించింది లేదు. పైగా అక్కడక్కడ నిజాయితీతో విధులు నిర్వర్తిస్తున్న కొద్దిమంది ఉపాధ్యాయులను మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ పోలీసులు రకరకాలుగా వేధించడం యేటేటా పెరుగుతోంది. ఇది వాస్తవం కాగా కేంద్ర గృహమంత్రి చిదంబరం తద్విరుద్ధంగా మాట్లాడుతున్నాడు. 'మావోయిస్టు ప్రాంతాల్లోకి పోలీసులే వెళ్లలేకపోతున్నపుడు ఉపాధ్యాయులు ఎలా వెళతారు?' అంటూ పోలీసులనూ, ఉపాధ్యాయులనూ ఒకే గాటన కట్టి పొంతన లేని కుతర్కానికి పూనుకున్నాడు. ఇప్పటికీ అసలు సమస్య ఇంకా పరిష్కరించబడనేలేదు. గ్రామగ్రామాన పిల్లలకు పాఠశాల గృహాలు నిర్మించాలనీ, అవి పోలీసు బ్యారక్కుల్లా కాకుండా ప్రజలు కోరుకున్న విధంగా నిర్మించాలనీ, క్రమం తప్పకుండా ఉపాధ్యాయులు బడికి రావాలనీ యావత్తు దండకారణ్య ప్రజానీకం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ రంగంలోనూ జనతనా సర్కార్లు జోక్యం చేసుకొని పరిస్థితులను చక్కదిద్దడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. 2010 డిసెంబర్‌లో నారాయణపూర్ బ్లాక్‌లోని ఒక గ్రామ పంచాయితీలో ప్రభుత్వ ఉపాధ్యాయుణ్ని ప్రజల ముందుపెట్టి జనతనా సర్కార్ విచారించింది. ఇకపై తాను క్రమం తప్పకుండా విధులకు హాజరవుతాననీ ప్రజలకు హామీ ఇవ్వడంతో వదిలేసింది. ఆ హామీని నిలబెట్టుకోని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందనీ హెచ్చరించింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయుల గైర్హాజరీతో పాఠశాలలు వెలతెలాపోతున్నట్టే, ప్రభుత్వ ధర్మాసుపత్రులు ఉన్నా డాక్టర్లు లేకపోవడంతో ఊరూరా రోగులు, వారి జబ్బులకు తగిన వైద్యం లేకుండా పోయి అకాల మరణాల పాలవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో విష జ్వరాలతో, కలరా వ్యాధితో పెద్దెత్తున పిల్లలు, పెద్దలు మృత్యువాత పడుతున్నప్పటికీ ప్రభుత్వాలు ప్రచార ఆర్భాటం తప్ప సీరియస్‌గా

పట్టించుకున్న పాపాన పోవడం లేదు. 'మా ప్రాంతానికీ, మా ప్రాథమిక వైద్య కేంద్రానికీ వైద్యులను పంపండంటూ' మాడ్ (దోపిడీ ప్రభుత్వాలు పెట్టిన పేరు అబూజ్‌మాడ్) ప్రజలు తమ బ్లాక్ కేంద్రమైన ఓర్చాకు వందల సంఖ్యలో వెళ్లి ఎంత మొరపెట్టుకున్నా విన్న నాథుడే లేడు. ఓర్చా ప్రాథమిక వైద్య కేంద్రంలో ఎనిమిది మంది స్త్రీ-పురుష డాక్టర్ల నియామకం అధికారికంగా జరిగినప్పటికీ పదేళ్లు దాటుతున్నా ఒక్కరికి మించి అక్కడికి ఎన్నడూ వైద్యులందరూ వచ్చి విధుల్లో చేరింది లేదు. దండకారణ్యం దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, అవసరమైన కనీస సౌకర్యాలు కూడా లేవంటూ చాలా మంది ప్రభుత్వోద్యోగులు అక్కడ ఉండడం లేదు. వీటికితోడు గత ముప్పయి సంవత్సరాలుగా వీళ్లగైర్హాజరీకి మరో కారణంగా మావోయిస్టుల బూచీని చూపడం మామూలైంది. కానీ నిజానికి అక్కడి ప్రజల్లోకి వెళ్లి నిజాయితీగా అడిగితే అసలు వాస్తవం వెల్లడవుతుంది. ఉపాధ్యాయులనూ, వైద్య సిబ్బందిని మావోయిస్టులు ఎక్కడా అడ్డుకోవడం లేదు. పైగా ప్రజలకు సేవ చేయడానికి రావాలనీ ఆహ్వానిస్తున్నారు. మాడ్‌లో మోటారు వాహనాల్లో చేరుకోలేని ప్రాంతమంటూ ఈనాడు లేదు. ఎంతటి లోతట్టు మాడ్ ప్రాంతానికైనా కాలినడకన గంటకు లోపే చేరుకోవచ్చు. చేరుకోలేని గ్రామాలంటూ వుంటే ప్రజల సహకారంతో కబురు అందిస్తే రోగులను తీసుకొని ప్రజలే వైద్యుని వద్దకు తరలిస్తారు. కావల్సిందల్లా ప్రజల మనసులను, విశ్వాసాన్ని గెలుచుకోవడమే. కానీ నిజాయితీ కొరవడి ప్రజాసేవా దృక్పథం లేకుండా పోయిన దోపిడీ ప్రభుత్వ అధికారుల వ్యవహారం ప్రజలకు ఏమాత్రం మేలు చేయడం లేదు. దోపిడీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, వైద్యులు, వైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి విధులు నిర్వహించడానికి సిద్ధపడితే అనేక గ్రామాల్లో ప్రజలు వారికి ఉచితంగా తమ శక్తిమేరకు అన్ని సౌకర్యాలూ కల్పించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈనాటికీ యావత్తు దండకారణ్య ప్రజానీకం తమ గ్రామాల్లోకి విద్యా, వైద్య సిబ్బంది వచ్చి తమ విధులు తప్పకుండా నిర్వహించాలనే డిమాండ్ చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా 2010 అక్టోబర్‌లో సాక్షాత్తు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వైద్యశాఖా మంత్రి రాష్ట్రంలో బడా వ్యాపారవేత్త డాక్టర్ అమర్ అగ్రవాల్ విడుదల చేసిన ఒక జి.ఓ.లో 'ప్రాథమిక వైద్య కేంద్రాల వైద్యులు గ్రామీణ ప్రాంతంలో ఉండనవసరం లేదంటూ వాళ్లు బ్లాక్ కేంద్రాల్లో ఉంటే సరిపోతుందని' సెలవిచ్చాడు. ఆయనా మావోయిస్టుల బూచీ చూపి స్వసమర్థన చేసుకున్నా ఆశ్చర్యపడాల్సిందేమీ ఉండదు. దండకారణ్యంలో హెమెల్‌కస, చాద్‌గాం లాంటి చోట్ల దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు స్వచ్ఛందంగా విద్యా, వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు మావోయిస్టుల మూలంగా ఎన్నడూ, ఎక్కడా వైద్య సిబ్బందికి ఎలాంటి సమస్య ఎదురు కాలేదనీ, సమస్యల్లా పోలీసులతోనే వేధింపులనీ బహిరంగంగా, సోదాహరణంగా వివరిస్తున్నారు. కొద్దిమంది ప్రజాహిత వైద్యులు ఏప్రిల్ 2010లో నాగపూర్‌లో ఒక ప్రెస్ మీట్‌లో బహిరంగంగా ఈ విషయాన్ని వ్యక్తపరిచారు. బస్తర్‌లో రామక్రిష్ణ మిషన్ వాళ్లు గత 25 ఏళ్లకు పైగా విద్యా, వైద్య రంగంలో నిరాటంకంగా పనిచేస్తున్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. ఇంకా నిజం చెప్పాలంటే సల్వాజుడుం, గ్రీన్‌హంట్‌ల దాడులకు చాలామంది ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు గురయ్యారు. ఈ రోజు ప్రజా సంక్షేమానికి పోలీసులు ప్రధాన అడ్డంకిగా మారారు.

ఆకాశన్నంటే అధిక ధరలతో అనునిత్యం సతమతమవుతున్న దేశ ప్రజల నిరసనోద్యమాలలో దండకారణ్య ప్రజలు సైతం పాలుపంచుకుంటున్నారు. 2008 సంవత్సరం తొలి నుంచీ అధిక ధరల సమస్యను దేశ ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. దండకారణ్యంలోని వారాంతపు సంతలపై ఆధారపడి జీవించే ఆదివాసీ ప్రజలు ఈ సమస్యను మరింత తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. వారాంతపు సంతల్లో వెల్లుల్లి ధర కిలో ఒక్కింటికి రూ.100/- పలుకుతోంది. కూరగాయాల ధరలు వింటేనే బేజారెత్తిపోతోంది. పూ గోబి ధర కిలో ఒక్కటికి రూ.40/- కాగా, వంకాయలు కిలోకు రూ.30/-లకు చేరాయి. జనవరి మాసంలో టమాటాలు కిలో ఒక్కింటికి రూ.30/- పలకడం దాదాపు ముప్పయి ఏళ్లలో జనాలు ఎన్నడూ ఎరిగి ఉండరు. దోపిడీ ప్రభుత్వాలు తలకెత్తుకున్న దివాళాకోరు సామ్రాజ్యవాద ఆర్థిక విధానాల ఫలితమే ఈ ధరల పెరుగుదల ఒకవైపూ మార్కెట్‌లలో కృత్రిమ సరకుల కొరత మరోవైపూ, అలాగే సంతలకు షావుకార్లు అన్ని రకాల సరుకులు తేకుండా దారిలో పోలీసులు అడ్డుకోవడం లాంటి పలు సమస్యలతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయనీ దండకారణ్య విప్లవ ప్రజానీకం పలు సందర్భాలలో ప్రచార, ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అనేక సంతల్లో వందల సంఖ్యలో ప్రజలు ర్యాలీలు నిర్వహించారు. అధిక ధరలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త బంద్ నిర్వహణలో చాలాసార్లు దండకారణ్య ప్రజలు భాగస్తులయ్యారు. విప్లవ ప్రజా సంఘాలు బహిరంగసభలు నిర్వహించి ధరల పెరుగుదల పట్ల తమ తీవ్ర నిరసనను ప్రకటించాయి. 2011 మార్చ్‌లో మద్దేడు పట్టణంలో ఐదువేల మంది ప్రజలు అధిక ధరలకు వ్యతిరేకంగా పెద్ద ప్రదర్శన నిర్వహించారు.

ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థను సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్నప్పటికీ అది ప్రజల అవసరాలను తీర్చడం కన్నా దొంగ నిల్వలను పెంచడానికీ, దొంగ మార్కెట్లలో వ్యాపారస్తులు వాటి అమ్మకాలు జరిపి అధిక లాభాలు ఆర్జించడానికే ఎక్కువ ఉపయోగపడుతున్నది. గ్రీన్ హంట్ సైనిక దాడి ప్రారంభమయ్యాక 'చౌకధరల' దుకాణాలన్నీ పోలీసులచే బలవంతంగా పోలీస్‌స్టేషన్లలోకి తరలించబడ్డాయి. దీనితో దారిద్ర్యరేఖ దిగువన నివసించే వారికి లభించే కనీస దినుసులు తెచ్చుకోవాలన్నా వారు పోలీసులతో ఒక రకంగా యుద్ధమే చేయాల్సి వస్తోంది. పోలీస్‌స్టేషన్ల పరిసరాల్లోనే దుకాణాలు ఉండడంతో సరుకులకు వెళ్లాలంటేనే ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. సరుకులకు వెళ్లే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకూ, వేధింపులకూ హద్దూ, అదుపూ లేకుండా పోయింది. సల్వాజుడుం, గ్రీన్ హంట్‌ల ఫలితంగా అడవంతా నిండుకున్న పోలీసులు ఏ దారిలో ఎక్కడ పొంచి మాటుదాడులకు కూచుంటారో తెలియని స్థితిలో అడుగడుగునా ప్రమాదాల మధ్యనే ప్రజలు తమ సొంత పనులు పూర్తి చేసుకోవలసి వస్తోంది.


2006 ఏప్రిల్‌లో దక్షిణ బస్తర్ డివిజన్‌లో డల్లా, మల్లెపల్లి గ్రామాల నుంచి మహిళలు చౌకధరల దుకాణానికి బియ్యం కోసం వెలుతుండగా దారిలో మాటుకూచున్న పోలీసులు డల్లా గ్రామానికి చెందిన కా.మంగ్లీని పట్టుకొని ఘోరంగా సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు. ఆ తర్వాత చెర్‌పాల్, రెడ్డి,

గంగలూరు, కిరందూల్ తదితర పోలీస్‌స్టేషన్లలో, క్యాంపులలో ఎందరెందరు ఆదివాసీ మహిళలు రేషన్ కార్డుల బియ్యానికి వెళ్లి అత్యాచారాల పాలయ్యారో, ఎన్ని రాత్రులు బియ్యం లేకుండా పోలీసుల వేధింపులతో గడచిపోయాయో ఆ ప్రజల్లోకి వెళ్లితే తప్ప తెలియదు. మరోవైపు సల్వాజుడూం నేతలు జుడూం శిబిరాలకు వెళ్లే ఆహార దినుసులను పెద్దమొత్తంలో కొల్లగొడుతూ నల్లబజార్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే సంచలనాత్మక వార్తలు వార్తా పత్రికల్లో వస్తూనే ఉన్నాయి. 2010 ఫిబ్రవరిలో మాడ్ నుంచీ వందలాది మహిళలు-పురుషులు జిల్లా కేంద్రం నారాయణ్‌పూర్‌కు తరలివెళ్లి చౌకధర దుకాణాలు పోలీస్‌స్టేషన్ల నుంచి ఖాళీ చేసి తిరిగి తమ సంత కేంద్రాలలోనే తెరువాలనీ కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఆ తర్వాత మూడు మాసాలకు మే నెలలో మాన్పూర్ ప్రాంత ప్రజలు నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రానికి వెళ్లి 'ప్రజా పంపిణి వ్యవస్థ'లో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలనీ, పోలీస్‌స్టేషన్ల నుంచీ చౌకధరల దుకాణాలను గ్రామాల్లోకి తరలించాలనీ డిమాండ్ చేశారు. వాస్తవాలు ఇలా ఉండగా ఛత్తీస్‌గఢ్ పోలీస్ డిజిపి విశ్వరంజన్ కుతర్కం ఎలా ఉందంటే, 'గ్రామాల్లో చౌక ధరల దుకాణాలుండడం ద్వారా సరకులన్నీ మావోయిస్టుల పాలవుతున్నాయి' అంటూ తమ ప్రజా వ్యతిరేక చర్యలను సమర్థించుకున్నాడు. దాదాపు ఈ దశాబ్ద ప్రారంభం నుంచీ పోలీసులు గ్రామీణ సంతలను నిలిపివేయడం, సంతలకు షావుకార్లు రాకుండా అడ్డుకోవడం, రేషన్ షాపులను కట్టడి చేయడం క్రమంగా పెరిగింది. 2003 జనవరిలో ఆంధ్ర సరిహద్దులు దాటి షావుకార్లను తమ గ్రామ సంతలకు రావడాన్ని అనుమతించాలనీ వేలాది బస్తర్ ప్రజలు పొరుగున ఉన్న ఖమ్మం జిల్లా బండిరేవులకు వెళ్లి ప్రదర్శన జరిపితే ఆంధ్ర పోలీసులు నిర్దాక్షిణ్యంగా జరిపిన కాల్పుల్లో 16 యేళ్ల ఆదివాసీ యువతి కడ్తి సోమె ప్రాణాలు కోల్పోయింది. మరో ఇద్దరు ఆదివాసీ రైతులు తీవ్రంగా గాయపడినారు. జీవితమే యుద్ధంగా మారిన దండకారణ్య ఆదివాసీ ప్రజలు తమ దైనందిన జీవితావసరాలను తీర్చుకోవడానికైనా, కనీస జీవికను సంపాదించుకోవడానికైనా, కడప దాటి కాలు బయటపెట్టాలన్నా, ఇంట్లోనే కాలం గడుపుకోవాలన్నా వారు 'ప్రశాంతంగా' రోజు గడుస్తుందన్న హామీ లేని వాతావరణంలో జీవిస్తున్నారు. జీవితం కోసం మరణంతో పోరాడుతున్నారు. అడుగడునా పోరాడుతూ జీవిస్తున్నారు. కల్లోల భరిత క్షణాలు వారి ఛిద్రమైన జీవితాలలో భాగమైనాయి.

# 2. రాజ్యహింస - విప్లవ హింస

దండకారణ్యంలో రాజ్యహింస మున్నెన్నడూలేని స్థాయిలో కొనసాగుతోంది. అక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే ఫాసిస్టు లక్ష్యంలో భాగంగా యేటేటా రాజ్యహింస తీవ్రమవుతోంది. భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమానికి తలమానికంగా నిల్చిన ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం క్రమంగా వెనుకపట్టుపట్టిన గత పదేళ్ల నేపథ్యంలో అక్కడ రాజ్యహింస మరింత విరుచుకపడుతోంది. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో విప్లవోద్యమం దెబ్బతిన్న పరిస్థితుల్లో దండకారణ్యంపై శత్రువు కేంద్రీకరణ పెరిగింది. సుదీర్ఘకాలం భారతదేశ విప్లవోద్యమంలో వేరు వేరు ప్రవాహాలుగా కార్యాచరణను కొనసాగించిన రెండు విప్లవ పార్టీలు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్), భారత మావోయిస్టు కమ్యూనిస్టు కేంద్రం ఒకే ప్రవాహంగా విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించడం; వాటి నాయకత్వంలో ఏర్పడి ఉన్న ప్రజా గెరిల్లా సైన్యం, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం రెండూ సంలీనమై ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంగా ఏర్పడిన నేపథ్యంలో పురోగమిస్తున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే వ్యూహాత్మక దృష్టితో శత్రు సైనిక దాడుల తీవ్రత పెరిగింది. దేశీయంగా, అంతర్జాతీయంగా పూర్తిగా అదుపు తప్పి తీవ్రమవుతున్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభ నేపథ్యంలోమావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాలపై 'తక్కువ తీవ్రత యుద్ధం' (ఎల్ఐసి) వ్యూహంలో భాగంగా బహుముఖ దాడులు పెరుగుతున్నాయి. భారత దేశ ప్రధాని 'దేశ ఆంతరంగిక భద్రతకు ఏకైక పెనుముప్పుగా వామపక్ష తీవ్రవాదాన్ని' టార్గెట్ చేసిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దాడులు తీవ్రమయ్యాయి. దండకారణ్యంలో గత ముప్పై ఏళ్లుగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న విప్లవోద్యమాన్ని ఇంకెంత మాత్రం సహించలేని స్థితికి పాలకవర్గాలు చేరుకున్న నేపథ్యంలో దండకారణ్యంలో ఫాసిస్టు రాజ్యహింస, సైనిక దాడులు గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్నాయి. గత పదేళ్లలో రాష్ట్రాల పోలీసులు, కేంద్ర, అర్ధసైనిక బలగాలు దెబ్బ మీద గట్టిదెబ్బ తింటూ దెబ్బ దెబ్బకూ తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్న పరిస్థితులలో వేలకు వేలుగా అదనపు బలగాలు దిగుతూ దాడుల తీవ్రతను పెంచసాగాయి. 2001లోనే కేంద్రం నక్సల్ ప్రభావిత రాష్ట్రాలతో ముందరి జెసిసి (జాయింట్ కోఆర్డినేషన్ కమిటి) స్థానంలో జెఓసి (జాయింట్ ఆపరేషనల్ కమాండ్)ను ఏర్పర్చింది.

ఛత్తీస్‌గఢ్‌లో అప్పటి ముఖ్యమంత్రి అజీత్‌జోగి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దండకారణ్యంలోని బస్తర్ ప్రాంతానికి 2003 మార్చిలో మొదటిసారిగా కేంద్ర అర్ధసైనిక బలగాలు దిగాయి. అప్పటి వరకూ కొనసాగుతూ వచ్చిన నిర్బంధంలో ఈ బలగాల రాక ఒక మలుపుకు దారితీసింది. అదే సంవత్సరం ఛత్తీస్‌గఢ్ విధానసభకు ఎన్నికలుండడంతో మరిన్ని అదనపు బలగాలు రాష్ట్రానికి చేరాయి. ఆ మరు సంవత్సరం 2004 ఏప్రిల్‌లో జరిగిన 14వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం, మహారాష్ట్ర విధానసభ ఎన్నికల నిమిత్తం దిగిన అదనపు బలగాలతో దండకారణ్యం నిండిపోయింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన మొదటి విధానసభ ఎన్నికల్లో అతి ప్రమాదకర రియాక్షనరీ శక్తులైన మతోన్మాద కాషాయ



పల్లెల మీద దాడికి పాశవిక బలగాలు

ధ్వజారోహకులు సంగ్ ముఠా అధికారంలోకి వచ్చింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ - రాష్ట్రవాది కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్నేర్పర్చింది. 14వ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలో తొలిసారిగా అధికార పగ్గాలు అందుకున్న యుపిఏ 'దేశ అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాదం ఏకైక పెద్ద ప్రమాదకార శక్తి' అని తొలిసారి ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో దండకారణ్యంలో ప్రధానంగా బృహత్ బస్తర్‌లో పాలకవర్గాల ప్రజావ్యతిరేక రియాక్షనరీ శక్తులు, పోలీసులు రహస్యంగా, మారుపేర్లతో విప్లవ వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేశాయి. గతంలో 1990-91లో మొదటిసారి, 1997లో రెండవసారి కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ సహా రివిజనిస్టు పార్టీలు 'జన్‌జాగరణ్' పేరుతో విప్లవోద్యమ అణచివేత క్యాంపెయిన్‌ను స్థానిక భూస్వామ్య, పెత్తందారీ శక్తులన్నింటినీ సమీకరించడం మొదలైంది. మరోవైపు మీడియాలో వివిధ రూపాల్లో కొనసాగిన ఉద్దేశ్యపూరిత విప్లవ వ్యతిరేక ప్రచారం నిర్బంధాన్ని తీవ్రతరం చేయడంలో, విప్లవకారులను దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, ప్రగతి నిరోధక శక్తులుగా చిత్రించడంలో అది తన వంతు విప్లవ వ్యతిరేక పాత్రను అది పోషించింది. భవిష్యత్ దాడిని దృష్టిలో పెట్టుకొని ఐజి అన్సారి లాంటి కరుడుగట్టిన అధికారులను, బస్తర్ పోలీసు శాఖలో విశేష అనుభవం సంపాదించి బదిలీపై వెళ్లిన లాంగ్‌కుమేర్ లాంటి అధికార్లను ఇతర ప్రాంతాల నుంచీ ముందే రప్పించారు.

పైన పేర్కొన్న అన్ని సన్నాహాల నేపథ్యంలోనే 2005 జూన్ 5 నాడు ప్రస్తుత బీజాపూర్ జిల్లా, కుట్రు

ప్రాంతంలోని అంబేలిలో ప్రజా వ్యతిరేక తెగ పెత్తందారీ శక్తులు తొలి 'జన్ జాగరణ్' సభను నిర్వహించారు. ఆ పిమ్మట అదే ప్రాంతంలోని కర్కేలిలో అవే శక్తులూ మోసపూరితంగా ఐదుగురు విప్లవ ప్రజాసంఘ కార్యకర్తలను బంధించి పోలీసులకు అప్పగించారు. జూన్ 18 నాడు తాడిమెండ్రిలో జరిపిన ఒక సభలో ఇద్దరు ప్రజాసంఘ కార్యకర్తలను జన్‌జాగరణ్ శక్తులు గొడ్డండ్లతో నరికి గాయపర్చాయి.అదే విధంగా మాట్వాడ గ్రామంలో జరిపిన మరో సభలో మరో ఇద్దరు ప్రజాసంఘ కార్యకర్తలను తీవ్రంగా కొట్టారు. మాట్వాడ సభకు తరలించిన జనాలను బలవంతంగా వెంటేసుకొని జన్‌జాగరణ్ నేతలు కోత్రపాల్‌పై జూన్ 18 నాడు భారీ హింసాత్మక దాడికి పూనుకున్నారు. కానీ ఇక్కడ వారికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విప్లవ ప్రజా సంఘాలు, ప్రజా మిలీషియా నాయకత్వంలో కోత్రాపాల్ ప్రజలు జన్‌జాగరణ్ గూండాలను ఇద్దరినీ మట్టుబెట్టి మరో 7-8 మందినీ గాయపరిచి 10 మందినీ ఘటనా స్థలంలోనే పట్టుకున్నారు. ఈ కౌంటర్ చర్యతో వారి 'జన్‌జాగరణ్' అభియాన్‌కు బలమైన ప్రజా ప్రతిఘటన ప్రారంభమైంది. ప్రజా మిలీషియా అరెస్టు చేసిన పది మంది గూండాలను పిఎల్‌జిఏ గెరిల్లాలు వారం రోజులు విచారించి ఆరువేల ప్రజలతో ప్రజాకోర్టును నిర్వహించి భువనేశ్వర్ ఠాకూర్‌కు మరణశిక్ష విధించి మిగతా వారిని హెచ్చరించి వదిలారు. ఇలా 2005 జూన్‌లో జన్‌జాగరణ్ అభియాన్ పేరుతో సల్వాజుడుంకు రాజ్యం, స్థానిక ప్రజాద్రోహులు కలిసి నాంది పలికారు.

2005 జూన్ నుంచీ 2006 మధ్య వరకు సల్వాజుడుం తన దాడులను తీవ్రం చేస్తూ విస్తరించింది. కానీ దానికి ఎదురవుతున్న బలమైన ప్రజా ప్రతిఘటనలో ఆ తర్వాత దాని విస్తరణా ఆగిపోయింది. దాడుల తీవ్రతా తగ్గినప్పటికీ 2008 వరకూ కొనసాగి చివరకు ఓటమి పాలైంది. మూడేళ్ల కాలంలో ఫాసిస్టు సల్వాజుడుం అనేక గట్టిదెబ్బలు తిని చివరకు నిర్వీర్యమై డుల్లిపోయింది. 2009 జులై-ఆగస్టు నుంచీ 2010 అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు సల్వాజుడుం తిరిగి తన బ్రాండ్ మార్చుకొని 'దండకారణ్య శాంతి సంఘర్ష్ సమితి' పేరుతో పురుడు పోసుకుంది. 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో భాగంగా దండకారణ్యలోనూ సైనిక దాడి ప్రారంభమైంది. యుపిఏ అధ్యక్షురాలుగా ఎన్నికైన సోనియా గాంధీ 'ఖనిజ సంపద అపారంగా ఉన్న అటవీ ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాదం ప్రబలుతున్న ప్రాంతాలు ఒక్కటే కావడం ఆందోళనకరంగా ఉంది' అని అన్న వ్యాఖ్య ఈ సందర్భంగా గుర్తు పెట్టుకోవాలి.

## 2 (ఎ) సల్వాజుడుం సృష్టించిన సర్వం విధ్వంసంలో వల్లకాడైన పల్లెలు – బుగ్గిపాలైన ఆస్తులు – ఘోర నరసంహారం

2005 జూన్ వరకు అన్ని విధాలా తయారీలు పూర్తి చేసుకొన్న రాజ్యం ఫాసిస్టు హంతక దాడులతోనే తన హింసాత్మక సల్వాజుడుం క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. దీనికి కల్మ దేవాల్ పేరును ముందుకు తెచ్చి అధ్యక్షునిగా ప్రకటించారు. మహేంద్ర కర్మ, కల్మ దేవాల్‌లు వేరు వేరు కాదనీ స్థానిక ప్రజలందరికీ తెల్సిన విషయమే. బస్తర్ విప్లవోద్యమ చరిత్రలో అతి దుశ్చరిత్రుడు ఈ కల్మ దేవాల్. బస్తర్‌లో విప్లవోద్యమం

శిక్షించిన తొలి భూస్వామి ఇతడు. కిష్టారం ఏరియా పిడిమిలికి చెందిన ఇతన్ని 25 ఏండ్ల కింద విప్లవోద్యమం హతమార్చింది. ఇతన్నే కర్మ ఆదర్శంగా నిలుపుకోవడం ఆయన వర్గ స్వభావాన్నే చాటుతూంది. ఈ సర్వం విధ్వంసం క్యాంపెయిన్‌కు ప్రత్యక్షంగా ఫీల్డ్‌లో నాయకత్వ పాత్రను పోషించినవాడు మహేంద్ర కర్మ. కాగా బృహత్ బస్తర్‌లోని ఆదివాసీ భూస్వామ్య శక్తుల్లో అధిక భాగం పాలక, ప్రతిపక్ష పార్టీల తేడా లేకుండా కర్మకు దన్నుగా నిలిచారు. బస్తర్‌లో భా.జ.పా. నాయకుడు లోక్‌సభ సభ్యుడు బలిరాం కశ్యప్, ఈయన పుత్రరత్నం రాష్ట్రమంత్రి కేదార్ కశ్యప్‌లతో పాటు వీరి కుటుంబంలోని ఇతర రాజకీయ నాయకత్వ శక్తులు, సోహన్ పొట్టాయి (కాంకేర్ లోక్‌సభ సభ్యుడు)తో సహా స్థానిక ప్రజావ్యతిరేక శక్తులు అంబేలి గ్రామ గన్ను పటేల్, ఉస్కపట్నంకు చెందిన కోట్వార్, జాంగ్లా గ్రామస్థుడు గజేందర్, మాట్వాడ భువనేశ్వర్ ఠాకూర్, సన్ను కర్మ, బుర్క సమ్మయ్య, బుర్క గజేందర్, బుధురాం రాణా (బీజాపూర్ సల్వాజుడుం అధ్యక్షుడు), బోదిలి మొడియం లక్ష్మన్, పరాల్‌నార్ బుధురాం, పరాల్‌నార్ పెంటా, కెర్లాపాల్ బుధురాం సోడి, పొట్టెం క్రరె వుంగాల్, పొందుం జార ముయితోర్, లంబాడి రాజకుమార్, ఎర్రబోర్ సోయం ఎంకులు నిలిచారు. సల్వాజుడుం వ్యతిరేక ప్రజా తిరుగుబాటులో ప్రజలు ఈ స్థానిక ప్రజా వ్యతిరేక శక్తులను మట్టికరిపించారు. నేటికి ఇంకా సికా మాంఝీ (గంగలూర్), మధుకర్ గురూజీ, మూక గురూజీ, పి. విజయ్, చిన్నా గోటా లాంటి కరుడుగట్టిన ప్రజా వ్యతిరేక భూస్వామ్య-పెత్తందారీ శక్తులు మిగిలే వున్నాయి. వీళ్లు సల్వాజుడుం సాగిన కాలంలో పరమ దుర్మార్గంగా వ్యవహరించారు. అన్ని రకాల హింసోన్మాదపు చర్యల్లో వీళ్లు ముందున్నారు. ప్రభుత్వ నిధులను సొంతం చేసుకొని కోట్లకు పడగలెత్తారు. వీళ్లు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి ఏదో రూపంలో వరుసగా తెల్ల బీభత్సాన్ని సృష్టిస్తూ వస్తున్నారు. వీళ్లే తిరిగి 2010 అక్టోబర్‌లో 'దండకారణ్య శాంతి సంఘర్ష్ సమితి' పేరుతో ముందుకు వచ్చారు.

సల్వాజుడుంను మొదట జన్‌జాగరణ్ అభియాన్‌గా వ్యవహరించారు. కానీ కొద్ది రోజుల్లోనే జన్‌జాగరణ్ ఏ టీకా టిప్పనీలు అవసరం లేకుండా తన కార్యాచరణకు సరిపడే విధంగా 'సల్వాజుడుం'గా తన పేరును మార్చుకుంది. అయితే సల్వాజుడుం అంటే శాంతియాత్రగా నిర్వచిస్తూ చివరి వరకూ అది ప్రపంచాన్ని మోసం చేస్తూ వచ్చింది. కానీ కొద్ది రోజుల్లోనే విప్లవకారులు దాని మోసాన్ని బట్టబయలు చేసి అది 'శాంతియాత్ర' ఎంత మాత్రమూ కాదనీ సల్వాజుడుం అంటే 'సామూహిక వేట' అనే నిజమైన అర్థం ప్రపంచం ముందుంచగలిగారు. అది శాంతి సందేశ వాహకంగా పావురాన్ని తన లోగోగా నిల్పుకుంది. కానీ అదెప్పుడూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇవ్వలేదు. దండకారణ్య అడవుల్లో ఆ జుడుం గూండాలు అశాంతికి చిచ్చు లేపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పథకం ప్రకారం ప్రారంభించిన విప్లవ ప్రతిఘాతక ఫాసిస్టు సల్వాజుడుంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రమన్‌సింగ్ మంత్రివర్గం, యావత్తు ప్రభుత్వ యంత్రాంగం దానిని 'మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రజలు ప్రారంభించిన శాంతియుత విప్లవం'గా అభివర్ణిస్తూ

అలుపెరుగని ప్రచార క్యాంపెయిన్‌ను దేశ, విదేశాల్లో చేపట్టారు. రాష్ట్ర మీడియాను పూర్తిగా తమ గుప్పెట్లో పెట్టుకొని వాస్తవాలు వెలుగు చూడకుండా సంపూర్ణ కట్టడి విధించారు. మావోయిస్టులను ఎదుర్కొని అంతమొందించడానికి ఆంధ్ర గ్రేహౌండ్స్‌ను 'రోల్ మాడల్'గా చూపుతున్న కేంద్ర ప్రభుత్వం 2005 నుంచీ శాంతియుత ప్రజా విప్లవం సల్వాజుడుం అంటూ 'సివిల్ సొసైటీ' ముందుంచడం మొదలుపెట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో బి.కె.ఎస్. 'రే' లాంటి ఉన్నతస్థాయి ప్రభుత్వ కార్యదర్శులు, డిజిపి విశ్వరంజన్ అసత్యాలతో, అర్ధ సత్యాలతో, వక్రీకరణలతో, ఊహాగానాలతో, కల్పితాలతో ప్రభుత్వ స్వరాన్నీ, పోలీసు ఎత్తుగడలనూ ముందుపెట్టి విప్లవ వ్యతిరేక ప్రచారాన్ని గోబెల్స్ రీతిలో కొనసాగించారు. వీటన్నింటి కోసం ప్రభుత్వ ఖర్చులు ఎన్నివేల కోట్ల రూపాయలు అయి ఉంటాయో రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు నిజాయితీగా శ్వేతపత్రాన్ని సమర్పిస్తే గానీ తెలియవు.

సల్వాజుడుంకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని ప్రకటించిన ముఖ్యమంత్రి కేంద్రం నుంచీ వేలాది అర్ధసైనిక బలగాలను రప్పించాడు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినపుడు 15వేలు దాటని రాష్ట్ర పోలీసు బలగాలను 2006 నాటికి 26 వేలకు పెంచాడు. కేంద్రం నుంచీ రప్పించిన అర్ధ సైనిక బలగాలలో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లలో అనుభవం సంపాదించిన నాగా బెటాలియన్, మిజో బెటాలియన్ లాంటి వాటిని చేర్చారు. కరుడుగట్టిన విశ్రాంత పోలీసు అధికారి కె.పి.ఎస్. గిల్‌ను ప్రభుత్వ సలహాదారుగా, ఆతర్వాత క్రమంలో డిజిపిగా విశ్వరంజన్‌ను, బస్తర్ డిఐజిగా టి.జె. లాంగ్‌కుమేర్ లాంటి అధికారులను ఏరి కోరి రాష్ట్ర ప్రభుత్వం రప్పించింది. పర ప్రాంతాల నుంచీ ఎన్ని బలగాలు వచ్చినా స్థానిక బలగాల తోడ్పాటు లేకుండా పోలీసు దాడులను కొనసాగించలేమని గుర్తించి వందల సంఖ్యలో స్థానిక నిరుద్యోగ యువతను, లంపెన్ యువతను భ్రమాజనిత హామీలతో ఆకర్షించి స్పెషల్ పోలీసు అధికారులుగా (ఎస్‌పిఓ) నామమాత్ర వేతనంతో నియమించారు. వీళ్లే పోలీసు దాడుల్లో కళ్లూ-చెవులుగా, గైడ్స్‌గా పనిచేశారు. వీరికి తోడుగా లొంగిపోయిన మాజీ మావోయిస్టులను, విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలను సామ, దాన, బేధ, దండోపాయాలతో ఒప్పించి ఎస్‌పిఓలలో కలుపుకున్నారు. వీటన్నింటి కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వార్షిక బడ్జెట్‌లో రక్షణ పద్దును రెండింతలకు పైగా పెంచారు.

సల్వాజుడుం దాడులు తొలి నుంచీ అత్యంత హింసాత్మకంగా సాగాయి. వాళ్ల తొలుత నిర్వహించిన పాదయాత్రల దారి అంతా రక్తం పొంగింది. విప్లవ ప్రజాసంఘాలు బలంగా పని చేస్తున్న గ్రామాల పైగా పాదయాత్ర సాగింది. దారిలో ఎదురైన ఏ ఊరునూ, ఏ పల్లెనూ వదలలేదు. ఊరు మీద పడిన జుడుం గూండా వాహిని క్షణాల్లో ఊరునంతా బుగ్గిపాలు చేసేది. ఊళ్లో ఏదీ మిగిలేది కాదు. గూండాలు తాము తినగలిగినంత తిని, మోయగలిగినంత మోసేవాళ్లు. కోళ్లు, మేకలు, పందులు ఏవీ మిగిలేవి కావు. నాగా పోలీసులు వచ్చాక ఆదివాసుల కుక్కలు కూడా దక్కలేదు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో బహిరంగసభలు నిర్వహించి ప్రజలను నానారకాలుగా బెదరగొట్టి భయకంపితులను చేసేవాళ్లు. వీరి రాక గురించి జనాలకు

తెల్సిందంటేనే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆత్మరక్షణ కోసం అడవుల్లోకి పరుగెత్తేవాళ్లు. పొరపాటున వీళ్ల చేతికి చిక్కినవాళ్లలో విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలు, జనతన సర్కార్ల నాయకులు, మాజీ విప్లవ గెరిల్లాలు, మాజీ విప్లవ పార్టీ కార్యకర్తలు, పిఎల్‌జిఏలో, విప్లవ పార్టీలో కొనసాగుతున్న గెరిల్లాల, కార్యకర్తల బంధుమిత్రులను నిర్దాక్షిణ్యంగా నరికి చంపేవాళ్లు. సజీవంగా మంటల్లోకి విసిరి నిలువెత్తు మనిషి కాలిబూడిదవుతూంటే చూసి ఆనందించేవాళ్లు. ఇళ్లల్లో మనుషులను బంధించి బయట నుంచీ తలుపులు బిగించి గొళ్లాలు వేసి ఇంటికి నిప్పు పెట్టిన ఘటనలున్నాయి. మనుషులను చంపి వారి శిరస్సులను బజార్లలో భయం గొలిపే విధంగా వేలాడదీసిన ఘటనలూ ఉన్నాయి. ఆడ, మగ, చిన్న, పెద్ద బాలెంతలు, సూలెంతలు, గర్భవతులు, రోగులు, వృద్ధులు, పసిపిల్లలు అనే ఏ తేడా లేకుండా ఈ హంతక వాహిని హత్యలు చేసింది. ఎందరెందరో మహిళలను సామూహిక అత్యాచారాలకు బలిచేశారు. ఊళ్లల్లో మహిళలను నగ్నంగా చేసి లావుపాటి కర్రలకు వేలాడదీసుకొని పశువుల్లా సజీవంగా పోలీసు క్యాంపులకు తరలించుకుపోయేవారు. తమకు నచ్చిన యువతిని సల్వాజుడుం గూండాలు, పోలీసులు తమ వెంటే ఉంచుకున్న ఘటనలూ ఉన్నాయి. వావీ, వరుసలు లేకుండా తరతరాల ఆదివాసీ (మానవ) సంబంధాల సంప్రదాయాలను అమానవీయంగా హననం చేస్తూ తోడేళ్లలా పడి ఎంత మంది స్త్రీలను ఎన్ని రకాలుగా వేధించారో! పోలీసు క్యాంపుల్లో, సల్వాజుడుం శిబిరాల్లో ఎంతమంది మహిళల జీవితాలు ఛిద్రమయ్యాయో! తమకు టార్గెట్‌గా ఉన్న గ్రామాలపై పదుల సార్లు దాడులు చేశారు. తొలి రెండేళ్ల కాలంలో ఒక్క మన్కేలి గ్రామంపై నలభై సార్లు, కోత్రపాల్ అనే మరో గ్రామంపైనే ఇరవై ఐదు సార్లు దాడి చేశారంటే వీళ్ల దాష్టీకానికి ఏ కొలమానం సరిపోతుంది? ఇండ్లల్లో పేద, మధ్యతరగతి ప్రజలు రోజు గడవడం కోసం నిల్వ ఉంచుకున్న ధాన్యం, పప్పు దినుసులు, మొక్క జొన్నలు, జొన్నలు, అటవీ ఉత్పత్తులైన ఇప్పపూవు, ఇప్పకాయ (గారి), మొర్రిపళ్లు, తునికి పళ్లు ఇంకా ఎన్నో రకాల ప్రాణంతో సమానమైన కాయలు, పండ్లు, కంద మూలాలు వీళ్ల దాడుల్లో బుగ్గిపాలయినాయి. వాటి విలువను ఆకలికి వెలకట్టే మనుషులు డబ్బుల్లో అంచనా వేయగలరేమో గానీ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు తెల్సిన వాళ్లెవరూ వీటికి ఖరీదు కట్టలేరు. ఉన్నదాంట్లోదే కాసింత రేపటి భవిష్యత్ కోసం దాపెట్టుకునే పేదల మనస్తత్వం ఎరిగినవాళ్లు ఆ బూడిద కుప్పలను చూసి వలవలా ఏడ్చేవాళ్లు. జుడుం దాడి ప్రమాదాన్ని శంకించి ఇంట్లో ఉన్న ధాన్యాన్ని మరో చోట భద్రంగా దాపెట్టుకోవాలని క్షణాల్లో ప్రయత్నించిన వందలాది కుటుంబాల వాళ్లకు శాస్త్రీయత, సురక్షిత పద్ధతులు తెలియక ఎన్ని టన్నుల ధాన్యం బొందల్లో చెడిపోయిందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రకృతి బీభత్సాలలో పొందే నష్టాలను మనుషులు తమను తాముగా ఓదార్చుకుని తట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ మానవ మృగత్వం ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించిన విధ్వంసాన్నీ, హత్యలకూ, అత్యాచారాలనూ తట్టుకొని నిలబడడానికి ఎంతో గుండెధైర్యం అవసరమవుతుంది.

సల్వాజుడుం దాడులతో అనేక గ్రామాలు వల్లకాడులా తయారయ్యాయి. సల్వాజుడుం మూలంగా 644 గ్రామాలు పూర్తిగా ఖాళీ అయినట్టూ, దాదాపు 60 వేల మంది ప్రజలు నిరాశ్రయులై శిబిరాలకు

చేరినట్టు ఆ ప్రాంతాలను పరిశీలించిన చాలా మంది చెప్పుతున్నారు. సల్వాజుడుం గూండా వాహిని గ్రామంపై దాడి చేసిందంటే ఆ ఊరు భౌతికంగా తన ఉనికిని కోల్పోయేదనే చెప్పవచ్చు. ఊళ్లోని ఇండ్లూ, పంటలూ ధ్వంసమైపోయేవి. గ్రామవాసుల్లో హత్యకు గురైన వాళ్ల ప్రాణాలు కోల్పోగా బతికి ఉన్నవాళ్లందరూ సల్వాజుడుం వాళ్ల ఏర్పర్చిన 'సహాయ' శిబిరాల్లోకి తరలించబడేవాళ్లు. తప్పుకోగలిగినవాళ్లు అడవి తల్లి ఒడిలో తలదాచుకునేవాళ్లు. తమ అడవిలోనో లేదా పొరుగున ఉన్న ఒడిషా, తెలంగాణ అడవుల్లో రక్షణ పొందేవాళ్లు. తమ అడవుల్లో రక్షణ పొందిన వేలాది మంది ప్రజలకు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం జుడుం గూండాలతో, పోలీసు, అర్ధ సైనిక బలగాలతో పోరాడుతూ తమ శక్తి మేరకు రక్షణ కల్పించడంలో దృఢంగా నిల్చింది. మొత్తంగా సల్వాజుడుం దాడులకు గురైన విశాల ప్రాంత ప్రజలు మూడు భాగాలుగా విభజితమైనట్లు చెప్పవచ్చు. ఒక భాగం జుడుం ఏర్పర్చిన 33 'సహాయ' శిబిరాల్లోకి (స్ట్రాటెజిక్ హామ్లెట్), మరో భాగం పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి, మిగతా భాగం సొంత అడవిలో పిఎల్‌జిఏ రక్షణలో ఉండిపోయారు.

సల్వాజుడుం శిబిరాలలో జీవితం నరకప్రాయంగా ఉండేదని అందులో గడిపివచ్చిన వాళ్లంతా అనుభవపూర్వకంగా చెప్పే విషయం. తమ ఊళ్లో, తమ ఇంట్లో, తమ వాళ్ల మధ్యనా, తమ భూమినీ, తమ అడవినీ నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో జీవించినవాళ్లు శిబిరాలలో బందీలుగా జీవించాల్సి వచ్చేది. అక్కడ బానిసలుగా ఉంటూ మృత్యుముఖంలో పగలూ, రాత్రులూ గడపడం అనేకమందికి భరించరానిదిగా ఉండేది. శిబిరాల్లో ఉన్న ఎవరి ప్రాణాలకూ ఎలాంటి హామీ ఉండేది కాదు. శిబిరాల పాలైన ఎంతోమంది ప్రజలను జుడుం గూండాలు నిర్దాక్షిణ్యంగా చంపి శవాలను సైతం మాయం చేసేవాళ్లు. శిబిరాల నుంచి బయటకి వెళ్లే అవకాశమే లేకుండా పోయింది. మంచీ చెడూ; సుఖం దుఃఖం; పండుగ పబ్బం; పెళ్లీ, చావూ; సంత, సంతోషం అన్నీ శిబిరానికే పరిమితమై గడుపుకోక తప్పేది గాదు. అడవిపై ఆధారపడి తమకు నచ్చిన విధంగా ఆకూ, అలము, పండు, కాయ, మాటి (గడ్డలు), పుట్టగొడుగులు, రకరకాల తేనెలు, చేపలు, పీతలు, పక్షులు, రకరకాల జంతువుల వేటతో తరతరాల సాంస్కృతిక జీవనాన్ని అనుభవిస్తూ జీవించిన ఆదివాసీలు; టాటాలు, ఎస్సార్‌లు, జిందల్‌లు ఇచ్చిన డబ్బులతో సర్కారీ శిబిరాలలో దినమొక గండంగా, బతుకే భారంగా అతి దారుణంగా రోజులు గడిపేవాళ్లు. పచ్చని అడవి అందాల మధ్య పొందికగా ఏర్పర్చుకున్న గూడెం గుండెల్లో శీతాకాలం వెన్నెల రాత్రుల్లో నెగడు మంటల వెలుతుర్లో శోభగా అలంకరించుకున్న యువతీ-యువకుల 'నానోలీ వయా' సంవాద గీతాలు, డోలు నృత్యాలు అనేక వలయాలతో కూడిన తుపాకుల పహారాల మధ్య కత్తుల బోనులో సాగేదెక్కడ! అక్కడంతా కడుపులో నుంచీ తన్నుకొచ్చే కన్నీటి జ్ఞాపకాలే. గుండె కోత గుర్తులే! నెత్తుటి మడుగుల్లో విలవిలలాడే ప్రాణమున్న మనుషులే. అక్కడ మానవ సంబంధాలకూ, మానవీయ విలువలకూ అర్థమే లేకుండా పోయింది. సర్వం కోల్పోయి తమ వాళ్లకు దూరంగా ఉండలేక, ఎవరు, ఎక్కడ, ఎలా ఉంటున్నారో తెలుసుకోలేక మృత్యు కుహరాలలో అతి దైన్యమైన పరాయీకరణ పరిస్థితులకు తట్టుకోలేక మనస్థిమితం కోల్పోయినవాళ్లు

ఎందరో!

శిబిరాలలో మహిళల జీవితాలు మరింత దుర్భరంగా ఉండేవి. వాళ్లు అనేక రకాల వేధింపులను, అవమానాలను భరించాల్సి వచ్చేది. రోజూ మునిమాపు వేళ ఏం తాఖీదు వస్తుందో తెలియని పరిస్థితుల్లో రేపటి జీవితం కోసం ఆశతో ప్రతి రోజూ గడపాల్సి వచ్చేది. తోడేళ్ల హింస తల్చుకుంటూ భయం భయంగా నిద్రపోకుండా గడిపే రాత్రులు భయంకరమైనవి. విప్లవ పార్టీ ఈ అడవుల్లో అడుగుపెట్టకముందు ఎందరెందరో ఆదివాసీ ఆడపడుచులు ఇలాంటి లైంగిక హింసను ఫారెస్టు డిపార్టుమెంటు దుర్మార్గుల చేతుల్లో అనుభవించారు. కానీ నవతరానికి అవి తెలియవు. ఇప్పుడు జుడుం వాటిని మళ్లీ ముందుకు తెచ్చింది. అడవిలో 'అన్నలతో, అక్కలతో' ప్రజల కోసం జీవిస్తూ పోరాడుతున్న తమ వాళ్లనీ లొంగదీసుకోవడానికి తమను ఒక సాధనంగా మృగప్రాయంగా శత్రువు తమను వాడుకుంటున్నాడనీ వాళ్లకు తెలుసు. కానీ తమవాళ్లు ప్రజావీరులుగానే జీవించాలనీ వాళ్లు బలంగా కోరుకుంటూ నిర్బంధ శిబిర జీవితం నుంచీ తమకు వాళ్లు తప్పకుండా విముక్తి గలిగిస్తారనే దృఢవిశ్వాసంతోనే వాళ్లు జీవిస్తున్నారు. భరించేవాళ్లు. మనిషి ఆశాజీవి. ఆ ఆశలతోనే తమ వాళ్ల ఆశయాల సాధన కోసం తామూ ఆరాటపడుతున్నారు. వాళ్లెంతో గొప్పవాళ్లు. వాళ్ల త్యాగాలు సాటిలేనివి.

2005 జూన్‌లో భైరంగఢ్, బీజాపూర్ బ్లాకులను పైలట్ ప్రాజెక్టులుగా ఎంచుకొని సల్వాజుడుం క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. దాదాపు ఎనిమిది మాసాలు ఈ రెండు బ్లాకులు విధ్వంసకర దాడులతో అట్టుడికిపోయాయి. ఈ కాలంలో ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ నెట్, ఆపరేషన్ మ్యాప్ (మెడికల్, అడ్మినిస్ట్రేషన్, పోలీసు) పేర్లతో అడవులను గాలించే ప్రత్యేక సైనిక క్యాంపెయిన్లు చేపట్టారు. అడవిలో దింపిన వేలాది అదనపు పోలీసు బలగాలతో కార్పెట్ సెక్యూరిటీ పద్ధతిని అమలులోకి తెచ్చారు. గ్రామాలకు, ఏరియాలకు, డివిజన్లకు మధ్య విప్లవ సమన్వయాన్ని తెంచేసి పిఎల్‌జిఏ బలగాలను దిగ్బంధిస్తూ తమ దాడులను సమన్వయంతో కొనసాగించే సైనిక పద్ధతుల్లో 3-5 కి.మీ.ల పరిధితో ఏరియాను సెక్టార్లుగా విభజించి ఒక్కో పోలీసు క్యాంపును కొత్తగా ఏర్పర్చారు. మావోయిస్టులు నిర్మిస్తున్న విప్లవోద్యమాన్నీ సమూలంగా నిర్మూలించే తమ ఎల్ఐసి వ్యూహాత్మక పథకంలో భాగంగా దండకారణ్యానికి ఏదీ అందకుండా చేయాలనీ, అన్ని వనరులనూ తెగ్గొట్టాలనే లక్ష్యంతో 'నాలుగు కోతల' విధానాన్ని (ఫోర్ కట్ పాలసీ) పోలీసులు అమలు చేశారు. 'నూతన భర్తీలను నిలిపివేయడం, ఆర్థిక రాబడిని నిలిపివేయడం, సరఫరాలను నిలిపివేయడం, సమాచార వ్యవస్థను నిలిపివేయడం' కోసం నూతన పథకాలు రూపొందించుకున్నారు. ప్రత్యేక ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఏర్పర్చుకున్నారు. జైళ్లను కట్టుదిట్టం చేశారు. వందల సంఖ్యలో అరెస్టు చేసిన స్త్రీ-పురుషులను దంతెవాడ, జగ్దల్‌పూర్, రాయపూర్ జైళ్లలో కుక్కడంతో అవి హద్దులెరగని నరక కూపాలుగా మారాయి. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో హెలికాప్టర్లు దిగడానికి అనుకూలంగా హెలీప్యాడ్‌లు తయారు చేసుకున్నారు. జగ్దల్‌పూర్‌లో, రాయపూర్‌లో విమానాశ్రయాలను మెరుగుపరచుకొని ఆధునీకరించసాగారు.

పోలీసు ఆధునీకరణలో భాగంగా అడవిలో గెరిల్లాలను ఎదుర్కొనే విధంగా, 'గెరిల్లాలతో గెరిల్లాలుగా పోరాడండి' నినాదంతో కౌంటర్ టెర్రరిజం అండ్ జంగిల్ వార్‌ఫేర్ స్కూల్ (CTJWS) వంటి నూతన తరహా శిక్షణా కేంద్రాలను, అత్యాధునిక కమ్యూనికేషన్ వ్యవస్థను, ఆగమేఘాల మీద ఘటనా స్థలానికి చేరుకునే విధంగా కొత్త రోడ్ల నిర్మాణాన్నీ, పాత రోడ్ల మరమత్తునూ చేపట్టారు. ఆధునిక ఆయుధాలను, మందుపాతరల నిరోధక వాహనాలను సమకూర్చుకున్నారు. గ్రామాల నుంచీ విప్లవకారుల రహస్య సమాచారాన్ని సేకరించుకోవడానికి ఇన్ఫార్మర్ల యంత్రాంగాన్ని తయారు చేసుకున్నాడు. విప్లవోద్యమ నాయకత్వాన్ని కుట్రపూరితంగా అంతమొందించడానికి కోవర్టులను తయారు చేసుకోవడంపై కేంద్రీకరించారు. విప్లవోద్యమ నిర్మాణ పార్టీనీ, ఆదివాసీ బాలల సంఘం సహా దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్, క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ లాంటి విప్లవ ప్రజా సంఘాలను నిషేధించారు. దండకారణ్యంలో రూపుదిద్దుకుంటున్న ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికార అంగాలను విప్లవ ప్రజా కమిటీలను నిషేధించారు. విప్లవోద్యమంలో పాల్గొన్నా, విప్లవోద్యమానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఏ రూపంలో సహాయం చేసినా, దానితో సంబంధాలు పెట్టుకున్నా, కఠినాతికఠినంగా శిక్షించడానికి 'ఛత్తీస్‌గఢ్ ప్రజా రక్షణ చట్టం' వీటన్నింటి పరాకాష్టగా రూపొందింది. భారత రాజ్యాంగంలో పేర్కొన్న పౌరుల ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు అడ్రస్ లేకుండా పోయాయి. అంతా పోలీసు రాజ్యం, తుపాకుల స్వైర విహారం దండకారణ్యంలో ప్రధానంగా దక్షిణ, పశ్చిమ బస్తర్లలో ఉనికిలోకి వచ్చింది. చాలా ముందు నుంచే ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రభుత్వోన్నతాధికారులు ఒక పథకం ప్రకారమే సన్నాహాలు చేసుకున్నప్పటికీ రానున్న గంభీర పరిణామాలను పార్టీ సకాలంలో గుర్తించలేకపోయింది.

## 2 (బి) జుడుం మంటల్లో జ్వలించిన జనం, జుడుంను అంతమొందించిన జన ప్రభంజనం

జుడుం దాడులు ప్రారంభమైన తర్వాత భైరంగఢ్, బీజాపూర్ బ్లాకుల్లోని ప్రజలు అనుభవించిన కష్టాలు, బాధలు వర్ణనాతీతం. దండకారణ్య విప్లవోద్యమాన్ని అంతమొందించాలనే ఫాసిస్టు లక్ష్యంతో మొదలైన జుడుం క్యాంపెయిన్ అక్కడ నిర్మాణమవుతున్న ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికార అంగాలను మొదటగా తన లక్ష్యంగా చేసుకుంది. దాని తొలి దాడులకు గంగలూరు ప్రాంతం కేంద్రమైంది. జుడుం గూండా వాహిని, ఎస్‌పిఓలు, పోలీసులు, అర్ధసైనిక బలగాలు సంయుక్తంగా కొనసాగించిన దాడుల మధ్య జుడుం శిబిరాల పాలుకాని ప్రజలు లోతట్టు అడవిలో, కొండల అంచుల్లో తలదాచుకోవడానికి చెప్పనలవికాని బాధలు అనుభవించారు. తమ ఇండ్లనూ ఇండ్లలోని సమస్త దినుసులనూ ఆ దుండగులు అగ్గిపాలు చేయడంతో వేలాది జనం కట్టుబట్టలతో అడవి పాలయ్యారు. ఆకలితో అలమటించే జనాలను అడవి తల్లి ఆదుకుంది. అడవిలో కంద మూలాలు, కాయలు, పండ్లు వాళ్ల ఆకలిని తీర్చేవి. ఏవీ దొరకనపుడు చంటిపిల్లలతో సహా ఎన్నెన్ని పగళ్లూ, రాత్రులూ వాళ్లు ఉపవాసాలతో గడిపారో వారే చెప్పాలి. ఆ జీవితంలో వాళ్లకు వెంటనే కనీస వైద్య సౌకర్యం అందకుండా పోయింది. పలకా బలపం పట్టే చేతులు పలుగూ పార

పట్టి కడుపాకలి తీర్చుకోవడం కోసం అడవంతా కందమూలాలకై భయం భయంగా పెకలించక తప్పేది గాదు. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో ఆకులతో ఓ గూడు ఏర్పర్చుకోవడం వారికి తక్షణావసరం అయింది. కనీసం ప్లాస్టిక్ జిల్లీలైనా (షీట్) వారికి తొలుత కరువయ్యాయి. చివరకు గర్భవతి మహిళలకైనా ప్రసవ సమయంలో ప్రైవసీ (చాటు) కరువైంది. బొమ్మరిల్లు లాంటి గూడులో ఆదిమానవులను తలపించే పరిస్థితుల్లో ఆ మహిళలు పడిన వేదన ప్రసవవేదనను మించిందే. ఊరు విడిచీ అడవి అంచుల్లో తాత్కాలికంగా నిర్మించుకున్న ఆ గూళ్లయినా తమకు నాలుగు రోజులు ఆశ్రయం ఇస్తాయనే గ్యారంటీ లేనిపరిస్థితులలో వాళ్లు జీవించారు. జుడుం గుండాలకు తమ గూడెం విషయం పొక్కిందంటే అదీ వారి దాడికి గురై అగ్గి పాలయ్యేది. ఆ తర్వాత మీడియా వార్తల్లో 'మావోయిస్టుల శిబిరం ధ్వంసం' అని అది ఒక ప్రముఖ వార్త అయ్యేది. మళ్లీ జనాలకు తిరిగి మరో గూడు నిర్మించుకునే శ్రమ తప్పేది కాదు. ఇలా ఒక్కొక్క ఊరును అనేక స్థలాలు మారుస్తూ పదే, పదే ఎన్నిసార్లు పునర్నిర్మాణం చేసుకున్నారో ఆ ఊళ్లలోకి వెళ్లి తెలుసుకోవాల్సిందే. సల్వాజుడుం దాడులకు గురైన పల్లెల్లో మనిషి, మనిషికీ, ఇంటింటికీ, మరుపురాని చేదు జ్ఞాపకాలు ఎన్నెన్నో ఉంటాయి. వాళ్లు ఎన్ని కష్టాలకూ, బాధలకూ, అవమానాలకూ, నష్టాలకూ గురైనా, కడుపుకోతకు గురైనా, ఆత్మీయులను కోల్పోయినా, తమ కండ్ల ముందే తమ శ్రమ ఫలితం సర్వం నాశనమైనా వాళ్లు దోపిడీ రాజ్యం ముందు లొంగిపోలేదు. తల్లుల ముందు బిడ్డలనూ, భర్తల ముందు భార్యలనూ, అన్నదమ్ముల ముందు అక్కచెల్లెళ్లనూ కన్నతండ్రి కళ్లెదుట కూతుళ్లనూ అతి పాశవికంగా వివస్త్రలను చేసి, సామూహికంగా అత్యాచారం చేసి అంతమొందించిన దారుణ ఘటనలు చూసి వాళ్లు గుండెలు బాదుకున్నారు కానీ జుడుం ముందు లొంగిపోలేదు. పదేడాకు చెందిన ఒక వృద్ధురాలి కొడుకు పూనెం మంగూను 2005 చివర్లో గూండాలు హత్య చేసి శవాన్ని గంగలూరు పోలీస్‌స్టేషన్ ముందు పడేసి దాన్ని కాకులూ, గద్దలూ, కుక్కలూ పీక్కుతింటుంటే చూడలేక చలించిన తల్లి హృదయం ఆ శవాన్ని తన గుండెల కద్దుకొని కడసారి కడుపు తీపి తీర్చుకోవడానికి విలవిలలాడుతుంటే ఆ హంతకులు వికటాట్టహాసం చేస్తూ ఆ తల్లిని హింసించిన తీరు అక్షరాల్లో మల్చడం సాధ్యమా! అయినా ఆ తల్లి ఆ మృగాల ముందు లొంగిపోలేదు. ఆ జుడుం పీడిత జనాలు తాము కొనసాగిస్తూన్న దోపిడీ రాజ్యవ్యతిరేక బతుకు పోరు కోసమే వాళ్లు ఎన్నుకున్న, నమ్ముకున్న జనతన సర్కార్లను కాపాడుకోవడం కోసమే, వాళ్లు సంఘటితమై నిర్మించుకున్న మూడు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమాన్ని రక్షించుకోవడం కోసమే వాళ్లు అంత దృఢంగా, సంకల్పబద్ధులై నిలిచారనీ అదే వాళ్లకు అర్థమైన మావోయిజమనీ గుర్తించడం త్రికరణశుద్ధిగా దాన్ని నమ్మేవాళ్లకే సాధ్యం. నాలుగేళ్ల పాటు సాగిన సల్వాజుడుం హంతక దాడుల్లో, సర్వం ధ్వంసం అభియాన్లలో వేలాది ప్రజలు దృఢంగా విప్లవ పక్షం నిలవడమే జుడుం వ్యతిరేక పోరాటంలో వాళ్లు సాధించిన అతి పెద్ద విజయంగా భావించాలి. ఈ సర్వం విధ్వంసం, మానవ సంహారంలో దాదాపు వెయ్యి మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు.

సల్వాజుడుం పీడిత ప్రజలు గొప్ప ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించారు. ఊరూరా యువత పెద్దెత్తున ప్రజామిలీషియా బాధ్యతలు చేపట్టారు. 2006 ఫిబ్రవరి 10 (మహాన్ భూంకాల్ దివస్) నాడు నూతనంగా కోయ భూంకాల్ మిలీషియా ఏర్పడింది. దళారీ పెట్టుబడిదార్ల, బహుళ జాతి కార్పొరేషన్ల, మైనింగ్ మాఫియా స్వార్థ ప్రయోజనాల కోసం ఒక అపార గనుల ప్రాంతంలోని ఒక ప్రాదుర్భావ జాతినే నిర్మూలించే ఫాసిస్టు లక్ష్యంతో ప్రారంభించిన 'సామూహిక వేట' (సల్వాజుడుం)ను ఎదుర్కోవడానికి 'జాతి' యావత్తు సాయుధం కావల్సిందేనన్న స్ఫూర్తితో కోయ భూంకాల్ మిలీషియా ఏర్పడింది. ప్రజా మిలీషియా రక్షణలోనే ప్రజల ప్రతి కదలిక సాగింది. ప్రజలు దుక్కులు దున్నుకోవడం, వరి విత్తడం, పొలం కోతలు, వరి మోతలు, నూర్పిళ్లు, అటవీ ఉత్పత్తుల సేకరణా, సంతలకు వెళ్లి రావడం, వేడుకలు, దినకర్మలు ఇలా జీవితంలోని ప్రతిచర్యా ప్రజా మిలీషియా రక్షణలోనే సాగడం ఒక నియమంగా మారింది. ప్రజలకు రక్షణ కల్పించడంలో నిమగ్నమై ఆ బాధ్యతలు నిర్వర్తిస్తూనే కామ్రేడ్ లక్కే లాంటి ప్రజా మిలీషియా యువతీ యువకులు అనేక మంది అసువులు బాశారు. తమ గుడిసెలను పదే పదే కాల్చిబూడిద చేయడానికీ, తమ వాళ్లను అరెస్టులు చేసి చిత్రహింసల పాలుచేసి అంతమొందించడానికి వచ్చే పోలీసులకు తగిన బుద్ధి చెప్పాలనే వర్గకసితో ఇళ్లలోని వస్తువులనే ప్రజలు బాంబులుగా మలుచుకున్నారు. ఆ బాంబుల గురించి రహస్యం పొక్కి పోలీసులకు అర్థమైన్నాడు పోలీసుల లాఠీదెబ్బలు, బూతులు ఎన్నైనా భరించి తుదకు వారి బలవంతంతో అక్టోబర్ 19 నాడు 2005 పెదకోర్మాలో తన ఇంట్లోని పెట్టె బాంబుకు కామ్రేడ్ బుద్రి లాంటి పసిగుడ్డు తల్లులు బలయ్యారే గానీ తమ వాళ్ల జాడ పగవాడికి చెప్పలేదు. ఈ రకంగా జనం సల్వాజుడుంకు గట్టి ప్రతిఘటనను ఇచ్చారు. పొరపాటున స్త్రీ-పురుషులెవరైనా శత్రువు చేత చిక్కితే తమ ప్రాణాలనైనా ఫణంగా పెట్టారే తప్ప వాళ్లకు తెలిసిన ఏ ఒక్క విషయాన్ని కూడా శత్రువుకు నోరు విప్పి చెప్పలేదు. అది వారి ఉన్నత వర్గపోరాట చైతన్యాన్నే చాటిచెబుతోంది.

స్వార్థాన్ని జయించడమే అన్నింటికన్నా పెద్ద త్యాగం అవుతోంది. విప్లవోద్యమంలో అడుగడుగునా, ఘడియ ఘడియకూ అది ఒక పెద్ద పరీక్షే అవుతోంది. చెప్పనలవి కాని కష్టాల మధ్యనా, భరించలేని భారీ నష్టాల మధ్యనా అనేక సమస్యలతో రోజూ సతమతమవుతున్న పరిస్థితులలో దృఢంగా నిలబడడమే వారి పోరాట దీక్షా పట్టుదలలకు నిదర్శనంగా ఉంటుంది. ఇలాంటి అనుభవాలను సల్వాజుడుం పీడిత ప్రజల నుంచీ ఎన్నైనా నేర్చుకోవచ్చు. సల్వాజుడుం శిబిరాలకు బలవంతాన మహిళలను తరలించుకువెళ్లి వాళ్ల జీవితాలతో పరమ దారుణంగా వ్యవహరించి వదలిన తర్వాత తిరిగి ఆ మహిళలను దొడ్డ మనసుతో తమలో కలుపుకోవడం వారి ఔన్నత్యాన్ని ప్రదర్శిస్తుంది. తమ కళ్ల ముందే తమ మహిళలను అవమానపర్చి, అసభ్యంగా వ్యవహరించి పశుప్రాయంగా బలాత్కారం చేసి తమ వెంట తీసుకెళ్లి వారితో చిత్తానుసారం వ్యవహరించి వదలడం మధ్యయుగాల పాశవిక భూస్వామ్యాన్ని గుర్తు చేస్తుంది. ఆ మహిళలను జుడుం పీడిత ప్రజానీకం సాదరంగా ఆదరిస్తూ తమ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం కాసిన్ని పసుపు నీళ్లు వాళ్లపై చల్లి వారిని తమలో కలుపుకుంటోంది. జరిగిన దాంట్లో మహిళ తప్పేమీ లేదని ఆ ప్రజానీకానికీ,

ఆ సమాజానికీ తెలుసు. అలాంటి ఘటనలు ఒక్కరికో, ఇద్దరికో పరిమితమవడం లేదు. యావత్తు సమాజం భరిస్తున్న దారుణాలవి. సల్వాజుడుం ప్రారంభం నుంచీ ఈనాటి గ్రీన్‌హంట్ సైనిక దాడుల వరకు ఆగకుండా మహిళలపై జరుగుతున్న దుష్కృత్యాలవి. వాటి పీడ విరగడ కావడం అన్నది ఆ ప్రాంతంలో దోపిడీ ప్రభుత్వాల ఖాకీ బలగాలు ఎంతకాలం ఉంటాయనే దానిపైనే ఆధారపడి ఉందనీ వాళ్లందరికీ తెలుసు. అందుకే వాళ్లు ఆ దోపిడి ప్రభుత్వ బలగాలను తమ ప్రాంతం నుంచీ వెనక్కి పంపి వారి నుంచీ విముక్తి సాధించుకోవడానికి దృఢ నిశ్చయులై పోరాడుతున్నారు.

జుడుం దాడులను అడ్డుకోవడానికి ప్రజలు తమకు తోచిన పద్ధతుల్లో సృజనాత్మక రూపాల్లో పోరాడుతూ పోరాడడం నేర్చుకుంటున్నారు. శత్రువు కదలికలను అడ్డుకోవడానికి దారులన్నీ ప్రాణాంతకంగా తయారు చేశారు. పోలీసులు నడిచే దారులన్నీ వందల సంఖ్యలో పెద్ద పెద్ద గోతులు తవ్వారు. ఆ గోతుల్లో వెదురు కొయ్యలు, ఇనుపరాడ్లు పాతారు. అవి తమకు తప్ప మరొకరికి అర్థం కాకుండా కెమోఫ్లెజ్ చేశారు. అనేక చోట్ల బూబీట్రాప్‌లు అమర్చారు. ఆ గోతుల్లో పొరపాటున తమ వాళ్లే పడి గాయపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పశువులు పడిపోయి మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. అయినప్పటికీ వాళ్లు ఆ గోతుల తవ్వకాన్ని నిలిపివేయలేదు. ఆ గోతుల బారిన పడిపోకుండా వాళ్లు తమ వాళ్లకు జాగ్రత్తలు చెప్పుకున్నారు. ఆ గోతులు తమ గెరిల్లా యుద్ధ తంత్రంలో ఒక విడదీయరాని భాగమయ్యాయి. అవి తమను రక్షించడంలో, శత్రువును దెబ్బతీయడంలో, నిలువరించడంలో తోడ్పడుతున్నాయనీ వాళ్లకు అర్థమైంది. శత్రువు దాడికి అవకాశం ఉందని వారు భావించిన పల్లె అయినా, అడవి అయినా, ఇళ్లయినా, దారి అయినా దానిని కాపాడుకోవడానికి వాళ్లు తమకు తోచిన పద్ధతుల్లో దానిని పోరాట స్థలంగా లేదా డెత్ ట్రాప్‌గా మలచడానికి కృషి చేశారు. అమరువీరుల స్థూపాలను రక్షించుకోవడానికి వారు ప్రత్యేక శ్రద్ధ కనపర్చారనడానికి తాకిలోడ్ గ్రామ అనుభవం ఒక మంచి ఉదాహరణ. 2006 జనవరిలో తాకిలోడ్ గ్రామాన్ని టార్గెట్‌గా చేసుకొని వచ్చిన పోలీసులు అక్కడ ఎదురుగా పది అడుగులకు పైగా ఎత్తుతో నిల్చిన అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీల స్థూపాన్ని కూల్చడానికి ముందుగా సిద్ధపడ్డారు. కానీ వాళ్లు ఆ స్థూపాన్ని కూల్చలేకపోయారు. వాళ్ల గునపం పోట్లకు ప్రజలు పాతిన డైనమైట్లు జవాబు చెప్పడంతో అక్కడి నుంచీ వాళ్లు నెత్తుటి గాయాలతో వెనక్కి వెళ్లకతప్పలేదు. అప్పటికే ఆ ఊరంతా డెత్ ట్రాప్‌గా మారిందన్న విషయాన్ని అర్థం చేసుకున్న జుడుం గూండాలు, పోలీసులు మరెక్కడా దాడికి దిగకుండా తోక ముడిచారు. ఈ రకంగా ఒక విశాల భూభాగం ప్రజా ఆత్మరక్షణ చర్యలతో నిండిపోయింది.

ఇది ఇలా ఉండగా ప్రజా మిలీషియా కార్యకర్తలు అమర్చే 'ప్రెజర్' బాంబులంటేనే పోలీసు బలగాల్లో భయం మొదలైంది. 2006లో మొదటి ఆరు మాసాలలో ప్రెజర్ బాంబుల పలవరింపులతో దాదాపు ఒక అరడజను మంది పోలీసులు (సిఆర్‌పిఎఫ్) తమ శిబిరాలలోనే గుండె ఆగి చనిపోయారు. అందుకే పోలీసు వర్గాలు ప్రజా మిలీషియా కార్యకర్తలను 'హిడెన్ ఆర్మీ' (అదృశ్య సైన్యం)గా పేర్కొనడం

మామూలైంది. పిఎల్‌జిఎ సాహసోపేతంగా సైనిక దాడులు నిర్వహించడం, ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం, స్వాధీనం చేసుకున్న ఆయుధాలలో నుంచీ ఒక భాగాన్ని కేటాయించడంతో దండకారణ్య ప్రజా మిలీషియాకు సాయుధం కావడానికి అవి తోడ్పడినాయి.

సల్వాజుడుం దాడులను ఎదుర్కొవడానికి, వాటిని ప్రజలు సమైక్యంగా తిప్పికొట్టడానికి, జుడుం అసలు నైజాన్ని బయటపెట్టడానికి 2006లో జూన్ 5-12 మధ్య 'జన పితూరి సప్తాహాన్ని' పాటించడం ప్రారంభమైంది. సల్వాజుడుం ప్రారంభ దినంగా వాళ్లు జూన్ 5ను పాటిస్తూంటే ప్రజలు దానికి ప్రతిగా పితూరి సప్తాహాన్ని పాటించసాగారు. ఈ సందర్భంగా ప్రజా మిలీషియా, కోయ భూంకాల్ మిలీషియా, విప్లవ ప్రజానీకం పెద్దెత్తున సమర రంగంలోకి దిగి రకరకాల చర్యలు చేపట్టేవారు. ఈ సందర్భంగా స్త్రీలు-పురుషులు కదలి పోలీసు, గుండాల కదలికలను నిరోధించడానికి రోడ్లను తవ్వడం, రోడ్లకు ఆటంకాలు ఏర్పర్చడం సాధారణ పోరాటరూపంగా ముందుకు వచ్చింది. గూండాల, పోలీసుల కదలికల గూర్చి సమాచారం చేరిందంటే వాళ్లను దెబ్బతీయడానికి ప్రజా మిలీషియా, పిఎల్‌జిఏ గెరిల్లాలు ప్రతిఘటనా చర్యల నిమిత్తం తక్షణం రంగంలోకి దిగేవారు. జన పితూరి సప్తాహం సందర్భంగా ప్రజా మిలీషియా ఏర్పాటు చేసిన బూబీట్రాప్‌లో పడి చాలా చోట్ల పోలీసులు, గూండాలు గట్టిదెబ్బలు తిన్నారు. గుండా అజయ్ ఠాకూర్ సల్వాజుడూం సంబరాల్లో పాల్గొనడానికి వెళ్తూ ఆవుపల్లి రోడ్డు పై 2006 జన పితూరి సప్తాహ్ సందర్భంగా డెత్‌ట్రాప్‌లో పడి చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా మృత్యువాత నుంచీ తృటిలో తప్పుకొని గాయాలతో బయటపడ్డాడు. జూన్ 5-12 వచ్చిందంటేనే 'జన పితూరి సప్తాహం' గురించి విస్తృతంగా ప్రచారం జరిగి గూండాల, పోలీసుల కదలికలు నియంత్రించబడేవి.

ప్రజాయుద్ధంలో తమ్ము తాము సాయుధం చేసుకోవడానికి ప్రజలు ఎంతగానో కృషి చేశారు. పిఎల్‌జిఏ వెంటా సాయుధ చర్యలలో తాము పాల్గొనకుండా జుడుం గూండాలనూ వారి రక్షణలో వస్తున్న పోలీసు, అర్ధసైనిక బలగాలనూ ఎదుర్కోలేమని ప్రజలు గుర్తించారు. సల్వాజుడుం దాడులు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రజలు, ప్రజా మిలీషియా ప్రతిఘటన దాడుల్లో పాల్గొంటున్నప్పటికీ 2006 జనవరి నుంచీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో పిఎల్‌జిఏ చేపట్టిన కౌంటర్ క్యాంపెయిన్‌ను ఒక టర్నింగ్ పాయింట్‌గా చూడాలి. 2006 జనవరి 30 నాడు వందలాది మంది ప్రజా మిలీషియా పిఎల్‌జిఏ గెరిల్లాలతో కలిసి గంగలూర్ సల్వాజుడుం శిబిరంపై చేసిన తొలి దాడితో భారీస్థాయిలో ప్రజా ప్రతిఘటన ప్రారంభమైంది. శిబిరాలలో ఉండే సల్వాజుడుం గూండాలు రెండు లేదా మూడు వలయాలలో శిబిరాలలోని ప్రజలను తమకు రక్షణ కవచాలుగా (షీల్డు) ఏర్పర్చుకునేవారు. శిబిరానికి ఎప్పుడూ అందుబాటులోనే భారీ సంఖ్యలో సాయుధ పోలీసులుంటారు. ఇన్ని వలయాల మధ్య, పోలీసుల అండతో తాము సురక్షితంగా ఉన్నామనీ విర్రవీగిన జుడుం గుండాలను ఆ రోజు గెరిల్లాల నాయకత్వంలో ప్రజలు కఠినంగా శిక్షించి తమ కసి తీర్చుకున్నారు. జుడుం శిబిరాన్ని గెరిల్లాలు చుట్టుముడుతున్నారన్న విషయాన్ని ముందే పసిగట్టిన

గ్రామస్థులు, వలయాలుగా మోహరించబడి ఉన్న శిబిర జనాలు ఎనలేని ఉత్సాహంతో గెరిల్లాలకు, ప్రజా మిలీషియాకు పూర్తిగా సహకరించారు. శిబిరవాసులు రాత్రంతా దాడిలో పాల్గొని గూండాలను పేరు పెట్టి, ఏరుకుంటూ, ఏరుకుంటూ అంతమొందించారు. ఆ దాడిలో ఎనిమిది మంది గూండాల పీడ విరగడైందని ప్రజలు సంతోషించారు. గెరిల్లాలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ ఎంకినానో తన ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత ఫిబ్రవరి 9కి 'జాతీయ గనుల అభివృద్ధి సంస్థ'పై గెరిల్లాలు జరిపిన దాడిలో వెయ్యిమంది ప్రజా మిలీషియా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ దాడిలో దాదాపు 19 టన్నుల పేలుడు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇది వారు సాయుధం కావడానికి చాలా ఉపకరించింది. ఆ దాడి శత్రువుకు వెన్నులో జర్వాన్ని పుట్టించింది. ఆ వెంటనే ఫిబ్రవరి నెలాఖరుకు దర్భగూడెం వద్ద గెరిల్లాలు జరిపిన మందుపాతర పేలుడులో జుడుం మూక భారీ సంఖ్యలో నేలగూలింది. ఇదే సమయంలో బెజ్జి ప్రాంతంలో నాగా పోలీసులపై జరిపిన మాటు దాడిలో దిమ్మతిరిగే దెబ్బపడి తొమ్మిది మంది నాగా పోలీసులు అక్కడికక్కడే నేలగూలారు. ఇంతటితో, నాగా పోలీసులంటే సృష్టించిన కథలు, కథనాలన్నీ పటాపంచలైనాయి. ఈ దాడుల పరంపర అనేక త్యాగాలతో ఎన్నో విజయాలు సాధిస్తూ పురోగమించింది. ఈ దాడుల పరంపరలో మురికినార్, రానీబోదిలి, ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, బట్టిగూడెంలలో గెరిల్లాలు జరిపిన మాటు దాడులన్నీ ప్రజా మిలీషియా, ప్రజల భాగస్వామ్యంతో జయప్రదమైనవే.

ప్రతీ సమరం త్యాగాలను డిమాండ్ చేసింది. రానీబోదిలిలో కామ్రేడ్స్ మోహన్, భగత్, చైతు, కైలాస్, లింగన్న, భీమాల్‌లు అమరులైతే ఉర్పల్‌మెట్టలో శత్రువుతో 2007 జూలై 9 నాడు జరిగిన బాహాబాహీ యుద్ధంలో కా. దూలా తన నెత్తురు ధారపోశాడు. బట్టుగూడెంలో కా. బామన్ తన ఇద్దరు సహచరులతో అసువులు బాశాడు. ఇక్కడ పేర్కొన్నవి మచ్చుకు కొన్ని మాత్రమే. వీళ్ల త్యాగాలు లేకుండా ఈ ఘటనల్లో ఇంచుమించు 90 మంది శత్రు బలగాలను మట్టికరిపించడం సాధ్యం అయ్యేది కాదేమో! దండకారణ్య యుద్ధభూమిలో జరిగిన సమరాల్లో ప్రజా మిలీషియా, ప్రజల పాత్ర అద్వితీయమైనది. వారు సాయుధులు కావడానికీ, సల్వాజుడుంను ఓడించడానికీ అవి అతి ప్రధాన కారకంగా పనిచేశాయి. ధైర్యంగా పోరాడడం ద్వారానే తమ అస్థిత్వం, ఆత్మగౌరవం నిలబడిందనీ ప్రజలు స్పష్టంగా గుర్తించారు.

మరోవైపు శత్రువు బలగాలలో ఈ దాడుల ప్రభావం ఎంతగా ఉందంటే దండకారణ్యంలోని ప్రజాయుద్ధ ప్రాంతాలకు వెళ్లాలంటేనే పోలీసు ఉన్నతాధికారులలో ఒక జడుపు మొదలైంది. 2006 ప్రారంభంలో బీజాపూర్ జిల్లాలో బాధ్యతలు స్వీకరించడానికి నిరాకరించిన ఎస్‌పి సంజయ్ తివారీనీ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా అంతటి స్థాయి అధికారినీ ఉద్యోగం నుంచీ సస్పెండ్ చేశారు. పోలీసు బలగాల్లో ఎలాంటి మానసిక స్థితి నెలకొందో చెప్పడానికి తివారీది ఒక ఉదాహరణ మాత్రమే. దాదాపు మూడింట ఒక వంతు అధికారులు విధుల్లో చేరకుండా ఏదో నెపంతో కాలం నెట్టుక రావడం సహజమైంది. డిజిపి విశ్వరంజన్ ఎన్ని గంభీర హెచ్చరికలు చేస్తున్నా గానీ పరిస్థితులలో పెద్ద ప్రగతి లేదని బాహాటంగా

దిన పత్రికలే రాయసాగాయి.

జుడుం గూండాలు, జుడుం రక్షణ కోసం వచ్చిన పోలీసులు, జుడుం నేతలు, పిఎల్‌జిఏ చేతిలో దెబ్బపై దెబ్బతింటూండడంతో 2006 మధ్య నాటికి దాని విస్తరణ స్వప్నాలు దూదిపింజల్లా గాలిలో ఎగిరిపోయాయి. జుడుం పొందిన ప్రతీ ఓటమీ దాని శిబిరాలలో బందీలుగా ఉంటున్న జనాలలో గొప్ప ఉత్సాహాన్ని కలిగించేది. దాని ప్రతి ఓటమి తర్వాత శిబిరాలలోని జనం ఉత్సాహంతో ఎంతో కొంత అక్కడి నుంచీ బయటపడేవారు. దాడుల ప్రజా యుద్ధ ప్రభావం ఎంత ఉండిందంటే ఒక దశలో శిబిరాలలో రేడియోలను, టీవీ వార్తలను (దాడుల వార్తలను) విననీయకుండా నిషేధించే పరిస్థితి ఏర్పడింది. 2007 ప్రారంభం నాటికి శిబిరాలలో గణనీయమైన సంఖ్యలో జనాలు ఖాళీ అయ్యారు. 2008 జులై నాటికి జుడుం శిబిరాలలో 13-15 వేలమంది మాత్రమే మిగిలారు. ఎక్కువ మంది జుడుం కుటుంబాలకు, ఎస్‌పిఓ కుటుంబాలకు చెందినవారే. మిగిలిన జనాలు పొద్దంతా తమ వ్యవసాయ పనులలోకీ, అటవీ ఉత్పత్తుల సేకరణకూ వెళ్లి రాత్రి పూట నిద్రకు మళ్లీ శిబిరానికి వెళ్తాండేవారు. శిబిరాలను వదిలి వచ్చేవారిని నియంత్రించడానికి ఒక దశలో పోలీసులే వాళ్లను హత్య చేసి మావోయిస్టుల పైకి ఆ నేరం నెట్టే స్థితికి వెళ్లారు. మాట్వాడా క్యాంపులో ముగ్గురు రైతులను ఇదే తరహాలో హత్య చేసిన ఉదంతంలో ఎస్ఐ, ఎస్‌పిఓలు తదితర పోలీసుల పాత్రను ఛత్తీస్‌గఢ్ హైకోర్టు విచారించి శిక్షించిన విషయం జగద్విదితమే. ఈ క్రమంలో విప్లవ పార్టీ, విప్లవ ప్రజా సంఘాలు, జనతన సర్కార్ల వైపు నుంచీ వరుసగా ప్రజలు శిబిరాలు వదిలి తమ ఇండ్లకు రావల్సిందిగా విజ్ఞప్తులు చేయడం పెంచారు. అలాగే శిబిరాలలో బందీ జీవితాల కన్నా స్వేచ్ఛగా పోరాడుతూ ప్రాణాలర్పించడం మేలంటూ శిబిరాల బయటి ప్రజలు తమ అనుభవాలను అనేక రూపాలలో శిబిరాలకు చేర్చేవారు. శిబిరాలకు బలవంతంగా తరలించబడిన ప్రజల పంట పొలాలు కోసీ ధాన్యం నూర్పిళ్లు చేసీ, వాటిని భద్రపరిచేవారు ప్రజా మిలీషియా కార్యకర్తలు. శిబిరాలు వదలి వచ్చిన ప్రజలకు తిరిగి తమ ధాన్యం లభించేసరికి ఎంతో సంతోషం కలిగేది. వారంతా ప్రజా మిలీషియాకు ఎంతో కృతజ్ఞతతో వారంతా ఉంటూ కన్నబిడ్డల్లా చూసుకోసాగారు. ఇవన్నీ శిబిరాలలో మిగిలిన వాళ్ల మీద చాలా సానుకూలమైన ప్రభావాన్ని వేసి వారంతా శిబిరాలు వదిలి రావడానికి తోడ్పడినాయి. శిబిరాలు వదిలి వచ్చిన వారిని ప్రజలు పరిశీలించి తమలో కలుపుకునేవారు. శిబిరాలలో ఉంటూ ప్రజా వ్యతిరేక చర్యలలో పాల్గొన్నవారిని ప్రజాకోర్టులలో విచారించి ఆ తీర్పు మేరకు వారితో వ్యవహరించేవారు. దీనితో 2008 మధ్య నాటికి జుడుం శిబిరాలు ఎస్‌పిఓలు, జుడుం గూండాలు, ప్రజా వ్యతిరేక భూస్వామ్య, పెత్తందారీ శక్తుల అడ్డాలుగా మాత్రమే మిగిలిపోయాయి. కానీ, జుడుం నిర్వహణ పేరుతో వచ్చే కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను సొమ్ము చేసుకోవడానికి అలవాటు పడిన దాని నాయకత్వం వాటిని 2009 చివరి వరకూ యథాతథంగా కొనసాగించారు. శిబిరాల 'రక్షణ' కోసం వచ్చిన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) 2009 అక్టోబర్‌లో ఆ బాధ్యతల నుంచీ వైదొలగింది. 2011 నవంబర్‌లో దండకారణ్య అడవుల నుంచి పూర్తిగా వెనక్కివెళ్లిపోయింది. వెనక్కి వెళుతున్న క్రమంలో ఎస్ఎస్‌బీ వాళు

ు గెరిల్లాల మందుపాతరకు తొలిసారిగా నెత్తుటి మూల్యం చెల్లించి మరీ వెళ్లిపోయారు.

సల్వాజుడుంలో ఎస్‌పిఓలుగా చేరి అది సృష్టిస్తోన్న విధ్వంసకాండలో ముందు నిలిచి పరమ దుర్మార్గంగా వ్యవహరిస్తోన్న వారిపట్ల ప్రజలు చాలా ఆగ్రహంగా ఉన్నారు. తమ 'జాతి' మొత్తాన్ని నిర్మూలించ తలపెట్టిన జుడుంలో భాగం కావద్దనీ ప్రజలు ఎస్‌పిఓలకు పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నారు. దీనితో కొంతమంది తమ తప్పును గుర్తించి తిరిగి ప్రజల ముందుకు వచ్చి జరిగిన తప్పును అంగీకరిస్తూ ప్రజల్లో భాగం అవుతున్నారు. అతికొద్ది మందే అయినప్పటికీ కొందరు ఎస్‌పిఓలు తమ తుపాకులతో సహా పారిపోయి వచ్చి వాటిని భద్రంగా గెరిల్లాలకు అప్పగించి వారు మాత్రం ప్రజల్లో కలిసిపోయారు. ప్రజల్లో కలవడానికి అవకాశం లేక, జుడుంలో కొనసాగలేక ఆత్మహత్యలు చేసుకున్నవాళ్లు కూడా కొందరు ఉన్నారు. ఇంతేకాకుండా గణనీయమైన సంఖ్యలోనే ఎస్‌పిఓలను విప్లవోద్యమం శిక్షించింది. ప్రజల పట్ల అతిపాశవికంగా వ్యవహరిస్తున్న ఎస్‌పిఓలను ప్రజలు తమ, పర అనే తేడా లేకుండా శిక్షిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. జేగురుగొండ ప్రాంతంలో నాగారం అనే గ్రామంలో సోండూ అనే ఎస్‌పిఓను కన్న తల్లిదండ్రులే జనతన సర్కార్‌కు అప్పగించి మరణశిక్ష విధించాలని కోరారు. తమ కడుపున పుట్టినవాడు ప్రజల పట్ల అంతటి దుర్మార్గాలకు పాల్పడుతూండడం, ప్రజలు ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నా వినకుండా పెడచెవిన పెడుతూండడం, తాము చేస్తున్న ఘాతుకాల పట్ల కనీసం పశ్చాత్తాపం లేకుండా అదే పొగరుతో ఉంటూ ఎస్‌పిఓగానే కొనసాగుతాననడంతో జనం సోండూ వైఖరిని ఖండించి అతనికి మరణశిక్ష విధించారు. తమ కన్నకొడుకు కన్నా ఒక దుర్మార్గపు ఎస్‌పిఓ పీడ విరగడై పోయిందనే సోండూ తల్లిదండ్రులు కూడా సంతృప్తిని వ్యక్తపరిచారు.

సల్వాజుడుం ఆదివాసీల శాంతి విప్లవంగా అభివర్ణిస్తూ, మావోయిస్టుల హింసను ఎదుర్కోవడంలో అదో గొప్ప ప్రజా విప్లవంగా ఆందోళనగా పాలకవర్గాలు ప్రచారం చేశాయి. విధానసభలో, ప్రతిపక్షంగా ఉంటూనే దాని నాయకుడైన మహేంద్ర కర్మ రమన్‌సింగ్ మంత్రి వర్గంలో పేరులేని మంత్రిగా గణుతికెక్కి జుడూం సూత్రధారి అన్పించుకున్నాడు. సల్వాజుడుం విషయంలో కవలలుగా పనిచేసిన బిజెపి, కాంగ్రెస్‌లు దానిని తొలుత తెగ ప్రచారం చేయడంతో దేశ విదేశాల్లో గణనీయమైన సంఖ్యలో బూర్జువా మేధావులను, రచయితలను, కళాకారులను, గాంధేయవాదులను, అది పెద్ద భ్రమలలోకి నెట్టింది. కానీ దాని అసలు స్వరూపం విప్లవోద్యమ కృషితో కొద్ది మాసాల్లోనే వెల్లడి గావడం ప్రారంభించింది. ప్రజా ప్రతిఘటనోద్యమం ఎలా తీవ్రతరం అవుతూ బలోపేతం కాసాగిందో, ఒకదాని వెంట మరొకటి ప్రజా విజయాలు ఎలా వెలుగు చూశాయో అలా జుడుం ఫాసిస్టు స్వభావం నగ్నం కాసాగింది. 2006 ప్రారంభంలో ఛత్తీస్‌గఢ్ విధానసభ సభ్యులకూ, మీడియా పర్సన్స్‌కూ, సల్వాజుడుం ఘాతుకాలను దండకారణ్య ప్రచార బ్యూరో రికార్డు చేసి సీడీలలో పంపడంతో అసలు వాస్తవాలు వెల్లడి కావడం ప్రారంభమైంది. 2007 చివర్లో జగ్దల్‌పూర్‌లో ఒక లక్ష మంది జుడుం పీడిత ప్రజలు, ప్రజాస్వామికవాదులు భారీయెత్తున బహిరంగసభను

| సల్వాజుడుం శిబిరాలలో బందీలుగా ఉండలేక ప్రజా విజయాలతో తిరిగి తమ గ్రామాలకు చేరిన కుటుంబాల వివరాలు<br>భైరంగఢ్ బ్లాక్‌లోని ఇంద్రావతి ఏరియా, 2006-07 (యేడాది కాలంలో) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | గ్రామం | మొత్తం కుటుంబాలు | శిబిరాల నుంచి గ్రామాలకు తిరిగి వచ్చిన కుటుంబాలు | శిబిరాలలోనే ఉన్న కుటుంబాలు | ఎస్‌పిఓలలో చేరినవారు | పోలీసు ఇన్ఫార్మర్లుగా మారినవారు |
| 1 | గుడ్సం | 56 | 53 | 3 | - | - |
| 2 | దొడ్డం | 30 | 12 | 8 | 2 | - |
| 3 | ఈద్‌వాయి | 20 | 15 | 5 | 2 | - |
| 4 | బడుంగ్ | 16 | 13 | 3 | - | - |
| 5 | పర్కేలి | 50 | 48 | 2 | 28 | 5 |
| 6 | గుట్టమంగి | 14 | 12 | 2 | 1 (ఖతం) | - |
| 7 | ఎత్‌లా | 13 | 8 | 5 | 4 | - |
| 8 | కొండికా | 25 | - | 25 | 1 (ఖతం) | - |
| 9 | బుర్రీ | 20 | 16 | 4 | 2 | 2 |
| 10 | పూస్‌లక్క | 20 | 5 | 15 | 4 | 2 |
| 11 | లక్క | 30 | 2 | 28 | 5 | 2 |
| 12 | బమ్‌రా | 17 | - | 17 | - | - |
| 13 | బోదిలి | 12 | - | 12 | - | - |
| 14 | నూంగూర్ | 29 | 5 | 24 | 6 | 3 |
| 15 | ఈంగ్‌మెట్ట | 24 | - | 24 | 3 | 1 |
| 16 | కొండె | 35 | 5 | 30 | 1 | - |
| | మొత్తం | 411 | 154 | 215 | 59 | 15 |

నోటు :

1) 42 కుటుంబాలు బతుకుదెరువు కోసం పరప్రాంతాలకు వెళ్లాయి.

2) ఎస్‌పిఓలలో చేరిన ఇద్దరికి ప్రజాకోర్టులో మరణశిక్ష విధించడమైంది.

3) ఎస్‌పిఓలలో చేరినవారి సంఖ్య మొత్తం కుటుంబాలలో భాగంగానే ఉంది.

4) 2010 చివరి నాటికి ఈ గ్రామాలలోని ప్రజావ్యతిరేక శక్తులే శిబిరాలలో ఉండిపోయాయి. మిగతా ప్రజలందరూ తమ గ్రామాలకు చేరుకొని పిఎల్‌జిఏ అండతో తమ ఆదివాసీ రైతాంగ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

5) సల్వాజుడుం కాలంలో ఏర్పడిన 33 శిబిరాల పరిస్థితి 2010 చివరి నాటికి పూర్తిగా దిగనాసిల్లింది. తమ దోపిడీ కోసం రిజిష్టర్‌లలో క్యాంపుల సంఖ్య యథాతథంగా కొనసాగిస్తూ కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని సల్వాజుడుం నేతలు గుండాలు, ఎస్‌పిఓలు, పోలీసు, పౌర ఉన్నతాధికార గణం కొల్లగొడుతున్నారు.

జరిపి జుడుంను వ్యతిరేకించారు. మరోవైపూ దేశ, విదేశాల నుంచీ రచయితలు, కళాకారులు, మేధావులు, పౌరహక్కుల సంఘాల కార్యకర్తలు, మానవహక్కుల సంఘాల కార్యకర్తలు, మీడియా పర్సన్స్, సిపిఎం మినహా వామపక్షాల కార్యకర్తలు, ఆదివాసీ మహాసభ నాయకులు, ఆదివాసీ ప్రజల హితాభిలాషులు, చరిత్రకారులు, అర్థ శాస్త్రజ్ఞులు, ప్రగతిశీల-ప్రజాస్వామ్య భావాలు కలవారు, ఆంథ్రోపాలజిస్టులు, చిత్ర నిర్మాతలు, పాత్రికేయులు, అభ్యుదయ, విప్లవ మహిళా సంఘాల కార్యకర్తలు జుడూం పీడిత ప్రాంతాలను పర్యటించసాగారు. సల్వాజుడుంను ముందుకు తేవడంలో తన వంతు పాత్ర అది పోషించిన యుపిఏ-1కు పార్లమెంటులో సిపిఎం అండగా నిల్చిందన్న వాస్తవాన్నీ, విప్లవ రాజకీయాల పట్ల అది అనుసరిస్తున్న సోషల్ ఫాసిస్టు స్వభావాన్నీ అర్థం చేసుకున్న వాళ్లకు దాని పాత్ర సులువుగానే బోధపడుతుంది. మరోవైపు, విప్లవోద్యమ పార్టీ నాయకులు, అధికార ప్రతినిధులు ప్రెస్ మీట్‌లు, ఎక్స్‌క్లూసివ్ ఇంటర్వ్యూలు పత్రికా ప్రకటనలు ఇవ్వడం పెరిగింది. స్థానికంగా పోస్టర్లు, కరపత్రాలు తీయడం, బ్యానర్లు కట్టడం, హ్యాండ్ బిల్స్ ప్రచురించడం, పత్రికల ప్రత్యేక సంచికలు వెలువరించడం, వ్యాసాలు రాసి పత్రికలకు పంపడం జరిగింది. బయటి నుంచీ ఉద్యమ ప్రాంత సమస్యల అధ్యయనానికి వచ్చిన వాళ్లలో అత్యధిక శాతం వ్యక్తులు, సంస్థలు ప్రధానంగా రోడ్డుపై గ్రామాలకూ, సల్వాజుడుం నిర్వహించే శిబిరాలకే పరిమితం అయినప్పటికీ వాళ్లు పర్యటించిన మేరకైనా వాస్తవాలను వెలుగులోకి తేవడానికి చేసిన కృషి దాని ప్రజా వ్యతిరేక చర్యలను బహిర్గతపర్చడంలో తోడ్పడింది. సల్వాజుడుం నిజస్వరూపాన్ని ఎండగట్టడంలో, ప్రజల కోణం నుంచీ పరిస్థితులను అర్థం చేసుకొని ప్రపంచం ముందుంచడంలో ఎన్ని అవాంతరాలు, ఒత్తిళ్లు ఎదురైనా వెరువక ధైర్యంగా నిల్చినవాళ్లందరికీ విప్లవోద్యమం పేరు పేరునా విప్లవాభినందనలు తెలియజేసింది. వీటన్నింటికి తోడు రాయపూర్, దంతెవాడ, జగ్దల్‌పూర్, సుక్‌మా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్, విజయవాడ, చర్ల తదితర పట్టణాలలో, దేశ రాజధాని ఢిల్లీలో, విదేశాలైన అమెరికాలో, కెనడాలో, బ్రిటన్‌లో సల్వాజుడుం వ్యతిరేక సభలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలకు తమ సంఘీభావాన్ని తెలియజేసిన కార్మిక, కర్షక, విద్యార్థి, ఉద్యోగ, మేధావి సెక్షన్లకు, విప్లవ సంస్థలకు విప్లవోద్యమం తన విప్లవాభినందనాలు తెలిపింది. దండకారణ్యంలో ప్రారంభమైన సల్వాజుడుం వెనక అక్కడి గనులను బడా కార్పొరేట్ శక్తులు తరలించుకు వెళ్లడానికి అడ్డుపడుతున్న మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతోనే సాగుతున్నట్టు చాలా రిపోర్టులు స్పష్టంగా వెల్లడి చేశాయి. సల్వాజుడుం ఆదివాసీ ప్రజలపై కొనసాగుతున్న హత్యాకాండా అని దాన్ని వ్యతిరేకించిన పీయూసిఎల్ నాయకులు, పిల్లల డాక్టర్ వినాయక్ సేన్‌కు 2010 చివర్లో జన్మఖైదు శిక్ష విధించడాన్ని సిపిఐ (మావోయిస్టు) నిర్ద్వంద్వంగా ఖండించింది.

### 2 (సి) విప్లవోద్యమ సమూల అణచివేతకై వ్యూహాత్మక దృష్టితో, సమగ్ర ప్లాన్‌తో మొదలైన దేశవ్యాప్త బహుముఖ దాడి – 'ఆపరేషన్ గ్రీన్ హంట్'

దేశంలో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఒక వ్యూహాత్మక

దృష్టితో, సమగ్రమైన ప్లాన్‌తో కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష దిశా నిర్దేశంలో మొదలైంది. దేశవ్యాప్తంగా బలమైన మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలుగా ఎంపిక చేసుకున్న **34** జిల్లాలలో ఏక సమయంలో సమన్వయంతో బూటకపు సంస్కరణలూ, సైనిక దాడులూ నిర్వహించే దీర్ఘకాల పథకంతో దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలపై బహుముఖ దాడిగా ఆపరేషన్ గ్రీన్ హంట్ విరుచుకుపడింది. ఇది సైనిక దాడిని ప్రధానంగా ఎన్నుకున్నప్పటికీ బహుముఖ దాడిగా ఇది కొనసాగుతోంది. 'హోల్డ్-కంట్రోల్-బిల్డ్' లక్ష్యంతో ఈ ఆపరేషన్ **2009** జులై, ఆగస్టుల నుంచీ ప్రారంభమైంది. దీని ప్రారంభానికి ముందు కేంద్ర గృహ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై **2009** జూన్‌లో పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌గఢ్‌లో ప్రారంభించిన సైనిక ఆపరేషన్‌ను గ్రీన్ హంట్ దాడులకు స్ప్రింగ్ బోర్డుగా ప్రకటించాడు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడుల నిమిత్తం అన్ని రాష్ట్రాలలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లను కమాండో బలగాలతో ఏర్పర్చుకున్నారు. కేంద్ర అర్ధసైనిక బలగాలలో నుంచీ ఎంపిక చేసిన శక్తులతో కోబ్రా కమాండోలను ఏర్పర్చారు. ఈ ప్రత్యేక బలగాలను ఒక దగ్గర గ్రేహౌండ్స్ అంటే మరో దగ్గర హాక్ ఫోర్స్,



ఆకాశ దాడికి అఘమేఘాలపై ఏర్పాట్లు

ఇంకో దగ్గర జాగువార్, మరో చోట స్కార్పియాన్ అంటూ అతి ప్రమాదకరమైన సరీసృపాల, మృగాల, జంతువుల పేర్లు పెడుతూ ఆ తరహాలోనే ఆ బలగాలను తయారు చేస్తున్నారు. ఈ బలగాలే కాకుండా దాదాపు 75 వేలకు పైగా కేంద్ర అర్ధ సైనిక బలగాలను తాము ఎంపిక చేసుకున్న 34 జిల్లాల్లో మోహరించారు. సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి, బిఎస్ఎఫ్ మొదలైన అర్ధసైనిక బలగాలను మోహరించారు. వీటన్నింటికీ కౌంటర్ గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణను ఇవ్వడానికి దేశవ్యాప్తంగా అనేక ట్రేనింగ్ స్కూల్స్‌ను తెరస్తున్నారు. వీళ్లందరికీ ఏకె, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, మోర్టార్‌లు, ఆధునిక గ్రెనేడ్లు, నైట్ విజన్లు, ఇంకా రకరకాల ఆయుధాలు సమకూరుస్తున్నారు. వీరి ప్రయాణాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఎం.పి.వి. (మందుపాతర నిరోధక వాహనాలు)లను పెద్దసంఖ్యలో సమకూరుస్తున్నారు. మావోయిస్టు వుద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నీ 'భద్రతా' బలగాల సత్వర తరలింపు కోసం అవసరమైనన్ని హెలికాప్టర్లను సమకూర్చుకుంటున్నాయి. ఇవే కాకుండా త్వరలోనే రాష్ట్రీయ రైఫిల్స్ దిగుతుందంటూ వేడి వేడిగా చర్చలు యేణ్ణర్థంగా సాగుతున్నాయి. కాగా 2011 మే 31 నాడు భారత సైన్యం గెరిల్లా శిక్షణా కేంద్రం నిర్మాణం పేరుతో దండకారణ్య నడిబొడ్డున ఉన్న మాడ్ కొండల్లో పాదం మోపింది. ఇప్పటికే మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో వైమానిక దాడులకు రంగం సిద్ధమైంది. జగ్దల్‌పూర్‌లో, కోరాపుట్‌లో బ్రిగేడ్ స్థాయిలో భారత సైన్యాలను నిలిపి ఉంచడానికి చురుగ్గా తయారీలు సాగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ పట్టణ సమీపంలో సైనిక సెల్ హెడ్‌క్వార్టర్స్ నిర్మాణానికై వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. రాజనాంద్‌గావ్, నాగపూర్, జగ్దల్‌పూర్, గడ్చిరోలిలలో విమానాశ్రయాల నిర్మాణానికీ, ఆధునీకీకరణకు నిర్ణయాలు జరిగాయి. రాజనాంద్‌గావ్‌లో ఎయిర్ బేస్ నిర్మాణానికీ పూనుకుంటున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో గల అహిరిని 2009 చివర్లో పోలీసు జిల్లాగా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌ను 2010లో పోలీసు జిల్లాగా ప్రకటించారు. ఐపిఎస్ అధికార్ల నియామకం ఎక్కువ సంఖ్యలో జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికనా చేపడుతున్న మార్పులను చూస్తుంటే ఈ పుస్తకం వెలుగు చూసే నాటికి ఇంకా ఎన్నెన్ని మార్పులు ముందుకు వస్తాయో చూడాల్సిందే!

యావత్తు దండకారణ్యంలో ఈ దశాబ్దంలో అనేక నూతన పోలీస్ స్టేషన్లనూ, క్యాంపులనూ నెలకొల్పారు. కార్పెట్ సెక్యూరిటీని బీజాపూర్, దంతెవాడల నుంచీ అన్ని ప్రాంతాలకూ విస్తరించి పటిష్టం చేశారు. పోలీస్ స్టేషన్లను అతివేగంగా ఫోర్టిఫైడ్ చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలను ఉపగ్రహాల ద్వారా సర్వే చేస్తున్నారు. మొత్తం భూభాగాన్నీ కెమెరాలలో బంధించి ప్రత్యేక అధ్యయనాలు చేస్తున్నారు. పిఎల్‌జిఏ దాడుల్లో పెద్దయెత్తున అర్ధసైనిక, పోలీసు బలగాలు దెబ్బతిన్న ఘటనలను సైనికాధికారులు చాలా కాలంగా ప్రత్యేకంగా పరిశీలించి సమీక్షలు చేస్తున్నారు. రాష్ట్ర-కేంద్ర పోలీసు బలగాల సమన్వయం కోసం జాయింట్ కమాండ్లను ఏర్పరుస్తూ దాడులను కొనసాగిస్తున్నారు. మొత్తంపై మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో జరుగుతున్న సైనిక దాడులలో ఇప్పటికే భారత సైన్యం జోక్యం పెరిగింది. ఇదంతా చాలా దీర్ఘదృష్టితో, వ్యూహాత్మక అంచనాలతోనే భారత సైన్యం చేస్తోందనేది మరువకూడదు. భారతదేశంలో

ఇంత నిలకడగా (కన్సిస్టెంట్‌గా), దృఢంగా, రాజీలేకుండా, ఎన్ని నష్టాలు, ఓటములు ఎదురవుతున్నా మళ్లీ, మళ్లీ కోలుకుంటూ సుదీర్ఘకాలంగా వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధంలో నిమగ్నమై ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగివస్తోన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)తో వ్యవహరించడం భారత పాలకవర్గాలకు ఏమాత్రం ఆషామాషి వ్యవహారం కాదనే అవగాహనతోనే అది గంభీరంగా ఉంది. ఇక్కడ మోహరించిన బలగాలకు ప్రత్యేక శిక్షణ, సన్నిహిత గైడెన్స్ ఇస్తూ భారత సైన్యం ఇక్కడి పరిణామాలన్నింటినీ చాలా కాలంగా ఎంతో శ్రద్ధతో పరిశీలిస్తూ వ్యూహాత్మక దృష్టితోనే అధ్యయనం చేస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తన పోలీసు బలగాల సంఖ్యను 45 వేలకు పెంచింది. త్వరలో 60 వేలకు పెంచనున్నట్టూ ప్రకటించింది. పోలీసులలో స్థానిక ఆదివాసీ యువతను ఎక్కువ సంఖ్యలో భర్తీ చేసుకోవడానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఆదివాసీలతోనే కోయ కమాండో లాంటి బలగాలను తయారు చేసి కరుడు గట్టిన సిపాయిలుగా మల్చడానికి పూనుకుంటున్నారు. అయితే వీళ్లంతా సల్వాజుడుం సృష్టించిన ఎస్‌పిఓలలో నుండే ఎంపికై వచ్చినవారేనన్న విషయాన్ని చూస్తేనే వీళ్లు ప్రజల పట్ల ఎంత ఫాసిస్టుగా వ్యవహరిస్తారో అర్థమవుతుంది. వీరిలో మెజార్టీ వ్యక్తులు స్థానిక భూస్వామ్య, పెత్తందారీ, లంపెన్ శక్తులకు చెందిన వారే. వీరిలో కనీసం మూడవ వంతు మనుషులు విప్లవోద్యమం శిక్షించిన కుటుంబాల నుంచీ వచ్చినవారై ఉండి దోపిడీవర్గ దాష్టీకం నిలువెల్లా నిండినవారై వున్నారు. గడ్చిరోలిలో చాలా కాలంగా (1991 నుంచీ) కొనసాగుతున్న క్రాక్ కమాండోస్ (సి-60) ఇదే విధంగా తయారయ్యాయి.

మావోయిస్టు ఉద్యమ ప్రాంతాన్ని రెడ్ కారిడార్‌గా వ్యవహరిస్తున్నారు. భాజపా నాయకత్వంలోని ఎన్‌డిఏ కాలంలో పశుపతి (భారత సరిహద్దులో గల నేపాల్‌లోని దేవస్థానం) నుంచీ తిరుపతి వరకు గల భూభాగాన్నీ తనదైన శైలిలో రెడ్ కారిడార్‌గా పేర్కొంది. దీనిని ఇంతగా ప్రచారం చేయడం వెనుక ఈ ప్రాంతానికి గల జియో పొలిటికల్, ఆర్థిక ప్రాధాన్యతలను తప్పనిసరి అర్థం చేసుకోవాలి. ఒకటి : ఈ ప్రాంతం దక్షిణ, తూర్పు భారతదేశాలను మధ్య భారతం గుండా కలుపుతోంది. రెండు : ఈ ప్రాంతం దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు కలిగి ప్రజా సైన్య నిర్మాణానికీ, ప్రజాయుద్ధ నిర్వహణకూ దేశంలో చాలా అనుకూలమైన వ్యూహాత్మక ప్రాంతాలలో ఒకటిగా ఉంది. మూడు : ఇటు దక్షిణాదిలో అటు తూర్పునా సుదీర్ఘ కాలంగా ప్రజలు వ్యవసాయ విప్లవ రాజకీయాలతో మమేకమై ఉన్నారు. ఈ ప్రాంతంలో ప్రాథమిక స్థాయిలో ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికార సంస్థలు ఏర్పడుతున్నాయి. నాలుగు : ఈ ప్రాంతంలో గణనీయమైన సంఖ్యలో దళిత, ఆదివాసీలు ఉన్నారు. ఐదు : ఈ ప్రాంతం అపారమైన ప్రకృతి సంపదలతో తులతూగుతోంది. ఆరు : ఈ ప్రాంతంలో అనేక బేసిక్ పరిశ్రమలు, పారిశ్రామిక కార్మికవర్గం ఉంది. ఇవన్నీ విప్లవోద్యమానికి చాలా అనుకూలమైన అంశాలనీ పాలకవర్గాలకు తెలియంది కాదు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తన మౌలిక దస్తావేజులలో ఒక్కటైన వ్యూహం-ఎత్తుగడలలో ఏం రాసుకుందో దేశంలోని ప్రముఖ న్యాయవాదులలో ఒకడిగా పేరు పొంది, తీవ్ర అపఖ్యాతిపాలైన అమెరికా విద్యుత్తు సంస్థ ఎన్‌రాన్‌కు ముందు వకీలు సేవలు అందించి, ఆ తర్వాత అంతర్జాతీయ

మైనింగ్ వ్యాపారంలో అతి దుర్మార్గంలో అందెవేసిన చేయిగా నిల్చిన బ్రిటన్‌కు చెందిన వేదాంత కార్పొరేషన్‌లో బోర్డు మెంబర్‌గా వ్యవహరించి, మొదట యుపిఎలో భారత ఆర్థిక మంత్రిగా సామ్రాజ్యవాదులకు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు నమ్మకమైన సేవలు చేసి గత మూడేళ్లుగా కేంద్ర గృహమంత్రిగా వ్యవహరిస్తోన్న పళనిప్పన్ చిదంబరంకు తెలియనిది కాదు. ఆయన పదే పదే ఈ సమస్యను పార్లమెంటులోనే ఉటంకిస్తున్నాడు. పోతే, ఒడిషా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు పశ్చిమ బెంగాల్‌లలోని ఖనిజ సమృద్ధిలలో రానున్న కొద్ది సంవత్సరాలలో 300 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులను పెట్టడానికి దేశ, విదేశీ ఘరానా కార్పొరేట్ శక్తులు సిద్ధంగా ఉన్నాయనీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (భారత లోహ సంస్థ) పేర్కొంది. ఖనిజ రంగంలో 1997లో 50 శాతం విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడులను ఆమోదించిన భారత ప్రభుత్వం 2006 వచ్చే సరికి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తోంది. దేశంలో చట్టబద్ధ తవ్వకాల కన్నా చట్టవ్యతిరేక తవ్వకాలే అత్యధికంగా సాగుతున్నాయి. ఈ మైనింగ్ మాఫియాతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు భారీ ముడుపులు ముడుతుంటాయి. పీటముడి ఒప్పందాలు సరేసరి! ఈ రంగం ఆర్జిస్తున్న భారీ లాభాలు పెద్దెత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోన్నాయి. ఈ ప్రాంతంపై జరుగుతున్న బహుముఖ దాడికీ ఇవన్నీ కారణాలే. ఈ పెట్టుబడుల ఫలితంగా ఈ ప్రాంతంలో విస్థాపన సమస్య విస్ఫోటనంలా బద్దలవుతోంది. ఈ వైరుధ్యం పరిష్కారానికై దోపిడీ శక్తులు ఫాసిస్టు యుద్ధాన్ని ఈ ప్రాంతంపై రుద్దితే పీడిత ప్రజల పక్షాన నిలిచి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేస్తోంది. రాష్ట్రాల పోలీసులు, కేంద్ర అర్ధసైనిక బలగాలను కలిపి దాదాపు మూడు లక్షలకు పైగా బలగాలను తాము 'రెడ్ కారిడార్'గా పేర్కొంటున్న భారత పాలకవర్గాలు ఈ ప్రాంతంలో మోహరించాయి. ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలనీ, తమ నియంత్రణలోనే ఉంచుకోవాలనీ ఆ క్రమంలో అక్కడ నిర్మాణాత్మక కార్యక్రమాలు లేదా వాళ్ల మాటల్లో 'అభివృద్ధి'* కార్యక్రమాలు చేపట్టాలనీ 'హోల్డ్-కంట్రోల్-బిల్డ్/డెవలప్‌మెంట్' నినాదాన్ని ఎత్తిపడుతూ పూర్తిగా కేంద్రీకరించారు. 'మార్జాల స్వప్నాలు మీగడ మీదే' అన్నట్లు బడా పెట్టుబడి ఆ ప్రాంతాన్నీ, ఆదివాసీ ప్రజలనూ కబళించనుంది. దీన్ని అడ్డుకోవడమే ఈనాడు ఈ ప్రాంత ప్రజల, ఈ దేశ ప్రజల, కార్మికుల, కర్షకుల, ఉద్యోగుల, ప్రజాస్వామికవాదుల, దేశభక్తుల, విద్యార్థుల, మేధావుల, ఆదివాసీ ప్రజాహితాభిలాషుల, రచయితల,

---

* *రమణ్‌సింగ్ ప్రభుత్వం 2012-13 కోసం బస్తర్ అభివృద్ధి పేరుతో రూ. 520 కోట్లు కేటాయించింది. ఇందులో సగానికి పైగా అంటే, రూ.330 కోట్లు రోడ్లకే కేటాయిస్తున్నది. ఇందులో సగం మాత్రమే అంటే రూ. 115 కోట్లు ప్రజా వైద్యానికి వెచ్చిస్తారట. ఈ సగంలో మూడవ వంతు మాత్రమే అంటే రూ. 40 కోట్లు మాత్రమే ప్రజల విద్యకు ఇస్తారట. వీటన్నింటి కంటే దిగదుడుపు కేటాయింపులు ప్రజల మౌలిక జీవన రంగమైన వ్యవసాయానికి ఇస్తున్నారు. అక్షరాలా రూ. 5 కోట్లే అంటే ఒక్క శాతం మాత్రమే ఇక్ష్వాకుల కాలం నాటి ఆదివాసీ వ్యవసాయాన్ని ఉద్ధరించడానికి ఇస్తారన్నమాట. ఇదీ వీళ్ల అభివృద్ధి నమూనా.*



కోయ కమాండోల దాష్టీకానికి ఛిద్రమవుతున్న పల్లె జీవితాలు

కళాకారుల, పాత్రికేయుల తదితర అన్ని సెక్షన్ల ప్రజల, ప్రజాసంఘాల, పోరాట సంస్థల ముందున్న ప్రధాన కర్తవ్యంగా ముందుకు వచ్చింది. దేశ 'స్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమత్వాన్నీ' అమ్ముకుంటున్న దారుణ స్థితికి దిగజారిన భారత పాలకవర్గాల దివాళాకోరు ఆర్థిక, రాజకీయ విధానాలతో పోరాడి వాటిని ఓడించడానికి దృఢసంకల్పంతో సిద్ధం కావల్సిన సమయం యిది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో కమ్యూనిస్టు విప్లవోద్యమాలనూ, జాతీయ ప్రజాస్వామిక

విప్లవోద్యమాలనూ అతి క్రూరంగా అణచివేయడానికి బ్రిటిష్ వలసవాదులు 'స్ట్రాటజిక్ హామ్లెట్' పద్ధతిని ముందుకు తెచ్చారు. పోరాట ప్రాంతాలలో దానిని నేటికీ ఒక సైనిక పద్ధతిగానే అమలు చేస్తున్నారు. ఇక్కడ తమ 'ఆజాద్' కోసం గత ఆరు దశాబ్దాలకు పైగా పోరాడుతున్న ఉత్తరాన కాశ్మీరీయులను గానీ ఈశాన్యానా ఏడుగురు అక్కచెల్లెలను గానీ అణచివేయడంలో భారత పాలకవర్గాలు సైనిక పద్ధతుల్లో భాగంగా స్ట్రాటెజికల్ హామ్లెట్లను ఏర్పరుస్తున్నాయి. అదే విధంగా గత నాలుగేళ్ళుగా దండకారణ్యంలో టాటా, ఎస్సార్ లాంటి ఘరానా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం విశాల భూఖండంలోని ఆదివాసీ ప్రజలను నిరాశ్రయులను చేసి స్ట్రాటెజికల్ హామ్లెట్‌లలోకి తరలించారు. వాటికి ముద్దుగా సహాయ శిబిరాలు అని నామకరణం చేశారు. ఈ హామ్లెట్‌లలో అతి నికృష్టంగా బతుకులీడుస్తున్న ఆదివాసులు తమ పోరాటం ద్వారా వాటి నుంచీ విముక్తి సాధించినది బహుశ దండకారణ్యంలోనే జరిగిందేమో! ఇలాంటి గొప్ప విజయాలను వమ్ము చేయడానికి తిరిగి దోపిడీ పాలకవర్గాలు పూనుకుంటున్నాయి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా మరోసారి స్ట్రాటెజిక్ హామ్లెట్లను ముందుకు తేవడానికి ప్రయత్నాలు చురుగ్గా సాగుతున్నాయి.

ఆపరేషన్ గ్రీన్ హంట్ సైనిక దాడులు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రజలపై సామూహిక హత్యాకాండ పెచ్చరిల్లింది. సల్వాజుడుం సృష్టించిన నరసంహారం సమయంలో పోలీసులు 2007లో పొంజేర్‌లో మొదటి విడత ఐదుగురినీ, రెండో విడత ఆరుగురినీ మొత్తం 11మందిని గ్రామీణ ఆదివాసీ రైతాంగాన్ని మూకుమ్మడిగా అతి పాశవికంగా హత్య చేసిన ఘటన రాష్ట్రంలోనే సంచలనాన్ని సృష్టించింది. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలోకి చొచ్చుకవచ్చిన ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ పోలీసులు కంచాలలో 2008 మార్చిలో 18 మంది విప్లవకారులను అత్యంత మోసపూరితంగా కాల్చిచంపాయి. ఆ తర్వాత 2009 జనవరి వచ్చేసరికి సింగారంలో 18 మంది ఆదివాసీ స్త్రీ-పురుషులను పోలీసులు దారుణంగా హత్య చేశారు. ఈ హత్యాకాండను ఖండిస్తూ దంతెవాడలో నాలుగు వేల మంది ప్రజలు ప్రదర్శన జరిపారు. ఇవన్నీ సల్వాజుడుం సమయంలో జరగగా, వీటిని మించి ఆపరేషన్ గ్రీన్ హంట్ ఉత్పాతాలు కొనసాగుతున్నాయి.

2009 సెప్టెంబర్ 17న గగన్‌పల్లిలో పసుల కాసుకుంటున్న 60 ఏళ్ల ముసలి ముచాకి దేవాను పోలీసులు చంపిన తీరు మధ్యయుగాలను మరిపిస్తున్నది. ఆయన్ని ఒక చెట్టుకు వేలాడదీసి కింద నూనె సలసలా మరగబెట్టి ఆయన మీద పోశారు. ఆ తర్వాత ఆయన మీద నీళ్లు పోశారు. దేవా శరీరం కాలిపోయింది. అంత శాడిస్టులుగా వ్యవహరించిన పోలీసుల నుంచీ వైద్యం ఆశించటం పిచ్చివాళ్లకు కూడా సాధ్యం కాదేమో! అదే రోజు అక్కడే గగన్‌పెల్లిలో 70 సంవత్సరాల దూది ముయే అనే వృద్ధురాలిని రొమ్ములు కోసి అతి దారుణంగా హత్య చేశారు. అక్కడే 25 ఏళ్ల మడావి దేవా అనే యువకున్ని చెట్టుకు కట్టేసి మూడు తూటాలు కాల్చి తల తెగ్గోశారు. ఇంత దారుణంగా హత్య చేయడం కరుడు కట్టిన శిక్షణ లేకుండా బహుశా సాధ్యమే కాదేమో! తిరిగి అక్టోబర్ వచ్చేసరికి గొంపాడ్ హత్యాకాండలో ఇండ్లన్నీ తగులబెట్టి

పరిసర గ్రామాలకు చెందిన 12 మందిని హత్య చేశారు. ఈ ఘటనలన్నీ అత్యంత దారుణంగా జరిగాయనీ ఏ మావోయిస్టులో అనడం లేదు. పియుసిఎల్ (ఛత్తీస్‌గఢ్), పియుడిఆర్ (ఢిల్లీ), వనవాసీ చేతనా ఆశ్రం - దంతెవాడ, హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ - ఛత్తీస్‌గఢ్, ఏక్షన్ ఎయిడ్ - ఒడిషా, మన్నా అధికార్ - మల్కన్‌గిరి, జిల్లా ఆదివాసీ సంఘ్ - మల్కన్‌గిరి లాంటి సంఘాలు ఘటనా స్థలాన్ని చూసి ప్రజలను కలిసి తయారు చేసిన నిజనిర్ధారణ రిపోర్టు చెప్పుతున్నది. 2010 ఫిబ్రవరి వచ్చేసరికి తూర్పు బస్తర్ డివిజన్‌లోని ఓంగ్‌నార్‌లో 2010 ఫిబ్రవరి 7 నాడు ఐదుగురు యువతీ యువకులను చుట్టుముట్టి కాల్చిచంపారు. అదే నెలలో రెండవ వారంలో భైరంగఢ్ బ్లాక్‌లోని తాకిలోడ్‌పై అర్ధరాత్రి పోలీసులు దాడి చేసి ఏడుగురు రైతులను అతి దారుణంగా కాల్చిచంపారు. ఇలా ఈ యేణ్ణర్థం కాలంలో ఆపరేషన్ గ్రీన్ హంట్ బలగాలు దాదాపు 200 మంది ప్రజలను అతి దారుణంగా హత్య చేశాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని కోకా వద్ద 2010 అక్టోబర్‌లో సవరగావ్ బడిపిల్లలను కూడా వదలకుండా హాస్టల్ మీద పోలీసులు రాకెట్‌లతో దాడి చేసి ముగ్గురు చిన్నారి బడి పిల్లలను హత్య చేసి దాదాపు అంతకు రెట్టింపు సంఖ్యలో పౌరులను ఐటిబిపి పోలీసులు గాయపర్చారు. ఈ దారుణాన్నీ మావోయిస్టులపైకి నెట్టి ప్రజలను పక్కతోవ పట్టించారు. 2010 డిసెంబర్‌లో దంతెవాడ జిల్లా జేగుర్‌గుండ ప్రాంతంలోని మెట్టగూడెం గ్రామం వద్ద తొమ్మిది మంది సిలింగేర్ ప్రజా మిలీషియా కార్యకర్తలను గ్రీన్ హంట్ బలగాలు చుట్టుముట్టి కాల్చి చంపి మావోయిస్టులను కాల్చి చంపామనే కట్టుకథను మీడియాకు నిసిగ్గుగా విడుదల చేశారు. ఇలాంటి కట్టుకథలు సృష్టించడంలో డీఐజీ కల్లూరి మహా చతురుడు. ఆయనకు గురువు డీ.జీ.పీ. విశ్వరంజన్. వాళ్ల ప్రియ శిష్యగణం స్పెషల్ పోలీసు అధికారులు. 2010 ఆగస్టు 4 నాడు కుత్రెం గ్రామాన్ని అర్ధసైనిక బలగాలు చుట్టుముట్టి ఆ గ్రామ రైతైన కుంజం జోగాల్‌ను అతి కిరాతకంగా ఊళ్లో యావత్తు గ్రామస్థుల ముందు హత్య చేయగా కల్లూరి గారు ఈ ఘటనకు మసాలాలు దట్టించి పిఎల్‌జిఏ గెరిల్లాలకూ, తన బలగాలకూ మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరుగుతున్నట్టు చిత్రించి మీడియా కట్టుకథలతో సంచలనం సృష్టించాడు. ఇలాంటి అవాస్తవాలు, అభూత కల్పనలు ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇలాంటి హత్యాకాండలు ఆగడమే లేదు. ఇంతటి దారుణాలకు ఒడిగడుతున్న పోలీసులు మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల నియంత్రణలో ఉన్న 40 వేల చదరపు కిలోమీటర్ల భూభాగం నుంచీ పదివేల చదరపు కిలోమీటర్లను స్వాధీనం చేసుకోగలిగామనీ, ఆపరేషన్ గ్రీన్ హంట్ అపూర్వ విజయాలు సాధిస్తోందనీ, ఛత్తీస్‌గఢ్ డీజీపీ విశ్వరంజన్ గత ఆరు మాసాలుగా (2010 అగస్టు నుంచీ) రంకెలు వేస్తున్నాడు.

గ్రీన్ హంట్ దాడులు మొదలయ్యాక కాంగ్రెస్ గూండాలు, భాజపా గుండాలు వారి సహోదరులైన ఎస్పీఓలతో, పోలీసులతో కలిసి చేయని ఫాసిస్టు ఆగడాలు అంటూ లేవు. కాంగ్రెస్ గూండాలకూ మహేంద్ర కర్మ తనయుడు ఛవీంద్ర కర్మ నాయకత్వం వహిస్తున్నాడు. 'తండ్రిని మించిన తనయుడు' అనే ప్రమాణ పత్రం పొందే దురాశతో ఆయన ఏకంగా దేశంలోని ప్రముఖ మేదావులనూ, ప్రజాస్వామికవాదులనూ, గాంధీవాదులనూ సైతం వదలకుండా అవమానించడం, దాడులు చేయడం కొనసాగిస్తున్నాడు.

గాంధేయవాది హిమాంశు కుమార్‌కు చెందిన వనవాసీ చేతనా ఆశ్రంపై పోలీసులు దాడికి 2009లో దిగి దాన్ని కూల్చడాన్ని ఖండిస్తూ దంతెవాడలో పూర్తి గాంధేయ పద్ధతుల్లో నిరసన ర్యాలీ నిర్వహించడానికి దిగిన నర్మదా బచావో ఆందోళన్ నేత్రి మేధాపాట్కర్ సహా అనేక మంది గాంధేయవాదులపై కోడిగుడ్లు, టమాటాలతో ఆయన గుండా వాహిని దాడి చేసి అవమానించారు. పలు మహిళా సంఘాల కార్యకర్తలను దాదాపు 30 మందిని బస్తర్‌లోకి అడుగుపెట్టనీయకుండా కొండగాం సరిహద్దుల నుంచీ వెనక్కి వెళ్లేలా పోలీసులు తీవ్ర ఒత్తిడి చేశారు. ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో జరుగుతున్న ఘాతుకాలను తెలుసుకోవడానికి జగ్దల్‌పూర్‌కు చేరిన దేశంలోని మేధావి ప్రముఖులను కాంగ్రెస్, భాజపా గూండాలు అవమానించి వెనక్కి పంపారు. వీళ్ల అరాచకాలు ఆదివాసుల బస్తర్ మూలకే పరిమితం కాలేదు. సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ బిలాస్‌పూర్‌లో బార్ అసోసియేషన్ వాళ్ల ఆహ్వానంపై మాట్లాడడానికి దిగితే నిముషాల్లో గూండాలు హైకోర్టు ఆవరణలోకి చేరిపోయి వాళ్లందరినీ అవమానిస్తూ వారి సభను అడ్డుకున్నారు. ఈ రకంగా రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి నిరసన ఎంత ప్రజాస్వామ్యయుతంగా, గాంధేయ పద్ధతుల్లో వ్యక్తం చేసినా సహించని దుస్థితికి ప్రతి క్షణం గాంధీని స్మరించే ప్రధాన బూర్జువా రాజకీయ పార్టీలు దిగజారాయి. ఖాకీలు యూనిఫారంలో, పౌర దుస్తుల్లో వాటి ఆదేశాలు తమదైన బాణీలో పాటిస్తూ పరిస్థితులను చరమస్థాయికి తీసుకెళుతున్నారు. నిజానికి వీటి గుండావాహినిలో సంఖ్యలో ఉండేది పౌర దుస్తుల్లోని ఎస్పీఓలే. ఛత్తీస్‌గఢ్‌లో ఎలాంటి అభివ్యక్తి స్వాతంత్ర్యం లేకుండా పోయింది. పరిస్థితులు ఎంత ఫాసీజీకరణ వైపు దారితీస్తున్నాయో తెలుసుకోవడానికి వినాయక్ సేన్ జమానత్ కేసులో చట్టపరంగానే హైకోర్టు తీర్పును పరిశీలించడానికి వివిధ యూరోపియన్ దేశాల నుంచీ వచ్చిన ఎనిమిది మంది న్యాయ కోవిదులను కోర్టు పరిసరాల్లోకి రానివ్వం అంటూ బిలాస్‌పూర్‌లో శివమెత్తి దుష్టశక్తుల వ్యవహారం సరిపోతుంది. ఇది 2011 జనవరి 24 నాటి ఘటన. అంటే మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26కి సరిగ్గా రెండు రోజుల ముందరి ఘటన ఇది. దంతెవాడ జిల్లాలో దాదాపు గత రెండు దశాబ్దులుగా తనదైన తీరులో ఆదివాసీల మధ్య జీవిస్తూ, స్వచ్ఛంద సంస్థ 'వనవాసీ చేతనా ఆశ్రం'ను నడిపిస్తూ, సల్వాజుడుం ఘాతుకాలను వ్యతిరేకించిన పాపానికి హిమాంశు కుమార్ అనే గాంధేయవాదిని ఈ గుండాలు బృహత్ బస్తర్ ఛాయలలోకే రాకుండా చేశారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో అంధవిశ్వాసాల వ్యతిరేక ఉద్యమ నాయకుడు శైలేష్ దాదాజీ వాక్డెను 2010 డిసెంబర్‌లో అకారణంగా అరెస్టు చేశారనీ ఆయన సహచరి విలపిస్తూ మీడియా ముందుకు వచ్చింది. చివరకు పోలీసుల దుర్మార్గం ఎంతకు దిగజారిందంటే వాళ్ల చర్యలు చూసి గడ్చిరోలి సహాయక కలెక్టర్ రాజేంద్ర ఖాన్‌ఫడే 'వీళ్లకన్నా నక్సలైట్లే నయం' అనడంతో 'రాజ్యం' ఆయనపై కక్ష గట్టి 2011 మార్చ్‌లో చర్య తీసుకుంది. అతి విశాల ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే ఈ దేశంలో, ఆరు దశాబ్దాలు దాటిన 'స్వతంత్ర' భారతంలో ఆదివాసీ ప్రజల పరిస్థితీ, వారి కోసం వారి మధ్య పనిచేస్తున్న వ్యక్తుల, సంస్థల పరిస్థితీ ఆఖరుకు ఉదారవాద అధికారులు అందులో దళిత అధికారుల దుస్థితి ఇంత దారుణంగా ఉందంటే ఈ ప్రజాస్వామ్యాన్నీ, ఈ దేశ స్వాతంత్ర్యాన్నీ బూటకం అనకుంటే

ఇంకేం అనాల్సి ఉంటుంది?

ఆపరేషన్ గ్రీన్ హంట్ ప్రారంభం నుంచీ రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర పోలీసు యంత్రాంగాలు యావత్తు దండకారణ్యంలో ఇన్ఫార్మర్ యంత్రాంగాన్నీ పెంచుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. గ్రామాల నుంచీ తమకు విప్లవోద్యమ కార్యకలాపాల గురించి ఎలాంటి సమాచారం అందడం లేదనే దానితో వాళ్లు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తూ గ్రామీణ వేగులను సృష్టించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. పటిష్టమైన ఇంటెలిజన్స్ యంత్రాంగం లేకపోవడంతో పిఎల్‌జిఏ సైనిక కార్యకలాపాలను పసిగట్టలేకపోతూ తమ పోలీసులు గట్టిదెబ్బలు తింటూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారనీ పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు హైరానా పడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర ఎస్ఐబి మద్దతుతో ఇక్కడి ఎస్ఐబి చేస్తున్న కుట్రలను విప్లవోద్యమం ఏర్పర్చుకున్న ఇంటలిజెన్స్ సంస్థ 'ప్రజా భద్రతా సేవలు' (పీపుల్స్ సెక్యూరిటీ సర్వీస్-పిఎస్ఎస్) ఎక్కడికక్కడే పసిగడుతూ ప్రజల ముందుంచుతున్నాయి. కంచాల, కచలారం, కోహ్కామెట్ట, ఆలెవార, ఆల్‌వేడ, పువ్వార్, కొండపెల్లి, కుమ్మడితోంగ్, ఊసెవాడ లాంటి చోట్ల శత్రువు పటిష్టం చేసుకున్న తన రహస్య సమాచార యంత్రాంగాన్ని పిఎస్ఎస్ బహిర్గతం చేసి చాల మంది నేరస్థులను ప్రజాకోర్టులలో విచారించి శిక్షించింది.

విప్లవోద్యమంలో కొంతకాలం పనిచేసి తర్వాత పోలీసులకు లొంగిపోయి వారికి రహస్య సమాచారం చేరవేస్తున్న వారి ద్వారా ఉద్యమానికి జరుగుతున్న నష్టం చాలా తీవ్రంగా ఉంది. ఇలాంటి వారిలో డికె ఎస్‌జడ్‌సి మాజీ సభ్యుడు రైను, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన వాళ్లు కొందరు పోలీసులకు పూర్తిగా సహకరిస్తున్నారు. విప్లవోద్యమ సరఫరాల యంత్రాంగంలో పనిచేస్తూ 2008 జనవరిలో అరెస్టయిన సుమిత్ పోలీసుల చిత్రహింసలతో వారికి పూర్తిగా లొంగిపోయి ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించాడు. చివరకు కోవర్టుగా మారి విప్లవోద్యమంలో చేరడానికి ప్రయత్నించాడు. కానీ అతడి వాలకాన్ని అర్థం చేసుకున్న పార్టీ అతన్ని పూర్తిగా విచారించి నేరస్థుడనీ కోవర్టుగా మారి ద్రోహానికి తలపడి వచ్చాడనీ తేల్చుకొని అతనికి మరణశిక్ష విధించింది.

విప్లవోద్యమంలో ప్రజలచే శిక్షించబడిన శక్తులను పోలీసులు చేరదీస్తున్నారు. వారికి అనేక రకాల ఆశలు కల్పిస్తూ తమ పెంపుడుకుక్కల్లా వారిని పోషిస్తూన్నారు. తాము నిర్వహించే దాడుల సమయంలో గైడ్లుగా వాడుకుంటున్నారు. వారిని రహస్య సమాచార వాహకులుగా వినియోగించుకుంటున్నారు. వారి ద్వారా వారి బంధుమిత్రులను తమ వలలోకి లాక్కోవడానికి నేరుగా పైస్థాయి అధికారులే ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. వీరి కుటుంబాలను అన్ని విధాలా వాడుకుంటున్నారు. వీరితో తమ అవసరాలు తీరాయనుకున్న తర్వాత వీరి జీవితాలు కుక్కలు చింపిన విస్తరి కన్నా ఘోరంగా తయారవుతున్నాయనడానికి లొంగిపోయిన వాళ్ల కోసం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లలో పోలీసులు కట్టిస్తున్న కాలనీలలో ఉంటున్న అనేక మంది జీవితాలే పెద్ద ఉదాహరణ. లొంగిపోయిన వారిలో చురుకైనవారిని ఇజ్రాయిల్ సహా దేశంలోని పలు కేంద్రాలకు ఇంటలిజెన్స్ శిక్షణ కోసం పంపిస్తున్నారు. ఇలాంటి శిక్షణ పొంది వచ్చిన వారిలో పువ్వార్

(దంతెవాడ జిల్లా) గ్రామస్థుడు మాడవి ఊరాల్ (డగ్గల్) ఒకడు.

2009లో పిఎస్ఎస్ శక్తుల చేత చిక్కి ప్రజల సమక్షంలో డగ్గల్ మరణశిక్ష అనుభవించాడు. ఇలాంటి కరుడుగట్టిన శక్తులను చిన్న చిన్న హంతక ముఠాలుగా తయారు చేసి విప్లవకారులను మట్టుబెట్టే లక్ష్యంతో గ్రామాల్లోకి పంపిస్తున్నారు. ఇలాంటి హంతక ముఠాలు 2010లో కుమిలి, చైతే, మడ్డాల్ సహా అర డజను మంది కామ్రేడ్స్‌ను దారుణంగా హత్య చేశాయి. ఈ ముఠాల కదలికలను పసిగట్టి దెబ్బతీయడానికి ప్రజలు, ప్రజాసంఘాలు, జనతన సర్కార్లు, ప్రజా మిలీషియా, పిఎస్ఎస్ శక్తులు భూంకాల్ వేట[6], ఇతరత్ర పద్ధతులలో ప్రత్యేక క్యాంపెయిన్లు చేపడుతున్నాయి. గతంలో జుడుం రోజుల్లో ఇన్ఫార్మర్లను, కోవర్టులను బహిర్గతం చేయడానికి దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్‌లలో విప్లవ పార్టీ, ఆపరేషన్ జాటల్-1, 2 (ఊడ్చివేత క్యాంపెయిన్)లను చేపట్టి పెద్దసంఖ్యలో అలాంటి ద్రోహులను పట్టుకోగలిగాయి. ప్రజాకోర్టులు వారికి, వారి నేర తీవ్రతను బట్టి శిక్షలు విధించాయి. ఇలాంటి ఘటనలు బయటపడి శిక్షలు విధిస్తూండడంతో పోలీసులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పటిష్టమైన రహస్య సమాచార సేకరణ యంత్రాంగం లేకుండా గెరిల్లాలతో సమరాలకు పూనుకోలేమనీ, యుద్ధాన్ని గెలవలేమనీ, తమ దాడులు గుడ్డి ఎద్దు చేనులో పడ్డట్టుగానే ఉంటూ ఎదురుదెబ్బలు తినే స్థితి తప్పదనీ వాళ్ల సైనిక నిపుణులకు తెలియనిది కాదు కదా! వాళ్లకు శిక్షణనిస్తోన్న అమెరికా ఎఫ్ఐబి వాళ్లు కానీ, వాళ్లు అనుసరిస్తోన్న ఎల్ఐసి విధానాల్లో గానీ బోధించే అతి ప్రాథమికమైన విషయం సి4ఐ గురించే!

ఆపరేషన్ గ్రీన్ హంట్ సైనిక దాడులతో పాటే అతి భయంకరమైన తీరులో ప్రచార యుద్ధాన్ని చేపట్టింది. సాయంత్రం చీకటి పడకముందే ప్రజలు ఎవరి ఇండ్లకు వాళ్లు చేరుకోవాలనీ, అడవిలో అగుపడితే పోలీసులు కాల్చి చంపుతారంటూ కోత్వాళ్లు గ్రామాల్లో చాటింపు వేసి బహిరంగంగా ప్రకటించారు. మావోయిస్టులకు ఎవరు సహకరించినా, ఎవరు మద్దతు తెలిపినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందనీ హెచ్చరించారు. అడవిలో, గ్రామాల్లో గుర్తింపు కార్డులు లేకుండా ఎవరు సంచరించినా పోలీసుల విచారణను ఎదుర్కోవలసి ఉంటుందనడంతో ప్రజలు భయపడిపోయి దగ్గరి పట్టణాల్లోని ఫోటో స్టుడియోల ముందు ఆడ, మగ, పిల్లా పాపలతో బారులు తీరి నిలబడిపోయారు. ఇక అడవిలో గాలింపుల గురించి, తమ తీరొక్క పోలీసుల ప్రతాపాల గురించి, ఇంకా రకరాలుగా వాళ్లు చేసుకున్న ప్రచారం చివరకు వాళ్లకే ఎదురు తిరిగింది. దేశంలోని మేధావులూ, ప్రజాస్వామికవాదులు, హక్కుల సంఘాల వాళ్లూ రంగంలోకి దిగి పాలకుల నీతిమాలిన, ప్రజా వ్యతిరేక మానసిక యుద్ధాన్ని ప్రశ్నించడంతో పాలకులకు దిక్కు తోచని స్థితి ఏర్పడింది. మావోయిస్టులనూ, విప్లవోద్యమాన్నీ అభాసుపాలు చేయడానికి, దానిని ప్రజా వ్యతిరేకమైందిగా, అభివృద్ధి నిరోధకమైందిగా చిత్రిస్తూ కరపత్రాలూ, పోస్టర్లూ, బ్యానర్లూ, రేడియో, టీవీలలో ప్రకటనలు ముమ్మరం చేశారు. అపర చాణక్యుని లాంటి వాళ్లు, సైనిక రంగంలో భారత పాలకవర్గాలకు యావజ్జీవ సేవలందించిన బ్రిగేడియర్ విశ్రాంత డీజీపీ పోన్‌వార్, ప్రకాశ్ సింగ్

లాంటి ఉన్నతాధికారులు సైనిక దృష్టితో బహిరంగ సైకోవార్‌ను కొన్ని విషయాల్లో విమర్శించక తప్పలేదు. ఈలోగా దేశ, విదేశాలలోని అనేక సంస్థలు ప్రజల పక్షాన ప్రధానంగా ఆపరేషన్ గ్రీన్ హంట్ సైనిక దాడుల బాధితుల పక్షాన నిలిచి వాళ్లకు మద్దతు నందించడానికి నడుం బిగించాయి. ప్రపంచంలోని అతిపెద్ద సైన్యాలలో ఒకటైన భారత అర్ధసైనిక బలగాలు ప్రజల మీద విరుచుకుపడడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తూ దానికి వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలనీ పిఎల్‌జిఏకు పిలుపునిస్తూ దేశ, ప్రపంచ విప్లవ పార్టీలనూ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులనూ, సంస్థలనూ, రచయితలనూ, కళాకారులనూ, మేధావులనూ, పాత్రికేయులను, ఆదివాసీ పోరాట సంస్థలనూ ప్రజల పక్షాన నిలవాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఖాకీ యూనిఫారంలలో ఉన్నప్పటికీ పోలీసు, అర్ధసైనిక, సైన్యంలోని సైనికులందరూ రైతు, కూలీ, సాధారణ ఉద్యోగుల బిడ్డలేనంటూ, ప్రజల పైన వారు తమ తుపాకులు ఎక్కుపెట్టవద్దనీ, దోపిడీ వర్గాల కోసం ప్రజలను హతమార్చకూడదనీ పదే పదే విజ్ఞప్తి చేసింది.

భారతదేశంలోని పదుల కొద్ది పోరాట సంస్థలు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఖండిస్తూ రంగంలోకి దిగాయి. అనేక మంది మేధావులు, పౌర హక్కుల సంఘాల కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాతలు, పాత్రికేయులు, మీడియా పర్సన్స్, ప్రజాస్వామికవాదులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, ఆంథ్రోపాలజిస్టులు, విస్థాపన వ్యతిరేక ఉద్యమకారులు ఇలా రకరకాల వ్యక్తులు, సంస్థలు సమీకరించబడినాయి. దేశంలో అభివృద్ధి మీద నిశితమైన చర్చ చోటు చేసుకుంది. సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల అభివృద్ధా! ప్రజల అభివృద్ధా! అనేది చర్చా విషయం అయింది. పాలకవర్గాలు అతి తెలివిగా అభివృద్ధి కోసం 'వార్ ఆన్ టెర్రర్' అంటూ ముందుకు వస్తే ప్రజల పక్షాన నిలిచినవాళ్లంతా దోపిడీ కోసమే 'వార్ ఆన్ పీపుల్'గా దేశ రాజధాని ఢిల్లీలో గొంతెత్తి నినదించారు. అంతేకాదు విదేశాలలోనూ రైతులు, కార్మికులు, విద్యార్థులు, న్యాయవాదులు, మహిళలు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఖండిస్తూ టర్కీ, ఫిలిప్పైన్స్,బ్రెజిల్ దేశాల్లో అలాగే బెర్లిన్, ఫ్రంక్‌ఫర్ట్, లండన్ లాంటి నగరాలలో భారత రాయబార కార్యాలయాల ముందు ప్రదర్శనలు జరిపి తమ తీవ్ర నిరసనను తెలిపారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ సైనిక దాడులకు గురవుతున్న ప్రజల పోరాట సంఘీభావ కమిటీలను నెలకొల్పారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ ఆగడాలను, హత్యాకాండను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి స్వీడన్ ప్రముఖ రచయిత, ప్రజల పక్షపాతి జాన్ మిర్డాల్ 2010 జనవరిలో దండకారణ్యాన్ని సందర్శించి దాదాపు 20 రోజులు ప్రజల మధ్య గడిపాడు. ఆయనతో పాటు పౌరహక్కుల నాయకుడు గౌతం నవలఖా సైతం దండకారణ్యం వచ్చి అక్కడి ప్రజలపై అమలవుతున్న దారుణ మారణకాండను తెలుసుకున్నాడు. ఆ తర్వాత ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ రెండు వారాలు దండకారణ్య ప్రజల మధ్య గడిపి అనేక విషయాలు తెలుసుకోగలిగింది. దేశంలో మున్నెన్నడూ లేనిస్థాయిలో ఒక స్పష్టమైన పోలరైజేషన్ జరుగుతూంది. ఇది విప్లవోద్యమ ఫలితంగానేనని స్పష్టంగా చెప్పవచ్చు. ఈ పరిణామాలను విప్లవ ప్రజా ప్రతిఘటన, ప్రజల ఆత్మరక్షణా పోరాటాల నుంచి ఏమాత్రం విడదీసి చూడడానికి వీల్లేదు.

భారత పాలకవర్గాలు రెడ్ కారిడార్‌గా పేర్కొంటున్న యావత్తు ప్రాంతంలో పిఎల్‌జిఏ బలగాలు ప్రజల పక్షాన జీవన్మరణ పోరాటంలో నిలిచాయి. ప్రజల రక్షణలో నిమగ్నమైన ప్రజా విముక్తి గెరిల్లా సైనికుల ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక తొలిదాడి కోబ్రాల మీదనే జరగడం విశేషం. 2009 సెప్టెంబర్‌లో దక్షిణ బస్తర్‌లోని పాలచెలిమ వద్ద జరిపిన దాడిలో ఆరుగురు కోబ్రాలు మృత్యువాత పడగా మిగిలిన వాళ్లంతా కనీసం గాయపడినవాళ్లనైనా చూడకుండా, తమ వెంట తీసుకెళ్లకుండా బతుకు జీవుడా అంటూ పరుగుపెట్టారు. ఈ దాడి తర్వాత మరిన్ని గట్టిదెబ్బలే గ్రీన్ హంట్ బలగాలు తిన్నాయి. ముకురం, లాహెరి, బడ్‌గాం, కొంగెర, కోకా (సవర్‌గాం)లలో భారత అర్ధసైనిక బలగాలు మున్నెన్నడూ లేనిరీతిలో దండకారణ్యంలో వరుస దెబ్బలు తిన్నాయి. వీటన్నింటిలో ముకరం దాడి చారిత్రాత్మకమైనది. దాదాపు 76 మంది భద్రతా బలగాల సైనికులను పిఎల్‌జిఏ మట్టుబెట్టింది. ఈ దాడులన్నీ, ఈ విజయాలన్నీ ప్రజల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కాగా భారతదేశ గృహమంత్రి చిదంబరం సిగ్గుతో రాజీనామాను ప్రతిపాదించక తప్పలేదు. పోలీసు బలగాల్లో మనోబలం చాలా వరకు దెబ్బతింది. విధి నిర్వహణలో మానసిక ఒత్తిళ్లు, దాడుల్లో అపజయాలు, ప్రాణ నష్టాలు, ప్రజల పట్ల అనుసరిస్తోన్న అమానుష వైఖరి, కుటుంబ సమస్యలు, అధికారుల అణచివేత, అవమానాలు భరించలేక లెక్కింపతగిన సంఖ్యలోనే పోలీసులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ ధోరణి పెరుగుతోంది. కాగా అర్ధసైనిక బలగాల్లో స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. గత ఐదు సంవత్సరాల (2005-10) కాలంలో దేశంలో 44,268 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బంది స్వచ్ఛంద పదవీ విరమణ (విఆర్‌ఎస్)ను కోరుకున్నారు. కాగా అటు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో, ఇటు బృహత్ బస్తర్‌లో విధుల్లోకి రాకుండా పోతున్న పోలీసుల సంఖ్యలో ఏమాత్రం తగ్గుదల లేదు. వీటన్నింటినీ మించి రాష్ట్ర, కేంద్ర బలగాల మధ్యనా ఘర్షణలూ ముందుకొస్తున్నాయి. ముకురం దాడి తర్వాత సిఆర్‌పి డిజిపి శ్రీవాత్సవను బాధ్యతల నుంచీ మార్చగా, ఎస్‌పి అమరేష్ మిశ్రాని బదిలీ చేశారు. 2011 చింతల్‌నార్ దాడి తర్వాత మూడు మాసాలైనా తిరక్కముందే ఛత్తీస్‌గఢ్ డీజీపీ విశ్వరంజన్ కూడా పదవీ బదిలీకాక తప్పలేదు. వారి మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు మీడియా ముందుకు రావడం పెరిగింది. ఇవన్నీ పాలకవర్గాలు పేర్కొంటున్న రెడ్‌కారిడార్‌లో వాళ్లు సృష్టించిన యుద్ధాన్ని ప్రజా విముక్తి గెరిల్లా సైనికులు, ప్రజలు ఎదుర్కొంటూ తిప్పికొడుతున్న ఫలితంగానే ఉత్పన్నమవుతున్నాయన్న విషయాన్నీ నిష్పక్షపాతంగా చెప్పేవాళ్లెవరూ కాదనలేరు. చారిత్రాత్మకమైన ముకరం దాడి తర్వాత ప్రభుత్వం నియమించిన రామమోహన్‌రావు కమిటీ రిపోర్టును సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేసినవాళ్లకు ఈ విషయం సులువుగానే బోధపడుతుంది.

తాము గ్రీన్ హంట్ ఆపరేషన్ ప్రారంభించాక చాలా మంచి ఫలితాలు వస్తున్నాయనీ పదే పదే ఊదరగొడుతున్న డీజీపీ విశ్వరంజన్ మావోయిస్టుల ఆక్రమణలోనున్న 40 వేల చదరపు కి.మీ. భూభాగంలో నుంచీ 10వేల కి.మీ. స్వాధీనం చేసుకున్నామనీ గొప్పగా చెప్పుకుంటున్న నేపథ్యంలో 2011 జనవరి రెండవ వారం నాటికి భారత సైనికాధికారులు తమ బలగాల శిక్షణ కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కేటాయించిన

స్థలాన్ని సర్వే చేయడానికి వచ్చారు. దీనితో అక్కడ భవిష్యత్‌లో ఏం జరగనుందో ఎవరైనా సులువుగానే ఊహించువచ్చు. దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని అణచడానికి గెరిల్లా శిక్షణ కోసం తయారవుతున్న భారత సైన్యం మొదట మాడ్ కొండల్లో భారత సైన్యాలు ఘోరకలిని సృష్టించనుంది. బ్రిటిష్ హయాంలో, వలసవాదుల కాలంలో మాడ్ కొండలపైకి సైన్యాలను పంపి 1910 నాటి ప్రజా తిరుగుబాటు (భూంకాల్ లాడాయి)ను అణచివేశారంటే, తిరిగి వందేళ్ల తర్వాత స్వదేశంలో స్వదేశీ సైన్యాలు తమ సొంత ప్రజలపైకి భారీ ఆయుధాలతో వాళ్ల న్యాయమైన పోరాటాలను అణచడానికి సిద్ధమవుతాయన్నమాట. కానీ, ఆనాడు ఉండింది పరాయి పాలన. ఈనాడో? మాడ్ కొండల్లో తరతరాలుగా నివసిస్తున్న ఒక ప్రాచీన ఆదివాసీ సముదాయాన్ని, వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనాన్నీ విధ్వంసం చేయడానికి తక్షణం పూనుకుంటాయన్నమాట. దీనిని యావత్తు ప్రజానీకం నిర్ద్వంద్వంగా ఖండించాలి. దండకారణ్య ఆదివాసీ ప్రజలకు అండగా నిలవాలి. మాడ్ కొండల్లో నుంచీ భారత సైన్యాల శిక్షణా కేంద్రాన్ని వెనక్కి తీసుకోవాలనే నినాదాన్ని దృఢంగా ముందుకు తేవాలి.

2005 మధ్య నుంచీ ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం పేరుతో ఝార్ఖండ్‌లో సెంద్రా పేరుతో, ఒడిశాలో శాంతి యాత్ర పేరుతో ఫాసిస్టు తెల్ల బీభత్సాన్ని సృష్టించడం, ప్రజల ప్రతిఘటనతో అవి ఓటమి చెందడంతో వెంటనే ఒక సమగ్ర పథకంతో, వ్యూహాత్మక దృష్టితో దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలపై దాడీని ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 2009 జులై-ఆగస్టులో ప్రారంభించారు. దీని వెనుక దేశంలో, అంతర్జాతీయంగా తీవ్రతరం అవుతున్న ఆర్థిక సంక్షోభం పాత్ర చాలా ముఖ్యమైంది. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా 2011 ప్రారంభం నాటికి పెట్టుబడిదారి వ్యవస్థల సంక్షోభ చరిత్రలోనే ఎన్నడెరుగనంతటి తీవ్రస్థాయిలో సంక్షోభంలో కూరుకపోయింది. దాని బడ్జెట్‌లో 40 శాతం ద్రవ్యలోటు ప్రకటితమైంది. అంటే దాదాపు ట్రిలియన్‌న్నర డాలర్లంటున్నారు. దీనికి తోడు గతం నుంచీ కొనసాగుతున్న దాని అప్పుల కుప్ప ఉండనే ఉంది. ప్రపంచంలో అతి పెద్ద ఋణగ్రస్త దేశం అమెరికానే. దాని అప్పు 13 లక్షల కోట్ల డాలర్లంటున్నారు (1,30,50,62,64,60,886.97 డాలర్లు). ఈనాడు ప్రతీ అమెరికా పౌరుడు తన తలపైన దాదాపు 2 లక్షల డాలర్ల అప్పును మోస్తున్నాడు. ఇది ప్రపంచంలో ప్రత్యేకించి అమెరికాలో గత కొద్దికాలంగా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, విపరీతమైన మాంద్యం ఫలితమేనన్నది అందరెరిగినదే. దీన్ని పూడ్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ఒబామా బహిరంగంగా, అతి స్పష్టంగా భారతదేశంతో వర్తకం పెంచుకోవడమే దారి అంటున్నాడు. యూరప్‌లోని అనేక దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రీకు, స్పెయిన్ లాంటి దేశాలు సంక్షోభ సుడిగుండంలో మునిగిపోతున్నాయి. సామ్రాజ్యవాద దేశాల నేతలు వరుసగా భారత పర్యటనలు చేస్తున్నారు. వారి వెంటా పెద్ద సంఖ్యలో కార్పోరేట్ శక్తులూ వుంటున్నాయి. మరోవైపూ భారతదేశంలో ఆర్థిక అభివృద్ధి రేటు 10 శాతం చేరుకొని తీరాలి అంటూ గత కొద్ది సంవత్సరాలుగా భారత ప్రధాని, ఆర్థికవేత్త, ప్రపంచ బ్యాంకు మాజీ సేవకుడు మన్‌మోహనుడు టార్గెట్ వ్యక్తం చేస్తూ వస్తున్నాడు. 2011 నాటికి 9 శాతానికి చేరుకోగలిగామంటూ తన

10 శాతం ప్రగతి లక్ష్యాన్ని పదే పదే సెలవిస్తూనే ఉన్నాడు. మావోయిస్టు కారిడార్‌గా పిలుస్తున్న ప్రాంతంలో గత కొద్ది సంవత్సరాలుగా మూల్గుతున్న పది లక్షల కోట్ల రూపాయల ప్రపంచ పెట్టుబడులను దేశ, ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో పనిలోకి తేవడానికే భారత సైన్యాలకు గెరిల్లా శిక్షణ ప్రారంభమైందన్న వాస్తవాన్ని గుర్తించడం ఇక్కడ చాలా అవసరం. ఈ అంతస్సంబంధాన్ని అర్థం చేసుకోకపోతే సైన్యాల శిక్షణకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడలేరు. ఈ ద్వంద్వాత్మక సంబంధాలను అర్థం చేసుకున్న మేధావులు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, చరిత్రకారులు తదితర ప్రగతిశీల భావాలుకల వారందరూ ఈ విశాల మావోయిస్టు ఉద్యమ ప్రాంతానికీ, ఢిల్లీకీ, అమెరికాకూ, యూరప్‌కూ గల ఎం.ఒ.యు. కారిడార్ ప్రాముఖ్యతను గుర్తించే సైనిక బలగాల మోహరింపును వ్యతిరేకిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితులలో ప్రజలు ధైర్యంగా ఉద్యమించక తప్పదు. వారు తమ అస్థిత్వం కోసం, 'జల్-జంగల్-జమీన్-జనవాద్' కోసం జీవన్మరణ పోరాటం సాగించి అనేక నిర్బంధాలను ఓడించారు. ఆ బాటలోనే ప్రజలు మళ్లీ మళ్లీ పోరాడి తీరుతారు. వారు పోరాడి తమ అస్థిత్వాన్నీ, ఆత్మగౌరవాన్నీ నిలుపుకుంటారు. అపార ప్రాకృతిక సంపదలను కాపాడుకుంటారు.

## 2 (డి) ఆదివాసీలు - ఖైదు జీవితాలు

దండకారణ్య విప్లవోద్యమంపై తొలి నుంచీ పోలీసు దాడులు జరుగుతూనే ఉన్నాయి. రైతాంగాన్ని (స్త్రీ-పురుషులను) పెద్దెత్తున అరెస్టు చేసి జైలు పాలు చేయడం కొనసాగుతూనే ఉంది. మైనర్ బాల, బాలికలను కూడా కటకటాల వెనక్కితోస్తూ వాళ్ల పసి బాల్యాన్ని చిదమడం రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. జైలు పాలైన కష్టజీవులు ఆదివాసీలు ఆ నరక కూపాల్లో అనుభవించే యాతనలు వర్ణనాతీతం. విచారణలోనున్న ఖైదీలతో జైళ్లలో ఎలాంటి చాకిరీ చేయించగూడదు. కానీ పొద్దస్తమానం ఆ జైళ్లలో గొడ్డు చాకిరి చేస్తే తప్ప కనీసం వాళ్ల ఆకలి తీరని పరిస్థితి వుంటోంది. జైలు కిచన్‌లో పని చేయకుంటే ఆదివాసీ కష్టజీవులకు మాన్యువల్ ప్రకారం ఇచ్చే 700 గ్రాముల అన్నం ఏ పేగుకూ సరిపోదు. కానీ అవినీతి అధికారుల మూలానా అదైనా దొరికేదెక్కడా! జైలు మాన్యువల్ కొలతల ప్రకారమైనా జైలు బాధితులకు తిండి సమకూర్చని జైలు అధికారుల హింసను తట్టుకోలేని ఆదివాసీలు చివరకు వంట గంజులు తోమో, వాళ్లు చెప్పిన ఇతర వెట్టి పనులు చేసో పొట్ట నింపుకోవడానికి సిద్ధమవుతుంటారు.

ఆదివాసీ ప్రజలు అన్ని రకాల ప్రభుత్వ ఫాసిస్టు చట్టాల హింసకు బలవుతున్నారు. టాడా, పోటా లాంటి కేంద్ర నల్లచట్టాలే కాకుండా రాష్ట్రాల పరిధిలో రూపొందిన నల్లచట్టాలు కూడా వారిని హెచ్చుగానే హింసిస్తున్నాయి. మాకోకా, ఛత్తీస్‌గఢ్ ప్రజా రక్షణ చట్టం మొదలగునవి రైతాంగాన్ని కటకటాల వెనక రకరకాల హింసోత్పాతాలకు బలిచేస్తున్నాయి. జైళ్లలో కనీస వైద్య సదుపాయం లేకుండా 2000కు ముందు గడ్చిరోలి డివిజన్ బంగారంపేట దేవన్న లాంటి వాళ్లు అసువులు బాయగా, ఆ తర్వాత గోందియా డివిజన్ మసేలి గ్రామస్థురాలు పారీబాయి, ఆ తర్వాత జైల్లో కమలాపురం భూమన్న లాంటి వాళ్లు తమ

ప్రాణాలను కోల్పోయారు. ఈ మధ్యకాలంలోనే వరంగల్ సెంట్రల్ జైలులో జోగాల్ అనే ఆదివాసీ రైతు బిడ్డడు దీర్ఘకాల శిక్షను అనుభవిస్తూ 2011లో తుదిశ్వాస విడిచాడు. ఇలా ఇంకా అనేక జైళ్లలో అనేక మంది విప్లవ ప్రజానీకం, విప్లవకారులు దోపిడీ పాలకవర్గాల అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికీ, అణచివేతలకు గురై ప్రాణాలు కోల్పోయారు. శత్రు శిబిరంలో తుదిశ్వాస విడిచిన పోరు బిడ్డల శవాలనైనా తుదిచూపు కోసం వారి కుటుంబాలకు అప్పగించకుండా ఆ శవాల పట్ల కూడా అమానవీయ వైఖరిని 'సివిల్ సొసైటీ' మధ్య ఉండే జైలు అధికారులు అవలంబిస్తున్నారు.

జైలు పాలై విచారణలో ఉన్న ఖైదీలను కోర్టు కేసు (వాయిదా)లకు అనేక సాకులతో హాజరుపర్చకుండా పోలీసులు వేధించడం సర్వసాధారణమైంది. ఆదివాసీ రైతాంగాన్ని వకీళ్ల సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. జైలు పాలైన వారి కుటుంబాల వాళ్లలో చాలా మందికి తమ వాళ్ల విడుదల కోసం బెయిల్ పిటీషన్ అయినా నల్లకోటు న్యాయవాదులతో పెట్టించడం తెలియనివాళ్లున్నారు. వాళ్లా, వీళ్లా కాళ్లూ, గడ్డాలు పట్టుకొని వకీళ్ల వరకు వెళ్లగలిగినా అక్కడ చెల్లించుకోలేనంత ఫీజులుండి వారిని హతాశులను చేస్తున్నాయి. కోర్టు కేసుల చుట్టూ తిరగడానికి ఎంతమంది రైతుల ఇళ్లు గుల్లయినాయో చెప్పలేం. చాలా మంది పేద ప్రజలు దేవుడిపై భారం వేసి, వాళ్ల మానాన వాళ్లను జైలుకే వదిలేస్తున్న అనుభవం కూడా పల్లె-పల్లెలో ఎదురవుతోంది. ఏండ్ల పర్యంతం జైలులో ఉన్న ఏ ముద్దాయి అయినా పొరపాటున విడుదలైతే వాళ్లను ఆ వెంటనే కటకటాల కడప దాటకముందే రహస్య పోలీసులు ప్రత్యక్షమై మళ్లీ వెనక్కి తోస్తారు. ఇందుకు జగ్దల్‌పూర్ జైలులో కా. పద్మ, నాగపూర్ జైలులోని కా. లత, మరొకరు, మరొకరు పేర్లు ఎన్నైనా సాక్ష్యంగా చెప్పవచ్చు. ఇకపోతే చాలా మంది మావోయిస్టు పార్టీ నాయకులను కటకటాల వెనుక నుంచీ ప్రజల్లోకి రాకుండా అడ్డుకోవడానికి పోలీసులు తమ చట్టాలనే ఉల్లంఘిస్తూ అతి నిర్లజ్జగా వ్యవహరిస్తున్నారు. జైలులో ఉన్నవారిపై అనేక తప్పుడు కేసులు బనాయిస్తూ వారికి బెయిల్‌లు దొరకకుండా అడ్డుకుంటున్నారు. వారికి పూచీకత్తులు ఇచ్చిన వారినీ నిర్బంధిస్తున్నారు. బెదిరిస్తున్నారు. తమ పూచీకత్తులను ఉపసంహరించుకునేలా వారిపై రకరకాల ఒత్తిడిలు తెస్తున్నారు. ఫలితంగా 2007 మేలో అరెస్టయిన మడ్కం గోపన్న (గజ్జల సత్యం రెడ్డి), శ్యాంలాల్ (అశోక్ రెడ్డి), అరుణ్ ఫరేరా లాంటి వాళ్లెందరో జైళ్లలో మగ్గుతున్నారు. వారంతా గత దశాబ్దంలో అరెస్టు అయినవారే. గేట్ల మీద ఉండే ఖాకీ గూండాల భల్లూకపు పట్టు నుంచీ ఒక వేళ ఎవరైనా అమాయక ఆదివాసీ రైతు తప్పుకోగలిగినా జైలు ఆవరణ నుంచి తమ పల్లె ఆవరణలోకి, కుటుంబాల మధ్యకు చేరుకోవడం ఒక పెద్ద పరీక్ష లాగే ఉంటున్నది. చిల్లి గవ్వ కూడా చేతిలో లేకుండా కట్టుబట్టలతో ఖాకీ వలయం నుంచీ బయటపడిన ఆదివాసీ రైతు ఆ జనారణ్యం నుంచీ, ఆ 'సివిల్ సొసైటీ' నుంచీ తమ ఇండ్లకు చేరుకోవడానికి అనేక ఫోర్, సిక్స్ లేన్‌లు దాటుతూ కాలినడకనే చేరుకోక తప్పడం లేదు. దారి మధ్యలో వాళ్లు పడే అవస్థలు వాళ్ల నోటి గుండానే వినాలి. తమ ఆదివాసీ భాష తప్ప మరో భాష రాని ఆ జైలు విముక్తి జీవులు ఆకలిదప్పులకు, అలసటతో అలమటిస్తూ తమ వాళ్ల మధ్యకు వచ్చిపడేదాక మళ్లీ ప్రయాణంలో ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకు వస్తుందో, మృత్యువే కబళిస్తుందేమోనన్న

దిగులు క్షణక్షణం వెంటాడుతూ ఉంటుంది. 2009 ప్రారంభంలో గడ్చిరోలి జిల్లా టిప్రాగఢ్ ఏరియా కోస్మీ గ్రామస్థుడు మన్నూ నైతాం నాగపూర్ జైలు నుంచి విడుదలై ఇల్లు చేరుకునే వరకు తాను ఎదుర్కొన్న ఇలాంటి అనేక అవస్థలు చెప్పడానికి సజీవ సాక్ష్యంగా ఇంకా మిగిలే ఉన్నాడు. ఇన్ని ఇబ్బందులతో ఇల్లు చేరినా వారిని తమ సంప్రదాయం ప్రకారం ప్రజలు 'ఖైదీ' అని పిలవడం నేటికీ ఆచారంగా దక్షిణ బస్తర్‌లో కొనసాగుతోంది. 'ఖైదీ' అన్న పిలుపు విన్నపుడల్లా చేయని నేరానికి శిక్ష అనుభవించిన రైతుకు గుండె గాయాన్ని మరింత కెలికినట్టే ఉంటోంది.

విప్లవకారులను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే డిమాండ్ దశాబ్దాలుగా కొనసాగుతోంది. 2009 మేలో దండకారణ్యంలో ఈ డిమాండ్‌ను సమర్థిస్తూ ప్రజలను కదిలించారు. దాని కొనసాగింపుగా మార్చ్-23ను (భగత్‌సింగ్ వర్ధంతి)ను జైలు పోరాటాల సంఘీభావ దినంగా, సెప్టెంబర్-13 (జతీంద్రనాథ్‌దాస్ వర్ధంతి)ను జైలు ఖైదీల హక్కుల దినంగా, డిసెంబర్-10 (అంతర్జాతీయ మానవ హక్కుల దినం)ను జైలులోని విప్లవకారులను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే డిమాండ్‌తో ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి.

జైలు పాలైన విప్లవ పార్టీ నాయకత్వం అమానుషమైన శిక్షలను అనుభవిస్తున్నారు. జైళ్లలో వారి ఆకారాలు బానిస తిరుగుబాటు నాయకుడు స్పార్టకస్‌ను గుర్తుకు తెస్తాయి. ఒంటరి సెల్‌లో కాళ్లూ, చేతులూ గొలుసులతో కట్టివేయబడి ఒళ్లంతా సంకెళ్లతో హూనమయ్యే బందీ దృశ్యం ప్రస్ఫుటమవుతుంది. వాళ్లకు వైద్య సౌకర్యం ఉండదు. రాజకీయ పరిణామాలు తెలుసుకోవడానికి కావాల్సిన పత్రికా, రేడియో, టీవీ లాంటివి వాళ్లకు వినబడనంత, కనబడనంత దూరంలో ఉంటాయి. వాళ్లకు తోటి ఖైదీలతో ఎలాంటి సంపర్కమే ఉండదు. పరస్పరం గాలి కూడా సోకనంత బందోబస్తు వారి మధ్య ఉంటుంది. వాళ్ల కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో పరిష్కరిస్తూ కఠినమైన శిక్షలు విధిస్తున్నారు. ఇప్పటికే భా.క.పా. (మావోయిస్టు) కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు అనేక మంది యావజ్జీవిత శిక్షలు అనుభవిస్తున్నారు. వీరే కాదు, పదుల కొద్దీ విప్లవ రైతాంగం కూడా యావజ్జీవ ఖైదీలుగా శిక్షలను అనుభవిస్తున్నారు. వీరిలో మహిళలూ ఉన్నారు. దండకారణ్యం ఆదివాసీ రైతాంగంలో దాదాపు 30 మందికి పైగా స్త్రీ-పురుషులు ఇంచుమించు గత దశాబ్ద కాలంగా వివిధ జైళ్లలో యావజ్జీవ శిక్షలు అనుభవిస్తున్నారు. గతంలో కొద్దిమంది ప్రజాసంఘాల నాయకులపై కోర్టులు జిల్లా బహిష్కరణ శిక్షలను అమలు చేశాయి.

గత దశాబ్దంలో అరెస్టయిన వారిలో దండకారణ్య ఉద్యమ నాయకులు వగ్గే చంద్రమౌళి (మదన్‌లాల్), గజ్జల సత్యం రెడ్డి (మడ్కం గోపన్న), చంద్రశేఖర్ (జయపాల్), నిర్మల, మాలతి, మీనా, నందూ, సురేష్, సురేందర్ లాంటి వాళ్లెందరో విప్లవ పార్టీ నాయకులు, కార్యకర్తలూ ఉన్నారు. వారి అరెస్టులతో ఉద్యమానికి చాలా తీవ్రమైన నష్టమే జరిగింది. వారే కాకుండా కేంద్రకమిటీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కా.నారాయణసన్యాల్ 2006 జనవరిలో రాయపూర్ అరెస్టు అయ్యాడు. వారిలో కా.నిర్మల పైనా 150 కేసులు మోపారంటే పోలీసులు ఆమె విడుదల కాకుండా ఉండడానికి ఎలా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. పోలీసులు

ఆరోపించిన కేసులలో సత్యాసత్యాలోతుల్లోకి వెళ్లకుండా, సమగ్రమైన పరిశీలనలు చేయకుండా, సాక్ష్యాల పూర్వాపరాలు తెలుసుకోకుండా నల్లకోటు న్యాయమూర్తులు ఎంతటి దుర్మార్గమైన కఠిన శిక్షలకు పూనుకుంటున్నారో మాలతీ, సురేంద్ర కోసరియాలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాయపూర్ జిల్లా న్యాయస్థానం విధించిన పదేళ్ల కారాగారవాసమే ప్రబల తార్కాణంగా మనముందుంది. ఇంతకన్నా దారుణమేమంటే విప్లవోద్యమాన్ని ప్రేమించడమే నేరంగా భావించి, వాస్తవాలనైనా చూడలేని న్యాయమూర్తులు వరల్డ్ టు విన్ పత్రికా సంపాదకుడు అజిత్ సేన్ గార్కి అలాంటి శిక్షలే వేసి తమ వర్గ న్యాయాన్ని నిస్సిగ్గుగా చాటుకున్నారు.

'చెరసాలలు, ఉరికొయ్యలు వెలుగును బంధించలేవు' అని ముప్పయియేళ్ల క్రితమే విప్లవ కవి చెరబండరాజు కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. దేశంలో బలపడుతున్న విప్లవోద్యమ ఫలితమే జహనాబాద్ (బీహార్), దంతెవాడ (ఛత్తీస్‌గఢ్) జైలు బ్రేక్‌లు. సల్వాజుడుం ప్రారంభమైనప్పటి నుంచీ దంతెవాడ, జగ్దల్‌పూర్, రాయపూర్, బిలాస్‌పూర్ జైళ్లన్నీ విప్లవకారులతో, విప్లవ ప్రజా నిర్మాణాల కార్యకర్తలతో కిటకిటలాడుతున్నాయి. అక్కడి పరిస్థితులు అతిదారుణం. ఆ వాతావరణానికి తట్టుకోవడం అడవి తల్లి ఒడిలో పుట్టి పెరిగిన 'స్వేచ్ఛా' ఆదివాసీ జీవితాలకు అగ్ని పరీక్ష లాగే ఉంటోంది. వాళ్లు ఏ చిన్న అవకాశం వచ్చినా కటకటాల జీవితాల నుంచీ బయటపడడానికి సిద్ధంగా ఉంటారు. జైలు గేట్లను బద్దలు కొట్టి అయినా సరే వారు స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడానికి వెనుకాడరనీ దంతెవాడ జైలు బ్రేక్ స్పష్టం చేస్తోంది. 2007 డిసెంబర్ 16 నాటి జైలు బ్రేక్‌తో దాదాపు 300 మంది 'ఖైదీలు' విప్లవాత్మకంగా బయటపడి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నారు. తెల్లారేసరికి అడవి తల్లి ఒడిలోకి వచ్చి వాలి పిఎల్‌జిఏ గెరిల్లాల, జనతనా సర్కార్ రక్షణలో ఏర్పాటు చేసిన సంతోష వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఆనాటి జైలు బ్రేక్‌కు నాయకత్వం వహించినవారిలో ఒకరైన కా.వర్గేష్ గెరిల్లా కంపెనీలో చేరిపోయాడు. సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఒడిషాలో జరిగిన 'నాల్కో' దాడిలో శత్రువుతో ధైర్యంగా పోరాడి ఆశయ సాధనలో అసువులు బాసాడు. ఆ వీర గెరిల్లాను జైలు సహచరులందరూ ఈనాటికీ ఎంతగానో గుర్తు చేసుకుంటుంటారు.

# 3. ప్రజాతంత్ర విప్లవంలో ప్రజాయుద్ధ ప్రగతి

## భారత ప్రజాస్వామిక విప్లవంలో నూతన అధ్యాయం

## ప్రజా విముక్తి గెరిల్లా సేనా నిర్మాణం

2000, డిసెంబర్ 2 నాడు ప్రజా గెరిల్లా సేనా ఏర్పడింది. ఇది అనేక దశాబ్దాల భారత ప్రజాతంత్ర విప్లవోద్యమ చరిత్రలోనే అపూర్వమైనది. 1925లోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి దేశంలో గణనీయమైన సంఖ్యలోనే సాయుధ రైతాంగ విప్లవ పోరాటాలకు అది నాయకత్వం వహించినప్పటికీ ప్రజా సైన్య నిర్మాణం వైపు మాత్రం పెద్దగా ముందుకు సాగలేదు. దేశంలో ఊడలు దిగిన రివిజనిజం యొక్క నడ్డి విరుస్తూ 1969లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఏర్పడి సాయుధ పోరాటాన్ని నూతనంగా ఎజండా మీదికి తెచ్చినప్పటికీ అది చేపట్టిన అతివాద ఎత్తుగడల ఫలితంగా ప్రజాసైన్యం మొగ్గ తొడగకముందే ఆ పార్టీ అనేక చీలికలకు గురైంది. విప్లవోద్యమం వెనుకంజ వేసింది. మరోవైపు ఆ కాలంలోనే మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఏర్పడింది. కానీ అదీ ప్రజా సైన్య నిర్మాణాన్ని చేపట్టలేదు. దెబ్బతిన్న విప్లవోద్యమం క్రమంగా తేరుకొని ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించుకోగలిగి 1980ల తొలినాళ్లలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)



విశాల భారతావనిలో కదం తొక్కుతున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం

(పీపుల్స్‌వార్)ను ఏర్పర్చుకోవడం నక్సల్బరీ ఉద్యమ కొనసాగింపులో ఒక చారిత్రాత్మకమైన మలుపు. ఈ పార్టీ 1980లో గెరిల్లాజోన్ల నిర్మాణాన్ని చేపట్టి, ఉద్యమాన్ని పలు నూతన ప్రాంతాలకు విస్తరించి దేశంలోని ఒక విశాలమైన భూభాగంలో ప్రజాయుద్ధానికి శ్రీకారం చుట్టింది. దీనితో దేశంలో అది ఎంపిక చేసుకున్న వ్యూహాత్మక ప్రాంతాలలో వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధం ఎజండా మీదికి వచ్చింది. దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, సాపేక్షికంగా శత్రు రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థ వెనుకబడి ఉండడం, 'నాగరిక' ప్రపంచానికి చాలా దూరంగా ఉంటూ వెనుకబడిన ప్రాంతాలుగా నమోదై ఉన్న ఆదివాసీ ప్రాంతంలో సాయుధ దళాలు (విప్లవ ప్రచార, నిర్మాణ, రైతాంగ ఆత్మరక్షణా దళాలు) రంగం మీదికి వచ్చాయి. అర్ధవలస - అర్ధభూస్వామ్య భారత రాజకీయ చిత్రపటంపై దీవుల్లా అగుపడే ఈ ప్రాంతాలన్నీ దేశ అసమానాభివృద్ధికి చక్కని చిహ్నాలుగా దర్శనమిస్తాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) 1980లో ఎంపిక చేసుకున్న వ్యూహాత్మక ప్రాంతాలలో దండకారణ్యం అతి ముఖ్యమైన ప్రాంతం. సముద్రమట్టానికి 2000 అడుగుల ఎత్తున వున్న ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్, పాత మధ్యప్రదేశ్ (ప్రస్తుత ఛత్తీస్‌గఢ్), ఒడిషా, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దులలోని కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, తూర్పు గోదావరి, విశాఖపట్టణం, పాత బస్తర్, పాత కోరాపుట్, పాత చంద్రపూర్ జిల్లాల అటవీ ప్రాంతాలతో కూడుకున్న విశాల భూభాగం. దీనిని దండకారణ్యంగా పేర్కొన్నారు. పురాణేతి హాసాలలో కోరాపుట్, బస్తర్ అడవులనే దండకారణ్యంగా పేర్కొనగా విప్లవకారులు ఆ సరిహద్దులను మరింత విస్తరించి నూతన ప్రజాయుద్ధ చిత్రపటాన్ని ముందుకు తెచ్చారు. ఈ ప్రాంతానికి 1980 జూన్-జులైలలో ఏడు దళాలు 35 మందితో చేరుకున్నాయి. ఈ యువ విప్లవకారులలో ప్రధానంగా ఉన్నది విద్యార్థులు, రైతాంగ యువకులు కాగా ఆనాటికి మహిళలు, ఆదివాసీలు ఆ దళాల్లో లేరు.

1980-2000 మధ్య గడచిన రెండు దశాబ్దాల కాలం ఈ ప్రాంతంలో పెద్దెత్తున సంఘటిత ప్రజా విప్లవోద్యమం కొనసాగింది. ఆనాటికి భారత ప్రజాతంత్ర విప్లవోద్యమంలో తలమానికంగా కొనియాడబడిన ఆంధ్రప్రదేశ్ జిల్లాల సరిహద్దుల్లో ప్రారంభమైన తొలినాళ్ల విప్లవ ప్రచారాందోళనోద్యమం క్రమంగా 1990ల నాటికి ఆ జిల్లాల ప్రధాన భూభాగమంతా వ్యాపించింది. కొన్ని చోట్ల మరింత ముందుకు విస్తరించి కొత్త జిల్లాల్లో పరిచయమైంది. (ఉదా॥ బండారా, బాలాఘాట్, రాజనాంద్‌గాం). తొలినాటి ఆ దళాలు కాలక్రమంలో అనేక మార్పులకు లోనయ్యాయి. 1987 నాటికి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లాల్లో 'రాజ్యం'తో తలపడడమే వాటి ప్రధాన కర్తవ్యంగా మారింది. మిగతా ప్రాంతాలలో 1991 నాటికి ఆ పరిస్థితి వచ్చింది. 1987 నాటికే దండకారణ్యం గెరిల్లాజోన్‌గా ఎదిగివచ్చిందనీ 1995లో అఖిల భారత పార్టీ ప్రత్యేక మహాసభ గుర్తించింది. ప్రతిఘటనోద్యమం మధ్యనే రైతాంగ విప్లవ దళాలు పటిష్టం కాసాగాయి. దళాల్లో సంఖ్య ఐదు నుంచీ పదకొండుకు పెరిగింది. పెరిగిన సంఖ్యలో స్థానిక ఆదివాసీ యువత ప్రధాన శక్తిగా ఎదిగివచ్చింది. సైనిక నిర్మాణాలకు వారే నాయకత్వ బాధ్యతలు చేపట్టుతూ నూతన అనుభవాన్ని

పొందసాగారు. వీరిలో మహిళలు మూడవ వంతుకు చేరుకోసాగారు. పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమ నిర్మాణ కర్తవ్యాల్ని నిర్వర్తించే దళాలతో పాటు సైనిక కర్తవ్యాలను నిర్వర్తించడానికై 1993 నుంచీ ప్రత్యేక సైనిక దళాలు ఉనికిలోకి వచ్చాయి. ఇవి అనతి కాలంలోనే ప్లాటూన్లుగా ఎదిగాయి. 1995 ఏప్రిల్‌లో మొదటి ప్లాటూన్ గడ్చిరోలిలో ఏర్పడింది. 1991-94 మధ్య గడ్చిరోలిలో మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన క్రూర నిర్బంధాన్ని ప్రతిఘటించడానికి అక్కడ ఉన్నత సైనిక నిర్మాణ రూపాన్ని చేపట్టాలనీ పార్టీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఆ తొలి ప్లాటూన్ అక్కడ ఏర్పడింది. 1998 నాటికి రెండవ ప్లాటూన్ బస్తర్‌లో ఏర్పడింది. 2000 నాటికి దండకారణ్యంలో అన్ని డివిజన్లలో సైనిక ప్లాటూన్ల నిర్మాణం మొదలైంది. ఆయుధ శక్తిలోనూ మంచిమార్పు వచ్చింది. ఆధునిక ఆయుధాలు, ఏకె, ఎస్ఎల్ఆర్, త్రీనాట్‌త్రీ రైఫిళ్లు గెరిల్లాల చేతుల్లోకి వచ్చాయి. తుపాకుల తయారీ, గ్రెనేడ్ల నిర్మాణం-వాడకంలో చాలా మెరుగుదల వచ్చింది. మందుపాతర్ల వినియోగించడంలో కొత్త జ్ఞానం పొందగలిగారు. ఉన్నతస్థాయి సైనిక శిక్షణ అనుభవజ్ఞుల నుంచీ లభించింది. ఎల్‌టిటిఈతో ఉండి విడిపోయిన మావోయిస్టు శక్తులు నేర్పిన ఆ శిక్షణ ప్రజాయుద్ధ అభివృద్ధిలో ఒక మలుపుకు దారి తీసింది. పెరుగుతున్న గెరిల్లాల శక్తినీ, బలపడుతున్న విప్లవోద్యమాన్నీ 1995లో సమీక్షించిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్ ప్రజా రాజ్యాధికార అంగాల (విప్లవ ప్రజా కమిటీల) నిర్మాణాన్ని చేపట్టాలనే కర్తవ్యాన్ని గెరిల్లాజోన్ ప్రాంతాలకు ఇచ్చింది. విప్లవం అంటే రాజ్యాధికార నిర్మాణమేనన్న విప్లవ సిద్ధాంతం దండకారణ్యంలో ఒక గెంతు రూపంలో అమలులోకి వచ్చి ఉద్యమ అభివృద్ధిలో ఒక నూతనత్వానికి రూపునిచ్చింది. ప్రాంతాల వారిగా రాజ్యాధికార స్థాపన లక్ష్యంతో దండకారణ్యంలోకి అడుగుపెట్టిన విప్లవ దళాలు రెండు దశాబ్దాల కాలంలో అవి ఆ దిశలో చెప్పుకోతగిన ప్రగతిని సాధించాయనీ వాటి అనుభవం, ఉద్యమ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అప్పటి వరకూ విప్లవోద్యమాన్ని అణచడానికి ఎక్కడికక్కడే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన బాధ్యత వహించాయి. విప్లవోద్యమ అణచివేతకు వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం కేంద్రం 1997-98లో ఉమ్మడి సమన్వయ కేంద్రాన్ని (జెసిసి) ఏర్పర్చి ఆ మేరకు తన వంతు పాత్రను అది పోషించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలే తమ బలగాలతో, తాము ఏర్పర్చుకున్న గూఢచర్య విభాగ శక్తులతో గెరిల్లా యుద్ధంతో తలపడ్డాయి. కానీ, 2000 నాటికి పరిస్థితి మారిపోయింది.

2000-2010 దశాబ్దం భారత ప్రజాస్వామిక విప్లవోద్యమంలో అనేక విధాలుగా ప్రాధాన్యతను సంతరించుకుంది. వాటిని సంక్షిప్తంగా ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు.

1. 2000 డిసెంబర్ 2న ప్రజా విముక్తి గెరిల్లా సేన నిర్మాణం జరిగింది.

2. 2001 జూన్ నుంచీ ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్, భర్తీ క్యాంపెయిన్ ప్రారంభమయ్యాయి.

3. 2003 మార్చిలో తొలిసారిగా దండకారణ్య గడ్డ మీద (బస్తర్‌లో) కేంద్ర అర్ధసైనిక బలగాలు

కాలుమోపాయి.

4. 2004 సెప్టెంబర్ 21 రెండు పార్టీల విలీనం - నూతనంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావం - రెండు పార్టీల నాయకత్వంలోని ప్రజాసైన్యాలు విలీనమై నూతనంగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ముందుకొచ్చింది.

5. 2005 జూన్ 5 ఫాసిస్టు సల్వాజుడుం ప్రతిఘాత విప్లవ క్యాంపెయిన్ ప్రారంభం.

6. 2006 జూన్ నాటికి పిఎల్‌జిఏ నాయకత్వంలో విప్లవ ప్రజల సాయుధ ప్రతిఘటనతో సల్వాజుడుం బలహీనపడి దాని విస్తరణ నిలిచిపోయింది.

7. 2007 నూతన పార్టీ తన ఐక్య కాంగ్రెస్ - తొమ్మిదో కాంగ్రెస్‌ను జరుపుకుంది. పార్టీ కాంగ్రెస్ పిఎల్‌జిఏను పిఎల్ఏగా, గెరిల్లా యుద్ధాన్ని చలన యుద్ధంగా అభివృద్ధి చేస్తూ దండకారణ్య, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే కేంద్ర కర్తవ్యాన్ని యావత్తు పార్టీ ముందుంచింది.

8. 2009లో దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో భాగంగా దండకారణ్యంలోనూ ఆపరేషన్ గ్రీన్ హంట్ (హరిత వేట/అడవుల వేట) దాడులు ప్రారంభం. సైనిక దాడులు, సంస్కరణలు కలసిన ద్విముఖ వ్యూహాన్ని తీవ్రతరం చేస్తూ చేపట్టిన 'హోల్డ్-కంట్రోల్-బిల్డ్' విధానంతో చేపట్టిన ఆ బహుముఖ సైనిక దాడులలో భారీ మార్పు మొదలైంది. వైమానిక దాడులకు కూడా అనుమతి లభించింది. ప్రజాయుద్ధంలో దెబ్బతింటూన్న ప్రభుత్వ సాయుధ బలగాల మనస్థైర్యాన్ని పెంచడానికి వేరుగా భారత సైన్యాలు గెరిల్లా శిక్షణ పేరుతో దిగాయి.

9. 2009 ఆగస్టు 10 నాడు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో నూతనంగా బెటాలియన్ నిర్మాణం ప్రారంభం.

10. దశాబ్ద కాలంలో కేంద్ర సైనిక కమీషన్, స్పెషల్ జోన్ సైనిక కమీషన్ ప్రజాయుద్ధాన్ని యేటేటా సమీక్షిస్తూ బలగాలకు ఇచ్చిన సందేశాలు.

పై ప్రధాన ఘట్టాల వెలుగులో దశాబ్ద కాలంలో రూపుదిద్దుకున్న నూతన ప్రజాయుద్ధ చరిత్రనూ, ఉద్యమాభివృద్ధినీ పరిశీలిద్దాం.

ఈ అధ్యాయం ప్రారంభంలోనే చెప్పినట్టూ భారత ప్రజాతంత్ర విప్లవోద్యమ సుదీర్ఘ ప్రయాణంలో ప్రజా విముక్తి గెరిల్లా సేన నిర్మాణం అపూర్వమైనది. చారిత్రాత్మకమైనది. భారత ప్రజాతంత్ర విప్లవోద్యమ ప్రారంభంగా ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని పరిగణనలోకి తీసుకొని లెక్కిస్తే 150 సం॥ల దీర్ఘావధి తర్వాత ప్రజల చేతిలో ఒక అద్భుతమైన ఆయుధంగా ప్రజల పక్షాన నిల్చి పోరాడే ఒక విప్లవ సైన్యం పురుడు పోసుకుంది. ప్రజా విముక్తి గెరిల్లా సేన నిర్మాణానికి డిసెంబర్ 2ను ఎంచుకోవడం

వెనుకగల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. 1999 డిసెంబర్ 2 నాడు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) కేంద్రకమిటీ సభ్యులు ముగ్గురు కామ్రేడ్స్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి), మహేష్ (సంతోష్ రెడ్డి), మురళి (శీలం నరేష్)లు ఒక కోవర్టు విద్రోహానికి బలై బెంగళూరు నగరంలో ఆంధ్ర పోలీసుల చేత చిక్కి బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. వీరు ముగ్గురూ కేంద్రకమిటీ సభ్యులే కాకుండా కామ్రేడ్స్ శ్యాం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహించాడు. కామ్రేడ్ మహేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, కామ్రేడ్ మురళి ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతల్లో ఉండినారు. వీరి అమరత్వంతో పార్టీ నడ్డి విరిగిందనీ పోలీసులు తెగ మురిసిపోతూ ప్రచారం చేశారు. కానీ పార్టీ కేంద్రకమిటీ దీనిని ఒక సవాలుగా తీసుకొని పార్టీని పటిష్టపర్చడానికి దృఢమైన నిర్ణయం తీసుకుంది. అమరుల వారసులుగా పెద్దసంఖ్యలో విప్లవోద్యమంలో చేరాలనీ పోరాట ప్రాంతాల యువతకు పిలుపు నిచ్చింది. వారి అమరత్వం తర్వాత సరిగ్గా యేడాది కాలానికి కేంద్రకమిటీ వాళ్ల స్మృతి దినాన్ని పురస్కరించుకొని గెరిల్లా జోన్‌లలో పిఎల్‌జిఏ నిర్మాణాన్ని చేపట్టింది. 1980లో పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాణం, అందులో భాగంగా చేపట్టిన గెరిల్లా జోన్‌ల నిర్ణయం, రైతాంగ విప్లవ దళాల నిర్మాణం. వాటి అభివృద్ధిలో ఆ ముగ్గురు నాయకుల పాత్ర విడదీయరానిది. ప్రజాసైన్య నిర్మాణంపై పార్టీలో జరుగుతున్న చర్చల్లో వారు కీలకమైన పాత్ర పోషించారు. దాదాపు రెండున్నర దశాబ్దాల భారత విప్లవోద్యమ అభివృద్ధిలో ఆ గొప్ప నాయకుల పాత్ర అవిస్మరణీయమైనది. ఆ నేపథ్యంలోనే వారి సంస్మరణ దినాన్ని పురస్కరించుకొన పార్టీ పిఎల్‌జిఎను ఏర్పర్చింది. ఆ రకంగా దండకారణ్య గెరిల్లా జోన్‌లో ఏర్పడిన పిఎల్‌జిఏలోని గెరిల్లా శక్తులను ఎస్‌జడ్‌సి వ్యవస్థీకృతం చేస్తూ ఆ సందర్భంగా ప్లాటూన్ల నిర్మాణాన్ని విస్తరించే నిర్ణయాన్ని తీసుకుంది. దండకారణ్యంలో 1995 ఏప్రిల్‌లో ఏర్పడిన తొలి ప్లాటూన్, 1998 చివర్లో ఏర్పడిన మలి ప్లాటూన్ సరసన మరిన్ని ప్లాటూన్లు ఏర్పడడానికి పార్టీ నిర్ణయం దోహదం చేసింది. భవిష్యత్ ప్రజా విముక్తి సైన్యానికి 1980 నాటి ఆత్మరక్షణ దళాలు బీజాలు వేయగా అవి క్రమంగా బలపడి 2000 నాటికి ప్లాటూన్ల ఆధారంగా ప్రజా గెరిల్లా సైన్య నిర్మాణానికి దారిచూపాయి. 'ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఏమీ లేదు' అనే విషయం గత రెండు దశాబ్దాల అనుభవంతో జోడించి ప్రజల్లోకి తీసుకెళ్లి గెరిల్లాలు సోదాహరణంగా వివరిస్తూ దేశ విదేశాల అనుభవాలను వారి ముందుంచారు. అయితే ఈ ప్రక్రియ 1995లోనే చేపట్టి ఉండాల్సిందనీ అఖిల భారత తొమ్మిదో కాంగ్రెస్ 2001లో సమీక్షించిన విషయం గమనార్హం.

సైన్య నిర్మాణంతో పార్టీ సైనిక రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ప్రతి సైనిక యూనిట్ పార్టీ నాయకత్వంలోనే తన బాధ్యతలను, కర్తవ్యాలను, కార్యక్రమాలను చివరకు తన దైనందిన చర్యలన్నింటినీ నిర్వహించుకునే దిశలో సైన్యంలో పార్టీ నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. సైన్య నిర్మాణం మూడు రకాల బలగాలతో కూడుకొని ఉంటుందనీ చెప్పుకొని వాటిని ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలుగా నిర్వచిస్తూ సైనిక ప్రణాళిక తయారైంది. మూడు రకాల బలగాలలో పునాది బలగాలు అతి విశాలకాయంగా

ఉంటూ భారీసంఖ్యలో ఉంటాయనీ, ద్వితీయ బలగాలు అంటే ప్రాంతీయ బలగాలు అనీ, ఇవి నిర్దిష్ట ప్రాంతాలకే పరిమితమై తమ సైనిక కార్యక్రమాలను నిర్వర్తిస్తాయనీ, సంఖ్య రీత్యా పునాది బలగాల కన్నా తక్కువగా ఉంటాయనీ ఆ ప్రణాళిక స్పష్టం చేసింది. పోతే ప్రధాన బలగాలు మాత్రం ప్రజాయుద్ధ అవసరాల రీత్యా అవి దేశవ్యాప్త ఉద్యమ ప్రాంతాలలో ఎక్కడికైనా వెళుతాయనే అవగాహనను ఇచ్చింది. ప్రధాన బలగాలు ప్రధానంగా వ్యూహాత్మక ప్రాంతాలలో రూపొందుతున్న 'బేసు'లను ఆధారం చేసుకొని ఆపరేట్ అవుతాయనే విషయాన్ని కూడా స్పష్టంగా చేసింది. ఇవి పునాది బలగాల కన్నా, ప్రాంతీయ బలగాల కన్నా సంఖ్య రీత్యా తక్కువగానే ఉంటాయి కానీ గుణంలో చాలా మెరుగ్గా ఉంటాయి. రాజకీయ అవగాహన, సైనిక కౌశలం, క్రమశిక్షణా, ఆయుధశక్తీ, పోరాటపటిమ, ప్రజాసేవ తత్పరతలో ముందుశ్రేణిలో నిలుస్తాయి. ఈ ప్రధాన బలగాలే క్రమంగా రెగ్యులర్ సైన్యాలుగా పరిణతి చెంది ప్రజా విముక్తి సేనలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయి. ఈ సైన్య నిర్మాణం ఈజిప్షియన్ల పిరమిడ్లను పోలి ఉంటోంది. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ప్రధానంగా యుద్ధం చేస్తూనే విప్లవోద్యమ ప్రచారం, ప్రజా ఉత్పత్తి కార్యకలాపాల్లో పాలుపంచుకుంటోంది. వర్తమాన విప్లవ దశను వ్యూహాత్మక ఆత్మరక్షణా దశగా నిర్వచించుకున్న నేపథ్యంలో పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని ప్రతిబింబించే విధంగా ప్రజాసైన్యానికి 'ప్రజా గెరిల్లా సైన్యం' అనే పేరు నిర్ణయమైంది.

ప్రజా గెరిల్లా సైన్య నిర్మాణం ప్రజా యుద్ధ నిర్వహణకు అవసరమైన కమాండ్లనూ, కమీషన్లనూ ఏర్పర్చుకుంది. అత్యున్నత స్థానంలో కేంద్రకమిటీ సభ్యులతో, కేంద్ర సైనిక కమీషన్ ఉండగా, దాని కింద స్పెషల్‌జోన్‌లలో, రాష్ట్రాలలో ఆయా కమిటీల సభ్యులతో కమీషన్లు ఏర్పడ్డాయి. వాటి కింద రీజియన్, డివిజన్, ఏరియా స్థాయిలలో కమాండ్లు నిర్మాణం జరిగింది. కమీషన్లలో, కమాండ్లలో ఆయా స్థాయి కమిటీల కార్యదర్శులు పదవీప్రాప్త (ఎక్స్-అఫిసియో) సభ్యులుగా ఉంటారు. ఇది ఒక నియమంగానే అమలవుతూ సైన్యాభివృద్ధికి తోడ్పడుతోంది. కమీషన్లు రాజకీయ, సైనిక, నిర్మాణ విషయాలలో అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ సైన్యాభివృద్ధికి కృషి చేస్తూంటే, కమాండ్లు ప్రధానంగా యుద్ధచర్యల నిర్వహణలో నాయకత్వం వహిస్తూ తమ సేవలందిస్తున్నాయి. వాటి కింద స్థానిక గెరిల్లా దళాలనూ, ప్లాటూన్లనూ ద్వితీయ బలగాలుగా పేర్కొంటుంటే కంపెనీలనూ, బెటాలియన్లనూ ప్రధాన బలగాలుగా ఉన్నాయి. ఇక్కడ చెప్పుకున్నటువంటి కమాండ్లే కాకుండా ఆయా అవసరాల రీత్యా రాష్ట్రాల సరిహద్దుల్లో సంయుక్త కమాండ్లను ఏర్పర్చుకోవడం ముందుకొచ్చింది. అలాగే కేంద్ర బ్యూరోల నాయకత్వంలో రీజియన్ కమాండ్ల నిర్మాణాలు ఉన్నాయి. ఇవి పోగా యుద్ధచర్యల నిర్వహణలో భాగంగా, టిసిఓసిల నిర్వహణ నిమిత్తం నాయకత్వ శక్తులతో ప్రత్యేక కమాండ్ల నిర్మాణం జరుగుతోంది.

ప్రజా మిలీషియాకు విడిగానే కమాండ్ల దొంతర ఉంది. ప్రస్తుతం పంచాయితీ, ఏరియా స్థాయిలో ప్రజా మిలీషియా కమాండ్లు పని చేస్తున్నాయి. ప్రజా మిలీషియాలో గ్రామ రక్షక దళాలు, ప్లాటూన్లు, కొన్ని చోట్ల కంపెనీలు (ఇవి నూతనంగా అమలులోకి వస్తున్నాయి) ఏర్పడి పనిచేస్తున్నాయి. ఇవి ప్రధానంగా

విప్లవ ప్రజా కమిటీల ఆధీనంలో ఉంటూ వాటి రక్షణ బాధ్యతలు చూస్తున్నాయి. మరోవైపు కంబాట్ కమాండ్లతో (ప్రాంతీయ బలగాలు, ప్రధాన బలగాలు) తమ చర్యలను సమన్వయించుకుంటూ వాటికి పూర్తి అండగా నిలుస్తున్నాయి.

కమాండ్లు ప్రధానంగా యుద్ధచర్యలకు ప్లాన్ చేస్తూ, వాటిని నిర్వహిస్తూ వాటిని సమీక్షించి తగిన గుణపాఠాలు తీస్తూ సైనిక రంగంలో బలగాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. కమీషన్లు శత్రు ఎత్తుగడలకు ధీటైన ప్రజాయుద్ధ ఎత్తుగడలను రూపొందించడంలో, సైనిక క్రమశిక్షణను పెంపొందించడంలో, సైన్యం యొక్క రాజకీయ చైతన్యాన్ని పెంచుతూ నిర్మాణాలను సుదృఢపర్చడంలో, దేశవ్యాప్త సైనిక యూనిట్ల మధ్య అన్ని విషయాల్లో సారూప్యతను తీసుకరావడానికీ విశేషంగా కృషి చేస్తున్నాయి. దశాబ్ద కాలంలో ఇవి మంచి ప్రగతిని సాధించాయి.

## 3 (ఎ) ఎత్తుగడల ప్రతిదాడుల క్యాంపెయిన్

పిఎల్‌జిఏ నిర్మాణం జరగడంతో సైనిక రంగంలో కొన్ని కొత్త ఎత్తుగడల రూపాలు ముందుకొచ్చాయి. వీటిలో ఎత్తుగడల ప్రతిదాడుల క్యాంపెయిన్ (టిసిఓసి) ఒకటి. ఈ ఎత్తుగడ రూపకల్పనకు మూలం 2001 ఫిబ్రవరి - మార్చిలో జయప్రదంగా ముగిసిన పార్టీ 9వ కాంగ్రెస్ అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఈ కాంగ్రెస్ పలు విషయాలలో ఉన్నతమైన, శాస్త్రీయమైన నూతన అవగాహనలను పార్టీ ముందుంచింది. 1995 నాటి అఖిల భారత ప్రత్యేక మహాసభ ఉన్నత గెరిల్లాజోన్ల నిర్మాణాన్ని చేపట్టాలనీ చేసిన నిర్ణయాన్నీ 9వ కాంగ్రెస్ సమీక్షించి దాని స్థానంలో విముక్తి ప్రాంతాల నిర్మాణానికి రోడ్‌మేప్‌ను రూపొందించింది. ఇందులో భాగంగా గెరిల్లాజోన్లలో గెరిల్లాబేసుల నిర్మాణాన్ని కేంద్ర కర్తవ్యంగా యావత్తు పార్టీ స్వీకరించింది.

గెరిల్లా బేసుల నిర్మాణ కృషిలో భాగంగా టిసిఓసిలు తక్షణం ఎజండా మీదికి వచ్చాయి. 2001 వేసవి అనంతరం నుంచీ ఇవి అమలులోకి వచ్చాయి. 2002 నుంచీ 2011 వరకు ప్రతీ యేటా ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్‌లు చేపట్టడం ప్రజాయుద్ధ ప్రగతికి ఎంతో లాభప్రదంగా ఉంది.

టిసిఓసిల గురించి మంరిత వివరంగా తెలుసుకోవడం అవసరం. దేశంలో గత నాలుగు దశాబ్దాల కాలంగా పలు ఆటు-పోటుల మధ్య అవిరామంగా కొనసాగుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధం ఈనాటికీ వ్యూహాత్మక ఆత్మరక్షణా దిశలోనే ఉంది. గెరిల్లాయుద్ధం ఆత్మరక్షణా యుద్ధంలో అంతర్భాగం అని దీర్ఘకాల ప్రజాయుద్ధం అని వివరిస్తోంది. ఈ నేపథ్యంలోనే అది తనను తాను కాపాడుకుంటూ ప్రభుత్వ సాయుధ బలగాలతో తలపడుతుంది. పీఎల్‌జీఏ వాటి దూకుడును అరికడుతూ, వాటి చొరవను దెబ్బతీస్తూ, తమ శక్తి మేరకు వాటిని అంతమొందిస్తున్నాయి. ప్రభుత్వ సాయుధ బలగాల నుంచీ ఆయుధాలను స్వాధీనం చేసుకుంటూ విప్లవోద్యమంలో అభివృద్ధిని సాధించడానికి చొరవతో పోరాడుతున్నాయి. ప్రజా సాయుధ బలగాలు ఎత్తుగడల ఎదురుదాడులలో భాగంగా టిసిఓసిలను చేపట్టి సైనిక రంగంలో మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. విప్లవోద్యమ అణచివేతలో భాగంగా 1985లో

తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోకి కేంద్ర పారా మిలటరీ బలగాలు అడుగిడినాయి. ఆ సమయంలో పార్టీ 'గెరిల్లా దళాలను కంటికి రెప్పలా కాపాడుకోండి' అంటూ పిలుపు నిస్తూ ఒక సర్క్యులర్‌ను రూపొందించి నూతన ఎత్తుగడలను ముందుకు తెచ్చింది. 1985 నుంచీ దాదాపు 2000 వరకు ఆ ఎత్తుగడల వెలుగులోనే ప్రధానంగా వేసవి కాలంలో గెరిల్లా బలగాలు తమ ఆత్మరక్షణలో భాగంగా శత్రు బలగాలతో తలపడడం అలవర్చుకున్నాయి. దాదాపు ఆ దశాబ్దన్నర కాలంలో గెరిల్లా యుద్ధం పొందిన అనేక అనుభవాల సమాహారంగా మొదలైన టిసిఓసిలు ఇప్పటికీ ప్రధానంగా ఆ పరంపరనే కొనసాగిస్తున్నాయి. దీనికి తోడు శత్రుదాడుల తీవ్రతను బట్టి ఎత్తుగడల ఎదురు దాడుల క్యాంపెయిన్లు నడుస్తున్నాయి. ఇందుకు చక్కని ఉదాహరణగా 2006 జనవరి నుంచీ జూన్ వరకూ యావత్తు దండకారణ్యంలో అత్యంత సమరశీలంగా సాగిన టిసిఓసిని చెప్పుకోవచ్చు. ఇందులో ప్రజల, ప్రజా మిలీషియా కార్యకర్తల భాగస్వామ్యం అపూర్వంగా ఉండింది. ఈ టిసిఓసి ఆరు మాసాలు సాగి ఫాసిస్టు సల్వాజుడుం దాడులను అరికట్టడంలో, దాని విస్తరణను నిలవరించడంలో పూర్తిగా సఫలమైంది.

క్యాంపెయిన్లను కొనసాగించే అవగాహన ఎప్పుడైతే ముందుకు వచ్చిందో అప్పుడే దాని ప్రాముఖ్యత గురించి నాయకత్వం యావత్తు పార్టీ శ్రేణులకు, సైనిక బలగాలకు వివరించింది. పార్టీ ఏ సమస్య పైన ఒక క్యాంపెయిన్‌ను చేపడుతుందో ప్రధానంగా ఆ సమస్యపైనే యావత్తు విప్లవ క్యాంపు తన శక్తియుక్తులను కేంద్రీకరించాలనే అవగాహనను ఇచ్చింది. దీని ప్రకారం 2002 నుంచీ నడుస్తున్న టిసిఓసిలలో మొత్తం విప్లవ క్యాంపులోని సమస్త శక్తులను సమీకరించి దాడులు నిర్వహిస్తోన్న ఫలితంగా దండకారణ్యంలోని సైనిక రంగంలో చెప్పుకోతగిన ప్రగతి సాధ్యమైంది. తొలి సంవత్సరాలలో టిసిఓసి కాలంలో సైనిక చర్యలకూ వివిధ విప్లవ కార్యక్రమాల మధ్య కొంత సమన్వయ సమస్య అనవగాహన మూలంగా ఎదురైనప్పటికీ క్రమంగా దాని నుంచీ పార్టీ బయటపడుతూ ఎంతో మెరుగుదల వచ్చింది. దండకారణ్యంలో జరిగిన సఫల భారీ సైనిక దాడులన్నీ టిసిఓసిల కాలంలోనే జరిగాయన్నది ఒక వాస్తవం. కొన్ని వైఫల్యాలూ లేకపోలేదు. 2001లో ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లాలో చేసిన కలిమెల పోలీస్‌స్టేషన్ రెయిడ్ జయప్రదం కాగా, అదే జిల్లాలోని మోటు పోలీస్‌స్టేషన్ రెయిడ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో గల బాందె పోలీస్‌స్టేషన్ రెయిడ్‌లు పూర్తిగా విఫలం అవడమే కాకుండా భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది. దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు, ప్రజల, కేడర్ల అభిమాన నాయకుడు కామ్రేడ్ క్రాంతి రణదేవ్ తన నులివెచ్చని నెత్తుర్లను తొలి టిసిఓసిలో ధారపోశాడు. ఆయనతో పాటు దండకారణ్య ఆదివాసీ ముద్దుబిడ్డడు దంతెవాడ భూమి పుత్రుడు కామ్రేడ్ మల్లేష్ ఆశయ సాధనలో అసువులు బాశాడు. ఆ తర్వాతి కాలంలో జరిగిన పలు చెప్పుకోదగిన భారీ సైనిక దాడులు ఉదాహరణకు 2006 ఫిబ్రవరి 9న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థకు చెందిన బైలదిల్లా విస్ఫోటన పదార్థ నిల్వల గోదాముపై వెయ్యిమంది ప్రజా మిలీషియా కార్యకర్తలతో పిఎల్‌జిఏ జరిపిన సఫల దాడి, ఆ తర్వాత ఏప్రిల్ 16న జరిపిన మురికినార్ పోలీస్‌స్టేషన్ రెయిడ్ (పశ్చిమ బస్తర్ డివిజన్), 2007 మార్చి 15న జరిగిన రానీబోదిలీ పోలీస్‌స్టేషన్ రెయిడ్, 2009 మేలో గడ్చిరోలి

జిల్లాలో జరిగిన హత్తిగుట్ట మాటుదాడి అలాగే జులై 12న జరిగిన మదనవేడ మాటుదాడి (రాజనాంద్‌గాం జిల్లా), 2010 ఏప్రిల్ 6న జరిగిన చారిత్రాత్మక ముకరం మాటుదాడి (దక్షిణ బస్తర్ డివిజన్), జూన్ 29న జరిగిన కొంగెర (నారాయణ్‌పూర్ జిల్లా) దాడులను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. టిసిఓసిల కాలంలో గెరిల్లాలు భారీ, మధ్య తరహా, చిన్న రకం సైనిక దాడులను సమన్వయంతో కొనసాగించడంలో మంచి నేర్పరులయ్యారు. చిన్న, మధ్య రకం దాడులు ప్రధాన దాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతూ దాని విజయానికి దోహదపడుతున్నాయి.

గ్రీష్మకాలం గెరిల్లాలకు చాలా ప్రతికూలమైందనీ, అడవిలో నీటి కటకట తీవ్రంగా ఉంటుందనీ, ఆకురాలిన అడవిలో నీడా కరువేననీ, ఎండిన అడవిలో మనుషులు చాలా దూరం నుంచీ కంటపడతారనీ, పరచినట్టూ రాలిన ఆకులపై నడిచే మనుషుల రహస్యాన్ని వాళ్ల అడుగుల చప్పుళ్లే బయటపెడతాయనీ క్షుణ్ణంగా తెలిసిన పోలీసులు వేసవిలో అడవి జంతువులను వేటాడే వేటగాళ్లలా గెరిల్లాల వెంటపడడం అతి సాధారణమైన విషయం. వేసవిలో దొరికే అతి కొద్ది నీటితావుల దగ్గర నీడను ఇవ్వగలిగే పచ్చని చెట్ల కిందా పోలీసులు మాటుదాడులు కూచోవడం పరిపాటి. ఇలాంటి పరిస్థితులతో ఎలా వ్యవహరించాలో టిసిఓసిలు నేర్పుతున్నాయి. గెరిల్లాలు చేపట్టే వేసవి టిసిఓసిలలో పోలీసులు పలుమార్లు గట్టిదెబ్బలు తినడంతో గుణపాఠం తీసుకొని 'గెరిల్లాతో గెరిల్లాగా పోరాడు' అనే తక్కువ తీవ్రత యుద్ధ నీతిని అనుసరిస్తూ వాళ్ల ఎత్తుగడలలోనూ వాళ్లూ మార్పులు చేసుకోకతప్పడం లేదు. పోలీసుల ఎత్తుగడలను పరిశీలిస్తూంటే సాధారణంగా వాళ్లు వేసవికి ముందూ లేదా తర్వాత పలుమార్లు తమ దాడి క్యాంపెయిన్‌ను చేపట్టినట్టు దాఖలాలు దొరుకుతాయి. ఫలితంగా వేసవికాలంలో గెరిల్లాలు అనేక ఆత్మరక్షణ చర్యలు చేపడుతూనే ఎత్తుగడలు ఎదురుదాడుల క్యాంపెయిన్‌లో పోలీసులతో తలపడుతూ నూతన అనుభవాలు గడిస్తున్నారు. గెరిల్లాల విప్లవ యుద్ధచర్యలలో వచ్చిన ఒక మౌలికమైన మార్పును ఇక్కడ చెప్పుకోవలసిన అవసరం ఉంది. ఈ దశాబ్ద ప్రారంభానికి ముందు గెరిల్లాలు చాలా వరకు డెలిబరేట్ ఆంబుష్‌లే చేసేవాళ్లు. శత్రువు సమాచారం తెల్సిందంటే ఆత్మరక్షణార్థం ముందే తప్పుకునేవారు. కానీ, పిఎల్‌జిఏ నిర్మాణం అయిన తర్వాతా ముఖ్యంగా టిసిఓసిలు జయప్రదంగా చేపడుతున్న ఫలితంగా పరిస్థితి భిన్నంగా మారింది. పోలీసులు లోతట్టు అడవుల్లోకి వచ్చినట్టుగా జాడ దొరికిందంటే పరిస్థితుల అనుకూల, ప్రతికూలతలను చర్చించుకొని అనుకూలం అనుకుంటే వారితో తలపడడానికి గెరిల్లాలు ఉత్సాహంగా పరుగెత్తుతూ యుద్ధ చర్యలకు దిగడం పెరిగింది. ప్రజల, ప్రజా అధికార రక్షణకు ఇది వారికి అనివార్యమైంది.

## 3 (బి) భర్తీ అభియాన్లు నూతన సైనిక ఫార్మేషన్ల నిర్మాణానికి హామీలు

దండకారణ్య విప్లవోద్యమంలో నూతన శక్తుల భర్తీ ఉద్యమ తొలినాళ్ల నుంచే ప్రారంభమై ఈనాటికీ అది కొనసాగుతోంది. ఉద్యమ ప్రారంభ సంవత్సరాలలో ఆనాటి స్థాయికి తగినట్టూ వేళ్ల మీద లెక్కించతగిన

సంఖ్యలోనే నూతన శక్తులు చేరినప్పటికీ వారి ప్రభావం ఎంతో విస్తృతంగా ఉండింది. ఒక ప్రాంతమంతా యువతరంలో అది ఒక మంచి ప్రేరణగా పనిచేసేది. తొలినాళ్లలో ఉద్యమంలో చేరిన యువతలో మెజార్టీ పురుషులను తమ తల్లి తండ్రులు, గ్రామస్థులూ సంతోషంగా ప్రోత్సహించి పోరాటానికి పంపారనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. వాళ్ల నిజాయితీ, సత్ప్రవర్తన గూర్చి గ్రామస్థులందరూ విప్లవ పార్టీకి హామీగా ఉండేవాళ్లు. కానీ మహిళల విషయంలో అలా ఉండింది కాదు. తెగ పితృస్వామ్య సంకెళ్ల మధ్య నలిగిపోతున్న యువతులు తామే తెగించి ఉద్యమంలో భాగమయ్యారు. వారు కుటుంబంతో, తెగ పెద్దలతో, తెగ సమాజంతో స్వేచ్ఛా సమానత్వాల కోసం ఘర్షణ పడి సంకెల బంధాలు తెంచుకున్నారు. ఆ బంధాలు తెగిన సవ్వడి మహిళా లోకానికి పోరాట సందేశాన్ని చేర్చేది. ఆ తదనంతర క్రమంలో ఉద్యమ సంఘటితీకరణలో భాగంగా మహిళా సంఘాలలో చేరి అనుభవం గడించిన నూతన మహిళా శక్తులు రాజకీయ చైతన్యంతో భర్తీ కాసాగాయి. ఉద్యమంలో భర్తీ అయిన నూతన శక్తులన్నీ ప్రధానంగా స్థానిక ఆదివాసీ శక్తులే గావడం ఉద్యమ విస్తరణకూ, సంఘటితీకరణకు చాలా తోడ్పడింది. ఉద్యమం విశాల ప్రాంతంలో కొనసాగుతూండడంతో ప్రభుత్వం ఒక చోట అమలు చేసే నిర్బంధం, రాజ్యహింస, సైనిక అణచివేత దాడులు మరో చోట భర్తీని ఎప్పుడూ పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫాసిస్టు సల్వాజుడుం కాలంలో వారు అనుసరించిన అణచివేత దాడులు వారికే బ్యాక్‌ఫైర్‌లా తయారై భర్తీలో గుణాత్మక మార్పుకు దోహదపడ్డాయి. 1980, 1985, 1991, 2000, 2004లలో ఆంధ్రప్రదేశ్ రైతాంగ ఉద్యమం నుంచీ విప్లవ పార్టీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా అనేక నూతన శక్తులు తరలివచ్చి దండకారణ్యంలో భాగమయ్యాయి. వీరిలో ఉత్తర తెలంగాణ నుంచీ వచ్చినవాళ్లే అధిక మొత్తంలో ఉంటారు.

2001 నుంచీ క్యాంపెయిన్లు చేపట్టడం మొదలయ్యాక భర్తీ క్యాంపెయిన్లు ప్రతీ యేటా చేపడుతున్నారు. అవసరమైతే యేడాదిలో రెండుసార్లు చేపడుతున్నారు. ఈ దశాబ్దంలో చోటు తీసుకున్న చెప్పుకోతగిన అభివృద్ధికర మార్పుల్లో భర్తీ ఒకటి. దీనికి ప్రధాన కారణం విప్లవోద్యమంపై ప్రజల విశ్వాసం, ఉద్యమంలో వారి క్రియాశీల భాగస్వామ్యం పెరగడం తప్ప మరేమీ కాదు. ప్రజలు విప్లవోద్యమంలో భాగస్వాములు కావడంతో వారి జీవన ప్రమాణాల్లో మంచి మెరుగుదల వచ్చింది. దున్నేవారికే భూమి ప్రాతిపదికన వేలాది ఆదివాసీ రైతాంగానికి సాగు భూములు లభ్యమయ్యాయి. వారు గ్రామీణ దుష్ట పెత్తందార్ల దౌర్జన్యం, అణచివేతల నుంచీ బయటపడ్డారు. దోపిడీ ప్రభుత్వ అధికారుల జులుం, దోపిడీ, హింసా, అత్యాచారాలు దూరమయ్యాయి. వారు ఒక విశాల భూభాగంలో ఆత్మగౌరవంతో జీవించడం నేర్చుకోసాగారు. వారు తరతరాల దోపిడీ పాలన స్థానంలో తమదైన ప్రభుత్వాన్ని తామే ఎన్నుకొని, తామే జవాబుదారిగా దానిని నడుపుకోవడం ఒక అద్భుతమైన కార్యంగా ముందుకు వచ్చింది. 'ఈ అడవి మాదే'నన్న భావన వారిలో ఇనుమడించసాగింది. దీనితో వారు తమ బిడ్డలను యుద్ధంలోకి సైనికులుగా పంపడం చాలా అవసరం అనుకున్నారు.

ముఖ్యంగా మహిళల విషయంలో వారు అనుభవించిన జమిలి హింసలతో (పితృస్వామ్య హింస, రాజ్యహింస) పోరాడకుండా అవి అంతంకావనే వాస్తవం యేటేటా వారికి సుస్పష్టం అవుతూ వచ్చింది. అది వారిని పోరాటోన్ముఖులను చేసింది. వీటన్నింటి ఫలితంగా భర్తీలో చెప్పుకోతగిన మార్పు వచ్చింది. దండకారణ్యంలోని అన్ని ప్రాంతాలలో అక్కడి పోరాటం, ప్రజాపునాదిపై ఆధారపడి నిర్దిష్టమైన సంఖ్యను నిర్ణయించుకొని భర్తీ క్యాంపెయిన్లు చేపడుతూండడంతో అవి చాలా వరకూ సఫలమవుతున్నాయి.

2005 జూన్‌లో సల్వాజుడుం ప్రారంభమయ్యాక భర్తీలో వేగంగా మార్పులు వచ్చాయి. సల్వాజుడుం తొలి దాడులకు పైలట్ బ్లాకులుగా దాని ప్రాయోజకులు ఎంచుకున్న భైరంగఢ్, బీజాపూర్‌లలోనే ఈ మార్పులు మొదటగా సంభవించాయి. ఒక విశాల ఆదివాసీ భూభాగంలో నెలకొన్న ప్రకృతి సంపదలను కొల్లగొట్టుకపోవడానికి పెద్దెత్తున దిగిన దేశ దళారీ బూర్జువా, విదేశాల పెట్టుబడులు ఇక్కడి ప్రకృతి వనరులతో పాటు మానవ వనరుల వినాశనానికి పూనుకున్నాయి. వందలాది గ్రామాల్లోని వేలాది జనానికి భారీ పెట్టుబడులు అత్యంత ప్రమాదకరమైన సమస్యగా, అస్థిత్వ ప్రశ్నగా నిలిచాయి. ఆ పెట్టుబడులతో తలపడకుండా, జీవన్మరణ పోరాటానికి సిద్ధపడకుండా ఆ సమస్యతో మరో రకంగా వ్యవహరించలేని స్థితి దాపురించింది. అయితే ఆ ప్రజలకు సుదీర్ఘకాలంగా తమ మౌలిక సమస్యల పరిష్కారానికై తమతో నిల్చి తమకు నాయకత్వం వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్న విప్లవ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అండగా ఉండడంతో ఆ సమస్యతో వ్యవహరించడానికి వారికి అన్ని విధాల తోడ్పడింది. దానితో పీడిత ప్రజానీకం ఒక గొప్ప పోరాట శక్తిగా నడుం బిగించింది. వందలాది యువత పిఎల్‌జిఏలో చేరిపోయి సాయుధమై 'జల్-జంగల్-జమీన్-జనవాద్' కోసం దృఢంగా నిలిచారు. ఆ పరంపర సల్వాజుడుం విస్తరించిన మేరకూ వ్యాపించింది. ఫలితంగా ఈ దశాబ్ద తొలినాళ్ల సంఖ్య కన్నా దశాబ్దం చివర్లో గెరిల్లాల సంఖ్య నాలుగు రెట్లకు పైగా వృద్ధి చెందింది. అణచివేత ప్రతిఘటనకు దారితీస్తుందన్న నానుడి వాస్తవమని మరోసారి తేలింది.

నూతన శక్తుల భర్తీ విషయంలో 2000 సంవత్సరం వరకూ పార్టీ కమిటీలే పూర్తిగా ఆ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ వచ్చాయి. ఆ తర్వాత విప్లవ ప్రజా సంఘాల, జనతన సర్కార్ల ప్రమేయం పెరిగింది. 2006 తర్వాతి సంవత్సరాలలో విప్లవ ప్రజాసైన్యంలోకి సైనికులను చేర్చే బాధ్యత చాలా వరకు జనతన సర్కార్లకే అప్పగించబడింది. జనతన సర్కార్ల నాయకత్వంలో ఉండే ప్రజామిలీషియా నుంచీ భర్తీ కావడం క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2008 డిసెంబర్‌లో చేపట్టిన 'నూతన శక్తుల భర్తీ' క్యాంపెయిన్‌లో భాగంగా పశ్చిమ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా)లోని గంగలూరు ఏరియాలో అక్కడి ఏరియా జనతన సర్కార్ రెండు బహిరంగసభలను నిర్వహించింది. 3-5 కి.మీ. పరిధిలో అల్లుకపోయిన పోలీసు, అర్ధసైనిక బలగాల కార్పెట్ సెక్యూరిటీ[8] మధ్యనే దాదాపు పదివేల మంది ప్రజలు ఆ సభలకు హాజరయ్యారు. ఆ సభల వేదికపై నుంచీ ఏరియా ప్రభుత్వ అధ్యక్షుడు 'పిఎల్‌జిఏలోకి భర్తీ కావాలంటూ' యువతకు పిలుపు నిస్తూ

ఆహ్వానించాడు. ఆ సందర్భంగా దాదాపు వంద మంది యువతీ-యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భర్తీకి సిద్ధం అంటూ చేతులెత్తి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. దండకారణ్యంలో భర్తీ ఏ విధంగా జరుగుతూందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. కానీ దోపిడి ప్రభుత్వ యంత్రాంగం, వారి రక్షక భటులు, వాళ్ల రాజకీయ నాయకులు వాళ్ల పట్టుకోని మీడియా పర్సన్స్ పనిగట్టుకొని భర్తీ విషయంలో పూర్తిగా అసత్య ప్రచారానికి దిగుతున్నారు. దండకారణ్యంలో ప్రత్యేకించి బస్తర్‌లో ఇంటికొకరు పిఎల్‌జిఏలో చేరాలనీ మావోయిస్టులు ఫర్మానా జారీ చేసి ఆదివాసీ యువతీ-యువకులను పెద్దెత్తున తమలో చేర్చుకుంటున్నారనీ వార్తలు గుప్పిస్తున్నారు. ఇప్పటి వరకూ గడిచిన మూడు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమంలో ఏ ఒక్కరినీ బలవంతంగా పార్టీలోకి కానీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలోకి కానీ చేర్చుకున్నది లేదు. ఏ ఒక్కరికీ జీతభత్యాలు ఇస్తున్నదీ లేదు. ప్రజాసైనికుల పోషణ బాధ్యత మాత్రం పూర్తిగా పార్టీ చూసుకుంటున్నది. ప్రజాసైన్య నిర్మాణం, స్వభావం గురించి తెలియనివాళ్లు ఈ నిజాలను గ్రహించలేరు. దండకారణ్య విప్లవోద్యమాన్ని తుదముట్టించే దుష్టతలంపుతో ప్రారంభమైన సల్వాజుడుం కాలం నుంచీ ఛత్తీస్‌గఢ్ పోలీసులు వ్యూహాత్మక దృష్టితో చేపట్టి అమలు చేస్తున్న 'ఫోర్ కట్' పాలసీలో భర్తీలను నియంత్రించడం ఒకటి. కానీ ఇందులో వాళ్లు ఈ ఆరేళ్లలో ఏమాత్రం సఫలం కాలేకపోయారనీ నిర్దిష్టంగా ఈ కాలంలో అభివృద్ధి చెందిన విప్లవోద్యమమే జవాబు చెపుతోంది. ప్రస్తుత పరిస్థితులలో పిఎల్‌జిఏలో చేరుతున్న యువతకు బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో దృఢంగా పోరాడిన వీర బాబూరావు సడ్మేక్ నాయకత్వంలో గూండాదూర్, గేంద్‌సింగ్, వీర నారాయణ సింగ్ తదితర పడియోర్ స్ఫూర్తిదాయకం అనీ, వీళ్లంతా వారి వారసులేనని తప్పక గుర్తు పెట్టుకోవాలి.

విప్లవోద్యమంలో చేరుతున్నవాళ్లలో మూడొంతులకు పైగా 18 నుంచీ 25 సంవత్సరం మధ్య వయస్కులైన యువతనే కావడం, గెరిల్లా దళాలకూ, ఆ పై సైనిక నిర్మాణాలైన ప్లాటూన్, కంపెనీలకు కమాండర్ బాధ్యతలు చేపడుతున్నవారిలో అధిక శాతం 23-28 మధ్య వయస్సు కలవారే కావడంతో సైనికరంగంలో వారు చురుగ్గా ఉంటూ గెరిల్లాలు ఎదుర్కొనే కష్టాలను తట్టుకోగలుగుతూ అద్భుతమైన ఫలితాలు సాధించడానికి తోడ్పడుతున్నది. వీరిలో దాదాపు 70 శాతం గెరిల్లాలు ఆదివాసీ పేద రైతు వర్గం నుంచీ, 20-25 శాతం మధ్యతరగతి ఆదివాసీ రైతు వర్గం నుంచీ మిగిలిన అతి కొద్ది శాతం మాత్రం ధనిక రైతాంగం నుంచీ భర్తీ అవుతూండడంతో వర్గ పోరాటంలో దృఢంగా నిలబడి అభివృద్ధి చెందుతున్నారు. వీరంతా స్థానికులే కావడంతో పరిసరాలపై మంచి పట్టును కలిగి వుంటూ, ప్రజలతో కలిసి పోతూ గెరిల్లా మెలకువలు సులువుగా అలవర్చుకుంటున్నారు. వీరిలో అవివాహితులే అత్యధికంగా ఉంటారు. చివరకే అయినప్పటికీ వీటన్నింటికన్నా విప్లవాంశను కలిగి ఉన్న అతిముఖ్యమైన విషయాన్ని ఇక్కడ తప్పక చేర్చుకోవాలి. వీళ్లంతా మూడు దశాబ్దాల విప్లవ పోరాట, రాజకీయాల మధ్య వర్గ పోరాటంలో పుట్టి పెరిగిన నవతరం కావడం ఎంతో అనుకూలమైన విషయం. అయితే వీరిలో 60 శాతానికి మించిన గెరిల్లాలకు, 40-50 శాతం కమాండర్లకూ పొగ నమలడం అనే దురలవాటు కొనసాగడం వారి యుద్ధ

జీవితానికి కావాల్సిన ఆరోగ్యాన్ని రకరకాలుగా చెడగొడుతోంది. వీరందరి తెగ, వర్గం, గోత్రం, కుటుంబ పుట్టుపూర్వోత్తరాలు, సంబంధాలు అన్నీ సాంగోపాంగంగా ఎరిగిన అనుభవజ్ఞులైన పార్టీ నాయకత్వం దండకారణ్యంలో కొనసాగుతూండడం ఉద్యమ ప్లస్ పాయింట్‌గా చెప్పుకోవాలి.

దండకారణ్యంలోని గెరిల్లాల వర్గపొందిక చూస్తుంటే చైనా ఎర్రసైనికుల పొందికను తలపింప చేస్తున్నది. చైనా ఎర్ర సైనికుల సగటు వయసు 19 ఏండ్లు కాగా అందులోని అధికారుల సగటు వయసు 24 సంవత్సరాలు. వీళ్లంతా దాదాపు ఎనిమిదేళ్ల పోరాట అనుభవాన్ని కలిగి వున్నవారే. వీరిలో 38 శాతం శ్రామిక వర్గాల నుంచీ, 58 శాతం రైతాంగం నుంచీ వచ్చినవారు. ఎర్రసైనికులలో 60-70 శాతం మంది సైనిక జీవితంలో చదువు నేర్చుకున్నారనేది వాస్తవం.

వందల సంఖ్యలో నూతన శక్తులు భర్తీ కావడం ఉద్యమ పటిష్టతకూ, ఉద్యమ విస్తరణకూ ఎలా ఉపయోగపడుతూందో అలాగే దీర్ఘకాల విప్లవోద్యమంలోని గెరిల్లా జీవితంలో ఉండే కష్టతర జీవితాన్నీ, సమస్యలనూ, శత్రువు అనుసరిస్తున్న తీవ్రమైన, దుర్మార్గమైన అణచివేత దాడులను వ్యూహాత్మకంగా రాజకీయ దృష్టితో అర్థం చేసుకోలేక, వాటికి తట్టుకోలేక, యుద్ధ సంస్కృతికి అలవాటు పడలేక ఉద్యమంలో నుంచీ దాదాపు 1/3 వంతు కేడర్లు వెనక్కి వెలుతున్నారు. ఇది ఉద్యమంపై నకారాత్మక ప్రభావాన్ని వేస్తోంది. అయితే వీరిలో శత్రువు ముందు లొంగిపోతున్నవారి సంఖ్య 5-10 శాతం మధ్య ఉంటోంది. కానీ శత్రువు చూపే ప్రలోభాలకూ, పెట్టే మానసిక, శారీరక చిత్రహింసలకూ తట్టుకోలేక రాజకీయంగా డీలాపడి వారు శత్రువుకు చేరవేస్తున్న పార్టీ, ఉద్యమ రహస్య సమాచారంతో కలిగిస్తున్న నష్టం చాలా తీవ్రంగా ఉంది. విప్లవ ప్రజానీకంపై చాలా నెగిటివ్ ప్రభావం పడుతోంది. శత్రువు ముందు లొంగిపోకుండా వుంటున్న వారిని ప్రజలు, జనతన సర్కార్లు కాపాడుకుంటూన్నాయి. దాదాపు వీరంతా తిరిగి గ్రామ ప్రజా మిలీషియాలో ఉంటూ ప్రతిఘటనోద్యమంలో పాలుపంచుకుంటున్నారు. వీరు అధికాధికంగా సల్వాజుడుం పీడిత ప్రాంతాల వారే కావడం గమనార్హం.

భర్తీలో యేటేటా పెరుగుదల ఉండడంతో ఉద్యమం సుదూర నూతన ప్రాంతాలకు సైతం విస్తరించగలుగుతోంది. శత్రువు అనుసరిస్తున్న అణచివేత, నిర్మూలన ఎత్తుగడలకు ధీటుగా అంతర్గత, బాహ్య భూభాగంలో చేపడుతున్న విస్తరణ 2004 నుంచీ మంచి ఫలితాలను ఇస్తోంది. 1990-91లో దండకారణ్యం నుంచీ కాంకేర్, బాలాగాట్, మాండ్లా (మధ్యప్రదేశ్)ల వైపు విస్తరించిన తర్వాత తిరిగి దాదాపు ఒకటిన్నర దశాబ్ద కాలానికి చేపట్టిన బాహ్య విస్తరణలో భాగంగా దంతేవాడ జిల్లాలోని దర్భ, రాజనాంద్‌గాం, దుర్గ్ జిల్లాల్లోని అపార ఖనిజ నిక్షిప్త ప్రాంతాలైన పల్లెమాడి, మాన్పూర్‌లకు ఉద్యమ విస్తరణ జరిగింది. ఇదే సమయంలో మాడ్ ప్రాంతంలోనే తూర్పు వైపూ ఒక ప్రత్యేక డివిజన్ తూర్పు బస్తర్ పేరుతో అస్థిత్వంలోకి వచ్చి అంతర్గత విస్తరణకు దోహదం చేసింది. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకే 2007 ప్రారంభంలో మరో విడత బాహ్య విస్తరణకు పార్టీ పూనుకున్నాది. ఈసారి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర

రాజధాని దరిదాపుల్లోకి విప్లవోద్యమం చేరుకుంది. ధంతరీ, రాయపూర్ జిల్లాలు ఉద్యమ ప్రభావంలోకి వచ్చాయి. రాష్ట్ర తూర్పు సరిహద్దుల్లోని ఒడిషా రాష్ట్రానికి చెందిన నవాపాడాలోకి మావోయిస్టులు అడుగుపెట్టారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో గల దేవ్‌భోగ్ (ఛత్తీస్‌గఢ్) ప్రాంతం వజ్రపురాళ్లకు ప్రసిద్ధి చెందింది. అక్కడ ఉద్యమం కాలూనుకోవడంతో ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాలను కలుపుకొని మరింత ముందుకు ఝార్ఖండ్ వైపూ దండకారణ్య బలగాలు 2010 మే నెలలో తరలివెళ్లాయి. దీనిని ఒక చారిత్రాత్మకమైన విస్తరణగా చెప్పుకోవచ్చు. ఈ విస్తరణ సాపేక్షికంగా ఎక్కువ సంఖ్యలో సైనిక నిర్మాణాల సంరక్షణలో పార్టీ నూతన ప్రాంతాలలో తన విప్లవోద్యమాన్ని విస్తరించుకోవడం విశేషం. అభివృద్ధి చెందుతున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం రేపటి తన భవిష్యత్‌లో మరింత వేగంగా చేపట్టే విస్తరణకు ఈనాటి విస్తరణ ఒక రేఖామాత్ర చిత్రాన్ని విశాల భారత పీడిత ప్రజారాశుల ముందు ఆశాకిరణంగా ఉంచగలగింది. దేశంలోని ఏ ప్రాంతానికి విప్లవోద్యమం విస్తరించినా విప్లవకారులకు ఎదురవుతున్న అక్కడి ప్రజల అపార ఆదరాభిమానాలు, స్వాగతం ఈ దేశంలో నానాటికి తీవ్రతరమవుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. ఆయా ప్రాంతాలలో ప్రజలు తమ బిడ్డలను స్వచ్ఛందంగా సాయుధ విప్లవోద్యమంలో భాగం చేస్తున్నారు. ఇది పిఎల్‌జిఏ పిఎల్ఏగా ఎదగడానికే కాకుండా దాని అపార వికాసానికి హామి నిచ్చే ప్రప్రధాన అంశమవుతుంది.

## 3 (సి) భారత అర్ధసైనిక బలగాలతో తలపడుతున్న పిఎల్‌జిఏ గెరిల్లాలు

1980లో దండకారణ్య అడవుల్లో గెరిల్లాలు ప్రవేశించినప్పుడు వారిని అడ్డుకోవడానికి, వారి పురోగమనాన్ని నిరోధించడానికి 'రాజ్యం' ప్రధానంగా సాధరణ పోలీసులను మోహరించింది. ఆనాడు బస్తర్, గడ్చిరోలి జిల్లాల్లో తాలూకాకు ఒక పోలీస్‌స్టేషన్ మాత్రమే ఉండింది. అందులో ఉండే పోలీసులు, సిబ్బంది అంతా కలసి డజనుకు లోపే, వారి ప్రధాన ఆయుధం మస్కట్ తుపాకులు. తాలూకాలోని కొంచెం పెద్ద గ్రామాల్లో ఉండే అవుట్‌పోస్టులలో ఇద్దరు లేదా ముగ్గురు లాఠీలు పట్టుకున్న పోలీసులు ఉండేది. కానీ ఈనాడో!

ప్రపంచంలోనే అతి విశాలకాయమైన భారత అర్ధసైనిక బలగాలు ప్రస్తుతం పెద్దసంఖ్యలోనే దండకారణ్యంలో మోహరించి ఉన్నాయి. అర్ధసైనిక బలగాలలో ఉన్న ఆరు రకాల బలగాలూ ఇక్కడ ఎదురవుతాయి. భారతదేశంలో మూడవ అతిపెద్ద జిల్లా అయిన పాత బస్తర్ జిల్లాను ఈ దశాబ్ద ఆరంభం నాటికే విడగొట్టడం మొదలై ఇప్పుడు ఐదు జిల్లాలుగా ఉనికిలోకి వచ్చింది. రేపు మరెన్ని జిల్లాలుగా విడగొడుతారో! ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పుడున్న మూడు పోలీసు జిల్లాలకు తోడు త్వరలో మరో 4 పోలీసు జిల్లాలను ఏర్పర్చనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి రమన్‌సింగ్ 2011 ఫిబ్రవరిలో స్పష్టం చేశాడు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో భాగంగా ఉన్న గడ్చిరోలి 1980లో విడి జిల్లాగా ఏర్పడింది. 2010 అక్టోబర్ నాటికి ఈ జిల్లాలో అహిరి ఒక నూతన పోలీసు జిల్లాగా ప్రకటితమైంది. గడ్చిరోలి జిల్లాలో

దాదాపు 60 పోలీస్ స్టేషన్లు ఉండగా బృహత్ బస్తర్ (పోలీసు పరిభాషలో ఐదు జిల్లాలు కలసి బస్తర్ రేంజ్‌గా మారింది)లో అంతకు రెట్టింపు సంఖ్యలో పోలీసు స్టేషన్లు వెలిశాయి. నూతనంగా విస్తరించిన రాజనాంద్‌గాం జిల్లాలో త్వరత్వరగా నూతన పోలీసు స్టేషన్లను ప్రారంభిస్తూ నేటికి వాటి సంఖ్యను 24కు పెంచారు. ఇక అర్ధసైనిక బలగాలతో పుట్టగొడుగుల్లా పుట్టుక వచ్చే అదనపు క్యాంపులు అనేకం ఉన్నాయి. వయసు మళ్లీ, చురుకుతనం తగ్గి, బొర్రలు విరుచుకు తిరిగే బజారు గూండాగిరి పోలీసులకు కాలం చెల్లిపోయిందనీ, మంచి శరీర దారుఢ్యం, చురుకుదనంతో కూడిన యువ కమాండోలే గెరిల్లాలతో తలపడగలరనే స్పష్టమైన అవగాహనతో 'రాజ్యం' ప్రత్యేక శిక్షణతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లను రూపొందిస్తోంది. ఇప్పుడు స్వచలిత రైఫిళ్లే (ఏకె, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ మొదలైనవి) వారి ప్రధాన ఆయుధాలు. వీటితో పాటు ఏరియా ఆయుధాలుగా గుర్తించే గ్రెనేడ్లు, మోర్టార్లు, రాకెట్ లాంచర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చాయి. ప్రతి 5 నుంచీ 10 కి.మీ.ల పరిధిలో 1-2 పోలీసుస్టేషన్లు లేదా క్యాంపులు. ఆదివాసీ గ్రామాలనూ, అడవినీ చుట్టుముట్టి ఉన్నాయి. దీనిని కార్పెట్ సెక్యూరిటీగా వ్యవహరిస్తున్నారు. దేశంలో సగటున లక్ష ప్రజలకు 160 మంది సాయుధ భటులుండగా, దండకారణ్యంలో 205 మంది పోలీసులున్నారు. (ఈ సంఖ్యలో అర్ధ సైనిక బలగాలు చేరలేదు) సైనిక దృష్టితో ఒక గెరిల్లాకు 12 మంది పోలీసుల మోహరింపు అంటూ అంచనాలు వేసే పోలీసు గణాంకాలను తలకిందులు చేసే విధంగానే ప్రస్తుత దండకారణ్యా మోహరింపులున్నాయి. భారత సైనిక ఇన్‌ఫాంట్రీ డివిజన్‌కు గెరిల్లా శిక్షణ పేరుతో భారత సైనిక అధికారులు స్థల సేకరణ సర్వేలో భాగంగా జనవరి 2011లో దండకారణ్యం చేరారు. ఆరేళ్ల కిందటి ప్రభుత్వ నిర్ణయం అంటూ ఇప్పుడు ఆగమేఘాల మీద గెరిల్లా యుద్ధతంత్ర శిక్షణా కేంద్రాన్ని మాడ్ నాభిలో ఏర్పర్చడానికి పూనుకుని ముందుగా 100 చ.కి.మీ. (25 వేల ఎకరాలు) స్థలాన్ని చూపి వెళ్లారు. వారికి కావల్సిన మరో 500 చ.కి.మీ. సర్వే చేస్తున్నారు. దీనికి తోడుగా 'పౌర సమాజం'లోని అనేక మంది ప్రజాస్వామికవాదుల నుంచీ వ్యతిరేకత వచ్చినప్పటికీ పెడచెవిన పెడుతూ చిదంబరం వాదనలకు పెద్ద పీట వేసిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల పైకి అవసరమైనపుడు ఆత్మరక్షణ కోసం అంటూ వైమానిక దాడులకు అంతిమంగా 2010 ఆగస్టు 13 నాడు అనుమతి నిచ్చింది. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా, సరఫరాల కోసం అంటూ దిగిన రెండు మిగ్-17లు, రెండు మానవ రహిత విమానాలు (డ్రోన్) ఆ పనిలో నిమగ్నమయ్యాయి. మిగ్-17లలో చాలా వరకు మూలకు పడ్డాయంటూ ఇప్పుడు భారీ వ్యయంతో రష్యానించి మరిన్ని మిగ్-17లను సమకూర్చుకుంటున్నారు. మరిన్ని డ్రోన్‌లు వస్తాయంటున్నారు. ఇవి కాకుండా రాష్ట్రాలు విడిగా హెలికాప్టర్లను సమకూర్చుకుంటున్నాయి. నెలకు కోటి రూపాయిల ఖర్చుతో గడ్చిరోలి పోలీసులు 2011 మార్చిలో అద్దె విమానాన్ని సమకూర్చుకున్నారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న నేటి దండకారణ్య స్థితి ఇది. అందుకే దీనిని భారత హోంమంత్రి చిదంబరం, హోంకార్యదర్శి జికె పిళ్లైలు (ఈయన 2011 జూలైలో విశ్రాంత వర్గంలో చేరిపోయాడు) పదే పదే అంతర్యుద్ధ వాతావరణం అంటూ నిర్వచిస్తున్నారు. దేశానికి ఉత్తరాన కాశ్మీర్, ఈశాన్యాన అనేకలలో మోహరించి

వున్న భారత అర్ధసైనికులుగా మూడవ ఫ్రంటుగా వాటి సరసన మధ్య భారతంలోని దండకారణ్యాన్ని చేర్చారు.

మావోయిస్టుల నిర్మూలన కోసం గెరిల్లా శిక్షణలోకి దింపిన భారత సైన్యాల అసలు యుద్ధ చర్య కొంత చూద్దాం. 1947 తర్వాత గడిచిన దాదాపు 65 సంవత్సరాలలో దేశ సైన్యాలు 146 రోజులు మాత్రమే సరిహద్దుల్లో విదేశీ సైన్యాలతో యుద్ధం చేశాయి. అంతేతప్ప వాటి శక్తినంతా ప్రధానంగా దేశ అంతర్గత భద్రత పేరుతో గత 4 దశాబ్దాల కాలంగా ప్రజలపైనే ఉపయోగిస్తున్నారు. భారత రాజ్యాంగంలోనే దేశ అంతర్గత భద్రత విషయంలో “భారత ప్రభుత్వం సాయుధ బలగాలను ఉపయోగించవచ్చు”ననీ చాలా ముందుచూపుతోనే పాలకవర్గాలు రాసుకున్నాయనీ వాటి భారత చరిత్రను పరిశీలిస్తే సులువుగానే అర్థమవుతుంది. ప్రపంచంలో విశాల ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకునే దేశ రాజ్యాంగంలో “అవసరమైన, ఆమోదయోగ్యమైన స్థాయిలో హింసను ప్రయోగించవచ్చు”ననే విషయం స్పష్టంగానే ఉంది. ఈ అవసరం, ఆమోదయోగ్య స్థాయి నిర్ణయించేది దోపిడీ పాలకవర్గాలే. జమ్ము-కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో అనేక దశాబ్దాలుగా ప్రజ్వరిల్లుతున్న జాతుల విముక్తి పోరాటాలు గత నాలుగు దశాబ్దాలుగా భారత సైన్యాలతో చేస్తున్న పోరాటం నిజానికి దోపిడీ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాల ఫలితమేనన్నది మర్చిపోవద్దు. అలాగే నేటి దండకారణ్యానికి దిగిన భారత అర్ధసైనిక బలగాలు మావోయిస్టు 'వైరస్'ను త్వరితంగా నిర్మూలించాలనీ వేగిరపడుతున్నాయి. దీని వెనుక గల నిశితమైన విప్లవ వర్గపోరాట రాజకీయాలే అందుకు కారణం. అయితే 1946-51 నాటి వీర తెలంగాణ విప్లవ రైతాంగ పోరాటాన్ని వారం రోజుల్లోనే అణచివేస్తామని విర్రవీగుతూ దిగిన నెహ్రూ సైన్యాలే మూడేళ్లు అక్కడి ప్రజాయుద్ధంలో దిగబడిపోయాయి. 1991లో శ్రీలంక తమిళ పులుల పైకి వెళ్లిన భారత సైన్యాలకూ అదే గతి పట్టి పెద్ద ఓటమితో వెనక్కి వచ్చాయి. రేపు దండకారణ్యం సహా మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాలు ఎలాంటి గుణపాఠం నేర్పుతుందో ఊహించడం కష్టమేమీ కాదు. ప్రజాయుద్ధంలో ప్రజలే అజేయులనే విషయం చరిత్రలో అనేక చోట్ల రుజువైన విషయం కదా!

గెరిల్లాలతో తలపడడానికి అన్ని రాష్ట్రాల్లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లను ప్రత్యేక శిక్షణతో తీర్చి దిద్దుతున్నారు. దండకారణ్యంలోని ఉత్తర బస్తర్ డివిజన్ (కాంకేర్ జిల్లా)లో ఏర్పర్చిన శిక్షణా కేంద్రంలో విశ్రాంత సైనికాధికారి బ్రిగేడియర్ పోన్‌వార్ మార్గదర్శకత్వంలో త్వరత్వరగా బలగాల శిక్షణను పూర్తి చేస్తున్నారు. 2006-ఆగస్టు 2010 వరకు గడచిన ఐదు సంవత్సరాలలో దాదాపు 19 బ్యాచ్‌లలో 12 వేలకు పైగా పోలీసులకు 45 రోజుల గెరిల్లా శిక్షణ గరిపారు. ప్రభుత్వం మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రాలుగా ప్రకటించిన ఐదు రాష్ట్రాలలోని 223 జిల్లాల నుంచీ పోలీసులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. ఈ దశాబ్ద ప్రారంభంలో ఈ జిల్లాల సంఖ్య కేవలం 56 జిల్లాలుగానే చెప్పారు. ఇందులో తీవ్రంగా ప్రభావితమంటున్న 70 జిల్లాలకూ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ బలగాల శిక్షణలో వాటికి సంఖ్యాపర

ప్రాముఖ్యతను కల్పిస్తున్నారు. వీరందరికీ 'పొంచి ఉన్న ప్రమాదాన్ని వెంటనే దాడి చేసి నాశనం చేయి' అనే చాణక్యనీతి ఆధారంగా సైనిక శిక్షణ ఇస్తున్నప్పటికీ 'మా బలగాల ఆత్మస్థైర్యం' దిగతుడుపుగా ఉందనీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వ్యవహారాల మంత్రి (పోలీసు మంత్రి) నన్‌కీరాం కంవార్ నిర్మొహమాటంగా పదే పదే చెప్తుతున్నాడు. మరోవైపు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఇలాంటి నివేదికలనే విడుదల చేస్తోంది. మావోయిస్టుల ప్రభావం దేశంలో అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా గత ఐదేళ్లుగా నమోదవుతున్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల ఆత్మస్థయిర్యం నానాటికి కునారిల్లుతోందనీ బహిరంగంగానే చేస్తున్నారు. 2009 జూలై 15 నాడు 29 మంది కమాండోలను జంగిల్ వార్‌ఫేర్ శిక్షణకు వెళ్లనందుకు ఉద్యోగం నుంచీ సస్పెండ్ చేశారు. తిరిగి ఆగస్టు 14 నాడు 15 మంది పోలీసులను, ఆగస్టు 26 నాడు 13 మంది పోలీసులను కౌంటర్-ఇన్‌సర్జెన్సీ చర్యలలో పాల్గొనడానికి నిరాకరించినందుకు ఏకంగా ఉద్యోగం నుంచీ ఊడబీకారు. వీరంతా కాంకేర్‌లోని జంగిల్ వార్‌ఫేర్ ట్రేనింగ్ స్కూల్‌లో ప్రత్యేక శిక్షణను పొందినవారే కావడం విశేషం. కౌంటర్ ఇన్‌సర్జెన్సీ చర్యలలో పాల్గొనడానికి నిరాకరించిన ఈ కమాండోలలో పీడిత ప్రజల పట్లా అభిమానం ఉన్నవాళ్లు ఏ ఒక్కరూ లేరని ఎలా చెప్పగలం? ఇలాంటి వాళ్ల సంఖ్య పెరుగుతూపోతే రానున్న ప్రమాద సంకేతాలను గ్రహించే వాళ్లను ఉద్యోగాల నుంచీ ఊడదీశారని ఎందుకనుకోకూడదు? ఈ విషయాలు ఎలా ఉన్నా వారి నివారణతో మనం వారి ఆత్మస్థయిర్యాన్నే ప్రస్తుతం అర్థం చేసుకుందాం. ఈ శిక్షణా, బలగాల మోహరింపూ, అన్ని రకాల అణచివేత చర్యలూ ఆర్థికంగా ప్రజలపై ఎంత భారం వేస్తున్నాయంటే ఛత్తీస్‌గఢ్‌లో ఫాసిస్టు సల్వాజుడుం, గ్రీన్ హంట్ ఆపరేషన్ లేకముందు 2004లో పోలీసు బడ్జెట్ కేవలం 268 కోట్లు మాత్రమే ఉండగా 2010 నాటికి అది ఐదు రెట్లకు పైగా పెరిగి 1100 కోట్లకు పడగలెత్తింది. ఈ పోలీసు పద్దు 2011-12 వార్షిక బడ్జెట్‌లో మున్నెన్నటికన్నా ఎక్కువగా 35% పెరిగి 1,535 కోట్లకు చేరింది. రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్న సంక్షోభ భారాన్ని లెక్కచేయకుండా న్యాయమైన ప్రజా పోరాటాలను కర్కశంగా లాఠీలతో, తుపాకులతో అణచివేసే పోలీసు పద్దుపై ఇంతేసి మొత్తాలు ఖర్చు చేయడం దోపిడీ వర్గాలకే చెల్లుతుంది. పెద్ద మొత్తాల్లో ఖర్చుపెట్టే 'హిడెన్' పద్దులు అసలు ఇందులో లేనే లేవు.

2003 నుంచీ క్రమంగా దండకారణ్యంలో గెరిల్లాల యుద్ధం ప్రధానంగా కమాండో బలగాలతోనూ, భారత అర్ధసైనిక బలగాలతోనే జరుగుతోంది. వీరిలో పోలీసు రోల్ మోడల్ ఆంధ్ర గ్రేహౌండ్స్ కమాండోలు 2006 నుంచీ సరిహద్దుల్లోని గోదావరి నదిని దాటి బస్తర్, గడ్చిరోలి అడవుల్లోని లోతట్టు గ్రామాలపైకి దాడులకు రావడం బాగా పెరిగింది. వీళ్లతోనూ గెరిల్లాలు తలపడాల్సి వస్తోంది. నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాలలో పోరాటకారులను ఎదుర్కొన్న అనుభవం ఉందనే దానితో ఆ బలగాలనూ దండకారణ్యంలోకి దించారు. దండకారణ్య గెరిల్లాలు వారితో పోరాడిన అనుభవం సంపాదించారు. కరుడుగట్టిన పోలీసు అధికారులకు ఇక్కడి బాధ్యతలు ఇస్తున్నారు. ఏ.డబ్ల్యు. అన్సారీ నుంచీ కల్లూరి వరకూ ఇక్కడ పదవులు అలంకరించిన డిఐజిలు పరమ దాష్టీకానికి ప్రతిరూపాలుగా నిల్చినవారే. అన్సారీ 2005-06లలో చేయని ఘోరాలు లేవు. హద్దులెరుగని అవినీతిపరుడు. వృత్తిరీత్యా డిఐజి ప్రవృత్తి రీత్యా అందుకు తగినట్టే పీడకుడు.

చివరకు అవినీతి, లంచగొండితనంలో ప్రత్యక్షంగా పట్టుబడి బదిలీ అయ్యాడు. కల్లూరి కూడా ఈ కోవకు చెందినవాడే. ఆయన వ్యవహారం ఖాకీలకే తలవంపు తెస్తుందనే వరకు మీడియాలో చర్చలు సాగాయి. చివరకు ఈయన గారు కూడా ఈ మధ్యే మార్చి 2011లో పోలీసు శిక్షపై బదిలీ అయ్యారు. వున్నతాధికారుల అండదండలు దండిగా ఉండడంతో ఈయన్ని ఛత్తీస్‌గఢ్‌లోనే దక్షిణం నుంచీ (బస్తర్), ఉత్తరానికి (సర్గూజా) బదిలీ చేశారు తప్ప రాష్ట్రం వదలి వెళ్లనివ్వలేదు. గత ఒకటిన్నర దశాబ్ద కాలంగా బస్తర్ అడవుల్లోనే పదవిపై పదవిని అలంకరిస్తూ ప్రమోట్ అవుతున్న అధికారి టి.జె. లాంగ్‌కుమేర్. ఈయన జిల్లా ఎస్పి నుంచీ మొదలై ఈనాడు డిఐజి హోదాకు చేరుకున్నాడు. అణచివేత దాడులు నిర్వహించడంలో ఈయనకు ఈయనే సాటి. ఎంతోమంది అమాయక ఆదివాసీ ప్రజలను హత్య చేసి బూటకపు ఎదురుకాల్పుల కథలల్లిన అబద్ధీకుడు ఈయన. బస్తర్‌కు చేరిన అధికారుల తీరుతెన్నులు ఇలా ఉండగా గతంలో ఎప్పుడో బస్తర్‌లో ఎస్.పి.గా పనిచేసి ఇంటలిజెన్స్ విభాగంలో దాదాపు స్థిరపడిన విశ్వరంజన్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2007లో ఏరికోరి రాష్ట్రానికి డీ.జీ.పీ.గా తెచ్చుకుంది. ఈయన పనికిరాని అసమర్థుడు అనే ప్రచారం ప్రారంభంలో జోరుగా సాగింది. కానీ తాను పూర్తిగా సమర్థుడనేనంటూ బాధ్యతలు చేపట్టి పరిస్థితులను 'నికృష్ట' స్థాయికి దిగజార్చాడు. ఈ ఖాకీ మహానుభావుడు కలం 'యోధుడు' కూడా. పాలకవర్గాల వైరుధ్యాల కుస్తీలో భాగంగా 2011 జూలైలో మరో విభాగానికి మారాడు. ఛత్తీస్‌గఢ్‌లోని 'కాషాయ' ప్రభుత్వం తనకు రక్షణ సలహాదారులుగా దేశంలో ప్రజా పోరాటాలను అణచడంలో కరుడుగట్టిన పోలీసు అధికారులను నియమిస్తోంది. వీరిలో పంజాబ్ ప్రజా పోరాటాలను 1980వ దశకంలో దారుణంగా అణచివేసిన కె.పి.ఎస్. గిల్ కూడా ఉన్నాడు. చివరకు రాష్ట్ర గవర్నర్లుగా కూడా భారత సైన్యంలో ఉన్నత పదవులు నిర్వహించి విశ్రాంత జీవితం గడుపుతున్నవారినే తెచ్చి నియమిస్తున్నారు. ఇదంతా యుద్ధ నిర్వహణ వ్యూహంలో భాగంగానే సాగుతున్నదని విడిగా చెప్పాల్సిన అవసరమే లేదు.

భారత పోలీసు బలగాల ప్రత్యేకతలలో చెప్పుకోతగినది వారి క్రూరత్వం. ఒకరిని మించి మరొకరు ప్రజలతో దుర్మార్గంగా వ్యవహరిస్తారు. అత్యాచారాలు, దొమ్మీ, లూటీ, గృహదహనాలు, దౌర్జన్యం, వేధింపులు, చిత్రహింసలు అంతిమంగా మనుషులను మాయం, హత్యలు చేయడంలో ఒకరిని మించినవారు మరొకరు. వీరి దగ్గర శిష్యరికం చేస్తున్నవారు ఎస్పిఓలు. వీళ్లు స్థానికులు కావడం, వీరిలో చాలా మంది ప్రజావ్యతిరేకుల కుటుంబాల నుంచీ వచ్చినవారో లేదా లంపెన్ గుణగణాలు అబ్బినవాళ్లో కావడంతో ప్రజల్లో వీరి పట్లా తీవ్ర అసహ్యం, క్రోధం నెలకొని ఉంది. వీరి వ్యవహార పద్ధతి గురించి పైకి ప్రజల 'హృదయాలను, ఆలోచనలనూ గెలుచుకొనే'లా ఉండాలనీ బోధిస్తున్నారు. అందుకు మానవ ముఖాన్నీ అంటూ స్థానికులను రక్షించడాన్నీ, అదనపు నష్టాలను నివారించడాన్నీ, విచక్షణా రహిత బలప్రయోగ నివారణనూ చేపట్టాలనీ సెలవిస్తున్నారు. కానీ ఇందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. 'కార్డెన్ అండ్ సెర్చ్' (చుట్టుముట్టి వెతకడం) ఆపరేషన్లలో గ్రామాలను చుట్టుముట్టి తోచినంత మందిని పోలీసులు హత్య చేస్తున్నారు. అడవులనూ గాలిస్తూ అక్కడ తటస్థపడే ఆదివాసులనూ హత్య చేస్తున్నారు.

మహిళలపై సామూహిక అత్యాచారాలు చేస్తూన్నారు. వారి శరీరాలను తుపాకి బాయ్‌నెట్లతో పొడిచి పొడిచి చంపుతున్నారు. ఆ శవాలను మాయం చేయడమో లేదా మావోయిస్టులుగా ప్రకటించి 'పౌర సమాజం' ముందు పరమ అనాగరికంగా కర్రలకు వేలాడదీసుకొని భయంగొల్పే విధంగా ప్రదర్శనలు చేస్తున్నారు. పోలీసులంటేనే ప్రజల్లో పరాయివాళ్లుగా, దుష్టులుగా, పీడకులుగా, హంతకులుగా, అరాచకులుగా స్థిరపడిపోయిన భావాలను రుజువు చేసుకుంటున్నారు. నిజానికి వీరికి 'రాజ్యం' ఇస్తున్న శిక్షణే అలాంటిది. ఇవి ఈ వ్యవస్థ తాలూకు లక్షణాలను ప్రతిబింబిస్తాయి. అందుకే ప్రజా గెరిల్లాలు విప్లవ ప్రజల సంరక్షణకై పోలీసులతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. ఫలితంగా, ఈ దశాబ్ద కాలంలో వారు అనేక త్యాగాలు చేస్తూ 800 మందికి పైగా పోలీసులను దండకారణ్యంలో అంతమొందించారు. మరో 850 మందిని గాయపర్చారు. 600 తుపాకులను, 54 టన్నుల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పల్లెం నిండా పెట్టుకున్న అన్నంలో నుంచీ బుక్క-బుక్కే నమిలి మింగినట్టూ అడవంతా పరచుకున్న పోలీసుల్లో నుంచీ వీలైన చోటల్లా గెరిల్లా ఎత్తుగడలతో వాళ్లను దెబ్బతీస్తూ పోలీసుల మనోబలాన్ని రోజు రోజుకూ పరీక్షకు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా పిఎల్‌జిఏ గెరిల్లాలు 2 వేల మంది పోలీసులను మట్టుబెట్టారు. దాదాపు అంతేమందిని గాయపర్చారు. 2500 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. సల్వాజుడుం, సెంద్రా, గ్రీన్ హంట్ ఆపరేషన్లను ఎదుర్కోవడంలో భాగంగా 2006 నుంచీ 2011 వరకు దేశంలో 1150 మంది పోలీసులు గెరిల్లాల దాడుల్లో హతులయ్యారు. గడ్చిరోలిలో గడిచిన ఇరవై సంవత్సరాలలో దాదాపు 110 మంది (ఇందులో 14 మంది కిందిస్థాయి అధికారులున్నారు) పోలీసులు చనిపోయారనీ యేటా గెరిల్లాల సైనిక చర్యలతో గాయపడుతున్న పోలీసుల సంఖ్య 40-45 ఉంటోందనీ వాళ్ల అధికారులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. వీరిలో ప్రజా పీడకులుగా మారిన కరుడుకట్టిన పోలీసులను ఒంటరిగా చూసి అంతమొందించిన 'సింగిల్ ఆక్షన్స్' కూడా చేర్చబడినాయి. కానీ దుష్ట రాజకీయ నాయకులను, ఫాసిస్టు సల్వాజుడుం నేతలను, పోలీసు ఇన్ఫార్మర్లను, కోవర్టులను, రహస్య సిఐడిలను అంతమొందించిన ఘటనలు చేర్చలేదు. ఆ సంఖ్య ఇంతకు రెట్టింపే ఉంటుంది.

సాధారణ పోలీసులు వాళ్ల రాష్ట్ర బలగాలకు చెందినవారైనా, కేంద్ర అర్ధసైనిక బలగాలలో భాగమైనా వారంతా ఖాకీ దుస్తుల్లో ఉన్న శ్రమజీవుల కుటుంబాలకు చెందినవారే. కానీ వాళ్లను తమ స్వప్రయోజనాల కోసం దేశ ప్రధాని నుంచీ జిల్లా పోలీసు అధికారుల వరకూ విపరీతంగా రెచ్చగొడుతూ తప్పుడు 'దేశభక్తి', 'ప్రజా రక్షణ' భావాలను తలకెక్కిస్తూ హింసోన్మాదులుగా, నేరస్థులుగా మలచి పేద ప్రజలపైకి ఉసిగొల్పుతున్నారు. 2010 ఆగస్టు 15 నాడు ఎర్రకోట బురుజులపై నుంచి దేశ ప్రజలకు ఇచ్చిన సందేశంలో ప్రధాని మన్మోహన్ సింగ్ 'వామపక్ష ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం' అన్నాడు. అదే నోట 2011 ఫిబ్రవరి 1 నాడు 'మావోయిస్టులు దారితప్పిన మన పిల్లలే' అన్నాడు. ఇది తన మానవ ముఖాన్ని చూపడానికి అన్న మాటలే తప్ప ఆచరణలో జరుగుతున్నదంతా అణచివేతే. ఇక ఈ వరుసన చూస్తే 2005లో బీజాపూర్ జిల్లా ఎస్‌పి మన్‌హర్ తన పోలీసులకు పంపిన వైర్‌లెస్ మెసేజ్‌లో 'మావోయిస్టులను

కలవడానికి వస్తున్న ప్రెస్ పర్సన్స్‌ను కూడా కాల్చివేయండి' అనే ఆదేశాలు పంపాడు. 2008 అక్టోబర్ 26 నాడు గడ్చిరోలి జిల్లా ఎస్‌పి రాజేష్ ప్రధాన్ పోలీసులకు వైర్‌లెస్‌లో పంపిన దీపావళి శుభాకాంక్షలలో 'జిల్లాలో ఇప్పటి వరకూ మనమే పైచేయిగా ఉన్నాం. ఇప్పుడు నక్సలైట్లు మళ్లీ తమ తలలు పైకి లేపుతున్నారు. ఆ తలలు ఇక లేవకుండా కాళ్ల కింద నలిపివేయండి' అంటూ తన హంతక కసినంతా వెళ్లగక్కాడు. 2011 ప్రారంభంలో బస్తర్ రేంజి డిఐజి కల్లూరి అన్న మాటలు వార్తా పత్రికలకే ఎక్కాయి. రానున్న ఆరు మాసాల్లో 12 మంది మావోయిస్టు నాయకులను అంతమొందించకుండా 'ఉప్పు ముట్టుకోనని' శపథం చేశాడు. వీళ్లంతా రాజ్యాంగాతీతంగా వ్యవహరిస్తున్న 'మొనగాళ్లు'. ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఇవ్వవచ్చు. ఇలాంటి హేమాహేమీ అధికారుల రెచ్చగొట్టుడు బోధనలను వినకూడదనీ, ప్రజల పక్షం వహించి ఆలోచించాలని, ప్రజల పైకి తుపాకులు ఎక్కుపెట్టి కాల్చిచంపడం, మహిళలపై అత్యాచారాలు జరపడం ఇతర దుర్మార్గాలకు పాల్పడడం మానుకోండంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పలుమార్లు బహిరంగ విజ్ఞప్తులు చేసింది. పూర్తిగా మానవ మృగాలుగా మారకుండా మిగిలిన సాధారణ ఖాకీలు అక్కడక్కడ ప్రజలకు సహాయపడుతున్న ఘటనలూ లేకపోలేదు. 2006 సల్వాజుడుం వ్యతిరేక (ప్రజాపోరాట) అభియాన్ సందర్భంగా ఎస్ఐ స్థాయి అధికారులు సైతం కొందరు తాము పొట్టకూటి కోసం పోలీసుల్లో చేరామంటూ, పై అధికారుల ఒత్తిడితో గస్తీలు తప్పడం లేదంటూ తాము ప్రజలకు వ్యతిరేకం కాదంటూ, తమను టార్గెట్ చేయకూడదంటూ గెరిల్లాలకు కబుర్లు చేసిన ఘటనలున్నాయి. 2008 చివర్లో గడ్చిరోలిలో జరిగిన ఒక బూటకపు ఎన్‌కౌంటర్ సందర్భంగా దారిలో తారసపడిన జనతన సర్కార్ అధ్యక్షున్ని కాపాడడానికి ఒక పోలీసు తప్పుకోమంటూ ముందే సైగ చేసిన మరుక్షణంలోనే మరో ఖాకీ మృగం తన తుపాకి నుంచి కాల్చిన తూటాలతో ప్రజా నాయకుడు యేసు శవంగా మారాడు. ఈ మధ్య 2010 డిసెంబర్‌లో గాలింపులు చేస్తున్న గడ్చిరోలి పోలీసులు ఒక ఊళ్లో రైతు ఇంట్లోని గడ్డివాము పరిశీలిస్తూండగా వాములోని మూట ఒక పోలీసు కంట్లో పడింది. ఆయన దాన్ని మరింత లోనికి దూర్చి తన అధికారికి 'వాములో ఏమీ లేదు' అని రిపోర్టు చేసి రైతును 'జాగ్రత్తగా పెట్ట'మంటూ సలహా ఇచ్చిపోయాడు. ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి.

2001లో గోర్ఖా, 2002లో ఏటెగట్ట, సోమన్‌పెల్లి, 2003లో గీదం రెయిడ్, కుమ్మరిగూడ ఆంబుష్, 2004లో వింజరం, 2005లో మేడిపల్లి, కర్రెమర్క, 2006 ఫిబ్రవరిలో నాగా బలగాలను, అదే సమయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలను; 2007 ఆగస్టులో ఉర్పల్‌మెట్టలో, సెప్టెంబర్‌లో తాడిమెట్లలో; 2008లో బట్టుం, మోదుగుపాల్‌లో; 2009లో లాహెరి, మదన్‌వేడలలో; 2010లో ముకరం, కొంగెర, బడ్‌గాం, కోకాలలో భద్రతా బలగాలను ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో ఎదుర్కొన్న ఘటనలు కొన్ని మాత్రమే. విప్లవోద్యమ తొలి సంవత్సరాలలో రాష్ట్ర ప్రత్యేక బలగాలనే ఎదుర్కొన్నప్పటికీ పోనూ పోనూ అర్ధసైనిక బలగాల మోహరింపు ఎలా పెరుగుతూ పోయిందో వాటితో గెరిల్లాలు తలపడడమూ పెరిగింది. ఈ దాడుల్లో చాలా వరకూ కేంద్ర, రాష్ట్ర బలగాలు కలిసే నిర్మూలించబడినప్పటికీ 2010 ఏప్రిల్ 6 నాటి

చారిత్రాత్మక ముకరం దాడిలో కంపెనీ స్థాయిలో, జూన్ 29 నాడు కొంగెరలో ప్లాటూన్ స్థాయిలో మొత్తంగా కేంద్ర అర్ధసైనిక బలగాలే తుడిచిపెట్టుకపోవడం విశేషం. కేంద్ర, రాష్ట్ర బలగాల మధ్య కొనసాగుతున్న వైరుధ్యాలు ముకరం దాడితో నగ్నంగా బయటపడ్డాయి. కేంద్ర హోంమంత్రి చిదంబరం ఆదేశాలపై ఆ విభాగం ఉన్నతాధికారులు బలగాల మోహరింపు విషయంలో తలబిరుసుతో చేస్తున్న తప్పులను ఈ.ఆర్. రాంమోహన్‌రావు లాంటి సైనిక ఉన్నతాధికారులు తూర్పార బట్టారు. సిఆర్‌పిఎఫ్ పరిమితులూ బయటపెట్టారు. కె.పి.ఎస్. గిల్ అయితే ఏకంగా గ్రీన్ హంట్ ఓటమి తప్పదనే ఘోషించాడు. ఈ దెబ్బల నుంచీ గుణపాఠాలు తీసుకుంటున్న కేంద్ర అర్ధసైనిక బలగాలు నూతనంగా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్' (ప్రామాణిక కార్యాచరణ పద్ధతులు) రాసుకున్నారు. వీటిలో ప్రధానంగా బలగాల సంఖ్య, వారికి ఆయుధాలు, రక్షణతో పాటు తక్కువ ప్రమాదకర ప్రాంతాలలో మొదట వారిని మొహరించాలనీ, కనీసం నెల రోజులు ఆ బలగాలకు పరిసరాల గూర్చి శిక్షణ ఇవ్వాలనీ రాశారు. సంయుక్త దాడులలో సిఆర్‌పిఎఫ్ వాళ్లతో రాష్ట్రాల బలగాలు 2:1గా ఉండాలనీ కోరారు. లేకపోతే మాత్రం బలగాలు కదలవన్నారు. సంయుక్త బలగాలు కోర్ ఏరియాలో ఉండాలనీ, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ బలగాలు మాత్రం వాటి అంచుల్లో (ఫ్రింజ్ ఏరియాస్) ఉంటాయన్నారు. ఇక రేపు భవిష్యత్‌లో సైన్యం మోహరింపులు, గస్తీలు ఎలా వుంటాయో చూడాల్సిందే. సైన్యాధికారులు మాత్రం మావోయిస్టులు మా సహోదరులే, వారిపై యుద్ధం ఎందుకు చేస్తామంటూ కప్పిస్తున్నారు.

ఎస్‌పిఓలు సంఖ్య రీత్యా ఎక్కువో, తక్కువో అన్ని గెరిల్లా చర్య ఘటనల్లో అంతమొందడం ప్రజలకు ఎంతో ఊరటను ఇస్తూంది. ఎస్‌పిఓలను పెద్దెత్తున మట్టుబెట్టడం మొదట ఎర్రబోరులో తర్వాత రానీబోదిలీ రెయిడ్‌లోనే సాధ్యమైంది. ఎర్రబోరులో జుడూం శిబిరంలో చనిపోయిన ముప్పై మందిలో 27 మంది ఎస్‌పిఓలే కాగా రానిబోదిలీ దాడిలో మరణించిన 55 మంది పోలీసులలో 39 మంది ఎస్‌పిఓలే ఉండడం విశేషం. ఆ సందర్భంగా ప్రజల్లో పండగ వాతావరణమే కనపడింది. తమ మధ్యనే పుట్టి, పెరిగిన యువకులు సల్వాజుడుంలో ఎస్‌పిఓలుగా అవతారమెత్తి తమ పల్లెల్లో, ప్రజల కడుపుల్లో చిచ్చుపెట్టడంలో పరమ దారుణంగా వ్యవహరిస్తున్న ఎస్‌పిఓలు అంటేనే ప్రజల్లో తీవ్రమైన అసహ్యం, ద్వేషం ఏర్పడింది. 2006లో దంతెవాడ జిల్లా మనికుంటలో ఐదువేల మందితో ప్రజాకోర్టు నిర్వహించినప్పుడు 17 మంది ఎస్‌పిఓలకు ముక్తకంఠంతో వాళ్లంతా మరణశిక్ష విధించారంటే ప్రజల్లో ఎస్‌పిఓల పట్లా వాళ్లు ద్రోహులనే కసి, ద్వేషం, అసహ్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజా మిలీషియా కార్యకర్తలు ఎస్‌పిఓలను, కోయ కమాండోలను ఒంటరిగా చూసి పదునైన ఆయుధాలతో అంతం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వీళ్లంతా ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా శత్రు పక్షం చేరి పరాయీకరణ చెంది తమ ఆదివాసీ ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారనీ, వీళ్లు శత్రు వర్గాలేనని ప్రజలు కచ్చితంగా తేల్చుకున్నారు. వీళ్లకు ఏ వావీ వరుసలు, కుటుంబ సంబంధాలు, ప్రేమానుబంధాలు, మానవీయ విలువలు లేకుండా పోయాయనీ వీరి దుశ్చర్యల ద్వారా

ప్రజలకు తెలిపోయింది. పోలీసు డిజిపి విశ్వరంజన్ వీళ్లలో నుంచి మరింత కరుడుగట్టిన వాళ్లను ఎంపిక చేసి వాళ్లతో కోయ కమాండో, సిరా-60 లాంటి నరహంతక బలగాలను ఇజ్రాయిల్ తరహాలో ప్రమోట్ చేస్తున్నాడు. తమ అస్థిత్వం కోసం తాము శిక్షలు వేయక తప్పడం లేదనీ, ప్రజాయుద్ధానికి తూట్లు పొడవ సిద్ధపడిన పోలీసు ఇన్ఫార్మర్లనూ, కోవర్టులనూ, ఎస్‌పిఓలను తుదముట్టించాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హతులలో పొరపాటున నిర్దోషులుండిపోయారనీ ఎక్కడైనా తేలితే వెంటనే బహిరంగంగా గెరిల్లాలు, పార్టీ ప్రజలకు క్షమాపణలు తెలుపుకుంటూంది. ఇలాంటి ఘటనలూ ఉన్నాయి.

ఇన్ఫార్మర్లు, ఎస్‌పిఓలు చనిపోతున్నప్పుడు కొంతమంది కుహనా ప్రజాస్వామికవాదులు, కుహనా విప్లవకారులు మావోయిస్టులు పేద ఆదివాసీలనే అంతమొందిస్తున్నారని నిందిస్తున్నారు. ప్రజా వ్యతిరేకులుగా మారినవాళ్లు ఉద్దేశ్యపూరకంగా చేస్తున్న దారుణాలను చూడ నిరాకరించేవాళ్లూ, కులాలనూ, తెగలనూ, జాతులను కావాలనే ముందుకు తెస్తున్నారు. తెలిసి చేస్తున్నా, తెలియక చేస్తున్నా వారి వాదనలన్నీ ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ఎక్కుపెట్టిన ప్రజా శత్రువులకే తోడ్పడుతున్నయన్నది మాత్రం నిజం. వీళ్లు దోపిడీ ప్రభుత్వ యంత్రాంగం గొంతులో గొంతు కలుపుతూ మావోయిస్టు విప్లవకారులను ఉగ్రవాదులు, హంతకులు అంటూ నిందిస్తూన్నారు. కట్టుకున్న భర్త, కడుపున పుట్టిన తనయుడు ఎస్‌పిఓ అయినా ప్రజలు నిర్దాక్షిణ్యంగా అంతమొందించాలనే తీర్పు చెబుతున్నారు. ఆ ప్రజల కసిని వ్యక్తం చేసే శక్తి కలాలకు చాలడం లేదు. వివేచనారహితంగా ఎస్‌పిఓలను గెరిల్లాలు అంతమొందిస్తున్నారని అనుకునేవాళ్లు ఎవరైనా సంవేదనా భరిత దక్షిణ బస్తర్ ప్రజల మధ్యకు వెళ్లి వాళ్ల హృదయాంతరంగాలలో జ్వలిస్తున్న మంటలను ముందు తెలుసుకోకుండా ఫలితాలను చూసి నిందించడం తగదు.

విప్లవోద్యమంలో ప్రతి యుద్ధచర్య నిశితంగా సమీక్షించబడుతుంది. గడ్చిరోలిలో 2006లో ఆలెవార వద్ద, ఉత్తర బస్తర్‌లో కాప్సీ వద్ద, 2009 ఏప్రిల్‌లో మాన్‌పూర్‌లోని కంకసూర్ వద్ద 2010లో చింగవరం వద్ద అలాగే మరికొన్ని చోట్ల పొరపాటున మందుపాతర్లను పేల్చి పౌరుల ప్రాణాలు తీయడం ఘోర తప్పిదం అంటూ పార్టీ బహిరంగంగా ప్రజలకూ, బాధిత కుటుంబాలకూ క్షమాపణలు చెప్పుకుంది. ఇక్కడ పేర్కొన్న ఘటనలన్నీ, విషయాలన్నీ ఎలాంటి దాపరికం లేనివే.

సమరంలో లొంగిపోతున్న, పట్టుబడుతున్న పోలీసులతో గెరిల్లాలు తమ పిఎల్‌జిఏ ప్రణాళికలో రాసుకున్న విధంగా వ్యవహరిస్తున్నారు. వారిని అవమానించడం లేదు. వారిపై చేయి చేసుకోవడం, నోరు పారేసుకోవడం అసలే జరగదు. అవకాశం ఉన్నమేరకు వారి అవసరాలు తీరుస్తూ వారితో మర్యాదగా వ్యవహరిస్తుంటారు. వారికి తమ విప్లవ లక్ష్యాలను వివరిస్తారు. పోలీసు ఉద్యోగాలను వదులుకోండనీ విజ్ఞప్తి చేస్తూంటారు. ఇది గెరిల్లాల సాధారణ వైఖరి. మావోయిస్టుల కస్టడీ నుంచీ విడుదలైన అనేక మంది పోలీసులు మీడియా ముందు బహిరంగంగా చెప్పుతున్న విషయాలే ఇందుకు సాక్ష్యంగా మన ముందున్నాయి. 2004లో భెజ్జి (దంతెవాడ) దరొగ ప్రకాష్ సోనీ, 2006లో చింతల్‌నార్ వద్ద అరెస్టయిన నల్గురు పోలీసులు,

2007లో భద్రకాళి, అంతాగఢ్‌లలో దొరికిపోయిన దాదాపు 10 మంది పోలీసులు, 2011 ఫిబ్రవరిలో ఓర్చా వద్ద పట్టుబడిన ఐదుగురు పోలీసులు మీడియాతో చెప్పిన విషయాలు రికార్డయ్యాయి. వీళ్లంతా మావోయిస్టులు తమతో చాలా మర్యాదగా వ్యవహరించారనీ, తమను దుర్భాషలాడడం గానీ, తమపై చేయి చేసుకోవడం కానీ జరగలేదన్నారు. మావోయిస్టుల కస్టడీ నుంచీ విడుదలయ్యాక వీళ్లలో ఏ ఒక్కరు కూడా తిరిగి పోలీసు ఉద్యోగాల్లో కొనసాగడానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేయలేదన్నది గుర్తు పెట్టుకోవాలి. మీడియా ముందే చెప్పిన విషయాలు ఇవి. ఏవో ఒత్తిళ్లతోనో, బెదిరింపుల మధ్యనో కాకుండా వాళ్లు మావోయిస్టు రాజకీయ చర్చల ప్రభావంతో మాట్లాడిన మాటలేనన్నది మరిచిపోకూడదు. మావోయిస్టులతో కాకపోయినా మావోయిస్టులంటూ ముద్రలు వేస్తూ అరెస్టులు చేస్తున్న సాధారణ ప్రజలతోనైనా పోలీసులు అనుసరించే పద్ధతులకూ, పోలీసుల పట్లా గెరిల్లాలు అనుసరించే పద్ధతులకూ అసలు పోలికే ఉండదు.

## వర్గపోరాట ప్రాంతాలలో పోలీసుల స్థితిగతులు:

జీవితంలో తాము అనుభవిస్తున్న అనేక కష్టనష్టాలు, దారుణాలు, పేదరికం, హింస, దోపిడీ, దౌర్జన్యాలతో విసిగి వేసారిపోయి వాటి అంతానికై విప్లవ మార్గాన్ని ఎంచుకుని తెగించి సాహసంగా పోరాడుతున్న గెరిల్లాల సమర విజయాలతో పోలీసులు తమ మనోబలాన్ని కోల్పోతున్నారు. అనేక దాడులలో  వాళ్లు మడమ తిప్పుతున్నారు. అక్కడక్కడ కొద్దిమంది పోలీసులు యుద్ధ చర్యల మూలంగా మానసికంగా విచలితులవుతున్నారడానికి రెండే రెండు ఉదాహరణలు సరిపోతాయి. 2009 జులైలో రాజనాంద్‌గాం జిల్లా మదన్‌వేడ వద్ద గెరిల్లాలతో జరిగిన భీకర సమరంలో గాయాల పాలైన అనిల్ సాహూ అనే పోలీసు దోపిడీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దాదాపు యేణ్ణర్థం పైగా మనస్థిమితం లేకుండా పోయి ఆసుపత్రిలో 2011 మార్చిలో చనిపోయాడు. 2010 మేలో గడ్చిరోలి జిల్లా హత్తిగుట్ట వద్ద గెరిల్లాలతో జరిగిన మరో సమరంలో హతులైన పోలీసుల శవాలను జిల్లా కేంద్రానికి తరలించి లాంఛనంగా పోలీసు వందనం సమర్పిస్తుండగా విచలితుడైన ఒక సాధారణ పోలీసు వెర్రికేకలు వేస్తూ పారిపోయిన దృశ్యాన్ని టివిలో ప్రసారం చేశారు.  గత కొద్దికాలంగా పోలీసు ఉన్నతాధికారులు తమ బలగాలలో మనోనిబ్బరాన్ని నిలిపి ఉంచడానికి అనేక తంటాలు పడుతున్నారు. గెరిల్లాలకూ, పోలీసులకూ మధ్య జరిగిన ప్రతి ఎదురుకాల్పుల ఘటన తర్వాత 'పోలీసులు జరిపిన కాల్పుల్లో చాలా మంది గెరిల్లాలు మృత్యుపాలైనారు, కానీ శవాలను గెరిల్లాలు తమ వెంట తీసుకెళ్లారు. శవాలు పోలీసులకు దొరకలేదు' అంటూ వాస్తవాలతో సంబంధం లేకుండా ప్రకటించడం సాధారణమైంది. గెరిల్లాల శవాలు దొరకలేదంటేనే పోలీసుల మాట చాలా వరకు వుత్తదేన్నది సాధారణ ప్రజలకు కూడా అర్థమైపోతూన్నది. ఇలా పోలీసులు ఎన్ని ప్రచారాలు చేపడుతున్నా ఇప్పటి వరకూ గెరిల్లాలే పైచేయిలో ఉండడం పోలీసుల మనోస్థైర్యాన్ని మరింత దిగజారుస్తోంది. జీతపు రాళ్ల కోసం తాము సమిధలు గావడం వారిలో అనేక రుగ్మతలను పెంచుతోంది. వీటికి తోడు సుదూర ప్రాంతాల నుంచీ తమ ప్రాంతం కాని ప్రాంతం వచ్చి దట్టమైన అడవుల్లో, ఎత్తైన కొండల మధ్య

అడుగడుగునా ప్రమాదభరత పరిస్థితుల నడుమ, తెలియని ప్రజలతో వారి అర్థం కాని భాషతో, పరిచయంలేని ఆచార వ్యవహారాలతో జీవన్మరణ సైనిక చర్యల మధ్య ప్రాణసంకటంగా తయారైన మలేరియా జ్వరాలతో పడలేక, కనీస సౌకర్యాలు కరువై ఖాకీ బరువును మోస్తున్న పోలీసుల్లో ఆత్మహత్యలకు, అధికారుల హత్యకు పాల్పడే ధోరణి, ఉద్యోగాలను వదిలివెళ్లే, విధుల్లో హాజరుకాకుండా కాలయాపన చేసే ధోరణి పెరుగుతూంది. మంత్రుల, అధికారుల హెచ్చరికల తాఖీదులు ఎన్ని అందుతున్నా ప్రమోషన్ల ప్రలోభాలు, ఆవార్డుల ఆశలు, మృతి చెందితే లక్షల రూ.ల చెల్లింపు వాగ్దానాలు ఎన్ని గుప్పిస్తున్నా ప్రాణభయం ముందు వాటిని వేటినీ ఖాతర చేయని వాళ్ల సంఖ్య పెరుగుతూందనడానికి ఈ కింది గణాంకాలు సరిపోతాయి.

మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం గడ్చిరోలి జిల్లాకు 2010 ప్రారంభంలో 131 మంది పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తే 2010 అక్టోబర్ వరకు 40 మంది (దాదాపు మూడవ వంతు) విధుల్లో హాజరు కాకపోవడంతో రాష్ట్ర పోలీసు మంత్రి ఆర్.ఆర్.పాటిల్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. విధుల్లో హాజరుకాని వారి సంఖ్య మొదట్లో 105 ఉండింది. అంటే 80 శాతానికి మించిన మంది పోరాట ప్రాంతాలకు రావడానికి సిద్ధపడడం లేదని గమనించాలి. జారవండి, దోడ్‌రాజ్, కుర్కెడ పిఎస్‌ఐలను చివరకు ఉద్యోగాల నుంచీ సస్పెండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు బదిలీపై రావడానికి మెజార్టీ మంది సిద్ధపడడం లేదు. పోలీసు మంత్రులు, డీ.జీ.పీ. ఎన్ని హెచ్చరికలు చేసినా పెద్దగా పనిచేయడం లేదు. గ్రీన్ హంట్ ప్రారంభం సందర్భంగా డీ.జీ.పీ విశ్వరంజన్ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసినా ఫలితం పెద్దగా కనపడలేదు. ఇక్కడి పరిస్థితి ఎలా ఉందంటే 2006లో బీజాపూర్‌కు బదిలీ అయిన సంజయ్ తివారి జిల్లా ఎస్‌పి విధులకు హాజరు కాకుండా పోయి సస్పెన్షన్‌కు గురై చరిత్రకు ఎక్కాడు. దేశంలోని మొత్తం దాదాపు 8 లక్షల సిఆర్‌పిఎఫ్ బలగాలలో ఇప్పటికే 50 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయంటే 2010లో మరో 50 వేల మంది 'స్వచ్ఛంద' పదవీ విరమణకు దరఖాస్తు చేశారు. 9 వేల మంది ఉద్యోగాలు వదిలివేశారు.

విధులకు హాజర్‌కాని స్థితి పై విధంగా ఉంటే విధుల్లో ఉన్నవారి స్థితి ఎంత దయనీయంగా వుందో చూద్దాం. గడ్చిరోలిలో ఒక సి-60 కమాండో ఆత్మహత్యకు పాల్పడిన కొద్ది రోజులకే సబ్-ఇన్‌స్పెక్టర్ మికింద్ షేడ్‌కర్ ఏటపల్లిలో తన ఏకెతో కాల్చుకుని 2010 సెప్టెంబర్‌లో ప్రాణాలు తీసుకున్నాడు. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల ఆత్మహత్యల సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుంది. ఒక్క 2010లోనే భద్రకాళి, తాడోకి, బీజాపూర్, కిష్టారం, చివరకు జగ్దల్‌పూర్ జిల్లా కేంద్రంలో కూడా పోలీసుల, అర్ధసైనిక బలగాల ఆత్మహత్యలు, హత్య ఘటనలు వెలుగు చూశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2010 ఏప్రిల్ నెలలోనే నల్గురు సిఐఎస్‌ఎఫ్ జవాన్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వారు ఎలాంటి స్థితిలో ఉన్నారో ఆలోచించాలి. 2007-10 మధ్య 332 మంది సిఆర్‌పిఎఫ్ 'వీర జవాన్లు' పరస్పర హత్యలకో, ఆత్మహత్యలకో పాల్పడినట్టు అధికారిక

లెక్కలే వెల్లడి చేస్తున్నాయి. యేటేటా ఈ సంఖ్య పెరిగే దిశలోనే వుంది. 'ఘర్షణ ప్రాంతాలు' (కాన్ఫ్లిక్ట్ ఏరియాస్)గా పిలవబడుతున్న చోట విధులు నిర్వహిస్తున్న పోలీసుల్లో పిటిఎస్‌డి (పోస్టు ట్రామటిక్ స్ట్రెస్ డిసార్డర్)తో చాలా మంది బాధపడుతున్నారనీ వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. (కావాలనే పాలకవర్గాలు వీటిని కాన్ఫ్లిక్ట్ జోన్స్ అంటున్నాయి. ఇక్కడి వర్గ పోరాటాన్నీ, వర్గ యుద్ధాన్ని అభావం చేసే దృష్టితోనే) వీరి వ్యవహారం ఇలా ఉండగా ఇంకొంత మంది అధికారుల తీరు చాలా గమ్మత్తుగా ఉంటుంది. వర్గపోరాట ప్రాంతాలలో ఉండడం ఇష్టంలేని అధికారులు బూటకపు నక్సలైట్ల దాడులకు నాటకీయంగా రూపకల్పన చేస్తూంటారనేది కూడా బస్తర్ ప్రజలకు, మీడియా పర్సన్స్‌కూ తెలియనిది గాదు. తాము గస్తీ వెళ్లిన సందర్భంగా తమపై నక్సలైట్లు కాల్పులు జరుపుతూ మందుపాతర్లను పేల్చారంటూ కట్టు కథనాలు మీడియా ముందు వెల్లడి చేస్తూంటారు. మావోయిస్టులకు తాము ప్రధాన టార్గెట్‌గా మారామనీ అతి పైస్థాయిలో ఒత్తిడి పెంచి సుబ్బరంగా బదిలీ చేయించుకున్న అధికారుల చిట్టా కూడా తక్కువేం ఉండదు. వీరంతా మంచి హస్తలాఘవం ఉన్నవారు కావడంతో సులువుగానే బదిలీపై వెళ్లగలిగారు. మిగిలినవాళ్లు యేళ్ల తరబడిగా వర్గపోరాట ప్రాంతాల్లోనే ఉంటున్నారు. వాళ్లలో కొందరి పైనైనా వర్గపోరాట ప్రభావం వుండకుండా పోతుందా!

## 3 (డి) గెరిల్లా యుద్ధంలో ప్రజల పాత్ర – ప్రోత్సాహం

ప్రజలకు సేవ చేయాలనే రాజకీయ చైతన్యంతో గెరిల్లాలు చేస్తున్న విప్లవ యుద్ధంలో గెరిల్లాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలనే భావన ప్రజల్లో అడుగడుగునా, క్షణ క్షణం వ్యక్తమవుతోంది. 'ఈ సైన్యం మాది', 'ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు ఉండేదేమీ లేదు' అన్న భావన ప్రజల్లోనూ; 'ప్రజలే గురువులు, ప్రజల నుంచీ ప్రజల వద్దకు' అన్న భావన గెరిల్లాలలోనూ పెరుగుతూన్నంత కాలం వారిరువురినీ ఈ భూమ్మీద ఏ శక్తీ వేరు చేయజాలదు. దండకారణ్యంలో చోటు చేసుకున్న ఏ స్థాయి గెరిల్లా సైనిక చర్య అయినప్పటికీ అందులో తప్పనిసరి ప్రజల పాత్ర ఉంటోంది. అదీ క్రియాశీలంగా ఉంటూంది. ఫలితంగా ప్రజాయుద్ధ భావన వికసిస్తూంది. భారీ గెరిల్లా సైనిక చర్యలలో వందల సంఖ్యలో ప్రజలు - స్త్రీలూ, పురుషులూ - పాల్గొంటున్నారు. రోజుల తరబడి యుద్ధ మానసికతతో సమరం కోసం సంసిద్ధంగా వుంటున్నారు.

ప్రజా గెరిల్లాల దప్పిక తీర్చడానికి కడవల కొద్దీ నీళ్లు కావళ్లతో మోయడం, ఆకలి తీర్చడానికి భోజనాలు సమకూర్చడం, గెరిల్లాల కదలికలను వేగవంతం చేయడానికి వారి బరువులను పంచుకోవడం, వారి రహస్యాలను కాపాడడం, మందుపాతర్లకు కందకాలు తవ్వడం, రణక్షేత్రంలో రిజర్వులుగా నిలిచి ఉండడం, క్షతగాత్రులను మోయడం, అవసరం మేరకు సాయుధంగా యుద్ధచర్యలో ఉత్సాహంగా పాలుపంచుకోవడం వరకు ప్రజలు చేయని పనంటూ లేదు. ప్రజాయుద్ధ భావన మహత్యం ఇది. ఇదే వారి శత్రువులకు అర్థం కానిది. భారీ గెరిల్లా దాడి జరిగి పెద్దెత్తున పోలీసులు దెబ్బతిన్న ప్రతిసారి

'ప్రభుత్వ, నిఘా విభాగాల వైఫల్యం' అంటూ సమీక్షించడం తరచూ వింటుంటాం. బిఎస్‌ఎఫ్ విశ్రాంత డిజిపి ప్రకాష్ సింగ్ లాంటి అధికారులు నిఘా వైఫల్యం అంటూ గ్రామస్థాయి ప్రభుత్వ ఉద్యోగులను విమర్శించడం వార్తా పత్రికల పాఠకులకు, టివి ఛానళ్ల ప్రేక్షకులకు తెలియనిది గాదు. కానీ గెరిల్లాలతో ప్రజలకు పెనవేసుకపోయిన అనుబంధ బాంధవ్యాలు ఏ ప్రభుత్వ అధికారి తెలుసుకోగలడు? ఈ భ్రష్టుపట్టిన దోపిడి వ్యవస్థతో వెయ్యినొక్క దారాలతో ముడిపడిన పంజరంలో బందీలుగా చిక్కుకపోయిన గ్రామస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు విప్లవ ప్రాంతాలలో ఇన్ఫార్మర్లు తప్ప గెరిల్లాల ఆనుపానులు అందించే వాళ్లు ఇంకెవరుంటారు! గెరిల్లా దాడుల్లో ప్రజల పాత్ర గురించి చెప్పడానికి ఒక ఉదాహరణచాలు.

2010 ఏప్రిల్ 6 నాడు దంతెవాడ జిల్లా చింతల్‌నార్ పరిసరాల్లోని ముకరం గ్రామం వద్ద చారిత్రాత్మక మాటుదాడిలో కంపెనీ స్థాయి శత్రు బలగాలు మట్టిగరిచాయి. ఈ దాడి ఉదయం 5:50 గంటలకు మొదలైంది. తూటాల పేలుళ్లు, మందుపాతర్ల విస్ఫోటనలు, మోర్టార్ షెల్లుల గర్జనలు పదుల కిలోమీటర్ల వరకూ వినబడసాగాయి. అవి గంటల తరబడి ఆగకుండా వినవస్తూండడంతో పది కిలోమీటర్ల పరిసర పల్లెల్లోని ప్రజాదండు తమ సంప్రదాయ విల్లంబులతో పరుగు పరుగున సమర భూమికి చేరుకోసాగింది. యుద్ధభూమికి చేరిన మొదటి దండు కసితో బలంగా విడిచిన వాడి అయిన ఒక అమ్ము ఖాకీ కడుపులో దిగబడిపోయింది. గెరిల్లాల తుపాకులకు ప్రజల విల్లంబులు తోడై ఉదయం 10 గంటల వరకు పోరు జరిగి శత్రు శేషం మిగలకుండా తుడుచుకుపోయింది. అయినప్పటికీ గ్రామాల నుంచీ ఇంకా ప్రజాదండు వస్తూనే ఉంది. సమరం ముగిసిన తర్వాత వాళ్లంతా తొమ్మిది మంది క్షతగాత్ర గెరిల్లాలను, ఎనిమిది మంది గెరిల్లాల శవాలను, దాదాపు 80 ఆయుధాలను 'సురక్షిత' ప్రాంతాలకు చేర్చారు. ఆ గెరిల్లాల్లో వాళ్లు తమ కన్నబిడ్డలను, తోబుట్టువులను, బంధుప్రియులను, అన్నింటికన్నా మిన్నగా తమ ప్రియమైన విప్లవకారులను చూసుకున్నారు. ఈ అనుబంధ రహస్యం ఏ దోపిడీ అధికారికి బోధపడుతుంది? మూడు దశాబ్దాల దండకారణ్య ప్రజాయుద్ధం ఫలితంగా గెరిల్లాబేసుల్లో అతి ప్రాథమిక స్థాయిలోనే అయినప్పటికీ రూపొందుతున్న ప్రజారాజ్యాధికార సంస్థలు, ప్రజలు ఈ దాడుల వెనుక నిర్వహిస్తున్న పాత్ర, వాటి కృషి అడుగడుగునా వ్యక్తమవుతోంది. అందుకే దోపిడీ రాజ్యాంగ యంత్రం విప్లవోద్యమ నిర్మూలనలో భాగంగా 'మాపింగ్ అప్' (సర్వం ధ్వంసం) ఆపరేషన్స్ చేపట్టి ఊళ్లకు ఊళ్లను తగలబెడుతుంది. కనపడ్డవారినల్లా కాల్చి చంపుతూంది. ఇకపై విమానాల నుంచీ బాంబులు కురిపిస్తారట! ప్రజాశక్తి ముందు ఇవేవీ నిలవవనీ ఇది వరకు అనేక పర్యాయాలు చరిత్ర రుజువు చేసింది.

ఈ విధ్వంసం దండకారణ్యంలో కొత్తదేమి కాదు. గతంలో 1987లో ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం అడవుల్లో 46 గ్రామాలలోని 638 ఆదివాసీ ఇండ్లను కాల్చిన ఖాకీల వైనం చరిత్రలో నిల్చిపోయింది. అయితే ప్రస్తుత విధ్వంసం విస్తృతిలో, లోతులో చాలా అధికమైంది.

## 3 (ఈ) నూతన పార్టీ ఆవిర్భావంతో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం వికాసం – ఐక్యతా కాంగ్రెస్ నిర్దేశించిన కార్యసాధనలో దాని పురోగమనం

2004 సెప్టెంబర్ 21 భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావ దినం. అప్పటికే ఏర్పడి ఉన్న రెండు గెరిల్లా సైన్యాలను ఆ రోజే కలిపి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంగా నామకరణం చేయడం జరిగింది. రెండు సైన్యాలు ఒక్కటిగా రూపాంతరం చెందడంతో పెరిగిన శక్తీ, సంఖ్యా బలంతో విప్లవ ప్రజానీకంలో ఉత్సాహం వెల్లివిరిసింది. రెండు సైన్యాల అనుభవాల సమ్మేళనం నూతన విజయాల ఎత్తుగడల రూపకల్పనలో అపూర్వంగా తోడ్పడింది. దేశ, విదేశీ విప్లవకారులు, పార్టీలు తమ విప్లవాభినందనలు తెలుపుతూ ప్రపంచ విప్లవ సైన్యాల ఒక నూతన డిటాచ్‌మెంట్‌గా పిఎల్‌జిఏ భారతదేశ విప్లవోద్యమంలో పురోగమిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ నూతన పార్టీకి తమ విప్లవ సంఘీభావాన్ని తెలిపారు. రెండు సైన్యాల విలీనం నాటికి అవి కంపెనీ స్థాయి సైనిక నిర్మాణాలను ఏర్పాటు చేసుకొని విశాల భూభాగంలో భారత అర్ధసైనిక, ఆయా రాష్ట్రాల పోలీసు బలగాలతో యుద్ధచర్యలలో నిమగ్నమై ఉన్నాయి. ఆ రెండు సైన్యాలకు పీడిత ప్రజల పూర్తి అండదండలు, ప్రజా మిలీషియా కార్యకర్తల సమరశీల తోడ్పాటు, విప్లవ ప్రజాసంఘాల, విప్లవ రైతాంగ కమిటీల, జనతన సర్కార్ల క్రియాశీల మద్దతు ఉండింది. నూతనంగా విలీనమైన రెండు పార్టీల మధ్య కొంతకాలం చోటుచేసుకున్న అవాంఛనీయ ఘర్షణల 'చీకటి అధ్యాయం' ముగిసి ఏర్పడిన బలమైన విప్లవ ఐక్యత నూతన వెలుగుల ప్రస్థానంలో కొత్త విశ్వాసాలను, హామీలను ఇచ్చింది.

నూతన సైన్యం ఆవిర్భావంతో పాలకవర్గాలు ఖంగుతిన్నాయి. భారత ప్రధాని దేశ అంతర్గత భద్రతకు దానిని పెను ప్రమాదంగా ప్రకటించాడు. యేడాది తిరగకముందే దాని నిర్మూలనకై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైనిక అణచివేత పథకాలు రూపొందించాయి. వాటి ఫలితమే దండకారణ్యంలో సల్వాజుడుం (శాంతి వేట), ఝార్ఖండ్‌లో సేంద్ర (శాంతివేట), ఒడిషాలో శాంతిసేన మరో చోట మరో పేరుతో పుట్టుకవచ్చాయి. పేరు ఏదైనా ఇవన్నీ ప్రభుత్వ ప్రాయోజిత, ఖాకీ సురక్షిత గొడుగు నీడలో పుట్టుకవచ్చిన శ్వేత మిలీషియా బలగాల కిందికే వస్తాయి. ఇవి 'రాజ్యం'లో 'రాజ్యం'లా వ్యవహరిస్తున్నాయి. ఈ ఫాసిస్టు శ్వేత బలగాలను ప్రజలు, ప్రజా మిలీషియా, పిఎల్‌జిఏ కలిసి దెబ్బ మీద దెబ్బతీసి వాటి నడ్డివిరిచి అంతిమంగా వాటిని ఆ రూపంలో ఓడించాయి. దండకారణ్యంలో సల్వాజుడుం ఓటమిని 2009 అక్టోబర్‌లో దాని సేనాని మహేంద్రకర్మ (ఛత్తీస్‌గఢ్‌లో 2000-03 మధ్య పరిశ్రమల శాఖ మంత్రి, 2004-08 విధానసభ ప్రతిపక్ష నేత) బహిరంగంగా ఒప్పుకున్నాడు. అంతకు కొద్దినెలల క్రితమే కేంద్ర గృహమంత్రి చిదంబరం పరోక్షంగా అదే చెప్పాడు. జుడూం ప్రారంభంలో కొద్ది వారాలలోనే దండకారణ్యంలో మావోయిస్టుల అంతు చూస్తామనీ, ప్రగల్భాలు పలికినవాళ్లు భారీ సైనిక దాడికి సిద్ధమయ్యారు. దాని పేరే 'ఆపరేషన్ గ్రీన్ హంట్' (హరిత వేట/అడవుల వేట) అన్నారు. గత రెండేళ్లకు పైగా ఈ దాడులతో దండకారణ్యం

అట్టుడికి పోతోంది. మావోయిస్టుల నిర్మూలన సైతం కోసం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్ 2011 ఫిబ్రవరిలో పదేళ్ల వ్యూహాన్ని ప్రకటించాడు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ 2009 చివర్లో అర్ధసైనిక బలగాలను దింపితే నూతన ముఖ్యమంత్రి పృధ్వీరాజ్ చౌహాన్ వ్యూహాత్మక దాడులకు రంగం సిద్ధం చేశాడు. ప్రజలూ, గెరిల్లాలూ ప్రతిదాడులకు సిద్ధం కాక తప్పడం లేదు.

గ్రీన్‌హంట్ దాడులు అడవులకే పరిమితం కాలేదనీ పట్టణాలు, నగరాలకూ, విస్తరించాయనీ ప్రజాస్వామికవాదులు, ప్రముఖ రచయితలు సాక్ష్యాధారాలతో వెల్లడిస్తున్నారు. గత దాడులకు మించిన తీవ్రతతో, విస్తృతితో గ్రీన్‌హంట్ దాడులు సాగుతున్నాయి. 2011 మార్చి 13 నాడు చింతల్‌నార్‌లో వందలాది కరుడుగట్టిన కోయ కమాండోలు ప్రజల్లో తీవ్ర భీతావహాన్ని సృష్టించడానికి తింపురం, ముర్రుం, తాడిమెట్ల గ్రామాల్లో ఘోర విధ్వంసాన్ని సృష్టించారు. వందలాది ఆదివాసీ ఇండ్లు బుగ్గిపాలు చేశారు. మహిళలపై అత్యాచారం జరిపారు. ఎదురైనవారిని కాల్చిచంపారు. ఈ ఘోర మారణకాండ వివరాలు తెలుసుకోవడానికి ఢిల్లీ నుంచీ వచ్చిన స్వామి అగ్నివేశ్ తదితరులను పోలీసులు అవమానాల పాలు చేసి వెనక్కి పంపారు. ఎస్‌పిఓల కుటుంబాలను గ్రామస్థుల రూపంలో ముందుపెట్టి వాళ్లను కోడిగుడ్లతో కొట్టించారు. ఇది ఇవాళ కొత్తకాదు. గతంలో 2009లో 'వనవాసీ చేతనా ఆశ్రమ్'ను వేయి మంది పోలీసులు నాలుగు బుల్‌డోజర్లతో కూల్చారనీ ఆరోపణలు వచ్చినపుడు దాని నిర్వాహకుడైన హిమాంశు కుమార్ అభ్యర్థనపై పరిశీలనకు ప్రముఖ పర్యావరణవాది, ఆదివాసీ ప్రజాహితాభిలాషి మేధాపాట్కర్ తదితరులు డిసెంబర్‌లో వెళ్లినపుడు 'మా దంతేశ్వరి స్వాభిమాన్ మంచ్' పేరుతో పోలీసులు ప్రధానంగా డిఐజి కల్లూరి నాటకీయంగా ఏర్పాటు చేసిన సంస్థను ముందుపెట్టి మహేంద్రకర్మ పుత్రరత్నం ఛవీంద్ర కర్మ, బిజెపికి చెందిన సుఖ్‌దేవ్, చైతూరాం హట్టామీల గూండా గ్యాంగులచే కోడిగుడ్లతో పాట్కర్ తదితరులను కొట్టించి అవమానించి వెనక్కి వెళ్లగొట్టించారు. ఆ సందర్భంగా దంతేవాడ విలేకరులు అనిల్ మిశ్రా, యశ్వంత్ యాదవ్‌లు మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ బెదిరిస్తూ కరపత్రాలు పంచారు. తాడిమెట్ల విధ్వంసంపై విధానసభలో చర్చించిన ప్రతిపక్షాలు ఘటనా స్థలానికి బయలుదేరగా వారిని దోర్నపాల్ దాటనీయలేదు ఆ దుష్టశక్తులు. గ్రీన్ హంట్ బాధిత ప్రజలకు ప్రభుత్వ సహాయం చేర్చడానికి వెళ్లిన జిల్లా కలెక్టర్‌ను కూడా పోలీసులు అనుమతించలేదంటే దండకారణ్యంలో పోలీసు రాజ్యం ఎంత ఫాసిస్టు స్వభావాన్ని సంతరించుకుందో తెలుసుకోవచ్చు. మీడియా పర్సన్స్‌ను ఆ పరిసరాల్లోకే వెళ్లనివ్వలేదు. చివరకు కొంత మంది విలేకరులు పోలీసుల కండ్లుగప్పి సంఘటనా స్థలానికి చేరడంతో మార్చ్ 23 నాటికి వాస్తవాలు వెలుగు చూశాయి. దేశ ప్రజలకు కల్పించిన ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ - సమాచార హక్కు) ఏ గంగలో కలిసిందో! ఇలాంటి పరిస్థితుల మధ్య జీవిస్తున్న దండకారణ్య ప్రజలు తమ ప్రియమైన గెరిల్లాలను కాపాడుకోవడానికి, అభివృద్ధి చేయడానికి పూర్తిగా సంకల్పబద్ధులై ఉన్నారు. నిజానికి ఈ దాడి నుంచీ ప్రజలను కాపాడింది ప్రజాగెరిల్లాలే. ప్రజలను తక్షణం ఆదుకుంది జనతన సర్కార్లే. ఊళ్లను బూడిదపాలు చేసి వెళ్తున్న పోలీసులపై ప్రాణాలకు తెగించి గెరిల్లాలు దాడి చేసి పోలీసుల విధ్వంసాన్ని

అడ్డుకున్నారు. ఆ దాడిలో కామ్రేడ్ గంగాల్ అమరుడైనాడు.

పోరాట ప్రాంతాల గ్రామాల నుంచీ సమాచారం సేకరించుకోవడానికి పోలీసులు ప్రత్యేకించి విద్యార్థులపై దృష్టి పెడుతున్నారు. ఓ మోస్తరు పెద్ద గ్రామాలలో, పట్టణాలలో చదువుకుంటున్న గ్రామస్థుల పిల్లలను ఇన్ఫార్మర్లుగా మార్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు విప్లవకారుల సమాచారాన్ని చేరవేస్తున్న విద్యార్థి ఇన్ఫార్మర్లను 2010 ప్రారంభంలో తూర్పు బస్తర్ డివిజన్‌లో గెరిల్లాలు పట్టుకోగలిగారు. వారిని ప్రశ్నించగా 'తీగ లాగితే డొంకంతా కదలినట్టు' వారు మొత్తం విషయాన్ని బయటపెట్టడంతో తమకు ఎదురుగానున్న ప్రమాద తీవ్రతను పసిగట్టి వారిని గెరిల్లాలు చంపివేశారు. దీన్ని పోలీసులు సాకుగా చేసుకొని నక్సలైట్లు విద్యార్థులను హతమారుస్తున్నారనే బూటకపు ప్రచారానికి లంఖించుకున్నారు. పట్టణాలలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహింపజేస్తూ నక్సలైట్ల దిష్టిబొమ్మలను తగులబెట్టించారు. సల్వాజుడుం ప్రారంభం నుంచీ పోలీసులు ఎదుగుతున్న ఒక తరాన్ని తమకు విశ్వసనీయమైన విధంగా మలచుకోవడానికి చేస్తున్న తీవ్ర ప్రయత్నాలు లేత మనసులను విషతుల్యం చేస్తున్నాయి. సల్వాజుడుంలో ప్రజల చేత శిక్షలు అనుభవించిన వారి పిల్లలను పోలీసులు చేరదీసి వారిని చదివించే పేరుతో పట్టణాలలోని పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. పోలీసులతో పాటు కొన్ని ఎన్‌జిఓలు, గాయత్రీ పరివార్ లాంటి మత సంస్థలు కూడా ప్రజా వ్యతిరేక జుడుం నాయకుల పిల్లలను చేరదీసి చదివించే పేరుతో విప్లవోద్యమం పట్ల విషాన్ని నూరిపోస్తున్నారు. వారిలో విప్లవోద్యమం పట్లా తీవ్రమైన ద్వేషాన్ని నింపుతూ ప్రపంచానికి మావోయిస్టుల 'ఘాతుకానికి' బలైన పిల్లలుగా చిత్రిస్తూ తరచుగా ప్రదర్శనకు పెడుతున్నారు.

రెండు సైన్యాల విలీనంతో బలపడిన పిఎల్‌జిఏ ప్లాటూన్‌ల నిర్మాణాల నుంచీ కంపెనీల నిర్మాణం వైపు వేగంగా సాగుతోంది. కంపెనీల నిర్మాణంతో సంఘటితం అవుతున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం వాటి ఆధారంగా ఇతర బలగాల సమీకరణతో బెటాలియన్లుగా మారి శత్రువును ఎదుర్కొంటున్నారు. శత్రువు పెద్దసంఖ్యలో వస్తుండడంతో వాళ్లను చీల్చి ప్లాటూన్ సంఖ్య బలగాలను చుట్టుముట్టి సంహరించడంలో మంచి నేర్పరులయ్యారు. ఎదురు నుంచీ, పక్కల నుంచీ శత్రువుపై విరుచుకపడి గంటల తరబడి పోరాడుతూ వారిని తుదముట్టిస్తున్నారు. ఏరియా ఆంబుష్‌లు నిర్వహించడంలో మంచి అనుభవం సంపాదిస్తున్నారు. గెరిల్లా కంపెనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బెటాలియన్ కమాండ్లను ఏర్పర్చి, బెటాలియన్ స్థాయిలో గెరిల్లా సైనిక నిర్మాణ దిశలో పురోగమిస్తున్నారు. ఈ దశాబ్ద ప్రారంభం వరకు ప్రధానంగా మందుపాతరల విస్ఫోటనలతోనే శత్రువు వాహనాలను మట్టిగరిపించిన గెరిల్లాలు ఈ పదేళ్ల సైనిక చర్యలలో అన్ని రకాల దాడులలో శత్రువును దెబ్బతీసి మంచి అనుభవం గడించారు. వాహనాలలో ప్రయాణిస్తూ ఎక్కువ సంఖ్యలో నష్టపోతున్నామనీ పోలీసులు తమ ప్రయాణానికి ప్రధానంగా కాలినడకనే ఎంచుకుంటున్నారు. అడపా, దడపా సైకిళ్లూ, మోటారు సైకిళ్లు, వాహనాలూ వాడుతున్నారు.

కేరళ రాజ్యం అంతటి భూభాగాన్ని కలిగిన విశాల బస్తర్ జిల్లాలో వాహనాలు వాడకుండా పోలీసుల ప్రయాణాలు ఎలా సాధ్యం? అని ముఖ్యమంత్రి రమన్‌సింగ్ స్పష్టంగానే చెప్పి ఉన్నప్పటికీ వాహనాలు ధ్వంసం అవుతున్నపుడల్లా పోలీసులను దోషులుగా చూపడం సాధారణమైంది. ప్రధాన రహదారులు, రోడ్లు వదిలి చాలా వరకు పోలీసులు కాలిబాటలు, అడ్డదారుల్లో గస్తీ చేస్తున్నారు. ఓటమి పాలైన ప్రతి దాడి నుంచీ వాళ్ళు గుణపాఠాలు తీస్తున్నారు. ఎత్తుగడలు మార్చుకుంటున్నారు. ఆయుధాలు ఆధునికం చేసుకుంటున్నారు. మందుపాతరల నిరోధక వాహనాలను సమకూర్చుకుంటున్నారు. అయితేనేం! సాహసిక, సంకల్పబద్ధ ప్రజా గెరిల్లాలు వారితో తలపడుతూనే ఉన్నారు. ఏ ఎత్తుగడ, ఏ ఆయుధము, ఏ వాహనం వాడినా కాలినడకన ప్రయాణం చేస్తున్నా మాటు దాడులు - ఎదురుకాల్పులు తప్పడం లేదు. వికాసం చెందుతున్న పిఎల్‌జిఏ శక్తియుక్తులు, ఎత్తుగడలు, త్యాగాలు, పటిష్టమవుతున్న ప్రజా సంబంధాలు అన్నింటికీ ప్రాణవాయువు లాంటి వారి విప్లవ సిద్ధాంత, రాజకీయాలు వారి అంతిమ గెలుపుకు హామీ నిస్తున్నాయి.

ఆనాటి కానాటికీ శత్రు బలగాలను ఎదుర్కొంటూ, ఓడిస్తూ అభివృద్ధి చెందుతున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి పార్టీ ఐక్యతా కాంగ్రెస్ - తొమ్మిదో కాంగ్రెస్ మహత్తర కేంద్ర కర్తవ్యాన్నిచ్చింది. దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లను బేస్ ఏరియాలుగా (విముక్తి ప్రాంతాలు) మలచాలని నిర్దేశించింది. అందుకుగాను పిఎల్‌జిఏను పిఎల్ఏగా, గెరిల్లా యుద్ధాన్ని చలనయుద్ధంగా మలచడం అత్యావశ్యం అని చెప్పింది. ఆ దిశలో పురోగమిస్తున్న పిఎల్‌జిఏ ఉన్నతస్థాయి గెరిల్లా సైనిక ఫార్మేషన్లను నిర్మిస్తూ 'దెబ్బకొట్టు-దౌడు తీయు' (హిట్ అండ్ రన్) గెరిల్లా ఎత్తుగడలే అనుసరిస్తున్నప్పటికీ, కార్పెట్ సెక్యూరిటీ మధ్య **3-4** గంటలు నిల్చి యుద్ధం చేస్తున్నారు. ఇప్పటికీ మాటుదాడులే ప్రధాన పోరాట రూపంగా ఉన్నప్పటికీ చెప్పుకోతగిన సంఖ్యలో రెయిడ్లూ చేశారు. దశాబ్ద అనుభవాలను క్రోడీకరించిన పార్టీ 'ప్రస్తుతం గెరిల్లా యుద్ధం ఉన్నతస్థాయిలో సాగుతూందని' పిఎల్‌జిఏ దశాబ్ద వుత్సవాల సందర్భంగా స్పష్టం చేసింది. సుత్తీ-కొడవలి-ఎస్ఎల్ఆర్ హత్తిన ఎర్రజెండాను వీర ప్రజా గెరిల్లాలు ఎత్తిపట్టి 'ఈ దశాబ్దం మాదే' అంటూ గర్వంగా నిల్చిన దృశ్యం పిఎల్‌జిఏ దశాబ్ద వేడుకల సందర్భంగా దండకారణ్య పల్లెల్లో, కొండల్లో, ప్రజల మనస్సుల్లో దర్శించింది. ఈ పదేళ్ల కాలంలో గెరిల్లాలు సాధించిన ప్రగతిలోని ముఖ్యాంశాలుగా చెప్పుకోతగినవి అంటే ఒకటి. శత్రుదాడిని పసిగట్టి వీలైన ప్రతి సందర్భంలో వెంటపడడం, అలాగే అనేక దాడులలో నుంచీ ఆయుధాలు స్వాధీనం చేసుకోవడానికి ప్రాణాలకు తెగించి కిల్లింగ్ గ్రౌండ్‌లోకి వెళ్లి వాటిని తీసుకరావడం, మరోటి దాడుల్లో నేలకొరుగుతున్న తమ సహచరుల శవాలను సాధ్యమైనంత వరకూ వదలకుండా విప్లవ పోరాట సంప్రదాయాన్ని అనుసరించి స్వాధీనం చేసుకోవడం, వాటికి తమ పద్ధతుల్లో అంత్యక్రియలు జరిపి శ్రద్ధాంజలి అర్పించడం వారి పోరాట సంస్కృతిని చాటిచెబుతుంది. పిఎల్‌జిఏను సాయుధంగా శక్తివంతం చేయడంలో శత్రువు నుంచీ స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ప్రధానమయ్యాయి.

## 3 (ఎఫ్) ద్విముఖ వ్యూహం లక్ష్యం ఉద్యమ అణచివేతే

దండకారణ్య విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు అనుసరిస్తున్న ద్విముఖ వ్యూహంలో సైనిక, సంస్కరణ విధానాలున్నాయి. రెండింటిలో సైనిక విధానమే ప్రధానం. ఇది అత్యంత క్రూరంగా ఉండి ప్రజల్లో తీవ్ర భయాందోళలను కల్గిస్తుంది. ఉద్యమ తీవ్రతను, విస్తరణను అడ్డుకొని ఉద్యమ విజయాలను వమ్ము చేసే లక్ష్యంతో సాగే సైనిక దాడుల కర్కశ స్వభావాన్ని దండకారణ్య ప్రజలు ప్రత్యక్షంగా గుర్తిస్తున్నారు. ఈ అణచివేతతో భయాందోళనల పాలైన ప్రజలను తమ ఆదుపాజ్ఞలలో నిలిపి ఉంచుకోవడానికి, అవి కలిగించిన శారీరక, మానసిక గాయాలను తాత్కాలికంగానైనా మరిచిపోవాలనే భ్రమాజనిత ఆలోచనలతో పాలకవర్గాలు ఉద్దేశపూర్వకంగానే సంస్కరణలను అమలు చేస్తున్నాయి. బ్రిటిష్ వలసవాదుల కాలం నుంచీ ఈ రెండు పద్ధతులూ దండకారణ్యంలో అమలవుతున్నాయి. వీటిని సరళమైన భాషలో 'కర్ర-కంద' నీతిగా వ్యవహరించడం చాలా పాతదే. ఈ సంస్కరణలను పాలకులు ప్రజా పోరాట ప్రాంతాలలో ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తారు. ఇవి బయటి ప్రాంతాల ఉదారవాద బూర్జువా శక్తులను అమితంగా ప్రభావితం చేస్తాయి. వారు వీటి గురించి అభివృద్ధి కార్యక్రమాలుగా తెగ ప్రచారం చేస్తుంటారు. ఈ సంస్కరణలతో ప్రజల జీవితాలు బాగుపడుతాయనీ, వీటిని ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయగలిగినపుడు ప్రజలు ఏ ఉద్యమాల జోలికి వెళ్లకుండా ఉండగలుగుతారనీ నిరర్థకమైన సలహాలు ఇస్తూంటారు. కానీ వారు విప్లవోద్యమాన్ని వక్ర మార్గాన్ని పట్టించే కుట్రలతో సాగుతున్న దోపిడీ సంస్కరణల అసలు స్వభావాన్ని సహజంగానే గుర్తించడం లేదు. గుర్తించినవాళ్లు బయటపెట్టడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదులు ముందుకు తెచ్చి అనుసరిస్తున్న ప్రజా ఉద్యమాల అణచివేత విధానాలన్నీ ఎల్ఐసి (లో ఇంటెన్సిటీ కాన్ఫ్లిక్ట్) వ్యూహంలో భాగంగా ఇలా సాగుతున్నాయి. ఈ సంస్కరణలన్నీ సామ్రాజ్యవాద ప్రాయోజితమనీ స్వభావ రీత్యా ఇవి 'తేనెపూసిన కత్తి' లాంటివనీ, దండకారణ్య ప్రజలకు విప్లవకారులు విడమర్చి చెప్పుతున్నారు. ఇవి WHAM (హృదయాలనూ, మెదళ్లనూ గెలుచుకోడం) గూర్చి వాళ్లు బోధించే ఎల్ఐసిలో భాగమని స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ బూటకపు సంస్కరణల పక్షం వహిస్తున్నవాళ్లలో ప్రధానంగా బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా విశ్వసిస్తూ, రాజ్యాంగబద్ధ సవరణల ద్వారా ప్రజలు అన్నీ సాధించుకోగలుగుతారనే భ్రమలు కలిగిన వాళ్లే ఉన్నారు. ఈ సెక్షన్ దేశంలో విశాలంగా, 'బలంగా' ఉంది. వీళ్లు సైద్ధాంతికంగా ఏకపక్ష అహింసా మార్గాన్ని వల్లిస్తుంటారు. రాజ్యహింసను పరోక్షంగా సమర్థిస్తూ ప్రజల ప్రతిహింసను తూలనాడుతారు. ఫలితంగా వీరు పోరాట ప్రజలను 'అడకత్తెరలో పోక'లా నలుగుతున్నారంటూ ప్రజలనూ, విప్లవకారులనూ వేరు చేసి, విప్లవకారులను ఒంటరి చేసే చర్చలు చేస్తూంటారు. విప్లవాన్ని నీరుగార్చే విధంగా, ప్రజలకు అపార నష్టాన్ని కలిగించే విధంగా దోపిడీ రాజ్యానికీ, విప్లవకారులకూ మధ్య; హింసకూ, ప్రతిహింసకూ మధ్య రాజీ కుదిర్చే వ్యవహారాలను పదే పదే ముందుకు తెస్తుంటారు. ఇలాంటి వాళ్ల

వాదనలన్నీ ప్రభుత్వ సంస్కరణలను నిర్బంధ్వంగా బలపరుస్తూ వాటిని మరింత పెద్దెత్తున అమలు చేయాలనే సాగుతుంటాయి. ప్రస్తుతం దండకారణ్యంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని తప్పుపడుతూ, 'హింసను' విడనాడాలంటూ, ప్రభుత్వంతో చర్చలకు వెళ్లాలంటూ వీళ్లు సలహా ఇస్తున్నారు. ప్రభుత్వం కోటానుకోట్ల రూపాయలు అంతర్జాతీయ ద్రవ్యసంస్థల నుంచీ అప్పులు తెచ్చి లేదా ప్రజా ధనాన్ని దుర్వినియోగపరుస్తూ ముందుకు తెస్తున్న సంస్కరణలలో ఆర్థిక సంస్కరణలే ప్రధానం. రోడ్లు, రైల్వే లైన్ల నిర్మాణం, మైక్రో ఫైనాన్సింగ్ సంస్థలను ప్రమోట్ చేయడం, పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కలిగించే ప్రాజెక్టులను చేపట్టడం, స్థానిక వ్యవసాయ సాగు పద్ధతులకు, పరిస్థితులకు పొసగని ఆధునిక వ్యవసాయక యంత్ర పరికరాలను, రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను, జీవావరణానికి అరిష్టదాయకమైన విత్తనాలను ప్రవేశపెట్టడం, స్థానిక వాతావరణానికి తట్టుకోలేని పశువులను, జంతువులను పెంపకం కోసం ప్రజలకు పంపకం చేయడం, ఇవన్నీ పోనూ ప్రజా సంక్షేమం కోసం వాస్తవంగా తమ సంస్కరణలలో అతి తక్కువ ఖర్చు చేస్తూ తాగునీటి బోరింగులు వేయడం, నామమాత్రంగా విద్యా, వైద్య సౌకర్యాలు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు కల్పించడం చూడవచ్చు. ఇక్కడ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన సంస్కరణలుగా వీటిని చెప్పుకోవచ్చు.

ప్రభుత్వ సంస్కరణలలో సామూహిక పెళ్లిళ్లూ నడుస్తూన్నాయి. డబ్బుల కక్కుర్తితో పెళ్లిపై పెళ్లి చేసుకుంటున్న కేసులు కూడా వెలుగు చూస్తున్నాయి. నిజానికి ప్రభుత్వాలు చేపడుతున్న సంస్కరణల కార్యక్రమాలన్నీ ప్రజల్లో తరతరాల సంప్రదాయ చైతన్యంగా వస్తూన్న సామూహికత్వాన్ని నిర్వీర్యం చేస్తూ వారి తెగ ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. ప్రజల్లో చీలికలు సృష్టించి వారిలో అవినీతిని పెంచుతున్నాయి. సారాంశంలో ఈ సంస్కరణలన్నీ విప్లవ మార్గం నుంచీ ప్రజలను పక్కదార్లు పట్టించి వారి సుసంఘటిత శక్తిని దెబ్బతీసి వారు అనుసరిస్తున్న స్వావలంబన, ప్రజాస్వామ్య విధానాలను మంటగలపడానికే ముందుకు వస్తున్నాయి. సంస్కరణల కోసం భారత ప్రభుత్వం పుష్కలంగా డబ్బులు గుమ్మరిస్తోందనడానికి 2011 ఫిబ్రవరి కేటాయింపులు చూస్తేనే తెలుస్తుంది. ఇలాంటి కేటాయింపులూ గతంలోనూ చాలా జరిగాయి. ఈసారి డిల్లీలో ఫిబ్రవరి 1 నాడు దేశ ప్రధాని మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిపి అందులో దేశంలోని 60 ఆదివాసి, ప్రబల వెనుకబడిన జిల్లాలకు రూ. 1375 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పాడు. ఆ డబ్బులో ఎక్కువ మొత్తం రోడ్ల నిర్మాణం, విద్యుచ్ఛక్తి సరఫరా, మౌలిక సదుపాయాల రూపకల్పనకే వెళుతుందన్నాడు. ప్రజల విద్యా, వైద్యానికి మాత్రం ఆ మొత్తంలో కేవలం 50 కోట్లు విదిలించారంటే సంస్కరణలు ఏ ఉద్దేశ్యంతో ముందుకు వస్తున్నాయో విజ్ఞులకు మళ్లీ ఇక్కడ విడమర్చి చెప్పాల్సిన పనే ఉండదు. తుపాకులతో ఉద్యమాలను అణచివేస్తూ వెళితే ఆ దారిన డబ్బుల సంస్కరణలతో ముడిపదార్థాల సరఫరాలకు మార్గాలను సుగమం చేయడమే మన్‌మోహానుడి మౌలిక సదుపాయాల రూపకల్పనలోని చిదంబర రహస్యం. మృత ప్రధాని రాజీవ్ కాలం నాటికే ఆదివాసీల అభివృద్ధి కోసం వెచ్చించిన డబ్బులను నేరుగా వాళ్లకే అందజేసి ఉంటే కుటుంబానికి లక్ష రూపాయలు

అందించి వాళ్లను ఆదుకోగలిగేవాళ్లం అన్నాడాయన. ఆయన కాలం నాటికే రూపాయిలో 15 పైసలే లక్షిత కార్యక్రమాలపై ఖర్చవుతున్నాయనీ మిగతాది బూరాక్రసీ పాలవుతోందని లెక్కలు తేల్చి రాజీవుడు వాపోయాడంటే, నేటి గ్లోబలైజేషన్ యుగంలో సీరియల్ బ్లాస్ట్‌లా వెలుగు చూస్తున్న అవినీతి కుంభకోణాల మధ్య ఇంత పెద్ద మొత్తాలలో బాధిత ప్రజలకు చేరేదెంతో చెప్పడం కష్టమేమీ గాదు. అలాగే 60 ఏళ్ల 'స్వతంత్ర్య' భారతావనిలో ఆదివాసీల అభివృద్ధికై చేపట్టిన రోడ్లూ, రైల్వేలైన్లూ, మౌలిక సదుపాయాల రూపకల్పనా వారికి ఎంత మేలు చేశాయో, అంతకన్నా ఎక్కువ కీడు చేసాయని దోపిడీ ప్రభుత్వాల వైనం తెలిసినవాళ్లెవరైనా ఊహించగలరు. అవినీతి విషయానికి వస్తే ఇక్కడ మీడియా చర్చల్లో నలుగుతున్న ఒక్క వుదాహరణను చూద్దాం.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని 18 జిల్లాలలో ముఖ్యమంత్రి సొంత జిల్లా కవర్ధా ఒకటి. ఇక్కడ ఆదివాసీ జనాభా 27%కి మించిలేదు. వీరిలో లుప్తమవుతున్న బైగాలూ ఉన్నారు. ఈ జిల్లా పోలీసుల జాబితాలో మావోయిస్టు ప్రభావిత జిల్లాగా లేనేలేదని పోలీసు విభాగ అధికార ప్రతినిధి ఆర్.కె. విజ్ స్పష్టం చేస్తూంటే ముఖ్యమంత్రి మాత్రం మావోయిస్టు ప్రభావిత జిల్లాలో తన జిల్లాను చేర్చుకొని కోట్లాది రూపాయలను తోచినట్టు ఖర్చు పెట్టిస్తున్నాడనీ వార్తా పత్రికలే రాస్తున్నాయి. ఈ డబ్బుతో బైగాలకు కానీ, ఇతర ఆదివాసీలకు కానీ సంబంధమే లేకుండా పోయింది. ఇదీ వీళ్ల సంస్కరణల దోపిడీలో భాగమే.

ఈ సంస్కరణల తతంగంలో భాగంగానే 'నాగరిక సురక్షా సమితి'లు 'మహాత్మాగాంధీ తంటాముక్తి సమితి'లు నిర్మించడానికి పూనుకుంటున్నారు. వీటిని గ్రామ రియాక్షనరీ శక్తులతో నింపి వీటిని పౌర గూఢచర్య కేంద్రాలుగా మలుస్తున్నారు. వీటికి లక్షలాది రూపాయలు మంజూరు చేస్తూ డబ్బుతో మనుషులను కొనుగోలు చేసే అవినీతి వ్యాపారంగా వీటి వ్యవహారం సాగుతోంది. మూడు దశాబ్దాల విప్లవోద్యమం ద్వారా ప్రజల్లో పెంపొందిన విప్లవ చైతన్యాన్నీ, ప్రజాస్వామిక విలువలనూ భ్రష్టు పట్టించే కుట్రలో భాగంగానే ఇవి చాప కింద నీరులా కార్యకలాపాలను కొనసాగిస్తూన్నాయి. ఈ వాస్తవాలను ప్రజల ముందుంచుతూ వారి విప్లవ చైతన్యాన్నీ పెంచి సంస్కరణలను తిప్పికొట్టే దిశలో విప్లవోద్యమం కృషి చేస్తోంది. దేశంలోని పిడికెడు మంది అభివృద్ధి కోసం కోట్ల ప్రజలను కొల్లగొడుతూ, విశాల ప్రజారాశుల నిజమైన అభివృద్ధి కోసం జరుగుతున్న విప్లవోద్యమాన్ని అభివృద్ధి నిరోధకంగా వర్ణించడం ఎలా తప్పో, ఎంత బూటకమైందో సోదాహరణంగా విప్లవకారులు ప్రజల్లో స్పష్టం చేస్తున్నారు. గ్రీన్‌హంట్ ప్రారంభమయ్యాక పోలీసుల సివిక్ ఆక్షన్ ప్రోగ్రాంలు ముమ్మరం అయ్యాయి. ఉద్యమ అణచివేతలో భాగంగా ముందు నుంచీ పోలీసుల సంస్కరణలు నడుస్తూన్నప్పటికీ ఈ మధ్య ఇవి ముమ్మరం అయ్యాయి. అన్ని రకాల పోలీసు, అర్ధసైనిక బలగాలు వీటిని అమలు చేయడంలో తెగ పోటీ పడుతున్నాయి. సంతల్లో, పట్టణాల్లో, రోడ్లపైనా రైతాంగాన్ని దొరకబుచ్చుకొని గంజులూ, సైకిళ్లూ, మందులూ ఇంకా రకరకాల నిత్యావసర సరకులు ఉచితంగా ప్రజలకు పంచుతూ తమ వైపు వారిని మలచుకోవడానికి అనేక తంటాలు

పడుతున్నారు. యువతకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు పంచడం సాధారణమైంది. వీటి అన్నింటి ఏకైక ఉద్దేశ్యం విప్లవోద్యమం నుంచీ ప్రజలను దూరం చేసి అంతిమంగా దాన్ని నాశనం చేయడమే.

## 3 (జి) పిఎల్‌జిఏ పురోగమనంలో సైనిక కమీషన్ల సందేశాలు - దిశానిర్దేశాలు

డిసెంబర్ 2 వచ్చిందంటేనే ప్రజా గెరిల్లాలలో, ప్రజా మిలీషియా కార్యకర్తలలో పెద్ద పండుగ వాతావరణం నెలకొంటూంది. ప్రజలతో మమేకం చెందిన గెరిల్లాలు ఆ పండుగను వారితో కలిసే ఉత్సాహంగా జరుపుకోవడం ఒక విప్లవ సంప్రదాయంగా మారింది. డిసెంబర్ 2 నుంచీ 8 వరకు పిఎల్‌జిఏ స్థాపనా వారం గ్రామగ్రామాన పాటించబడుతూంది. పిఎల్‌జిఏ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎప్పటిలా వారం రోజులు కాకుండా పదేళ్ల వేడుకలు నెల రోజుల నిర్దిష్ట కార్యక్రమాలతో సాగాయి. ఊరూరా పిఎల్‌జిఏ జండాను ఎగురవేసి గెరిల్లాలు, ప్రజా మిలీషియా కార్యకర్తలు ఫ్లాగ్‌మార్చ్ చేసి సైనిక వందనం చేయడం, అమర గెరిల్లా సైనికుల త్యాగాల స్మృతిలో వినమ్రంగా తలవంచి రెండు నిమిషాలు మౌనంగా నిల్చి సైనిక పద్ధతులలో విప్లవ జోహార్లర్పించడం సాధారణమైంది. పిఎల్‌జిఏ స్థాపనా దినాన్ని పురస్కరించుకొని కేంద్ర, స్పెషల్ జోన్ సైనిక కమీషన్లు విడుదల చేసే సందేశాల సారాంశాన్ని చదవడం, వక్తలు దాని వెలుగులో తమ అనుభవాలనూ, పరిస్థితులనూ విశ్లేషించి మాట్లాడడం తప్పక జరుగుతూ వస్తోంది. రాజకీయ - సైనిక వాతావరణంలో దినమంతా జరిగే కార్యక్రమాలన్నింటిలో గ్రామస్థులూ భాగస్తులే అవుతారు. దశాబ్ద కాలంలో సైనిక కమీషన్లు విడుదల చేసిన యేటేటీ సందేశాలలో ప్రధానంగా ఈ కింది సారాంశం ఉండింది.

2001 నుంచీ 2005 వరకూ విడుదలైన సందేశాలలో పిఎల్‌జిఏను పటిష్టం చేయడంలో భాగంగా నూతన భర్తీలను ప్రోత్సహించడం, టిసిఓసిలను సఫలం చేయడంపైనే ప్రధానంగా కేంద్రీకరించి చెప్పారు. వాటిలో చాలా వరకు ఉద్యమం సఫలమయింది. 2005లో సల్వాజుడుంను ఓడించాలనే పిలుపూ, 2007లో 'కంబాట్ స్కిల్స్‌ను, టెక్నికల్ స్కిల్స్‌ను పెంచుకుందాం' అనే పిలుపు ఉంది. వాటిలో ప్రధానంగా ఇలా పేర్కొన్నారు : '....చిన్న ఫార్మేషన్లు నడిపిన కమాండర్లు పెద్ద ఫార్మేషన్లు నడిపేలా, తమకు పరిచయమున్న ప్రాంతాల్లో యుద్ధచర్యలు చేయగల్గే కమాండర్లు తమకు పరిచయంలేని ప్రాంతాల్లో సైతం యుద్ధచర్యలు నిర్వహించగలిగేలా, పెరిగిన యుద్ధస్థాయికి తగినట్లుగా యుద్ధచర్యల్ని నిర్వహించగలిగేలా మన కమాండర్లు అభివృద్ధి కావాలి....' 2008లో 'కమాండో బలగాలను మట్టుబెడుదాం, కార్పెట్ సెక్యూరిటీని విఫలం చేద్దాం, శత్రు ఇంటలిజన్స్ నెట్‌వర్క్‌ను మట్టుబెడదాం' అంటూ పిలుపు నిచ్చి అందులో ప్రధానంగా '....కమాండో బలగాలను దెబ్బతీయడంలో శత్రు ప్రధాన బలగాలను దెబ్బతీయడంలో మన ప్రధాన బలగాలు ముందుండాలి. మన ప్రధాన బలగాలు కమాండో బలగాలను నిర్మూలించే దాడులు చేయాలి. ద్వితీయ, పునాది బలగాలు తమ శక్తి సమర్థతలకు అనుగుణంగా నష్టం కలిగించే దాడులు చేయాలి. కమాండో బలగాలను దెబ్బతీయడంలో మనకు గొంపాడు సమరం, బలిమెల ఆంబుష్‌లు నమూనాలుగా

ఉంటాయి. గొసామా సమరంలో మన బలగాలు ప్రదర్శించిన నిబ్బరత్వం, వీరత్వం మనం ఆదర్శంగా స్వీకరించాలి. బలిమెలలో కమాండో బలగాల బలహీనతల్ని కనిపెట్టి వాటి ఆధారంగా దాడి ప్లాన్‌ను రూపొందించుకొని దృఢంగా అమలు చేశాయి. కమాండో బలగాల బలహీనతల్ని (ప్రయాణం, మకాం, దాడి, రిట్రీట్) కనిపెట్టి దాడి చేయడంలో మనకు బలిమెల ఆంబుష్ ఆదర్శంగా వుంటుంది. ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, తోంగూడ, బట్టిగూడెం ఆంబుష్‌ల్లాగా శత్రువును చుట్టుముట్టి నిర్మూలించే దాడులు చేసి కమాండో బలగాలను నిర్మూలించాలి..... కార్పెట్ సెక్యూరిటీ ధ్వంసం చేయడానికై మనం ఆంబుష్, రెయిడ్ ఎత్తుగడలను రెండింటిని మేళవించాలి. కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా వందలాది పోలీసు, పారామిలటరీ బలగాలతో, పకడ్బందీ ఫోర్టిఫికేషన్లతో వాడు నిర్మించుకుంటున్న క్యాంపులను దెబ్బతీసేలా రెయిడ్ ఎత్తుగడల్లో అభివృద్ధి సాధించాలి. కార్పెట్ సెక్యూరిటీ ఆధారంగా వాడు చిన్న చిన్న ప్రాంతాలను చుట్టుముట్టి నిరంతరం చేపట్టే గాలింపు చర్యలను విఫలం చేయడానికై భారీ ఆంబుష్‌లతో పాటు, చిన్న మధ్యరకం ఆంబుష్‌లు నిరంతరం చేపట్టాలి...... శత్రు ఇంటెలిజన్స్ నెట్‌వర్క్‌లో భాగమయిన కోవర్టులను, ఇన్‌ఫార్మర్ల సమస్యను ఎదుర్కోవడంలో భాగంగా మొదట ప్రజలను, విప్లవ శ్రేణులను విప్లవ, వర్గ రాజకీయాలతో చైతన్యవంతం చేయాలి. పీడిత వర్గ విముక్తికై పోరాడుతున్న విప్లవ శిబిరాన్ని (ప్రజలు, పార్టీ, పిఎల్‌జిఏ) చీల్చి, దెబ్బతీయడానికి శత్రువు అనుసరిస్తున్న ఎలాంటి ఎత్తుగడలకయినా లొంగవద్దని, శత్రువు చూయించే వివిధ రకాల ప్రలోభాలకు లొంగవద్దని, బెదిరింపులకు భయపడవద్దని చైతన్యపరచాలి....' అని పేర్కొన్నారు. 2009లో విడుదల చేసిన సందేశంలో 'గ్రీన్ హంట్ దాడులకు వ్యతిరేకంగా ప్రజలను ప్రజాయుద్ధంలో విస్తృతంగా కదలిద్దాం' అని చెప్పి అందులో '.....కేంద్ర ప్రభుత్వం భారీదాడిని కొనసాగించి 3 సంవత్సరాల్లో దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి సిద్ధమయ్యింది. ఈ భారీ దాడిలో భాగంగా డికెలో పూర్తిస్థాయి యుద్ధానికి పూనుకున్నారు. ఈ దాడి మొదటి దశలో కోబ్రా కమాండోలతో సహా వివిధ రకాల కమాండో బలగాలను ముందుభాగాన ఉంచి పెద్దఎత్తున పారామిలటరి బలగాలను సమీకరించి దాడులు చేస్తారు. రెండవ దశలో శ్రీలంక తరహాలో దాడుల్ని నిర్వహిస్తారు. అంటే పూర్తిస్థాయిలో సైన్యాన్ని మోహరించి దాడులు చేస్తారు.... శత్రు దాడి రాజకీయ లక్ష్యాన్ని ప్రజలకు వివరించి వారిని లాల్‌గఢ్ తరహాలో కదిలించాలి. విస్థాపిత సమస్యపై ప్రజలను పెద్దఎత్తున కదిలించి ఉద్యమాన్ని నిర్మించాలి. ఇందులో అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలను కదిలించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న భారీదాడిని ఓడించడానికి అన్ని సెక్షన్లను, విశాల ప్రజారాశులను విప్లవోద్యమంలోకి సమీకరించాలి. అందుబాటులో ఉన్న ఆయుధాలు అన్నింటిని సమీకరించి, స్థానిక వనరులపై ఆధారపడి మిలీషియాను పెద్దయెత్తున సాయుధం చేసి ప్రజా ప్రతిఘటనను పెంచాలి. శత్రు దాడి నుండి ప్రజలను కాపాడుకోవడంలో భాగంగా గ్రామాల ప్రాతిపదికగా దాడి-ఆత్మరక్షణ పద్ధతులపై శిక్షణ గరపాలి. మిలీషియా చికాకుపరిచే చర్యల్ని, చిన్నరకపు ప్రతిఘటనా చర్యల్ని రెగ్యులర్‌గా నిర్వహించాలి. సెకండరి బలగాలు స్వతంత్రంగా, చొరవ చేసి దాడులు చేయాలి, తమ శక్తిమేరకు చిన్న, మధ్యరకపు చర్యల్ని విస్తృతంగా నిర్వహించాలి.....'

అంటూ పిలుపు నిచ్చారు. 2010 పిఎల్‌జిఏ దశాబ్ది వేడుకల సందర్భంగా ఇచ్చిన పిలుపులో 'దండకారణ్య ఉద్యమ నిర్మూలనకు దాడికి దిగనున్న భారత సైన్యాన్నీ, వాయుసేనను ఎదుర్కోవడానికి సిద్ధమవుదాం' అని కోరారు. ఇందులో '.....శత్రుదాడిని ఓడించడానికి, సైన్యం దిగితే ఎదుర్కోవడానికి చేపట్టే సన్నాహాల్లో భాగంగా మన ఫార్మేషన్లలో మార్పులు, పెంపుదల చేసుకోవాలి. దీనికోసం పెద్దయెత్తున పిఎల్‌జిఏ రిక్రూట్‌మెంట్‌ను పెంచుకోవాలి. పిఎల్‌జిఏ దశాబ్ది ఉత్సవాలను పెద్ద రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్‌గా మలచి వందలు, వేలసంఖ్యలో యువతీ యువకులను పిఎల్‌జిఏలోకి రిక్రూట్ చేసుకోవాలి. ఇప్పటి వరకు సంవత్సరానికి వందల సంఖ్యలో వస్తున్న రిక్రూట్‌ను వేలసంఖ్యలోకి అభివృద్ధి చేయాలి. ప్రస్తుతమున్న కంబాట్ బలగాలను రాజకీయంగా, మిలటరీపరంగా, నిర్మాణపరంగా సంఘటితం చేసి వాటి పోరాట సామర్థ్యం పెంచాలి.

హెలికాప్టర్ల దాడులను ఎదుర్కోవడానికి పాసివ్ (సాత్విక), యాక్టివ్ (చురుకైన) ఆత్మరక్షణా చర్యల్ని చేపట్టాలి. భారత సైన్యాన్ని, వాయుసేనను ఎదుర్కోవడానికి ప్రజలకు, పార్టీకి, పిఎల్‌జిఏకు విస్తృతమైన శిక్షణ నివ్వాలి. ప్రజలు-పిఎల్‌జిఏ కలిసి నిరంతరం చిన్న, మధ్యతరహా, పెద్ద చర్యల్ని సమన్వయించి సాగించాలి....'

పైన చెప్పిన విధంగా ప్రతియేటా పీఎల్‌జీఏ సైనిక కమీషన్లు డిసెంబర్‌కు ముందుగానే తమ సైన్యానికి సందేశాలు పంపిస్తూ రానున్న సంవత్సర కాలంలో అది కేంద్రీకరించాల్సిన చర్యలను కార్యక్రమాలను స్పష్టంగా వివరిస్తున్నాయి. గడిచిన సంవత్సర సందేశాల అమలును సమీక్షిస్తూ గుణపాఠాలు అందిస్తున్నాయి. ఈ సందేశాలు పిఎల్‌జిఏకు గైడ్‌లైన్స్‌గా ఉంటున్నాయనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. (పైన పేర్కొన్న పిలుపులన్నీ దండకారణ్య స్పెషల్ జోన్ సైనిక కమీషన్ ఇచ్చినవనే విషయాన్ని పాఠకులు గుర్తుపెట్టుకోవాలి.)

పిఎల్‌జిఏ స్థాపనా వారం మొదలైందంటేనే అన్ని రాష్ట్రాలలో లాగా దండకారణ్యంలో పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటిస్తారు. దండకారణ్యానికి వచ్చే ఒకే ఒక్క రైలు బండిని (వాల్తేర్-కిరందూల్) నిలిపివేస్తారు. పిఎల్‌జిఏ స్థాపనా వారాన్ని 'బంద్'గా పోలీసులు, పత్రికలు తప్పుడుగా ప్రచారం చేస్తూ ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మరో కొత్త పదాన్ని 'మహా బంద్' దండకారణ్య ప్రజలకు పరిచయం చేసి నెల రోజుల బంద్ సృష్టించారు. పిఎల్‌జిఏ వేడుకల సందర్భంగా ఎలాంటి బంద్‌లు లేవని పదే పదే పార్టీ అధికార ప్రతినిధి గుడ్సా ఉసెండి స్పష్టం చేస్తున్నా మీడియా మాత్రం పోలీసుల ఒత్తిళ్లకే లొంగిపోతూ అసత్య ప్రచారాన్నే కొనసాగిస్తోంది.

## 3 హెచ్) పదేళ్ల పిఎల్‌జిఏ – సాధించిన ప్రగతి

పిఎల్‌జిఏ ఏర్పడి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా దండకారణ్య స్పెషల్ జోన్ సైనిక కమీషన్ అది సాధించిన ప్రధాన రాజకీయ - సైనిక విజయాలను ఈ కింది విధంగా పేర్కొంది.

"...... దండకారణ్యంలో డివిజన్ స్థాయిలో జనతనా సర్కార్లు (ప్రజా రాజ్యాధికార అంగాలు) ఏర్పడి పనిచేస్తున్నాయి. పిఎల్‌జిఏ సాగిస్తున్న ప్రజాయుద్ధపు దన్నుతో ఈ జనతనా సర్కార్లు బడాభూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ వర్గ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా పీడితవర్గాలైన రైతుల, కార్మికుల, పెటీబూర్జువాల, జాతీయ బూర్జువాల, పీడిత సెక్షన్ల (ఆదివాసులు, దళితులు, మహిళలు, మత మైనారిటీలు) ఆకాంక్షల పరిపూర్తి కోసం ప్రజా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థను నిర్మిస్తున్నాయి.

....... గ్లోబలైజేషన్ విధానాల ఫలితంగా దళారీ నిరంకుశ బూర్జువాలు, సామ్రాజ్యవాదులు కలిసి చేస్తున్న ప్రకృతి వనరుల దోపిడీని అడ్డుకుంటున్నాం.

...... 'అడవిపై అధికారం ఆదివాసులదీ, పీడిత ప్రజలదే', 'దున్నేవారికే భూమి' అనే నినాదాల అమలు కోసం ప్రజాయుద్ధం సాగుతున్న ఫలితంగా ఈ రోజు దండకారణ్యంలో లక్షలాది ఎకరాల అడవి భూములు, భూస్వాముల, తెగపెద్దల భూములు ప్రజలపరం అయ్యాయి. జల్, జంగల్, జమీన్ మీద ఆదివాసుల, పీడిత ప్రజల అధికారం కొనసాగుతోంది.

....... దండకారణ్యంలోని సకల వనరులను కొల్లగొట్టుకపోవడానికి దళారీ నిరంకుశ బూర్జువాలు, సామ్రాజ్యవాదులు మిలాఖత్తై భారత రాజ్యపు దన్నుతో సల్వాజుడుంను ప్రారంభిస్తే, ప్రజల్ని సంఘటితం చేసి ప్రజాయుద్ధాన్ని సాగించి సల్వాజుడుంను ఓడించాం.

........ శత్రువును సెక్షన్ స్థాయిలో నిర్మూలించగలిగే స్థితి నుండి ప్లాటూన్లను నిర్మూలించే స్థాయికి పిఎల్‌జిఏ పోరాట సామర్థ్యం పెరిగింది. ముకరం ఆంబుష్‌లో శత్రువుకు చెందిన కంపెనీని తుడిచిపెట్టేశాం. ఇది పిఎల్‌జిఏ సాధించిన నూతన, ఉన్నతమైన అనుభవం. ఈ అనుభవం ద్వారా 'మరిన్ని ముకరంలను సృష్టిద్దాం' అనే నినాదం దేశవ్యాప్తంగా పిఎల్‌జిఏ బలగాల ప్రేరణదాయక నినాదంగా మారింది.

........ 'శత్రువే ఆయుధాల సమీకరణకు ప్రధాన వనరు' అనే సూత్రాన్ని ఆచరణలో పెట్టి వందలాది తుపాకుల్ని, వేలాది తూటాల్ని, టన్నుల కొలది పేలుడు పదార్థాల్ని శత్రువు నుండి స్వాధీనం చేసుకొని పిఎల్‌జిఏ ఆయుధ సంపత్తిని పెంచుకుంటూ మెరుగుపరుచుకుంటున్నాం.

....... ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ల, ఆపరేషన్ల (చర్యల) రూపకల్పనలో అభివృద్ధి సాధిస్తున్నాం. మెరుగైన ప్లానింగ్ ఆధారంగా సి4 (కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, కోఆర్డినేషన్)[7]లో అభివృద్ధి సాధిస్తున్నాం.

........ శత్రువు అనుసరించే కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ ఎత్తుగడలను ప్రజాయుద్ధ ఎత్తుగడలతో తిప్పికొడుతున్నాం. కార్పెట్ సెక్యూరిటీ మధ్యలోనే గెరిల్లా యుద్ధాన్ని సాగించే అనుభవం సంపాదిస్తున్నాం....."

పైన సైనిక రూపంలో సంశ్లేషించిన దానిని మరో విధంగా సాహితీ రూపంలో ఇలా కూడా

చెప్పుకుందాం.

అసమాన త్యాగాల నులివెచ్చని నెత్తుర్లతో తడుస్తూన్న దండకారణ్య మట్టి వాసనలతో నిండిన విముక్తి పవనాలు దండక్ అడవులనూ, కొండలనూ దాటి మైదానాల్లోకీ, పట్టణాల్లోకీ, భారత పీడిత ప్రజా రాశుల హృదయాలలోకి ఆక్సిజన్‌లా చేరుతున్నాయి.

# 4. త్యాగాల ఫలం - దశాబ్ది వికాసం

1980లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో జరిగిన కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల రైతాంగ పోరాటాల విస్తరణలో భాగంగా దండకారణ్యానికి విస్తరించిన విప్లవోద్యమంలో కామ్రేడ్ పెద్దిశంకర్ తొలి అమరవీరుడుగా గణుతికెక్కాడు. ఆయనను మహారాష్ట్ర సాయుధ పోలీసులు ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర సరిహద్దులలో గోదావరి తీరాన గల ముయ్యబోయినపేట వద్ద కాల్చిచంపారు. ఇది 1980 నవంబరం 2 నాడు జరిగింది. అప్పటి నుంచీ 2011 అగస్టు 15 వరకు (భారత 'స్వాతంత్ర' దినం వరకు) దాదాపు రెండువేలకు పైగా కామ్రేడ్స్ విప్లవ ప్రజానీకం దండకారణ్య విప్లవోద్యమ నిర్మాణంలో నేలతల్లి విముక్తి కోసం తమ నెత్తుర్లు చిందించారు. వీరందరికీ దండకారణ్య విప్లవోద్యమం వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది. వీరి ఆశయాల సాధనకై తుది వరకూ పోరాడుతామనీ విప్లవ ప్రజానీకం దృఢసంకల్పంతో విప్లవ ప్రతిజ్ఞ చేస్తోంది.

దండకారణ్య విప్లవోద్యమ నిర్మాణంలో భాగంగా తొలి రెండు దశాబ్దాలలో అసువులు బాసిన వీరయోధులు మూడు వందలకు మించలేదు. కానీ, ఆ తర్వాతి దశాబ్దంలోనే అనేకమంది కామ్రేడ్స్ ఆశయాల సాధనలో శత్రువుతో పోరాడుతూ తమ ప్రాణాలను ధారపోశారు. వీరిలో సగానికి పైగా కామ్రేడ్స్ ఫాసిస్టు సల్వాజుడుం, గ్రీన్ హంట్‌లు సృష్టిస్తోన్న తెల్ల బీభత్సంలో రాజ్యహింసకు బలైన గ్రామీణ విప్లవ ప్రజానీకమే ఉండడం గమనార్హం. వీరిలో అన్ని వయసుల వాళ్లున్నారు. ఆడ-మగ అనే తేడా లేకుండా ముసలీ, ముతక అనే బేధం లేకుండా ఎందరెందరో ప్రజలు పోలీసుల కర్కశత్వానికి బలయ్యారు. వీరందరినీ దండకారణ్యంలో పల్లె, పల్లె స్మరించుకుంటోంది. వీరి స్మృతిలో ప్రజలు అనేక పల్లెల్లో నిలువెత్తు స్థూపాలు నిర్మించుకున్నారు. ఆ స్థూపాల శిఖరాన నిల్చిన సుత్తీ కొడవలి హత్తిన రెపరెపలాడే ఎర్రజండాలు నిరంతరం దండకారణ్య విప్లవ త్యాగాలను ఎత్తిపడుతున్నాయి. ప్రజలు తమ ప్రియమైన అమరులను ఆ జండాలలో, ఆ స్థూపాలలో చూసుకుంటారు.

విప్లవోద్యమ నిర్మాణానికీ నెత్తుర్లు ధారపోసిన వారిలో పార్టీ అత్యున్నత నాయకత్వ సంస్థ కేంద్రకమిటీ సభ్యుల నుంచీ మొదలుకొని సాధారణ పార్టీ సభ్యుల వరకు ఉన్నారు. విప్లవ ప్రజా సంఘాల నాయకుల నుంచీ సాధారణ కార్యకర్తల వరకున్నారు. ప్రజా మిలీషియా కార్యకర్తలున్నారు. నూతనంగా ఆవిర్భవిస్తోన్న ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికార అంగాలైన విప్లవ ప్రజా కమిటీ - జనతన సర్కార్ల నాయకులున్నారు. వీరందరినీ తమ కంటికి రెప్పలా, ప్రాణంలో ప్రాణంలా కాపాడుకునే విప్లవ ప్రజలూ ఉన్నారు. వీరందరి త్యాగఫలితమే 'నేటి దండకారణ్యం'. వీరందరి దృఢ సంకల్పం, అంకిత భావం, త్యాగాల పరంపరే దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మలచడానికి భూమినంతా ఎరుపెక్కిస్తోంది. అడవినంతా అరుణారుణం చేస్తోంది.



రణభూమిలో నేలకొరిగిన సహచరుడి స్మృతిలో అశ్రు నివాళి

20వ శతాబ్దం చివరి సంవత్సరంలో అంటే 1999 డిసెంబర్ 2న కామ్రేడ్స్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి), మహేష్ (సంతోష్ రెడ్డి), మురళి (శీలం రమేష్)లు బూటకపు ఎదురుకాల్పుల్లో హత్యకు గురైనారు. వీరి మరణంతో పీపుల్స్‌వార్ నడ్డి విరిగిందనీ శత్రువు తెగ మురిశాడు. విప్లవోద్యమం అంతమవుతుందనీ ఆశించాడు. కానీ వేలు, లక్షల సంఖ్యలో వారి వారసుల్ని తయారు చేయాలనీ, వారి విప్లవ స్ఫూర్తితో ఉద్యమాన్ని పురోగమింపజేయాలనీ పార్టీ పిలుపు నిచ్చింది. ఆ పిలుపును అక్షరాల అమలుచేస్తూ వారి ఆశయాల సాధనకై యావత్తు పార్టీ దృఢసంకల్పంతో నడుం బిగించింది. ఫలితంగా 21వ శతాబ్దం విప్లవోద్యమ పురోగమనానికి దారులు మరింత విశాలంగా తెరుచుకున్నాయి. నూతన దశాబ్దంలో విప్లవోద్యమం ఎన్ని తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ అనేక గొప్ప విజయాలు సాధించింది. విప్లవోద్యమం అనేక గెంతులతో అభివృద్ధి పథంలో పురోగమించింది. ఈ పురోగమనం శత్రువుతో సాగిన ఒక పెద్ద యుద్ధం ద్వారానే సాధ్యమైంది. ఈ అభివృద్ధి శత్రువు బలగాలను గట్టిదెబ్బలు తీస్తూ సాగింది. విప్లవోద్యమంలో సాధించిన విజయాలతో అది పటిష్టమవుతూ అనేకానేక ప్రాంతాలకు విస్తరిస్తూ ముందుకుపోయింది. దశాబ్దం ఆరంభంలో 56 జిల్లాలకే పరిమితమైన విప్లవోద్యమం 2010 నాటికి 223 జిల్లాలకు విస్తరించిందనీ చెప్తుతూ పార్లమెంటులో అనేకసార్లు పాలకవర్గాలు సమీక్షించాయి. ఈ మొత్తం ప్రగతికి పార్టీ రూపొందించుకున్న విప్లవ దిశ (లైన్), పార్టీ చేపట్టిన ఎత్తుగడలు, పార్టీ నిర్ణయించుకున్న విధానాలు వాటన్నింటికీ కార్యాచరణ రూపం ఇవ్వడానికి పార్టీ కొనసాగించిన విప్లవ రాజకీయ-నిర్మాణ కృషి కారణం. ఈ కృషిలో అసమాన త్యాగాలు అనేక ఉన్నాయి. ఈ కృషి ఫలితమే, ఈ త్యాగాల ఫలితమే గెరిల్లాజోన్‌లో పలు గెరిల్లాబేసులు నిర్మితమై విముక్తి ప్రాంత సాధన దిశలో 'నేటి దండకారణ్యం' ముందుకుపోతోంది.

దేశవ్యాప్తంగా పురోగమిస్తోన్న మావోయిస్టు విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తూన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ, రాష్ట్ర కమిటీల సభ్యులు ఈ దశాబ్ద కాలంలో గణనీయమైన సంఖ్యలోనే అమరులయ్యారు. వీరిలో చాలా మంది శత్రువు కొనసాగిస్తోన్న బూటకపు ఎదురుకాల్పుల్లోనే అసువులు బాశారు. ఏయేటికాయేడు శత్రువు నూతన పద్ధతుల్లో తీవ్రం చేస్తున్న దాడులు, యావత్తు విప్లవోద్యమాన్నీ నిర్మూలించడానికి కొనసాగిస్తూన్న అణచివేత-నిర్మూలనా దాడులు ముఖ్యంగా శత్రువు దేశవ్యాప్త మావోయిస్టు నాయకత్వంగా తాను ఎంచుకున్న 100 మంది పార్టీ ప్రధాన నాయకత్వ కేడర్లను టార్గెట్ చేస్తూ కొనసాగించిన దాడుల ఫలితమే ఈ నష్టాలు. పార్టీ నాయకత్వ కేడర్లను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపడంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, గ్రేహౌండ్స్ దేశంలోని శత్రు బలగాలకు రోల్ మోడల్‌గా నిలిచారు. కేంద్రం, వివిధ రాష్ట్రాల బలగాల సమన్వయంతో కొనసాగించిన దాడులలో వారి చేతికి చిక్కిన ఏ స్థాయి ఆంధ్రప్రదేశ్ కేడర్లను అయినా బూటకపు ఎదురుకాల్పుల్లో హత్య చేయడాన్నే ఒక విధానంగా వారు కొనసాగిస్తున్నారు. వారు అనేక ఘటనలలో చట్టాతీతంగానే వ్యవహరించి తమను తాము దోషులుగా ప్రపంచం ముందు నిలుపుకున్నారనడానికి కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్, హేమ్‌చంద్ పాండెల హత్యలే తాజా ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ విచారించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అందంటే అవి ఏ స్థాయిలో జరిగాయో ఊహించుకోవచ్చు.

పురోగమిస్తున్న దండకారణ్య విప్లవోద్యమానికీ కేంద్రకమిటీ సభ్యుల అమరత్వం తీవ్ర నష్టాన్ని కలిగించింది. దండకారణ్య విప్లవోద్యమ పురోగమనంలోని ప్రతి మలుపులో వారి పాత్ర అజరామరమైంది. సంతరించుకుంది. 2001-2010 మధ్య అమరులైన వారిలో కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ అజయ్‌దా, కామ్రేడ్ కరంసింగ్, కామ్రేడ్ అనురాధాగాంధీ, కామ్రేడ్ వడ్కాపూర్ చంద్రమౌళి, కామ్రేడ్ సందె రాజమౌళి, కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి, కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్‌లున్నారు. వీరితో పాటు పార్టీ రాష్ట్రస్థాయి కేడర్లు చాలా మంది ఉన్నారు. వీరందరూ గొప్ప విప్లవోద్యమ నిర్మాణ అనుభవం ఉన్నవారే. వీరు ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో విశిష్టానుభవాన్ని గడించినవారే. కామ్రేడ్ అజయ్‌దా, కామ్రేడ్ చంద్రమౌళి, కామ్రేడ్ రాజమౌళి సైనికరంగంలో, కామ్రేడ్ సుధాకర్ రెడ్డి గూఢచర్యంలో మంచి నైపుణ్యం సంపాదించి ఎంతో విప్లవ భవిష్యత్‌ను కలిగినవారు. కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్ పార్టీ సిద్ధాంతకర్తలలో ఒకరిగా ఉండి పార్టీ అధికార ప్రతినిధిగా 'ఆజాద్' పేరుతో సుపరిచితుడయ్యాడు. వీరంతా బూటకపు ఎదురుకాల్పుల్లో అసువులు బాసిన వీరయోధులే. వీరే కాకుండా కామ్రేడ్ కరంసింగ్, కామ్రేడ్ అజయ్‌దా, కామ్రేడ్ అనురాధ గాంధీలు అనారోగ్యంతో కన్నుమూశారు. వీరిలో కామ్రేడ్ కరంసింగ్, కామ్రేడ్ అజయ్‌దాలు విశేష ఉద్యమ అనుభవం కలిగిన నక్సల్బరీ తరం నాయకులు. కాగా, కామ్రేడ్ అనురాధ గాంధీ నక్సల్బరీ రాజకీయాలతో ప్రభావితం అయి జీవితాన్ని విప్లవోద్యమానికి ఫణంగా పెట్టింది. మహిళా రంగంలో ప్రత్యేక అనుభవాన్ని గడిస్తూ పార్టీ ఏర్పాటు చేసిన కేంద్ర మహిళా సబ్‌కమిటీకి నాయకత్వం వహించింది. ఇలాంటి నాయకత్వ శ్రేణుల లోటు ఉద్యమానికి చాలా నష్టాన్ని కలిగించింది. ఈ నష్టాల ప్రభావం

విముక్తి ప్రాంత లక్ష్యంతో పురోగమిస్తోన్న దండకారణ్యా విప్లవోద్యమంపై తీవ్రంగానే ఉంది. ఆజాద్ అడవికి చేరే దారిలో దొంగ ఎదురుకాల్పుల్లో అమరుడైతే, కామ్రేడ్ అనురాధ దండకారణ్యంలో విప్లవోద్యమానికి మహానగరాల మహిళలను పరిచయం చేసింది. అజయ్‌దా ఆదివాసుల మధ్య తిరుగాడే సమయంలో మలేరియా వాతపడినారు. కరంసింగ్, అజయ్‌దా, అనురాధ దీది ఆదివాసుల మధ్య అడవిలోకి వచ్చి అనారోగ్యం పాలై విప్లవోద్యమంలో ప్రాణమిచ్చారు.

దండకారణ్య విప్లవోద్యమ నిర్మాణానికి ప్రాణం పోసిన ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం 20వ శతాబ్దం చివరి వరకూ భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమంలో అగ్రశ్రేణిలో నిల్చింది. ఆ తర్వాతి సంవత్సరాలలో అక్కడి ఉద్యమం వెనుకపట్టు పట్టింది. అక్కడ ఎక్కువ సంఖ్యలోనే నాయకత్వ శ్రేణులను పార్టీ నష్టపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శి కామ్రేడ్ మాధవ్ సహా చాలా మంది కామ్రేడ్స్ శత్రువుతో పోరాడుతూ ఆశయసాధనలో అసువులు బాశారు. వీరందరి అమరత్వంతో పార్టీ భారీ నష్టాలను ఎదుర్కొంది. ఉత్తర తెలంగాణలోనూ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు కామ్రేడ్స్ అనుపురం కొమురయ్య, సోమన్న, రామక్రిష్ణ, పద్మక్క, లలితక్క సహా మరెందరో కామ్రేడ్స్ పోరాటంలో నేలకొరిగారు. వారందరి అమరత్వంతో పొందిన ఉద్యమ నష్టాలు దండకారణ్య విప్లవోద్యమ పురోగమనాన్ని కచ్చితంగా మందగింపజేశాయి.

ఈ దశాబ్దంలో దండకారణ్య విప్లవోద్యమం కోల్పోయిన ముఖ్యమైన నాయకత్వ కామ్రేడ్స్‌ను గుర్తు చేసుకోవడం అవసరం. 2001లో శత్రువుపై చేపట్టిన తొలి ఎత్తుగడల ఎదురుదాడి (టి.సి.ఓ.సి.)లో ఆగస్టు 9న కామ్రేడ్ రణదేవ్ ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా మోటు పోలీస్ స్టేషన్ రెయిడ్‌లో తన ప్రాణాలను అర్పించాడు. ఆ వెంటనే 2002 వేసవిలో చేపట్టిన రెండవ టి.సి.ఓ.సి.లో కామ్రేడ్ విజయ భాస్కర్ (సుఖదేవ్) బస్తర్ జిల్లాలో ఒక మాటుదాడిలో శత్రువుతో వీరోచితంగా తలపడుతూ శత్రువు తూటాలకు బలయ్యాడు. తర్వాత 2003 అక్టోబర్‌లో నిర్వహించిన ఒక మాటుదాడిలో కామ్రేడ్ రాజు (అయితు) అమరుడయ్యాడు. ఆ తర్వాత 2005లో చేపట్టిన వేసవి టిసిఓసిలో నారాయణపూర్ జిల్లా దౌడాయి పోలీస్‌స్టేషన్‌పై రెయిడ్‌కు వెళ్లినవారిలో కామ్రేడ్ కొండన్న (మంగ్తూ) శత్రువు జరిపిన కాల్పుల్లో అసువులు బాశాడు. ఆ తర్వాత 2006 తొలకరి సమయంలో ధంతరి జిల్లాలోని ఒక పోలీసు క్యాంపుపై దాడికి సిద్ధపడి ఆ పనుల్లో నిమగ్నమైన కామ్రేడ్ శ్రీనివాస్ (వికాస్) ప్రమాదవశాత్తు శత్రువు చేత జిక్కి వాడి చేతిలో చిత్రహింసలనుభవించి తుదకు విప్లవాశయాల కోసం తన ప్రాణాలు దారపోశాడు. 2007లో బీజాపూర్ జిల్లాలో మార్చిలో జరిగిన రానీబోదిలీ రెయిడ్‌లో కామ్రేడ్ మోహన్ తన ఐదుగురు సహచరులతో ప్రజావీరుడిగా అమరత్వం చెందాడు. 2008 వేసవి టిసిఓసిలో బీజాపూర్ జిల్లాలో జరిగిన తడికెల్ మాటుదాడిలో శత్రువును ఖంగు తినిపించి కామ్రేడ్స్ మధు, బద్రులు తమ నలుగురు కంపెనీ సహచరులతో సహా వీర మరణం చెందారు. ఆ తర్వాత అదే వేసవి టిసిఓసిలో జూన్ చివర్లో నారాయణపూర్

జిల్లా ఓర్చా పరిసరాల్లో జరిగిన మండేలి (బట్టుం) మాటుదాడిలో శత్రువును గట్టి దెబ్బతీయగలిగిన కంపెనీకి నాయకత్వం వహించిన కామ్రేడ్ తిరుపతి అసువులు బాశాడు. 2009లో జరిగిన 15వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మినప వద్ద భారత అర్ధసైనిక బలగాలతో పోరాడుతూ వారికి పెద్దనష్టాన్నే కలిగించిన మాటుదాడిలో కామ్రేడ్ చందూ తన ఐదుగురు సహచరులతో నేలకొరిగాడు. అదే సంవత్సరం మహారాష్ట్ర విధానసభ ఎన్నికల సందర్భంగా శత్రువు కొనసాగిస్తోన్న దాడుల నుంచీ ప్రజలకు రక్షణ కల్పించడంలో భాగంగా లాహెరి వద్ద పిఎల్‌జిఏ గెరిల్లాలు జరిపిన మాటుదాడిలో కామ్రేడ్ సాయినాథ్ (మంగేష్) ఆశయసాధనలో అసువులు బాశాడు. 2010 వచ్చేసరికి ఫాసిస్టు గ్రీన్ హంట్ సైనిక దాడిని తిప్పికొట్టే ప్రజా ప్రతిఘటనకు నాయకత్వం వహిస్తూన్న పిఎల్‌జిఏ వేసవి టిసిఓసిలో దంతెవాడ జిల్లాలో జరిపిన చారిత్రక ముకరం మాటుదాడిలో వీరోచితంగా పోరాడి శత్రువును పెద్దఎత్తున దెబ్బతీసినవారిలో మెరికల్లాంటి కామ్రేడ్స్ ఎనిమిది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఆ వెంటనే నారాయణపూర్ జిల్లాలో జరిగిన కొంగెర మాటుదాడిలో కామ్రేడ్స్ బండు, శంకర్, రమేష్‌లు తమ మరో సహచరుడితో సహా కలిసి వీర మరణం పొందారు. 2011 టిసిఓసిలో ఇడ్మాల్, మహరు, రాకేష్, మంగు సహ పదిహేను మంది చురుకైన కామ్రేడ్స్ సమరంలో మృత్యువును జయించారు. ఈ రకంగా 2001 నుంచీ 2011 వరకు జరిగిన అనేక ప్రజాయుద్ధ చర్యల్లో పదుల సంఖ్యలో కామ్రేడ్స్ తమ ప్రాణాలను త్యాగం చేశారు. వీరంతా పార్టీ ఇచ్చిన పిలుపును అందుకొని ప్రజాయుద్ధ చర్యలలో సాహసంగా పాల్గొన్నారు. సల్వాజుడుంను ఓడించడంలో వీరి అసమాన త్యాగాలు చిరస్మరణీయమైనవి. గత రెండేళ్లుగా కొనసాగుతున్న గ్రీన్ హంట్ సైనిక దాడిని ఓడించడానికి ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్న పిఎల్‌జిఏ త్యాగాలు మరువలేనివి.

యుద్ధభూమిలో శత్రువుతో పోరాడుతూ అసువులు బాసిన వీరయోధులలో కామ్రేడ్స్ సుఖదేవ్, మంగ్తూ, వికాస్ లాంటి ఉన్నతస్థాయి (ఎస్‌జడ్‌సి) నాయకత్వ కామ్రేడ్స్, రణదేవ్, రాజు, మోహన్, మధు, బద్రు, తిరుపతి, చందూ, మంగేష్ లాంటి మధ్య (డివిజన్) స్థాయిలలో సైనిక బాధ్యులు, కంపెనీల కమాండర్లు, కంపెనీ పార్టీ కమిటీ మెంబర్లు సైతం ఉన్నారు. వీరు సమర రంగాన నిల్చి తమ బలగాలకు నాయకత్వం వహిస్తూ త్యాగానికి వెనుకాడకుండా శత్రువును దునుమాడుతూ తమ సహచరులతో పాటు తాము అమరులు అయ్యారు. వీరిలో ఉత్తర తెలంగాణ పోరు బిడ్డల వారసులైన సుఖదేవ్, వికాస్, రణదేవ్, మధుల నుంచీ దండకారణ్య పోరు పొత్తిళ్లలో పెరిగి పెద్దయి జంగ్‌లో ప్రాణాలు త్యాగం చేసిన రాజు, బదురు, మోహన్, చందూ, మంగేష్ లాంటి వీర యోధుల వరకు ఉన్నారు. దండకారణ్య సమర రంగాన సాధించిన సైనిక విజయాలను వీరి త్యాగాలు లేకుండా ఊహించలేం. నాగలి దున్నడం, పసుల గాయడం, అంట్లు తోమడం, వంట చేయడం, కర్రలు తేవడం, ఆప్యాయంగా బిడ్డల నోటా 'అమ్మా' అనే పిలుపుతో తనువెల్లా పులకించి పోయే మహిళలు, మాతృమూర్తులు ఎందరో ఈ దండకారణ్య విముక్తి పోరులో అసువులు బాసారు. కామ్రేడ్స్ కమల, సీత, శారద, అనిత, సోమారీ, కరుణ, రత్తక్క, లక్కి, మంగ్లో, సునంద ... వంటి ఎందరెందరో వీర వనితలు త్యాగమూర్తులై పోరు చరిత్రకెక్కారు. వీరి

అమరత్వంతో వీరు భౌతికంగా ప్రజల మధ్య లేనిమాట నిజం కానీ వీరు లక్ష్యసిద్ధి కోసం ప్రజాసేవలో చేసిన త్యాగాల ఫలితంగా విప్లవోద్యమానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగింది. వీరు తమ త్యాగాలతో యుద్ధ గుణపాఠాలు అందించి తమ తర్వాతి పోరాట వారసులకు ఒక గొప్పస్ఫూర్తిని ఇవ్వగలిగారు. యుద్ధకళలో, టెక్నిక్‌లలో అభివృద్ధిని సాధించడానికి పునాదులు వేశారు. యావత్తు విప్లవోద్యమాన్ని పటిష్టం చేస్తూ అది నూతన ప్రాంతాలకు విస్తరించడానికి కావల్సిన పోరు సందేశాలను తమ నెత్తుటి త్యాగాలతో లిఖించి చరిత్రకు వన్నె తెచ్చారు. వ్యక్తులుగా ఉద్యమం వీరిని నష్టపోవడం, వీరు లేనిలోటును ఎదుర్కోవడం ఎంత వాస్తవమో, వారు తమ త్యాగాలతో, రక్తతర్పణంతో అంతకు మించి నూతన తరాలను లక్షలు, కోట్ల సంఖ్యలో వారి వారసులుగా తయారు చేసుకోవడానికి కావల్సిన పునాదులను మరింత గట్టిపరిచారు. కొత్త దారులను తెరిచారు. విప్లవోద్యమాన్ని నూతన ఎత్తులకు కొనిపోయారు. ఈ ఘనత వారికే దక్కుతుంది. 'నేటి దండకారణ్యా' ద్రష్టలు వాళ్లే.

ప్రజాయుద్ధం పురోగమిస్తున్న క్రమంలో అనేక నూతన పోరాట రూపాలు అనివార్యంగా ముందుకు వచ్చాయి. అవి యుద్ధంలోనే పుట్టాయి. యుద్ధ అవసరాల రీత్యానే అవి ఆచరణలోకి వచ్చాయి. వాటిలో మందుపాతరల యుద్ధతంత్రం ఒకటి. గెరిల్లా యుద్ధం అంటేనే ఆధునిక ఆయుధాలు కలిగిన బలమైన శత్రువుకు వ్యతిరేకంగా తమ సంప్రదాయ ఆయుధాలతో విశాల ప్రజారాశులు చేపట్టే ప్రజాపోరాట రూపంగా అర్థం చేసుకున్న వాళ్లెవరైనా దాని సృజనశీలతను సులువుగానే గ్రహించగలుగుతారు. దండకారణ్య ప్రజాయుద్ధంలో పాల్గొంటున్న పీడిత ప్రజలలో అత్యధిక శాతం ఆదివాసులే. వారికి గల సైనిక అనుభవం, వారికి బయటి 'పౌర' సమాజాలతో గల సంసర్గం, వారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవన స్థాయిని పరిగణన లోనికి తీసుకుంటే వారు ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యాలలో ఒకటైన భారత 'భద్రతా' బలగాలతో పోరాడడానికి పూర్తిగా సంసిద్ధులు కావడం అంటే అది సాధారణ విషయం ఏమీ కాదు. ఢిల్లీ నుంచీ ఇక్కడికి చేరుకుని ఇక్కడి ప్రజలపై వర్ణనాతీతమైన రూపాల్లో అతి పాశవికమైన పద్ధతులలో అర్ధసైనిక బలగాలు కొనసాగిస్తున్న సైనిక దాడుల నుంచీ తమ ప్రజలకు వీలైన మేరకు రక్షణ కల్పించడంలో భాగంగా ప్రజా మిలీషియా చేపట్టిన యుద్ధతంత్రాలలో మందుపాతర్ల యుద్ధతంత్రం ఒకటి. ఇందులో భాగంగా ప్రజా మిలీషియా ఏర్పాటు చేసే 'ప్రెజర్ మైన్లు' శత్రు బలగాలకు కునుకు పట్టనివ్వలేదు. 'బస్తర్ భూమి అంతా మందుపాతరల మయం' అనే చందంగా మీడియా చేసిన ప్రచారం వాళ్లను మరింత అదరగొట్టింది. కానీ ఈ ప్రెజర్ మైన్లు, బూబీట్రాప్‌లు, కేమోఫ్లేజ్‌డ్ పిట్స్ (బొందలు)ను అమర్చడంలో, వాటి మెలకువలు అర్థం చేసుకోవడంలో, వాటిని తమ చేతిలో అద్భుతమైన ఆయుధాలుగా మలచుకోవడంలో ప్రమాదవశాత్తు ఎన్ని ప్రాణాలు పోయాయో! ఎంతెంతో మంది చురుకైన, మెరికల్లాంటి యువకులు వాటి పని విధానాన్నీ పూర్తిగా అర్థం చేసుకునే క్రమంలోనే అసువులు బాసారు. శత్రువును మట్టుబెట్టి తమ వారిని కాపాడుకోవాలనే గొప్ప సంకల్పంతో వాటితో వ్యవహరించే ప్రక్రియలోకి దిగిన కేస్‌కుత్తుల్ గ్రామ బొముడాల్ (2005 జూలై 5న అమరుడైన తొలి కామ్రేడ్) గోర్నంకు చెందిన హోడికోసా,

పొంబాడ్ పూనెం బూదు, మాత్‌లూర్ గ్రామ హేమ్‌ల సోన్యూ, పదేడకు చెందిన హొప్కా సోనులు, 2005లో మురంగ గ్రామ నివాసి పూనెం బిచ్చెం, మస్కెలి గ్రామ కోర్సా బద్రు, అవునార్ హేమ్‌లా సన్ను, పోనాడ్ గ్రామ వేకో సోన్కో లాంటి చురుకైన ప్రజా మిలీషియా కార్యకర్తలు దాదాపు 20 మందికి పైగానే ఆ యుద్ధతంత్రానికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఆ ఆయుధాన్ని అందించారు. వీరే కాకుండా పిఎల్‌జిఏలోని వీర గెరిల్లాలు రాహుల్, హేంలాల్, నీలేష్, ముకేష్, ..... మొదలైనవాళ్లూ ఉన్నారు. వీరందరికీ విప్లవోద్యమం ఎంతగానో ఋణపడి ఉంటుంది.

ప్రజలు తమకు అందుబాటులో ఉన్న అనేక వస్తువులను తమ ఆత్మరక్షణార్థం బూబీట్రాప్‌లుగా, ప్రెజర్ మైన్లుగా మలుచుకున్నారు. వాటి ఆచూకి తెలిసినవాళ్లు శత్రు పంచన చేరి వాటి ఆనుపానులు పోలీసులకు చెప్పడంతో వాళ్లు వాటిని ప్రజల చేతనే తీయించి ప్రజలను బలితీసుకున్న ఘటనలూ వున్నాయి. బీజాపూర్ జిల్లా కోర్మాలో జనతన సర్కార్ నడుపుకుంటున్న కిరాణ దుకాణంలో బూబీట్రాప్ అమర్చిన విషయం తెలిసిన మొడియం మంగూ ప్రజాద్రోహిగా మారి పోలీసులకు రహస్యం చెప్పడంతో వాళ్లు ఊరుపై దాడి చేసి తమ చేతికి చిక్కిన మొడియం బుద్రితో దుకాణంలోని పెట్టె తెరిపించడంతో బాంబు పేలి ఆమె ఆ ట్రాప్‌లో తన ప్రాణాలను కోల్పోయింది. బూబీట్రాప్‌ల మూలంగా ప్రజాయుద్ధంలో క్షతగాత్రులయినవాళ్లు అమరులయిన వారికన్నా తక్కువేమీ లేరు. అయినప్పటికీ వాటిని ప్రజల యుద్ధంలో ప్రజలు తమ ఆత్మరక్షణార్థం నేటికీ అద్భుతంగా వినియోగించుకోగలుగుతున్న ఆయుధాలే. వాటికీ నెత్తుటి చరిత్ర, వాటి వెనుక త్యాగాల పరంపర నెలకొంది. అవీ మారణాయుధాలే కదా!

సల్వాజుడుం తొలి నుంచీ ప్రజలను సామూహికంగా హత్య చేయడం కొనసాగింది. జుడుం మొదలైన కొద్ది నెలలకే పైలట్ బ్లాక్ భైరంగఢ్ లోని మిర్తుల్ దగ్గర గల హరియాల్ గ్రామంలో పన్నెండు సంవత్సరాల బాలుడు సహా పది మంది రైతులను కేతుల్ (పొలంలోని పాక)లో పట్టుకొని నిలబెట్టి కాల్చి చంపారు. ఆ తర్వాత 2007 నుంచీ మరింత పెరిగింది. ఇప్పటికీ పోలీసులు, సల్వాజుడుం గూండాలు, గ్రీన్ హంట్ కమాండోలు, స్పెషల్ పోలీసు అధికార్లు దాదాపుగా డజనుకు పైగా ఘటనల్లో గ్రామీణ విప్లవ ప్రజానీకాన్నీ సామూహికంగా హత్య చేశారు. పొంజేరులో 11 మందినీ, తడికేల్‌లో ఆరుగురినీ, కంచాలలో 18 మందినీ, సింగారంలో 18 మందినీ, ఒంగ్‌నార్‌లో ఐదుగురినీ, తాకిలోడ్‌లో ఏడుగురినీ, పాలచెలిమలో 12 మందిని, గొంపాడ్‌లో 12 మందినీ, సాత్‌నార్‌లో ఏడుగురినీ, సమ్మేలీలో ఏడుగురిని, మద్కం గూడెంలో ముగ్గుర్ని, సుర్పాన్‌గూడాలో ఐదుగురినీ, పుల్లుం గ్రామంలో సిఎన్ఎం వారి సాంస్కృతిక కార్యక్రమాలను చూస్తున్న ప్రజలపై కాల్పులు జరిపి ఎనిమిది మందిని, పూజారి కాంకేర్ పంచాయితీలో నలుగురినీ, గొల్లగూడా (జేగురుగుండ)లో నల్గురినీ, తింపురం పంచాయితీలో ముగ్గురినీ, గుమియపాల్‌లో ఏడుగురినీ, ఇలింగేర్ ప్రజా మిలీషియా వారిని తొమ్మిది మందినీ పోలీసులు హత్య చేశారు. ఇలా ఒక ఘటనలో ఒక్కరికి మించిన సంఖ్యలో చంపడం అనేది క్రమంగా పెరుగుతూనే ఉంది. 2011 జనవరి 17 నాడు గొర్గుట్ట

గ్రామంపై దాడి చేసిన గ్రీన్ హంట్ కమాండోలు 25 సంవత్సరాల ముచాకి భీమాను, 18 ఏండ్ల యువకుడు కుహడాం బుద్రాను ఇద్దరినీ ఏకంగా హత్య చేశారు. గ్రీన్ హంట్ సైనిక దాడులు ప్రారంభమయ్యాక ప్రజా సమూహాలపై విచ్చలవిడిగా నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరపడం పెరిగింది. 2010 నవంబర్ 2న బీజాపూర్ జిల్లా సోమన్‌పెల్లి (మద్దేడ్ తాలుకా) గ్రామంలో చేతనా నాట్య మంచ్ వాళ్లు జరుపుతున్న బహిరంగసభపై పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరపగా శారద అనే మహిళ గాయపడింది. దండకారణ్యంలో పోలీసులు రొమ్ములు కోసి హత్య చేసిన 70 సంవత్సరాల దూది మూయే కానీ, మూకవెల్లిలో తల్లి గర్భంలో నుంచీ ఇంకా ఈ ప్రపంచ విచిత్రాలను చూడడానికి బయటికి రాకముందే తల్లి గర్భాన్ని తుపాకీ సన్నీలతో పొడవగా ప్రాణాలు కోల్పోయిన గర్భస్థ శిశువు కానీ, కోత్రాపాల్‌లో సజీవ దహనం పాలైన 80 ఏళ్ల వృద్ధుడు గానీ, వాళ్లంతా మావోయిస్టులేనని నిసిగ్గుగా పోలీసులు ప్రపంచాన్ని బుకాయిస్తున్నారు. పోలీసుల సిగ్గులేని ప్రతి కథనానికీ వాళ్ల సుప్రీం కమాండర్‌లు ప్రమాణ పత్రాలు ఇస్తూ రడీమేడ్ కుతర్కాన్ని మీడియాకు వెంటనే విడుదల చేస్తారు. వారిలో డిజిపి విశ్వరంజన్ అగ్రగణ్యుడు. మీడియా కావల్సినన్ని మసాలాలను దట్టిస్తూంది. వాటిని వెలుగులోకి తేవడానికి నిజనిర్ధారణ కమిటీలు పూనుకుంటే ఖాకీలు వారిని అనేక ఇబ్బందులపాలు చేస్తున్నారు. 1992లో మహారాష్ట్రలోని గోందియా జిల్లా దేవురి తాలుకాకు చెందిన పోలీసులు మంగెఝరి గ్రామంలో 14 మందిని సామూహకంగా హత్య చేసిన విషయంపై తీర్పు వెలువడకుండా ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో దాదాపు 20 ఏండ్లుగా మూలుగుతోంది అనే విషయం పాఠకులు గుర్తు పెట్టుకోవాలి. అలాగే పోలీసులు ప్రజలను హత్య చేసి శవాలను మాయం చేయడంలోనూ దిట్టలే. మనుషులను మాయం చేయడంలోనూ వారు మహా నేర్పరులే. అయితే ఇలాంటి కేసులు ఏవీ తమ చట్టం దృష్టిలోకి రాకుండా పకడ్బందీగా చూస్తుంటారనడానికి దండకారణ్యంలోనే ఎన్నో కేసులున్నాయి. 1992లోనే గోందియా జిల్లా దేవురి పోలీసులు బేవర్‌టోలలో నలుగురు కెఏఎంఎస్ కార్యకర్తలను మాయం చేశారంటే ఇప్పటికీ దాదాపు 20 ఏళ్లు కావస్తున్నా వారి అడ్రస్ వెతికి పెట్టినవాళ్లే లేరు. ఇవన్నీ ఇంత దారుణంగా జరిగిపోతున్నచోటుకి భారత ప్రభుత్వం తన సైన్యాలను పంపింది. భారత సైన్యం ఇక్కడ దిగిందంటే ఇక్కడ ఇంకెన్ని పొంజేరులు, ఎన్ని సింగారాలు, ఎన్ని తాకిలోడ్‌లు ఎన్నెన్ని సామూహిక హత్యలు, మిస్సింగ్‌లు జరిగిపోతాయో భారత సైన్యాల ప్రతాపమెరిగినవాళ్లకూ, నేటి కాశ్మీర్, మణిపూర్‌ల వైనం తెలిసినవాళ్లకూ విడిగా చెప్పాల్సిన అవసరమే ఉండదు. వాళ్లకు సాయుధ బలగాల విశేషాధికార చట్టం అండగా ఉండి ఏం చేసినా చెల్లుతుంది. వెలుగు చూడని ప్రజల త్యాగాల చరిత్రనూ వాళ్లను కన్నతల్లులూ, పెంచిన పల్లెలు, వాళ్లు పాలుపంచుకున్న విప్లవోద్యమం ఎలా మరవగలుగుతుంది? వాళ్ల త్యాగాల స్మృతులను నిత్యం స్మరించుకుంటోంది.

ప్రజాయుద్ధంలో నేలకొరుగుతున్న తమ బిడ్డల జ్ఞాపకాలను తమ పల్లెల్లో నిలుపుకోవడమనేది విప్లవోద్యమంలో అతి సాధారణ విప్లవ సంప్రదాయంగా మారింది. నేటి దండకారణ్యంలోని ఏ పోరాట గ్రామానికి వెళ్లినా అక్కడ తమ ప్రియమైన అమరుల స్మృతిలో ప్రజలు నిర్మించుకున్న నిలువెత్తు స్థూపం

దర్శనమిస్తుంది. లేకపోతే ప్రజలు తమ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం స్థూపాకారంలో పేర్చుకున్న రాళ్ల కుప్పలో, పొడవాటి కర్రలో (మొద్దు/గుంజ) అగుపడతాయి. ఇవి దండకారణ్యవ్యాప్తంగా వందల సంఖ్యలోనే ఉన్నాయి. అమరుల సంస్మరణ స్థూపాలపైన ఎర్రని జండాలు రెపరెపలాడుతుంటాయి. ఆ ఎర్రని జండాలపై పార్టీ జండా సుత్తీ-కొడవలి లేదా నూతన ఉషోదయానికి సంకేతంగా నిల్చిన కేఏఎంఎస్ వారి ఐదు కోణాల అరుణతారో లేదా పోరాట సంకేతంగా డీఏకెఎంఎస్ సుత్తీ కొడవలితో పాటు నిలుపుకున్న సారించిన విల్లో లేదా విల్లుతో పాటు ఆదివాసీ, ఆదివాసేతర శ్రామిక ప్రజల సమైక్యతా చిహ్నమైన జనతన సర్కార్ వారి రెండు నక్షత్రాలో లేదా సుత్తి, కొడవలిలో అమరిన పిఎల్‌జిఏ వారి సెల్ఫ్ లోడింగ్ రైఫిలో హత్తి సుత్తీ కొడవలితో పాటు ఉంటాయి. ఈ స్థూపాలు పోలీసుల కళ్లల్లో నలుసులవుతున్నాయి. ప్రజా శత్రువుల గుండెల్లో చేదు జ్ఞాపకాలుగా అణువణువునా పొటమరిస్తున్నాయి. ఆ స్థూపాల పైన ఎర్రెర్రని అక్షరాలతో దిద్దిన మృత్యుంజయుల పేర్లు, శిఖరాన రెపరెపలాడే ఎర్ర జండాలు విశాల ప్రజారాశులకు ఎంత ప్రియమైనవో దోపిడీ వర్గాలకు అంత హడలెత్తిస్తున్నాయి. అందుకే పోలీసులు వాటిని కూల్చే, పేల్చే చర్యలను చేపట్టారు. వాళ్లు దాడి చేయగలిగిన గ్రామంలో అమరుల స్థూపాలే వారి మొదటి టార్గెట్ అవుతాయి. బలవంతంగా వాటిని ప్రజలచే కూలగొట్టిస్తున్న ఘటనలూ ఉన్నాయి. తమ చేతులతో రాయీ-రాయీ పేర్చుకొని కట్టుకున్న తమ ముద్దు బిడ్డల జ్ఞాపకాలను తమతోనే కూలగొట్టిస్తున్న పోలీసులకు తమ గుండెల్లో అమరుల రూపాలు నిలిచి ఉన్నాయనీ, వారి రక్తం సిరాగా మారి వారి పోరాట సందేశం అక్షరబద్ధమైందనీ, తమ నెత్తురంతా వారి తీపి జ్ఞాపకాలతో, వారి ఆదర్శాలతో మసలుతూందని ఏం తెలుసు! అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న రేపు భారత సైన్యాలను మరింత గట్టిగా అడిగి తీరుతారు. 'నేటి దండకారణ్య'మంతా పరచుకున్న వారి జ్ఞాపకాల వెలుగులో రేపటి చరిత్ర నిర్మితమవుతుంది.

ముప్పై వసంతాల దండకారణ్య విప్లవోద్యమ ఫలితంగా ప్రజలు ఎన్నో ప్రయోజనాలను సాధించుకున్నారు. తమ గ్రామాలలో దోపిడీ ప్రభుత్వ అధికారాన్ని నడువకుండా చేసుకున్నారు. సంప్రదాయ పెద్దల తాఖీదులు చెల్లకుండా పోయాయి. సాహూకార్ల, కాంట్రాక్టర్ల వేధింపులు లేకుండా చేసుకున్నారు. స్త్రీ-పురుషులకు సమాన కూలిరేటును సాధించుకున్నారు. ఆత్మగౌరవంతో జీవించడం వారికి కావాలి. జల్-జంగల్-జమీన్‌పై జనవాద్‌తో కూడిన అధికారం వాళ్లకు కావాలి. దోపిడీ నుంచీ వారు విముక్తిని కోరుతున్నారు. అందుకోసం వారు పోరాడుతున్నారు. వారి పోరాటాలు దోపిడీ పాలకవర్గాలకు రుచించడం లేదు. వాళ్లంతా వామపక్ష ఉగ్రవాదులే. వాళ్లంతా మావోయిస్టులే. వాళ్లే దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా కనబడుతున్నారు. బ్రిటిష్ వలసవాదులకు సిద్ధూ, కానూ, గేండ్‌సింగ్, సడ్మెక్ బాబూరావు, గుండాదూర్, వీర నారాయణ్ సింగ్‌లు ఇలాగే అగుపడ్డారు. ఆనాడు ఆ ఆదివాసీ ముద్దుబిడ్డలే తమ ప్రజల కోసం, తమ ప్రకృతి సంపదల కోసం బ్రిటిష్ గుండెలపై తొలి తూటా పేల్చిన వీరులుగా చరిత్రకెక్కారు. ఇవాళ 'దండకారణ్యం', ఝార్ఖండ్, లాల్‌గఢ్, మన్యం, నారాయణపట్నా, ఆదిలాబాద్, ఖమ్మం లాంటి పోరాట

ప్రాంతాలు ఏవైనా, వాళ్ల కోయ, సంథాల్, కుయి, గోండు ఆదివాసులెవరైనా కావచ్చు - వాళ్లంతా పోరాట వారసులే. నేటి దండకారణ్యంలో ప్రజల ప్రతి పనికి పోలీసులు అడ్డు తగులుతున్నారు. వారి ప్రతి కదలికను 'రాజ్యం' ప్రశ్నిస్తోంది. ఫలితంగా వారు పోలీసులతో, రాజ్యంతో రోజూ ఏదో ఒక రూపంలో, ఏదో ఒక జీవన సమస్యపై పోరాడక తప్పడం లేదు. చివరకు వాళ్ల శవాల కోసం సైతం పోరాడాల్సి వస్తోంది. గ్రీన్ హంట్ దాడులు ప్రారంభమయ్యాక సామూహిక హత్యలు పెరిగినట్టే హతుల శవాల కోసం ప్రజలు పోలీస్‌స్టేషన్ల పైకి వెళ్లడం పెరిగింది. ధర్నాలు చేయడం, బైఠాయించడం లాంటి నిరసన పోరాట రూపాలు చేపడుతూ తమ ప్రియమైన అమరుల శవాలను స్వాధీనం చేసుకుంటున్నారు. 2010 మేడే నాడు బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపిన కామ్రేడ్ సోను శవం కోసం మే 2 నాడు వెయ్యి మంది ప్రజలు కాంకేర్ జిల్లా కోయిలీబేడా పోలీస్‌స్టేషన్ పైకి వెళ్లి మూడు రోజులు పోలీసులతో ఘర్షణ పడి చివరకు శవాన్ని తెచ్చుకోగలిగారు. డిఏకెఎంఎస్ నాయకుడైన మిడియం బుధురాంను పోలీసులు బూటకపు ఎదురుకాల్పుల్లో కాల్చిచంపితే ఆయన శవం కోసం గ్రామస్థులు భైరంగఢ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మూడు రోజులు ధర్నా చేసి శవాన్ని తెచ్చుకోగలిగారు. 2010 ఫిబ్రవరిలో భైరంగఢ్ బ్లాకులోని తాకిలోడ్ గ్రామంలో ఏడుగురు రైతులను బూటకపు ఎదురుకాల్పుల్లో హత్య చేసిన పోలీసుల నుంచీ శవాలను స్వాధీనం చేసుకోవడానికి ఊరికి ఊరు కదలి వెళ్లాల్సి వచ్చింది. చివరకు, పోలీసులు గ్రామస్థులకు శవాలు ఇవ్వక తప్పలేదు. అలాగే 2011 జనవరి 17 నాడు బీజాపూర్ జిల్లా గొర్గుట్ట గ్రామంలో ఇద్దరిని కాల్చిచంపిన పోలీసులు శవాలను తమ వెంట తీసుకెళ్లారు. గ్రామ మహిళలంతా శవాల కోసం వెళ్లగా పోలీసులు వారిని తిట్టి, కొట్టి వెనక్కి పంపారు. శవాలను సైతం బంధువులకు, కన్నవాళ్లకు అప్పగించని ప్రజాస్వామ్యం, చట్టాలూ అమలవుతున్న పోలీసుస్వామ్యం ఇది. ఫాసిస్టు రాజ్యమిది. అందుకే శవాల స్వాధీనానికి పోరాడి తీరాలనీ, 'పడియోర పరివార్ కమిటీ' (అమరవీరుల బందు మిత్రుల కమిటీ) ఆ బాధ్యత తీసుకోవాలనీ జనతనా సర్కార్ ఈ మధ్యే 2011 ఫిబ్రవరిలో నిర్ణయించింది.

పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లలో ఆదివాసీ రైతులను, యువకులను కాల్చిచంపుతున్నారంటే బాధితుల తరపున ఎవరైనా ధైర్యం చేసి కోర్టులకు వెళ్లితే తీవ్ర వేధింపులు తప్పడం లేదు. కేసులు ఉపసంహరించుకోవాలనీ బెదిరింపులు, ప్రలోభాలు వెళుతుంటాయి. 2008 నవంబర్ 14 నాడు ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల రోజు భారత అర్ధసైనిక బలగాలు కాంకేర్ జిల్లా కూరెనార్‌లో హత్య చేసిన రైతు కుటుంబాన్ని ఎలా వేధించారో దిన పత్రికలే రాశాయి. ఇలాంటి ఘటనలు మరెన్నో వెలుగు చూశాయి. ఏదేని ఘటనలో పొరపాటున న్యాయమూర్తులు పోలీసులను దోషులుగా నిర్ధారిస్తూ తీర్పు చెబితే దానిని అమలులోకి రానియ్యకుండా ప్రభుత్వ యంత్రాంగమంతా నడుం బిగించి ఎలా రంగంలోకి దిగుతుందో భామ్రాగఢ్ తాలూకాలో 2001 ఫిబ్రవరి నాటి మర్కనార్ ఘటన, భైరంగఢ్ బ్లాక్‌లోని కోత్రాపాల్ ఘటన స్పష్టమైన ఉదాహరణలుగా మనముందున్నాయి. 2001లో మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గల క్రాక్ కమాండోలు మర్కనార్ ఊళ్లో చిన్నా మెట్టామి అనే యువకున్ని హత్య చేసారు. ఈ కేసులో శ్రామిక్

ఎల్గార్ సంస్థ (ఎన్‌జిఓ) తరపున పురోహిత గోస్వామి పోలీసులను కోర్టుకు ఈడ్చింది. కోర్టు పోలీసులను దోషులుగా నిర్ధారిస్తూ తీర్పు ఇచ్చింది. నష్టపరిహారంగా రెండు లక్షల రూపాయలు ఆ ఆదివాసీ కుటుంబానికి చెల్లించమంది. కానీ ఆ తీర్పు కోర్టు ద్వారాలు దాటి అడవి దారుల్లో బాధితుని కుటుంబానికి చేరుకుండా 'రాజ్యం'పై కోర్టుల ద్వారా బ్రేకులు వేసింది. బూర్జువా కోర్టుల నైజమిది. ఇదే విధంగా 2007-08లో భైరంగఢ్ బ్లాక్‌లోని జాంగ్లా పోలీసులు కోత్రాపాల్‌లో నలుగురు రైతులను మడ్కాం హిడ్మా, మడ్కాం భీమా, మడ్కాం దేవా, మడ్కాం భీమాలను చెర్‌పల్లి వాగు వద్ద హత్య చేశారు. ఈ కేసులో ఎఎస్ఐ గన్‌శ్యాం పటేల్, ఎస్‌పిఓ సుఖదేవ్, కోసాలు దోషులంటూ కోర్టు తేల్చినా వారిని శిక్షించిందే లేదు. ఇలాంటప్పుడు ఇది పోలీస్‌స్వామ్యం, నియంతృత్వ పాలన కాకమరేమవుతుంది? అందుకే 'నేటి దండకారణ్యం'లో దోషులను శిక్షించడానికి ప్రజాకోర్టుల తీర్పులు అవసరమవుతున్నాయి.

ప్రజల కోసం, దోపిడీ రహిత సమాజాన్ని సాధించే ఉన్నత లక్ష్యంతో విప్లవ పార్టీలో, ప్రజాసైన్యంలో చేరి, విప్లవోద్యమాన్ని ప్రజాయుద్ధం ద్వారా పురోగమింపజేస్తూ ఆ యుద్ధ చర్యలలో తమ ప్రాణాలను త్యాగం చేస్తున్న వీర యోధులను ప్రజలు ఎంతగానో ప్రేమిస్తున్నారు. పిఎల్‌జిఏ గెరిల్లాలు తమ సహచరుల శవాలను బాధ్యతగా యుద్ధభూమి నుండి తీసుకవచ్చి వారి బంధుమిత్రులకు అప్పగించడం ఒక విప్లవ సంప్రదాయంగానే అమలవుతోంది. ప్రజలు, జనతన సర్కార్లు మృత శరీరాలను ఎర్రగుడ్డతో అలంకరించి ఎర్రజండాలుకప్పి ప్రజల దర్శనానికి పెడుతున్నారు. ప్రజలు తమ ఆదివాసీ సంప్రదాయాల ననుసరించి మృతవీరుల గౌరవార్థం కొత్త బట్టలు శవం ముందుపెట్టి జోహార్లు చెప్పుతున్నారు. అమరుల పట్ల గౌరవంతో శవయాత్రలు జరుపుతూన్నారు. శవయాత్రలలో వందలు, వేలు సంఖ్యలో ప్రజలు పాల్గొంటూ అమరుల ఆశయాలను కొనసాగిస్తామంటూ విప్లవ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. విప్లవ సంప్రదాయాలతో అంతిమంగా అంత్యక్రియలు జరుపుతూ తుది వీడ్కోలు చెబుతున్నారు. 2007లో జరిగిన బట్టుగూడెం ఘటనలో శత్రువుతో సాహసంగా పోరాడి ఆ దాడి విజయానికి తన ప్రాణాలను ధారపోసిన కామ్రేడ్ బామన్ అంత్యక్రియలలో మూడువేల మంది ప్రజలు చెన్నంపేటలో పాల్గొన్నారు. 2009లో ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మాడెక్ ఘటనలో పోలీసులతో జరిగిన పోరులో కొందరు పోలీసులను మట్టిగరిపించి కామ్రేడ్ లోకేష్ అమరుడయ్యాడు. ఆయన అంత్యక్రియలు పొద్దెం గ్రామంలో జరపగా విప్లవ ప్రజా సంఘాల నాయకత్వంలో వెయ్యి మంది ప్రజలు పాల్గొన్నారు. జనతన సర్కార్ల నిర్మాణం లేని చోట విప్లవ ప్రజా సంఘాలే బాధ్యతగా అమరవీరుల శవయాత్రలు, అంత్యక్రియలు నిర్వహిస్తున్నాయి. 2010 ఏప్రిల్ 6 నాడు జరిగిన ముకరం మాటు దాడిలో కంపెనీ స్థాయిలో అర్ధసైనిక బలాగాలను మట్టుబెట్టి నూతన చరిత్రను సృష్టించిన ఘటనలో అసువులు బాసిన వారిలో కామ్రేడ్ రతన్ ఒకరు. ఈయన అత్యక్రియలకు మూడువేల మంది ప్రజలు హాజరై తుది వీడ్కోలు చెప్పారు. ఆ ఘటనలో నేలకొరిగిన వీరులందరి శవాలను ప్రజలు మోసుకొచ్చి తమ కన్నబిడ్డల కన్నామిన్నగా గౌరవంగా శవయాత్రలు జరిపి అంత్యక్రియలు జరిపారు. 2009 అక్టోబర్‌లో గడ్చిరోలి జిల్లా లాహెరిలో 17 మంది కమాండోలను

మట్టుబెట్టిన మాటుదాడిలో అసువులు బాసిన కామ్రేడ్ సాయినాథ్ సడ్మెక్ శవయాత్రలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. 2008 జూన్‌లో మండేలి మాటుదాడిని సఫలం చేసి శత్రువు తూటాతో అసువులు బాసిన కంపెనీ కమాండర్ తిరుపతి శవయాత్రకు పరిసర గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో హాజరై అంత్యక్రియలు జరిపారు. ఆయన పుట్టింది ఎక్కడో కరీంనగర్ జిల్లాలోని రంగాపూర్ గ్రామం. కానీ ఆయన పోరాడింది ప్రజల కోసం. తన ప్రాణాలు అర్పించింది ప్రజాయుద్ధంలో. అందుకే ప్రజలంతా ఆ వీరుని జ్ఞాపకాలతో శవయాత్రలో పాల్గొన్నారు. 2010 జూన్ 29 నాడు నారాయణపూర్ జిల్లా కొంగెరలో మాటుదాడిని జయప్రదం చేసిన ఘటనలో అసువులు బాసిన కామ్రేడ్స్ బండు, శంకర్, రమేష్‌ల అంత్యక్రియలలో వందలాది జనం పాల్గొని సంప్రదాయబద్ధంగా తుది వీడ్కోలు చెప్పారు. 2011 జూన్ 11 జరిగిన బెజ్జి ఘటనలో శత్రుమూకలను అంతమొందిస్తూ అమరుడైన కామ్రేడ్ మంగు శవాన్ని తన సహచరులు గొమ్ముగూడెం చేర్చగా అక్కడ జనతనా సర్కార్ నిర్వహించిన శవయాత్రలో వందలాది మంది జనం పాల్గొని తమ ముద్దుల పోరు బిడ్డకు అంతిమ లాల్‌సలాం చెప్పి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కట్‌నూక కబురు వచ్చిందంటేనే ప్రజలు అమరవీరుల శవయాత్రలలో పాల్గొని విప్లవ సంప్రదాయాలకు తమ సంప్రదాయాలను జోడిస్తూ అంత్యక్రియలు జరపడం అనేది వారి పోరాట చైతన్యాన్ని చాటుతుంది. శత్రువుతో జరుగుతున్న దాడుల్లో సమర రంగాన ధైర్యంగా నిలిచి పోరాడుతూ అసువులు బాస్తున్న తమ సహచరుల వస్తువులు తమ యూనిట్లలో ఏవి మిగిలి వున్నా పిఎల్‌జిఏ అమరుల కుటుంబాలకు వారి జ్ఞాపకాలుగా అందజేస్తోన్నారు. వారి జీవిత చరిత్రలను, విప్లవోద్యమంలో వారి పాత్రనూ వివరిస్తూ ప్రచురించే సాహిత్యాన్నీ వారి ఫోటోలనూ ప్రజల వద్దకు చేరుస్తూన్నారు. దండకారణ్యవ్యాప్తంగా ప్రజలు గ్రామగ్రామాన పోరాట స్ఫూర్తి, శ్రద్ధ, గౌరవంతో పాటించే విప్లవ దినాలలో జులై 28 చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. దాని వివరాలు మరో అధ్యాయంలో చూద్దాం. 2011 జూలై అమరుల సంస్మరణ వారం సందర్భంగా మృతవీరుల జ్ఞాపకాల ప్రతీకగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని దక్షిణ బస్తర్ జనతనా సర్కార్ చేపట్టింది. పెరిగే మొక్కల్లో అమరుల ఆశయాలను, వారి ఆదర్శాలను, త్యాగాల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు చూపించే ప్రజా సంప్రదాయాన్ని జనతన సర్కార్ తిరిగి ముందుకు తెచ్చింది. ఇది చూస్తుంటే రెండున్నర శతాబ్దాల క్రితం జరిగిన ఫ్రాన్స్ బూర్జువా విప్లవ విజయాల స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తంగా సొంతం చేసుకోవడంలో భాగంగా దాని ప్రతీకగా మొక్కలు నాటిన మైసూర్ టిప్పు సుల్తాన్, జబల్‌పూర్ ఆదివాసీ తెగ నాయకుడు వెంకట్రావు, దండకారణ్యంలోని మల్లంపెల్లి వీర బాబురావు సడ్మెక్‌ల స్ఫూర్తిదాయక సంప్రదాయం గుర్తుకు వస్తోంది.

# 5. ప్రజాయుద్ధంతో ప్రజాతంత్రం - రాజ్యయంత్రం

విప్లవోద్యమాన్ని నిర్మించడం అంటేనే రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకునే లక్ష్యంతో యుద్ధం చేయడం అనీ, యుద్ధం అంటే రాజకీయాల కొనసాగింపేననీ, తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందనీ, మనసా, వాచా, కర్మణా నమ్మి దానికి అంకితమై పోరాడుతూ నిరూపిస్తున్నవాళ్లు ఈ దేశంలో మావోయిస్టులేనని విడిగా చెప్పాల్సిన అవసరమే లేదు. అందుకే ఈ దేశంలో అంతర్గత భద్రతకు అతిపెద్ద ప్రమాదకర శక్తులుగా వాళ్లను దోపిడీ పాలకవర్గాలు ప్రకటించాయి. వాళ్లను అంతమొందించే పథకాలను 'ప్రజాస్వామ్య' ముసుగడ పేరు మీదా రూపొందిస్తూ తీవ్రమైన సైనిక దాడులను కొనసాగిస్తున్నారు. వాళ్లను దేశ అంతర్గత భద్రతకు ముప్పు అని అంటున్నారంటే వాళ్లు వర్తమాన దోపిడీ రాజ్యయంత్రాన్ని ప్రజాయుద్ధం ద్వారా సవాలు చేస్తూ దాని స్థానంలో దోపిడీ రహిత ప్రజల ప్రజాస్వామ్య రాజ్య యంత్రాన్ని నిర్మిస్తున్నారనీ సూటిగా వ్యాఖ్యానించడం సమంజసంగా ఉంటుంది. దోపిడీ రాజ్యయంత్రాన్ని సవాలు చేస్తున్నారంటే నేటి 'రాజ్యం' పక్షాన నిలిచిన భద్రతా బలగాలను లేదా దాని సైనికులను, రక్షకులను ఎదిరిస్తూ, ఓడిస్తూ, ఒక నూతన ప్రజాతంత్రానికి ప్రాణం పోస్తున్నారు. తమ భ్రూణ రూపంలోని ఆ రాజ్యయంత్రానికి దండకారణ్యంలో 'జనతన సర్కార్లు' అని పేరు పెట్టుకున్నారు. తెలుగులో చెప్పాలంటే 'విప్లవ ప్రజా కమిటీ'లనాలి. వాటి విశిష్టత్వాన్ని తెలుసుకుందాం. దానికి ముందు విప్లవోద్యమారంభ దశాబ్దాల అనుభవాన్ని కొంత సంక్షిప్తంగా పరిచయం చేసుకుందాం.

విప్లవం యొక్క కేంద్ర, ప్రధాన, తక్షణ కర్తవ్యం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమే. కాబట్టి విప్లవం అంటేనే రాజ్యాధికార సమస్య అని మావోయిస్టులు స్ఫటిక స్పష్టతతో ప్రజల ముందుంచుతున్నారు. అంటే ఒక వర్గం నుంచి మరో వర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమే విప్లవం అని కూడా వ్యాఖ్యానించుకోవచ్చు. ఈ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి పార్టీ ఎన్నుకున్న పంథా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా. ఈ పంథా ననుసరించి దేశంలో విప్లవోద్యమం కొనసాగుతోంది. ఈ పంథా ప్రకారం ప్రాంతాల వారీగా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమే ఉంటుంది. మరోమాటలో చెప్పాలంటే యావత్తు దేశంలో ఒకేసారి అధికారాన్ని నెలకొల్పడం ఈ పంథా కిందికి రాదు. దీనినే గ్రామాల నుండి పట్టణాలకూ అంతిమంగా నగరాలను విముక్తి చేసుకోవడంగా కూడా చెప్పుకోవచ్చు. అలాగే ఇది దీర్ఘకాల ప్రజాయుద్ధ సైనిక వ్యూహంగానూ చెప్పుకోవచ్చు. భూస్వామ్య దోపిడి పీడనలు తీవ్రంగా ఉన్న వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ విప్లవ పోరాటాలు బద్దలైనప్పటికీ, వీటిపై ఆధారపడి వ్యూహాత్మకంగా శత్రువు బలహీనంగా ఉండే ప్రాంతాల్లో పార్టీ మొదటి నుంచీ కేంద్రీకరిస్తూ వస్తోంది. మొట్టమొదట ఇలాంటి ప్రాంతాల్లోనే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం (విముక్తి ప్రాంతాల స్థాపన) సాధ్యమనే అవగాహనతో పార్టీ పనిచేస్తూ వస్తోంది. వ్యూహాత్మక ప్రాంతాలలో ఉద్యమాన్ని విస్తరింపజేసేందుకూ, బలోపేతం చేసేందుకూ, ప్రజాసైన్యాన్ని అభివృద్ధి చేసేందుకూ కృషి

చేస్తూ వచ్చింది. ప్రజాయుద్ధం ద్వారా శత్రువు అధికారాన్ని కూలదోసిన చోట ప్రజా రాజ్యాధికార అంగాలు ఆవిర్భవించినప్పటికీ వ్యూహాత్మకంగా శత్రువుకు బలహీనంగా ఉండే ఇలాంటి వ్యూహాత్మక ప్రాంతాల్లో వీటిని అభివృద్ధి చేసేందుకు పార్టీ కేంద్రీకరించింది. భారతదేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలలో ముఖ్యమైన వాటిలో దండకారణ్యం ఒకటి. కానీ ఇక్కడ మనం దండకారణ్య విప్లవోద్యమంలో ఉనికిలోకి వచ్చిన ప్రజా రాజ్యాధికార సంస్థల అనుభవాన్నీ, సమస్యలనూ నిర్దిష్టంగా చెప్పుకుందాం.

దండకారణ్య విప్లవోద్యమం ప్రారంభమై విప్లవ ప్రజా రాజ్యాధికార సంస్థలు ఏర్పడే నాటి వరకు సాగిన ఒక సుదీర్ఘ కార్యాచరణ అంతటినీ పాఠకుల సౌలభ్యం కోసం తొలిదశ (ఫేజ్)గా చెప్పుకుంటే ఆ తర్వాతి ఆచరణ అంతటినీ మలిదశ (ఫేజ్)గా చెప్పుకోవడం ద్వారా విప్లవ కృషిలో చోటు చేసుకున్న ఒక గుణాత్మక మార్పును (గెంతును) లేదా సుదీర్ఘ కార్యాచరణలోని ఒక స్పష్టమైన విభజన రేఖను నిర్దిష్టంగా చూడగలుగుతాం. దీనినే కాలసరళిలో **1980-1995**ను మొదటి దశగానూ, **1996-2011**ను రెండవ దశగానూ చూడాల్సి ఉంటుంది. అయితే మొదటి దశ లేకుండా రెండవ దశ లేదనీ, మొదట దశ యొక్క కొనసాగింపుగా సాధించిన ఉన్నత, నూతన అనుభవమే రెండవ దశ అన్న విషయాన్నీ, రెండు దశల మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్నీ సరిగా అర్థం చేసుకున్నప్పుడే ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణ పంథా బోధపడుతుంది.

తొలుత **1980-95** మధ్య దండకారణ్యంలోని విశాల ప్రజారాశులు పలు విప్లవ ప్రజాసంగాలలో సంఘటితం అయ్యారు. సంఘటిత ప్రజలు మాత్రమే విప్లవం విజయవంతం చేస్తారన్న మౌలిక విప్లవ అవగాహనకు లోబడి విశాల ప్రజారాశులను సంఘటితపరిచిన తర్వాత వర్గ పోరాటంలో నిరంతరం వారి క్రియాశీల, సమరశీల భాగస్వామ్యం పెరుగుతూ వచ్చింది. విప్లవోద్యమంలో ప్రజల క్రియాశీల భాగస్వామ్యం పెరగడానికి చేపట్టిన అన్ని ప్రజా పోరాటాలూ అందుకు ఎంతగానో తోడ్పడినాయి. ఇందులో భాగంగానే దండకారణ్యంలో కొనసాగిన ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు, భూస్వామ్య, పెత్తందారీ వర్గాల వ్యతిరేక ప్రజా పోరాటాలను, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ వ్యతిరేక పోరాటాలను అర్థం చేసుకోవాలి. అటవీ భూములపై సాగుహక్కు, భూస్వాములు అక్రమంగా స్వాధీనం చేసుకున్న పీడిత రైతుల భూములను తిరిగి రైతాంగం స్వాధీనం చేసుకోవడం, కూలీరేట్ల పెంపుదల పోరాటం, కరువు నివారణా పోరాట చర్యలు, రాజ్యహింస వ్యతిరేక ప్రజా పోరాటాలు, ఆదివాసీ తెగ సాంప్రదాయ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పంచాయితీలు - అమలైన శిక్షలు, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాలను సమకూర్చాలంటూ ప్రజలు దోపిడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చేపట్టిన పలు పోరాటాలు ప్రజల విప్లవ చైతన్యాన్ని పెంచడానికి చాలా తోడ్పడినాయి. ఈ పోరాటాలన్నీ విప్లవ ప్రజాసంగాల నాయకత్వంలోనే జరిగాయి. ఫలితంగా ప్రజల్లో సంగాల పట్ల ఎనలేని గౌరవం, విశ్వాసం, అభిమానం, వాటిలో చేరాలన్న భావన, వాటిని కాపాడుకోవాలన్న తపన, అవి అప్పగించిన పనులు తప్పక చేయాలన్న విప్లవ పట్టుదల

ఎంతగానో పెరిగాయి. సంగాలు లేకుండా తాము ఆత్మగౌరవంతో బతుకలేమన్న భావన విశాల రైతాంగంలో ఏర్పడింది. పిల్లలూ, పెద్దలూ, స్త్రీ-పురుష భేదం లేకుండా మెజార్టీ ప్రజానీకంలో ఈ భావన బలపడింది. గ్రామీణ ప్రాంతంలో క్రమంగా విప్లవ ప్రజాసంగాల మాటే చెల్లుబాటు కాసాగింది. అప్పటి వరకూ గ్రామాల్లో అధికారాన్ని నెరుపుతూ వచ్చిన దోపిడీ రాజ్యం - స్థానికంగా గడ్చిరోలిలో దానికి ప్రాతినిధ్యం వహించే అహిరి రాజు లాంటి వాళ్లు, ఆయన ప్రతినిధులు, బస్తర్‌లో మహేంద్రకర్మ, బలిరాం కశ్యప్, బురద వడ్డె లాంటి రియాక్షనరీ భూస్వాములు, తెగ పెద్దలు, పటేళ్లు, పట్వారీలు, సర్పంచ్‌లు, సచివ్‌లు - క్రమంగా నిర్వీర్యం కాసాగింది. ఈ వర్గ పోరాటంలో దోపిడీ రాజ్యం దెబ్బతిన్న మేరకు ఏర్పడిన ఖాళీలో ప్రజాసంగాల 'అధికారం' ఊపిరి పోసుకుంది. లేదా విప్లవ ప్రజాసంగాల 'అధికారం' బలపడుతున్న మేరకు పాత రాజ్యం నిర్వీర్యమవుతూ పోయింది. దీన్నంతా ప్రజలు తమ భాషలో, తమ మనసుల్లో ఒక సర్కార్ ఏర్పడినట్టుగానే భావించారు. అయితే పార్టీ వైపు నుంచి దీన్ని గుర్తించడంలో, తగిన నిర్మాణ రూపం, అందుకు తగిన నినాదం ఇవ్వడంలో చాలా ఆలస్యం జరిగిందనీ 1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక పార్టీ మహాసభ సమీక్షించింది.

పైన చెప్పిన 'అధికారం' ఏర్పడడానికీ, ప్రజాసైన్యం, ప్రజాయుద్ధం బలపడడానికీ, తీవ్రం గావడానికి మధ్య గల పరస్పర సంబంధాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రజల అధికారాన్ని, ప్రజాతంత్రాన్ని నిలబెట్టుకోవడం అంటేనే ప్రజాయుద్ధంతో ముడిపడిన సమస్య. ప్రజాయుద్ధం అంటేనే ప్రజాసైన్యం కొనసాగించే సైనిక చర్యల మొత్తం అని అర్థం చేసుకోవాలి. జర్మన్ సైనిక జనరల్ క్లాస్‌విట్జ్ 'సమరాల మొత్తమే యుద్ధం' అన్నాడు. ఈ సమరాలను కొనసాగించడానికి 1980-95 మధ్యకాలంలో ప్రజాసైన్యం దళాల రూపంలోనే ఉండింది. గ్రామాల్లో ప్రజా మిలీషియా గ్రామ రక్షణ దళాల రూపంలో నిర్మాణమై బలపడసాగింది. సైన్య నిర్మాణం, దానిలో భాగంగా సైనిక కమీషన్‌లు, కమాండ్లు ఆనాటికి ఇంకా ఏవీ ఏర్పడలేదు. అయినప్పటికీ ప్రభుత్వ సాయుధ బలగాలతో ప్రజా సాయుధ బలగాలు పథకం ప్రకారం తలపడడం అనేది 1987 నుంచీ ప్రారంభమై క్రమంగా పెరిగింది. సెక్షన్ స్థాయిలో ఉంటూ వచ్చిన ప్రజా సాయుధ దళాలు క్రమంగా ప్లాటూన్ రూపాన్ని (1995) సంతరించుకున్నాయి. ఈ ఆత్మరక్షణా పోరాటం ద్వారానే మొదట విప్లవోద్యమం రక్షించబడి బలపడుతూ అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధినంతా అంచనా వేసిన పార్టీ రైతు, కార్మిక, సైనిక సోవియట్లను పోలిన అధికార అంగాలను నిర్మించాలనీ తలపెట్టింది. చైనాలో, రష్యాలో ప్రసిద్ధి చెందిన సోవియట్లకు ప్రతిబింబంగా ఈ నిర్మాణాలను చేపట్టింది. ఫలితంగానే దండకారణ్య విప్లవోద్యమంలో గ్రామ కమిటీలు ఉనికిలోకి వచ్చాయి.

దండకారణ్యంలో 1996లో గ్రామ కమిటీల నిర్మాణం ప్రారంభమైంది. 1996-2011 వరకు సాగిన కార్యాచరణను సులువుగా అర్థం చేసుకోవడానికి విప్లవోద్యమ కార్యాచరణలో దీనిని రెండవ దశగా చూడాలనీ పైన చెప్పుకున్నాం. ఈ కాలాన్ని తిరిగి సులువుగా అర్థం చేసుకోవడానికి నాలుగు ఉపదశలుగా

విడదీసి చెప్పుకోవడం బాగుంటుంది. 1996-2001 మొదటి ఉపదశ; 2001-2004 రెండవ ఉపదశ; 2004-2006 మూడవ ఉపదశ; 2007 నుంచి ఇప్పటి వరకు గల కాలాన్ని నాల్గవ ఉపదశగా విడదీసుకోవడం ద్వారా ఆయా సమయాల్లో జనతనా సర్కార్ల నిర్మాణంలో గెంతు రూపంలో చోటు చేసుకున్న పరిణామాలను సులువుగా అర్థం చేసుకోవచ్చు. (ఇది ఈ పుస్తక రచయిత చేస్తున్న విభజనే)

## 5 (ఎ) గ్రామ రాజ్య కమిటీలు – అనుభవం

గ్రామ కమిటీల పేరుతో 1996లో ప్రారంభమైన రాజ్యాధికార అంగాల పేరు అనతి కాలంలోనే గ్రామ రాజ్య కమిటీలుగా మారింది. ఆ సమయంలో మొదట ఊరూరా గ్రామ రాజ్య కమిటీలు నిర్మితమయ్యాయి. ఆనాటికి ప్రధానంగా దక్షిణ, పశ్చిమ బస్తర్‌లలోనే అనేక గ్రామాలలో గ్రామ రాజ్య కమిటీలు ఏర్పడ్డాయి. గ్రామ రాజ్య కమిటీలలో భాగంగా వివిధ పనులను చేపట్టడానికి సబ్ కమిటీలు ఏర్పడినాయి. గ్రామ రాజ్య కమిటీలు పార్టీ నాయకత్వంలోనే ఏర్పడ్డాయి. 'గ్రామ కమిటీలకే సర్వాధికారాలు' నినాదం ప్రాతిపదికన ఇవి ఏర్పడ్డాయి. ఈ తొలి గ్రామ రాజ్య కమిటీలు ప్రధానంగా విప్లవకర భూసంస్కరణలను చేపట్టాయి. ఆదివాసీ ప్రజల వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చడానికి గ్రామ రాజ్య కమిటీలు సాగునీటి వ్యవస్థను నిర్మించడంపై కేంద్రీకరించాయి. దీనికి అనుబంధంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహించాయి. వీటితో పాటుగా పండ్ల తోటల పెంపకాన్ని కూడా ప్రజల్లో ప్రోత్సాహించాయి. ఇవి ప్రజల ఉత్పత్తి విధానంలో మార్పుకు ఉద్దేశించినవి కాగా ప్రజల జీవితాలలో విద్యా, వైద్య రంగాలను అభివృద్ధిపర్చడం తక్షణం గ్రామ రాజ్య కమిటీల ఎజెండా పైకి వచ్చింది. తరతరాలుగా విద్యా, వైద్య సదుపాయాలకు నోచుకోని పీడిత ఆదివాసీ ప్రజలకు వాటిని సమకూర్చడంపై గ్రామ రాజ్య కమటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి వచ్చింది. ఇందులో భాగంగా నూతన పాఠశాలలు తెరవడం, గ్రామాల్లో ఉన్న దోపిడీ ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా నడిపించడానికి ప్రయత్నించడం, ప్రజావైద్యానికి అవసరమైన మందులను సమకూర్చుకోవడంతో పాటు రైతాంగ యువతను ప్రజావైద్యులుగా మలచుకోవడంపై శ్రద్ధ పెట్టాయి. ఆదివాసీ వ్యవసాయంలో తగిన మార్పులను ప్రవేశపెట్టడం కోసం అలాగే ప్రజలకు వైద్య అవసరాలను తీర్చే లక్ష్యంతో పార్టీ ఈ రంగాలలో మంచి ప్రవేశం ఉన్న కొందరు వ్యవసాయ కార్యకర్తలను, పట్టభద్రులైన వైద్యులను బయటి ప్రాంతాల నుంచి పంపడానికి కృషి చేసింది.

ప్రజా జీవితాలలో విద్యా, వైద్య రంగాలకు ఎంతో ఉన్న ప్రాముఖ్యత వుంది. వెంటనే గ్రామ రాజ్య కమిటీలు వాటిని సమకూర్చలేని వస్తుగత పరిస్థితుల్లో దోపిడీ ప్రభుత్వ విభాగాల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయమైంది. ఇవి మినహా మిగతా దోపిడీ ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలన్నింటినీ ప్రజలు వ్యతిరేకించాలనుకున్నారు. ఇదే ఇప్పటికీ అమలవుతూంది.

గ్రామ రాజ్య కమిటీలను ఏర్పర్చుకున్న తొలినాళ్లలోని దండకారణ్య అనుభవం స్థూలం అది పైన పేర్కొన్న కృషి ఫలితంగా గ్రామ రాజ్య కమిటీలు ప్రజల విశ్వాసాన్ని అపారంగా చూరగొన్నాయి.

## 5 (బి) జనతనా సర్కార్లు - 2001-2004

ఇక ఈ దశాబ్ద వివరాల్లోకి వద్దాం. నేటి జనతనా సర్కార్ల నిర్మాణంలోని 2001-2004 కాలాన్ని రెండవ ఉపదశ చెప్పుకొన్నాం. దీనిని గ్రామ రాజ్య కమిటీల అభివృద్ధి, విస్తరణ కాలంగా చెప్పుకోవచ్చు. 2001లో జరిగిన పీపుల్స్‌వార్ పార్టీ తొమ్మిదో కాంగ్రెస్ అందించిన ఉన్నతస్థాయి సైద్ధాంతిక అవగాహనల ఫలితంగా ఈ రంగంలో కూడా గణనీయమైన మార్పులు సంభవించాయి. అప్పటి వరకూ గ్రామ రాజ్య కమిటీలుగా వ్యవహరించిన వాటిని జనతనా సర్కార్లు-విప్లవ ప్రజా కమిటీలు-గా పేరు మార్చుకోవడం కాంగ్రెస్ అందించిన అవగాహనలో భాగమే. వీటిని నిజమైన ప్రజా రాజ్యాధికార అంగాలుగా మలచడానికి ముందుగా యావత్తు పార్టీలో తగిన సైద్ధాంతిక అవగాహనను అందించడానికి గానూ ఒక సవివరమైన సర్క్యులర్‌ను కేంద్రకమిటీ విడుదల చేసింది.

దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవడానికై ముందుగా దండకారణ్య గెరిల్లాజోన్‌లో గల భౌగోళిక ప్రాంతాన్ని, ప్రజా పునాదిని దృష్టిలో పెట్టుకొని అన్ని డివిజన్లలో పలు గెరిల్లా బేస్‌ల ఎంపిక జరిగింది. భౌగోళికంగా చూస్తే మొత్తం దండకారణ్యమే ఒక దీర్ఘకాల విప్లవ వ్యూహాత్మక ప్రాంతంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేనప్పటికీ అందులోనూ సాపేక్షికంగా మరింత అనుకూలమైన భూ-భౌగోళిక ప్రాంతాన్ని ఎన్నుకోవడంతో పాటు ప్రధానంగా ప్రజా పునాదిని పరిగణనలోకి తీసుకోవడమైంది. ఒక్కొక్క డివిజన్‌లోని విశాల అటవీ ప్రాంతంలో గల అనుకూల-ప్రతికూలతలను, ప్రజా పునాదిని దృష్టిలో పెట్టుకొని ప్రాధాన్యతా క్రమంలో రెండు మూడు ప్రాంతాలను గెరిల్లా బేస్‌లుగా నిర్ణయమయ్యాయి. స్థానిక సాయుధ బలగాల మోహరింపుకూ, పార్టీ నిర్మాణాల కార్యకలాపాలకూ తగిన విస్తీర్ణంతో కూడిన ప్రాంతాలు గెరిల్లా బేస్‌లుగా ఎంపిక అయ్యాయి. 50×50 కి.మీ.ల విస్తీర్ణం గల ప్రాంతాలను గెరిల్లా బేస్‌లుగా ఎంచుకోవడం అవసరమని భావించినప్పటికీ దాన్ని యాంత్రికంగా చేయకుండా ఆయా ప్రాంతాల విశేషతలను బట్టి అందులో అవసరమైన మార్పులు కూడా జరిగాయి. ఈ అన్ని గెరిల్లా బేసుల సమాహారమే దండకారణ్య విముక్తి ప్రాంతం అవుతుందన్న వ్యూహాత్మక అవగాహనతోనే ఈ గెరిల్లా బేసుల నిర్మాణం ముందుకు వచ్చింది. దీనిని బేస్ ఏరియా (విముక్తి ప్రాంత) నిర్మాణ రోడ్‌మ్యాప్‌గా చెప్పుకోవచ్చు.

ఇక్కడి ఆదివాసీ గ్రామాల పొందికా, గ్రామాల్లో వుండే అతి పలుచనైన జనాభాను దృష్టిలో పెట్టుకొని 500-3000 మధ్య గల జనాభాకు ఒక స్థానిక జనతనా సర్కార్‌ను ఎన్నుకోవాలన్న నిర్ణయం కూడా కాంగ్రెస్ ఇచ్చిందే. ఈ మేరకు జనాభా ఉండడం ద్వారా ఇవి ఆ స్థాయిలో ప్రభుత్వాలుగా పనిచేయడానికి మంచి అవకాశాలుంటాయని రుజువైంది. మూడంచెల బూర్జువా పంచాయితీ వ్యవస్థలో గూడా ఇలాంటి నియమాలనే పాలనా సౌలభ్యం కోసం బూర్జువా పాలకులు పెట్టుకున్న విషయం కూడా గమనార్హం.

నూతన నిర్ణయం ప్రకారం గతంలోని గ్రామ రాజ్య కమిటీలన్నింటినీ పునర్ వ్యవస్థితం చేసుకోవడంతో

ఒక్కో గెరిల్లా బేస్‌లో 20-30 జనతనా సర్కార్లు ఉనికిలోకి వచ్చాయి. దీనితో గెరిల్లా బేస్‌ల గురించి మరింత స్పష్టత పెరిగింది. ఒక్కొక్క గెరిల్లా బేస్ విస్తీర్ణం, అక్కడ పనిచేసే పార్టీ కమిటీ స్థాయీ, ఆ ప్రాంతంలో మోహరించుకునే ప్రజా గెరిల్లా సైన్యపు బలగాల నిర్మాణం (ఎస్.జి.ఎస్-ప్రత్యేక గెరిల్లా దళం), స్థానిక ప్రభుత్వాల గ్రామాల పరిధి, ఆ పరిధిలోని జనాభా మొదలైన విషయాలలో వచ్చిన స్పష్టతతో జనతనా సర్కార్లు ఉనికిలోకి రావడం వేగవంతమైంది. గ్రామ రాజ్య కమిటీల నిర్మాణాలున్నప్పుడు ప్రధానంగా దక్షిణ, పశ్చిమ బస్తర్‌లకే పరిమితమై ఉండగా 2001 నుంచి ఏర్పర్చుకుంటున్న జనతన సర్కార్లు దండకారణ్య వ్యాప్తంగా ఏర్పడడం ప్రారంభమైంది. గెరిల్లా బేస్‌ల ప్రాధాన్యతా క్రమాన్ననుసరించి వాటిని ఏర్పర్చుకోవడానికి అవసరమైన కృషి మొదలైంది. దీనికి అనుకూలంగానే శక్తుల కేటాయింపూ జరిగింది. గెరిల్లాజోన్ అంటే విరుద్ధ శక్తుల మధ్య అధికారం కోసం యుద్ధం జరిగే ప్రాంతమనీ, గెరిల్లాజోన్‌లోనే ఏర్పడే గెరిల్లాబేస్‌లు అంటే బీజరూపంలో విప్లవ శక్తుల - ప్రజల - అధికారం నెలకొనే ప్రాంతమనీ కాంగ్రెస్ ఇచ్చిన అవగాహనతో సాగిన ఆచరణ ద్వారా మరింత స్పష్టత ఏర్పడసాగింది. గెరిల్లా జోన్లలో ద్వంద్వాధికార సమస్య ఉంటుందనీ, గెరిల్లా బేసులో అది ఏ స్థాయిలో అయినప్పటికీ ప్రధానంగా విప్లవ శక్తుల అధికారమే నిర్మితమై వికసిస్తుంది. గ్రామ రాజ్య కమిటీలకు జనతనా సర్కార్లుగా పేరు మార్చుకున్నట్టుగానే సబ్ కమిటీల స్థానంలో శాఖా కమిటీలనడం ముందుకొచ్చింది. జనతనా సర్కార్లలో వ్యవసాయం, ఆర్థికం, రక్షణ, విద్యా-సంస్కృతి, వైద్యం, న్యాయం, అడవుల పరిరక్షణ, ప్రజా సంబంధాల శాఖలు ఏర్పడ్డాయి.

'జనతనా సర్కార్లకే సర్వాధికారాలు' అన్న నినాదం ప్రాతిపదికగా ఏర్పడుతున్న రాజ్య అంగాలు నాలుగు వర్గాల సమైక్య సంఘటన నెరపే అధికారానికి చిహ్నాలనీ, ఇవి రష్యా, చైనాల విప్లవోద్యమాలలో ఏర్పడిన కార్మిక, కర్షక, సైనిక సోవియట్లను బీజరూపంలో పోలి ఉన్నాయనీ వ్యక్తమైంది. ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేయడానికి క్యాంపెయిన్‌ల రూపంలో ఎత్తుగడలపర ఎదురుదాడులను చేపట్టిన విధంగానే జనతనా సర్కార్ల నిర్మాణం, అభివృద్ధికీ క్యాంపెయిన్‌ల రూపంలో సాగిన కృషి చాలా తోడ్పడింది. ఏ లక్ష్య సాధన కోసం చేపట్టే క్యాంపెయిన్ అయినప్పటికీ ఆ క్యాంపెయిన్‌ల సమయంలో విప్లవ శక్తులన్నీ ఆ లక్ష్య సాధన కోసమే కేంద్రీకరించి పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించడమే క్యాంపెయిన్ అవుతుందనీ వివరించుకున్న విధంగానే ఫలితాలూ ఉండాలి. గెరిల్లాబేస్‌లలో జనతన సర్కార్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడానికి 2003లో ప్రత్యేక ఏరియా పార్టీ కమిటీలు ఏర్పడ్డాయి. అలాగే నూతనంగా గ్రామ పార్టీ కమిటీలు ఉనికిలోకి వచ్చాయి. ఏ స్థాయికి ఆ స్థాయిలో పార్టీ కమిటీలు ప్రభుత్వాలకు నాయత్వం వహించడం ఉద్యమ నిర్మాణ పంథాలో భాగం. సాధారణంగా పార్టీ కమిటీ కార్యదర్శులనే ప్రభుత్వ నేతలుగా ఏర్పర్చుకోవడంతో సమన్వయంలో చాలా సమస్యలు తగ్గాయి.

జనతనా సర్కార్లు ఏర్పడుతూ పటిష్టమవుతున్న క్రమంలో దోపిడీ ప్రభుత్వాలు ముమ్మరం చేసిన




ప్రజా రాజ్యాధికారం కోసం విప్లవ జనతన సర్కార్ కమిటీ సమావేశంలో గంభీర చర్చలు

బూటకపు ఆర్థిక సంస్కరణలన్నింటినీ సంఘటిత విప్లవ ప్రజానీకం విప్లవ చైతన్యంతో వ్యతిరేకించారు. ఈ విషయంలో ఒక స్పష్టమైన పాలసీని (విధానాన్ని) పార్టీ రూపొందించింది. మరోవైపు విప్లవ సంస్కరణలు తీవ్రం అయ్యాయి. వాటిలో విప్లవ భూసంస్కరణలు అగ్రభాగంలో నిలిచాయి.

ఇక ఈ కాలంలో ప్రజాయుద్ధం-ప్రజాసైన్యం విషయంలోనూ మౌలికమైన మార్పులే జరిగాయి. ఇందులో ప్రప్రథమంగా చెప్పుకోవాల్సింది ప్రజా గెరిల్లా సైన్య నిర్మాణమే. ప్రజా గెరిల్లా సైన్యం ఏర్పడడంతో పలు స్థాయిల్లో కమీషన్లూ, కమాండ్లూ ఉనికిలోకి వచ్చాయి. ప్రతి డివిజన్‌కు ఒక ప్లాటూన్ చొప్పున 2001 ప్రారంభంలో ప్లాటూన్ల విస్తరణ జరిగింది. ప్రజా మిలీషియా సంఖ్యాపరంగా పెరిగి దాని గుణంలోనూ సమరశీల స్వభావం పెరిగింది. ప్రతీ గెరిల్లాబేసుకు కనీసంగా ఒక ప్రత్యేక గెరిల్లా దళం ఉండాలన్న నిర్ణయం జరిగింది.

పై మార్పులన్నీ ఒక ఎత్తు కాగా, జనతన సర్కార్ల నిర్మాణంలో ఏరియా స్థాయి జనతన సర్కార్ల నిర్మాణానికి పార్టీ నిర్ణయం తీసుకోవడం, అలాగే పి.ఎల్.జి.ఏ నిర్మాణాలలో కంపెనీల నిర్మాణానికి పూనుకోవడం ఈ కాలంలోని ఉద్యమ పురోగమనంలో తీసుకున్న పెద్ద గెంతులుగానే చెప్పుకోవాలి.

కంపెనీలు ఉనికిలోకి రావడంతో ప్రధాన బలగాలుగానూ, ప్లాటూన్లు అవి ద్వితీయ బలగాలుగానూ విభజితమయ్యాయి. భవిష్యత్ రెగ్యులర్ సైన్య నిర్మాణ ప్రక్రియకు ఈ మార్పులు ప్రారంభసూచికలు.

గెరిల్లా బేస్‌లుగా నిర్ణయించుకున్న నిర్దిష్ట ప్రాంతాలలో పార్టీ కేంద్రీకరించి ప్రజా నిర్మాణ కార్యక్రమాలను తీవ్రం చేయడం ద్వారా అనతి కాలంలోనే ఆశించిన మార్పులు జరిగాయి. దీనితో ఉన్నతస్థాయిలోనూ జనతన సర్కార్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం తక్షణ ఎజెండా మీదికి వచ్చింది. ఏరియా జనతన సర్కార్ల నిర్మాణానికి కృషి ప్రారంభమైంది. పార్టీ చేపట్టిన నిర్మాణ క్యాంపెయిన్ల ఫలితంగా గ్రామ స్థాయి జనతన సర్కార్లు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి విస్తరించాయి. పార్టీ చేపట్టిన కన్సాలిడేషన్ క్యాంపెయిన్ల ద్వారా అవి పటిష్టమవుతూ ఉన్నత స్థాయి నిర్మాణాల వైపు విస్తరించాయని స్పష్టంగా చెప్పుకోవచ్చు. దీనినే మరో మాటలో గ్రామ స్థాయి జనతనా సర్కార్లు క్యాంపెయిన్ల ద్వారా హారిజాంటల్ గానూ, వర్టికల్ గానూ విస్తరించాయని చెప్పుకోవచ్చు. ఈ మొత్తం కాలాన్ని జనతన సర్కార్ల నిర్మాణం లోనే ఒక మలుపుగా చూడాలి. ప్రజా పోరాటాలలో, ప్రజా ప్రతిఘటన చర్యలలో, ప్రజా నిర్మాణాల వికాసంలో, ప్రజాసైన్య నిర్మాణాలలో గుర్తించతగిన మార్పులు సంభవించిన కాలమిది. ఈ కాలంలోనే రెండు పార్టీలు - సి.పి.ఐ. (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్), ఎం.సి.సి.ఐ. - విలీనం (21 సెప్టెంబర్ 2004) జరిగింది.

## 5 (సి) జనతనా సర్కార్లు – 2004–06

2005-2006ను మనం కాలానుగుణంగా మూడవ ఉపదశగా విభజించుకున్నాం. దీనిని మనం ఉన్నత స్థాయి జనతనా సర్కార్ల నిర్మాణ కాలంగా చెప్పుకోవాలి. దండకారణ్యంలోని అన్ని డివిజన్లలో గెరిల్లాబేస్‌ల ఎంపిక జరిగిన తర్వాత మొదటి శ్రేణి గెరిల్లా బేస్‌లన్నింటిలో నిర్మాణ కృషి ఒక పథకం ప్రకారం జరిగింది. గెరిల్లా బేస్‌లలోని గ్రామాలన్నింటినీ జనాభా ప్రాతిపదికన విభజించుకొని కొనసాగించిన గ్రామ స్థాయి నిర్మాణాల కృషి ఫలితంగా ఒక్కొక్క గెరిల్లా బేస్‌లో 20 నుంచి 30 గ్రామ స్థాయి జనతనా సర్కార్లు ఉనికిలోకి రాసాగాయి. ఇంచుమించు పదివేల జనాభాతో గెరిల్లా బేస్‌లు అస్థిత్వంలోకి వచ్చాయి.

ఎంపిక చేసుకున్న గెరిల్లాబేసుల్లో నిర్ణయించుకున్న విధంగా అన్ని చోట్ల గ్రామ జనతన సర్కార్లు ఏర్పడకపోయినప్పటికీ, సగం లేదా అంతకు మించిన సంఖ్యలో గ్రామ జనతన సర్కార్లు ఏర్పడినా ఏరియా జనతన సర్కార్ల నిర్మాణానికి పూనుకోవచ్చుననే అవగాహనకు రావడంతో ఆ రెండేళ్లలో చాలా చోట్ల ఏరియా జనతన సర్కార్ల నిర్మాణం జరిగింది. గ్రామ జనతన సర్కార్ల ఎంపికకూ, ఏరియా జనతన సర్కార్ల ఎంపికకూ మధ్య ఒక మౌలిక తేడానే చేసుకోవాల్సి వచ్చింది. అప్పటి వరకూ ఎంపిక అవుతూ వచ్చిన గ్రామ జనతన సర్కార్లన్నీ వయోజన ఓటు హక్కు పద్ధతిలో గ్రామ జనతన సర్కార్ పరిధిలో ఉన్న స్త్రీ-పురుష వయోజనులందరూ సర్కార్ కమిటీ ఎన్నికలో పాల్గొనేవాళ్లు. ప్రజా వ్యతిరేకులను మాత్రం సర్కార్ కమిటీని ఎన్నుకోవడానికీ, దానికి ఎంపిక కావడానికీ తాత్కాలికంగా అనర్హులుగానే

ప్రకటితమయ్యారు. వందలాది ప్రజలు ఎన్నుకుంటున్న ఆ సర్కార్లన్నీ 'రహస్య' సర్కార్లే. కాగా ఏరియా స్థాయిలో ఎన్నికయ్యే జనతన సర్కార్లు మాత్రం ప్రాతినిధ్య సభ - కౌన్సిల్ - ద్వారా ఎన్నిక కావడం అనే కొత్త విధానం ముందుకు వచ్చింది.

ఏరియా జనతన సర్కార్ ఎన్నికకు కౌన్సిల్ ప్రతినిధులుగా అన్ని గ్రామ జనతన సర్కార్ల కమిటీ సభ్యులతో పాటు ఏరియాలోని గెరిల్లాల తరఫున పి.ఎల్.జి.ఏ. ద్వితీయ (ప్రాంతీయ) బలగాల నుంచి ఒకరిద్దరు ప్రతినిధులు, ఏరియా స్థాయి ప్రజా సంగాల కార్యవర్గాల నుంచి ఎంపికైన వ్యక్తులు, అలాగే ఆ ఏరియాలో ఉన్న విద్యార్థి, ఉద్యోగ, మేధావి, దళితులు, చేతి వృత్తుల వాళ్లు, అర్ధశ్రామిక సెక్షన్ల నుంచీ ఎంపికైన వ్యక్తులను కూడా (ఈ సెక్షన్లలో సంగాలు నిర్మాణం కాని ఫలితంగా వ్యక్తులనే ఎంచుకోవడం అనివార్యమైంది) కౌన్సిల్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. స్థల, కాల, పరిస్థితులను బట్టి ఆహుతుల సంఖ్యలో మార్పు ఉంటుంది. ప్రజల దైనందిన సమస్యలను పరిశీలించి త్వరితగతిని పరిష్కరించుటకు గానూ ఏరియా జనతన సర్కార్లలో స్టాండింగ్ కమిటీని మూడు విభాగాలతో కలిపి అధ్యక్షుని నాయకత్వంలో - ఆర్థిక, రక్షణ, ప్రజా సంబంధాలు - ఏర్పడసాగాయి. ఏరియా వ్యాప్తంగా ఏ రంగంలో పనిచేస్తున్న విప్లవ పార్టీ కార్యకర్తలైనా కౌన్సిల్‌కు తమ ప్రతినిధులను పంపడం ద్వారా ఏరియా సర్కార్ ఎన్నికలో వాళ్లూ భాగస్థులే అయ్యారు. దీనితో ఎక్కడికక్కడే పనిచేస్తున్న విప్లవకారులు కూడా జనతన సర్కార్లకు జవాబుదారీగా ఉండాల్సి ఉంటోంది.

ప్రజల్లో జనతన సర్కార్ల కార్యక్రమాలు పెరుగుతున్న క్రమంలో విప్లవ ప్రజా సంగాలకూ, జనతన సర్కార్లకూ మధ్య ఉండాల్సిన సంబంధాల గురించి విస్తృతమైన చర్చ జరిగింది. ఏరియా స్థాయి సర్కార్లు ఏర్పర్చుకోవడానికి ముందు వరకూ జనతన సర్కార్లు చేసే ఏ నిర్ణయాలనైనా, తీర్మానాలనైనా సర్కార్ అధ్యక్షులు లేదా సర్కార్ నుంచి ఎవరో ఒకరు గ్రామసభను ఏర్పాటు చేసి ఆ నిర్ణయాలను, తీర్మానాలను ప్రజలందరికీ వివరించి వారి అభిప్రాయాలను తీసుకొని అవసరమైన చేర్పులు-మార్పులతో వాటిని అమలు చేయడానికి ప్రజలను ప్రోత్సహించేవారు. కాని దానితో జనతన సర్కార్ల నిర్ణయాలను విప్లవ ప్రజా సంగాల కార్యకర్తల వద్దకు తీసుకెళ్లడంలో, వాటి పట్ల సంగ కార్యకర్తలను మోటివేట్ చేయడంలో ఎదురవుతున్న సాధక బాధకాలను చర్చించి అందులో మార్పులను చేసుకోవాల్సి వచ్చింది. ఏరియా జనతన సర్కార్ల నిర్మాణ కాలంలో ఈ మార్పు సంస్థాగతంగానే జరిగి ప్రజా సంగాల నుంచి ఒక బాధ్యుణ్ని జనతన సర్కార్ల కమిటీలోకి ఎన్నుకునే పరంపర మొదలైంది. ఆ బాధ్యునికే ప్రజా సంబంధాల శాఖ బాధ్యతలు ఇవ్వడం కూడా అమలులోకి వచ్చింది. ప్రజా సంగాల నాయకత్వ శక్తులతో ప్రజా సంబంధాల శాఖా కమిటీ ఉనికిలోకి వచ్చింది. దానితో జనతన సర్కార్ల నిర్ణయాలు నేరుగా ఆ కమిటీ ద్వారానే ప్రజా సంగాల వద్దకు వెళ్లుతున్నాయి. ఆ విషయాల పైన సంగాలతో చర్చించి వారిని చక్కగా మోటివేట్ చేయడానికి ఈ పద్ధతి ఉపయోగకరంగా ఉంటుందన్న విషయం అనుభవంలోకి వచ్చింది.

అయితే ప్రజా సంగాల కార్యక్రమాలతో మాత్రం జనతన సర్కార్లకు ఎలాంటి నిర్మాణపర సంబంధం, జోక్యం ఉండదు. కాకపోతే సర్కార్ తమ పరిధిలో జరిగే అన్ని ప్రజా కార్యక్రమాలకు తన బాధ్యతగా ప్రజా సంగాల సమావేశాలకు, రాజకీయ తరగతులకు ఇతరత్రా కార్యక్రమాలకు రక్షణ కల్పిస్తుంది. ఈ మార్పుతో పాటుగా గ్రామ జనతన సర్కార్ - పంచాయితీ - పరిధిలో నూతనంగా ప్రజా సంగాల కార్యవర్గ దొంతర ఒకటి అమలులోకి వచ్చింది. ఇవి పంచాయితీ కమిటీలుగా రూపం తీసుకున్నాయి. పంచాయితీ కమిటీలలో ఇతర బాధ్యతలతో పాటు ఒకరికి జనతన సర్కార్ల తీర్మానాల అమలు బాధ్యత, మరొకరికి ప్రజా సమస్యలను జనతన సర్కార్ల ముందు పరిష్కారానికై ప్రతిపాదించే బాధ్యతను వుంటుంది. ప్రజా సంఘాలలో చేసుకున్న ఈ పని విభజన ఆ రెండింటి మధ్య పరస్పర సంబంధాలు పటిష్టం కావడానికి దారితీసింది.

పై మార్పులతో పాటుగా ఆ కాలంలో సైనిక రంగంలో కూడా నిర్మాణపరంగా కొన్ని మార్పులు జరిగాయి. ఒక వైపు ఏరియాల వారీగా ప్లాటూన్లు ఉనికిలోకి రావడంతో పాటుగా డివిజన్ల ప్రాతిపదికన కంపెనీల నిర్మాణం ప్రారంభమైంది. ప్రధాన బలగాలలో కంపెనీల నిర్మాణం ప్రారంభం కావడంతో పునాది బలగాలలో ప్లాటూన్ల నిర్మాణం ఉనికిలోకి వచ్చింది. ఆ కాలంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాన్ ప్రకారం ఫాసిస్టు సల్వాజుడుంను ప్రారంభించాయి. దాని ప్రతిఘటన వ్యూహంలో భాగంగా ప్రజా మిలీషియా నిర్మాణంలో నూతనంగా కోయ భూంకాల్ మిలీషియా (10 ఫిబ్రవరి 2006) నిర్మాణమైంది. ఫాసిస్టు సల్వాజుడుం తీవ్రం చేసిన హంతక, విధ్వంసకర దాడులను ఓడించడానికి పార్టీ నాయకత్వంలో బహుముఖ ప్రతిఘటన తీవ్రమైంది. యువత పెద్దెత్తున సమరశీల చర్యలలోకి కదులుతూ సైనిక నిర్మాణాలలోకి భర్తీ కావడానికి తమ పూర్తి సంసిద్ధతను, ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ ముందుకు వచ్చింది. ఫలితంగా విప్లవ కార్యక్రమాలు ముఖ్యంగా సైనిక చర్యలు ఊపందుకున్నాయి. భారీ సైనిక చర్యలతో శత్రువును గట్టిదెబ్బలు తీయడం పెరిగింది. గెరిల్లా యుద్ధం చలన యుద్ధం వైపూ, పిఎల్‌జిఏ పిఎల్ఏ వైపూ అభివృద్ధి చెందడం మొదలైంది. అణచివేత ప్రతిఘటనకు దారితీస్తుందన్నది ఇక్కడ అక్షరాలా నిజమైంది. ఉన్నత స్థాయి సైనిక నిర్మాణాలు, సఫల సైనిక దాడులు, విస్తృత ప్రజా మిలీషియా నిర్మాణం, అవి నిర్వహిస్తున్న సైనిక చర్యలు జనతనా సర్కార్లు పటిష్టం కావడానికి చాలా తోడ్పడినాయి. అంటే ఇక్కడ మరోసారి మనకు స్పష్టమయ్యేదేమంటే ప్రజాసైన్యం నిర్మాణాల అభివృద్ధి పటిష్టం గావడం ప్రజా రాజ్యాధికార అంగాల వికాసానికీ, విస్తరణకూ, పటిష్టతకూ దన్నుగా ఉంటూ ప్రత్యక్షంగా తోడ్పడుతోందన్నది కీలకమైన విషయం. ఇది ఎంతటి ప్రాముఖ్యతను కలిగి ఉందో జనతనా సర్కార్లు ఏర్పడడం, వాటి నాయకత్వంలో ప్రజల జీవన సమరంలో గణనీయమైన మార్పులు జరగడం కూడా అంతే ప్రాముఖ్యతను కలిగి ఉంది. జనతనా సర్కార్లు లేకుండా ప్రజాసైన్య నిర్మాణాలలో ఇంతటి త్వరితగతి మార్పులను లక్ష్యసాధన దిశలో చేపట్టడం సాధ్యమయ్యేదే కాదు.

ప్రజా పునాది బలంగా ఉన్న చోట ఏరియా జనతనా సర్కార్లు నిర్మాణమై అవి కొంత పటిష్టం కావడంతో మరింత ఉన్నత స్థాయిలో డివిజన్ స్థాయి జనతనా సర్కార్ల నిర్మాణానికి కావలసిన ప్రాతిపదిక ఏర్పడింది. ప్రజాపునాది సాపేక్షికంగా బలహీనంగా ఉన్న చోట ఏరియా జనతనా సర్కార్ల నిర్మాణ పద్ధతులలో, నియమాలలో అవసరమైన మోడిఫికేషన్ చేసుకోవడంతో అక్కడ కూడా ఏరియా జనతనా సర్కార్లు ఉనికిలోకి వచ్చాయి. దానితో దండకారణ్యంలోని అన్ని డివిజన్లలో ఎంపిక చేసుకున్న దాదాపు గెరిల్లా బేస్‌లన్నింటిలో ఏరియా జనతనా సర్కార్లు ఏర్పడినాయి. ఇవి కూడా పంచాయితీ స్థాయి సర్కార్‌ల వలెనే విశాల ప్రజా రాశులచే ఎన్నికవుతున్న రహస్య నిర్మాణాలేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఏరియా జనతనా సర్కార్లు నిర్మాణమై పటిష్టమవుతున్న క్రమంలో వాటి పని విధానం, వాటి గతీ-గమనాన్ని సన్నిహితంగా పరిశీలించిన పార్టీ కేంద్రకమిటీ దండకారణ్యంలో మూడు ఏరియా జనతనా సర్కార్లు ఏర్పడిన చోట డివిజనల్ సర్కార్ నిర్మాణానికి పూనుకోవాలన్న పిలుపును ఇచ్చింది. ఆ దిశలోనే 2006 వర్షాకాలంలో జరిగిన దండకారణ్య పార్టీ మహాసభ విప్లవ ప్రజానీకానికీ, పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలకూ, ప్రజా మిలీషియాకు 'డివిజన్ స్థాయిలో జనతనా సర్కార్లను నిర్మించండి' అంటూ నిర్దిష్ట పిలుపును ఇచ్చింది. ఆ మొత్తం అభివృద్ధి క్రమంలో తొట్టతొలుత ఏర్పర్చుకున్న ప్రత్యేక ఏరియా పార్టీ కమిటీల అవసరాన్ని గురించి పార్టీ ఉన్నత కమిటీలు సమీక్షించాయి. ఏరియా జనతనా సర్కార్లు నిర్మాణమై పటిష్టమవుతున్న క్రమంలో (గెరిల్లా బేస్‌లలో) మొదట నిర్మించుకున్న జిబిపిసి (గెరిల్లా బేస్ పార్టీ కమిటీ) లాంటి ప్రత్యేక ఏరియా పార్టీ కమిటీల అవసరం సహజంగానే తీరిపోయిందనీ అవి సమీక్షించాయి.

**ఏరియా జనతన సర్కార్లు పటిష్టం కావడం అంటే :** గెరిల్లాబేస్‌లలో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారం సాపేక్షికంగా మెరుగ్గా కొనసాగడం లేదా గెరిల్లా బేస్‌లు గతం కన్నా పటిష్టం కావడం; వాటి పట్ల ప్రజల విశ్వాసం ఇనుమడించడం; వారి జీవన ప్రమాణాలలో మెరుగుదల సాధించడం; వారి దైనందిన కార్యక్రమాలలో, సమస్యల పరిష్కారంలో సర్కార్ దన్నుగా నిలబడడం; ప్రజా సంఘాల నిర్మాణాలలో చాలా కాలం తర్వాత తిరిగి జోన్ స్థాయి నిర్మాణాలు ఎన్నికై ఉనికిలోకి రావడం, ప్రజా మిలీషియా రాశి, వాసిలోనూ మెరుగవడం; ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం నిర్మాణాలలో, యుద్ధచర్యలలో ఉన్నత మార్పులు జరుగుతూ పిఎల్ఏ నిర్మాణం వైపూ, చలన యుద్ధం వైపూ పయనించడం; ఇవన్నీ గెరిల్లా బేస్‌లలో ప్రజా రాజ్యాధికారం మరింత స్థిరంగా, ఉన్నత స్థాయిలో కొనసాగడానికి కావలసిన విధంగా శత్రు కదలికలను అడ్డుకుంటూ నియంత్రించసాగాయి. ఇవన్నీ కలసి మరింత ఉన్నతస్థాయిలో - డివిజన్ స్థాయి - ప్రజల రాజ్యాధికారాన్ని ఏర్పర్చడానికి దారులు తెరిచాయి.

## 5 (డి) జనతనా సర్కార్ – 2007–11

ఇప్పుడు 2007 నుంచి ఇప్పటి వరకు కొనసాగుతూన్న కాలాన్ని చూద్దాం. దీన్ని మనం దండకారణ్య

విముక్తి ప్రాంత నిర్మాణంలో జోన్ స్థాయి రాజ్యాధికార నిర్మాణానికి ప్రారంభదిశగా చెప్పుకోవచ్చు. 2007 నుంచి దండకారణ్య విప్లవ కార్యాచరణలో చోటు చేసుకుంటోన్న పరిణామాలన్నీ ఈ దిశలోనే సాగుతున్నాయనీ నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్-తొమ్మిదో కాంగ్రెస్ 2007 జనవరిలో జయప్రదంగా ముగిసింది. ఆ కాంగ్రెస్ యావత్తు పార్టీకి దండకారణ్యాన్నీ, బీహార్-ఝార్ఖండ్‌నూ విముక్తి ప్రాంతంగా మార్చాలనీ పిలుపు నిచ్చింది. ప్రస్తుతం యావత్తు పార్టీకి ఇదే కేంద్ర, ప్రధాన, తక్షణ కర్తవ్యంగా నిల్చింది. దండకారణ్యం విముక్తి ప్రాంతం కావడం అంటే దండకారణ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో కార్మిక, కర్షక పునాదిపై నాలుగు వర్గాల ఉమ్మడి ప్రజాస్వామిక నియంతృత్వంలో ఐక్యసంఘటనా ప్రభుత్వం ఏర్పడడం అని అర్థం చేసుకోవాలి. ఈ దిశలోనే అంటే కేంద్ర కర్తవ్య పరిపూర్తి దిశలోనే గత పదేళ్ల విప్లవ కార్యాచరణ ఉంది. ఈ కాలాన్ని ప్రజాతంత్ర ప్రభుత్వ స్థాపనా దిశలో ప్రజాయుద్ధం తీవ్రమైన కాలంగా కూడా చెప్పుకోవచ్చు.

2007 ఏప్రిల్‌లో దండకారణ్యంలో తొలి డివిజనల్ (స్థాయి) జనతన సర్కార్ ఏర్పడింది. డివిజనల్ జనతన సర్కార్ ఎన్నిక కూడా ప్రాతినిధ్య సభ ద్వారానే జరిగింది. ప్రాతినిధ్య సభకు అన్ని ఏరియా జనతన సర్కార్ల కమిటీ సభ్యులు, పిఎల్‌జిఏలోని ప్రధాన, ద్వితీయ బలగాల ప్రతినిధులు, డివిజనల్ ప్రజాసంగ కార్యవర్గాల ప్రతినిధులు, విద్యార్థి, ఉద్యోగ, మేధావి, అర్ధశ్రామిక సెక్షన్ల ప్రతినిధులు, ప్రతినిధుల సభ - కౌన్సిల్ - లో పాల్గొని డివిజన్ ప్రభుత్వాన్ని - డివిజన్ జనతన సర్కార్ కమిటీని - ఎన్నుకున్నారు. మొదటి ప్రభుత్వం ఎన్నికైన కొద్ది మాసాలకే మరో చోట రెండవ డివిజన్ ప్రభుత్వం ఎన్నికైంది. ఆ క్రమంలోనే మరోవైపు అన్ని డివిజన్లలో ప్రాధాన్యతా క్రమంలోని గెరిల్లా బేసులలో జనతన సర్కార్ల నిర్మాణాలను పెంచుకునే కృషి తీవ్రం అయింది. ఫలితంగా ప్రస్తుతం దండకారణ్యంలోని మరికొన్ని డివిజన్లలో డివిజన్‌కు మూడేసి ఏరియా జనతన సర్కార్లు నిర్మాణమై డివిజన్ స్థాయి ప్రజా ప్రభుత్వాలు ఎన్నిక కావడానికి కావాల్సిన ప్రాతిపదిక ఏర్పడింది.

జనతన సర్కార్లు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఎన్నిక అవుతున్నాయి. అవి ప్రతి ఆరు మాసాల కొకసారి గ్రామ సభలను నిర్వహిస్తున్నాయి. గ్రామ సభలు జనతన సర్కార్ కార్యకలాపాలను సమీక్షిస్తున్నాయి. జనతన సర్కార్లను నడిపించడంలో అసమర్థులుగా, అవినీతిపరులుగా లేదా ప్రజా వ్యతిరేక కార్యకలాపాలలో పాలుపంచుకుంటున్నవారుగా ఆరోపణలు వచ్చిన వారిని గ్రామసభ జనతన సర్కార్ నుంచి తొలగిస్తుంది. జనతన సర్కార్‌ను ఎన్నుకునే గ్రామసభకు వారిని వెనక్కి పిలిచే ప్రజాస్వామిక అధికారం కూడా ఉంది. అవినీతి కుంభకోణాల వరుస బాంబులు పేలుతూ, నోటు-ఓటుతో పార్లమెంటు అసెంబ్లీలు కంపుకొడుతున్న భారత 'బడా ప్రజాస్వామ్యం'లో ఇవేవీ కనీసంగా ఊహకైనా తట్టనివే!

డివిజన్ ప్రభుత్వానికి సాధారణంగా డివిజన్ పార్టీ కమిటీ కార్యదర్శే అధ్యక్షునిగానూ, డివిజన్ పిఎల్‌జిఏ బలగాల - సెకండరీ ఫోర్స్ - సైనిక కమాండర్ డివిజన్ ప్రభుత్వంలో రక్షణ విభాగ అధ్యక్షునిగా, డివిజన్ ప్రజా సంగాల సమన్వయ కమిటీ నుంచి ఒకరు డివిజన్ ప్రభుత్వంలో ప్రజా సంబంధాల విభాగ బాధ్యులుగా ఎన్నికవుతున్నారు. ఎన్నిక కోసం కౌన్సిల్ ముందు ప్రతిపాదించే ప్యానెల్‌లో సాధారణంగా పైన పేర్కొన్న వ్యక్తులు ఉంటారు. కౌన్సిల్ ప్రభుత్వ ప్యానెల్ (కమిటీ)ని ఎన్నుకొన్న పిదప ఆ కమిటీ సభ్యులు తమ మధ్య ప్రభుత్వ విభాగాల పనులను విభజించుకుంటారు. డివిజన్ ప్రభుత్వంలో కూడా ప్రభుత్వ అధ్యక్షుల నాయకత్వంలో రక్షణ, ఆర్థిక, ప్రజా సంబంధాల శాఖల బాధ్యులతో స్టాండింగ్ కమిటీని ఎన్నికవుతోంది. డివిజన్ స్థాయిలో ప్రభుత్వాలు ఏర్పడుతున్న క్రమంలో ప్రభుత్వ శాఖలలో అదనంగా తొమ్మిదో శాఖగా వ్యాపార, కుటీర పరిశ్రమల శాఖను కూడా ఏర్పర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దండకారణ్య విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనే దుష్టతలంపుతో దోపిడీ పాలకవర్గాలు చేపట్టిన ఫాసిస్టు సల్వాజుడుం విధ్వంసకర దాడుల ఫలితంగా వారాంతపు సంతలు కూడా తీవ్రంగా ప్రభావితమై దెబ్బతిన్నాయి. పీడిత ఆదివాసీ ప్రజానీకపు దైనందిన అవసరాలు తీర్చగలిగే అతి ప్రధానమైన సోర్సు వారాంతపు సంతలే. ఇవి దెబ్బతినడంతో (బంద్ కావడంతో) ప్రజల దైనందిన మార్కెట్ అవసరాలను కూడా జనతన సర్కార్లే చూడాల్సి వచ్చింది. అలాగే అపార ప్రాకృతిక వనరులకు, సమృద్ధ ఖనిజ నిల్వలకు నిలయమైన దండకారణ్యంలో ఎక్కడికక్కడే దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద సంస్థలు వాటిని కొల్లగొట్టుకపోవడానికి తీవ్రంగా కుట్రలు పన్నుతున్న పరిస్థితులలో వాటి పరిరక్షణనూ జనతన సర్కార్లే చూడాల్సి వచ్చి వ్యాపార, పరిశ్రమల శాఖను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఫలితంగా డివిజన్ సర్కార్ల నిర్మాణం నాటికి తొమ్మిది శాఖలు ప్రకటితమైనాయి. అయితే వీటిని ఏ స్థాయి ప్రభుత్వమూ యాంత్రికంగా అమలు చేయాల్సిన అవసరం లేదనీ, స్థల-కాల-పరిస్థితులను బట్టి అవసరమైన విభాగాలనే ఏర్పర్చుకోవచ్చని కూడా వెసులుబాటు వుంది.

డివిజన్ ప్రభుత్వాలు ఏర్పడినాక పన్నుల వసూలు అనే సమస్య ముందుకు వచ్చింది. గ్రామ రాజ్య కమిటీల నిర్మాణం నుంచీ డివిజన్ సర్కార్ల నిర్మాణం వరకు ప్రభుత్వాల నిర్మాణంలో వికాసం, విస్తరణ ఎలా జరిగాయో అదే విధంగా ప్రజల మౌలికావసరాలను తీర్చడానికి కావాల్సిన నిధుల సేకరణ విషయంలోనూ మెరుగదల వచ్చింది. ప్రధానంగా వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ (మిలీషియా సాయుధం చేయడంతో పాటు సైనిక చర్యలు) విభాగాల ఖర్చు క్రమంగా పెరుగుతూ వస్తోంది. జనతన సర్కార్‌లు వెచ్చిస్తున్న మొత్తం ఖర్చులల్లో వ్యవసాయం తర్వాత రక్షణ విభాగ ఖర్చు ఉంటోంది. దీనితో జనతన సర్కార్లు తమకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తగిన విధానాలను రూపొందించుకున్నాయి. పాలకవర్గాల భద్రతా బలగాలు కొనసాగిస్తున్న తీవ్రమైన అణచివేత-నిర్మూలనా దాడులను ఎదుర్కొంటూ

ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా పాలుపంచుకుంటున్న ఆదివాసీ పీడిత రైతాంగం నుంచి పన్నులు ఇప్పుడప్పుడే వసూలు చేయకూడదని నిర్ణయమైంది. ఇతరత్రా వనరుల ద్వారానే తమ ఆర్థికావసరాలను తీర్చుకోవాలనే అవగాహనతో ప్రస్తుత జనతన సర్కార్ల ఆర్థిక పాలసీ నిర్ణయమైంది. పార్టీ కేంద్రకమిటీ కూడా జనతన సర్కార్ల అవసరాలను ముఖ్యంగా ఫాసిస్టు సల్వాజుడుం కొనసాగించిన విధ్వంసక దాడులకు గురై అన్ని విధాలా నష్టపోయిన విశాల ఆదివాసీ, పీడిత రైతాంగ ప్రజల కనీస అవసరాలనైనా తీర్చడానికై దేశవ్యాప్తంగా గల విప్లవ ప్రజానీకం నుంచి స్వచ్ఛంద చందాల సేకరణకు పిలుపు నిచ్చింది. మరోవైపు తాత్కాలికంగా పరిమితంగానే అయినా వాటికి నిధులను సమకూర్చడంలో భాగంగా అది తన నిధుల నుంచీ పది శాతాన్ని జనతన సర్కార్ల బడ్జెట్‌లకు సమకూరుస్తూ అవసరమైన చర్యలు చేపట్టింది. ప్రజా రాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అభివృద్ధి చేసేందుకు ఆ పార్టీ తనకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తుండగా, దోపిడి ప్రభుత్వాలు పార్టీ ఆర్థిక నిధుల గురించి, రాబడి గురించి చిలువలు పలువలు చేస్తూ దుష్ప్రచారాన్ని సాగిస్తున్నాయి. పార్టీ రాబడి గురించి అవి చెబుతున్న లెక్కల్లో కనీసం ఒక్క శాతం రాబడి నిజంగా ఉన్నా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇప్పటికన్నా ఎన్నో రెట్లు మెరుగ్గా చేపట్టగలిగేవాళ్లమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి 2010 చివర్లో మీడియాకు విడుదల చేసిన ఇంటర్వ్యూలో స్పష్టం చేయడం ఇక్కడ గమనార్హం.

డివిజన్ జనతన సర్కార్ల నిర్మాణం ప్రారంభమై పటిష్టమవుతున్న క్రమంలో వర్తమాన దేశ, ప్రపంచ సంక్షోభ పరిస్థితుల మధ్య నిర్దిష్టంగా దండకారణ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పార్టీ కేంద్రకమిటీ దండకారణ్య వ్యాప్త జనతన సర్కార్ నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించాలని 2007 చివర్లో పిలుపు నిచ్చింది. ఈ పిలుపు ఈ రంగంలో జరుగుతున్న కృషిని మరింత వేగవంతం చేసింది.

కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపుకు కార్యరూపం ఇవ్వడంలో భాగంగా దండకారణ్యంలో వెంటనే 2008 ఫిబ్రవరిలో జనతన సర్కార్ల కార్యశాల (వర్క్‌షాప్) జరిగింది. ఆ కార్యశాలకు ఏరియా, డివిజనల్ జనతన సర్కార్ల స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరైనారు. ఆయా సర్కార్‌లలో వస్తున్న నూతన, గొప్ప అనుభవాలను పార్టీ శీర్ష నాయకత్వంతో కలిసి వాళ్లు పంచుకున్నారు. వివిధ విభాగాలలో వస్తున్న సమస్యలను చర్చించుకున్నారు. వాటిని సరిదిద్దడానికి కావల్సిన నిర్ణయాలు చేశారు. జనతన స్కూళ్లలో పాఠ్యాంశాలు మొదలు ఉపాధ్యాయులకు వేతనాలు, పిల్లలకు తిండి, గుడ్డలు సమకూర్చడం వరకూ చర్చించారు. అలాగే ప్రజల వైద్య అవసరాలు తీర్చడంలో భాగంగా కనీస మందులను సమకూర్చడం నుంచీ రైతాంగ వైద్యులను తయారు చేయడం వరకూ చర్చించారు. అడవిపై ఆధారపడి వ్యాపారం చేస్తున్న వారి విషయంలో అభివృద్ధికరమైన పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టడం వరకూ అనేక విషయాల్లో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. నిర్మాణపరంగా ఎదురవుతున్న సమస్యలలో ముఖ్యంగా వివిధ స్థాయిల్లోని జనతన సర్కార్లకు ఎన్నికవుతున్న వారిని ఉద్యమావసరాల రీత్యా ఇతర బాధ్యతలలోకి

బదిలీ చేస్తున్నపుడు పార్టీ పాటించాల్సిన కనీస పద్ధతులను రూపొందించుకున్నారు. విప్లవ ప్రజాసంగాలకు, జనతన సర్కార్లకు మధ్య ప్రజా సమస్యలు చేపట్టడంలో, పోరాటాలు నిర్వహించడంలో, ఇతరత్రా విప్లవ కార్యక్రమాలు కొనసాగించడంలో వస్తున్న సమస్యలను చర్చించుకొని అవసరమైన గైడ్‌లైన్స్ రూపొందించుకున్నారు. అంతిమంగా పార్టీ కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపును దృష్టిలో పెట్టుకొని ఆ దిశలో తొలిచర్యగా 'దండకారణ్య జోన్ జనతన సర్కార్ సన్నాహక కమిటీ'ని కార్యశాలలో నిర్ణయించుకున్నారు. కార్యశాల ముగింపును శీర్ష నాయకత్వం 'దండకారణ్యంలో ప్రజాతంత్రం గట్టిగా వేళ్లూనుకోవాలంటే ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేయడంలో జనతన సర్కార్లు నిర్మాణాత్మక కృషిని తీవ్రం చేయాలనీ' సమీక్షించింది.

ఉన్నతస్థాయి జనతన సర్కార్ల నిర్మాణంతో ఏటేటా ప్రజాయుద్ధంలో అంటే నేటి గెరిల్లా యుద్ధ నిర్వహణలో అనేక నూతన అనుభవాలు ఎదురవుతూ గెరిల్లా యుద్ధం తీవ్రమవుతూ అభివృద్ధి చెందుతోంది. ఈ కాలంలోనే రానీబోదిలీ, కుదురు, ఉర్పల్‌మెట్ట, చింతల్‌నార్, గొల్లపల్లి, మోదుగుపాల్, చింతగుప్ప, బడ్‌గాం, కోరపెల్లి, మర్కనార్ తదితర చోట్ల అంతర్గత వలయంలో శత్రువుపై గట్టిదెబ్బలు తీయడంతో పాటు బాహ్య వలయంలో మహామాయ, బింతి, చిత్రకూట్ లాంటి చోట్ల కూడా శత్రువును పిఎల్‌జిఏ దెబ్బతీసింది. అంతర్గత వలయంలో శత్రువును దెబ్బతీయడంలో గెరిల్లాబేసులలో నిర్మాణమవుతున్న జనతన సర్కార్లు చాలా కీలకమైన పాత్రను పోషించాయి. శత్రు బలగాలను రెక్కీ చేయడంలో, ప్రజా బలగాలు తగినన్ని రోజులు మకాం చేసి దాడి సన్నాహాలు చేసుకోవడంలో, ప్రజా బలగాల ఆచూకీ శత్రువుకు పొక్కకుండా కాపాడడంలో, గెరిల్లాలకు అన్ని విధాలా సహకరించడంలో భాగంగా అన్నపానీయాలు సమకూర్చడం, బరువులు మోయడం, దారులు చూపడం, నీటి వనరులు వెతికి పెట్టడంలో వాటి పాత్ర అద్వితీయమైనది. ప్రజలు ఎన్నుకుంటూన్న జనతన సర్కార్లు లేకుండా ఇవేవీ విశ్వసనీయంగా అందుబాటులోకి వచ్చేవి కావు. ఇవి లేకుండా భారీ స్థాయిలో శత్రువుపై విజయాలు సాధించడం సాధ్యమయ్యేదే కాదు. ప్రజా గెరిల్లాలు జయప్రదంగా జరిపిన ప్రతి దాడి తర్వాత "గ్రామాలు తమ పట్టులో లేకపోవడమే సమరంలో తమ ఓటమికి కారణమంటూ" శత్రువు వాస్తవాన్ని సమీక్షించుకోక తప్పలేదు. ప్రజలు గెరిల్లాలకు కావాల్సినవి సమకూర్చడంతో పాటు సైనిక చర్యలలో కొద్దిమంది ప్రత్యక్షంగా పాల్గొంటే అనేక మంది రిజర్వులుగా నిలిచి వుండడం ప్రజాయుద్ధ స్వభావాన్ని ఎత్తిపడుతుంది.

దండకారణ్యంలో నిర్మాణమవుతూ బలపడుతున్న ప్రజా రాజ్యాధికారాన్ని ధ్వంసం చేసే దుష్టతలంపుతో శత్రువు ఏనాటికానాడు వేలసంఖ్యలో నూతన బలగాలను దింపుతూ మోహరించడం పెరిగింది. వాటిని ప్రతిఘటించడానికి అనువుగా గెరిల్లా సైనిక నిర్మాణాలలో మరింత ఉన్నత ఫార్మేషన్‌లను చేపట్టాల్సిన అవసరం 2008 చివరి నాటికి ఎజెండా మీదికి వచ్చింది. దీనితో బెటాలియన్ కమాండ్లను గెరిల్లా బెటాలియన్‌లను నిర్మాణం చేయాలని నిర్ణయమైంది. ఇది పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా; గెరిల్లా యుద్ధాన్ని

చలన యుద్ధంగా అభివృద్ధి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తూ పార్టీ చేపట్టిన కేంద్ర కర్తవ్యాన్ని - దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలు చేయడం - నెరవేర్చే దిశలో ముందుకు సాగింది. ఈ ఉన్నత సైనిక నిర్మాణాలు జనతన సర్కార్ల రక్షణకూ పటిష్టతకూ అనివార్యమైనవి. ప్రజాయుద్ధ విజయాలను ప్రాతిపదిక చేసుకొని ఏనాటికానాడు ప్రజారాజ్యాధికార సంస్థలను పటిష్టం చేసుకుంటూ పురోగమిస్తున్న దండకారణ్యంలో జనతన సర్కార్లు సైన్యం-యుద్ధం-రాజ్యం అనే దిశలో అభివృద్ధి చెందుతూ మూడింటి సమ్మేళనంగా కార్యాచరణ కొనసాగుతోంది. ఈ మూడింటి సమ్మేళనాన్ని మట్టుబెట్టడానికే 2005లో సల్వాజుడుం 2009లో గ్రీన్ హంట్ ఆపరేషన్ మొదలైనాయి. గత రెండేళ్లుగా గ్రీన్ హంట్ ఆపరేషన్ యుద్ధ దాడులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజాసైన్యం, ప్రజా నిర్మాణాలు, ప్రజలు కలిసి నిర్మించుకున్న ప్రజాతంత్ర రాజ్య యంత్రాన్ని కాపాడుకోవడానికి భారీ మూల్యాలను చెల్లిస్తూ సాహసంగా ప్రతిఘటిస్తున్నారు. భారీ సైనిక దాడుల మధ్యనే నూతనంగా కొన్ని ఏరియాలలో ఏరియా జనతన సర్కార్లను నిర్మించుకున్నారు. మరి కొన్ని చోట్ల నిర్మాణానికి అన్ని హంగులూ పూర్తి చేసుకున్నారు. నూతనంగా డివిజన్ సర్కార్ నిర్మాణానికి కూడా అవసరమైన చోట నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతటి భారీ దాడుల మధ్య 2011 జూలై వరకూ ఏరియా జనతన సర్కార్లు ఏదో రూపంలో పని చేస్తూండడం ప్రజల విజయంగానే చెప్పుకోవాలి. గెరిల్లా చర్యలలోఅర్ధసైనిక బలగాలు కూడా గట్టిదెబ్బలు తింటూండడంతో అవి తమ ఆత్మస్థయిర్యాన్ని కోల్పోతున్నాయి. వెలుతురుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా దోపిడీ పాలకవర్గాలు కొత్త నిర్ణయాలు తీసుకున్నాయి. మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ తీవ్రమవుతున్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభ పరిస్థితుల తీవ్ర ఒత్తిడి ఆ నిర్ణయాల వెనుక ఉందన్నది ఒక భౌతిక వాస్తవం.

గ్రీన్ హంట్ ఆపరేషన్ కాలవ్యవధి ఏడేళ్లుగా పెట్టుకున్నారంటూ బహిరంగంగా పత్రికలే రాస్తున్నాయి. అందులో ఇప్పటికే రెండేళ్లు పూర్తి కావస్తున్నాయి. వాళ్లు కొత్తగా దింపిన వేలాది అర్ధసైనిక బలగాలు కూడా ఇక్కడి జనతన సర్కార్లను ధ్వంసం చేయలేకపోయాయి. ఇక్కడి ముడి పదార్థాలను తరలించుకు పోయేలా రహదారులను నిర్మించ లేకపోయాయి. ప్రభుత్వంతో కుదుర్చుకున్న అనేక అవగాహనా ఒప్పందాలను అమలులోకి తేలేకపోయాయి. దీనితో ఇంకా కాలయాపనకు దోపిడీ పాలకవర్గాలు సిద్ధంగా లేవు. కాలయాపన ద్వారా అవి దేశ, ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులకు నెట్టబడుతున్నాయి. కాబట్టి, అవసరమైతే మరిన్నైనా అర్ధసైనిక బలగాలను దింపి ప్రత్యామ్నాయంగా రూపొందుతున్న జనతన సర్కార్లను నిర్మూలించాలి. పరిశ్రమల స్థాపనను, ముడి పదార్థాల తరలింపును త్వరితం చేయాలనీ నిశ్చయించాయి. దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో ఎక్కడా వాళ్ల ఆటలు వాళ్లనుకున్నట్టు సాగడం లేదు. ఈ నేపథ్యంలోనే దండకారణ్యానికి 2011 మే 31 నాడు శిక్షణ నిమిత్తం భారత సైన్యం దిగింది.

భారత అర్ధసైనిక బలగాలకు ముందస్తు గెరిల్లా శిక్షణ లేకుండా మావోయిస్టు గెరిల్లాలతో తలపడుతూండడంతో భారీ నష్టాలు ఎదురవుతున్నాయనీ సైనికాధికారులు సమీక్షిస్తున్నారు. కాబట్టి భారత సైన్యానికి ఈ పరిస్థితి రాకూడదనీ ముందే దానికి గెరిల్లా శిక్షణ ఇవ్వడానికి పూనుకుంటున్నారు. జనతన సర్కార్లను, ప్రజాసంఘాలను, యావత్తు విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో పెద్దెత్తున దిగనున్న అర్ధసైనిక బలగాల దాడులు వాళ్లు ఆశించిన ఫలితాలు ఇస్తే శిక్షణ పొందిన భారత సైన్యం రిజర్వు ఫోర్స్‌గా ఉంటుంది. విలోమానుపాతంలో ఫలితాలుంటే భారత సైన్యం రంగంలోకి దిగుతుంది. ఈ అవగాహనతోనే దండకారణ్య జోన్ జనతన సర్కార్ తయారీ కమిటీ అన్ని విధాల ప్రజాతంత్ర రాజ్యయంత్ర పరిరక్షణకు, పటిష్టతకు, విస్తరణకూ పూనుకోవాలనీ 2011 భూంకాల్ సందేశంలో ప్రజలకు పిలుపు నిచ్చింది. 30 సంవత్సరాల దండకారణ్య విప్లవోద్యమ విజయాలను అది ఈ కింది విధంగా పేర్కొంటూ ప్రజల ముందుంచి వాటిని వమ్ము చేసుకోకూడదనీ ప్రజలను కోరింది.

**'జనతన సర్కార్లకే సర్వాధికారాలు' నినాదంతో/లక్ష్యంతో ప్రజలు సాధించిన విప్లవ విజయాలు:**

1) 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన దండకారణ్యంలోని ఎనిమిది డివిజన్‌లకు చెందిన దాదాపు ఐదు వేల గ్రామాల్లో కనీసం ఒక లక్ష కుటుంబాలు మూడు లక్షలకు పైగా ఎకరాల అటవీ భూమిని, భూస్వామ్య పెత్తందార్ల భూమిని స్వాధీనం చేసుకొని నూతనంగా సాగులోకి తెచ్చుకొని యాజమాన్య హక్కులు అనుభవిస్తున్నారు. ఇది మూడు దశాబ్దాల వ్యవసాయక విప్లవం సాధించిన అతి పెద్ద విజయం.

2) ప్రజలు సాయుధమై తమ సైన్యాన్ని నిర్మించుకొని ప్రజాయుద్ధం కొనసాగించిన ఫలితంగా దండకారణ్యంలోని దాదాపు 300 పంచాయితీలలో విప్లవ ప్రజా కమిటీల – జనతన సర్కార్ – అధికారం ఏర్పడింది. ప్రజలు దాదాపు 1500 గ్రామాల్లో జనతన సర్కార్లను ఎన్నుకొని నిజమైన ప్రజల ప్రజాస్వామ్యాన్ని అనుభవించడం వారు రాజకీయంగా సాధించుకున్న మౌలిక విజయం.

3) 'అడవిపై అన్ని హక్కులు ఆదివాసులకే' అన్న విప్లవ లక్ష్యంతో పీడిత ప్రజలు అడవిపై ప్రభుత్వ పెత్తనాన్ని దెబ్బతీసి అడవిపై అన్ని హక్కులూ అనుభవిస్తున్నారు. భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లను, బహుళజాతి కార్పొరేషన్‌ల చౌరబాటును నిషేధించి అమూల్యమైన ప్రకృతి సంపదలను సంరక్షించుకోవడం తమ అభివృద్ధికి, దేశాభివృద్ధికి వాటిని వినియోగించే దిశలో చర్యలు చేపట్టడం రాజకీయ, ఆర్థికరంగాల్లో ప్రజలు సాధించిన మరో మౌలిక విజయంగానే చెప్పాలి.

4) తెగ పితృస్వామ్యాన్ని, పురుషాధిక్యతను, రాజ్యహింసను, అవమానాలను,

అత్యాచారాలను, అణచివేతను మేం ఇక ఎంత మాత్రం భరించేది లేదంటూ ఎదిరించి పొలం పనులతో పాటు రాజకీయాకాశంలో, ప్రజా రాజ్యాధికారంలో, సామాజిక జీవితంలో సగం వాటాను కోరుతూ దండకారణ్య ఆదివాసీ, పీడిత మహిళలు వాటి కోసం పోరాడుతూ క్రమంగా సాధించుకుంటున్నారు.

5) మూఢవిశ్వాసాలతో నిండి ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన, కాలం చెల్లిన, తెగ కట్టుబాట్ల సంస్కృతినీ, హిందూ మతోన్మాద దాడినీ, హిందూమత మరియు క్రైస్తవ మత కుట్రపూరిత చొరబాటునూ అడ్డుకుంటూ నూతన విద్యావిజ్ఞానాలను, జన సంస్కృతిని, ప్రగతిశీల, ప్రజాస్వామ్య భావాలను ప్రచారంలోకి తేవడం ఉపరితల రంగంలో కొత్తదనానికి దారులు వేస్తున్న ప్రజా విజయం.

దోపిడీ ప్రభుత్వాలు గత ఆరు దశాబ్దాలుగా ఈ దేశంలో ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ పేరుతో కొనసాగిస్తున్న పార్లమెంటరీ ఎన్నికలన్నీ బూటకమనీ, దండకారణ్యంలో తొలి నుంచీ వాటిని బహిష్కరిస్తున్నారు. ముఖ్యంగా జనతన సర్కార్ల ఎన్నిక ప్రారంభం కావడంతో ప్రజలకు రెండు ప్రభుత్వాల ఎన్నికల మధ్య గల తేడా స్పష్టంగా అర్థం కాసాగింది. ఇవే నిజమైన ప్రజాస్వామిక ఎన్నికలనీ, తమ ప్రతినిధులను తామే ఎన్నుకుంటున్నామనీ, వారంతా తమ మధ్య జీవించే తమ వర్గ ప్రజల ప్రతినిధులేనని వారికి ఆచరణాత్మకంగా అర్థమైంది. దండకారణ్యంలోని అన్ని స్థాయిల జనతన సర్కార్లను ప్రతి మూడేళ్ల కొకసారి ఎన్నుకుంటున్నారు. ఐదేళ్ల కొకసారి ముందుకు వస్తున్న దోపిడీ పాలకవర్గాల పార్లమెంటరీ ఎన్నికలను ప్రజలు క్రియాశీలంగా బహిష్కరిస్తున్నారు. బూటకపు ఎన్నికల ప్రతీ బహిష్కరణ ప్రజలలో విప్లవ చైతన్యాన్ని పెంచుతూ రెండు ప్రభుత్వాల మధ్య గల తేడాను తేటతెల్లం చేస్తున్నది. ఈ నేపథ్యంలో 15వ లోక్‌సభ ఎన్నికలకు ముందు 2009 ఫిబ్రవరిలో తొలిసారిగా దండకారణ్య జనతన సర్కార్లు తమ ఎన్నికల ప్రణాళిక ప్రకటిస్తూ బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణ ప్రచారంలో ఒక మంచి ఆయుధంగా వినియోగించుకున్నారు.

## 5 (ఈ) జనతన సర్కార్లు పరిష్కరించుకోవల్సిన ముఖ్య రాజకీయ, నిర్మాణ సమస్యలు

### 1. ప్రజా మిలీషియా

ప్రజా మిలీషియాను సాయుధం చేయడం, విప్లవ ప్రజాయుద్ధంలో యావత్తు విప్లవ ప్రజానీకం యొక్క సమరశీల పాత్రను ఇంకా ఇంకా పెంచడానికి వారందరినీ ప్రజా మిలీషియాలో తప్పనిసరి భాగం చేయడం, వారిని సాయుధం చేయాలి;

ప్రజా మిలీషియా కార్యకర్తలను పెద్దయెత్తున ప్రజాసైన్యంలో చేర్చుకోవాలి;

ప్రజా మిలీషియాలో తలెత్తుతున్న పెడధోరణులను సరిదిద్దుకోవాలి;

యావత్తు విప్లవ ప్రజానీకాన్ని ప్రజాయుద్ధ ఓరియంటేషన్‌తో ఎడ్యుకేట్ చేసుకోవాలి.

**2. ఐక్యసంఘటన**

నాలుగు వర్గాల ఐక్యసంఘటనను పటిష్టం చేయడంలో భాగంగా ఆదివాసేతర విశాల ప్రజారాశులను సమైక్యం చేయాలి, సంఘటితం చేయాలి.

విద్యార్థి, ఉద్యోగ, మేధావి సెక్షన్ల ప్రజలను జనతన సర్కార్లలో భాగం చేయడం, శ్రామిక, అర్ధశ్రామిక సెక్షన్ల ప్రజల నాయకత్వాన్ని గ్యారంటీ చేయాలి, పటిష్టం చేయాలి.

విశాల అటవీ ప్రాంతంలో విస్తరిస్తూ పటిష్టమవుతున్న జనతన సర్కార్ల కార్యకలాపాలను అతి విశాల మైదాన ప్రాంతాలలోని గ్రామీణ రైతాంగ, పట్టణ శ్రామిక ప్రజలతో అనుసంధానించుకోవడం.

**3. బోధనాపరమైనవి**

జనతన సర్కార్లలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి మార్క్సిస్టు రాజకీయ, సైద్ధాంతిక విషయాలలో తగిన ఎడ్యుకేషన్‌ను అందించాలి.

ఆయా విభాగాల ప్రాముఖ్యతను అన్ని విభాగాల మధ్య గల అంతర్గత సంబంధాన్ని అర్థం చేసుకొని సమన్వయంతో ప్రజల సమస్యను పరిష్కరిస్తూ వారి అవసరాలను తీరుస్తూ జనతన సర్కార్ల పట్ల వారిలో విశ్వాసాన్ని మరింత ఇనుమడింపజేయాలి.

జనతన సర్కార్లకూ ఇతర ప్రజా, సైనిక నిర్మాణాలకు మధ్య గల సంబంధం, పని విధానం మధ్య కావల్సిన సమన్వయం తదితర విషయాలలో స్పష్టత పెంచాలి.

**4. ఆర్థికపరమైనవి**

తీవ్రమైన నిధుల కొరతతో విద్యా, వైద్య విభాగాల కనీస అవసరాలే తీరడంలేదు, ప్రజల సంప్రదాయ వ్యవసాయ పద్ధతులలో అభివృద్ధికర మార్పుకు పూనుకొని జనతన సర్కార్లు చేస్తున్న కృషిని తీవ్రం చేయడానికి కూడా నిధులు కొరతగానే ఉన్నాయి.

ప్రజాయుద్ధ అవసరాలను తీర్చడానికి జనతన సర్కార్ల వద్ద తగిన నిధులు లేవు.

దోపిడీ ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ తమ ఎల్.ఐ.సి. విధానాల్లో భాగంగా ముమ్మరంగా ముందుకు తెస్తున్న ఆర్థిక సంస్కరణలను జనతన సర్కార్లు తిప్పికొడుతున్న మేరకు ప్రత్యామ్నాయంగా ప్రజల కనీస అవసరాలను తీర్చడానికి నిధుల కొరత తీవ్రంగా ఉంది.

సల్వాజుడుం విధ్వంసకర దాడులలో నష్టపోతున్న విప్లవ ప్రజల అవసరాలను కనీసంగానైనా తీర్చడానికి జనతన సర్కార్లకు నిధులు సరిపోవడం లేదు. (దేశంలోని పలు ప్రాంతాల నుంచి విప్లవ ప్రజానీకం అందిస్తోన్న స్వచ్ఛంద విరాళాలు ఉన్నప్పటికీ)

## 5. ప్రచార రంగం

ప్రపంచవ్యాప్తంగా ఏయేటికాయేడు విప్లవ పరిస్థితి అద్భుతంగా పెంపొందుతున్నది. విప్లవ శక్తులు మాత్రం పలు కారణాలతో బలహీనపడిపోతూండడంతో పరిస్థితులను పూర్తిగా సద్వినియోగపరచు కోలేకపోతున్నారు. మరోవైపు ప్రజాయుద్ధాన్ని విరమించి అధికార కుమ్ములాటల్లోకి దిగి ప్రజల ప్రజాస్వామిక, విప్లవ ఆకాంక్షలను పక్కదార్లు పట్టిస్తున్న నేపాల్ పరిణామాలు జగమెరిగినవే. మరోవైపు సి.పి.ఐ.(మావోయిస్టు) ఎంతటి తీవ్ర నాయకత్వ నష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ దండకారణ్యంలో పెంపొందుతున్న ప్రజల ప్రజాస్వామిక అధికారం భారత పీడిత ప్రజలకు ఆశాకిరణంగా ఉంది. దీన్ని ఏమాత్రం బలపడనీయకూడదనీ, విస్తరించనీయగూడదనీ దోపిడీ పాలక వర్గాలు కేంద్రీకరించి సైనిక దాడులను తీవ్రం చేస్తూ అభివృద్ధి పేరుతో మోసపు ఆర్థిక సంస్కరణలను ముమ్మరం చేస్తున్న పరిస్థితులలో సమస్త పీడిత ప్రజల మద్దతును కూడగట్టుకోవడానికి చేయాల్సిన ప్రచారం తగినంతగా లేదు.

## 5 (ఎఫ్) జనతన సర్కార్లు – విభాగాలు

జనతన సర్కార్లలో తొమ్మిది విభాగాలున్నాయనీ పైన చూశాం. ఈనాటికి ఈ విభాగాలతో ప్రజల వ్యవహారాలన్నీ సాగుతున్నాయి. ప్రతీ విభాగానికీ ఒక అధ్యక్షులు ఉంటారు. ఆ అధ్యక్షులు జనతన సర్కార్ కమిటీ సభ్యులై ఉంటారు. ప్రతీ విభాగానికీ ముగ్గురితో లేదా ఐదుగురితో కూడిన కమిటీ ఉంటుంది. జనతన సర్కార్‌లో, సర్కార్‌కు చెందిన తొమ్మిది శాఖా కమిటీలలో మహిళల సంఖ్య ఉండాల్సినంతగా లేదు. స్త్రీ-పురుషులు సమానంగానే బాధ్యతలు స్వీకరించాలనే ప్రోత్సాహం ఉన్నప్పటికీ మహిళలు నాల్గవవంతుకు మించి లేరనే అనుకోవాలి. పురుషులతో సమానంగా రాజ్య వ్యవహారాలలో బాధ్యతలను పంచుకోవడంలో ఎదురవుతున్న పితృస్వామ్యం, తమ వెనుకబాటుతనం వెరసి మహిళలు అధికారంలో సంపూర్ణ భాగస్థులు కావడంలో వారి కోటా కొరవలతో కొనసాగుతోంది. రక్షణ రంగానికి విభాగ కమిటీతో పాటు ప్రజా మిలీషియా కమాండర్లతో కూడిన కమాండ్ యుద్ధచర్యలను కొనసాగిస్తోంది. శాఖల సంఖ్యను అవసరాల కనుగుణ్యంగా మార్చుకోవచ్చనే అవగాహన ఉంది. ఒక సర్కార్ కమిటీ ఉందంటే అందులో తొమ్మిది లేదా పదకొండు మంది సభ్యులుంటారు. విభాగ కమిటీలన్నింటితో కలిపి మొత్తం 35-45 సంఖ్యలో సభ్యులు ఉంటారు. కిందిస్థాయి (పునాది) సర్కార్ కమిటీని పంచాయితీ కమిటీ అంటారు. ఏరియా, డివిజన్ స్థాయిలోనే వ్యాపార, పరిశ్రమల శాఖ ఏర్పడుతోంది.

వ్యవసాయ రంగం మానవుని మనుగడకు పునాదిగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలోని వివిధ శాఖల స్వతంత్ర అస్థిత్వానికి, అవి మరింతగా అభివృద్ధి చెందడానికి ఈ రంగం పునాదిగా వుంటుంది. ఇది మానవ సమాజ చారిత్రక దశలన్నింటికీ వర్తించే ఒక నియమం. శ్రమశక్తిలోని ఒక భాగమే సమాజ సభ్యులందరికీ సరిపడేంత పరిమాణంలో వ్యవసాయక ఉత్పత్తులను చేయగలిగిన స్థాయికి వ్యవసాయ రంగంలోని శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందిన తర్వాత మాత్రమే ఇతర కార్యకలాపాలను చేపట్టడానికి



వ్యవసాయాభివృద్ధి కోసం నడుం బిగించిన దండకారణ్య ప్రజ

శ్రమ విడుదల కాగలిగింది. ఈ విధంగా చేతి వృత్తుల పరిశ్రమ వ్యవసాయం నుండి విడివడి ఉత్పత్తిలోని ఒక స్వతంత్ర శాఖగా మారింది. వాణిజ్యం ఆవిర్భవించింది. అలాగే సంస్కృతి, విద్య వంటి మేధోపరమైన ఉత్పత్తికి సంబంధించిన మానవ కార్యకలాపాల శాఖలు కూడా ఆవిర్భవించాయి. పై చారిత్రక ఆర్థిక నియమాన్ని దండకారణ్యానికి అన్వయించి అర్థం చేసుకున్న జనతన సర్కార్లు వ్యవసాయ రంగంపై ముందుగా తమ దృష్టిని కేంద్రీకరించాయి.

ఆదివాసీ వ్యవసాయంలో మార్పు తేకుండా ప్రజల జీవితాలలో, జీవన ప్రమాణాలలో మంచి మెరుగుదలను ఊహించలేం. పైగా విముక్తి ప్రాంత లక్ష్యంతో ప్రజా సైన్య నిర్మాణాన్నీ చేపట్టి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్న చోటా ఆ ప్రాంతాలు ఆర్థికంగా స్వయంపోషకం గావడం ఒక ముందు షరతుగానే ఉంటుంది. చైనా విప్లవోద్యమ అనుభవాలు ఇలాంటి విషయాల్లో అనేక మార్గదర్శకాలను అందిస్తున్నాయి. వెనుకబడిన ఆదివాసీ ప్రాంతంలో వీటన్నింటి నేపథ్యంలోనే వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి దాని అభివృద్ధికి తీవ్రంగా కృషి సాగుతోంది.

వ్యవసాయ కార్యక్రమాలను కొనసాగించడానికి స్థానికంగా కావాల్సిన వనరులు (భూమి, నీరు, శ్రమశక్తి, పశుగణం మొదలైనవి) లభ్యమవుతున్నప్పటికీ ఆధునికమైన, మెరుగైన వ్యవసాయ జ్ఞానాన్ని అందించేవారి అవసరం దండకారణ్యానికి ఎంతగానో ఉంది. వివిధ రాష్ట్రాల నుంచీ వ్యవసాయ అనుభవజ్ఞులను విప్లవ పార్టీ దండకారణ్యానికి పంపి వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ స్థానిక పరిస్థితులను ఆకళింపు చేసుకొని వారు దృఢంగా నిలబడి, ఉద్యమం ఆశిస్తోన్న సేవలు అందించలేకపోయారు. ఫలితంగా దండకారణ్య పార్టీ కేడర్ల నుంచే వ్యవసాయ రంగంలో అనుభవం ఉన్నవారిని ఈ రంగానికే పూర్తిగా

కేటాయించడం గత దశాబ్ద కాలంగా అమలవుతూ క్రమంగా పెరుగుతోంది. వీరంతా జనతన సర్కార్లలో భాగమవుతూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఈ రంగంలో పార్టీ కార్యకర్తలు (అన్ని స్థాయిల వారు కలిసి) దాదాపు పాతిక మందికి పైగానే స్త్రీ-పురుషులు ఉన్నారు.

వ్యవసాయంలో ప్రధానంగా వరి పండించడం పైనే దృష్టి పెడుతున్నారు. వరి ఇక్కడి ప్రధాన పంట గావడంతో వరి పండిస్తూనే మొక్కజొన్న, గంగా (నూనె గింజలు), పప్పు ధాన్యాలు పండిస్తున్నారు. సమిష్టి భూములలో కూరగాయలు, మిరప పండిస్తున్నారు. దక్షిణ బస్తర్‌లో ప్రధానంగా 'లంద' (రైస్ బీర్, మధ్యం) తయారీ కోసం కోహ్‌ల (చిరుధాన్యం) పండించడం ప్రజల్లో చాలాకాలంగా సాగుతోంది. దీనిని నిరుత్సాహపర్చడంలో భాగంగా జనతన సర్కార్లు నువ్వుల పంటను ప్రోత్సహిస్తున్నాయి. వీటి ఫలితాలు ఉత్సాహజనకంగా ఉండి ఈ పంట త్వర త్వరగా విస్తరిస్తోంది. ఆదివాసీ వ్యవసాయంలోకి వేగంగా చొచ్చుకవస్తోన్న బిటి కాటన్ (పత్తి) పంటను జనతన సర్కార్లు నిరుత్సాహపరుస్తున్నాయి. పత్తి రైతుల అవస్థలు, ఆత్మహత్యలు వివరిస్తూ రైతాంగాన్ని ఇతర పంటల వైపు ప్రోత్సహిస్తున్నారు. అధిక దిగుబడి వంగడాలు కాకుండా స్థానిక విత్తనాలను సమకూర్చడం పైనే శ్రద్ధ పెడుతున్నారు. అనివార్యం అయితేనే మార్కెట్ నుంచీ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. భూపరీక్ష, సేంద్రీయ ఎరువుల వాడకం, రసాయన ఎరువుల వినియోగం తదితర వ్యవసాయ సాగుకు కావాల్సిన జ్ఞానం ఆదివాసీ రైతాంగానికి అందించాల్సిన అవసరం తీవ్రంగా ఉంది. సమష్టి భూములలో పంటలు సామూహికంగా పండించడంతో పాటు పేద రైతులలో నాగళ్ల లెక్కన టీంలు ఏర్పడి ఒకరికొకరు తోడ్పడడం పెరుగుతోంది. సమష్టి భూములలో వచ్చే పంటను మూడు భాగాలు చేస్తున్నారు. ఒక భాగం సామూహిక శ్రమలో పాల్గొన్న వాళ్లకు ఇస్తూ ఒక భాగం తదుపరి సంవత్సరం విత్తనాలు, వ్యవసాయ ఖర్చుకు అట్టిపెడుతున్నారు. మిగిలిన భాగాన్ని ప్రజాయుద్ధ అవసరాలకు వెచ్చిస్తున్నారు. 2007-08లో ప్రజాసంఘాలు తమ అవసరాల ఖర్చుల కోసం సమష్టిగా వ్యవసాయం చేయడం ప్రారంభించాయి. కానీ, ఇక్కడి వ్యవసాయ భూముల పరిస్థితి, పంట దిగుబడి స్థితి, వ్యవసాయ సీజన్‌లో రైతాంగానికి ఉండే తీవ్ర పని ఒత్తిడిని పరిగణనలోనికి తీసుకోవడంతో పాటు ఉత్పత్తిలో సర్కార్ పాత్ర, ప్రజాసంఘాల పాత్రను లోతుగా చర్చించి ప్రజాసంఘాల సామూహిక సేద్యాన్ని నిలిపివేశారు.

జనతన సర్కార్లు పేద రైతాంగానికి విత్తనాలు, నాగళ్లు, ఎడ్లు సమకూర్చడంతో పాటు పొలాలు దున్ని పెట్టడం, కోతలు, మోతలు మొదలైన పనులలో సహాయాన్ని అందిస్తున్నాయి. చాలా చోట్లా రైతాంగం టీంలుగా ఏర్పడి పరస్పర సహకారంతో వ్యవసాయ పనులు పూర్తి చేసుకోవడం క్రమంగా పెరుగుతోంది. జనతన సర్కార్లు ఎడ్లను సమకూర్చడం మొదలయ్యాక నిరుపేద రైతాంగం అద్దెకు ఎడ్లను తెచ్చుకోవడం తగ్గింది. భూస్వాముల నుంచీ దున్నడానికి ఎడ్లను తెచ్చుకోక తప్పనివారు గతంలో తమ బిడ్డలను ఎద్దు కింద తాకట్టు పెట్టే దౌర్భాగ్య స్థితి నుంచీ నిరుపేద రైతాంగాన్ని జనతన సర్కార్లు ఆదుకుంటున్నాయి.

అంతేకాదు, నాగటెడ్లు అడవి మృగాల వాతపడి కరువైనా, ప్రకృతి వైపరీత్యాలతో మరణం సంభవించినా రైతుల దున్నకం పనులు నిల్చిపోకుండా వారి అభ్యర్థనపై జనతన సర్కార్లు యుద్ధ ప్రాతిపదికపై ట్రాక్టర్లతో దున్నిపెట్టే బాధ్యతను చేపడుతున్నాయి. చేతుల్లో డబ్బున్న రైతులైతే గంటకు కిరాయి రూ.300-450 చెల్లించి ట్రాక్టర్లతో దున్నించుకుంటున్నారు. జనతన సర్కార్లు రైతులకు గంటకు రూ.225లతో దున్ని పెడుతున్నాయి.

పంట పొలాలకు కావాల్సిన సాగు నీటి వ్యవస్థకు దోపిడీ ప్రభుత్వాలు ఇంతకాలం ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు. అవి తలపెట్టిన అనేక సాగునీటి ప్రాజెక్టులు దండకారణ్యంలో దశాబ్దాల తరబడి పెండింగ్‌లోనే మూలుగుతున్నాయి. ఫలితంగా 2 శాతానికి మించి దండకారణ్య ఆదివాసీ భూములకు నీరందని స్థితే దాపురించింది. ఇలాంటి దుస్థితి నుంచీ వ్యవసాయం బయటపడకుండా ఆదివాసీ జీవితాలు దారుణమైన దుర్భర స్థితి నుంచీ గట్టెక్కలేవు. ఆదివాసీ రైతాంగానికి విప్లవోద్యమం ఫలితంగా లక్షలాది ఎకరాల సాగు భూములు లభ్యమైన మాట నిజమే కానీ, ఉత్పాదకత రేటు అత్యల్పంగా ఉండడంతో మెరుగైన బతుకుదెరువు కోసం నిరంతరం అటవీ భూములను నూతనంగా సాగులోకి తెచ్చుకోవడానికి రైతులు ఆరాటపడుతున్నారు. గెరిల్లాబేసుల్లోని రైతాంగంలో మెజార్టీ రైతుల జీవన విధానంలో 30 యేండ్ల విప్లవోద్యమ ఫలితంగా కొంత మెరుగు వచ్చినప్పటికీ సాగు పద్ధతులలో పెద్ద మార్పులేదు. దండకారణ్యంలో ఎక్కడ చూసినా ఆదివాసీ రైతాంగం నేటికీ నీటి తావులను ఆధారం చేసుకొనే, వాటి అంచుల్లో ధాన్యం విత్తుతూ పంటపై విశ్వాసంతో జీవిస్తుంటారు. చెరువులకు తూములను ఏర్పర్చి కాలువల ద్వారా పంట పొలాలకు నీరందించడంపై ఎలాంటి ఆశక్తిని ప్రదర్శించకపోవడంతో జనతన సర్కార్లు నిర్మించిన దాదాపు 250కి పైగా చెరువులు (కుంటలు) తూములు లేకుండానే సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయానికి పశువుల దాహాన్ని తీర్చడానికి, చేపల పెంపకానికి ఉపయోగపడుతున్నాయి. దక్షిణ బస్తర్‌లోని లింగగిరి, కరిగుండం, కేడ్వాల్ లాంటివి మాత్రం దాదాపు ఒక పది చెరువులు పెద్దవిగా ఉండి, తూముల ద్వారా పొలాలకు నీళ్లు అందిస్తున్నాయి. రాజగోండులలో (దొర్లు) తూముల ద్వారా పొలాలకు నీళ్లు అందించేపద్ధతి అనేక సంవత్సరాలుగా కొనసాగుతూ మెరుగ్గా పంటలు పండిస్తున్నప్పటికీ, మిగతా తెగలు మాత్రం ఇప్పటికీ ఆవైపు ఇంకా మళ్లలేదు. జనతన సర్కార్లు ఆ పనిని ఒక ఛాలెంజ్‌గానే తీసుకొని పూర్తి చేయాల్సిన అవసరం సీరియస్‌గా ఉంది.

ఇందుకు ఒక ఉదాహరణను చూద్దాం. 2011 జూన్‌లో జరిగిన ఒక డివిజన్ సర్కార్ సమావేశం ముందుకు నూతన అటవీ భూముల ఆక్రమణ కేసులు 45 వచ్చాయి. వీరంతా 2011 ఖరీఫ్ పంటల కోసమే అడవులను నూతనంగా నరికారు. వీరిలో చాలా మందికి భూమి అవసరం ఉండగా కొద్దిమంది ధనిక రైతాంగం మాత్రం భూదాహంతో నరికారు. నిజానికి ఇక్కడి సగటు పంట దిగుబడి ఎకరానికి కనిష్టంగా 10 క్వింటాళ్లకు (ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సగటు ఉత్పాదకత 6 క్వింటాళ్లు మాత్రమే)

చేరుకోగలిగితే నేడున్న ఏ ఒక్క రైతుకు కూడా అదనపు భూముల కోసం ఆరాటపడేస్థితి బహుశ ఉండదేమో! వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు, పరిశ్రమలు అభివృద్ధి చెందినా రైతాంగానికి భూముల అవసరం తగ్గి వారు ఇతర వృత్తుల్లోకి వెళ్లగలుగుతారు.

చిన్న, చిన్న చెరువుల నిర్మాణం చేపట్టడంతో ఆదివాసీ రైతులలో చేపల పెంపకం గతం కన్నా విస్తృత స్థాయిలో కొనసాగుతోంది. వాగులు, వంకలు, నదులలో చేపలు పట్టడమే ఎరిగిన చాలా మంది ప్రజలు ఇప్పుడు ఉత్సాహంగా తమ సర్కార్ చెరువుల్లో చేపల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. చేపల కోసం ఉవ్విళ్లూరిన గ్రామాల్లో ఇప్పుడు చేపలు తినగలుగుతున్నారు. జనతన సర్కార్లు మార్కెట్ రేటు కన్నా చవకగా ఇస్తూండడంతో ప్రజలకు కూడా చేపలు అందుబాటులోకి వచ్చాయి. వాళ్ల జీవితాల్లో ఎంతోకొంత పౌష్టికాహారం లభించే అవకాశాలు పెరిగాయి. ఈ చిన్న, చిన్న చెరువులే వేసవిలో పసువుల దాహాన్ని తీరుస్తున్నాయి. బావులు తవ్వడం ఏతం వేయడం, రాట్లతో నీరు తోడడం లాంటి పద్ధతులూ, మోటార్లు, ఇంజన్‌లూ, బోర్లు వేయడం చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితులలో పాతాళంలోకి బోర్లు వేసి భూగర్భ జలాలు తీయడం కన్నా వర్షపు నీటిని నిలవ చేసే చెరువుల నిర్మాణాన్ని ప్రోత్సహించడమే అన్ని విధాలా శ్రేయస్కరం అంటూ జనతన సర్కార్లు ఆ దిశలో తమ కృషిని తీవ్రం చేస్తున్నాయి. అర, కొరగా చెక్‌డ్యాంల నిర్మాణానికి పూనుకున్నా అవి అనుకున్నంతగా ముందుకు సాగలేదు. మొత్తంపై నీటి యాజమాన్య పద్ధతులను జనతన సర్కార్లు తెలుసుకొని అమలులోకి తేవడం చాలా అవసరం.

ఆదివాసీ వ్యవసాయ భూములను చదను చేయకుండా, మళ్ల నిర్మాణానికీ పూనుకోకుండా, సాగు నీటి వసతులను కల్పించకుండా సగటు ఉత్పాదకతను పెంచడం సాధ్యం కాదనీ భావించిన జనతన సర్కార్లు 30 ఏండ్ల దండకారణ్య విప్లవోద్యమ వేడుకలను పురస్కరించుకొని 'భూమి చదను, మళ్ల నిర్మాణం' ప్రజా క్యాంపెయిన్‌కు పిలుపు నిచ్చాయి. 2011 ఫిబ్రవరి 11-28 వరకు ఈ క్యాంపెయిన్ దండకారణ్యా వ్యాప్తంగా చాలా ఉత్సాహంగా సాగింది. దాదాపు 5 లక్షలకు పైగా పని దినాలతో సాగిన ఈ ప్రజా క్యాంపెయిన్ వందలాది పేద రైతాంగానికి తోడ్పడింది. జనతన సర్కార్లు ఈ క్యాంపెయిన్ కోసం దాదాపు రెండు కోట్ల రూపాయలను మంజూరు చేయగా దాదాపు రూ. 50 లక్షల మేరకు డబ్బు ఖర్చుతోనే రమారమి వెయ్యి ఎకరాలలో భూమి చదను, మళ్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగాయి. ఈ క్యాంపెయిన్‌లో భాగంగానే 50 చెరువులను నూతనంగా నిర్మించారు. వీటిలో 4 చెరువులు పెద్దవి. ఇలాంటి ప్రజా క్యాంపెయిన్లు తరచుగా చేపట్టాలనీ, పేద ప్రజానీకాన్ని ఆదుకోవాలనే భావన ప్రజల్లో వ్యక్తమైంది. అవినీతి, లంచగొండితనాలతో కుళ్లికంపుకొడుతున్న దోపిడీ వ్యవస్థలో ఏ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (మన్‌రేగా) గానీ, ఇతర బూటకపు సంస్కరణలు కానీ పేద ప్రజలను ఆదుకోవు. వాళ్ల మౌళిక సమస్యలు పరిష్కరించవు. విప్లవోద్యమాలు మాత్రమే ఇలాంటి అద్భుతమైన ప్రజా క్యాంపెయిన్లను చేపట్టి ప్రజల ద్వారా ప్రజలను ఆదుకోగలవనీ దండకారణ్య ప్రత్యామ్నాయ వ్యవస్థ మరోసారి రుజువు చేసింది.



తమ పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్న జనతన సర్కార్ పాఠశాలలు

జనతన సర్కార్లు వ్యవసాయం తర్వాత విద్యా, వైద్యం లాంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఆదివాసీ పిల్లలకు మాతృబాషలోనే విద్యా బోధనను కొనసాగించడానికి పూనుకుంటున్నాయి! ఆదివాసీ బుద్ధిజీవులు గొప్ప ఆత్మాభిమానంతో కోయ భాషకు ఒక లిపిని రూపొందించే కృషి చేసినప్పటికీ దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్న తీవ్ర నిర్లక్ష్యం ఫలితంగా ఆ లిపి వెలుగులోకి రాకుండా పోతోంది. సర్కారీ పండుగలకు (జనవరి 26, ఆగస్టు 15) తప్ప బడి ముఖం చూడని పంతుళ్లు ఎందరో! పేద ప్రజల బతుకులతో ఏమాత్రం సంబంధం లేని, అశాస్త్రీయ విద్యను, అర్థంకానీ బోధనా పద్ధతులలో చిన్నారి మెదళ్లకు ఎక్కించే దుష్ట విద్యా విధానానికి భిన్నంగా ప్రజల ఉత్పత్తి విధానంతో, సంస్కృతితో, జీవితాలతో ముడిపడిన విద్యను జనతన సర్కార్లు బోధిస్తున్నాయి. 7వ తరగతి వరకు సిలబస్ రూపొందించారు. 4వ తరగతి నుంచీ హిందీ, 5వ తరగతి నుంచీ ఆంగ్లాన్ని పరిచయం చేస్తున్నారు. తీవ్రమైన నిధుల కొరత, నిరంతరం ఖాకీల దాడుల ప్రమాదం మూలంగా పలకా-బలపం పట్టే చిన్నారులు సైతం చలన పాఠశాలల్లో (మొబైల్ స్కూల్)నే కష్టపడి అభ్యసించక తప్పడం లేదు. బోధనా పరికరాలు, పుస్తకాలు, నోటు బుక్కులు, డ్రెస్సులు, తిండి సరకులు అన్నీ కొరతే. ఆశ్రమ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం అక్కడక్కడ సమకూరుస్తున్నా ప్రజల అవసరాలను తీర్చగలిగే స్థాయిలో లేవు. బడిలో ఉపాధ్యాయులకు జనతన సర్కార్లు రూ. 600-1000 నెలసరి వేతనాన్ని చెల్లిస్తూ ఉపాధ్యాయుల కుటుంబాలకు

వ్యవసాయంలో సహాయ పడుతున్నాయి. స్కూల్ మాస్టర్‌లకు విద్యా అర్హతలంటే ఏ డిగ్రీలు లేకున్నా రాయడం, చదవడంలో మంచి ప్రవేశం ఉంటే సరిపోతుంది. పల్లెల్లో కాస్తా రాయడం, చదవడం వచ్చిన వారిని వెతికి పట్టుకొని జనతన సర్కార్లు వారికి ఎంతో నచ్చ చెపుతూ తమ పిల్లలకు చదువు చెప్పే కొలువులిస్తున్నాయి. కొన్నిపాఠశాలలలో పూర్తికాలం విప్లవకారులే (రైతాంగ విప్లవ కార్యకర్తలు) ఉపాధ్యాయ బాధ్యతలను చేపట్టారు. వీరిలో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ఈ కార్యకర్తలే జనతన సర్కార్లలో విద్యాశాఖ బాధ్యతలు చేపడుతున్నారు. ఈ పాఠశాలలను 'ప్రజా స్కూల్' (జనతన స్కూల్)గా వ్యవహరిస్తున్నారు.

జనతన స్కూల్‌లలో టీచర్లతో పాటు చిన్నారి పిల్లలూ వంట చెరకు తేవడం వంటా, వడ్డన చేసుకుంటూ బడి నిర్వహణలో పాలు పంచుకుంటున్నారు. ఆహారం కోసం పంటల కాలంలో పొలం పనులలో పాల్గొంటూ ధాన్యం పండిస్తున్నారు. కూరగాయలు పండిస్తున్నారు. జీవితం నేర్పిన ఈ పనుల నుంచీ వారిని పాఠశాల విద్య దూరం చేయకుండా శ్రమను గౌరవించే సంప్రదాయాన్ని నిలబెడుతూంది. పిల్లలకు సంత రోజు సెలవు ఉంటుంది. పిల్లలు, టీచర్లూ కలసి వేటలోనూ పాల్గొంటారు. చేపలు, పీతలు పట్టడం సహా అడవి నుంచి ఆకూ, అలము, వెదురు కొమ్ములు, పుట్టగొడుగులు మొదలైనవీ తిండికి సమకూర్చుకుంటారు. గ్రామస్థులు స్కూల్ పిల్లలంతా తమ బిడ్డలేనన్న విశాల దృష్టితో తమకు ఉన్న దాంట్లో నుంచీ ప్రతీది పిల్లలకు తప్పక అందజేస్తూంటారు.

ప్రజల కోసం ఏర్పర్చిన పాఠశాలలను కూడా పోలీసులు ధ్వంసం చేయకుండా విడిచిపెట్టడం లేదు. వీటిపై కూడా దాడులు చేస్తున్నారు. 2010 డిసెంబర్‌లో తూర్పు బస్తర్ డివిజన్‌లోని 'తిర్క' పంచాయితీ స్కూల్‌పై పోలీసులు దాడి చేసి ధ్వంసం చేశారు. పిల్లలకు పోలీసుల రాక ప్రజల ద్వారా ముందే తెలవడంతో ఉపాధ్యాయులూ, పిల్లలూ సురక్షితంగా తప్పుకోగలిగారు. ప్రాథమిక విద్యా హక్కు చట్టం గురించి తెగ మురిపిస్తూ మీడియా ద్వారా మహా ప్రచారానికి పూనుకుంటున్న ప్రభుత్వాలు దండకారణ్యంలో ప్రత్యామ్నాయ వ్యవస్థ నడుపుతున్న పాఠశాలలను మాత్రం కూలగొడుతున్నాయి. కాల్చిబూడిద చేస్తున్నాయి. ఈ వ్యవస్థలో ప్రజలు తమకు ఏది సమకూర్చుకోవాలన్నా యుద్ధం ద్వారా తప్ప మరోదారి లేకుండానే పోతోంది.

జనతన స్కూళ్లలో గ్రామస్థుల పిల్లలతో పాటు విప్లవకారుల పిల్లలూ చదువుకుంటున్నారు. దశాబ్ద క్రితం వరకూ ఈ అవకాశం లేకుండింది. గతంలో బూర్జువా స్కూల్‌కు విప్లవకారుల పిల్లలు వెళితే పోలీసులూ అక్కడికి చేరి ఆ చిన్నారి పిల్లల హృదయాలు తీవ్రంగా గాయపడేలా వారిని 'నక్సలైట్ల' బిడ్డలంటూ 'అవమాన'పర్చేవారు. రియాక్షనరీ స్వభావం కలిగిన టీచర్లు పోలీసులతో గొంతు కలిపేవారు. కానీ, జనతన స్కూళ్లు ఏర్పడినచోట ఆ లేత గుండెలకు పోలీసు హింస నుంచీ విముక్తి దొరికింది.

పల్లెల్లోని అక్షరం రాని రైతు బిడ్డలే ప్రజలను కాపాడే వైద్యులవుతున్నారు. పార్టీ కేంద్రకమిటీ తనకు

అందుబాటులో ఉన్న పట్టభద్రులైన వైద్యులను దండకారణ్యానికి పంపడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఇప్పటికీ కొద్దిమంది ప్రజావైద్యులు (విప్లవాభిమానులు) స్వచ్ఛందంగా దండక్ అడవుల్లోకి వచ్చి ప్రజలకు వైద్యం చేయడంతో పాటు రైతాంగ వైద్యులకు శిక్షణను ఇచ్చారు. దండకారణ్యంలో ప్రజా వైద్యుల అవసరం చాలా తీవ్రంగా ఉన్నప్పటికీ పట్టభద్రులు లభ్యం కావడం లేదు. ఇక సర్కారీ వైద్యుల మాట సరేసరి. ఉపాధ్యాయులు గానీ, వైద్యులు గానీ లోతట్టు అటవీ ప్రాంతాలలో వారికి కావల్సిన సౌకర్యాలు లేనిచోట ప్రజా సేవా తత్పరతతో ప్రజల మధ్య ఉంటూ వారికి సేవలందించడం సాధారణ విషయమేమీ గాదు. అందుకే వాళ్లంతా ప్రభుత్వాసుపత్రులు గాలికి వదిలి మావోయిస్టుల బూచీని చూపుతూ సుబ్బరంగా పట్టణాలలో జీవితాలు గడుపుతూ వేతనాలు మాత్రం క్రమం తప్పకుండా తీసుకుంటున్నారు.

ప్రజా వైద్యులకు మందుల కొరత తీవ్రంగా ఉంది. ప్రజలు తమ చిరు ఆదాయం నుంచే పాఠశాలలు నడుపుకుంటున్నారు. వైద్యశాలలూ నడుపుకుంటున్నారు. నెలవారిగా డబ్బులు పోగేసి పరిసర పట్టణాల నుంచి మందులు తెప్పించుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. పోలీసుల కళ్లు గప్పి 'హరిత వేట'కు గురికాకుండా పట్టణాల మందులు అడవుల్లోకి చేరడం భగీరథ ప్రయత్నాల్లాగే సాగుతున్నాయి. ప్రజలకు




ప్రజాసేవలో ప్రజా వైద్యులు

చేరిన మందుల కన్నా పోలీసులకు పట్టుబడ్డ మందులే అధికంగా ఉంటాయేమో! ఈ సమస్యల నుంచీ నివారణను పొందడానికి జనతన సర్కార్లు ఆయుర్వేదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మూలికా వైద్యాన్ని ముందుకు తెస్తున్నాయి. పల్లెల్లో అనుభవజ్ఞులైన పెద్దల నుంచీ ఈ జ్ఞానాన్ని పొందుతూ కొద్దిమంది ప్రజా వైద్యులు ఆయుర్వేదాన్నీ శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. పోలీసు హింసలో గాయాల పాలైనవారికీ, ఎముకలు విరిగిన వాళ్లకు అక్కడక్కడ వడ్డెల ఇండ్లే వైద్యశాలలవుతున్నాయి. జబ్బులు తగ్గినవారు కోలుకొని యధావిధిగా తమ దైనందిన చర్యలలో, జీవన పోరులో భాగమవుతూంటే, ఆ వైద్యం పని చేయని రోగులు అకాల మరణాలకు గురి అవుతున్నారు. పోలీసు కార్పెట్ సెక్యూరిటీ వలయంలో బందీలైన ఆ నిరుపేద ఆదివాసీ ప్రజానీకం, వాళ్ల జనతనా సర్కార్లూ ఇంతకన్నా ఈనాడు చేయగలిగిందేముంది? ఆఁ! అవకాశం ఉంటే మాత్రం పేదల ప్రాణాలను కాపాడుకోవడానికి రోగులను పట్టణ వైద్యానికి జనతనా సర్కార్లు పంపిస్తూ ఖర్చు భరిస్తున్నాయి.

## జనతన సర్కార్లు అందించిన వైద్య సేవల వివరాలు:

2009లో 25 మంది రోగులను పట్టణ వైద్యానికి పంపగలిగాయి. 2010లో, ఈ సంఖ్య 40కి పెరిగింది. 2009లో మాడ్, పశ్చిమబస్తర్‌లలో ప్రజావైద్యానికై జనతనా సర్కార్లు రూ.5 లక్షల విలువ గల ఔషధాలను కొనుగోలు చేశాయి. 2010లో పశ్చిమ బస్తర్ డివిజన్‌లో ఆరు మాసాల కాలంలో దాదాపు 50 వేలమంది ప్రజలకు ప్రజావైద్యులు వైద్యం చేశారు. వీరిలో అధిక శాతం మలేరియా బాధితులే. మాడ్‌లో 2009లో 16 మంది పాముకాటుతో, 160 మంది పెద్దలు, 250 మంది పిల్లలు పలు జబ్బుల మూలంగా చికిత్స దొరకక అకాల మరణాలకు గురయ్యారు.

దండకారణ్య ప్రజల్లో ఐదవ వంతు మందికి సికిల్ సెల్ వ్యాధి పీడితులే అని బూర్జువా గణాంకాలు ప్రపంచానికి చాటుతున్నాయి. ఈ జబ్బుకు వైద్యమే లేదంటున్నారు. జూన్ 19ని యేటా ప్రపంచ సికిల్ సెల్ దినంగా పాటిస్తూ మొక్కుబడిగా, రోగికి యేటా 600 రూ.లు ఇస్తున్నాం అంటున్నారు కానీ దండకారణ్యంలో ఈ సర్కారీ డబ్బు అందుతున్న సికిల్ సెల్ పీడితులు లేరేమో! గెరిల్లా సైనికుల్లో కూడా ఈ జబ్బుతో బాధపడుతున్న వాళ్లు అక్కడక్కడ ఎదురవుతుంటారు. ఇలాంటి వ్యాధులకు సైతం రేపు ప్రజా వైద్యులే చికిత్సను కనిపెట్టాలి.

జనతన సర్కార్ల విభాగాలలోని అతి ముఖ్యమైన శాఖలలో రక్షణ శాఖ ఒకటి. జనతన సర్కార్ స్థాయీ కమిటీ (స్టాండింగ్ కమిటీ)లో రక్షణ శాఖ బాధ్యులు కూడా వుంటారు. రక్షణ శాఖ కమిటీ నిర్వర్తించే బాధ్యతలలో ప్రజా మిలీషియా, ప్రజా భద్రతా వ్యవహారాలు (ఇంటలిజెన్స్), జైలు వ్యవహారాలు, ప్రజా పోలీసుతో పాటు గెరిల్లాల కుటుంబాల యోగక్షేమాలు చూసుకోవడం ప్రధానంగా ఉన్నాయి. ప్రజా మిలీషియా నిర్వహణలో భాగంగా రక్షణ శాఖ నాయకత్వంలో ప్రజా మిలీషియా కమాండ్ పనిచేస్తుంది. యుద్ధ చర్యల సక్రమ నిర్వహణలో, సమన్వయంలో, బలగాల క్రమశిక్షణా, ఆయుధాలు-మందుగుండు

నిర్వహణ తదితరాలన్నీ కమాండ్ చూస్తుంది. జనతన సర్కార్ల రక్షణ విభాగంలో ఉన్న ప్రజా మిలీషియా కమాండ్ మిలీషియా నిర్మాణాలను సైనికంగా నడిపిస్తుంది. గ్రామ రక్షణ దళాలు, ప్లాటూన్లు ప్రజా మిలీషియా నిర్మాణంలో ఏర్పడి పనిచేస్తున్న యూనిట్లు. మిలీషియా కార్యకర్తలు తమ ప్రభుత్వ రక్షణ బాధ్యతలను ప్రధానంగా నిర్వర్తిస్తూనే జనతన సర్కార్లు చెప్పే సమష్టి పనులలో కూడా పాల్గొంటారు. ఉత్పత్తి కార్యక్రమాలతో పాటు ఇతర ఆర్థిక నిర్మాణ కృషిని కొనసాగిస్తుంటారు.

ప్రజా భద్రతా వ్యవహారాలు (ఇంటలిజెన్సీ వ్యవస్థ) చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఏనాటికానాడు పెరుగుతోంది. శత్రువు విప్లవోద్యమంలోకి చొప్పిస్తున్న కోవర్టులను, రహస్యంగా కొనసాగిస్తున్న ఇన్ఫార్మర్ల యంత్రాంగాన్ని పసిగట్టాలి. ఈ విషయాలలో నిరంతరం ప్రజల అప్రమత్తతను పెంచాల్సిన నేటి పరిస్థితులలో ఈ రంగం ప్రాముఖ్యత ఎంతగానో పెరిగింది. ఇది ప్రజాయుద్ధ బలగాలకు నిజంగా కళ్లూ, చెవులుగా పనిచేస్తుంది.

రక్షణ శాఖ నిర్వహణ కిందికే జైళ్లు వస్తాయి. వీటి అవసరం ఇప్పటి వరకు చాలా పరిమితంగా ఉందని చెప్పుకోవచ్చు. ప్రజా కోర్టులు చాలా వరకు ప్రజా సమస్యలన్నింటినీ వర్గపంథా, ప్రజాపంథాకు లోబడి పరిష్కరిస్తున్నందున జైళ్ల అవసరం పెద్దగా రావడం లేదు. కరుడు గట్టిన నేరస్థులను, పదే పదే తప్పులు చేస్తున్నవారిని సరిదిద్దడానికి కొన్నిచోట్ల జైళ్లను వినియోగిస్తున్నారు. ప్రజా కోర్టుల తీర్పు వెలువడిన తర్వాత జైలు శిక్ష పడిన నేరస్థులు ప్రజా మిలీషియా సంరక్షణలో ఉంటున్నారు. వాళ్లు అన్ని ఉత్పత్తి కార్యక్రమాలలో మిలీషియా కార్యకర్తలతో పాల్గొంటూ తమ శ్రమశక్తిని వెచ్చిస్తున్నారు. వారి భోజనం చాలా చోట్ల కుటుంబీకులే సమకూరుస్తుంటారు. లేనిచో జనతన సర్కార్ చూసుకుంటున్నది. నేరస్థులకు ఆరు మాసాలకు మించి శిక్షలు వేసిన అనుభవం ఇప్పటికి లేదని ప్రజా కోర్టు తీర్పులను పరిశీలిస్తే బోధపడే విషయం. ఈ దోపిడీ వ్యవస్థ పరిభాషలో చెప్పుకోవాలంటే ఒక రకంగా ఆరు బయట జైళ్లు లాగే ఉండే చోటనే నేరస్థులు ఉంటుండడంతో పారిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒళ్లంతా సంకెళ్లతో, ఊపిరి సలపని ఒంటరి సెల్లు (గది)లలో, కడుపాకలితో పూట-పూటకు అంగలార్చే దుస్థితి ఏ ఖైదీకి ఉండదు. ఖైదీలు సామూహిక శ్రమలో పాల్గొంటారు. తమ కుటుంబీకులతో ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. మనుషులు తమ తప్పును అర్థం చేసుకునే విధంగా, దాని నుంచీ బయటపడే విధంగా, మానసిక చింతనకు తోడ్పడే విధంగా వారికి బోధించే విద్య, వారితో ప్రజా మిలీషియా ప్రవర్తన ఉంటుంది. ఇప్పటికీ ఏ ఖైదీకి ఆరు మాసాలకు మించిన శిక్ష విధించింది లేదు. ఈ జైళ్లు నిజంగా నేరస్థులను సంస్కరించే కేంద్రాలుగా తీర్చిదిద్దబడుతున్నాయి. దండకారణ్యంలో జైళ్లు చాలా పరిమితమైన ప్రాంతాలలోనే ప్రాథమికంగా పని చేస్తున్నాయి.

గెరిల్లాల కుటుంబాల యోగక్షేమాలు చూస్తున్న కమిటీ. దీనిని పడియోర పరివార్ కమిటీ అంటున్నారు. ఇది రక్షణ శాఖలో భాగంగానే ఉంది. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో చేరిన గెరిల్లాల యోగక్షేమాలు



ప్రజా రక్షణలో ఒక ప్రజా మిలీషియా ప్లాటూన్

తెలుసుకోవడంతో పాటు ప్రజా యుద్ధంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాల మంచీ చెడులను కూడా ఈ కమిటీ చూస్తుంది. గెరిల్లాలు తమ కుటుంబాలను వదిలి దూర దూర ప్రాంతాల్లో సైనిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నవాళ్లు చాలా మందే ఉంటారు. వాళ్లు తమ బాధ్యతలు పూర్తి అంకిత భావంతో రాజకీయ చైతన్యంతో ఎక్కడ నిర్వర్తిస్తున్నప్పటికీ వారు మరింత ఆత్మవిశ్వాసంతో, సంతృప్తితో, తమ విప్లవ జనతన సర్కార్లపై పూర్తి నమ్మకంతో పనిచేసే విధంగా వాళ్ల కుటుంబాల చింత వారికి పెద్దగా లేకుండా ఉండేలాగే వారిని మోటివేట్ చేసే బాధ్యత ఈ కమిటీకి ఉంటుంది. అలాగే ప్రజాయుద్ధంలో అసువులు బాసిన కుటుంబీకులకు తాము తమ వాళ్లను కోల్పోయామన్న బాధ నుంచీ బయటపడడానికి అన్ని విధాల ఈ కమిటీలు సహాయ సహకారా లందించాల్సి వుంటుంది. ప్రజాయుద్ధ నిర్వహణలో అన్ని ప్రజలపై పోలీసులు తప్పుడు ఆరోపణలు చేస్తే కోర్టులు కఠిన శిక్షలు వేయగా జైలు పాలైనవారి కుటుంబాలను కూడా ఈ కమిటీ వాళ్లే పరామర్శిస్తూ వాళ్ల అవసరాలు కూడా చూడాలి. ఈ బాధ్యతలు ఓపిగ్గా నిర్వహించగల జీవితంలో పరిపక్వత ఉన్న స్త్రీ-పురుషులతో ఈ కమిటీలు నిర్మించాల్సి ఉంటుంది.

పైన పేర్కొన్న బాధ్యతలను నిర్వర్తిస్తూ రక్షణ శాఖ విప్లవ జనతన సర్కార్ల నిర్వహణలో అతి ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నది. ప్రజా మిలీషియా నిర్వహణ, పోషణ, యుద్ధచర్యల నిర్వహణ, అమరుల కుటుంబాల, గెరిల్లాల కుటుంబాల యోగక్షేమాలు చూడడం, ప్రజా భద్రతా వ్యవహారాలు, ప్రజా జైళ్ల నిర్వహణ మున్నగునవి చాలా కీలకమైన బాధ్యతలుగానే ఉన్నాయి. వీటన్నింటితో పాటు ప్రజా పోలీసు బాధ్యతలు నిర్వహించడం కూడ రక్షణ విభాగం కిందనే ఉంది.

ప్రజల మధ్య, ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్న విభాగాలలో న్యాయ విభాగానికి ప్రత్యేక

స్థానం ఉంది. ప్రజల సమస్యలు ఇప్పుడు న్యాయ విభాగాలే పరిష్కరిస్తున్నాయి. నిజానికి విప్లవోద్యమం ప్రారంభమైనప్పటి నుంచీ ప్రజా పంచాయితీల పరిష్కారం మెల్లమెల్లగా ఆదివాసీ భూస్వామ్య-పెత్తందారీ శక్తుల నుంచీ తొలుత విప్లవ ప్రజా సంఘాలకూ, తదుపరి జనతన సర్కార్ల నిర్మాణంతో న్యాయ విభాగం చేతుల్లోకి వచ్చింది. దండకారణ్యంలోని పదుల పోలీసు స్టేషన్ల రికార్డులను ఎవరైనా పరిశీలించపూనుకుంటే పోలీసులు గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఫైల్ చేసిన సివిల్ కేసులు చాలా అరుదుగానే ఉన్నాయన్న విషయం వారికి అర్థమవుతుంది. పోలీసులు చేసేదల్లా గ్రామాలపైబడి రైతాంగాన్ని అరెస్టు చేసి క్రిమినల్ కేసులు ఆరోపించడమే. విప్లవ తొలినాళ్లలో పోలీసుల చేత అరెస్టు అయ్యి కోర్టుల పాలై మూడు దశాబ్దాలుగా వాటి చుట్టూ తిరుగుతున్నా ఇప్పటికి విముక్తి కానీ ఆదివాసీ రైతులు అన్ని ప్రాంతాల్లో కానవస్తారు. 1984 కమలాపూర్ మహాసభలపై గడ్చిరోలి పోలీసులు దాడి చేసి ఆదివాసీ రైతాంగాన్ని అరెస్టు చేసి మోపిన తప్పుడు కేసులు ఇంకా న్యాయ స్థానాలలో నలుగుతూనే ఉన్నాయి. నల్లకోటు న్యాయమూర్తుల న్యాయం (తీర్పు) కోసం ఎందరెందరో ఆదివాసీలు, రైతులు అంగలారుస్తున్నారు. ఈ చేదు అనుభవం అక్కడి ఏ రైతూ మరిచిపోడు. 2004 నాటికి గడిచిన 20 ఏండ్లలో గొల్లపల్లి (దంతెవాడ జిల్లా) పోలీసుస్టేషన్‌లో సివిల్ కేసులు ఏ ఒక్కటీ బుక్ కాలేదనీ ఒక సందర్భంగా పోలీసులే చెప్పుకున్నారు. మరోవైపు ప్రజాకోర్టులలో ఎక్కువ శాతం విచారిస్తోంది ప్రజా ద్రోహులనే అన్న విషయం జనతన సర్కార్ల రికార్డులను పరిశీలించినవారికి తెలుస్తుంది. గతంలో ప్రజల మధ్య తలెత్తే గొడవల్లో భూస్వామ్య, పెత్తందారీ శక్తులు సృష్టించినవే అత్యధికంగా ఉండేవి. సివిల్ కేసుల్లో ఆస్తి సంబంధాల గొడవల కన్నా బలవంతపు వివాహాలు, పునర్వివాహాలు, విడాకులు ఉంటాయి. ఇలాంటి కేసుల్లో గతంలో 'పెద్దలు' వేల రూపాయిల దండుగలు వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం దానికి భిన్నంగా వర్గదృష్టితో ప్రజా సమస్యల పరిష్కారానికే జనతన సర్కార్లు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. గతంలో హత్య కేసుల్లో పెద్దల సంప్రదాయ తీర్పులను అనుసరించి తలకు తల తీయడమో లేదా పది తలలు (10 పసువులు) నష్టపరిహారంగా తీసుకోవడమో జరిగేది. ఇప్పుడు అలాంటి తీర్పులకు దాదాపు కాలం చెల్లిపోయింది. ప్రజా కోర్టులు ప్రజా వ్యాజ్యాలన్నింటినీ ఎలాంటి జాప్యం లేకుండానే పరిష్కరిస్తున్నాయి. కేసుల పరిష్కారంలో ముద్దాయిలు చెల్లించుకునే ఖర్చులంటూ ఏం ఉండవు. కింది ప్రజాకోర్టులలో తమ కేసు సరిగా పరిష్కారం కాలేదనీ, తమకు అన్యాయం జరిగిందనీ భావించిన పక్షం ఏరియా, డివిజన్ స్థాయి న్యాయ విభాగాల వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. ఈ తీర్పులకు ఎంతటి సాధికారత ఉంది అని ఎవరూ సందేహించాల్సిన పనే లేదు. సమస్యల గురించి క్షుణ్ణంగా తెలిసిన ప్రజలు, ముద్దాయిల గురించి పూర్తిగా అర్థం చేసుకున్న ప్రజలు, డబ్బుల ప్రస్తావన లేకుండా అవినీతికి, బంధుప్రీతికి అవకాశం లేని విశాల ప్రజారాశులు తీర్పరులు అయినప్పుడు నిజానికి తీర్పుకున్న సాధికారతను ప్రశ్నించాల్సిన అవసరమే రాదు. ఇది ఈ తీర్పుల్లోని విశిష్టత. తరతరాలుగా వంచనకూ, దోపిడీ-దౌర్జన్యాలకూ, అవినీతి-అక్రమాలకూ, అన్యాయానికీ-అవమానాలకూ బలి అవుతున్న పేద ప్రజానీకానికి ప్రజాకోర్టు తీర్పులు ఎంతో ఊరటను ఇస్తున్నాయి. ఆత్మగౌరవాన్ని

నిలబెడుతున్నాయి.

భారత ప్రజా వ్యతిరేక న్యాయ వ్యవస్థ బండారాన్ని బయటపెట్టడానికి రెండే రెండు ఉదాహరణలు చాలు. గత 60 యేళ్లుగా బాబ్రీమసీదు కేసు దేశ సర్వోన్నత న్యాయస్థానంలో మూలుగుతుందెందుకు? గత పదేళ్లుగా గుజరాత్ మారణకాండ హంతకులకు ప్రత్యక్ష సాక్షులు నిజాలు వెళ్లడి చేస్తున్నా న్యాయం నిగ్గుదేల్చి శిక్షించడం లేదే! లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలకు ఒడిగట్టారన్న బలమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఏ ఘరానా పెద్ద మనిషినీ ఉరితియ్యని ఈ దుష్ట న్యాయవ్యవస్థపై ఒక సాధారణ ఆదివాసీ (ఆమ్ ఆద్మీ) ఎందుకు విశ్వాసం పెట్టుకుంటాడు? ఆయన తన పల్లె కోర్టుపైనే, ప్రజాతీర్పుపైనే నమ్మకంతో జీవిస్తున్నాడు.

అడవిలో నివసిస్తున్న ఆదివాసులకు అత్యవసరమైన విభాగాలలో ఒకటి అటవీ శాఖ. గతంలో అడవిలో అడుగుపెట్టడానికి జడుసుకునే ఆదివాసీలు జనతన సర్కార్ల ఆవిర్భావంతో వాటిపై అధికారాన్ని అనుభవిస్తున్నారు. వారు తమ అవసరాలను తీర్చుకోగలగుతున్నారు. అడవుల నుంచీ దోపిడీ సర్కార్లు కల్ర తరలించుకపోవడాన్ని జనతన సర్కార్లు నిషేధించాయి. ఖాకీల రక్షణలో తరలించుకపోవడానికి సాహసించిన అటవీ శాఖ వాహనాలు గెరిల్లాల దాడులకు గురవుతున్నాయి. అడవిని ఎవరూ అక్రమంగా నరకకూడదనీ జనతన సర్కార్లు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. జనతన సర్కార్ల అనుమతితోనే ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవచ్చునీ పదే పదే ప్రచార క్యాంపెయిన్ల ద్వారా జన చైతన్యం పెంచే కార్యక్రమాలను విప్లవ ప్రజా కమిటీలు చేపడుతున్నాయి. అయినప్పటికీ, యేటా డజన్ల కొద్ది అక్రమ భూకబ్జా కేసులు జనతన సర్కార్ల పరిశీలనకు వస్తూనే ఉన్నాయి. అయితే క్రమంగా వీటిలో తగ్గుదల ఉండడం గమనార్హం.

దోపిడీ ప్రభుత్వ యంత్రాంగం కల్ర తరలించుకపోవడాన్నీ అన్ని విధాలుగా ఉద్యమం అడ్డుకుంటోంది. పారిశ్రామిక అవసరాల కోసం తరతరాలుగా దండక్ అడవుల నుంచీ భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం వెదురు వనాలను నరికి తరలించుకుపోవడం కొనసాగుతోంది. వెదురు వనాలు తిరిగి త్వరితగతిని పెరగడం, వెదురు కూపుల్లో స్థానిక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజానీకం పెద్దెత్తున పాల్గొంటూండడం తదితర ప్రబల కారణాల వల్ల జనతన సర్కార్లు వెదురు వనాల నరికివేతను ప్రస్తుతం అనుమతిస్తున్నాయి.

ఈనాడు దండకారణ్యంలో దొంగ కలప వ్యాపారాన్ని అరికట్టడం జనతన సర్కార్ల శక్తికి మించిన కార్యంగానే కానవస్తోంది. గోదావరి తీరం వెంటా ఆంధ్రప్రదేశ్ అడవులను చాలా వరకు కొల్లగొట్టుకపోయిన బడా కలప మాఫియా గత కొద్ది సంవత్సరాలుగా దండకారణ్యాన్ని తమ వ్యాపారానికి నెలవుగా మలచుకొంటోంది. అలాగే జనతన సర్కార్లు, విప్లవ ప్రజా సంఘాలు బలహీనంగా ఉన్నచోట దొంగ కలప వ్యాపారం జోరుగానే సాగుతోంది. మరోవైపూ మహారాష్ట్ర ప్రభుత్వం తన అటవీ శాఖ ఉద్యోగులకు ఆత్మరక్షణ పేరుతో ఆయుధాలనూ సమకూర్చింది. కానీ నిజానికి ఈ అధికార యంత్రాంగమే నేర

ప్రపంచంతో చేతులు కలిపిందన్న వాస్తవం దాచేసినా దాగని సత్యం. వీళ్లందరి ఆటలు కట్టిస్తూ అక్రమ కలప రవాణాను అడ్డుకోవడం ప్రధానంగా గోదావరి తీరం వెంటా ఒక గడ్డు సమస్యగానే మారింది. నీళ్ల ప్రవాహంతో పాటు కర్ర తరలించడం గోదావరి నుండి సముద్రం వరకూ సాగుతోంది. ఈ దశాబ్ద కాలంలో దాదాపు ఒక అరడజన్ మంది ఘరానా కలప వ్యాపారులను తుదముట్టించినప్పటికీ కలప తరలింపు మాత్రం పూర్తిగా ఆగింది లేదు. కలప వ్యాపారుల డబ్బు ఆశతో ఆ వ్యాపారంలో పావులుగా మారిన స్థానిక ఆదివాసీ రైతులు కలప తరలింపులో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. 2009లో సిరొంచ తాలూకాలో ముగ్గురు అమాయక ఆదివాసీ రైతాంగం అటవీ శాఖ వారి దౌర్జన్యానికి బలై తూటాలతో ప్రాణాలు కోల్పోయారు. ఆదివాసీ రైతాంగంపై అటవీ శాఖ అధికారులు కొనసాగిస్తున్న హంతక దాడులను ఖండిస్తూ పిఎల్‌జిఏ గెరిల్లాలు వారిపై సాయుధ దాడి జరిపి వాళ్ల తుపాకులను (ఎస్ఎల్ఆర్) స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు నేర ప్రపంచం కోసం కర్ర తరలింపుకు కుదిరి అటవీ సంపదల అక్రమ రవాణాలో పావులుగా మారకూడదంటూ విజ్ఞప్తులూ చేస్తున్నారు.

జనతన సర్కార్లు మొక్కల పెంపక కార్యక్రమాలను తరచుగా చేపడుతున్నాయి. ఈ దశాబ్దం తొలినాళ్లలో పాదుకొల్పిన పండ్ల చెట్లు అనేక గ్రామాలలోని ఎదిగే తరాలకు ఇపుడు పండ్లనిస్తున్నాయి. ఈ పరంపర నేటికీ సాగుతూంది. 2009లో జనతన సర్కార్లు దాదాపు పదివేలకు పైగా మొక్కలను నాటాయి. వీటిలో అత్యధికం పండ్ల మొక్కలే. 2010లో అంతకు రెట్టింపుగా మొక్కలను నాటాయి. 2011 వచ్చేసరికి అమరుల జ్ఞాపకాల స్ఫూర్తితో వారి ఆశయాల సాధన ప్రతిజ్ఞలతో ప్రజావీరుల స్మృతి వారంలో పండ్ల మొక్కలను నాటే కార్యక్రమం తీసుకున్నారు. దక్షిణ బస్తర్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభించారు. ఎదిగే మొక్కలను అందులో ప్రజల ఆకలి తీర్చే పండ్ల మొక్కలను ప్రజలు తమ ప్రాణంతో సమానంగా చూసుకుంటారు. కానీ ఖాకీ క్రౌర్యానికీ, జుడుం గూండాల అమానుషానికీ చాలా చోట్లా పండ్ల తోటలు కూడా ధ్వంసమైనాయి. అయినప్పటికీ ప్రజలు విధ్వంసంలో నుంచీ తిరిగి నూతనాలను సృష్టిస్తున్నారు. విధ్వంసం-నిర్మాణం-విధ్వంసం-నిర్మాణం అనే ప్రక్రియ చాలాకాలం కొనసాగితీరుతుందనీ, అంతిమంగానే ప్రత్యామ్నాయ వ్యవస్థ రూపొందుతుందనీ ఆదివాసీలకు జీవితం ఎప్పుడో నేర్పింది. ఇక చివరికే అయినప్పటికీ దండకారణ్యంలో జనతన సర్కార్లు నిర్వర్తిస్తున్న అతి ముఖ్యమైన విభాగాలను తెలుసుకోకుండా ఈ అధ్యాయం పూర్తి కాదు. ఈ అతి ముఖ్యమైన విభాగాలలో ఆర్థికం, వ్యాపారం-లఘు పరిశ్రమలు ఉన్నాయి.

ఆర్థిక విభాగం నిర్వర్తిస్తున్న కార్యక్రమాలు ఈనాడు చాలా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయి. జనతన సర్కార్లు ప్రజల నుంచీ ఎలాంటి పన్నుల వసూళ్లను ఇంకా ప్రారంభించలేదు. దండకారణ్యంలోని కేవలం బస్తర్ (పాత) ప్రాంతంలోనే నాలుగు వందలకు పైగా వారాంతపు సంతలు సాగుతున్నాయి. వీటిలో మూడొంతులకు పైగా ఉద్యమ ప్రాంతాలతో ముడిపడివున్నవే. దాదాపు సగానికి పైగా సంతలు ఉద్యమ

ప్రాంతంలోనే ఉన్నాయనుకోవచ్చు. వీటిలో కనీసం 5వ వంతు సంతలను (80కి పైగా) సల్వాజుడుం ప్రారంభంలో పోలీసులు అతి దౌర్జన్యపూరితంగా మూయించారంటే తిరిగి అవి ఇప్పటి వరకూ యధావిధిగా సాగడం లేదనే అనుకోవాలి. సల్వాజుడుం ప్రారంభం నుంచీ ఈనాటి గ్రీన్ హంట్ సైనిక అణచివేత వరకు చూస్తే గడచిన ఏడేళ్ల కాలంలో పోరాట ప్రాంతాల ప్రజలు సంతలకు స్వేచ్ఛగా వెళ్లలేని స్థితే కొనసాగుతోంది. ఖాకీల దాడుల మూలంగా చాలా ప్రాంతాలలో ప్రజా ఉద్యమ నాయకత్వం సంతలకు వెళ్లడమే మానుకుంది. ఆచరణలో సంతలంటేనే సల్వాజుడుం గూండాలకు, ఎస్‌పిఓలకు, అన్ని రకాల ఖాకీ భద్రతా బలగాలకు నిలయాలుగా మారడంతో అవి విప్లవ ప్రజానీకానికీ నిషిద్ధ క్షేత్రాలయినాయి.

వాస్తవంగా వారంతపు సంతలను ఆదివాసీ ప్రజా జీవితం నుంచి విడదీసి చూడలేం. సంతలు ప్రజా జీవితాలతో అతి సన్నిహితంగా ముడిపడిన కేంద్రాలు. వెయ్యిన్నొక దారాలతో లంకెపడి ఉన్న కేంద్రాలుగా వాటిని చెప్పుకోవచ్చు. చేతిలో డబ్బు ఉన్నా, లేకపోయినా, సంతలో సరకులు కొనేవి ఉన్నా, లేకపోయినా, ఇతర పనులు ఎన్ని ఉన్నా వదలుకొనైనా సంబరంగా సంతకు మైళ్ల కొద్ది దూరం నడిచి వెళ్లే ఆదివాసులు కోకొల్లలు. సంతతో వాళ్లకు అంతటి సంసర్గం ఉంటుంది. అక్కడ ఎక్కడెక్కడి చుట్టపక్కాలో కలుస్తారు. సంతలు వాళ్లకు ఎక్కడెక్కడో వార్తలు అందించే కేంద్రాలు. అవి వాళ్లకు ఎంతో ముచ్చటపడే వినోద వాటికలు. రకరకాల, రంగు రంగుల అలంకార సరకులంటే ఆదివాసులు ఎంతో ముచ్చటపడతారు. జీవితంలో వాళ్లు ఒక కొత్తదనాన్ని ఆస్వాదించే కేంద్రాలవి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సంతల నుంచీ రాజ్యం ప్రజలను హింస, దౌర్జన్యాలతో ఎడబాపుతోంది. ఇలాంటి పరిస్థితులలో విప్లవోద్యమం అన్ని రంగాలలో ఒక నూతన ప్రత్యామ్నాయాన్ని సృష్టించుకుంటున్నట్టే గెరిల్లా బేసులలోని జనతన సర్కార్లు గెరిల్లా స్వభావంతో కూడుకున్న సంతలను గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నాయి. సంతలు



వార సంతల కోసం ఎంత దూరమో! తప్పని తలమోతలు, కాలినడకలు!!

దండకారణ్య ఆదివాసీ ప్రజలకు కేవలం సరకు కొనుగోలు కేంద్రాలే కాదు. అవి వస్తు మారకపు కేంద్రాలు కూడా. ఈనాటికీ ఆదివాసీ ప్రాంతాలలోని సంతలలో ప్రజలు అటవీ ఉత్పత్తుల అమ్మకాలు గణనీయమైన స్థాయిలోనే కొనసాగిస్తున్నారు. వస్తుమార్పిడి పద్ధతి ఇంకా సజీవంగానే ఉంది. కాకపోతే ముప్పయి ఏళ్ల క్రితం లాగా ప్రైవేటు సాహుకార్ల విచ్చలవిడి దోపిడీ వ్యాపారం సాగడంలేదిపుడు.

ఆర్థిక విభాగం తమకు అందుతున్న స్వల్ప నిధులతోనే గృహ వసతి లేని నిరుపేద ప్రజానీకానికి ఇండ్లు కట్టివ్వడం జరుగుతోంది. ఇందులో ప్రజల సామూహిక శ్రమదానం ప్రధానంగా ఉంటుంది. అతి తక్కువ వ్యయంతో ఇళ్ల నిర్మాణం జరిగిపోతోంది. జనతన సర్కార్లు ఉచితంగా పేద రైతులకు అడవి నుంచి ఇంటి కోసం కర్ర తెచ్చుకోవడానికి అనుమతినిస్తాయి. ఈ రకంగా యేటా కనీసంగా 200 ఇండ్లను జనతన సర్కార్లు నిర్మించి ఇస్తున్నాయి. అయితే శ్రమదానంలో పాల్గొన్న ప్రజలకు ఆ పూట భోజనాలు సమకూర్చే ఆదివాసీ సంప్రదాయం చాలా చోట్ల పాటిస్తున్నారు.

విప్లవోద్యమ అవసరాల రీత్యా పార్టీ సేకరిస్తున్న నిధులలో అత్యధిక శాతం యుద్ధ అవసరాలకే వెచ్చించక తప్పడం లేదు. మిగిలిన దాంట్లో బలగాల పోషణ, జైలు-కోర్టులు, ప్రచురణలు తదితర అవసరాలు తీర్చుకోవడమే కష్టంగా ఉన్నప్పటికీ జనతన సర్కార్ల కోసం పది శాతం నిధులను కేటాయిస్తున్నది. సంత కమిటీలు విప్లవ సానుభూతి కలిగిన వ్యాపార వర్గాల నుంచీ తృణమో, ఫణమో అన్న చందంగా నిధులు సేకరించుకుంటున్నాయి. ఇవి పోనూ, నేటికీ విప్లవ ప్రజానీకం, సానుభూతిపరులు స్వచ్ఛందంగా సమకూరుస్తున్న విరాళాలే జనతన సర్కార్ల అవసరాలను తీర్చడంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి.

వ్యాపార, కుటీర పరిశ్రమల శాఖకు చాలా ప్రాముఖ్యత ఉంది. అడవిలో అనేక రకాల గనులు, ఖనిజాలు ఉండడమే గాకుండా ఔషధ విలువలు కలిగిన మొక్కలు, వేర్లు, కంద మూలాలు సహితం పుష్కలమైన ప్రకృతి వనరులున్నాయి. వీటి మీదా ఆధారపడి జనతన సర్కార్లు కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తోడ్పడే పరిశ్రమలతో పాటు ప్రజల మౌలిక అవసరాలను తీర్చగలిగే వాటిని ప్రాథమిక స్థాయిలోనైనా ప్రారంభించడం తప్పనిసరి. కానీ, అడవిలో అడుగడునా సాయుధ పోలీసులు పరచుకొని ఉన్న నేటి విషమ పరిస్థితులలో వీటి స్థాపనకు ఎంతకాలం తీసుకుంటుందో కాలమే చెప్పాలి. మరోవైపు, ప్రపంచ సామ్రాజ్యవాదులు, బహుళ జాతి కార్పొరేషన్లు, భారత దళారీ పెట్టుబడిదారులు వీటిని కొల్లగొట్టుకపోవడానికి గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న విఫల ప్రయత్నాలను ఏరోజు కారోజు మరింత తీవ్రం చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు 'నేటి దండకారణ్యం'లో యుద్ధ స్వరూపాన్ని సంతరించుకున్నాయి. ఈ అంతర్యుద్ధంలో ప్రజలు గెలవడం ద్వారానే వారి అపార ప్రాకృతిక సంపదలన్నీ 'ఈ అడవి మాదే' అంటూ ప్రజలు అనుభవించి తీరుతారు. అదే మనమంతా కోరుకుందాం.

# 6. విప్లవ ప్రజలు - విప్లవ వేడుకలు

## పెంపొందుతున్న విప్లవ సంప్రదాయాలు

మన దేశం భిన్న మతాలకూ, అనేక కులాలకూ, బహు భాషలకూ నిలయం. దేశ ప్రజలు వారు ఏ భాష మాట్లాడేవారైనా, ఏ ప్రాంతంలో నివసించే వారైనా తమ తమ మత సంప్రదాయాలను, కులాచారాలను పాటించడం సహజం. ఇది ప్రపంచ ప్రజలకూ వర్తిస్తుంది. మన దేశ జనాభాలో 8 శాతంగా ఉన్న ఆదివాసీ ప్రజలకూ వరిస్తుంది. దండకారణ్య ఆదివాసీ ప్రజలు విజ్జ పండుం, బుర్రి పండుం (భీముల్, గాదె), కుర్మి (పోర), కొర్తా (నొవ్వ) లాంటి పండుగలు పాటిస్తారు. ఇవి వాళ్ల నిత్య జీవితంలో వాళ్లు చేపట్టే వివిధ పనులతో ముడిపడిన సందర్భాలలో పాటించేవి. ఇవి నేటికీ పాటిస్తూన్నారు. వీటికి తోడుగా వాళ్ల జీవితాల్లోకి నూతన పండుగలు వచ్చి చేరుతున్నాయి. ఈ పండుగలు సార్వజనీనమైనవి. ఈ పండుగలు కుల, మత, ప్రాంత, భాష, లింగ బేదాలు లేనివి. ఇవి విప్లవ వేడుకలు. విప్లవించే ప్రజలు వీటిని తమ పోరాట విజయాలకు, త్యాగాలకు, సంఘటితీకరణకు ప్రతీకగా జరుపుకుంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఎక్కడ, ఎలా పెంపొందుతున్నాయో అక్కడ, అలా ఈ పండుగలను ప్రజలు జరుపుకోవడం అనే కొత్త పరంపర ఉనికిలోకి వస్తూంది. దండకారణ్యంలో అవి జరుగుతున్న తీరు తెన్నులను ఇక్కడ చూద్దాం.

### ఫిబ్రవరి 10 – భూంకాల్ దివస్

బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా దండకారణ్య ఆదివాసీ ప్రజలు అనేక వీరోచిత తిరుగుబాట్లు చేశారు. వాటిలో గేంద్‌సింగ్ నాయకత్వంలో సాగిన 1825 పరాల్‌కోట ఆదివాసీ ప్రజా తిరుగుబాటు, సడ్మెక్ బాబూరావు నాయకత్వంలో కొనసాగిన 1857-58 ప్రజా తిరుగుబాటు, 1910లో గూండాదూర్ నాయకత్వంలో లేచిన ప్రజా తిరుగుబాటు ముఖ్యమైనవి. వీటిలో గేంద్‌సింగ్, సడ్మెక్ బాబూరావులు బ్రిటిష్ వలసవాదుల మరణశిక్షలకు గురికాగా గుండాదూర్ వారికి చిక్కకుండా అదృశ్యమయ్యాడు. ఈ మూడింటిలో 1910 ప్రజా తిరుగుబాటు ఒక విశిష్ట ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ తిరుగుబాటు కాలంలోనే ప్రజలు ఫిబ్రవరి 10 నాడు 'మాడియా రాజ్య స్థాపన'ను ప్రకటించారు. ఇది వారి స్వాతంత్ర్యేచ్ఛను, స్వరాజ్యకాంక్షను, ప్రజల తిరుగుబాటు స్వభావాన్నీ తెలియజేస్తుంది. ఇందులో పర పీడన, పర పాలనను ధిక్కరిస్తూ ప్రజలు తమ స్వంత అధికారాన్ని ప్రకటించుకోవడం అనేది అతి కీలకమైన విషయం. దీనికున్న ప్రాముఖ్యతను విప్లవకారులు అర్థం చేసుకొని 2004 నుంచీ దీనిని పెద్దెత్తున పాటిస్తూన్నారు. వారు దీనిని తాము నిర్మిస్తోన్న జనతన సర్కార్లకు అన్వయించుకొని పాటించడం ఉనికిలోకి వచ్చింది. వారు ఏరియా స్థాయిలో జనతన సర్కార్లను నిర్మించడం 2004 నుంచే ప్రారంభం అయిందన్న విషయం గుర్తు పెట్టుకోవాలి. 1910 ఫిబ్రవరి 10 'మాడియా రాజ్య స్థాపనా దినం'ను వాళ్లు ప్రజా రాజ్య స్థాపనా దినంగా మలచుకున్నారు.



ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్‌కి ఆహ్వానం తెలిపిన 2010 భూంకాల్ సందోహం

జనతన సర్కార్లు ఎలా పటిష్టం అవుతున్నాయో అలా ప్రజా రాజ్య స్థాపనా దినాన్ని పాటించడం పెరుగుతోంది. ఈ సందర్భంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడమే గాకుండా జనతన సర్కార్లను పటిష్టం చేసుకోవడానికి నిర్దిష్ట పిలుపులు ఇస్తూ తగిన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఫిబ్రవరి 10ని ప్రజలు 'భూంకాల్ దివస్'గా వ్యవహరిస్తున్నారు. జనతన సర్కార్లున్న చోట ఫిబ్రవరి 10 నాడు తమ సర్కార్ జండా (ఎర్రజండాపై సారించిన విల్లు, రెండు నక్షత్రాలు)ను ఎగురవేయడం, బహిరంగసభ జరపడం, సర్కార్ కార్యకలాపాలను సమీక్షించడం అమలవుతోంది. ప్రజలు పెద్దెత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 2006లో 'భూంకాల్ దివస్' రోజే నూతనంగా 'కోయ భూంకాల్ మిలీషియా' ఉనికిలోకి వచ్చింది. సల్వాజుడుం దాడుల నుంచీ ఆదివాసీ ప్రజలను కాపాడుకోవడం, తమ ప్రకృతి సంపదలను రక్షించుకోవడం లక్ష్యంతో ఇది ఏర్పడింది. 2007లో సల్వాజుడుంను ఓడించే పిలుపుపై ప్రజా రాజ్య స్థాపనా దినం నడిచింది. 2008లో భారత తొలి స్వాతంత్ర్య సంగ్రామ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసీ ప్రజావీరుల (పడియోర్) స్మృతిలో ఈనాటి సామ్రాజ్యవాదులను ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలనే పిలుపుతో 150 ఏండ్ల ప్రజాస్వామ్య పోరాట వేడుకగా సాగింది. 2009లో విస్థాపన వ్యతిరేక ప్రజా పోరాటాలను నిర్మించాలనే పిలుపుతో ప్రజలు కదిలారు. 2010లో 'వందేళ్ల భూంకాల్' 'గ్రీన్ హంట్ దాడులకు వ్యతిరేకంగా మరో భూంకాల్‌ను సృష్టించండి' పిలుపుతో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జనతన సర్కార్లు ఏరియా స్థాయిలో కార్యశాలలు (వర్క్‌షాపు) నిర్వహించి అన్ని విభాగాల కార్యకలాపాలను సమీక్షించాయి. ప్రజలు

గ్రీన్ హంట్ సైనిక దాడులను ఓడించాలనే విప్లవ ప్రతిజ్ఞలు చేశారు. వేలాది మంది ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు జగ్దల్‌పూర్‌లో భారీ బహిరంగసభను జరుపుకొని గుండాదూర్ పోరాట సాంప్రదాయాన్ని స్మరించుకున్నారు. 2011లో 'మూడు దశాబ్దాల దండకారణ్య విప్లవ విజయాలను కాపాడుకుందాం' 'భూమి చదను ప్రజా క్యాంపెయిన్‌ను జయప్రదం చేద్దాం' అనే పిలుపును దండకారణ్య జనతన సర్కార్ తయారీ కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ కోసా ఇచ్చాడు. కామ్రేడ్ ఆజాద్ (చెరుకూరి రాజకుమార్) స్మృతిలో కూడా స్థూపాలు నిర్మించాలనే కార్యక్రమం తీసుకున్నారు.

'ప్రజా రాజ్య స్థాపనా' దినానికి వీలైన సందర్భాలలో విప్లవ మేధావులను, మీడియా పర్సన్స్‌ను, రచయితలను, కళాకారులను, చిత్ర నిర్మాతలను జనతన సర్కార్లు ఆహ్వానిస్తున్నాయి. 2004లో జరిపిన తొలి భూంకాల్ దినానికి బిబిసి వరల్డ్ సర్వీస్‌కు చెందినవాళ్లు, సహారా టివికి చెందిన రుచిర్‌గర్గ్ వచ్చాడు. 2010లో రచయిత్రి అరుంధతీ రాయ్ వచ్చింది. ప్రతి యేటా ఏదో ఒక డివిజన్‌కు మీడియా పర్సన్స్‌ను ఆహ్వానిస్తున్నారు. జనతన సర్కార్ల కార్యక్రమాలను వాళ్లు ప్రజల ముందుంచుతున్నారు. 2010లో జరిగిన వందేళ్ల వేడుకలకు కుతుల్ (మాడ్ ప్రాంతం)లో ఐదువేల మంది, కుదురులో ఐదువేల మంది, మవులిపదర్ కేంద్రంగా జరిగిన నేతనార్ (గుండాదూర్ స్వస్థలం) సహా అనేక గ్రామాల ప్రజలు ఆరువేల మంది విప్లవోత్సాహంతో పాల్గొన్నారు. ఈ సభకు అమరుడు గూండాదూర్ మునిమనమడు 55 ఏళ్ల జోగీదూర్ కూడా తమ తాతల నాటి పోరాటస్ఫూర్తితో హాజరయ్యాడు. ఇవి కాకుండా దండకారణ్యవ్యాప్తంగా వందలాది మంది ప్రజలతో జరిగిన సభలు దాదాపు డజనుకు పైగా ఉన్నాయి. జనతన సర్కార్లు నిర్వహిస్తోన్న 'భూంకాల్ దివస్' ప్రభావం ఎంతగా ఉందంటే 2007 నుంచీ ప్రభుత్వం వరుసగా అదీ భూంకాల్ దినాన్ని మొక్కుబడిగానైనా పాటించాల్సి వస్తోంది. మరోవైపు వివిధ ఆదివాసీ సమూహాలకు చెందినవాళ్లు కూడా యేటా జగ్దల్‌పూర్‌లో వేలసంఖ్యలో జమవుతూ ఫిబ్రవరి 10ని పాటించడం ఒక పోరాట ఆనవాయితీగా ముందుకు వచ్చింది. జగ్దల్‌పూర్ వేడుకలకు బస్తర్ రాజు అమరుడు ప్రవీర్ చంద్ర భాంజదేవ్ సంతతికి చెందిన రాజ కుటుంబీకులు కూడా హాజరవుతున్నారు. 2010 భూంకాల్ దివస్‌కు 25 వేలమంది ప్రజలు తమ పూర్వీకుల 'పడియోర' (పోరాటవీరులు) స్ఫూర్తితో హాజరవ్వడం ఆదివాసీల పోరాట చేవను చాటుతుంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కూడా కొన్ని ఆదివాసీ సంఘాలు శ్రద్ధాసక్తులతో ఈ దినాన్ని పాటిస్తున్నాయి. చంద్రపూర్ జిల్లా బల్లార్షాలో విదర్భ ఆదివాసీ విద్యార్థులు సమైక్యమై 2010లో భూంకాల్ దివస్ జరిపారు. 2011లో దాదాపు 5 లక్షలకు పైగా పనిదినాలతో జయప్రదమైన భూమి చదను క్యాంపెయిన్ భూంకాల్ దివస్ రోజు నుంచీ 18 రోజులు సాగి వ్యవసాయ రంగంలో నూతన మార్పులకు ఆహ్వానం పలికింది. అనేక చోట్ల వేల సంఖ్యలో ప్రజలు భూంకాల్ సభలకు హాజరై దండకారణ్యంలో దాదాపు 10 చోట్ల అమరుడు చెరుకూరి రాజకుమార్ స్మృతిలో నిర్మించుకున్న స్థూపాలను ఆవిష్కరించుకున్నారు. ఇది తమ ప్రభుత్వ దినంగా దండకారణ్య ఆదివాసీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతోందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

## మార్చి 8 – అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం

దండకారణ్యంలోని విప్లవ మహిళలకు, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ కార్యకర్తలకు 8 మార్చి ఎంతో ప్రియమైన రోజు. 8 మార్చి అంటే 'మహిళా దివస్' అని దండకారణ్యంలో తెలియని ఊరు బహుశ లేదేమో! ఈ పదేళ్లలో జరుపుకున్న 8 మార్చి వేడుకలలో ఏదో ఒక సందర్భంలో పాల్గొనని మహిళలు ఏ ఊళ్లోనూ ఉండరేమోననడం ఏమాత్రం అతిశయోక్తి కాకపోవచ్చు. 8 మార్చి వచ్చిందంటేనే కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, సందేశాలతో ప్రచార హోరు ఊపందుకుంటోంది. దాదాపు లక్షకు పైగా సంఖ్యలో సంఘటితమైన క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ కార్యకర్తలు ఈ సందర్భంగా తమ సంఘటన్ ఇచ్చిన పిలుపును ఎక్కడికక్కడే ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వివిధ రూపాల్లో కృషి చేస్తుంటారు. ఎప్పటికప్పుడు ఆయా పరిస్థితుల ప్రత్యేకతను, ప్రాముఖ్యతను బట్టి 8 మార్చి పిలుపులను కేఏఎంఎస్ ఇస్తుంది. 2009లో తమ నాయకురాలైన కామ్రేడ్ అనురాధ గాంధీ స్మృతిలో 8 మార్చిను జరుపుకున్నారు. 'వందలు, వేలసంఖ్యలో ఆమెకు నిజమైన వారసురాళ్లను తయారు చేయండి' పిలుపును కేఏఎంఎస్ ఉత్సాహంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. 2010లో 'వందేళ్ల అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం'గా వేడుకలను ఘనంగా జరపండి అనే పిలుపును కేఏఎంఎస్ దండకారణ్యవ్యాప్తంగా తీసుకెళ్లింది.



మార్చి 8 వందేళ్ల వారసత్వంలో పోరు మహిళలు


'రాజ్యం' ఎంత తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఒక విప్లవ సంకల్ప దినంగా 8 మార్చిను ప్రజలు జరుపుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా మహిళలే పాల్గొంటున్నప్పటికీ పురుషుల భాగస్వామ్యం తక్కువేం ఉండడం లేదు. లైంగిక దోపిడీ, వివక్ష, అణచివేతలను మహిళలే దూరం చేసుకోవాలనో, అది మహిళల దినం, దాన్ని మహిళలే జరుపుకోవాలనో లేదిక్కడ. విప్లవోద్యమంలో పాల్గొంటున్న ప్రజలందరూ స్త్రీలు-పురుషులు కలసే ఉత్సాహంగా, పట్టుదలతో 8 మార్చిను జరుపుకుంటున్నారు. తమ మహిళా నాయకురాలు ఝార్ఖండ్ 'నారీ ముక్తి సంఘటన్' నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ శోభాదీ, కెఎఎంఎస్ నాయకురాలు కామ్రేడ్ నిర్మలక్కలను పోలీసులు అరెస్టు చేసి యేండ్ల తరబడిగా జైల్లోపెట్టి చిత్రహింసలు పెడుతూ వేధించడాన్ని వ్యతిరేకిస్తూ వారి విడుదలకై కెఎఎంఎస్ ఒక ప్రత్యేక క్యాంపెయిన్‌గా సంతకాల సేకరణను 2008లో చేపట్టింది. సల్వాజుడుంను ఓడించండి, గ్రీన్ హంట్ దాడులకు వ్యతిరేకంగా పోరాడండి అంటూ కెఎఎంఎస్ 8 మార్చి సందర్భంగా 2006లో, 2010లో ప్రజలను కోరింది.

2010లో 8 మార్చిను ప్రజలు పెద్దెత్తున జరుపుకున్నారు. పోలీసులు కార్పెట్ సెక్యూరిటీని భారీగా అమలు చేస్తున్నప్పటికీ, 3-5 కి.మీ.ల పరిధిలో కనీసం వందమందికి తగ్గకుండా పోలీసు, అర్ధసైనిక బలగాలతో అడవిలో అనేక గ్రామాలను బంధిస్తూ కొత్త కొత్త పోలీసు శిబిరాలు వెలిసినప్పటికీ గ్రీన్ హంట్ వాతావరణంలోనే 8 మార్చి జరిగింది. పశ్చిమ బస్తర్ డివిజన్‌లో గంగలూరు ప్రాంతంలో చిన్న చిన్న ఆదివాసీ పల్లెల మధ్య 16వేల మందితో 8 మార్చిను జరుపుకున్నారు. ఈ వేడుకకు దాదాపు 4 వేల మంది ప్రజా మిలీషియా కార్యకర్తలు కళ్లల్లో వత్తులు వేసుకొని 24 గంటలూ రక్షణ బాధ్యతల్లో నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగా గత నాలుగు దశాబ్దాల నక్సల్బరి వారసత్వ ఉద్యమంలో పాలుపంచుకుంటూ తమ నులివెచ్చని నెత్తుర్లను ధారపోసిన వందలాది విప్లవ మహిళల స్మృతిలో నిర్మించుకున్న నిర్మించుకున్న 40 అడుగుల ఎత్తైన స్థూపాన్ని దౌడాయి అమరులలో ఒకరైన కామ్రేడ్ పూనెం కరుణ తల్లి ఆవిష్కరించింది. గ్రీన్ హంట్ దాడుల మధ్య ఆ స్థూప నిర్మాణం జయప్రదంగా పూర్తి కావడం ఆ ప్రాంత ప్రజల అంకితభావానికి నిదర్శనం. ఇదే సంవత్సరం ఇతర చోట్ల జరిగిన 8 మార్చి వేడుకలకు కూడా ప్రజలు పెద్దెత్తున హాజరయ్యారు. దక్షిణ గడ్చిరోలి గుండుర్‌వాహిలో ఐదు వందలు, మాడ్‌లోని డోంగ్రివేడలో ఐదు వందలు, కుతుల్‌లో వెయ్యిమంది, ఇంద్రావతి ఏరియాలోని గోట్‌లో 1200 మంది 8 మార్చి వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 2009లో 'సోనా పుంగారి' (బంగారమ్మ కథ) కోయ పుస్తకాన్ని 2010 మార్చి 8 వేడుకల సందర్భంగా 'దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర' (1980-2009) పుస్తకాన్నీ, ఆవిష్కరించారు. 2009లోనే కామ్రేడ్ అనురాధ గాంధీ స్మృతిలో ఆమె ఫోటోతో కూడిన కేలండర్‌ను విడుదల చేశారు. 2010 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం వేడుకల సందర్భంగా క్లారా జట్కిన్ పేరును ఆదివాసీ మహిళలు తమదైన యాసలో ఉచ్చరిస్తూ కంఠస్థం చేసి ఆ ప్రపంచ శ్రామికవర్గ నాయకురాలి పట్ల తమ గౌరవాన్ని చాటుకోవడమే కాదు ఆమెకు నిజమైన వారసులు ప్రజా ఉద్యమాలలో నుంచే ఉబికుబికి వస్తునారన్న వాస్తవాన్ని ముందుకు తెచ్చారు. 2011లో మళ్లీ పెద్ద సభ

పశ్చిమ బస్తర్‌లోనే 10 వేల మంది స్త్రీ-పురుషులతో నేషనల్ పార్క్ ఏరియాలో జరిగింది. దర్బా డివిజన్‌లోని మలింగేర్‌లో 1800 మందితో, దక్షిణ బస్తర్‌లోని జేగురుగుండా ప్రాంతంలో 6063 మంది, కిష్టారం ప్రాంతంలో 1825 మందితో, కుంట ప్రాంతంలో 609 మందితో, పామేడ్ ఏరియాలో 2305 మందితో మార్చ్ 8 సభలు జరిగాయి. జేగురుగుండాలో పాల్గొన్న 6063 మందిలో స్త్రీలు 3032 మంది హాజర్ కాగా పురుషులు 3031 మంది హాజరయ్యారు. కాకతాళీయంగానే అయినప్పటికీ స్త్రీ-పురుషులు మార్చ్ 8 సభకు సమానంగా హాజరవ్వడం గమనార్హం.

## జులై 28 – అమరవీరుల సంస్మరణ దినం

దాదాపు గత రెండు దశాబ్దాలకు పైగా దండకారణ్యంలో జులై 28ని అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) సంస్థాపక నాయకుడైన కామ్రేడ్ చారు మజుందార్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు జులై 28 నాడు హత్య చేశారు. ఆ నాయకుని అమరస్మృతిలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) భారత విప్లవోద్యమంలో అసువులు బాస్తున్న తమ ప్రియమైన సహచరుల స్మృతి దినంగా యేటా జులై 28ని పాటించాలని 1989లో పిలుపు నిచ్చింది. ఆ తర్వాత 2004 సెప్టెంబర్ 21 నాడు మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్), మునుపటి అఖిల భారత మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్లు ఒకే పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా విలీనమయ్యాయి. ఆ పార్టీ తమ సంస్థాపక నాయకులైన కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీల స్మృతిలో జులై 28ని అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలనీ నిర్ణయించింది. పోలీసులు అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధ పరిస్థితులలో జులై 28 నాడు అమరుల దినాన్ని అంతటా జరుపుకోలేకపోతూండడంతో జులై 28 నుంచీ ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణవారం పాటించడం ఆ పార్టీ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ 1995లో ఇచ్చిన పిలుపును అనుసరించి గత 15 యేండ్లుగా అమలవుతోంది. జులై 28 మిగతా అన్ని దినాల కన్నా అధికంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.



తమ కోసం అసువులు బాసిన పోరు బిడ్డల స్మృతిలో ప్రజలు నిర్మించుకున్న సాంప్రదాయ స్మారక స్థూపం

జులై 28 నుంచీ ఆగస్టు 3 వరకు దండకారణ్యవ్యాప్తంగా పోలీసులు చాలా అలర్ట్‌గా ఉంటారు. ఈ వారం ఉద్యమ అమర సహచరులను సంస్మరించుకునే సందర్భంలో ఎక్కడ ఏ దాడి జరుగుతుందోననే వార్తలు సృష్టించి నగరాలు, పట్టణాలు అంతటా 'రెడ్ అలర్ట్'ను పోలీసులు ప్రకటిస్తున్నారు. రైళ్లు నిలిపివేస్తున్నారు. రోడ్లపై వాహనాలను నియంత్రిస్తున్నారు. గస్తీని పెంచుతున్నారు. ఈ పోలీసు వార్తలను సమర్థిస్తూ మీడియా వారం రోజుల 'మావోయిస్టుల బంద్' అంటూ ఎడతెరపి లేకుండా అసత్య ప్రచారాన్ని లంఖించుకుంటోంది.

జులై 28 వచ్చిందంటేనే అమరుల సంస్మరణలో ప్రజలు స్థూపాలు నిర్మిస్తూంటారు. పాత స్థూపాలను ఎర్రరంగుతో అలంకరిస్తూంటారు. పోలీసులు కూల్చిన స్థూపాలను ప్రజలు తిరిగి మరమ్మత్తు చేస్తారు. స్థూపాల నిర్మాణ పనులలో ప్రజలు పెద్దెత్తున స్వచ్ఛందంగా పాల్గొంటారు. జనతన సర్కార్లు ఉనికిలోకి వచ్చిన గ్రామాల్లో స్థూపాల నిర్మాణం, రక్షణ, మరమ్మత్తులు, అలంకరణల బాధ్యత జనతన సర్కార్లదే అయింది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరుగుతోంది. ఇవి లేనిచోట విప్లవ ప్రజా సంఘాలు ఆ బాధ్యతను నిర్వర్తిస్తూన్నాయి. దండకారణ్యంలో వందల సంఖ్యలోనే అమరవీరుల స్థూపాలున్నాయి. 2010 జులైలో అసువులుబాసిన కామ్రేడ్ ఆజాద్ స్థూపాన్ని గార్ప (మాడ్‌లో) గ్రామంలో మొదట నిర్మించుకున్నారు.

జులై మాసం వచ్చిందంటే వర్షాకాలం వచ్చేస్తుంది. భారీ వర్షాలతో నదులు, వాగులు పొంగుతూంటాయి. రైతులకు వ్యవసాయ పనులు చేతి నిండా ఉంటాయి. అయినప్పటికీ ప్రతి ఊళ్లో ప్రజలు జులై 28 నుంచీ ఆగస్టు 3 మధ్య ఏదో ఒక రోజున అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటించడం తప్పకుండా జరుగుతోంది. అది ఒక విప్లవ సంప్రదాయంగా మారింది. ఆ రోజు ఊరి జనాలందరూ స్త్రీలు, పురుషులు; పిల్లలూ, పెద్దలూ ఉదయాన్నే స్థూపం వద్దకు చేరుకుంటారు. స్థూపం వద్ద బారులు తీరి నిలబడి తమకు తెల్సిన అమరులను తలచుకుంటారు. వారి స్మృతిలో రెండు నిముషాలు మౌనం పాటించి వారి ఆశయాలను కొనసాగించి తీరుతామని ప్రతిజ్ఞలు చేస్తారు. తమకు తెలిసిన అమరవీరులను పేరు పేరునా తలచుకుంటూ వారికి జోహార్లు తెలుపుతూ, లాల్‌సలాం అంటూ అడవులు, కొండలు ప్రతిధ్వనించేలా నినదిస్తూంటారు. అవకాశం ఉన్న అమరవీరుల కుటుంబాల వారిని ప్రత్యేకంగా వేదికపైకి ఆహ్వానించి వారి బిడ్డల స్మృతులను వారు చెబుతూంటే ప్రజలు శ్రద్ధగా వింటూంటారు. ప్రజా సంఘాల నాయకులు, జనతన సర్కార్ నాయకులు, పార్టీ నాయకులు ఇచ్చే సందేశాలను, పిలుపులను శ్రద్ధగా ఆలకిస్తారు. పార్టీ వైపు నుంచీ అమరవీరుల చరిత్రలను తెలియజేసే సాహిత్యం, వారి ఫోటోలు వెలువడుతాయి. సాంస్కృతిక కార్యకర్తలు తమ ఆట, పాటలతో అమరవీరుల జ్ఞాపకాలను తెలుపుతూ వారి ఆదర్శాలను ఎత్తిపడుతూ ప్రజలకు విప్లవ సందేశాన్నిస్తారు. ఇప్పటి వరకు ఉద్యమం వెలువరించిన విప్లవ సాహిత్యంలో అమరవీరులపై వచ్చినంతగా ఇంకే విషయంపైనా బహుశా రాలేదేమో! అందులోనూ

పాటలు, కవిత్వాలు మొదటి శ్రేణిలో నిలుస్తాయి. జీవితమే యుద్ధమైన చోట, బ్రతుకే పోరాటమైన చోట, అడుగడుగునా మృత్యువును ధిక్కరిస్తూ పోరాడిన జ్ఞాపకాల కన్నా మిన్నగా, మరేం ఉంటాయి! కడుపుతీపి కన్నా మిన్నగా మనుషుల మధ్య పోరాటానుబంధాలు పెనవేసుకున్నపుడు అవి కాకుండా చెప్పుకునే ఊసులు, చేసుకునే బాసలు మరేం ఉంటాయి?

జులై అమరవీరుల సంస్మరణ సభలలో మొత్తం దండకారణ్యంలో యేటా కనీసంగా మూడు లక్షలకు పైగా ప్రజలు పాల్గొని 'అమరవీరులకు జోహార్లు, వారి ఆశయాలను తుది వరకూ కొనసాగిస్తాం' అంటూ నినదిస్తున్నారనీ ఇది ఇంకా, ఇంకా విస్తరిస్తుందనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్‌సింగ్, చిదంబరంల ముఠా దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా చెప్తుతున్న వారి జ్ఞాపకాలతో ఊరూరా ప్రజలు 'అమరవీరులకు జోహార్లు', 'విప్లవం వర్ధిల్లాలి' అంటూ గొంతెత్తి నినదించే ఈ ఆదివాసీ విప్లవ ప్రజానీకం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నిర్మిస్తున్న విప్లవోద్యమం నుంచీ విడదీయరాని భాగం అయ్యారు. ఇది మరవవద్దు.

## డిసెంబర్ 2 – ప్రజా విముక్తి గెరిల్లా సేన స్థాపనా దినం

2000 డిసెంబర్ 2 నాడు మునుపటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో ప్రజా గెరిల్లా సైన్యం, 2003 ఏప్రిల్ 22 నాడు మునుపటి అఖిల భారత మావోయిస్టు కమ్యూనిస్టు కేంద్రం నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడ్డాయి. ఇవి రెండూ ఆయా పార్టీల విలీనంతో 2004 సెప్టెంబర్ 21 నాడు విలీనమై ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం నూతనంగా ఉనికిలోకి వచ్చింది. భారతదేశ విప్లవోద్యమంలో విప్లవ సైన్యాలు ఏర్పడడం ప్రజాయుద్ధ నిర్వహణలో అత్యంత కీలకమైన ఘట్టం. ఈ సైన్యాలు ఏర్పడినప్పటి నుంచీ ప్రజాయుద్ధ చర్యలలో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ సైన్యం భారత పీడిత ప్రజల చేతిలో ఒక గొప్ప ఆయుధంగా నిల్చి ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తోంది. 'ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఉండేదేమీ లేదు' అన్న మావోయిస్టు విప్లవ సిద్ధాంత స్ఫూర్తితో ఏర్పడిన సైన్యాన్ని ప్రజలు రోజు రోజుకు మరింత తమదిగా చేసుకుంటున్నారు.

తరతరాలుగా దోపిడీ ప్రభుత్వ అణచివేత విధానాలతో విసిగి వేసారిపోయిన పీడిత ప్రజల పక్షాన నిల్చి దోపిడీ వర్గాల కిరాయి సైన్యాలతో దృఢంగా పోరాడుతున్న పిఎల్‌జిఏ స్థాపనా దినాన్ని ప్రజలు ప్రతి సంవత్సరం ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఈ సైనిక సంప్రదాయం 2001 నుంచీ కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర మిలటరీ కమీషన్ తన బలగాలకు అది చేపట్టాల్సిన కర్తవ్యాలను తెలియజేస్తూ ఇస్తున్న సాధారణ పిలుపులకు లోబడి దండకారణ్య ప్రత్యేక జోన్ సైనిక కమీషన్ నిర్దిష్టంగా తన బలగాలకు పిలుపు నిస్తోంది. ఇప్పటి వరకూ ప్రతి సంవత్సరం పిఎల్‌జిఏ స్థాపనా దినాన్ని పురస్కరించుకొని సైన్యంలోకి నూతన భర్తీ అభియాన్‌ను



అత్యంత ఉత్సాహభరితంగా సాగిన పదేళ్ల పిఎల్‌జిఏ వేడుకలు

చేపట్టడం ఒక విప్లవ సాంప్రదాయంగా కొనసాగుతూ మంచి ఫలితాలను ఇస్తోంది. గ్రామీణ విప్లవ ప్రజా నిర్మాణాలలో సంఘటితమవుతున్న యువత తమలో పెంపొందుతున్న రాజకీయ, నిర్మాణ, పోరాట చైతన్యం ఫలితంగా భర్తీ పిలుపునందుకొని గెరిల్లా సేనలోకి ప్రతి యేటా వందల సంఖ్యలో పూర్తి కాలం సైనికులుగా భర్తీ అవుతున్నారు.

పిఎల్‌జిఏ స్థాపనా దినాన్ని డిసెంబర్ 8 వరకు వారంగా మలచుకొని పాటిస్తున్నారు. గెరిల్లా సైనికులు తమ సైనిక పతాకాన్ని చేతబూని ఆ వారం రోజుల్లో ఫ్లాగ్ మార్చ్‌లు చేయడం, తమ సైనిక జండాను ఎగురవేసి గౌరవ వందనం చేయడం, కమీషన్ ద్వారా అందిన సందేశాన్ని బహిరంగంగా చదివి విన్పించడం, బహిరంగసభలు, ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతోంది. వారం రోజుల్లో పరిస్థితులను బట్టి కొద్ది రోజులు శత్రువుపై దాడులకు కూడా పూనుకుంటున్నారు. కానీ పోలీసులు, మీడియా కలసి పిఎల్‌జిఏ స్థాపనా వారాన్ని కూడా బంద్‌గానే ప్రచారం చేయడం మామూలైంది. ఈ సందర్భంగా ఎలాంటి బంద్ కార్యక్రమాలు లేవనీ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనీ పిఎల్‌జిఏ ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ శక్తివంతమైన బూర్జువా మీడియా పోలీసుల మాయా ప్రకటనలతో ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను తప్పు

తోవ పట్టిస్తోంది. 2010లో నెల రోజుల ఉత్సవ వేడుకల సందర్భంగా 'మహా బంద్' అమలులో ఉంటూందనీ మతిలేని ప్రకటనలను పోలీసులు సృష్టించారు. 2 డిసెంబర్ 2010 నాడు ఉదయం పార్టీ అధికార ప్రతినిధి గుడ్సా ఊసండి బిబిసికి విడుదల చేసిన ప్రకటనను చూసినవారికి అసలు వాస్తవం స్పష్టంగా బోధపడుతోంది. ఇక్కడి విప్లవ ప్రజల కార్యకలాపాలను గమనించిన వారికి ఎవరికైనా ఈ వాస్తవం సులువుగానే బోధపడుతుంది.

దండకారణ్య విప్లవోద్యమంలో పాలు పంచుకుంటున్న లక్షలాది  మంది ప్రజలు ప్రధానంగా పైన పేర్కొన్న విప్లవ వేడుకలను పాటించడం ఒక నూతన పోరాట సంప్రదాయంగా పెంపొందుతోంది. పై వాటితో పాటుగా మేడే - అంతర్జాతీయ శ్రామిక దినం, మార్చి-23, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి, సెప్టెంబర్ 21 - భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావ దినం, అక్టోబర్ 1 చైనా విప్లవ వార్షికోత్సవ దినం, నవంబర్ 8 రష్యా విప్లవ వార్షికోత్సవ దినం కూడా ప్రజలు పాటిస్తున్నారు. ఇవి కాకుండా బూర్జువా ప్రభుత్వాలు పాటించే జనవరి 26, ఆగస్టు 15లను దండకారణ్య విప్లవ ప్రజానీకం నిరసన దినాలుగా పాటించడం కూడా నేర్చుకున్నారు. అలాగే జూన్ 26 దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన దినాన్ని అత్యంత అప్రజాస్వామిక దినంగా, డిసెంబర్ 6 బాబ్రీమసీదును కూల్చిన దినాన్నీ మైనార్టీ మత ప్రజలపై హిందూ చావనిస్టుల దాడి దినంగా నిరసిస్తూ నల్లజండాలు ఎగురవేడం ద్వారా దండకారణ్య ఆదివాసీ ప్రజలు వారు ప్రజాస్వామ్యం పక్షం, న్యాయం పక్షం నిలుస్తామనీ స్పష్టంగా చాటుతున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో పుట్టి పెరుగుతున్న వర్తమాన, భవిష్యత్ తరాలకు తమ ఆదివాసీ సంప్రదాయాల కన్నా ఎక్కువగా విప్లవ సంప్రదాయాలే తెలుసుననడం ఏమాత్రం తప్పు గాదు. నేటి దండకారణ్యంలో ఇది పెరుగుతున్న ధోరణి. ఇది హర్షించతగింది. అభినందించతగినది.

# 7. నూతన సంస్కృతికి పునాది ప్రజా సంస్కృతి

ఒక ప్రాంతంలోని ప్రజల సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే ఆ ప్రాంతంలోని ప్రజల ఆర్థిక విధానాన్ని ముందు అర్థం చేసుకోవాలి. ప్రజల ఆర్థిక విధానాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రజల ఉత్పత్తి విధానాన్నీ, ఉత్పత్తి సంబంధాలనూ (ఉత్పత్తిలో పాల్గొంటున్న ప్రజల మధ్య సంబంధాలు) తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. వీటిని మార్క్సిస్టు పరిభాషలో పునాదిగా వ్యవహరిస్తారు. ఈ పునాదిపై ఆధారపడే ఉపరితలం ఉంటుంది. ప్రజల సాంస్కృతిక జీవనాన్ని ఉపరితలంగా పరిగణిస్తారు. సాంస్కృతిక జీవనం ఆర్థిక జీవనంపై ఆధారపడే ఉంటుంది. ఆర్థిక జీవనంలోని మార్పులు సాంస్కృతిక జీవనంపై త్వరగానో, ఆలస్యంగానో తప్పనిసరి ప్రతిబింబిస్తాయి. సాంస్కృతిక జీవనంలో ద్యోతకమయ్యే మార్పులు ఆర్థిక జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది పునాది, ఉపరితలాల మధ్య ఉండే కార్యాకారణ సంబంధం అవుతుంది. ప్రజల ఆర్థిక జీవనంలో చోటు చేసుకునే అభివృద్ధి వారి సాంస్కృతిక జీవనంలో వ్యక్తం అవుతుంది. సాంస్కృతిక జీవనం అన్నప్పుడు ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలీ, భాష, ఆలోచనా సరళీ, సాహిత్యం, కళలు, పండుగలు, పబ్బాలు, దినకర్మలు, పెళ్లిళ్లు తదితర అన్ని విషయాలూ అందులోకే వస్తాయి. ఈ అవగాహన వెలుగులోనే ఇక్కడి సాంస్కృతిక జీవనంలో వస్తున్న మార్పులను తెలుసుకుందాం.

దండకారణ్యం మెజార్టీ ఆదివాసులతో కూడుకున్న విశాల అటవీ ప్రాంతం. దోపిడీ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఇక్కడి ఆదివాసులలో అక్షరాస్యత శాతం చాలా స్వల్పంగా ఉంది. ఇక్కడి వ్యవసాయం వెనుకబడిన పద్ధతులలో సాగుతోంది. ఇక్కడ కొన్ని ప్రాంతాలలో ప్రధానంగా, మరికొన్ని ప్రాంతాలలో అక్కడక్కడ నేటికీ పోడు వ్యవసాయం, చిరు ధాన్యాలు పండించడం కనబడుతుంది. వ్యవసాయానికి ప్రభుత్వాలు సాగు నీటి వ్యవస్థను కల్పించడంలో పూర్తిగా విఫలమైనాయి. ప్రజల ఆరోగ్యం విషయంలో దోపిడీ ప్రభుత్వాలు ఎలాంటి శ్రద్ధ పెట్టడం లేదు. పోషక పదార్థాల లోపంతో పిల్లలు, పెద్దలు జబ్బుల బారిన పడుతుంటారు. ఆదివాసీ ప్రజలు మాంసప్రియులు. యేడాదిలో లెక్కించతగిన సమయాన్నే వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసమే ఖర్చు చేస్తారు.

గ్రామంలో ఆదివాసీ తెగ పెద్దల మాటే వేదవాక్కుగా అమలు కావాలి. వారి కోరిక మేరకు గ్రామస్థులు తమ శ్రమశక్తినీ ఉచితంగానే వెచ్చించాలి. తరతరాల సంప్రదాయలకు లోబడి వెట్టిచాకిరి చేసి పెట్టాలి. ఎలాంటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం లేకుండా యాంత్రికంగా మనిషి జీవించాలి. మనిషి జీవితం, జీవన కార్యకలాపాలన్నీ నిర్ణీత సంప్రదాయ చట్రంలోనే సాగాలి. ఆడపిల్లల పెళ్లిళ్లు చాలా వరకు పెద్దల ప్రమేయంతోనే, వారి అంగీకారంతోనే జరగాలి. మేనరికం, ఇల్లరికం ఏదైనా ఆదివాసీ సంప్రదాయ వివాహ బంధానికి లోబడే జరగాలి. వివాహపూర్వ సంబంధాలు నిషేధం కావు. మహిళలవివాహేతర సంబంధాలను చాలా తీవ్రనేరంగా పరిగణిస్తారు. వాటితో (కొన్నిచోట్ల) నిర్దాక్షిణ్యంగానే వ్యవహరిస్తారు. ప్రాంతాలలో



విప్లవోద్యమంలో వెల్లివిరుస్తున్న ప్రజా సంస్కృతి

గోటుల్ (గ్రామ రాజకీయ, సాంస్కృతిక వేదిక)లో సెక్స్ సంబంధాలు అవశేషాలుగానే నేటికీ మిగిలి ఉన్నాయి. ఇలాంటి చోట పురుషులు అందంగా అలంకరించుకోవడం అగుపడుతుంది. ముచ్చటగా జడ అల్లుకోవడం చెవులకు రింగులు వేసుకోవడం, తలలో దువ్వెన దోపుకోవడం, మెడలో రంగు రంగుల పూసల పేర్లు ధరించడం, జడలో నెమలి ఈకలు పెట్టుకోవడం లాంటివన్నీ పురుషుల అలంకరణలో భాగం. తమ తెగ జీవితానికి చిహ్నంగా ఆడపిల్లలు పచ్చబొట్లు వేయించుకోవడం, పురుషులు కూడా పరిమితంగా వేయించుకోవడం ఉంది. వివాహిత స్త్రీలు అర్ధనగ్నంగా ఉండడం వారు గృహిణులు అనే విషయాన్ని తెలపడానికే అంటారు. వారు తమ ఛాతిపై నుంచీ గుడ్డలు (రవిక) తొలగించుకోకపోతే పురుషులు కొన్ని చోట్ల నిర్దాక్షిణ్యంగా తొలగిస్తారు. అడవిలో ఎక్కడ చూసినా గతంలో చెట్లపై యోని ఆకారంలో చెక్కి ఉండడం సెక్స్ కార్యకలాపాల పట్ల వారి మక్కువను తెలియచేస్తుంది. వారం-వారం సంతలకు వెళ్లడం, కోళ్ల పందాలు ఆడడం, మధ్యపానం, నృత్యం వారి వినోదంలో భాగం. స్త్రీ-పురుషులు చిన్న-పెద్ద తమలో తాము 'రా' అంటూ సంబోధించుకోవడం అతి సహజం. కాని ఇప్పుడు వారి భాషలోనూ మార్పులు స్పష్టంగా వ్యక్తమవుతున్నాయి. పరభాష పదాలను తమ భాషలో కలపుకోవడం వేగంగా పెరుగుతోంది. ఈ మార్పులన్నీ సాంస్కృతిక స్థాయిని ప్రతిబింబిస్తోన్నాయి.

విప్లవోద్యమం ప్రారంభం నుంచీ 20వ శతాబ్దం చివరి వరకూ దాదాపు రెండు దశాబ్దాల కాలం పైన చెప్పిన అనేక విషయాలలో మార్పుకు కృషి జరిగింది. ఇందులో విప్లవోద్యమం చేపట్టిన కృషి, ప్రగతిశీల మార్పులకు దారులు వేస్తూంటే ఆదివాసీ సమాజంతో పెరుగుతున్న మార్కెట్ సంబంధాలు, చాలా వరకు వాటికి ఆటంకంగా ముందుకొచ్చాయి. వీటిలో విప్లవోద్యమ కృషిని మాత్రమే ఇక్కడ చూద్దాం. ఇది 2001కి ముందు జరిగిన మార్పులపై ఆధారపడి వివిధ రంగాలలో చోటుచేసుకున్న అభివృద్ధి అనే విషయాన్ని తప్పక గుర్తు పెట్టుకోవాలి. ఈ మార్పులు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడి ప్రజాయుద్ధం అభివృద్ధి చెందుతున్న కాలంలో జరుగుతున్నవనీ, ప్రజా సైన్యం దన్నుతో ఏర్పడుతున్న నూతన ప్రజా రాజ్యాధికార అంగాల నాయకత్వంలో జరుగుతున్నవనీ పాఠకులు గుర్తు పెట్టుకోవాలి. స్థల, కాల, పరిస్థితుల నుంచీ విడదీసి వీటిని వేటినీ చూడలేం.

ఆదివాసీ ప్రజల వ్యవసాయంలో మార్పులు తీసుకరావడంపై విప్లవోద్యమం ప్రధానంగా కేంద్రీకరించింది. విప్లవోద్యమం ఫలితంగా మొదటగా పేద రైతులకు, భూమిలేని రైతులకు, వ్యవసాయ కూలీలకు కుంటో, సెంటో భూమి లభించడం మౌలికమైన విషయం. తమకు లభ్యమైన భూములలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనలు ఆదివాసీ ప్రజలలో తీసుకరాగలగడం సాధారణ విషయం ఏమీ కాదు. వ్యవసాయానికి సాగునీటి వ్యవస్థను కల్పించలేకపోతే పంట దిగుబడికి గ్యారంటీ ఉండదనే అవగాహనను ప్రజలకు అర్థం చేయించి వారిని ఆ పనులలోకి దింపడం అనేది అతి ముఖ్యమైన విషయం. యేడాదిలో అధిక సమయాన్ని వేట, అటవీ ఉత్పత్తుల సేకరణకు వెచ్చించే ఆదివాసీ జీవనశైలిలో మార్పు రాకుండా ఉత్పత్తి విధానంలో మార్పును తీసుకరాగలిగే నిర్మాణాత్మకమైన కృషిలో వాళ్లను స్వచ్ఛందంగా భాగస్వాములను చేయడం సాధ్యం కాదు. వేట, అందులో జూడు వేట అంటే ఎంత ఇష్టమో వారికి! రోహిణి ఎండల్లో నల్లటి శరీరాలు చెమటపట్టి మెరుస్తుంటే ఒగరుస్తూ జంతువులతో పోటీపడి పరుగెత్తుతూ అనేక ఉపాయాలతో అంతిమంగా వాటిని బంధించే వేటలో ఉన్న ఆనందం వాళ్లకు తప్ప ఇతరులకు అర్థం కాదు. 10 గ్రాముల పిట్ట మాంసం కోసమైనా రెండు క్వింటాళ్లకు తక్కువ గానీ అడవి దున్న కోసమైనా వారు రోజుల తరబడిగా సాగించే వేటను కాలంతో, డబ్బుతో కొలిచేవాళ్లకు ఆ ఆనందంలోని విలువ అంతుపట్టదు. అయినప్పటికీ, గ్యారంటీలేని వేట, తరగిపోతున్న అటవీ ఉత్పత్తులపై ఆధారపడడం తగ్గకుండా వ్యవసాయంలో పురోగతి సాధ్యం కాదు. వ్యవసాయంలో మార్పులు వచ్చి జీవికకు గ్యారంటీ ఉందన్న హామీ ఏర్పడకుండా వాళ్ల జీవన శైలిలో పూర్తిగా మార్పును తేవడం కష్టమే. ఈ రెండూ విడదీయరాని సంబంధాన్ని కలిగిన అంశాలు. పునాదితో గట్టిగా ముడిపడిన ఉపరితల అంశం ఇది. భిన్న ఆలోచనల మధ్య, భిన్న సంస్కృతుల మధ్య, భిన్నమైన అలవాట్ల మధ్య తీవ్రమైన భావ ఘర్షణ జరిగిన ఫలితంగా 'దండకారణ్యం'లో 'జూడు వేట' దాదాపుగా నిలిచిపోయింది. దాదాపు రెండు, మూడు నెలలు సామూహికంగా దూర ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వెళ్లే ఆదివాసులు జూడు వేటను ఆపుకొని తమ శ్రమశక్తిని వ్యవసాయోత్పత్తులకు జీవధారగా నిలిచే సాగునీటి వ్యవస్థ రూపకల్పనలో పూర్తిగా వినియోగించారు.

దీనితో అనేక గ్రామాలలో కొత్తగా చెరువుల నిర్మాణం ఊపందుకుంది. ఈ నిర్మాణ పనులు తాము తమ ఇష్ట ప్రకారంగా గ్రామాల్లో ఎన్నుకుంటున్న జనతన సర్కార్ల ఆధ్వర్యంలోనే జరిగాయి. వీటితో వారి సాంస్కృతిక జీవనంలో అధిక సమయాన్ని వెచ్చించే జూడువేట నిలిచిపోయింది.

వ్యవసాయం అభివృద్ధి కావడానికి సాగునీటి వ్యవస్థను ఏర్పర్చుకోవడం ఒక ముందు షరతు అవుతుంది. వ్యవసాయంలో వచ్చే మార్పులతో రైతాంగం కాలానుగుణంగా తమ సాంస్కృతిక జీవన విధానంలో మార్పులు చేసుకోవడం ఒక అనివార్యం అవుతంది. దండకారణ్యంలో పోడు వ్యవసాయం నేర్చుకున్న కాలానికి సరిపడే విధంగానే ఇక్కడి ప్రజలు తమ ఇతర అన్ని కార్యకలాపాలను సహజంగానే నిర్ణయించుకున్నారనేది సామాజిక చలన సూత్రాలు, నియమాలు అర్థమైన వారికి వేరుగా చెప్పాల్సిన అవసరం ఉండదు. పోడు వ్యవసాయం చేసే దండకారణ్యంలోని మాడ్ లాంటి చోట జనవరి, ఫిబ్రవరి మాసాలలో అడవిని నరకుతారు. ఆ నరికిన అడవంతా వేసవి కాలంలో (మార్చి-జూన్) ఎండుతుంది. అప్పుడు జూన్ చివర్లో ఎండిన కర్రలకు నిప్పుపెడతారు. కాలిన మొద్దులన్నీ బూడిదవుతాయి. ఆ సమయంలో కురిసే తొలకరితో ఆదివాసీ రైతులు చిరుధాన్యాల పంటను విత్తుతారు. ఆ తర్వాత కాలమంతా అంటే దాదాపు అక్టోబర్ వరకు వారికి తీరుబడిగానే ఉంటుంది. ఈ కాలచక్రం సవ్యంగా సాగితే ఆదివాసీ రైతు ఆనందానికి అవధులుండవు. ఈ కాలచక్రానికి లోబడే ఆదివాసీ ప్రజల ఇతర పనులన్నీ ఉంటాయి. ఆదివాసీ రైతులు సుదీర్ఘకాలంగా వేసవిలో ధాన్యం నూర్పిళ్లు, వేట, జూడు వేటకు అలవాటు పడిపోయారు. అలాగే ఇక్కడి ఆదివాసులలో వర్షాకాలం పెళ్లిళ్లుంటాయి. వేసవిలో పెళ్లిళ్ల జరుపుకునే స్థిర వ్యవసాయం చేసుకునే రైతులకు ఇది అతి విచిత్రంగా ఉంటుందేమో! ఎందుకంటే మైదాన ప్రాంత రైతాంగానికి వర్షాకాలం ఊపిరి సలపని పనులుంటాయి కదా! స్థిర వ్యవసాయం ఉనికిలోకి వచ్చినచోట దానికి అనుగుణంగానే వారి సాంస్కృతిక జీవిత చక్రం సాగుతుంది. ఇది అతిసాధారణ నియమం.

శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి కానపుడు మూఢ నమ్మకాలే మనిషికి ఊరట నిస్తాయి. జీవితంపై ఆశలను నిలిపి ఉంచుతాయి. ప్రకృతిపరమైన మార్పులకు తమ అజ్ఞానంతో అతీత శక్తులను కారణంగా భావించుకునే సమాజంలో వాటిని కొలవడం (పూజించడం) తప్పదు. ఈ ఆచార వ్యవహారాలన్నీ ఆయా సమాజాల సాంస్కృతిక స్థాయిని తెలియజేస్తాయి. ఈ నేపథ్యంలో చూస్తే ఆదివాసీ సమాజంలో జరుగుతున్న వ్యవసాయ మార్పులకు అనుగుణంగా క్రమంగా వారి సాంస్కృతిక జీవనాన్ని మార్చుకోవలసి వస్తోంది. వారు ఒక సంధి దశలో జీవిస్తున్నారు. ఆదివాసీ ఉత్పత్తి విధానం (ఉత్పత్తి, వినియోగం) నుంచీ స్థిర వ్యవసాయంలోకి, రైతాంగ ఉత్పత్తి విధానంలోకి మారుతూన్నారు. దీనికి అనుగుణంగా వారి పండుగలు, పెళ్లిళ్ల తదితర కార్యకలాపాలన్నీ మారాల్సి వస్తోంది. ఈ మార్పులను ప్రవేశపెట్టడంలో విప్లవ పార్టీ చొరవ ప్రదర్శించి ఈ దశాబ్దం ప్రారంభంలో తెగ పెద్దలతో, పూజారీలతో, ప్రజలతో ఒక విశాల

బహిరంగసభను నిర్వహించింది. వీరంతా మారుతున్న పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయాన్నీ అభివృద్ధి చేసే దిశలో సంయుక్తంగా తగిన నిర్ణయం తీసుకొని పండుగల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. తమ వ్యవసాయ పనులకు ఆటంకం కాని విధంగా పండుగలను మార్చుకున్నారు. ఈ రకమైన మార్పు శ్లాఘనీయమైనది. దీనిని వారి సాంస్కృతిక వ్యవహారాల్లో విప్లవోద్యమం ప్రవేశపెట్టిన అతి ముఖ్యమైన మార్పుల్లో ఒకటిగా చూడవచ్చు. ఇలా సాంస్కృతిక రంగంలో మార్పు రావడం అనేది వారిలో పెరుగుతున్న విప్లవ చైతన్యాన్ని తెలియజేస్తుంది.

దండకారణ్యంలోకి క్రైస్తవం బ్రిటిష్ వారి కాలంలో ప్రవేశించగా బయటి నుంచీ హిందూ మత సంస్థల చొరబాటు ప్రధానంగా **1947** తర్వాత పెరిగింది. కొన్ని హిందూ మతోన్మాద సంస్థలు అతి దూకుడును ప్రదర్శిస్తూ ఆదివాసీ తెగ ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లనూ అవమానిస్తూ ప్రజల పూజా మందిరాలపై, దేవతా విగ్రహాలపై, గ్రామ ఆదివాసీ రాజకీయ-సాంస్కృతిక కేంద్రమైన గోటుల్‌లపై దుర్మార్గమైన దాడులు చేసి కొంతకాలం తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. దాదాపు ఒకటిన్నర శతాబ్దాల క్రితం దండకారణ్యం వచ్చి స్థిరపడిన క్రైస్తవం వైపు గానీ ఆ తర్వాత దాదాపు అర్ధశతాబ్ద కాలానికి పైగా ఇక్కడ కొనసాగుతున్న హిందూ మతోన్మాద సంస్థల వైపుగానీ ఇక్కడి ఆదివాసీ ప్రజలు ప్రత్యేకించి మోతుబరి సెక్షను మళ్లింది. ఆదివాసీతెగ ఆచార వ్యవహారాలు, తమ అభివృద్ధికి ఆటంకంగా భావించి వారు ఒకరకమైన బాప్టిజం స్వీకరించారు. వివిధ రకాల రాజకీయ, సామాజిక ప్రయోజనాలనాశించి ఆ వర్గం ముందు చూపుతో ఆ మతాలను స్వీకరించాయి.

20వ శతాబ్దం చివరి పాదం నుంచీ క్రమంగా విప్లవ చైతన్యం పెంపొందుతున్న ప్రజలను తమ వైపు మళ్లించుకోవడానికి గత రెండు దశాబ్దాలుగా 'రాజ్యం' అండతో అన్ని మత సంస్థలు రకరకాల జనాకర్షణ విధానాలను, హామీలను గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యహింస పెరిగిన ప్రతి సందర్భంలో అవి ఆ రాజ్యహింస మాటున ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ తమ పలుకుబడినీ, తమ ప్రభావాన్నీ అధికం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రధానంగా యువతను మత ప్రచారకులుగా మలచుకోవడంపై, చర్చీలు, ఆశ్రమాలు నిర్మించడంపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. నారాయణపూర్ జిల్లాలోని మాడ్ కొండల్లోకి చొచ్చుకవచ్చిన రామక్రిష్ణ మిషన్ ప్రజలకు విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించే పేరు మాటున చాప కింద నీరులా కమ్యూనిస్టు విప్లవ వ్యతిరేక ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం పెద్దెత్తున నిధులు కేటాయిస్తూ దాని వకాల్తాదారులుగా కార్యకలాపాలన్నింటినీ ప్రోత్సహిస్తున్నాయి. ఈ సంస్థ నర్మ గర్భంగా ప్రభుత్వానికి తన పూర్తి సేవలు అందిస్తోంది. ఇక్కడ పెరుగుతున్న భవిష్యత్ పౌరుల తరాన్ని కాషాయి రాజకీయాలతో పూర్తిగా నింపేసి వారిని తమ ప్రజల నుంచీ, తమ ప్రాంతం నుంచీ, దూరం చేయడంలో అది పూర్తిగా సఫలమైందనే చెప్పాలి. హిందూ మత సంస్థలు ఆదివాసీ ప్రజల తరతరాల సంప్రదాయాలను ధ్వంసం చేస్తున్నాయి. వారి కుదురు (గోత్రం)

పేర్లను సంస్కృతీకరిస్తున్నాయి. ఏముల కుదురు వారిని 'కస్యప్'లుగా మార్చింది. అలాగే మనుషుల పేర్లను గూడా నిర్దాక్షిణ్యంగా సంస్కృతీకరిస్తోంది. మాసాలు (నల్లనివాడు) అని పేరు వుంటే అది మహేష్ గానో, మనేశ్ గానో మారిపోతోంది. రామే (రామచిలుక) పేరు 'రమ'గా మారుతోంది. గోటుల్‌లు తగులబడిపోతూంటే, 'తల్లూర్ ముత్తే, మార్రెశేడో' ఆదివాసీ స్త్రీ దేవతలు హిందూ దేవుళ్లకు భార్యలవుతున్నారు. బండరాళ్లనే అలంకరించి హిందూ బ్రాహ్మణ మంత్రోచ్చారణలతో జరిపే వివాహతంతు ఒక విశాల ఆదివాసీ ప్రజా సమూదాయపు గుండెలను ఎంతగా గాయపరుస్తుందో వాళ్లు వివరిస్తున్నపుడు వినాల్సిందే గానీ, వాటిని అక్షరాల్లోకి అనువదించడానికి ఏ కవి కలానికి శక్తి చాలదేమో! హిందూ మతోన్మాద సంస్థల ఆగడాలను అరికట్టడంలో విప్లవోద్యమం ప్రజల పక్షాన నిలిచింది. మాడ్ కొండలపై రామకృష్ణ మిషన్ సహా మతోన్మాద సంస్థల విస్తరణను అరికట్టడంలో విప్లవోద్యమం చాలా వరకు సఫలమైంది.

ఆదివాసీ ప్రజల ఆచార వ్యవహారాలలో గుర్తించతగిన స్థాయిలో మార్పు వచ్చిన రంగం అంటే మహిళా రంగం అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఆదివాసీ సమాజంలోనూ మహిళల పట్ల వివక్ష, అత్యాచారాలు, అభద్రతా భావన, పితృస్వామ్య ధోరణులు ఉన్నాయి. అవి 'నాగరిక సమాజానికి' మోటుగానే అన్పిస్తాయి. ఆదివాసీ మహిళలకు పునర్వివాహ అవకాశం ఉన్నప్పటికీ స్వేచ్ఛగా మనువాడే అవకాశం అన్ని తెగలలో లేదు. హిందూ మత ప్రభావం బలంగా పడిన చోట బాల్య వివాహాలూ జరిగేవి. మహిళలకు ఆస్థి మీదా, పిల్లల మీదా హక్కే లేదు. ఆడపిల్లకు ఇష్టం లేకున్నా పసితనంలో ఆమె ఏడ్చినా, మొత్తుకున్నా వినకుండా పెద్దలు ఆమె ఒంటి నిండా పచ్చబొట్లు వేయించడం ఒక ఆచారం. దీని వెనుక ఒక చక్కని కథను అల్లిపెట్టారు. ఏ ఆడపిల్లయినా బాల్యంలో పచ్చబోట్లు వేసుకోకపోతే వృద్ధురాలై చనిపోయాక పరలోకంలో స్త్రీలు సలసలా కాగే గడ్డపారలతో పచ్చబోట్లు పొడిచాకే తమలో కలుపుకుంటారని భయం గొలిపే కథను విస్తృతంగా ప్రచారంలో పెట్టారు. ఈ కథకు జడవని అమ్మాయి ఉంటుందా! ఇప్పుడు పచ్చబోట్లూ చాలా తగ్గాయి, ఆ కథా మరుగునపడిపోతూంది. విప్లవ సంస్కృతి ప్రభావం పురివిప్పుతోంది. ఒక యువతి తనకు ఇష్టం లేదని చెప్పి ఎంత మొండికేసినా ఆమె అభిప్రాయాన్నీ, ఆమె మనసునూ కాదని పెద్దలు తమకు నచ్చిన, తాము ఒప్పిన వరున్ని తెచ్చి ఆమెకు మగన్ని చేస్తారు. ఆ మగాడితో తాను కాపురం చేయలేనని జిద్దు చేస్తే పెద్దలు వినిపించుకోరు. ఆ ఇద్దరి జంటను ఇంట్లోనే ఒక గదిలోకి వదిలి ఆమెతో అతి క్రూరంగానైనా లైంగిక సంబంధాలలోకి పురుషున్ని పురికొలుపుతారు. ఆ సమయాన గదిలో 'అబల' కార్చే కన్నీటికీ, విలపించే మనసుకూ, దీనంగా గింజులాడే శరీరానికీ, పెనుగులాడే ఆరాటానికీ, ధిక్కరించే ఆలోచనలకూ, ఘర్షించే స్వభావానికీ దిక్కెవ్వరూ ఉండరు. సంవేదనాభరితమైన ఆమె అరుపులు, పెడబొబ్బలు, దెబ్బలు ఇరుగు-పొరుగుకు స్పష్టంగా అర్థమైతాయి. కాకపోతే 'కొంద విత్‌తా' (పసువు తెంపుకుంది) అంటూ ఇంటి వాళ్లు చేసే అల్లరి అందరికీ సమాధానం అవుతుంది. నిజమే! మగ పసువు మహిళ మీదికి లంఘించడమే అది. ఆ మగహింసను భరించలేని 'అబల' ఆ చెర నుంచీ తప్పుకోవడానికి శత విధాల ప్రయత్నిస్తుంది. ఆమె ప్రయత్నాలు సఫలమైతే ఆమె ఒక 'కెర్దె'

అవుతుంది. కెర్దెగా మారిన యువతి అడవిలో కంటపడితే ఆమెను ఎంతమంది పురుషులైనా అనుభవించడానికి సమాజం లైసెన్స్ ఇచ్చింది. ఇది తెగ పితృస్వామ్యంలో ఒక భాగం. ఈ బాధను భరించలేని ఆ కెర్దె సామాజిక భద్రత కోసం మళ్లీ ఎక్కడో ఒక దగ్గర మగ పంచన చేరక తప్పదు. ఆదివాసీ యువతి సంతోషంగా జతగాళ్లతో నృత్యం చేస్తూంటే వరుసైన ఏ బ్రహ్మచారైనా ఆమెను తన భార్యగా ప్రకటించవచ్చు.తనకు నచ్చిన యువతిని సొంతం చేసుకోవడానికి పురుషుడు అనేక ప్రయత్నాలు చేస్తాడు. ఆమె ఒంటరిగా ఉన్నపుడు తన జట్టుతో ఆమెపై దాడి చేసి ఎత్తుకెళ్లి తన దానిగా నిలుపుకుంటాడు. ఆ క్రమంలో ఆమె సామూహిక అత్యాచారానికీ గురవుతుంది. ఆదివాసీ సంప్రదాయంలో పెళ్లి తంతుకు అయ్యే ఖర్చు పేదవాళ్లకు తడిసి మోపెడవుతుంది. కన్యాశుల్కం చెల్లించలేని పురుషులు కాబోయే సహచరి ఇంట్లో ఆరేండ్లు ఇల్లరికం ఉండి తీరాల్సిందే! ఈ ఇల్లరికం అల్లుడు ఊరందరికీ లోకువే.

ఆమెకు తినే తిండిలోనూ, చేసే పనిలోనూ పురుషాధిపత్యం కొన్ని నిషేధాలు విధించింది. ఆమె కోడిగుడ్డు తినొద్దు, వేట చేసిన జంతువు గుండెను తినొద్దు. ఆమె పొలంలో విత్తనాలు చల్లకూడదు. ఇలా మరి కొన్ని నిషేధాలున్నాయి.

ఆదివాసీ సమాజంలో మహిళ పురుషుడి కన్నా అధికంగా శ్రమిస్తుంది. ఆమె ఉదయాన్నే లేచి మొదలుపెట్టే వడ్ల దంపకంతో ఆమె దినచర్య మొదలవుతుంది. ఆమె అడవి నుంచీ వంటచెరకు తెస్తుంది. ఏ రోజుకు ఆ రోజు కూరలు వెతుక్కొస్తుంది. తన కోసం, తన వారి కోసం ఆమె అడవి నుంచీ కాయో, పండో, కంద మూలాలో ప్రేమగా తెస్తుంది. ఆమె నాగలి పట్టి దుక్కి దున్నుతుంది. ఆమె వేటలో పాల్గొంటుంది. ఆమె ఇంటిల్లిపాదికి వండి వడ్డిస్తుంది. ఆమె తన పిల్లలను పాలిచ్చి పెద్ద చేస్తుంది. ఆమె తన చెలికాడితో కాపురం చేస్తుంది. ఇన్ని చేసినా పితృస్వామ్యం ఆమెను తనతో సమానంగా, గౌరవంగా చూడనిరాకరిస్తుంది. ఆమెను సమాజంలో రెండవ శ్రేణిలోనే లెక్కిస్తారు. దీనిని ఆమె 1980ల నుంచీ భరించనంటోంది. ఆమె మార్పును కోరింది. సామాజిక సమస్యే!

దండకారణ్యంలో విప్లవ మహిళా సంఘం 'క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్'లో సంఘటితమైన వేలాది మంది మహిళలు నేడు ఆత్మగౌరవంతో, విశ్వాసంతో, మెరుగైన భద్రతా వాతావరణంలో జీవిస్తున్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వివక్ష దూరమవుతోంది. ఆమెకు బలవంతపు పెళ్లి, కెర్దె జీవితం, అత్యాచారాలు, అవమానాలు, కన్నుపడ్డ మగాడు తన ఇష్టప్రకారం బలవంతంగా ఎత్తుకెళ్లడం, రాక్షస పెళ్లిళ్లు, తెరమరుగై గత తరం చేదు జ్ఞాపకాలుగా రికార్డవుతున్నాయి. ఆమె ఇపుడు తనకు నచ్చిన యువకున్ని పెళ్లి చేసుకుంటోంది. పేదవాళ్ల ఇండ్లలో కొడుకు పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక నానా అవస్థలు పడే సమస్య పోతోంది. కల్లు, సారా, మాంసంతో విందులు లేకుండా సుబ్బరంగా ఉన్నదేదో పెట్టి విందు చేసి ఊపిరి తీసుకునే రోజులు వాళ్లనుభవిస్తున్నారు. వేలాది రూపాయల కన్యాశుల్కం పాత మాట అవుతోంది. ఆమె భూమిపై, ఆస్తిపై, పిల్లలపై కచ్చితమైన వాటాను పొందే

హక్కు ఉందనీ జనతన సర్కార్ తన విధాన కార్యక్రమంలో రాసిపెట్టింది. పెళ్లి కోసం అమ్మాయి ఇంటా ఆరేండ్లు ఇల్లరికంతో అవస్థలు పడే దుస్థితి పేద పురుషులకు పోతోంది. 'నేటి దండకారణ్య' మహిళ రాజ్యాధికారంలో తన వాటాను ఆమె సగర్వంగా పొందే అవకాశం ఉంది. ఇది ఆమె అనేక త్యాగాలతో, పోరాటాలతో, ధైర్యంగా సాధించుకున్న ఒక పెద్ద విజయం. సమాజంలో ఆమెకు ఎక్కడైనా అవమానం, అన్యాయం, అత్యాచారం, అశ్లీల, అసభ్య వ్యవహారం ఎదురవుతే ఆమె ధైర్యంగా ప్రతిఘటిస్తోంది. ఆమెకు విప్లవ మహిళా సంఘం పూర్తి అండగా ఉంది. ఆమెకు జనతన సర్కార్ దన్నుగా ఉంది. ఆ సర్కార్ కోసం ఆమె తన సర్వస్వాన్ని ఒడ్డి పోరాడుతోంది. ఆమె తన వాళ్లతో కలిసి ఆ సర్కార్ రక్షణ కోసం సాయుధమవుతోంది. ఆమె ఒక గెరిల్లా అవుతోంది. ఆమె ప్రజాసైన్యంలో సైనికురాలవుతోంది. ఆమెను మధ్యయుగాల కన్నా దారుణమైన స్థితికి నెట్టే దుష్టతలంపుతో దుర్మార్గ పథకాలతో, దాష్టీకంగా వ్యవహరిస్తూ ఆమె జీవితాన్ని ధ్వంసం చేయతలపెట్టిన సల్వాజుడుంతో, నేటి గ్రీన్ హంట్‌తో ఆమె పోరాడుతోంది. దండకారణ్యంలోని మహిళా లోకం పోరాటానికి పర్యాయపదంగా పురుషులతో సమానంగా ఎదిగి వస్తోంది. 2010 నుంచీ మార్కెట్‌లో లభ్యమవుతున్న ముప్పయి యేండ్ల దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర పుస్తకం ఈ రంగంలో మహిళలు సాధించిన ప్రగతిని చాలా స్పష్టంగా పేర్కొంది.

# 8. ముగింపు


మూడు దశాబ్దాలుగా ఒక చిన్న ప్రపంచం అతలాకుతలం అవుతోంది. ఆ ప్రపంచం దండకారణ్యం. అక్కడికి చేరుకున్న తొలినాళ్ల నిప్పురవ్వలు అడవి మంటలై త్వరత్వరగా నలుదిక్కులకూ వ్యాపించాయి. ఆంధ్రప్రదేశ్ నుంచీ 1980 జూన్-జూలై మాసాల్లో పిడికెడు మంది విప్లవకారులు సంఖ్యలో మప్పయి అయిదు మంది విశాల దండకారణ్యానికి చేరుకున్నారు. వారంతా సాయుధులే. వారి సైద్ధాంతిక ఆయుధం మార్క్సిజం-లెనినిజం-మావోయిజం. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా వారి విప్లవ మార్గం. ప్రాంతాల వారిగా రాజ్యాధికారాన్ని స్థాపించడం దాని సారాంశం. గ్రామీణ ప్రాంతం నుంచీ పట్టణాలకూ, ఆ పిదప నగరాలకు చేరుకోవడం ఆ మార్గం యొక్క సైనిక వ్యూహం. భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం, సామ్రాజ్యవాదం వారి విప్లవ టార్గెట్లు. ఈ స్పష్టమైన సిద్ధాంత, రాజకీయ అవగాహనతో విప్లవ పార్టీ మూడు దశాబ్దాల క్రితం చేరింది దండకారణ్యం.

మూడు దశాబ్దాల కాలంలో ఆ చిన్న ప్రపంచంలో గణనీయమైన మార్పులే జరిగాయి. అన్ని మార్పులలో అక్కడి ప్రజలే ప్రధాన పాత్రధారులు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో జరుగుతున్న మార్పులు దండకారణ్య ప్రజల జీవితాలను స్వావలంబన దిశలో పురోగమింప జేస్తున్నాయి. వారిలో పెరుగుతున్న ప్రజాస్వామిక చైతన్యం తరతరాల అణగారిన తమ జీవితాల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. దండకారణ్యంలో జరుగుతున్న ప్రతీ మార్పు ఒక తీవ్ర ఘర్షణ ద్వారానే జరుగుతోంది. వర్గ పోరాటం ద్వారా ఆ సమాజం భారీ కుదుపులకు లోనవుతోంది. సమాజంలో నూతన మార్పులను ఏమాత్రం సహించని పిడిపిడీల రియాక్షనరీ శక్తులు, గతిశీలమైన సామాజిక చలన సూత్రాలకు అడ్డు నిలుస్తున్నాయి. మధ్యయుగాల రాచరికాన్ని ఖననం చేసిన ఆనాటి విప్లవ శక్తులు, 'దున్నేవారికే భూమి' నినాదాన్ని ప్రపంచానికి అందించిన అలనాటి ప్రజాస్వామిక శక్తులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సౌభ్రాతృత్వం అంటూ నూతన దృక్పథాలను ప్రపంచానికి పంచిన మూడు శతాబ్దాల కిందటి పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదులుగా పడగవిప్పి ఈనాటి ప్రజా ఉద్యమాలకు పరమ ఆటంకంగా నిల్చినారు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అడ్డుకోవడానికి వర్తమాన దోపిడీ ఉత్పత్తి సంబంధాలను యథాతథంగా ఉంచడానికి యుద్ధానికి దిగుతున్నారు. అభివృద్ధి, ప్రజాస్వామ్యం అనే పదాల గారడీలతో జగన్నాథ రథచక్రాలను ఢీకొంటున్నారు. దండకారణ్య గర్భంలో దాగిన అపార సిరులను కబళించడానికి సామ్రాజ్యవాదం చేస్తోంది. అది ఒక వైపు 20వ శతాబ్దంలో అనేక చోట్ల చావు దెబ్బలు తిని, ప్రపంచ సోషలిస్టు శిబిరం అంతరించినప్పటికీ, శతాబ్దం చివరి నాటికి మాత్రం తిరిగి ఆ శిబిరం సామ్రాజ్యవాద కుట్రలు, కుహకాలకూ బలైపోయి అంతిమంగా కుప్పకూలిపోయింది. దీనితో చరిత్ర అంతం అంటూ, మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందంటూ సామ్రాజ్యవాద శక్తులు సంబరపడ్డాయి. కాని ఆ సంబరాలు వాళ్లకు ఎక్కువ కాలం మిగులకుండా పోతున్నాయి. పెట్టుబడిదారీ విధాన సంక్షోభ వలయాల సుడిగుండంలో దినదినం అంతులేని లోతుల్లోకి

సామ్రాజ్యవాదులు కూరుకుపోతూన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజలు ఎక్కడికక్కడే తమ న్యాయమైన సమస్యలపై దృఢంగా, సమరశీలంగా పోరాడుతున్నారు. అనేకచోట్ల జాతి విముక్తి పోరాటాలు కొనసాగుతున్నాయి. విప్లవ పోరాటాలు పురోగమిస్తున్నాయి. దండకారణ్యం అందులో ఒక అతి చిన్న భాగం. కానీ రేపటి భారీ మార్పులకు, సమూల పరివర్తనలకు, అదే కేంద్రకం అవుతుందేమో! తునీషియా నుంచీ లిబియా వరకు అరబ్ ప్రపంచంలో సాగిన తాజా ప్రజా వెల్లువలు ప్రభుత్వాల మార్పిడిలతో తాత్కాలికంగా సద్దుమణిగినాయి. అక్కడ సామ్రాజ్యవాదం తన విషపు కోరలను చాచి ప్రజల త్యాగాలను బలి తీసుకుంది. ఆ ప్రజా వెల్లువకు విప్లవ కార్మికవర్గ నాయకత్వం లేకపోవడం విచారకరం.

నేడు దండకారణ్యం ఒంటరిగా లేదు. దానికి ప్రపంచ కార్మికవర్గంలో భాగమైన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వం ఉంది. దేశంలోని మూడవ వంతు జిల్లాల్లో అది నిలబడి పోరాడుతోందనీ భారత దోపిడీ పాలకవర్గాలు కలవరపడుతున్నాయి. దేశంలోనే ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిర్భవిస్తున్న ఆ శక్తినీ మొగ్గలోనే తుంచివేయాలనీ దోపిడీ వర్గాలు దానిని పెను ప్రమాదకర శక్తిగా అభివర్ణిస్తున్నాయి. వాటి భయాలు నిజాలు గావడానికి ఎంతకాలమైన పట్టవచ్చు. కానీ అవి నిజాలై తీరుతాయి. రక్తంతో లిఖించుకుంటున్న నేటి దండకారణ్య ప్రజా చరిత్ర నూతన వెలుగులు ప్రసరిస్తోంది. దానికి ప్రపంచ విప్లవ శక్తులు అండగా ఉన్నాయి. అవి ఒక ఫిలిప్పైన్స్‌లో కావచ్చు లేదా తుర్కి, ఇటలీ, గ్రీసు, ఇంగ్లండ్, కెనడా, నేపాల్, భూటాన్, అమెరికాతో సహా ఏ దేశమైనా కావచ్చు. 'గ్రీన్ హంట్‌ను ఓడించండి' 'భారత అంతర్గత భూభాగాలలో మోహరిస్తున్న సైన్యాలను వెనక్కి తీసుకోవాలి' అనే నినాదాలు ఈనాడు విశ్వజనీనంగా వినవస్తున్నాయి. జాన్ మిర్డాల్, గౌతం నవలఖా, అరుంధతీ రాయ్‌ల నుంచీ బి.డి.శర్మల వరకూ మధ్యభారతంలోని నిరుపేద ప్రజలపై ప్రభుత్వం ఎక్కుపెట్టిన పాశవిక దాడి 'గ్రీన్‌హంట్'ను ఖండిస్తున్నారు. ప్రపంచ, దేశ ప్రజల సంఘీభావంతో దండకారణ్యం తన ప్రత్యామ్నాయ రాజ్యాధికార వ్యవస్థను సుదృఢం చేసుకుంటుంది. నేటి దండకారణ్య అడవులపై రెపరెపలాడుతున్న ఎర్రని జండాలు రేపటి నూతన ఉషోదయానికి సంకేతాలు. సల్వాజుడుంలు, గ్రీన్ హంట్‌లు ప్రజాయుద్ధ జ్వాలల్లో జ్వలించక తప్పదు. మనమంతా ఆ రేపటి ఉషోదయానికి స్వాగతం చెప్పుదాం. ఈనాటి ప్రజాయుద్ధంలో శక్తివంచన లేకుండా పాలుపంచుకుందాం. కార్మికులు, కార్షకులు, విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, చేతివృత్తుల శ్రామికులు, డాక్టర్లు, లాయర్లు, వాళ్లెవరైతేనేమి? దేశభక్తి, విప్లవ ప్రజాస్వామిక శక్తులతో సహా నూతన వ్యవస్థ నిర్మాణంలో భాగమవుదాం. భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న దేశవ్యాప్త విప్లవోద్యమ ప్రాంతాలలో ఈనాడు భ్రూణ రూపంలో ప్రత్నామ్నాయ ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించి పీడిత ప్రజలకు ఆకాశ కిరణంగా నిల్చిన దండకారణ్యాన్ని కాపాడుకుందాం. దేశంలోని యావత్తు విప్లవ ప్రజలకు అండగా నిలబడుదాం.

# నేటి దండకారణ్యం



దండకారణ్యం
మహారాష్ట్ర
ఛత్తీస్‌గఢ్
ఆంధ్రప్రదేశ్
ఆంధ్రప్రదేశ్
ఒడిషా
బస్తర్
గడ్చిరోలి
కాంకేర్
అమాబేడా
అంతాగఢ్
కర్వాపా
జగదల్‌పూర్
దర్భ
మహాదేవ్‌పూర్
వెంకటాపురం
కుంట